# శ్రీ విష్ణు సహస్రనామము

( త్రితీయ  భాగము 206-301 నామ వివరణ )




మాస్టర్ కె. పార్వతికుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్రీ విష్ణు సహస్రనామము

( త్రితీయ  భాగము 206-301 నామ వివరణ )




## మాస్టర్ కె. పార్వతికుమార్



ధనిష్ఠ

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపంలో, 1992 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణములో ప్రారంభించారు. ఇది కొన్ని సంవత్సరాలు కొనసాగింది. ఆ ప్రవచనములలో వారు విశదపరచిన విషయములు అమూల్యములు. సాధకునిగా మన జీవితములలో ఆచరించవలసిన సూచనలు కోకొల్లలు.

వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో లేని వివరణలను సేకరించే ప్రయత్నము ఒక ప్రక్క కొనసాగిస్తూ, అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపం లో అందజేయాలన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించడము జరిగింది. వారు ముందుగా మన మాస పత్రిక 'నా వాణి' లో నామాల వివరణ ప్రచురించమనగా, అది శుభకృత్ ఉగాది సంచికతో ముద్రణ రూపం దాల్చుట మొదలైనది. అది ఒక ప్రక్క కొనసాగుతుండగా, అందుబాటులో ఉన్న నామాలన్నింటిని 11 భాగాలుగా e-Book రూపంలో అందజేద్దామన్న ఉద్దేశ్యాన్ని కూడా వారికి తెలియపరచడం జరిగింది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Book రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకొని రావటము జరుగుతున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ మూడవ భాగము.

వివరణ అందుబాటులో లేని కొన్ని నామములకు, సాధకుల నోట్స్ నుండి సేకరించిన వివరణలు జత చేయబడినవి. పాఠకులలు గమనించగలరు.

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు అతికొద్ది సవరణలతో అందినంత వరకు అందజేయడమైనదని గమనించగలరు.

ఈ ప్రయత్నంలో పాల్గొంటున్న వారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్నవారందరికి మాస్టరుగారి ఆశీస్సులు బాగా అందాలని మాస్టరు గారికి మా ప్రార్థన.

ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై ఆనందము కలగజేయగలవని, గురుదేవుల సాన్నిధ్యములో ఉంచగలవని మా నమ్మకము.

శ్రీ క్రోధి గురుపూర్ణిమకు శ్రీ విష్ణు సహస్రనామ వివరణ మూడవ భాగము- 206 నుండి 301 నామాలకు శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ఠ

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ఘ్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్టాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ

భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్త్వము- 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్త్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని

గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా ' స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి

కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే 20 నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ

ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని "విశ్వం విష్ణుర్వషట్కారో" అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, "విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు" అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం-

మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటీ? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పొరపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకోనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ fresh గా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే

లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి ? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచిరోజు వచ్చినప్పడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది ? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు ? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు

గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశృతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశృతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పుడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు. నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్టానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు.

నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్టానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365 pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్త్వం గూర్చి రాసామా, భగవత్ తత్త్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క అర్థము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్డు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్ఠానము ముఖ్యము. అన్నింట్లోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా

మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతి కుమార్

# విషయ సూచిక

206 అమృత్యుః.................................................................... 15
207 సర్వధృక్ ....................................................................20
208 సింహః....................................................................24
209 సంధాత ....................................................................29
210 సంధిమాన్ ....................................................................32
211 స్థిరః.................................................................... 35
212, 213 అజః, దుర్మర్షణః....................................................................42
214 శాస్తా .................................................................... 51
215 విశ్రుతాత్మ.................................................................... 53
216 సురారిహా .................................................................... 55
217, 218, 219 గురుః, గురుతమః, ధామః.................................................................... 56
220 సత్యః.................................................................... 75
221 సత్యపరాక్రమః.................................................................... 81
222, 223, 224 నిమిషః, అనిమిషః, స్రగ్వీ .................................................................... 87
225 వాచస్పతిః....................................................................92
226 ఉదారధీ....................................................................93
227 అగ్రణి....................................................................95
228, 229 గ్రామణి, శ్రీమాన్....................................................................96
230 న్యాయః....................................................................97
231 నేతా ....................................................................98
232 సమీరణః ....................................................................99
233, 234, 235, 236 సహస్రముర్ధా, విశ్వాత్మా, సహస్రాక్షః, సహస్రపాత్ ............. 100
237 ఆవర్తనుడు .................................................................... 100
238 నివృతాత్మ.................................................................... 100
239 సంవృతః....................................................................101

240 సంప్రమర్దనః..........................................................................................101
241 అహ ........................................................................................................102
242 సంవర్తకుడు ...........................................................................................102
243 వహ్ని........................................................................................................102
244, 245 అనిలః, ధరణీధరః ....................................................................102
246 సుప్రసాదః.................................................................................................103
247 ప్రసన్నాత్మ.................................................................................................103
248, 249 విశ్వసృడ్, విశ్వభుక్ ....................................................................104
250 విభుః ......................................................................................................104
251 సత్కర్తా......................................................................................................104
252 సత్కృతః ..................................................................................................105
253 సాధుః.......................................................................................................105
254 జహ్నుః.......................................................................................................106
255, 256 నారాయణః, నరః.......................................................................107
257, 258, 259, 260, 261 అసంఖ్యయో, అప్రమేయాత్మ, విశిష్టః, శిష్టక్రత, శుచిః.... 108
262 సిద్ధర్దాః ....................................................................................................108
263 సిద్ధ సంకల్పః..........................................................................................108
264 సిద్ధిదః.......................................................................................................108
265 సిద్ధిసాధనః...............................................................................................109
266 వృషాహి ...................................................................................................110
267 వృషభః.....................................................................................................117
268 విష్ణు: .......................................................................................................120
269 వృషపర్వః ...............................................................................................122
270 వృషోదరః..................................................................................................126
271, 272 వర్ధనః, వర్ధమానః .....................................................................127
273 వివిక్తః.......................................................................................................129
274 శృతిసాగరః ..............................................................................................137
275 సుభుజః.....................................................................................................150

276 దుర్ధరః ........................................................................ 162
277 వాగ్మి........................................................................ 167
278 మహేంద్రః ........................................................................171
279, 280 వసుదః, వసుః ........................................................................ 183
281 నైకరూపః ........................................................................ 194
282 బృహద్రూపః........................................................................203
283 శిపివిష్టః ........................................................................204
284 ప్రకాశనః ........................................................................ 212
285, 286 ఓజః, తేజః ........................................................................ 215
287, 288, 289, 290 ద్యుతిధరః, ప్రకాశత్మ, ప్రతాపనః ఋద్ధః............................ 217
291 స్పష్టాక్షరః ........................................................................222
292 మంత్రః........................................................................227
293 చంద్రాంశు: ........................................................................230
294 భాస్కరద్యుతిః ........................................................................232
295 అమృతాం శూద్భవః ........................................................................233
296 భానుః........................................................................ 238
297 శశిబిందుః ........................................................................240
298 సురేశ్వరః ........................................................................246
299 ఔషధం........................................................................247
300 జగత్ స్సేతుః........................................................................256
301 సత్యధర్మ పరాక్రమః........................................................................260

## 206 అమృత్యుః

అమృత్యుః అంటే మృత్యువు లేని వాడు. ఆత్మతత్వానికి కానీ, దానికి సంబంధించిన వెలుగుకి కానీ మృత్యువు ఉండదు. ఆ ఆత్మతత్వం నుంచి ఏర్పడిన వెలుగు లో నుండి ఏర్పడిన లోకాలకు అది ఉన్నది. భగవంతుడు అత్మ స్వరూపుడు, ఆయన వెలుగు అమ్మవారు. మనలో కూడా ఆత్మతత్వం ఉన్నందు వలన మనకి కూడా వెలుగు ఉంది. ఆ వెలుగే కళ్ళలో నుంచి ప్రసరిస్తూ ఉంటుంది. ఆ వెలుగే మనుషుల్లో కళగా కనిపిస్తూ ఉంటుంది. అన్నిటిలోనూ అత్మతత్వం ఉన్నంత కాలం వెలుగు ఉంటుంది. వెలుగు ఉన్నంత కాలం మృత్యువు ఉండదు. కానీ ఈ వెలుగు ఆధారంగా వచ్చిన రూపములకు మార్పు ఉంటూ ఉంటుంది. ఆకాశము నుంచి ఏర్పడిన వాటన్నిటికి మార్పు ఉంటుంది. ఆకాశం ఎప్పుడూ ఉంటుంది. ఆకాశం అంటే వెలిగింపబడిన చోటని అర్థం. కాశం అంటే వెలుగు. 'కాశీ వెళ్ళాలి, కాశీ వెళ్ళాలి' అని అంటాం. కాశీ వెళ్ళటం అంటే వెలుగు ప్రదేశంలోకి నడిచి వెళ్ళటం. వెలుగులో జీవించటం. అందుకని 'కాశీనాం మరణం ముక్తిః' అంటారు. కాశీలో మృతిచెందిన వాడు శరీరం వదిలి వేస్తాడు కాని తాను ఉన్నాననే తత్వం తెలుస్తూ ఉంటుంది. అలాగే భగవంతుడి తత్వాన్నుండి ఏర్పడిన ఈ గ్రహగోళాదులకి, గ్రహగోళాదులలో ఏర్పడిన సమస్త జీవరాశులకి మార్పు ఉంటుంది కానీ భగవత్ తత్వానికి, దానికి ఉన్న వెలుగుకి ఎప్పుడూ మృత్యువు ఉండదు. మనం కూడా చావం అంటే అర్థం ఏమిటంటే జీవుడిగా దేవుని అంశగా లేక జీవాత్మగా మనకి సంబంధించిన కొంత వెలుగు మనలో కూడా ఉంది. మనమే అది కాబట్టి అంత వరకు మనకు చావు లేదు. ఇంక అక్కడి నుంచి పుట్టినవన్ని మారుతూ ఉంటాయి. 'మార్పే చావు' అని చెప్పారు. ఎంత మారుతూ ఉంటే దాన్ని అంత మృత్యువుగా వర్ణించి ఇచ్చారు. మనలో మారేవి ఏమిటి, మారనివి ఏమిటి ? సృష్టిలో మారేవి ఏమిటి, మారనివి ఏమిటి ? మారనివి చావులేనివి. మారేవి చచ్చిపోయేవి. గమనం ఉన్నవి మార్పు చెందుతూ ఉంటాయి. వాటికి మృత్యువు ఉంటుంది. కానీ మార్పు చెందని వాటికి ఆధారంగా ఉన్న తత్వానికి చావు ఉండదు. అందుకనే సృష్టి మొదలు నుంచి కూడా అయ్యవారు, అమ్మవారు శాశ్వతంగా ఉన్నారని చెప్తారు. అయ్యవారంటే తత్వము, అమ్మవారంటే ఆ తత్వమునకు సంబంధించిన వెలుగు. ఈ రెండు శాశ్వతంగా ఉంటాయి. ఈ రెండిటి లో నుంచి ఏర్పడే వాటన్నింటికీ పుట్టుక, చావు రెండూ ఉంటాయి. స్వరూపం ఏర్పడటం, గుణం ఏర్పడటం. ఇవన్నీ పుట్టుకల కిందకు వస్తూ ఉంటాయి. రూపానికి అతీతము, గుణానికి అతీతమైన చైతన్యము అమ్మవారు. చైతన్యమునకు ఆధారభూతుడైన తత్వము అయ్యవారు. అందుకనే భగవంతుడు సత్యస్వరూపుడు. అమ్మవారిని చైతన్య స్వరూపిణి అని చెప్తారు. అంటే సత్యము, చైతన్యము శాశ్వతమైనటువంటివి. అది ఆధారంగా

ఏర్పడిన వాటికి గుణములతో కూడిన రూపములు ఉంటాయి. మన భూమికి ఒక రూపం ఉన్నది. భూమి జీవులకు రూపములు ఉన్నాయి. ఈ భూమి రూపానికి ఆధారము భూమిలో ఉన్న చైతన్యమే! ఈ చైతన్యము సూర్యుడి నుంచి దిగివచ్చినది. అది ఆధారంగా భూమి ఏర్పడింది. సూర్యుడు కూడా వెలుగుగా శాశ్వతుడు. గోళముగా అశాశ్వతుడు. సూర్య గోళానికి కూడా పుట్టుక, మృత్యువు రెండు ఉంటాయి. కానీ ఆ గోళాన్నుంచి వ్యక్తం అయ్యే వెలుగుకి పుట్టుక, చావు వుండదు. అట్లాగే జీవునకి చావు లేదు, జీవుడి చుట్టూ ఏర్పడిన శరీరానికి చావు ఉంది. జీవుడుగా మనం సూర్యుడి లాంటి వాళ్ళం. సూర్యుడి గోళంలాగా మన గోళమే మన శరీరం. అట్లాగే ప్రతి గ్రహంలోనూ చైతన్యం ఉన్నది, ఆ చైతన్యం ఆధారంగా చుట్టూ ఏర్పడిన పదార్థానికి హెచ్చుతగ్గులు ఉంటాయి కానీ చైతన్యానికి హెచ్చు- తగ్గులు ఉండవు. అందుకని భగవత్ తత్వం నుంచి దిగివచ్చినవన్నీ కూడా అంటే అయ్యవారు, అమ్మవారు ఆధారంగా దిగివచ్చిన బ్రహ్మకి కూడా, పుట్టుక చావు అనేవి ఉన్నాయని చెప్తారు. ఒక దోమకి ఉన్న జీవిత పన్నా, మన జీవిత పన్నా చూస్తే ఎంత తేడా ఉంటుందో, మనిషికీ-బ్రహ్మకి జీవిత పన్నాలో అంత తేడా ఉంటుంది. దోమ బతికితే ఒకరోజు బతకచ్చు, రెండు రోజులు బతకచ్చు. దోమ కనుక లెఖ్కలు వేసుకుంటే మన జీవితం దానికి చాలా పెద్దదిగా కనిపిస్తుంది. అట్లాగే బ్రహ్మ జీవితం చూస్తే మనకి అలాగే అనిపిస్తుంది. అంతా లెఖ్ఖలు వేసి ఋషులు దర్శించి ఇచ్చారు. ఆయనకీ కూడా మొదలు ఉన్నది, తుది ఉన్నది. బ్రహ్మని కూడా దాటిన తత్వం- మూల తత్వం, ఆది తత్వం దానికీ మృత్యువు లేదు. దానినుంచి అన్ని పుట్టుకు వస్తాయి. దానికి పుట్టుక లేదు కాబట్టి చావు లేదు. ఆ తత్వం మనలో కూడా ఉన్నది కాబట్టి మనం కూడా దానియందు ఎరుక కలిగి అది మన మనమని గుర్తిస్తే ఈ మారుతున్న వాటిలో మనం ఇమిడిపోయి చచ్చిపోకుండా ఉంటాం. మామూలుగా మనం మారుతున్నవాటిల్లో జీవిస్తూ వుంటాం కాబట్టి అందులో ఇరుక్కుపోయి చచ్చిపోతూ ఉంటాం. మారేవి మనలో ఏమున్నాయంటే - మనం ఉన్నాం. అదొక సత్యం! మనం చైతన్యవంతులమై ఉన్నాం, అది ఒక సత్యం! ఈ చైతన్యము, ఆ ఉండటం - ఈ రెండు సత్యములే. దానిలో నుంచి వచ్చేటువంటి ఆలోచనలన్నీ మారుతూ ఉంటాయి. ఎన్ని ఆలోచనలు పుట్టి ఎన్ని ఆలోచనలు చచ్చిపోలేదు మనలో? ఈ పుట్టి చచ్చే ఆలోచనల్లో మనం బతుకుతామా, మనలో పుట్టి చచ్చేవే వీటితో కాసేపు క్రీడగా ప్రవర్తించి, మళ్ళీ మనం మనంగా ఉందామా? అనేటువంటిది ఎవరికి వారు నిర్ణయం చేసుకోవాలి. ఆలోచనలోకి దిగితే, అక్కడినుంచి గుణములలో బంధింపబడటమనేది ఉంటుంది. ఆలోచనల ద్వారా పని చేసి ఆలోచనల చేత బంధింపబడకుండా మళ్ళీ మనం మనంగా ఉండగలిగినట్లైతే అమృతత్వ స్థితి ఏర్పడుతుంది. మామూలుగా మనం ఆలోచనలలో ఇరుక్కుపోయి ఉంటాము. ఒక్కో ఆలోచన మనని కొన్ని రోజులు, సంవత్సరాలు కూడా తినేస్తుంది ఒక్కోసారి. ఆ ఆలోచనలో మనం ఉండబట్టి అది మనని తింటోంది. మనని

అది ఆహారంగా వాడుకుంటున్నది. మన బలాన్ని అది పుచ్చుకుని అది పెరుగుతూ మనని నీరసింప చేస్తూవుంటుంది. కాబట్టి దానికి బలం ఇవ్వకుండా మనం ఉంటే అది నీరసించి పడిపోతుంది. ఈ ఆలోచనల దగ్గరి నుంచి మనకి బాగా కదలిక ఉంటుంది. బాగా మార్పు ఉంటుంది. మార్పు చెందే వాటిలో మనం జీవిస్తూ ఉంటాం. ఆలోచన ఆధారంగా మనం ఇంద్రియాలని వాడుతూ ఉంటాం. అందుకని ఇంద్రియాల్లో కూడా చాలా కదలిక ఉంటుంది. ఇంద్రియాల ద్వారా శరీరాన్ని వాడుతూ ఉంటాం. కాబట్టి శరీరానికి కూడా మార్పులు, కదలికలు ఉంటాయి. ఇవన్నీ ఆలోచనలని బట్టి వస్తూ ఉంటాయి. కొంత మంది చాలా తొందరగా మారిపోతూ ఉంటారు. కొంతమంది ఎన్నాళ్ళైనా అలాగే ఉంటూ వుంటారు. ఎందుకుంటారంటే వాళ్ళకి వచ్చేటువంటి ఆలోచనలలో ఉన్న తేడానిబట్టి. ఆలోచనలు బాగా ఉధృతంగా వచ్చేసి, మనసుని గిరగిరగిరా తిప్పేస్తే, త్వరగా చీకేసిన మామిడిపండల్లే అయిపోతారు. కొంత మంది పండల్లే ఉంటారు ఎన్నాళ్ళుపోయినా. ఎందుకు ఉంటారంటే ఆలోచనతో వారు పని చేయడం తప్ప ఆలోచనలో వాళ్ళు ఇమిడిపోరు. ఆలోచనలో ఇరుక్కుపోయిన వారికి నిద్రలు పట్టవు. నిద్ర కూడా పాడుచేసుకుంటారు. ఆలోచనలో ఇమడనటువంటి వారికి ఇట్లా పడుకుంటే అట్లా నిద్రపట్టేస్తుంది. గింజులాటలు, పీకులాటలు, చీకులాటలు ఉండవు. కొంతమంది ఎప్పుడో అయిపోయినవి మళ్ళీ ముందు వేసుకుని సాగదీస్తూ వుంటారు. ఎప్పుడో అయిపోయింది కదరా అంటే, అయిపోతే ఎట్లా అన్నట్టుగా తయారుచేసుకుంటారు. అలాటి వాళ్ళు తమ యొక్క ప్రాణశక్తి దాని కోసం త్వరితగతిన నాశనం చేసుకుంటారు. అందుకని ఆలోచనలతో పని చేయడం ఒకటి, ఆలోచనలలో బంధింపబడటం ఒకటి. అందుకని బంధానికి-మోక్షానికి తెలియటం - తెలియకపోవడమే ఆధారం. మోక్ష స్థితి కలిగిన వాళ్ళు కూడా ఆలోచిస్తారు. వాళ్ళు కూడా ఆలోచనలతో పనిచేస్తారు - కాకపోతే వాళ్ళు ఆలోచనల్లో ఇరుక్కుపోరు. మోక్షస్థితి లేనివాడి ఆలోచన వాడిని పడ్తుంది. మనం దాన్ని పడ్తామా, అది మనని పట్టుకుంటుందా అన్నది. ఎవరిని ఎవరు మింగుతారని. మనం దాన్ని మింగగలిగితే సుఖం. అది మనని మింగెస్తే దానికి సుఖం. ఆలోచనల్లో ఇరుక్కున్న వాళ్ళ శరీరానికి అసహజమైనటువంటి ఒక ఉద్రిక్తత కలిగిస్తుంది. Full speed లో fan తిరిగిందనుకోండి ఎన్నాళ్ళు వస్తుంది? Fan అవసరమైనప్పుడు వాడుకుని అవసరం లేనప్పుడు ఆపలేదనుకొండి motor కాలి, పాడైపోయింది అంటారు. అలాగే మనిషి కూడా ఆలోచనల నుంచి విడిపడి ఇవతలికి రాలేకపోతే, తొందరగా పోతాడు. ఈ ఆలోచనల speed అన్నిటి మీద దాని యొక్క ఉద్రిక్తత చూపిస్తుంది. దానినే రజోగుణం అంటారు. అస్సలు ఆలోచించకుండా ఉంటే ఉండవలసిన సహజమైన జీవన స్రవంతి లేక ఎక్కడికక్కడ ఎండిపోయి, కుళ్ళి పోయి పాడైపోతారు. వీళ్ళు తమో గుణం ఉన్నవారు. అందుకని ఇచ్చిన దేహాన్ని అవసరమైన దానికన్నా ఎక్కువ ఆలోచనలతో వాడినా, తక్కువ ఆలోచనలతో వాడినా చావు

తప్పదు. ఆలోచనల ఆధారముగా ఇంద్రియములను వాడుకోవడం, అది ఆధారంగా శరీరం వాడుకోవడం అనేది మనస్సనే స్థితి నుండి వాడబడడం వలన వీటికి చావు ఉంటుంది. మనసుకి, ఇంద్రియాలకి, శరీరానికి చావు ఉంటుంది. అందులో ఇరుక్కోని వాడికి చావు ఉండదు. మనసులో ఇరుక్కుపోయిన వాడు చచ్చిపోతున్నాను అనుకుంటాడు. మళ్ళీ పుడుతూ ఉంటాడు. ఇట్లా ఉండనివాడు చావకుండా ఉంటాడు. అందుకని అమృత్యు అనే పదానికి అవగాహన 'మృత్యువు పొందని ఒక తత్వం సృష్టి లో ఉంది, మనలో కూడా ఉంది, ఆ భాగం ఎప్పుడు చావదు' అని. అసలు నిజానికి సృష్టిలో ఉన్నది ఏది చావదు. ఏమిటయ్యా చచ్చేది అంటే మన రూపం! ఎవరైనా ఒకరు చచ్చారనుకొండి, ఏం జరుగుతుంది? పదార్థం పదార్థంలో కలిసి పోతుంది చావదది. నీరు నీటిలో కలిసిపోతుంది. వేడిమి వేడిమిలో కలిసిపోతుంది. వాయువు వాయువులో కలిసిపోతుంది, ఆకాశం ఆకాశంలో కలిసిపోతుంది. అంటే ఇవన్నీ వాటి sources లోకి అవి వెళ్లిపోతాయి. Sources లోకి వెళ్లిపోతాయి తప్ప వాటికి చావులేదు. అయితే ఈ sources దగ్గరి నుంచి కొంచెం కొంచెం తెచ్చి మనం ఒకటి తయారు చెస్తే అది కొన్నాళ్ళే ఉంటుంది. తర్వాత ఈ తయారు చేసినది మళ్ళి source దగ్గరకు వెళ్ళి అందులో కలిసిపోతుంది. వినాయకుడు బొమ్మ మనం మట్టితో తయారు చేసుకుని, దాన్ని మళ్ళీ నీళ్ళల్లో కలుపుతాము కదా! ఏమైంది? అందులో ఉండే నీరు నీళ్ళల్లో వెళ్ళిపోయింది, మట్టి - మట్టిలోకి వెళ్ళిపోయింది. రూపం ఆకాశం లోకి వెళ్ళిపోయింది. మళ్ళీ రూపం మనసు నుంచి పుట్టుకొస్తుంటుంది. విశ్వకర్మ అనే ఒక తత్వం మనసులో ఉంది. దాని నుంచి రూపాలు వస్తూ ఉంటాయి. ఈ ఏడాది వినాయకుడిని కలిపేస్తే వచ్చే ఏడాది ఎట్లా వస్తాడు? మన మనసులో దాని యొక్క రూపం ఉండబట్టి. మన మనసులో రూపం భాసించితే, దాని ప్రకారం పదార్థాన్ని మలచుకుంటు ఉంటాం. కాని రూపంలో ఉన్న తత్వానికి మార్పు/ చావు లేదు. రూపానికి మాత్రమే మార్పు ఉన్నది మిగితావాటికి మార్పు లేదు. అందుకే ఈ పంచతత్వాలు ఏమయిపోతాయి? ఈ భూమి ఉన్నంత కాలం పంచతత్వాలు ఉన్నాయి. ఈ భూమి లాగా ప్రతి గోళం మీదా ఉన్నాయి. ఈ భూమి లేదనుకోండి ఏమయిపోతుంది? ఈ పదార్థం నీళ్ళలోకి వెళ్లిపోయి, నీళ్ళు వేడిమిలోకి వెళ్ళిపోయి, వేడిమి వాయువు లోకి, వాయువు ఆకాశం లోకి వెళ్ళిపోతాయి. ఇవి లేదా అంటే ఉంది. ఎట్లా ఉంది అంటే బీజ రూపంలో ఉంది అంటారు, విత్తనం రూపంలో ఉంది అంటారు. ఆకాశం లో వాయువు ఉంది, ఆకాశం లో వేడిమి ఉంది. ఆకాశం లో నీరు ఉంది. ఆకాశం లో పదార్థం ఉంది. అవి అవతరణ చెందుతూ ఉంటాయి, మళ్ళీ లయం అయిపోతూ ఉంటాయి. ఈ ఆకాశతత్వంలో ఇవన్నీ ఉంటాయి కాబట్టి, ఉన్నవి అన్నీ ఎప్పుడూ ఉంటాయి, ఎక్కడికీ పోవు అని చెప్తూ ఉంటారు. ఉన్నదేదిపోదు అని చెప్తారు. ఈ మొత్తంలో మనం కట్టే రూపాలు మాత్రమే పోతాయి. ఊళ్ళో ఉండే ఇళ్ళు పడిపోవచ్చు కానీ ఊరు ఉంటుంది కదా. మళ్ళీ కడతాం కదా. ఎట్లా కడతాం అంటే అంతకు ముందు

ఎట్లా కట్టామో అట్లా కడతాం. ఆ విధంగా రూపాలు వస్తూ వుంటాయి, పోతువుంటాయి. వాటికి సంబంధించినవంటి తత్వాలు అవతరణ చెందుతూ ఉంటాయి మళ్ళీ ఎక్కడ నుండి అవతరణ చెందుతాయో అక్కడకి వెళ్ళిపోతూ ఉంటాయి. కాబట్టి ఇక్కడ "అమృత్యు" అనే శబ్దానికి అర్థం ఆరోహణము - అవరోహణము లేనటువంటి స్థితి. రూపములో మార్పులేనటువంటి స్థితి - ఈ  స్థితిని అమృతత్వ స్థితి అంటారు. మనలో కూడా ఆ స్థితి ఉన్నది. అది ఆధారంగా మిగతావి అన్ని జరుగుతూంటాయి. ఈ మార్పు జరిగే వాటిలో మనం జీవిస్తున్నామనుకొండి మనం చచ్చిపోతూ ఉంటాం. మార్పు చెందేవాటిలో కాకుండా మార్పు చెందనివాటిలో మనం ఉండి, అది మనం అని తెలిస్తే మనం పోము అని తెలుస్తుంది, మనం ఉంటాం అని తెలుస్తుంది.

# ౨౦౭ సర్వధృక్

సర్వధృక్ అంటే అన్ని చూస్తూ ఉంటాడు, మనలో చూసేవాడిగా కూడా ఉంటాడు. మనం కూడా అన్ని చూస్తూ ఉంటాం. ఎవరింటికి అయిన కొత్తగా వెళితే Wardrobes చూస్తాం, showcase చూస్తాం. గోడకు తగిలించినవి చూస్తాం. Sofa sets చూస్తాం. ఇవన్నీ ఎవరు చూడమని చెప్పారు మనకు? ఇంట్లోకి వెళ్ళంగానే అవన్నీ చూడమని చెప్పారా ఎవరైనా? మన కంటికి కనిపించినదల్లా చూస్తాం కదా. ఇలా అన్ని చూద్దాం అనే తత్వం ఎక్కడి నుంచి వచ్చింది మనకి? దేవాలయం ఏదో కొత్తగా కట్టారనో, fountains పెట్టారని లేదా park అనో, ఏదో కట్టారుట, ఇలా అన్నీ చూద్దాం అనిపిస్తుంది కదా! ప్రతిదీ చూద్దాం అనిపించే స్వభావం మనలో "సర్వధృక్" అన్నమాట. ఆయన అలానే చూస్తూ ఉంటాడట. ఆయన అలా చూస్తాడు కాబట్టి మన దగ్గర కూడా ఆ బుద్ధి ఉంది. ఆయనలో లేనిది మనలో ఉండే అవకాశం లేదు. కాకపోతే ఆయన సమస్తాన్ని ఏక దృష్టితో, ఏకకాలం లో చూడగలుగుతాడు. మన దృష్టి అట్లా ఉండదు. మనకి ఒకటి చూస్తే ఇంకొకటి కనపడదు. ఏక కాలంలో అన్నింటినీ, సమస్తాన్నీ చూడగలిగినటువంటి శక్తి, తత్వం కలిగినటువంటి వాడు 'సర్వధృక్'. మనమూ చూస్తాము, ఆయనా చూస్తాడు. ఆయన చూడటానికి, మనం చూడటానికి తేడా ఏమిటంటే మనం ఏకకాలం లో చూడలేము, అంతా చూడలేము. ఈ ఊరే అంతా చూశామని చెప్పలేము మనం. ఈ పేట అంతా చూశామని చెప్పలేము. మన ఇంట్లోనే చూడని ప్రదేశాలు ఉండచ్చు. అట్లాంటిది ఏక కాలం లో సమస్తాన్ని చూడగలిగినటువంటి విశ్వరూపము. అది ఆయనకి ఉంది. ఆయన అనుగ్రహిస్తే ఇంకెవరికైనా కూడా వస్తుంది. అట్లా అనుగ్రహించాడు కొంత మందికి. ఎవరికి అనుగ్రహింపబడినదో వాళ్ళు చూడగలరు తప్ప అందరూ చూడలేరు. దేవకీ దేవికి అటువంటిది అనుగ్రహించాడు. నేను చూసాను అన్నవాళ్ళెవరు కూడా చూసినవాళ్లు కాదు. చూశాం అని ఎట్లా అంటారు? చూపించారు అనాలి. నాకు చూపించాడు అంటే చూసి ఉంటాడు అనుకోవచ్చు. అర్జునుడికి చూపించాడు. ధృతరాష్ట్రుడికి చూపించాడు. దేవకీ దేవికి చూపించాడు. చూపిస్తే చూడటమే! అలా చూడడం మనవల్ల అవుతుందా? మనబోటి వాళ్ళకి అయ్యేపని కాదది. అసలు ఇక్కడేదో పని చేస్తుంటే ఇంట్లోది కనిపిస్తుంది అనుకోండి. Office లో పనిచేస్తుంటే ఇంట్లోవన్ని కనిపించాయి అనుకోండి. కొంత మంది చచ్చిపోయిన వాళ్ళు, ఆక్సిడెంట్లు అవుతున్నవి, కొంత మంది మనుషులు పుడుతున్నవి, కొంత మంది మనుషులు చేస్తున్నవి, కొంతమంది మనుషులు ఆస్పత్రికి వెళుతున్నవి, ambulance లు, అట్లా అన్నీ ఒకేసారి కనిపిస్తే మనకి భయంకరం గా ఉండదూ? చూడగలమా? మనకి అలా చూపిస్తే మనం ఏమవుతామో మనకే తెలియదు 'ఈ ఘోరమైన రూపం నేను చూడలేను, ఇంక చాలు' అని చెప్తాడు అర్జునుడులాంటివాడు.

అది కూడా చాలా ప్రత్యేకమైనటువంటి ద్రుష్టి ఇచ్చి చూపించితేనే భరించలేకపోయాడు అర్జునుడు. దాన్ని అలా చూస్తూ ఉంటే సమస్తములో ఏమి జరుగుతోంది అన్నది తెలుస్తుంది. మన తలలో పేను, కాలి మీద దోమ మనకు తెలుస్తున్నట్లు. మన తలలో పేను తిరుగుతూ ఉంటే  మనం కుడి చేయి, ఎడం చేయిఎత్తి చూపుడు వేలో, మధ్య వేలో వాడి గోకాలి...ఇంత ఆలోచన చేయం. వెంటనే దాన్ని గోకేసుకుంటాం. అట్లాగే దోమ ఎక్కడో కాలు చిటికినవేలు మీదకి వాలిందనుకోండి, కొట్టట్లేదా ? ఎట్లా తెలుస్తుంది ? ఈ శరీరం మొత్తం మనం వ్యాపించి ఉన్నాం కాబట్టి. ఆయన సృష్టి అనేటువంటి శరీరాన్ని మొత్తం కూడా వ్యాపించియున్నాడు కాబట్టి సమస్తము తెలుస్తూ ఉంటుంది. సమస్తాన్ని చూస్తూ ఉంటాడు. అన్ని చూస్తూ ఉండేటటువంటి తత్వం భగవత్ తత్వం. ఆ తత్వం మనలో కూడా వుంది. కాబట్టి మనం అన్ని చూడటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాం. ఎవరూ చూడకూడని పనులు మనం చేయరాదు. మామూలుగా మనం కొన్ని పనులు ఎవరైనా చూస్తున్నారు అంటే చేయము కదా. అంటే అసహజమైనటువంటి పనులు ప్రకృతికి, సృష్టి ధర్మాలకి విరుద్ధంగా ఉండే పనులు చేసేటప్పుడు ఎవరైనా చూడకపోతే బాగుండని అనిపిస్తుంది. ఇవన్నీ ఎవరూ చూడటం లేదని మనం చేస్తామే ఎవరూ చూడకపోవటం అనేది ఏమీ ఉండదు. అదే చెప్తాడు శ్రీకృష్ణుడు భగవద్గీతలో. 'సమస్తాన్ని నేను చూస్తూనే ఉన్నాను. నేను చూసింది మీకు account ఒకటి maintain చేస్తున్నాను. ఆ account కి ప్రతిసారి balance చూస్తూ ఉంటాను. దాని ప్రకారం నీకు మీ ఫలితం మీకు అందిస్తూ ఉంటాను. కాలం రూపంలో సమస్తాన్ని కూడుతూ ఉంటాను. ప్రతి జీవి యొక్క వ్యాపారాన్ని, ప్రవర్తనని కూడి దానిని బట్టి వాళ్ళకి వచ్చే balance ప్రకారం మంచి వాటికి ప్రశాంతత, ఆనందము అనుభూతి కలిగిస్తాను. ఇంకొక రకమైన వాటికి దుఃఖం కలిగిస్తూ ఉంటాను. ఏది ఎవరూ చూడట్లేదని చేయబోక అని. చూస్తున్నారనే చేయి. చూస్తే చేయకూడని పని అయితే చేయకు. మరి అట్లా అయితే భార్యాభర్తల విషయమో అంటే అది ప్రకృతి సహజమైనటువంటి విషయం. ఇటువంటి వాటికి పవిత్రత ఉన్నది. పద్ధతి ఉన్నది. అన్నిటికీ ఒకటె వర్తించదు. ధర్మసూక్ష్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. Context కి దానిని అన్వయించుకొని చెప్పకోవలసి ఉంటుంది. అలా నిర్వర్తించినపుడు పవిత్రత పెరుగుతుంది. సర్వధృక్ అంటే సమస్తమును దర్శిస్తూ ఉండేటటువంటి వాడు కాబట్టి ఆయన చూస్తూ ఉన్నాడు అనేటువంటి భక్తి అయినా ఉండాలి, భయం అయినా ఉండాలి ధర్మంలో నిలబడటానికి. భక్తి లేని చోట భయపెట్టాలి. భక్తి లేని వాడు తెగించి అధర్మంలో నిలబడటానికి ప్రయత్నిస్తాడు అందుకని వాడిని భయపెట్టాలి. భయపెట్టిన వాడు లొంగలేదనుకోండి అప్పడు కొట్టాలి. కొట్టినా లొంగలేదనుకోండి, వాడి వలన మొత్తం సమాజానికి కీడు ఏర్పడేటటువంటి పరిస్థితి వచ్చిందనుకోండి ఒకడిని తీసేయడం వల్ల మిగతాదంతా బాగుంటుందిట అంటే వాడిని తీసేయటమే 'in the benefit of the world'. ఇది మనకు పెద్దలు చెప్పినటువంటి ధర్మం. ఏదో వేలి మీద

పుండు వచ్చిందనుకో. వేలు తీసేస్తే మీరు బతుకుతారు లేకపోతే చస్తారు అంటే. ఏం చెప్తావ్? మొత్తం పోవడానికి ఒప్పుకుంటావా, వేలు తీసేయడానికి ఒప్పుకుంటావా? చచ్చినట్టు వేలు తీయడానికే ఒప్పుకుంటావ్. ఏమీ సందేహం లేదు. నీ విషయంలో ఏది సత్యమో సంఘం విషయంలో కూడా సత్యం. ఒకడు బాగా లోకంటకుడిగా తయారయ్యి, అందరిని దుఃఖ పెడుతున్నాడు అనుకోండి వాడిని తీసేయడానికి ఒకడు వస్తాడు. మరి వాడు జీవహింస చేశాడు కదా అంటే? అలా అనడానికి లేదు. కృష్ణుడంటే ప్రపంచానికి ఈనాటికి అర్థం కాలేదు. ఎందుకు యుద్ధం చేయించాడు అని విదురుడంతటి వాడికే అర్థం కాలేదు. మనం ఎంత? భగవంతుడు అయితే యుద్ధం ఎందుకు చేయించాలి అంటే యుద్ధం చేయించకుండా దుర్యోధనాదులు బాగుపడటానికి అవకాశం ఎప్పటికీ ఉండదు. శిక్షణ జరగాలి. దుష్టులను శిక్షించి దుర్బలులని ఉద్ధరించాలి. మంచి వాళ్ళు ఉంటారు వాళ్ళని మనం ముట్టుకోనక్కర్లేదు కానీ, దుర్బలులు ఉంటారు. 'Weaknesses are different from wickedness'. Wickedness దుష్టత్వం కింద వస్తుంది. Weakness దుర్బలత్వం కింద వస్తుంది. దుర్బలత్వంలో ఉన్న వారిని దుర్బలత్వం నుంచి ఉద్ధరించవచ్చు. దుష్టుని ఉద్ధరించడానికి అవకాశం ఏమాత్రం ఉండదు. అందుకనే మన వాళ్ళు ఒక సామెత చెప్పారు 'పాముకి పాలు పోసినట్టుగా' అని. దుష్టుడెప్పుడూ మన నుంచి అందిన సహాయం వల్ల మంచివాడుగా మారడు. ఇదొక సత్యం. ఇది ఒక ధర్మ సూక్ష్మము. మనం ఎవరికైనా ఉపకారం చేస్తున్నా వాడు చెడు మార్గంలోనే ఇంకా ఉన్నాడనుకోండి వాడికి సహకరించడం అనేది ఉండకూడదు. రెండవది అవసరమైతే శిక్షించాల్సిన స్థితిలో ఉండగలగాలి. లేకపోతే వాడికి దూరంగా ఉండటమే! వాడికన్నా మన బలవంతులం కానప్పుడు దూరంగా ఉండటం ఉత్తమం. ఈ సర్వధృక్ చూపుతో దుష్టుని శిక్షిస్తూ ఉంటాడు. దుర్బలులని ఉద్ధరిస్తూ ఉంటాడు. మంచివారిని రక్షించుకుంటూ ఉంటాడు. ఈ సర్వధృక్ అనే భగవంతుని చూపు మనలో పెంపొందించడానికి అన్నింటిలో చూడటం అంటే అన్నిటియందు ఉన్నవాడిని చూడాలి. అదీ చూపు!

సుర రక్షకుని చూచు, చూడ్కులు చూడ్కులు అన్నారు.

సుర రక్షకుడు అంటే వెలుగు కేంద్రాలను రక్షించుకుంటూ ఉంటాడట. ఎందుకంటే వెలుగు కేంద్రాన్ని రక్షించుకుంటే అవి కేంద్రంగా మిగతావన్నీ నడుస్తూ ఉంటాయి. గభాలున సూర్యుడిని తీసేసారు అనుకోండి ఎవరైనా వచ్చి, మొత్తం అంతా ఇగిరిపోతుంది. ఈయన రక్షించుకుంటూ ఉంటాడు. సుర రక్షకుడు అంటే అది. మనలో కూడా వెలుగు కేంద్రాలు ఉన్నాయి. 16 వేల కేంద్రాలు ఉన్నాయని చెప్పారు ఒక పద్ధతిలో. 72,000 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు ఇంకొక పద్ధతిలో. ఈ కేంద్రాలన్నీ రక్షించుకుంటే వాటి పరిధిలో జరిగే activity బాగుంటుంది. కేంద్రమే పోయిందంటే ఆ చుట్టూ area లో ఇంక ఏమీ activity ఉండదు. అందుకని "సుర రక్షకుని చూచు

చూడ్కులు చూడ్కులు". మనం కూడా సర్వదృక్ అనేటువంటి భగవంతుని తత్వాన్ని మనలో మేల్కొలపాలి అంటే అన్ని రూపాల్లో ఉన్నటువంటి ఈ భగవత్ తత్వాన్ని దర్శనం చేయాలి. ఎవరిని చూసినా ఇది కూడా వాడి అవతరణ అనే చూపు ఉండాలి. అంటే ఉన్నవన్నీ చూడకుండా నేను సుర రక్షకుడినే చూస్తాననేట్లు ఉండదు. కనపడుతున్న దాంట్లో దానికి కేంద్రం గా ఉన్నవాడ్ని చూస్తాడు. మన అందరిలో ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క కేంద్రం ఉంటుంది. మీరు కేంద్రంగా మీ శరీరం, మీ కార్యకలాపాలు ఉంటాయి. నా శరీరం కేంద్రంగా నా కార్యకలాపాలు ఉంటాయి. ఏ రూపానికైనా దాని కేంద్ర దర్శనం చేసుకుంటూ ఉన్నట్లయితే మనకి కూడా నెమ్మదిగా ఈ సర్వదృక్ అనే తత్వం భాసించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ విధంగా మనం చూడటం మొదలు పెట్టినప్పుడు విశ్వవ్యాపకమైనటువంటి భగవంతుని యొక్క దర్శనము, సాన్నిధ్యము మనకి చేరువ అవుతాయి.

## 208 సింహః

సింహం అనగానే సింహరాశి తత్వం అంతా కూడా మనకి బాగా అవగాహనకు రావాలి. 'స, హ' ఈ రెండు శబ్దాలు ఇందులో నిబిడీక్రుతమై ఉన్నవి కాబట్టి ప్రకృతి పురుషుల యొక్క సమస్త తత్వం ఇందులో ఉన్నది. మనం ఎవరైనా ఉత్తమమైన గుణములు కలిగిన వారిని 'సింహం' అంటారు. సింహం అని పేరు పెట్టుకోవడం వలన కాదు. సింహం వంటి గుణాలు కలిగినటువంటి వారు అంటే రక్షణ కలిగించడం, ఆశ్రయం ఇవ్వడం, ఆత్మీయత, వాత్సల్యం కలిగి ఉండటం, మౌనముగా ఉండటం, ధీమాగా ఉండటం, దర్జాగా ఉండటం, రాజసం కలిగి ఉండటం - రాజ ఠీవీ కలిగి ఉండి అన్నీ పరిరక్షించుకుంటూ తన జీవితం గడపటం. "స" శబ్దానికి మనలో ఒక కేంద్రం ఉంది. "హ" అనే శబ్దానికి మనలో ఒక కేంద్రం ఉంది. "హ" అనే శబ్దం విశుద్ధి దగ్గర, "స" అనే శబ్దం ఆజ్ఞ దగ్గర చెప్తారు. అందుకనే లలితా సహస్రనామం చూసుకున్నట్లయితే 'ఆజ్ఞా చక్రాబ్జనిలయ' అన్నప్పుడు అక్కడ 'శాకిని' అని చెప్తారు. అలాగే 'విశుద్ధి చక్రనిలయ' అన్నప్పుడు 'హాకిని' అని చెప్తారు. ఆజ్ఞలో శాకిని - విశుద్ధిలో హాకిని. సహ అనే శబ్దం లోని "స"కి "ర"కారం, "ఇ" కారం చేరిస్తే, "శ్రీం" అవుతుంది. "హ" కి "ర" కారం, "ఇ" కారం చేరిస్తే "హ్రీం" అవుతుంది. "శ్రీం", "హ్రీం" ఈ శబ్దాలు. మనకి ఇవ్వబడిన "స", శబ్దము, "హ" శబ్దము - ఈ రెండిటిలో నుంచి సమస్తమూ పొందటానికి అవకాశం ఉంది. ఇదంతా తంత్ర శాస్త్రం. భగవంతుడు సింహ అని ఎందుకు చెప్పారంటే, సకార హకార హ్రీం కారములతో సృష్టిగా వెలువడిన వాడని చెప్పడానికి 'సింహ' అని చెప్తారు. సింహరాశి ద్వాదశ రాశుల్లో ఐదవ రాశిగా కనిపిస్తుంది. చైత్రం, వైశాఖ, జేష్టం, ఆషాడం నాలుగు మాసాల అయిన తర్వాత ఐదవ మాసం శ్రావణం. లేక మేషము, వృషభము మిధునము, కర్కాటకము ఇంకా ఐదవ రాశి సింహం. సింహము తత్వం ఏంటయ్యా అంటే సృష్టికి అతీతమైనటువంటి తత్వమే సృష్టిలో సృష్టికి ఆధారంగా ఏర్పడటం. అందుకని మేషమాసములో ఉన్నటువంటి అగ్నికి శ్రావణమాసంలో ఉన్న అగ్ని కొడుకు అని చెప్తారు. జాతకాలు చూసేటప్పుడు ఐదవ ఇంట్లో ఏవైనా గ్రహాలు ఉంటే కొడుకులు పుడతారా, కూతుర్లు పుడతారా అని నిర్ణయం చేస్తూ ఉంటారు. అయిదవ ఇంట్లో రాహు ఉన్నాడనుకోండి ఎవరైనా పిల్లలు పుడతారా అండి అంటే, దేవుడే దిక్కని చెప్పటం. పుట్టరు అని చెప్పద్దు ఎందుకంటే భగవంతుని అనుగ్రహం ఉంటే ఏదైనా జరగొచ్చు. కానీ general గా fifth house లో రాహు ఉన్నాడనుకోండి, అప్పుడు పిల్లలు పుట్టడానికి అవకాశం తక్కువ. Fifth house లో సూర్యుడు ఉన్నాడనుకోండి, వీర తేజస్సు కలిగినటువంటి కొడుకు పుట్టొచ్చు లేకపోతే ఆత్మతత్వం నీకు అబ్బచ్చు. ఇది కూడా పుట్టుకే కదా ఆత్మ నుంచి. ఇట్లా ఆత్మతత్వం సృష్టికి అతీతంగా ఉన్నది సృష్టిలో ఏర్పడటం అంటే సృష్టికి అతీతమైన భగవంతుడు సృష్టిలో ప్రవేశించడం అనేటటువంటి దానికి

'సింహము' అని పేరు పెడతారు. అంతకుముందు సృష్టికి అతీతంగా ఉంది ఎప్పుడు సృష్టిలో ఉంది. ఆ సృష్టికి అతీతంగా ఉన్న వాడికి సృష్టిలో ఉన్నవాడు కొడుకు అంటారు. ఈ పద్ధతిలో మనలో కూడా హృదయమనందు ఎప్పుడైతే చైతన్యం మేల్కాంచుతుందో అప్పుడు మనం పుట్టిన వాళ్ళం అవుతాం. మనం రెండవసారి పుట్టటం అంటే అది. హృదయంలో మేలుకాంచినటువంటి వాడు మళ్ళీ పుట్టిన వాడు. ఇంతకుముందు మనం పుట్టింది మనిషికి. ఇప్పుడు మనం పుట్టింది దేవుడికి. ఎందుకంటే మానవ శరీరం కూడా ఒక సృష్టి కదా. సృష్టిలో ఉన్నటువంటి సమస్త తత్వాలు శరీరంలో ఉన్నాయి కాబట్టి సృష్టిలో భగవంతుడు. సృష్టికి అతీతంగా ఉన్నటువంటి భగవంతుడు మనలో పుడతాడుట. మనలో పుట్టటం అంటే మన హృదయంలో పుట్టటం. అంతకుముందు మనం మనిషికి పుట్టాం. ఇప్పుడు ఎట్లా పుట్టాము? ఎట్లా పుట్టామంటే దేవుడిలో పుట్టామన్న మాట. ఈ పుట్టుకనే 'ద్విజత్వం' అంటారు. దానికే జ్వాలకూల్ మహర్షి ఏమని చెప్తారంటే, 'మొట్టమొదట నువ్వు పుట్టినప్పుడు చీకటిలో పుట్టావురా ఇప్పుడు వెలుగులో పుట్టావు' అని. నిజానికి చీకటిలో పుట్టిన వాళ్ళమే అందరం. అందుకని in the beginning you are a son of darkness now you are a son of light". అందుకనే 'sons of light' అనేవారు అందరూ కూడా సింహరాశిలో పుట్టుకు వస్తూ ఉంటారు. వాళ్ళందరికీ ఈ రాశి లో దిగి రావడం సులభం. శ్రీకృష్ణుడు ఏ రాశిలో పుట్టాడు? సింహరాశి శ్రావణమాసం. రాముడు ఏ రాశిలో పుట్టాడు? చైత్రమాసంలో పుట్టాడు. అదీ అగ్నితత్వపు రాశే. అట్లాగే అగ్నితత్వపు రాశుల్లో ఎక్కువ పుడుతూ ఉంటారు. ఎందుకని అంటే అగ్ని అవ్యక్తమైనటువంటి భగవత్ తత్వం నుంచి మొదటగా వ్యక్తమైనటువంటి తత్వం. కాబట్టి తేజోమయమైన రూపాలన్నీ కూడా మనకి ధనుర్మాసంలోనూ, లేక శ్రావణమాసంలోనూ లేక చైత్రమాసంలోనూ పుడుతూ ఉంటారు. మిగతా వాటి అన్నిటినీ కూడా దగ్ధం చేయగలిగినటువంటి, శక్తివంతమైనటువంటి తత్వములు అవి. అందుకని మనం పూజ చేసే మహాత్ములు ఎక్కువ భాగం వాళ్ళందరూ కూడా ఈ తత్వములో పుట్టిన వారు అంటే సింహములై పుట్టారన్నమాట. అందరూ సింహముగా పుట్టుకతోనే గర్జించారని అర్థం. శ్రీకృష్ణుడు శ్రావణమాసం, Master C.V.V. శ్రావణమాసం. Master M.N. శ్రావణమాసం. Master E.K. శ్రావణమాసం, Madam Blavatsky శ్రావణమాసం. అరవింద మహర్షి శ్రావణమాసం. చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఇన్ని సింహాల చుట్టూ కూర్చుని మనం ఇంకా సింహాలు కాలేకపోతే ఎలా? వారి యొక్క సాన్నిధ్యాన్ని ఎంత పెంచుకుంటే అంత అవటానికి అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి 'సింహ' అనే భగవత్ తత్వం మనకి భూమి మీద అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటుంది ఎట్లా కనిపిస్తుంది అంటే క్రైస్తవ పదజాలంలో దైవ కుమారులుగా కనిపిస్తుంది. దైవ కుమారుడు, దైవ కుమారుడు వాళ్ళు అంటారు కదా, సత్యమే అది. క్రీస్తు దైవ కుమారుడే! కానీ క్రీస్తు ఒక్కడే దైవ కుమారుడు

అనుకోవడం క్రైస్తవ మతం. క్రీస్తు కూడా దైవ కుమారుడు అనేటువంటిది మన సనాతన ధర్మం. అంతకుముందూ చాలామంది పుట్టారు. అంతకు తర్వాత కూడా చాలామంది పుట్టారు. అది తెలుసుకోవాలంటే మనలో సత్వగుణం బాగా ఉండాలి. రజోగుణం ఉంటే తెలియదు. కాబట్టి సింహరాశి తత్వము సింహమాసంలో మనం ఎక్కువగా అవగాహన చేసుకోవడానికి అవకాశం ఉన్నది.అందుకనే శ్రావణమాసం లో హృదయమునందు మనకి పూజలు ఇచ్చారు. అమ్మవారి పూజలు ఇచ్చారు. అదే మనం మన సింహాసనం మీదకి ఆవాహన చేసుకుని పూజ చేసుకోవడం అని చెప్పారు. కాబట్టి ఆ పద్ధతిలో సింహ అనే ఈ రాశికి జ్యోతిష్య పరంగా చాలా చెప్పారు. మొత్తం సృష్టికి అగ్నితత్వపు రాశులు మూడు అయినప్పుడు అందులో మధ్యస్తమైన అగ్నితత్వం సింహరాశి తత్వం. సృష్టికి అతీతంగా ఉండేటటువంటి అగ్నితత్వం మేష రాశి తత్వం. శ్రావణ మాసపు ప్రజ్ఞ పదార్థాన్ని అధిష్టించి ఉన్నటువంటి వేడిమి లేక అగ్ని. మేషమాసం ఈ రెండిటికి పుట్టుక స్థానమైనఅగ్ని. అంటే ఒకటి చోట్లో ఉన్నటువంటి అగ్ని కనపడదు. చోట్లో అగ్ని ఉంది అందుకనే మనము జీవిస్తున్నాం. చోట్లో ఉంది. ఉన్నట్టు మనకి తెలియదు. Oxygen ఉంది కదా. చోట్లో ఉండేది మనకు కనిపించేట్టుగా వస్తుంది. ఎలాగంటే చోట్లో ఉన్నటువంటి అగ్ని, పదార్థంలో ఉన్నటువంటి అగ్ని రెండు కలిపితే కనిపించేటటువంటి అగ్ని వస్తుంది. ఇది చాలా పెద్ద విషయం. మనం చాలా సులభంగా చెప్పేసుకుంటున్నాం. అదే మహాత్ముల అనుగ్రహం, అంతకంటే ఇంకేమీ లేదు. దీపం వెలిగించారు. మనకు కనిపించేటటువంటి దీపం అట్లా ఉండటానికి కారణం చోట్లో ఉన్నటువంటి అగ్ని, వత్తిలో ఉన్నటువంటి అగ్ని. వత్తి లేదనుకోండి, అగ్నిచోట్లోకి వెళ్ళిపోతుంది. వత్తి ,నూనె లేదనుకోండి, అగ్ని ఉన్నది కానీ మనకి కనబడదు. అట్లాగే చోటులో అగ్ని లేకపోతే ఉత్త వత్తి నుంచి అగ్ని వ్యక్తం కాదు. కాబట్టి చోట్లో ఉండే అగ్ని, పదార్థంలో ఉండేటటువంటి అగ్ని రెండిటి యొక్క సమాగమము చేత వ్యక్తం అవుతూ ఉండాలి. విద్యుత్తు చోట్లో ఉంది. మనకి కనబడదు. వెయ్యని ట్యూబ్లైట్లో అగ్నితత్వం ఉంది తప్ప వ్యక్తం అయ్యేటటువంటి అగ్నిగా ఉండదు. అవి రెండూ కలిసినప్పుడు వెలుగుగా వ్యక్తం అవుతుంది. ఈ పదార్థంలో ఉన్నటువంటి అగ్నినే అమ్మవారు అంటారు. చోట్లో ఉన్నటువంటి అగ్నిని అయ్యవారు అంటారు. వారి ఇద్దరికీ పుట్టిన వాడు సృష్టిలో భగవంతుడు. God in creation. అన్నీ అంతే! దీనినే త్రయివిద్య అంటారు. అది దొరికితే మనకి ఎన్ని ముళ్ళు అయినా విప్పకోవచ్చు. త్రేతాగ్ని అంటారు కదా. పదార్థంలో అగ్ని, చోట్లో అగ్ని. రెండిటినీ అనుసంధానం చేసేటటువంటిది వ్యక్తం అయినటువంటి అగ్ని. అంటే తండ్రికి, తల్లికి కుమారుడి లాగా అన్నమాట. తండ్రికి ఒకతత్వం ఉంటుంది, తల్లికి ఒక తత్వం ఉంటుంది. కుమారుడిలో తల్లిది తండ్రిది ఇద్దరిదీ సమీకరింపబడుతుంది. క.సా.గు. బట్టి వాడు దిగుతాడు. కొన్ని కొన్ని గుణాల్లో తల్లి గుణాలు కనిపిస్తాయి, కొన్ని కొన్ని గుణాలలో తండ్రి గుణాలు కనిపిస్తాయి. రెండు పుచ్చుకుని వస్తాడు వాడు. అవతరణము

చెందినటువంటి అగ్నితత్వము - భగవంతుని తత్వం శ్రావణమాసంలో. ధనుర్మాసంలో అగ్ని పదార్థంలో ఉంటుంది ప్రజ్వలింపజేస్తారు. అందుకనే తెల్లవారుఝమున నాలుగింటికి లేచి పూజ చేసుకోమని చెప్తారు. ఎందుకని తెల్లవారు నాలుగింటికి లేచి పూజలు చేస్తున్నారంటే బద్ధకం వదలటానికి. పదార్థం అగ్నిని కప్పి ఉంచటం బద్ధకం. అగ్ని పదార్ధములో /శరీరములో బాగా ఉంటే నాలుగింటి నుండే వాళ్లకి నిద్ర పట్టదు. చురుగ్గా ఉంటారు. రాత్రీ, పగలు కూడా నిద్రపోతున్నాడు అంటే తమోగుణం. తమోగుణం ఎక్కువ ఉన్నచోట పదార్థం ఎక్కువ ఉంటుంది. అగ్నితత్వం తక్కువ ఉంటుంది. రజోగుణం ఎక్కువ ఉన్నచోట అగ్నితత్వం ఎక్కువ ఉంటుంది పదార్థం తక్కువ ఉంటుంది. అందుకని మనం ఊర్ధ్వ గతికి ప్రయాణం చేసేటప్పుడు తమోగుణం కన్నా రజోగుణం better అని చెప్తారు. అందుకనే తమస్సులో నుంచి రజస్సుకి, రజస్సులో నుంచి సత్వంలోకి. అట్లా పెరగాలి. బద్ధకం ఉందిట అంటే కోరి ఏమైనా పనులతో busy గా ఉండటానికి ప్రయత్నం చేయాలి. అట్లాగే మరీ ఎక్కువ పనులు చేసే వాడికి కొంచెం speed తగ్గించాలి. ఎక్కువ మంచి పనులు, సత్కర్మలు చేస్తూ ఉంటే అందులో నుంచి సత్వగుణం పుట్టి balance అవుతుంది. అసలు ఏ పని చేయని తమో గుణం ఉండే వాడికి మంచి పనో, చెడ్డపనో ఏదో చేయరా అని చెప్పాలి. వాడు చేయడం మొదలుపెట్టిన తర్వాత వాడు ఏం చేయొచ్చు, చేయకూడదు మళ్లీ ఇంకొక syllabus ఇవ్వచ్చు. అసలు చేయనివాడు బాగా కప్పేసి ఉన్నవాడన్నమాట. ఎక్కువ చేసే వంటి వాడికి కొన్ని filter చేయాలి. చేస్తే వీళ్ళిద్దరూ వాళ్ళ క.సా.గు. కట్టుకొని శ్రావణమాసంలో కలుస్తారన్నమాట.

ఒకడు ఆకాశంలో ఉంటాడు, ఒకడు భూమిలో కూరుకుపోయి ఉంటాడు. ఇద్దరికీ క.సా.గు. కడితే మధ్యస్థంకి వస్తారు. అలాగే ప్రకృతికి పురుషుడికి క.సా.గు. గా దిగివచ్చేవాడు, ప్రకృతిలోని దైవం. ప్రకృతికి అతీతమైనటువంటి దైవంతో మనకి ఏమీ పని లేదు. ఆయన అన్నిట్లో ఉంటాడు కానీ చూస్తూ ఉంటాడు. మనలోనూ చూస్తూ ఉంటాడు పాములోను చూస్తూ ఉంటాడు. పులిలోనూ చూస్తూ ఉంటాడు. అన్నిటిలోనూ ఉంటాడు ఆయన. మనకి కావలసినది, అన్నిటిలోనూ ఉండి మనని రక్షించే దేవుడు కావాలి. మనకి దారి చూపించేవాడు కావాలి. మన చేయి పట్టుకుని నడిపించేవాడు కావాలి. వాడే శ్రావణమాసపు తత్వం/అగ్ని. శ్రావణమాసపు ప్రజ్ఞలన్నీ కూడా అట్లా దిగి వస్తూ ఉంటాయి. ముందు ముందు శ్రావణ పౌర్ణమికి ఎక్కువ ప్రాముఖ్యత వస్తుంది. ఆషాడ పౌర్ణమి కన్నా కూడా. మనకి కుమారులు అంటే (అంటే సనకసనందనాదులు, నారదుడు) పదార్థానికి, పరమార్థానికి సమత్వం ఏర్పడిన వారు. ఆ సమత్వం ఏర్పడటం సింహాతత్వం. కేవలం 'స' మీద పోకూడదు. లేక కేవలం 'హ' మీద పోకూడదు. తత్వం "హ" మీద పోయిందనుకోండి, పదార్థం ఎక్కువ అయిపోతుంది. 'స' మీద పోయిందనుకోండి అంతా పరమార్ధ తత్వం ఎక్కువైపోతుంది. రెండిటికీ balance సమతూకంగా కలిగిందనుకోండి, అది సింహం. అందుకని సింహరాశి తత్వానికి

అత్యంత ప్రాధాన్యత ఉన్నది ఆధ్యాత్మిక జ్యోతిష్యంలో. అది అయిదవ రాశి. ఐదవ రాశి అంటే 10 నెంబర్లలో మధ్యస్థం గా ఉండేది ఐదుగా. ఐదుకి అటు-ఇటుగా మనం అంకెలు వేస్తూ వెళితే ఐదు అన్ని అంకెలను సమతూకంగా ఉంచుతుంది. ఐదుకి ఇటుపక్క 4 అంకెలు ఉన్నాయి అటు పక్కన నాలుగు అంకెలు ఉన్నాయి.  ఒకటి నుంచి నాలుగు వరకు, 6 నుంచి 9 వరకు. 5 అధిష్ఠించి ఉంటే ఈ అంకెలు అన్ని కూడా వాటి మధ్య అనుసంధానం ఏర్పరచుకుంటూ ఉంటాయిట. 5 పైన వేసి ఒక పక్క నుంచి 4,3,2,1 వేసుకు రండి. రెండవ పక్క 6,7,8,9 వేసుకు రండి. ఐదు అధిష్ఠించి ఉండటం వల్ల 6,4 కలిపితే పది అయిపోతుంది. 3, 7 కలిపితే 10 అయిపోతుంది. 2,8 కలిపితే పది అయిపోతుంది. 9 1 కలిపితే 10. అది ఐదు గొప్పతనం. అంటే ఒక మహాత్ముని సాన్నిధ్యంలో ఇద్దరి మధ్య పరిపూర్ణత వాళ్లు సంధింప చేస్తారు.  ఎక్కడి నుంచి ఏర్పడిందంటే అది ఐదు number లో ఉన్నటువంటి ప్రత్యేకత లేక ప్రకృతి పురుషుని సమాగము వలన సమత్వములో నిలబడిన ప్రజ్ఞ వలన చక్కగా ప్రవర్తిస్తారు.  ఊర్లోకి ఒక పెద్ద గురువు గారు వచ్చారు అనుకోండి అందరూ చక్కగా ప్రవర్తిస్తారు ఆయన సాన్నిధ్యంలో. ఆ కాసేపట్లో కొట్టుకోవటాలు, తిట్టుకోవటాలు, తన్నుకోడాలు ఉండవు. వెళ్ళిపోయిన తర్వాత మళ్ళీ మొదలవ్వచ్చు కానీ  ఉన్నప్పుడు ఉండవు. Presence అంటే అట్లా వుంటుంది. ఈ సింహరాశి తత్వం అన్నిటినీ చక్కగా అమర్చి, అన్నిటినీ చక్కగా పరిపాలిస్తుంది. అన్ని తత్వాలని పరిపాలిస్తుంది. సృష్టిని 10 అంకెలుగా చెప్తారు. 'అత్య తిష్ఠ దశాంగులం'. 10 అంకెలకి కేంద్రంగా నిలబడి అన్నింటినీ చక్కగా నిర్వర్తింప చేయగలిగినటువంటి తత్వం సింహరాశి తత్వం. అందుకని సింహరాశి తత్వంలో ఉండే వాళ్ళు ఎవరిని నిరాదరించరు. వాళ్ళకి మంచి,చెడు రెండు కూడా సృష్టిలో అవసరమైన వాటిగానే వాళ్ళు గమనిస్తారు. వాళ్ళకి వృథాగా కనిపించేవి ఏవి ఉండవు.

# ౨౦౨ సంధాత

సంధాత అంటే సృష్టిలో ఉన్న అన్ని విషయాలు వేటి విలువ వాటికి ఉన్నాయని తెలిసి, దేన్ని దేనితో అమర్చితే చక్కగా వినియోగింపబడతుందో తెలిసిన తత్వం. సృష్టిలో పనికిరానిదంటూ ఏదీ లేదు అని తెలిసినటువంటి వాడు సంధాత. పనికిరానివి ఎందుకు పుట్టించుకుంటాడు? మనం పనికి వస్తాయనే కదా పనికిరాని పనులు కూడా చేస్తూ ఉంటాం. There is no waste thing in creation there can be wasted things in creation. మనం waste చేసుకోవాలి తప్ప సృష్టిలో waste లేదు. వినియోగం తెలిసిన వాళ్ళకి సృష్టిలో అన్నీ పనికొస్తాయి. వినియోగం తెలియని వాళ్ళకి అన్నీ waste. Life waste కొంతమందికి. ఎందుకండీ జీవితం వృధా అంటూ ఉంటారు. ఒకడు భగవత్ తత్వంలో ఏది వృధా లేదని చెప్తూ ఉంటే, రెండో పక్క అంతా వృధానే అని చెప్పేవాడన్నమాట. చాలా మెట్లు ఎక్కాలి. ఎందుకండీ వెధవ life waste అన్నట్టుగా ఉన్నాడు. సంధాత అంటే అన్నిటి వినియోగం తెలిసినవాడు. పదిమంది ఉన్నారనుకోండి పది మంది వినియోగం చక్కగా చేస్తాడు. ఎవరి వినియోగం వాళ్లని అట్లా చేసి అందరిని కట్టుగా ఉంచుతారు. ప్రతివాడిలోని కొన్ని కళ్యాణ గుణాలు ఉంటాయి, కొన్ని ఇంకోటేవో ఉంటాయి. ఆయనేం చేస్తాడంటే కళ్యాణ గుణాలు ద్వారా వాళ్లతో సంధానం చేసుకుని దాంతోనే ప్రవర్తిస్తాడు వాడికి ఉన్న మిగతా విషయాల తో ప్రవర్తించడు. అలా చేస్తుంటే ఏమవుతుందంటే వాడిలో అది బాగా పెరిగి మిగతాది తగ్గుతుంది. ఒకడు మంచి బాగా పనిచేసే వాడు ఉంటాడు. వాడికి పూజలు ఇష్టం లేదనుకోండి. కానీ పనులు ఇష్టం. ఒకడికి పూజలు ఎక్కువ ఇష్టం ఉంటాయి పనుల కన్నా. వాడూ ఉంటాడు, వీడూ ఉంటాడు. తెలిసినవాడు ఈ పూజలకు రాని వాడిని కోప్పడడు. ఉపన్యాసాలకి రాని వాడిని కోప్పడడు. ఎందుకంటే తెలుసుకుందాం అనుకునే వాళ్ళు కొంతమంది ఉంటారు, పనులు చేసుకుందామనుకునే వాళ్ళు కొంతమంది ఉంటారు. తెలుసుకోవడం పనిచేయటంతో సంబంధం లేకుండా, పూజ చేసుకుందాం అనుకునే వాళ్ళు కొంతమంది ఉంటారు. ఇవన్నీ కాకుండా సలహాలు ఇచ్చే వాళ్ళు కొంతమంది ఉంటారు. వాడు ఊరికే సలహాలు ఇస్తూ ఉంటాడు. ఇస్తూ ఉంటే, వీడు ఏ పని చేయకుండా సలహాలు ఇస్తున్నాడని మనం అనుకుంటాం. కానీ తెలిసిన వాడు ఏం చేస్తాడంటే వీడి వల్ల కూడా ఉపయోగం ఉందనుకుంటాడు. ఎవరు ఎందులో దిట్టో, వాడి దిట్టతనంతో ఈయన సంబంధం పెట్టుకొని పని చేసుకుంటాడు. అదీ భగవంతుడు. ఈ మొత్తం సృష్టిలో మనకి తెలియకపోవటం వల్ల ఇది పనికిరాదని మనం అనుకోవాలి తప్ప పనికిరానిదంటూ ఏమీ లేదు. అన్నింటికీ చక్కగా వినియోగం ఉన్నది. ఆ వినియోగం తెలిసినటువంటి వాడు భగవత్ తత్వంలో ఉన్నటువంటి వాడు. భగవంతుడికి పరిపూర్ణంగా తెలుసు కాబట్టి అది తయారు చేసుకున్నాడు. దోమల వినియోగం ఏంటండీ? ఎందుకు ఉండాలి దోమలు?

దోమలు చుట్టూ ముసుగు లేకుండా చూసుకో, అని చెప్తాయన్నమాట. దోమలే లేవనుకోండి, మనం అలా ముసుగు పెంచుకొని ముసుగులో చచ్చిపోతాం. దోమలు ఉన్నాయని కదా కాస్త ముసుగు లేకుండా చేసుకోవడం, వెలుగు వచ్చేటట్టు చూసుకోవడం. చీకటి గదిలోకి బొద్దింకలు వచ్చేస్తూ ఉంటాయి. బొద్దింక ఎందుకు వచ్చింది అని గొడవ పెట్టకుండా కుళ్ళు లేకుండా చూసుకోవాలి, వెలుగు వచ్చేటట్టు చూసుకోవాలి గదిలోకి. అన్ని గదులలోకి వెలుగు, గాలి రావాలి. చీకటి గదిలో బతికే వాళ్ళు చాలా కుళ్ళిపోతారు. అట్లా ప్రతి దానిలో నుంచి సందేశాలు ఉంటాయి. శ్రీకృష్ణుడు సమస్తాన్ని ఆ విధంగా వినియోగం చేసుకున్నాడు. అంటే అందులో ఉండేటటువంటి దివ్యత్వం చూసి దాన్ని ఆ పద్ధతిగా వాడుకొని అన్నిటి యొక్క వినియోగం చక్కగా చేశాడు. అంతమంది వచ్చి నీకు భార్యలుగా ఉంటామంటే, ఆ కానీయండి అన్నాడు. శ్రీకృష్ణుడి తత్వం బాగా అర్థం చేసుకోవాలి. శమంతకమణిని తను ఎత్తుకుపోయాడు అని చెప్తే, నేను తీసుకెళ్ళలేదు అని prove చెయ్యలేదు. ఇది ఎందుకు వచ్చిందో? ఇందులో నుంచి మనకి ఏదో వినియోగం ఉంది అనుకున్నాడు. వెళ్ళి జాంబవతి, సత్యభామలను పట్టుకొచ్చాడు. ఒక శమంతకమణి ఉపాఖ్యానం వల్ల నాలుగు రకాల పనులు జరిగినాయి ఆయనకి. మనకి ఏదైనా అపవాదు వస్తే మనం భయపడతాం. కానీ తత్వంలో ఉండే వాళ్ళు నాకెందుకు ఇట్లా రావాలి, నేను మంచి వాడిని కదా అనుకోరు. 'ఇందులో నుంచి భగవంతుడు మనకి ఏదో నేర్పుతున్నాడు. ఇందులో నుంచి మనం ఏదో తెలుసుకోవలసి ఉంది. మనకి సంబంధించిన వినియోగం ఏదో ఉన్నది' అని నిలబడతారు. చెప్పుకోవడం చాలా సులభం, మనదాక వచ్చినప్పుడు చాలా కష్టంగా ఉంటుంది. ఇది గుర్తు ఉండదు అప్పుడు. గుర్తు వస్తే ధన్యం. ఒకవేళ గుర్తు రాలేదనుకోండి ఎవరైనా మంచి వాళ్ళ దగ్గరికి వెళ్తే నీకే కాదు నీ కన్నా ఇంకా చాలా ఎక్కువ కష్టం వచ్చిన వాళ్ళు ఉన్నారని కథలు చెప్తారు. చెప్తే అప్పుడు మనకు జరిగిన విషయం చాలా చిన్నది అని తేలికబడి, దానిని మనం ఎదుర్కొని పరిష్కారం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తాం.

ఏ సన్నివేశాన్ని అయినా సరే దాన్ని సమగ్రముగా చూడగలిగినటువంటి శక్తి కలిగిన వారియందు భగవత్ తత్వం పనిచేస్తున్నట్టు. అట్లా లేని వాళ్ళు ఏం చేస్తారంటే కొంతమందిని దూరం చేసుకుంటారు. వీళ్ళు మాకు అక్కర్లేదు, వీళ్ళు కావాలి అని ఉండరాదు. ఎంత వద్దు అనుకుంటే అంత దూరంగా ఉంటాం ఈ భగవత్ తత్వానికి. సంధాత అనే వాడు సంయక్, ధాత. అంటే సమముగా అన్ని ధరించి ఉంటాడుట. అది ఎందుకులే, ఇది ఎందుకులే అనుకోకుండా మొత్తం సృష్టినంతా కూడా అట్లా ధరించి ఉన్నాడు. ఎన్నో సూర్య మండలాలు ఉన్నాయి. అందులో గోళాలు, గోళాలలో జీవులు ఇలా దేనిని waste అనుకోకుండా సమస్తాన్ని అట్లా ధరించి ఉన్నాడన్నమాట. సృష్టిలో ప్రతివాటికి వాటి స్థానం వాటికి ఉన్నది, దానితో మనం ప్రవర్తించే తీరు మనం

తెలుసుకోవాలి. తెలుసుకుంటే అందరితోనూ స్నేహపూర్వకంగా, ప్రేమగా ఉండవచ్చు. వాళ్ళు మనతో ఎలాగైనా ఉండవచ్చు.

కృష్ణుడిని శత్రువుగా చూసిన వాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ కృష్ణుడికి ఎవరూ శత్రువులు లేరు. రాముడికి ఎవరూ శత్రువులు లేరు, రాముడిని శత్రువుగా చూసిన వాళ్ళు ఉన్నారు. ధర్మరాజుకి ఎవరూ శత్రువులు లేరు ధర్మరాజును శత్రువుగా చూసినవాళ్లు ఉన్నారు. క్రీస్తు, బుద్ధుడు వీరెవరికీ శత్రువులు లేరు. వాళ్ళని ఎవరైనా శత్రువులుగా చూస్తే చూసి ఉండాలి. వాళ్ళ వాళ్ళ మాలిన్యాలని బట్టి అటువంటి భావనలు వస్తుంటాయి. చూడంగానే comment చేద్దామని అనిపిస్తుంది కొంతమందికి. ఊళ్లో ఎవరైనా గురువుగారు వచ్చారంటే తప్పులు వెతకడానికి చూస్తారు. ఎంతటి గురువో చూడాలనిపిస్తుంది. అట్లా చూసే వాళ్ళు లాభం లేదు. వాళ్లకి ఈ సంధాత అనేటువంటి నామం యొక్క అనుభూతి రావడానికి అవకాశం లేదు. Over-critical గా ఉండేటటువంటి వాళ్ళు ఈ అనుభూతి పొందడానికి వీలులేదు. అతి చిన్న విషయం నుంచి అతి పెద్ద విషయం వరకు అన్నిట్లో నిండి ఉన్న భగవంతుడిని, ఆ విషయములో ఉండేటటువంటి విలువని, వినియోగాన్ని తెలుసున్న వాడు సంధాత. భగవంతుడు ఆ విధంగా సంధాతగా సమస్తాన్ని ధరించి ఉన్నాడు.

## 210 సంధిమాన్

ఐదు చుట్లూ ఉండేటటువంటి అంకెలు ఏ విధంగా ఒకదానితో ఒకటి సంధి చేసుకున్నాయో అట్లా సమస్తమును రాజీ చేసి ఉంచుతాడన్నమాట. ఒకదానితో ఒకటి విభిన్నమైనటువంటి ప్రజ్ఞలని, శక్తులని అన్నిటినీ కూడా ఒక తాటి మీద నడిపిస్తున్నాడు. ఈ భూమి మీద ఎన్ని రకాలైనటువంటి తత్వాలున్న మనుషులు ఉన్నారు? వీళ్లందరినీ భూమి మీద ఉండేటట్టు చూస్తున్నాడు కదా.  మానవులే కాదు జంతువులు ఉన్నాయి. విభిన్నమైనటువంటి ప్రవృత్తి కలిగినటువంటి జంతువులు ఉన్నాయి. విభిన్నమైనటువంటి గుణములు గల ఖనిజములు ఉన్నాయి. వీటన్నిటినీ ఒకచోట రాజీగా ఉంచాడు. ఇది పెద్ద circus. Circus చూడటానికి ఎందుకు వెళ్తాం? పులి నోట్లో తల పెట్టేవాడు ఉంటాడు. మామూలుగా పులి నోట్లో తల పెడితే ఎగిరిపోతుంది. ఒక సింహం మీద కోతి నిలబడుతుంది. ఎలుక పిల్లి మీద తిరుగుతున్నట్టుగా చూపిస్తారు. అన్ని కలిసి ఉంటాయి. Circus లో విభిన్న ప్రవృత్తిగల జంతువులన్ని కూడా ఒక Ring master యొక్క ఆధ్వర్యంలో చక్కగా ప్రవర్తిస్తున్నాయి. Ring master లేకపోతే ఒకదానిని ఒకటి తినేస్తాయి. ఒక దానితో ఒకటి సంధించడం రెండు రకాలుగా ఉంటుంది ఒకదానితో ఒకటి రాజీ కుదర్చడం ఒకటి. ఒకదానితో ఇంకొక దాన్ని భయపెట్టడం ఒకటి. ఎలుకలు ఎక్కువ అయిపోయినాయి అనుకోండి. అప్పుడు ఏం చేయాలి? పిల్లిని తెచ్చుకోవాలి. పిల్లి ఎలుకని ఆట కట్టిస్తుంది. పిల్లి ఆట కట్టించడానికి ఇంకొకటి ఉంటుంది. అట్లా ఒకదానికి ఒకటి సంధానం చెందటం, ఒకదానితో ఒకటి సంధింపబడి వాటి వాటి హద్దులో అవి ఉండటం. మనుషుల్లో కూడా ఎవరైనా విపరీతంగా పెరిగిపోతుంటే వాడికి కొన్ని అవాంతరాలు వచ్చి వాడికి అడ్డుపడతాయి. అందుకనే భగవంతుడు ప్రతి వాడికి కొన్ని కొన్ని హద్దులు పెడతాడు. భూమికి సముద్రం హద్దు. అట్లాగే సముద్రానికి భూమి మీదకి రాకుండా హద్దు. అది వచ్చి దీనిని మింగినా, ఇది వచ్చి దానిని మింగినా మొత్తం కధే లేదు కదా! అట్లాగే అగ్నికి హద్దు. మన ప్రవర్తన బాగుండకపోతే ఇవి హద్దులు దాటుతూ ఉంటాయి. సముద్రం హద్దులు దాటవచ్చు. అగ్ని హద్దులు దాటవచ్చు. అగ్ని హద్దులు దాటటమే మనకి సూర్యుడిలో black spots వచ్చినాయి, మనం చచ్చిపోతామని చెప్తున్నారు. అదే Ozone layer లో చిల్లులు. అందువలన ఇప్పుడు వచ్చేటటువంటి సూర్యకిరణాల కారణంగా అన్నిటిలోకి క్యాన్సర్ వ్యాధి పాకుతున్నదని ఒక theory develop అవుతోంది. సత్యం భగవంతుడికి తెలియాలి.  AIDS అనే ఒక వ్యాధి వచ్చి హద్దులు పెట్టింది ఇప్పుడు ప్రపంచంలో మనుషులకి. అడ్డగోలగా స్త్రీ పురుష సంబంధాలు పెంచుకుంటున్నటువంటి జాతికి ఈ వ్యాధి ద్వారా కొంత హద్దు పెట్టడం జరుగుతున్నది. విపరీతమైపోతుంటే  ముట్టుకుంటే అంటుకుంటుందని చెప్తున్నారు. మనవాళ్లు ఎప్పుడో అడ్డమైనవి ముట్టుకోవద్దు అని చెప్పటానికే 'అంటు' పెట్టారు. Clean గా ఉండాలి అంటే

అడ్డమైనవి ముట్టుకోకూడదు. మనుషుల్లోనే అడ్డమైన వాళ్ళని ముట్టుకోవద్దంటూ, వస్తువులను కూడా ముట్టుకోవద్దని చెప్పారు. కనపడిందల్లా ముట్టుకునే వాడికి జబ్బులు వస్తాయి. ఈ ముట్టుకోకపోవటాలు, అంటుకోకపోవడాలు మన సాంప్రదాయంలోనే! మిగతా సాంప్రదాయాలలో, దేశాలలో ఎంగిలి అనేది కూడా లేదు. ఎంగిలి తెలియనటువంటి జాతులను మనకన్నా చాలా గొప్పవాడు అని మనం భావించడం దురదృష్టం. మనం సంప్రదాయం లో మనిషిని ముట్టుకునే పరిస్థితి లేదు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం నమస్కారం ముద్ర తో ఉంటుంది అంటే వాడిని మనం తాకక్కర్లేదు, వాడు మనని తాకక్కర్లేదు. అంటే వాడి అంటు మనల్ని అంటు చేయక్కర్లేదు, మన అంటు వాడికి అంటక్కర్లేదు. మన సాంప్రదాయాలు మనం కాపాడుకోవాలి. ఉదాహరణకు ఈ కుర్చీలో కూర్చోక ముందు ఇంకొక ఆయన కూర్చున్నాడనుకో, మనలో చైతన్యం బాగా పెరిగితే ఇంతకు ముందర కూర్చున్న ఆయన తరంగాలు ఇతరములైనటువంటివి సోకినట్టుగా భావన కలుగుతుంది. పూర్వం వాళ్లు ఎవరింటికైనా వెళ్ళినా ఇత్తడి చెంబుతో తాగడానికి వాళ్ళ నీళ్ళు వాళ్ళు పట్టుకు పోతూ ఉండేవాళ్లు. ఇవన్నీ చాదస్తం కాదు అందులో చాలా విజ్ఞానం ఉన్నది. మనవాళ్లు తినడానికి విస్తరాకు వేసేవారు. అదే కంచాలలో తింటే, అంతకు ముందు కంచాలలో తిన్నవాళ్ళ తరంగాలు మంచో, చెడో మనని అంటుతుంది. అలాగే ఇంకొకరు పడుకొనే మంచాల మీద పడుకొనేవారు కాదు. ఎవరి వస్తువులు వాళ్ళ వరకు చక్కగా వాడుకుంటూ, మిగతా వాళ్ళ వస్తువుల జోలికి పోకుండా, ముట్టుకునే తత్వం తగ్గితే ఏం జరుగుతుంది? 'దేహం మీద అభిమానం పోతుంది' అని పతంజలి మహర్షి చెప్పాడు. మనకి చచ్చే దేహాభిమానం. ఇదివరకు వాళ్లు జుట్టు నెరిసిపోయినా బాధపడలేదు. ఇప్పుడు దానిమీద రకరకాల రంగులు పోస్తాం. ఏదీ మనకి సహజంగా లేకుండా అసహజంగా తయారు చేసుకుంటూ వచ్చాం. ముక్కు కాస్త వంకరగా ఉందనుకోండి డబ్బులు ఉంటే అమెరికా వెళ్లి దాన్ని ఆపరేట్ చేయించేసుకుంటాం. తలపులు వంకరగా ఉంటే కష్టంగానీ ముక్కు వంకరకి ఏమిటిట? అంత అభిమానం దేహం మీద పెరిగిపోయినది. గుండు చేయించుకోరా అంటే చాలా ఆలోచిస్తారు ఈ రోజుల్లో. ఒక్కసారి జుట్టు తీయించేస్తే, తలలో ఒకసారి ఉన్న pattern of thoughts clean అయ్యి fresh గా ఉంటుంది. మళ్ళీ fresh crop of thoughts వస్తాయన్నమాట. అందుకని పెట్టారు మనవాళ్ళు. ఇవన్నీ మనకు హద్దులు పెట్టడం కోసం జరిగింది.

శ్రీకృష్ణుడు సంధి చేయడం ఎట్లా ఉంది? పాండవులు సంధాత గా పంపిస్తారు ఆయనని. చూశాడు. కుదిరిందా, కుదిరింది. కుదరలేదా, చావు దెబ్బ కొట్టడానికి అన్ని రెడీ చేసి ఉంచాడు. అక్కడే సగం యుద్ధం/సగం ఆట ఆడేసి వస్తాడు శ్రీకృష్ణుడు. సంధాత గా ఏం చేసాడు? సంధి కుదరదు అని తెలిసింది మొదట్లోనే. ముందు విదురుడిని ఉద్ధరిస్తాడు. ఎందుకంటే అతడు చెప్పిన ధర్మం ఎవరు వినరు కానీ దశాబ్దాలుగా చెప్తూనే

ఉంటాడు. ఎందుకు అక్కడ ఉండడం? వాళ్ళ అన్నయ్య ధ్రుతరాష్ట్రుడు నీ సలహా ఏంటి? అని అడుగుతాడు చెప్తే, సరేలే! అని అ సలహా పక్కకు పెట్టేసి చేయాల్సింది చేస్తూ ఉంటాడు. అయినా విదురుడు అక్కడే ఉంటాడు. అందుకని మొట్టమొదట విదురుడ్ని సభకు పిలిపించి, అతడి ఉద్యోగం తీయించేసి, బయటకి పంపించేసి ఉద్ధరించే పద్ధతి ఒకటి చేస్తాడు. ఎందుకంటే అతడు వ్యక్తిగతంగా బాగుపడాలి, మంచివాడు కానీ ఉద్యోగ వ్యామోహంతో బతుకుతున్నాడు. అది తీసేస్తే ఒక 30 ఏళ్లకో, 40 ఏళ్లకో ఉద్ధరింపబడతాడని. కర్ణుడే అర్జునుడ్ని చంపగలవాడని కదా దుర్యోధనాదుల ధైర్యము. అదే కర్ణుడి పట్టుదల, పొగరు కూడాను. అది తగ్గిస్తాడు నాలుగు శాపాలు పెట్టించి. ఇలా చాలా చేస్తాడు. ఇది ధర్మానికి సంబంధించిన సంధి. ధర్మం గెలవాలి అంటే అన్ని రకాలుగా సంధానం చేయాలి. తన గురించి ఆలోచించుకోలేదు. తన గురించి ఏమనుకుంటారనుకోలేదు. ధర్మం కోసం ఎన్ని చేయాల్సి వచ్చింది. యుద్ధంలో కూడా 'సంధానం.' చేస్తాడు. శ్రీకృష్ణుడు యొక్క సంధానం అవతల వాళ్ళకి అవగాహన కానట్టుగా ఉంటుంది. ధర్మం తెలిసిన వాళ్ళకే అవగాహన అవుతుంది. ఆ పద్ధతిలో ఈ సంధానం చేసి సంధిమాన్ అనిపించుకున్నాడు. మహాత్ములు కూడా అట్లా సంధానం చేస్తారు. ఎంతవరకు సంధానం చేస్తారంటే వీలుపడ్డంతవరకు. వీలు పడకపోతే set చేస్తారు.

# 211 స్థిరః

స్థిరః అంటే స్థిరత్వం కలిగి ఉన్నవాడని. తాను స్థిరంగా ఉంటే తన చుట్టూ ఉన్న కార్యక్రమము అంతా నడపబడుతుంది. తాను స్థిరంగా లేకపోతే, కార్యక్రమమంతా కూడ అస్తవ్యస్తంగా అయిపోతుంది. నాయకుడు స్థిరంగా ఉంటే, నాయకుడి చుట్టూ ఉండేటువంటి చతురంగ బలాలన్నీ కూడా చక్కగా నిర్వర్తిస్తూ ఉంటారు, నాయకుడి యందున్న విశ్వాసము చేత. నాయకుడే తత్తరబిత్తర అవుతూ ఉంటే, చుట్టూ ఉండే వాళ్ళు అల్లకల్లోల మయిపోతారు. అందుకని భగవత్ తత్త్వం కేంద్రంగా ఏర్పడుతూ ఉంటుంది. కేంద్రం నుంచి పరిధికి వ్యాపనం చెంది, మళ్ళీ పరిధుల్లో కేంద్రాలు ఏర్పడుతూ ఉంటాయి. మనము ఒకటి చూసినప్పుడు అది మనకి కేంద్రం గా కనిపించినప్పటికీ, అది అంతకన్నా ఉన్నతమైన స్థితి లో ఉన్నదానికి పరిధిగా ఉంటుంది. ఒకదానికి ఒకటి కేంద్రము, మరి ఒకదానికొకటి పరిధి. ఈ విధంగా మనకి సృష్టి లో అమరిక, చైతన్యం యొక్క కార్యక్రమం అలా చక్కగా అలా జరుగుతూ ఉంటుంది. సృష్టి కార్యక్రమం, సృష్టి ప్రణాళిక, సృష్టి విచ్చు కోవడం మనం చూసినట్లైతే, ఒక కేంద్రమేర్పడి ఆ కేంద్రం ఆధారంగా కొన్ని ప్రజ్ఞలు లేక శక్తులు ఉద్భవించి, ఉద్భవించిన శక్తులు లేక ప్రజ్ఞలు మళ్ళీ కేంద్రంగా ఏర్పడుతూ ఉంటే, వాటి నుంచి ఉద్భవించినవి మళ్ళీ పరిధులుగా ఏర్పడుతూ ఉంటాయి. ఈ విధంగా నడుస్తూ ఉంటుంది. అందుకనే సృష్టిని పెద్దలు మనకి మర్రి చెట్టు తో పోల్చి చెప్పారు. మర్రిచెట్టని ఎందుకన్నారంటే, మర్రిచెట్టు విత్తనం నుంచి పెరిగి, చెట్టై, అందులో నుండి విచ్చుకున్న కొమ్మలు ఊడలుగా దిగివచ్చి, ఊడలు మళ్ళీ వేళ్ళై నేలలో దిగి, అక్కడి నుంచి ఇంకొన్ని కొమ్మలు విచ్చుకుంటాయి. విచ్చుకున్న కొమ్మలన్నీ కూడా మళ్ళీ ఊడలవుతూ ఉంటాయి. ఊడలేమో మళ్ళీ వేళ్ళవుతూ ఉంటాయి. వేళ్ళ ఆధారం వలన మరింత పెరుగుతూ ఉంటుంది. అంటే ప్రతి కొమ్మ మొదలుకి పరిధి అవుతుంది. కొమ్మకి మొదలు కేంద్రమవుతుంది. మొదలు కేంద్రం కొమ్మకి; కొమ్మ మళ్ళీ మొదలై మరి కొన్ని కొమ్మలకి కేంద్రమవుతుంది. మర్రి చెట్టు ని జాగ్రత్తగా చూస్తే మీకది కనిపిస్తుంది. అందుకనే సృష్టికినూ మర్రి చెట్టు కి ఆ విధమైన అనుసంధానం పెద్దలు మనకి చూపించియున్నారు. అందుకనే మర్రిచెట్టు క్రింద ధ్యానం చేసుకోమని చెప్పారు. మర్రిచెట్టు అతి పవిత్రమైనటువంటి చెట్టుగా మనకి ఇవ్వబడింది. భగవద్గీత లో పురుషోత్తమప్రాప్తి యోగంలో దీని గురించి చెప్పడం జరిగింది. ఈ చెట్టు మొదళ్ళు కొమ్మలై, కొమ్మలు మళ్ళీ మొదళ్ళై, మొదళ్ళు కొమ్మలై, కొమ్మలు మొదళ్ళై ఎలా అవుతుందో , అలాగే జరుగుతూ ఉంటుంది ఈ సృష్టి అంతా అని చెప్తాడు. ఇదంతా మనకి స్థిరత్వానికి సంబంధించిన కార్యక్రమముగా చెప్పారు. అంటే ఒకరి నుంచి కొంతమంది పరిధిగా వ్యక్తమైతే పరిధిగా వ్యక్తమైన వాళ్ళు మళ్ళీ కేంద్రమవుతూ ఉంటారు. మళ్ళీ వాళ్ళు కేంద్రమైతే వాళ్ళ నుంచి వ్యక్తమైన ప్రజ్ఞ మళ్ళీ పరిధిని తయారు చేసుకుంటుంది.

Center to circumference; Circumference transforming in to center and again forming circumferences ఇట్లా అసలు పరిధి ఎక్కడ ఉన్నదీ కనబడ కుండా ఉన్నంత ఉంటుందిట. అందుకని "అనేమి" అంటారు భగవంతుడిని. పరిధి కనబడదు అన్నీ కేంద్రాలే. ఎట్లాగయ్యా అన్నీ కేంద్రాలంటే, మన సృష్టికి నారయణుని బొడ్డు యందు మొదటి కేంద్రమేర్పడుతుంది అని పెద్దలు చెప్పడం జరిగింది. అది అమ్మవారు యొక్క వ్యక్త రూపం. ఈ వ్యక్తమైన దాంట్లో నుండి మరియొక కేంద్రంగా బ్రహ్మ దిగివస్తాడు. బ్రహ్మ నుంచి మరియొక లోకంగా సత్యలోకం దిగివస్తుంది. సత్యలోకం కేంద్రంగా మిగతా లోకాలన్నీ దిగివస్తాయి. మన వరకూ అవగాహన చేసుకోవాలనుకుంటే మన సూర్యుడు మన సౌర కుటుంబానికి కేంద్రం. మన సూర్యుడు అంత కన్నా పెద్ద సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాడు. అంటే సూర్యుడి కి మళ్ళీ కేంద్రం ఉంది. దాన్ని మనం 'సావిత్రి' లేదా 'సవిత్రు' అనే నామం తో ధ్యానం చేసుకుంటాం. అక్కడి నుంచి మన సూర్యుడి లోకి వెలుగు వస్తుంటే, సూర్యుడి నుంచి గ్రహ గోళాదులకి వెలుగొస్తుంటే, అందులో నుంచి పుట్టుకొచ్చిన వాళ్ళం మనం. ఒక పక్క గ్రహములు పుట్టుకొస్తుంటే, వాటి మీద జీవులు పుట్టుకొస్తున్నారు. మన వరకూ కేంద్రం భూమైతే, ఈ భూమి, ఇతర గోళాలకి కేంద్రం సూర్యుడైతే, సూర్యుడికి కేంద్రం సవిత్రు అయితే, సవిత్రు కి కేంద్రం ఆదిత్యుడైతే, ఆదిత్యుడికి కేంద్రం అంతకు పైన ఉన్న నిర్వికారమైనది, నిరాకారమైనది, నామమునకి రూపమునకి అతీతమైనటువంటి ప్రజ్ఞ గా ఉంటుంది. అంటే, సహజముగా తను ఈ కేంద్రము లేకపోయినప్పటికీ కూడా కేంద్రములు ఏర్పరుచుకుంటూ సృష్టి ని తయారు చేసుకొంటూ వస్తారు. మనం కూడా అట్లాగే చేస్తూ ఉంటాం. మనం ఏదైనా ఒక వ్యవస్థ సంస్థాపన చేయాలనుకొంటే, వ్యవస్థ కి ముందు ఒక కేంద్రం ఉంటుంది. అక్కడి నుంచి విచ్చుకుంటూ ఉంటుంది. విచ్చుకున్న చోటి నుంచి మరి కొంచెం విచ్చుకుంటూ ఉంటుంది. అంటే మనకి central office ఒకటి ఉంటే, అక్కడి నుంచి మళ్ళీ regional offices కొన్ని ఉంటాయి కదా, regional offices కేంద్రం గా మరి కొన్ని జిల్లా కేంద్రాలు ఉంటాయి. జిల్లా కేంద్రా లు ఆధారంగా కొన్ని తాలూకా కేంద్రాలు లేక మండల కేంద్రాలు ఉంటాయి. అవి ఆధారంగా పంచాయితి కేంద్రాలు. ఇట్లా మనకుంది. అంటే కేంద్రం నుంచి పరిధి వరకూ తన పై దానికి తను పరిధి తన తరువాతి దానికి తను కేంద్రం. ఇట్లా ఏర్పడి ఉంటాయి కేంద్రాలన్నీ. అందుకని ఎక్కడికక్కడ కేంద్రం కనిపిస్తుంది, ఎక్కడికక్కడ పరిధి కనిపిస్తుంది. అందుచేత కేంద్రమూ, పరిధి గా తానే వ్యాపించి ఉన్న ప్రజ్ఞ భగవంతుడని మనం గుర్తించాలి. అంటే మనకి ఈ మొత్తం శరీరం ఇట్లా నిలబడి ఉండటానికి ఒక కేంద్రం ఉన్నది. అలా ఉండగా శరీరం లో ఉండేటువంటి ఒక్కొక్క భాగానికి మళ్ళీ కేంద్రాలు ఉన్నాయి. అక్కడ ఆ కేంద్రం తప్పకుంటే, ఆ భాగం పని చేయటం మానేస్తుంది. ఆ భాగం పనిచేయటం మానేసినంత మాత్రాన మిగతా మొత్తమంతా కూడా కలిసే ఉంటుంది. ఎందుకంటే మొత్తానికి ఒక

కేంద్రం ఉంది కాబట్టి. దురదృష్టవశాత్తు ఎవరికో చెయ్యి ఊడిపోయింది, కాలు ఊడిపోయింది. అయినా ఉంటున్నారు కదా! ఎందుకు ఉంటున్నారు అంటే అసలు కేంద్రం ఉన్నంత సేపూ పరిధి లో ఇబ్బంది ఏమీ లేదు కనక. కేంద్రం కనక ఎప్పుడైతే తన నిజస్థితి కి చేరుకుంటుందో, అప్పుడు ఈ మొత్తం పరిధుల్లో ఉన్నటువంటివన్నీ కూడా పడిపోతాయి. అంటే సూర్యగ్రహం లేకపోతే గోళాలన్నీ కూడా పడిపోతాయి. అట్లాగే మనలో, నేను అనేటువంటి ఆత్మతత్వం శరీరంలో నుండి వెలువడితే, ఈ శరీరం లో ఉండే సమస్త అంగములు వేటికవి అయిపోతాయి. మన శరీరం లో ఒక కేంద్రం భగవంతునిగా ఉంది. దానినే 'నారాయణ కేంద్రం' అంటారు అది ఇక్కడ మనకి అనాహతానికి విశుద్ధికి మధ్యగా ఏర్పడింది. దానినే "The God in man" అని చెప్తారు. ఇక్కడ పని చేసేవాడు నారాయణుడు. తరువాత ఇంకొక కేంద్రం మనకి ఇక్కడ (అనాహతం) ఏర్పడుతుంది. ఆ కేంద్రం "Man in God". ఇక్కడ పని చేసేవాడు నరుడు. దానినే కృష్ణుడు, అర్జునుడు అని చెప్పకోవచ్చు, గురువు శిష్యుడు అని చెప్పకోవచ్చు. గురుశిష్య సాంప్రదాయం లో కూడా గురువు కేంద్రం గా, శిష్యుడు పరిధిగా పని జరుగుతూ ఉంటుంది. శిష్యుడు గురువవుతూ ఉంటాడు, అయ్యేసరికి ఇంకొంతమంది శిష్యులు ఈ కొత్తగా గురువైన వారి ద్వారా మళ్ళీ తయారవుతూ ఉంటారు. ఇలా పరిధి కేంద్రంగా అవుతూ ఉంటుంది, కేంద్రం పరిధిగా అవుతూ ఉంటుంది. మన మానవ శరీరం లో ఉన్న భగవత్ తత్వానికి ఒక కేంద్రం ఉన్నది. అది ఆధారంగా మానవుడు పని చేయడానికి ఒక కేంద్రమున్నది. అది ఆజ్ఞ. ఆజ్ఞ అని ఎందుకు చెప్పారంటే అక్కడి నుండి మొత్తం శరీరానికి ఆజ్ఞలు ఇవ్వబడతాయి. The orders are given from the Agna center. ఇది లేకపోతే అట్లా పడుంటాడు horizontal గా. ఎంతకాలమైనా అట్లా hopital లో కొంతమంది పడుకొని లేరూ? ఎందుకుంటున్నారంటే,వీళ్ళలో ఈ కేంద్రం లేదు. ఆజ్ఞా కేంద్రం లేకపోతే మనిషి verticle గా రావడానికి అవకాశం లేదు. ఆజ్ఞ ను పుచ్చుకొని మిగతా కేంద్రాలు పని చేస్తూ ఉంటాయి. అంటే నారాయణ కేంద్రానికి నర కేంద్రం పరిధి అయితే, నరుడు మిగతా కేంద్రాలకి మళ్ళీ కేంద్రం అవుతాడు. ఆజ్ఞ కేంద్రం గా మనకి విశుద్ధి, అనాహతం, మణిపూరకం, స్వాధిస్థానం, మూలాధారం కేంద్రాలు పనిచేస్తున్నాయి. వేటికవి కేంద్రాలు మళ్ళీ. ఈ శరీరం లో గొంతు చుట్టూ ఉండే భాగములన్నీ, ఉచ్ఛ్వాస నిశ్వాసకు సంబంధించిన లేక ప్రాణమునకు సంబంధించిన ఒక పట్టు, అమృతత్త్వం ఇవ్వగలిగిన శక్తి, అలాగే సరిగ్గా వినియోగించుకోక పోతే విషమును వెదజల్లే శక్తి, అన్నీటికి కేంద్రం గా విశుద్ధి పని చేస్తూ ఉంటుంది. అందుకని అది ఎంత శుద్ధంగా ఉంచుకుంటే అంత అమృతత్త్వస్థితి లోకి వెళ్ళటానికి అవకాశం ఉంటుంది. మన హృదయ కేంద్రము లేక అనాహత కేంద్రం ఆధారంగా, మనలో వాయువు పని చేస్తుంది. ఆకాశము, శబ్దము విశుద్ధి కేంద్రం గా మనలో పనిచేస్తున్నాయి. ఆకాశము నుంచి స్పర్శ అనే జ్ఞానము పుట్టి, అందులో నుంచి వాయువు పుట్టి, ఆ వాయువు మనలో స్పందనాన్ని

జరిపిస్తూ ఉంటుంది. ఆకాశం నుంచి వాయువు పుడితే, వాయువు కి కేంద్రం గా అనాహతం పని చేస్తూ ఉంటుంది. మనకి జరిగేటువంటి స్పందనా కార్యక్రమములు, ఉచ్వాస నిశ్వాసలు, ఊపిరితిత్తులు కొట్టుకోవటం, మంచి రక్తం చెడు రక్తంగా తయారయితే మళ్ళీ చెడు రక్తాన్ని మంచి రక్తంగా తయారుచేయటం, ఇవన్నీ కూడా అనాహతం అనే కేంద్రం లో వాయువు చేస్తున్నటువంటి పెద్ద ప్రక్రియ. స్పర్శ, వాయువు కేంద్రం గా ఉన్నటువంటి అనాహత కేంద్రం సరిగ్గా పని చేయకపోతే రకరకములైన ఊపిరితిత్తులకి సంబంధించిన జబ్బులు, గుండెపోట్లు, రక్తపు పోట్లు ఇవన్నీ వస్తాయి. మనలో అగ్నికి కేంద్రం గా మణిపూరకం పనిచేస్తుంటే, మనలో ఉన్న వేడిమి చక్కగా distribute అవుతూ ఉంటుంది. అలాగే జల తత్వానికి, పృథ్వీ తత్వానికి కేంద్రాలున్నాయి. ఇందులో పృథ్వీ తత్త్వానికి అంతకు పైన ఉన్నటువంటి జలతత్త్వం ఆధిపత్యం వహిస్తుంది. జల తత్త్వానికి అగ్ని తత్త్వం, అగ్నితత్త్వానికి వాయు తత్త్వం, వాయుతత్త్వానికి ఆకాశ తత్త్వం ఆకాశతత్త్వానికి మనోమయ తత్త్వం ఆధిపత్యం వహిస్తాయి. సృష్టి లో మనస్సు ఒకటి ఉన్నది. చిన్న లాజిక్ ఇక్కడ మనం చెప్పకోవచ్చు. బయట పదార్థమే మన శరీరం లో పదార్థముగా ఏర్పడింది. అంటే ఈ భూమికి సంబంధించినటువంటి పదార్థమే మనలో శరీరం గా ఉన్నది. అందుకనే ఇంకొక గోళం మీద ఉండే వాళ్ళు ఆ పదార్థం తో చేయబడి ఉంటారు. ఈ పదార్థం తో చేయబడిన వాళ్ళు ఆ గోళం మీద వ్యవహరించడానికి అవకాశం లేదు. చాలా మంది చాల గోళాలకి వెళ్లాం, అక్కడ ఇంకెవరు లేరని చెప్తూ ఉంటారు. కానీ మనకివ్వబడిన ఈ పదార్థమైన శరీరం తో మనం చూస్తున్న ఈ రూపాలనే చూడగలం తప్ప, శుక్రగ్రహమునకు వెళ్తే అక్కడ ఉండే జీవులను చూడగలిగే శక్తి సామర్థ్యములు ఈ శరీరానికి, ఈ శరీరానికి సంబంధించిన కన్నులకి లేదు. మనకు ఉన్న కళ్ళతో చూద్దాం అనుకుంటే చాలా చూడలేము. ఎందుకంటే సూర్యలోకం తో compare చేస్తే, అందులో ఏడో వంతు వెలుగు కలిగినటువంటిది మన భూలోకం. కాబట్టి మన కన్నుల తో మనం చూస్తున్నటువంటి రూపాలు మిగతా గోళాలలో కనిపించవు. ఎందుకంటే ఇక్కడ ఉన్నటువంటి పదార్థాలతో ఈ రూపాలు తయారు చేయబడి ఉన్నయి. ఈ భూమికి సంబంధించిన నీరుతోనే మన దేహం లో ఉండే నీరంతా కూడా సమకూర్చబడ్డది. ఈ భూమి చుట్టు ఉండేటువంటి వేడిమే మనలో కూడా వేడిమి గా పనిచేస్తుంది. ఈ భూమి చుట్టూ ఉన్నటువంటి గాలే మనలో గాలిగా పనిచేస్తుంది. ఈ భూమి చుట్టూ ఉన్నటువంటి ఆకాశాన్ని మనలో ఆకాశశరీరం గా లేక సూక్ష్మ శరీరంగా అమర్చుకుంటూ ఉంటాం. అట్లాగే ఈ భూమి చుట్టూ ఉన్న మనస్సు ఒకటి ఉన్నది. ఆ మనస్సే మనలో మనస్సుగా పనిచేస్తూ ఉంటుంది. దానినే 'ఇక్ష్వాకు' అన్నారు. మన మనస్సు మనకి ఇవ్వబడింది. నా ప్రాణం అంటాం కాని నీకివ్వబడిన ప్రాణం తప్ప నీది కాదు. అన్నీ ఇవ్వబడినవే! శరీరం మొత్తం ఇవ్వబడిందే తప్ప నీది కాదు కాబట్టి శరీరాన్ని దైవదత్తము అన్నారు. అర్జునుడు దైవదత్తము అనే శంఖాన్ని పూరిస్తాడు.

అది దేవునిచే ఇవ్వబడింది కాబట్టి. శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని పూరిస్తాడు. తననుంచి ఈ పంచభూతాలు పంచీకరణం జరిగి తన నుంచి వ్యక్తమైంది కాబట్టి ఆయన శంఖం పేరు పాంచజన్యం. ఊరికే తమాషాకి పెట్టరు పేర్లు. అన్నీ దేవుడిచ్చినవే ఈ మొత్తం లో. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశ తత్త్వం, అట్లాగే మనలో ఉండే మనోతత్త్వం కూడా. మొత్తం మనస్సు నుండి కొంత మనస్సు మనకి ఇక్కడ పని చేస్తుంది అన్నమాట. అంటే national programme మన టీ.వీ లో వచ్చినట్టు. అది మనం tune off చేసుకోవచ్చు తప్ప, మన programme కాదు. దాన్ని మనం control చేయలేము. అలా ఈ భూమి కి ఉన్నటువంటి మనస్సుని 'ఇక్ష్వాకు' అంటారు. ఈ భూమి చూట్టూ ఉన్న వెలుగు సూర్యుడి దగ్గర నుంచి వచ్చినటువంటి వెలుగు. దాన్నీ వైవస్వతుడంటారు. ఈ వైవస్వతుడనే వెలుగు కి కేంద్రం, ఆయన తండ్రి అయిన వివస్వతుడు లేక సూర్యుడు. అక్కడి నుంచి వచ్చే వెలుగు బుద్ధిగా పనిచేస్తూ ఉంటుంది. ఆ బుద్ధి వైవస్వతుడు. వైవస్వతుడు అను బుద్ధికి పుట్టిన వాడు ఇక్ష్వాకు లేక మనోతత్త్వము. ఇక్ష్వాకు దగ్గర నుంచి ఈ పంచభూతాత్మకమైన సృష్టి. ఉదాహరణకి ఈ ఊళ్ళో మనం కట్టుకున్న ఇళ్ళన్నీ మనం తీసుకున్నాం అనుకుందాం. ఎక్కడ నుంచి వచ్చినాయి దీనికి కావలసిన ఇటుక ? చుట్టు పక్కల ఉన్న మట్టే గా ఇటుక గా వచ్చింది. చుట్టు పక్కల ఉన్న రాయే గా ఇక్కడ తయారయింది. చుట్టు పక్కల ఉన్న నీళ్ళే గా ఇక్కడ మనం తెచ్చుకుని కట్టుకున్నాం. అన్నీ ఇక్కడివే పోగేస్తూ మనం రూపాలు తయారు చేసుకుంటుంన్నాం. మానవ ఆకారమైనా అంతే! జంతువు ఆకారమైన అంతే! చెట్లైనా అంతే! ఈ భూమికి సంబంధించిన సమస్తమైన ఆకారములు ఏర్పడటానికి కేంద్రంగా ఆ తత్త్వం దిగి రావడమే! ఎక్కడికక్కడ ఎక్కడికక్కడ మనం చూసుకున్నట్లైతే కేంద్రాలు ఉంటాయి. కేంద్రమేది ? పరిధి ఏది ? ఈ మొత్తం లో మన పెద్దలు చెప్పింది ఏమిటంటే 'నీలో ఉన్న భగవంతుడు అంటే అసలు కేంద్రాన్ని చూడటం'. అసలు కేంద్రం లేక నారాయణ కేంద్రాన్ని చూడటం. ఈ కేంద్రాన్ని చూసే ముందు ఆ కేంద్రమే వివిధమైన కేంద్రములుగా వ్యాప్తమై వచ్చింది కాబట్టి వాటిలో దర్శనం చేయకుండా అసలు కేంద్రాన్ని చూడటానికి అవకాశం లేదు. Electricity ని నేను చూస్తానంటే ఈ mike లేక ఆ tubelight చూపిస్తే పని అయిపోతుంది. కాని ఇక్కడి నుంచి లేదండి ఇది కేంద్రం కాదు అన్నారు. మరి ఏవిటి కేంద్రం అంటే, మా ఇంట్లో ఉన్నటి Main meter. అది కేంద్రమా అంటే, ఈ ఇంటి వరకూ కేంద్రం. కాని అది పరిధి కూడా. ఇంట్లో పెట్టినటువంటి కేంద్రం, అక్కడ స్తంభం మీదున్నటువంటి కేంద్రానికి పరిధి అవుతుంది. ఈ స్థంభం కేంద్రమా! కాదు, దీనికి కేంద్రం ఈ area అంతటికీ ఒక transformer. దానికి కేంద్రం ఏదండీ అంటే సింహాచలం దగ్గర ఉందండి అంటారు. సింహాచలం దగ్గర ఉన్న దానికి కేంద్రం ఎక్కడ ఉంది ? మాచ్ కండ్ లో ఉంది. మాచ్ కండ్ లో దాని కేంద్రం అక్కడ జలపాతం లో ఉంది. ఆ జలపాతం ఎక్కడ నుంచి వచ్చింది ? నీరు పారటం వల్ల వచ్చింది. నీరు ఎక్కడ నుంచి పారుతున్నది ? నది పుట్టుక స్థానం

నుండి. నది పుట్టుక స్థానం లో ఎట్లా ఏర్పడింది? ఆకాశం నుండి వచ్చింది. అలా ఆకాశం లోకి వెళ్ళిపోతాం. కాబట్టి ఒక్కొక్క పరిధి నుంచి మనం కేంద్రానికి వెళ్ళడం సులభం తప్ప సరాసరి కేంద్రానికి వెళ్ళిపోదామంటే అవదు. చాలా మంది మనలో భగవంతుడు ఉన్నాడు అని తెలిసినప్పటికీ ఎందుకు చూడలేరంటే, ముందు మన గా ఉన్నటువంటి భగవంతుడిని గుర్తించకపోవడం వల్ల. అందుకనే మనకి విశిష్ట అద్వైతం లో ఒక సుఖం ఉన్నది. కనపడుతున్నదంతా భగవంతుడే అని ముందు ధ్యానం చేయడం. అదీ అద్వైతమే! ఒక్కడినే అన్నిటిగాను చూస్తాం. ఇంకోటి లేదు అనేటువంటి పద్ధతి లో చూస్తాం. అదే అద్వైతము. కాబట్టి శరీరం పరిధిగా జీవుడు. జీవుడు పరిధిగా దేవుడు. మళ్ళీ సృష్టి లో ఉండేటువంటి దేవుడు సృష్టి లోకి దిగిరాని దేవుడికి పరిధి. దాన్ని 'పరబ్రహ్మతత్త్వం' అంటారు. అంటే పరబ్రహ్మతత్త్వం నుంచి సృష్టి లోకి దిగివచ్చిన దేవుడుంటే. సృష్టి లోకి దిగివచ్చిన దేవుడి నుంచి ఏర్పడిన కేంద్రముల నుంచి రకరకములుగా. రకరకములు గా విచ్చుకుంటూ ఉంటాయి. అందుకనే ఈ మొత్తం సృష్టి అంతా కూడా ఒక పెద్ద 'పద్మాలయం' అని చెప్తారు. పద్మముల ఆలయమని ఎందుకనంటే అవి అట్లా విచ్చుకుంటూ ఉంటాయి. కేంద్రం నుంచి పరిధికి విచ్చుకుంటూ ఉంటాయి. అందుకనే దాన్ని మర్రి చెట్టు అని చెప్తారు. ఇట్లా కేంద్రం గా ఏర్పడడం వల్ల పరిధిలో కార్యక్రమం జరుగుతుంది. చేసిన పనుల వల్ల మూలాధారం లో అక్కడ దెబ్బ తగిలితే ఇహ Physically he is no more able to move. పడుకుని ఉండి పని చేసుకోవడమే వాళ్ళకీ వీళ్ళకీ చెప్పి. అంటే physical activity కి కేంద్రం పడిపోయింది అన్న మాట. అట్లాగే ఆజ్ఞ లో తేడా వచ్చింది అనుకో, ఇహ వాడుండడు మొత్తం శరీరానికి కేంద్రమైన నారాయణుడుంటాడు. ఇక మిగతావి అన్నీ maintain అవుతూ ఉంటాయి కాని అసలు నరుడుండడు. నారాయణుడుంటాడు. అందుకని కేంద్రమేది పరిధి ఏది అని మనం చూసుకుంటే ఒకదానికొకటి కేంద్రము. మనం కేంద్రమనుకున్నది పరిధి అయ్యి, మళ్ళీ మరొక కేంద్రం ఏర్పడుతూ ఉంటుంది. ఇట్లా ఒకటి కేంద్రము, పరిధులు గా వేసుకుంటూ మొత్తం సృష్టిని విచ్చుకుంటూ వస్తారు. దాన్నే మనకి compas లో చూపిస్తారు. Compass masonic tools లో చాలా important tool. చిన్న పిల్లలు కూడా దాన్ని వాడుతూ ఉంటారు. ముందు compass ఒక కాలికి ఒక pencil పెట్టి, ఒక కేంద్రం లో దాని ఒక కాలు పెట్టించి, pencil కట్టిన కాలి తో చుట్టిస్తారు. చుట్టిస్తే గుండ్రంగా మనకి ఆకారం వస్తుంది. Center and circumference is formed. ఈ center లో పెట్టేది సరిగ్గా పెట్టకపోతే ఈ circle ఏర్పడుతుందా? కేంద్రం కదిలితే circle ఏర్పడదు. కేంద్రము స్థిరంగా ఉంటే circle ఏర్పడుతుంది. ఏర్పడితే, పరిధిలో పెట్టినటువంటి కాలు స్థిరం చేసి కేంద్రం లో పెట్టినటువంటి కాలు మళ్ళీ దాంతో పాటూ ఇంకొక circle తయారు చేస్తుంది. ఆ విధంగా నేర్పాలి మనం compas వాడటం. ముందు ఒక కాలు స్థిరం చేసుకుని రెండవ కాలు అటు వేశాం. ఆ వేసిన కాలు స్థిరం

చేసుకుంటేనే కదా మళ్ళీ ఈ కాలు తీసి అవతల పెడతాం. మనం నడక ఎట్లా సాగిస్తున్నాం అండీ? మన నడక సాగించేటప్పుడు ఏ కాలు కేంద్రము, ఏ కాలు పరిధి? ఒక కాలికి ఇంకొక కాలు కేంద్రం, మళ్ళీ అదే కేంద్రం ఇంకొక సారి పరిధి అవుతుంది. అది మనకి కనిపిస్తూ ఉంటుంది. ఇవి బాగా చక్కగా అవగాహన చేసుకున్నట్లైతే నిచ్చెనెక్కుతూ పైకి వెళ్ళిపోవచ్చు. అట్లా నిచ్చెన దిగుతూ కిందకి రావచ్చు. పైకి వెళ్ళడం, కిందకి రావడం రెండూ చాలా సులభంగా అవగాహన అవుతుంది. మనం కుడి కాలు ముందుకి వేస్తే దానికి basis వెనక కాలు, మళ్ళీ కుడి కాలు basis గా ఎడం కాలు వేస్తుంటాము. ఎడం కాలు basis గా కుడి కాలు వేస్తుంటాము. ఇందులో ఏది గొప్ప? అని అడిగితే రెండూ గొప్పే! ఆ విధంగా ప్రకృతి పురుషుడు ఈ సృష్టి విచ్చుకోలుగా వస్తుంటారు. ఈ విచ్చుకోలుగా వస్తున్న ప్రతిసారి కేంద్రము గా ఏర్పడినప్పుడల్లా ఆ కేంద్రము లో అక్కడ స్థిరత్వం ఇస్తాడే, అక్కడ స్థితత్వం లేకపోతే రెండో కాలు వేయలేము. ఒక కాలు వేసిన తరువాత ఆ కాలు అక్కడ స్థిరంగా నిలబడితే కదా నువ్వు రెండో కాలు వేయగలవు. కాబట్టి పరిధి గా ఏర్పడిన చోట మళ్ళీ స్థిరత్వం ఏర్పరచే తత్త్వం ఉన్నదే అదీ భగవంతుడు! ఎక్కడ ఏది స్థిరంగా ఉన్నా సరే అది మనోలోకం అవ్వవచ్చు, ఇంద్రియముల లోకం అవ్వవచ్చు, భౌతికమై లోకం అవ్వవచ్చు, అంతకు మించిన బుద్ధి లోకం అవ్వవచ్చు. ఎక్కడ స్థిరత్వం ఉన్నదో అదంతా భగవంతుని యొక్క తత్త్వము. అది ఆధారంగా మిగతా కార్యక్రమాలు నడుస్తూ ఉంటాయి. మనలో ఆ విధంగా స్థిరత్వాన్ని ఏర్పరచుకునే తత్త్వము భగవంతుడు — భగవంతుని వెలుగు గా ఉన్న జీవుడు. మనం జీవుడిగా భగవంతుని యొక్క వెలుగు అని మనకి తెలిసినప్పుడు అది ఆధారంగా మన మనస్సూ, ఇంద్రియములూ, శరీరం కదులుతూ ఉంటాయి. నేను అనేటువంటి మానవుడి లో ఉన్న దేవుడు. అది ఆధారంగా దేవుడిలో ఉన్న మానవుడు. ఆ మానవుడు ఆధారంగా మిగతా మనో, ఇంద్రియ, శరీర వ్యాపారాలు జరుగుతూ ఉంటాయి. ఈ విధంగా ప్రతీ విషయం లో కూడా స్థిరత్వాన్ని చూడగలిగిన చోటు కనిపిస్తే అది భగవంతుని యొక్క అస్థిత్వం గా గుర్తించాలి. అది భగవంతుడిని చూడటం అంటే. చపలచిత్తం కనిపిస్తే అక్కడ కొన్ని విషయాల్లో భగవంతుడు లేడని తెలుసుకోవాలి. అట్లా మనము ప్రకృతి పురుషుని యొక్క సమస్తమైన కార్యక్రమం అవగాహన చేసుకోవచ్చు.

## 212, 213 అజః, దుర్మర్షణః

అజః అంటే పుట్టని వాడు. జన్మ లేనటువంటి వాడు. పుట్టక పోవటం అంటే పుట్టాం అనేటువంటి భావన లేకపోవటమే! ఉండటం లో నుండి మరియొక మార్పు వచ్చినప్పుడు పుట్టినట్టుగా అనిపిస్తుంది. ప్రొద్దున 'మనం మేల్కాంచాం' అనేది ఒక పుట్టుక. ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాం? ఎక్కడి నుంచి మేల్కాంచాం? నేనున్నాను అనేటువంటి స్థితి లో నుండి మేల్కాంచి యున్నాం కదా! మనం లేకపోతే నిద్ర లేచేదేముంది? ఉండటం లో నుండి మేల్కాంచటం ఎటువంటిదో, పుట్టక ముందు లేమా అని ప్రశ్న వేసుకొని, కనీసం మన మేధస్సు కి అందినంత వరకు మనం ఆలోచించాలి. ఎవరినైనా నీ date of birth ఏమిటని అడిగితే, ఏదో చెప్పాడనుకుందాం. అంతకు ముందు లేడా? ఉన్నాడు. ఎక్కడ ఉన్నాడు? తల్లి పొట్టలో ఉన్నాడు. కాబట్టీ ఏది date of birth? జ్యోతిష్యశాస్త్రం ప్రకారం ఏం చెప్తారంటే, తండ్రి నుంచి తల్లి కడుపులోకి దిగి వస్తాడే దాన్ని పుట్టుక గా చెప్తారు. దాన్నే ascendent అని చెప్తారు మనకి జ్యోతిష్యం లో. జ్యోతిష్యం లో లగ్నం అంటారే, ఆ లగ్నం అనేది తల్లి కడుపు లోకి వచ్చినటువంటి సమయం. తల్లి కడుపులోకి రాక ముందు లేమా? ఉన్నాం! ఎట్లా ఉన్నామంటే, తండ్రిలో ఉన్నాం. తండ్రిలోకి ఎప్పుడు వచ్చాం? ఇంకక్కడ జ్యోతిష్యం ఇంక చాల్లే అని చెప్తుంది. బట్టలు కట్టుకోవటం, విప్పకోవటం మనం రోజూ చేస్తున్నట్లే ఈ పంచభూతాలతో తయారయినటువంటి రూపాలున్నయే ఇవి కట్టుకుంటూ ఉంటాయి, విప్పకుంటూ ఉంటాయి. కట్టుకోవటం విప్పకోవటం మాత్రమే చూస్తే, మనకి పుట్టటం చావటం కనిపిస్తుంది. కట్టుకోకముందు ఏ విధంగా మనం ఉన్నాం? నిద్ర పోతున్నప్పుడు మనం ఉన్నాం. అది మనకి తెలుస్తుంది. అందులో నుండి మేల్కాంచినప్పుడు ఒక ఆవరణ లోకి వచ్చిన వాళ్ళమయ్యాం. చైతన్యవంతులమయ్యాం. అక్కడి నుంచి బుద్ధి అనే ఆవరణ లోకి వస్తాం. అక్కడి నుంచి మనం మనస్సు అనే ఆవరణ లోకి వస్తాము. అక్కడి నుంచి ఇంద్రియముల ఆవరణ లోకి వస్తాం. అక్కడి నుంచి శరీరమనే ఆవరణ లోకి, అక్కడి నుంచి గేటు బైటికి వెళ్ళిపోతాం. ఇదే నవ ఆవరణలని చెప్తారు. ఈ ఆవరణలన్నీ మనం దాటుకుంటూ వెళ్తాం. మళ్ళీ నిద్రలోకి వెళ్ళేటప్పుడు ఈ ఆవరణలన్ని దాటుకుని లోపలకి వచ్చి మనం, మనం గా ఉంటాం. మనం మనం గా ఉండటం మనకి తెలీదు కాబట్టి మనం పుట్టాం అనుకుంటాం. పుట్టటం అంటే శరీరం లోకి రావటమే. బుడగ గా ముందు రావటం. బుడగగా రాక ముందు ఎట్లా ఉన్నావు? అగ్ని గా ఉన్నావు. పురుషుడి లో పుట్టే వేడిగా ఉంటాడు. అందుకని వాడికి వేడి పుట్టి, ఆ వేడికి స్త్రీ కారణంగా ఒక ఆకర్షణ ఏర్పడుతుంది. ఈ వేడిమి, ఆ ఆకర్షణ కారణంగా జలం అవుతుంది. అందుకని అట్లా బుడగ ఏర్పడుతుంది. మొట్టమొదట లోపల ఏర్పడేది బుడగ. అంటే లోపల అంతా గాలి, పైన చుట్టూ నీటి ఆవరణ. అది ఆధారంగా మిగతావన్నీ ఏర్పడతాయి. అంతకు ముందు

ఎట్లా ఉన్నాడయ్యా అంటే అగ్నిగా ఉన్నాడు. అగ్నిగా ఉండక ముందు ఎట్లా ఉన్నాడు? వాయువు గా ఉన్నాడు. వాయువుగా ఉండనప్పుడు ఎట్లా ఉన్నాడు? ఆకాశం గా ఉన్నాడు. అంతకు ముందు స్థితి మనస్సు. మనసు కన్నా పైన స్థితి బుద్ధి. బుద్ధి కన్నా పైన స్థితి జీవుడు. ఆకాశం లోకి వెళ్ళడం అంటె, సూక్ష్మం లోకి వెళ్ళడం. ఒక దాంట్లో ఒకటి ఇమిడి ఉంటుంది. కాబట్టి "నేను" అనే దేవుడు, నేను అనే జీవుడు గాను, నేను అనే జీవుడు బుద్ధి గానూ, బుద్ధి నుంచి మనసు లోకి, మనసు నుంచి ఆకాశాన్ని కట్టుకోవటం, ఆకాశం నుంచి వాయువుని కట్టుకోవటం, వాయువు నుంచి అగ్ని ని కట్టుకోవటం, అగ్ని నుంచి జలాన్ని కట్టుకోవడమూనూ! ఇవన్నీ చుట్టూ వేసుకున్న కోట్లన్న మాట! ఇట్లా లేనప్పుడు ఎట్లా ఉన్నాం అంటే, అసలు ఉన్నాం, అసలు ఉండటం బట్టి ఇవన్నీ దీని చుట్టూ చేరుతున్నయి. పుట్టుక లేదు వీడికి అంటె అర్థం ఎప్పుడూ ఉండేవాడు! ప్రత్యేకించి పుట్టడం ఉండదు మన ఇంట్లో ఉండే చోటు లాగ. చోటు ఎప్పుడూ ఉంటుంది కదా? విద్యుత్తు మన tube light లోకి వచ్చినప్పుడు, మనకి పుట్టినట్టు గా ఉంటుంది. అప్పుడు పుట్టిందంటామా విద్యుత్తు? ఆ tube light వరకు అది సత్యం, అంతకు ముందు ఉందా లేదా విద్యుత్తు? విద్యుత్ tube light లోకి ఎట్లా వచ్చింది? ఉండబట్టి వచ్చిందా? లేక అప్పటికప్పుడు పుట్టిందా? మనం శరీరం లోకి రావటం కూడా అటువంటిదే! ఆ tube light లోకి వచ్చింది, తరువాత ఆ wire లోంచి వచ్చింది. అక్కడి నుంచి ఆ pole లోంచి వచ్చింది. అట్లా మనం trace చేసుకుంటూ వెళ్తే, ఎప్పుడూ ఉన్నది ఇట్లా దిగొచ్చి మళ్ళీ వెళ్ళిపోతూ ఉంటుందని తెలుస్తూ ఉంటుంది. అది జీవనది అంటే! అలాగే మనం కూడా ఎప్పుడూ ఉండే వాళ్ళం ఇందులోకి దిగొస్తూ ఉంటాం వెళ్ళిపోతూ ఉంటాం. ఎట్లా దిగొస్తూన్నాం అంటే, బుద్ధి లోకి దిగుతాం. మనసు లోకి దిగుతాం. కోరికల్లోకి దిగుతాం. మనమే శరీరం అనుకునే వరకూ దిగుతాం. దిగినప్పుడు మనం దిగి వచ్చాం అని మర్చిపోవడమే మృత్యువు! మరుపే మృత్యువని చెప్పారు. గుర్తున్నప్పుడు మనం ఎప్పుడూ ఉన్నాం, మనం ఈ కక్షలన్నిటి లోకీ దిగొస్తూ ఉంటాం అని తెలుస్తుంది. ఇంట్లో లేనంత మాత్రాన మనం లేని వాళ్ళమా? ఈ శరీరం అనేటువంటి ఇంట్లో మనం లేము అనుకుంటే లేనివాళ్ళం కాదు. ఉన్నారా అంటే, Camp వెళ్ళారండి. Camp వెళ్ళడం ఏంటి, శరీరం వదిలేసి వెళ్ళడం. మళ్ళీ ఇంకో శరీరం లోకి వస్తాం. ఉన్నారా అమ్మా అంటే, లేరండి అంటాం. లేరంటే ఏమిటి? ఎక్కడా లేరనా? ఇంట్లో ప్రస్తుతానికి లేరని చెప్పటమేగా! మళ్ళీ వస్తాడు. ఈ ఇంట్లో లేనప్పడు ఎక్కడున్నాడు, ఇంకోచోట ఇంకో ఇంట్లోనో లేకపోతే విమానం లోనో రైలు లోనో ఉంటాడు, ఎదో ఓ దాంట్లో ఉంటాడు. ఇట్లా సృష్టి ఉన్నంత కాలం ఈ లోకాలన్నిటి లోను ఎక్కడో ఓ చోట వీడు ఉంటాడు. అది పెద్దలు గమనించినటువంటిది. మనం కూడా మన జీవిత వ్యాపారం లో ఒక్కోసారి ఒక్కోచోట ఉంటూ ఉంటాం. అట్లా ఉంటూ ఉండే వాళ్ళమే కనిపించినప్పుడు ఉన్నాడంటారు, కనిపించనప్పుడు లేడంటూ ఉంటారు. లేడన్న వాడు మళ్ళీ ఎట్లా

ఉన్నాడు? మనకి కనిపించే కక్ష లోకి దిగివచ్చాడు కాబట్టి ఉన్నాడంటున్నాం. ఎప్పుడు ఉండేవాడువాడికి, ఈ అవస్థితులు లేవు. అవస్థితులు మనకి. అవస్థితి ఉంటే అవస్థలెక్కువ. ఏమిటీ అవస్థితులు అంటే, మనం ఊసరవెల్లు వలె మారిపోతుంటాం. ఏవరైనా మంచి వ్యాపారం చేసే వాడిని చూస్తే, మనం కూడా వ్యాపారం చేస్తే బావుంటుందని అనిపిస్తుంది. ఇంకోళ్ళెవరో బాగా ఆధ్యాత్మిక సాధన చేస్తుంటే చూసి అట్లా అయిపోతే బావుణ్ణు అనిపిస్తుంది. ఈ అయిపోదాం అనుకోవటం అనేటువంటిది అవస్థ. ఇంట్లో ఉంటాం, ఆఫీసులో ఉంటాం, ఏదో సాంఘిక కార్యక్రమం లో ఉంటాం. ఎక్కడ ఉన్నప్పటికీ, నేను నేనుగా ఉండి, తనకి తాను తెలిసి ఉన్నటువంటి వాడు ఆవరణ లో పని చేసిన వాడు గా కనిపిస్తాడు. మనం అట్లా ఉండక మర్చిపోతాం కాబట్టి మనం పుడుతూ ఉంటాం, చచ్చిపోతూ ఉంటాం. ఒక ఆలోచన మన లో నుండి వస్తే అది ఆధారంగా మనం పని చేయాలే తప్ప, మనం ఆ ఆలోచన అయిపోకూడదు. మామూలుగా మనిషి తన లోంచి వచ్చిన ఆలోచన కి తను అమ్ముడు పోతాడు. అప్పడది మనని ముప్పు తిప్పలు పెడుతూ ఉంటుంది. ఎవరో ఏదో మనని చెడ్డన్నారు. అది తెలిసి అదే గుర్తు తెచ్చుకుని నెమరేసుకొని మళ్ళీ తలచుకుంటూ ఉంటాం. ఎందుకంటే ఆ భావన అయిపోతాం. ఏ కార్యక్రమాలు మనం చేస్తున్నా, ఆ కార్యక్రమం మనం ఉండడం బట్టి, వచ్చిన ఆలోచన ఆధారంగా దాన్ని నిర్వర్తిస్తాం తప్ప, మనం ఆ ఆలోచన కాదు. తండ్రి అనేటువంటి ఆలోచన తో కొడుకుతో ప్రవర్తిస్తాం! తమ్ముడు అనేటువంటి ఆలోచన వచ్చినప్పుడు అన్నగా ప్రవర్తిస్తాం. భార్య అన్నప్పుడు భర్త గా ప్రవర్తిస్తాం. అంటె ఇవన్నీ Thought frames తప్ప, మనం అది కాదు. వాడిలో కొడుకు అనేటువంటిది ఎక్కడ ఉన్నది? పరస్పర ప్రవర్తనకి బహిర్ ప్రపంచం లో ఉన్నటువంటి సంబంధాలవి. అవి అంత వరకే! జీవుడుగా ఉన్నవాడు ప్రస్తుతం కొడుకు గ మన వద్ద ఉన్నాడు అని గుర్తు పెట్టుకోవాలి. అందుకని మన పెద్దవాళ్ళందరు కూడా నాటక రంగం మంచి ఉదాహరణ గా ఇచ్చారు. ఎందుకంటే, వాడు కొడుకు వేషం వేసుకుని నీ దగ్గరికి వచ్చాడు తప్ప, నీ కొడుకనుకోకు అని. భార్యగా వేషం వేసుకుని వచ్చిందండి. నాటకం అయినాక భార్యంటే కొడతారు కదా! మన పరిస్థితంతా అదే! మనకి తాత్కాలికమైన సంబంధాలు ఉన్నాయి. అవి నిర్వర్తించేప్పడు మనం ఒకటి గుర్తు పెట్టుకోవాలి. మన అసలు సంబంధం ఒకటే! జీవుడుగా దేవుని యొక్క అంశలం కాబట్టి మన అందరి మధ్య ఉండేది సోదరత్వం! ఈ శాశ్వతమైనటువంటి సంబంధానికి, మనం సరదాగా ఆడుకోవటానికి బాహ్యా ప్రపంచానికి సంబంధించిన కొన్ని సంబంధాలు పెట్టుకున్నాం. అవి తాత్కాలికములు అని తెలియకపోతే, దెబ్బ తింటాం. తెలిస్తే, మనం ఎప్పుడూ ఉన్నవాళ్ళం. రంగం మీదకొచ్చినప్పుడు ఇలా ఉన్నాం, అని ఎరుక కలిగి ఉంటాం. అట్లా ఒక ఆలోచనలోకి మనం దిగటం అంటే నాటక రంగం లో ఒక particular role లోకి మనం దిగినట్టన్న మాట. దాన్ని అక్కడే వదిలేసి రావాలి, లేదంటే ఇరుక్కుపోతాం. అది గుర్తు

లేకపోతే దిగినప్పుడు పుట్టినట్టుంటుంది. లాగేసినప్పుడు చచ్చినట్టుంటుంది. చచ్చేచావు చచ్చే వరకు! ఎందుకనంటే వాడు రంగం లో వాడి ప్రస్థానం అయిపోయినా కూడా వాడింకా అక్కడ ఉందాం అనుకుంటాడు. ఇప్పుడు నాటక రంగం లో కాని, సినిమా లో కాని, ఒక dialogue ఇచ్చారు మనకి అదైపోయిన తరువాత ఇంకా వాడు అక్కడే ఉంటే జబ్బ పట్టుకుని లాగేస్తారు కదా! నాటకం లో వెనకాల నుంచి మనకి మనం పాడుతున్నట్టు వస్తూ ఉంటుంది. పాట మనది కాదు. మాట మనది కాదు. వేషం మనది కాదు. రూపం మనది కాదు. తరవాత పేరు కూడా మనది కాదు. అందుకనే ఈ జీవితమనేటువంటిది ఒక నాటకరంగం గా తీసుకుని, దాన్నుంచి మొత్తం అవగాహన చేసుకునేటువంటి చక్కటి సులువు పెద్దలు ఇచ్చేసారు. అంత సులువుగా ఋషులు చెప్పినట్టుగా ఎవ్వరూ చెప్పలేదు.

నేను ఇవన్నీ ధరించి ఉన్నాను అని తెలుసుకున్నటువంటి వాడు ధారణ అనేటువంటి స్థితి లో ఉంటాడు. యోగం లో ఆరవ మెట్టది. అలా లేని వాడు వాటిలో ఇరుక్కుపోతూ ఉంటాడు. తన నిజస్థితి మరచిపోయి హద్దులు మీరి ప్రవర్తిస్తాడు. ఇది మొత్తం నాటక రంగం. ఇందులో మనం నటించడానికి వచ్చాం అని గుర్తు ఉన్న వాడు ధన్యుడు. అప్పుడు వాడికి ఏమవుతుందంటే, ఎన్ని వేషాలు వేసినా వాడు వాడుగా ఉంటాడు. వేషం పోయినప్పుడల్లా చచ్చినట్టా? వేషం వేసినప్పుడల్లా పుట్టినట్టా? నాటకం లోఎన్ని వేషాలు వేసినా వాడు అందులో జీవిస్తున్నప్పుడు ఆ అనుభూతి వాడిది తప్ప, వాడు మాత్రం ఇవన్నీ తను అనుకోడు కదా! ఇన్నిగా వీడు కనిపించినట్టు మనకి అనిపిస్తుంది చూస్తున్నప్పుడు. వాడికీ? వాడొక్కడే ఇన్నిగా ఉన్నాడు. కాకపోతే వాడొక్కడే ఇన్నిగా పుట్టాడా అంటే పుట్టలేదు. చచ్చాడా అంటే చావలేదు. ఉన్నవాడే ఇంకా మారుతూ ఉంటాడు. మారుతున్నట్టుగా మనం అనుకున్నప్పుడు మనకి అవస్థితులున్నాయి, భగవంతుడికి అవస్థితి లేదు. అవస్థితి లేకపోవడానికి చాలా ఉదాహరణలు ఉన్నయి మనకి. ఆవిరి, నీరు. నీరు మంచుగడ్డ అయింది. అందులో ఉండే అసలు పదార్థం ఏమిటి? అది అట్లాగే ఉన్నది. స్థితి బేధం వచ్చింది తప్ప అసలు వస్తువు అట్లాగే ఉన్నది. రాయి కొండ నుంచి తెచ్చి మన ఇంటి దగ్గర అట్లాగే గోడగా పెట్టుకున్నామనుకో, రాయి రాయి గానే ఉంది అక్కడ. కాకపోతే దాన్ని అప్పుడు గోడ అంటాం. ఈ గోడ కట్టక ముందు ఈ రాయి ఉందా లేదా? గోడ పెట్టినప్పుడే పుట్టిందా? కొండలో భాగంగా ఉంది. మనం వెళ్ళిపోతాం కాని రాయి అనేది ఎప్పుడూ ఉంటుంది. మనం వెళ్ళిపోవటమంటే ఏమిటీ? శరీరం వెళ్ళి పోవటం. అలా మనం ఎప్పుడూ ఉండే వాళ్ళం, ఇట్లా మారుతూ ఉన్నాం అని తెలిసినప్పుడు చావమని తెలుస్తుంది. భగవద్గీత లో చెప్పినటువంటి మొట్టమొదటి ప్రబోధము 'ఉన్నది ఎప్పుడూ ఉంటుంది, ఎక్కడికీ పోదు. కాకపోతే రూపాలు మారుతూ ఉంటుంది.' అదే పిండి. కాసేపు ఈ బొమ్మ చేస్తారు, కాసేపు ఆ బొమ్మ చేస్తారు. కలిపేస్తే పిండై పోతుంది. మళ్ళీ బొమ్మలు వస్తూ ఉంటాయి.

ఉన్నది ఏదీ పోదు. ఈ భూమి మీద ఉన్నటువంటి పదార్థం అట్లాగే ఉంటుంది. నీరు అట్లాగే ఉంటుంది. కాకపోతే కాసేపు నీరు భూమి మీదకి రావచ్చు, కాసేపు భూమి బయటికి రావచ్చు. ఎప్పుడూ శాశ్వతం గా ఉన్నదాన్ని గమనించినటువంటి వాడు, శాశ్వత తత్త్వాన్ని గమనించినటువంటి వాడు! భగవంతుడు ఇన్నిట్లో ఉండి, అట్లాగే ఉన్నాడు. మనం పొందుతున్నటువంటి వికారములు ఆయన పొందడు. పెద్దల విషయం లో కూడా అంతే!

అన్నీ తన నుంచి పుట్టుకొచ్చినవి కాబట్టి, తనకన్నా బలమైనవి కావు కాబట్టి తనని జయించే వాళ్ళు లేరు అనేదే దుర్మర్షణుడు. అంటే జయింప శక్యము కాని వాడు. నీళ్ళల్లో జన్మించిన బుడగ నీళ్ళని జయించ గలదా? జయించలేదు కదా! ఎందుకు జయించలేదంటే, దాంట్లో నుండి పుట్టుకొచ్చింది కాబట్టి. సమస్తానికీ ఆధారభూతమైనటువంటి వాడికి వాడి నుండి పుట్టుకొచ్చిన వేటివల్లా ఇబ్బంది లేదు. వాడి శక్తి ఆధారంగా అవి ఉన్నాయి తప్ప, పుట్టినవాటి శక్తి ఆధారంగా వాడు లేడు. మనం కూడా చాలా పుట్టిస్తాం. ఆస్థులు అంతస్థులు, కుటుంబము ఇలా అన్నీ పుట్టిస్తాం. పుట్టించి వాటి మీద ఆధారపడటం మొదలుపెట్టిన వాడు దెబ్బతింటాడు. కొడుకుని పెంచి, వాడు ఎప్పుడు ఉద్యోగం చేస్తే అప్పుడు మనం ఉద్యోగం మానేసి వాడి మీద వాలిపోదాం అనుకుంటాడే, వాడు తెలిసిన వాడు కాదు. దుర్మర్షణ అనే శబ్దానికి పనికి రాడు. దుర్మర్షుణుడంటే అంటే, తన మీద ఆధారపడి ఉన్న వాటి మీద తను ఆధార పడడు. తనకేవిటి ఆధారమంటే.. తనే ఆధారం. మనం మన శరీరం మీద ఆధార పడిపోతూ ఉంటాం. శరీరం మీద ఆధార పడిన కొద్దీ, శరీరం మనని ఇంకొంచెం లొంగతీసుకుంటూ ఉంటుంది. పెద్దలు చెప్పినటువంటి మార్గం ఏమిటంటే, శరీరం వచ్చి పోయేటటువంటిది. శరీరం నువ్వు చేద్దాం అనుకునేటువంటి కార్యక్రమముల కోసం నీకు ఇచ్చారు. శరీరం పడిపోతుందేమో అని పనులు ఆపక, పడిపోతే పడిపోతుంది. పెద్దలు పడిపోతుందేమో అని పనులు ఆపుకోలేదు. కాకపోతే శరీరానికి విశ్రాంతి ఇస్తుండచ్చు. కాని మొత్తం శరీరమే జీవిత programme గా జరగరాదు. లేచిన దగ్గర నుంచీ రోగ ధ్యానం అంటే ఏ మందులు వేసుకోవాలి, ఏ doctor దగ్గరకి వెళ్ళాలి, ఏ hopital చుట్టూ తిరగాలి అనే! ఇచ్చినటువంటి బండి ఎంతసేపూ repair షాపులు చుట్టూ తిరుగుతున్నది తప్ప, ఏనాడూ ప్రయాణానానికి వాడలేదు. బండి ఎందుకు ఇచ్చాడంటె, ప్రయాణానికి వాడమనీ. కానీ బండి వచ్చిన దగ్గర నుంచీ దానిని మనం hospital చుట్టూ తిప్పటమే. అంటే work shop చుట్టూ తిప్పుతూ ఉంటాం.

ఈ తిరుగుళ్ళలో మనకి ఒక పది పన్నెండేళ్ళు జీవితం లో చేద్దాం అనుకున్నవి కూడా అట్లా పెండింగ్ ఉండిపోతాయి. అందుకని రోగం కోసం, శరీరం కోసం చూడకూడదు. వెంట వచ్చినంత సేపూ వస్తుంది, పడితే దారిలో పడిపోతుంది, ఇంకోటి వస్తుంది ఏవిటిట? అనేవాడు ఋషి. వాడు ధీరత్వం కలిగిన వాడు తప్ప శరీరం కోసం

అన్ని programmes adjust చేసుకునే వాడు తెలిసినవాడు కాదు. అందుకని మనం దుర్మర్షణులం కాదు. మనం శరీరము, ఇంద్రియాలు, మనసు చెప్పినట్టు వింటాం. అంతే తప్ప బుద్ధి చెప్పినట్టు వినం. అటు నుంచి దిగొచ్చే వాడు ఏమి చేస్తాడంటె బుద్ధిని వింటాడు.సూర్యుడి ఆధారంగా సూర్యుని కిరణాలు ఉన్నాయి. కనక సూర్యుడు చెప్పినట్టు కిరణం వినాలి. కిరణము చెప్పినట్లు సూర్యుడు వినడు. మనం చెప్పినట్టు మన వాహనం వినాలి. దాని మీద మనమే అధిష్ఠించి ఉండాలి తప్ప , మన మీద అది ఎక్కి ఉండకూడదు. గుర్రం మీద మనం ఉండాలా? మన మీద గుర్రం ఉండాలా? మన మీద గుర్రం ఉంటే ప్రయాణం లేదు. గుర్రం మీద మనం కూర్చుంటేనే ప్రయాణం. కూర్చున్న తరవాత కూడా గుర్రాన్ని నడిపించగలగాలి. నడిపించగలగాలంటే పగ్గాలు నీ చేతిలో ఉండాలి. పగ్గాలే ఇంద్రియాలు. పగ్గాలు నీ చేతిలో పెట్టుకుని, శరీరాన్ని అధిష్ఠించి, నువ్వు కూర్చుని పని చేయాలి తప్ప, దాన్ని నీమీద ఎక్కించుకుంటే ఉపయోగం లేదు. పనవ్వదు.

మనం చాలా మంది చాలా తెలివితేటలతో ఉన్నాం అనుకుంటూ, మన నుంచి పుట్టుకొచ్చిన వాటి మీద మనం settle అయిపోదామని చూస్తూంటాం. చూస్తుంటే ఏమవుతుందంటే, ఎప్పుడైనా తేడా పడితే, unsettle అయిపోతాం. ఓ పది లక్షలు పోయిందిట అంటే, వెంటనే గుండెనొప్పి వచ్చి పోయేవాళ్ళు లేరా? ఇప్పుడు పది లక్షలు ఎక్కడినుంచి వచ్చాయి? వీడుండ బట్టి వచ్చాయి కదా! వీడి నుండి పుట్టిన తెలివితేటల నుండి పుట్టుకొచ్చినాయి. మరి వీడేపోతే, ఇంకో పది లక్షలు వచ్చే అవకాశం లేదు కదా. వీడుంటే, ఇదివరకు ఉన్న పది లక్షలు మళ్ళీ ఇంకో సారి రావా? వస్తాయి.

దుర్మర్షణులు అనేటువంటి స్థితి పెద్దల యందు కనిపిస్తుంది మనకి. ధీరత్వం కలిగి ఉంటారు. మొత్తం సృష్టి లో ఎవరు ఎదిరించినాఆయనే వాటన్నింటికి మూలం కాబట్టి వాడి దగ్గరికి వెళ్ళేసరికి వాడిలోకి వెళ్ళి పోతారు. అది మనకి విష్ణు అవతార లీలలలో కనిపిస్తుంది. ఈ పధ్నాలుగు లోకాలూ నేను జయించాను అనుకున్న వారందరికీ కూడా ఆయన్ని చూడంగానే, వారి పుట్టుక స్థానం ఆయన కాబట్టి, ఆ పుట్టుక స్థానం లోకి ఆకర్షింప బడి, అంటే జీవతత్త్వం దైవతత్త్వం లోకి ఆకర్షింపబడి అక్కడ ఉత్తదేహం మిగిలి ఉంటుందన్న మాట. హిరణ్యకశిపుడి విషయంలో కాని, హిరణ్యాక్షుడి విషయంలో కాని, కంసుడి విషయంలో కాని, శిశుపాలుడి విషయంలో కాని, రావణుడి విషయంలో కాని, ఎవరి విషయంలో కానీ జరిగిందదే! తన యొక్క చూపులతో ఎదుటి వ్యక్తిని చూసినప్పుడు, భగవత్తత్వం కలిగిన వాళ్ళు వాళ్ళలో ఉన్నటువంటి జీవతత్త్వాన్ని పరిపూర్ణంగా ఆకర్షించేస్తారు. ఆకర్షించడం వల్ల వాళ్ళ జీవతత్త్వం వినా మిగతాదంతా కూడా బలహీనంగా ఉంటుంది. వరాహుడు ఆ విధంగా హిరణ్యాక్షుడ్ని చంపినట్టు భాగవతం చెప్తుంది. పధ్నాలుగు లోకాలు జయించి, ఎవరూ నన్ను జయించలేరు అని వాడు వరాహుడి దగ్గరికి వెళతాడు. ఆయన ఒక చూపు చూసేసరికి, వాడి లోపల ఉండే నీలమైనటువంటి రంగంతా కూడా ఈయన లోకి వచ్చేస్తుంది. ఇంకక్కడ మిగిలింది

ఉత్తడొల్ల. బంగారు రంగుకి ఆధారం నీలం. 'హిరణ్యవర్ణాం' అనేటువంటి అమ్మవారి రంగుకి ఆధారం నీల రూపుడైనటువంటి అయ్యవారు. ఈ నీలం with draw అయిపోతే, అక్కడ ఇంక హిరణ్యం ఉండటానికి అవకాశం లేదు. అట్లా అన్నిటికీ పుట్టుక స్థానం తానవ్వటం వలన తన నుంచి వ్యక్తం అయినటువంటిదేది కూడా తనని జయించే పరిస్థితి లేదు. ఆధ్యాత్మిక మార్గం లో ఎవడి పనులు వాడు చేసుకొనగలిగి ఉండాలి. ఎవరి మీదా ఆధారపడడు. తన పనులు తను చేసుకుంటూ ఇతరులకు సహాయం చేస్తూ ఉండాలి. అయితే ఎవరైనా సాయం చేయాలని వస్తే వాళ్ళల్లో ఉండేటువంటి ఉద్దేశాన్ని బట్టి సహాయం చేయనివ్వచ్చు. అంతమాత్రం చేత వాడు లేకపోతే వాడి కోసం వెతుక్కోకుండా, పని చేసుకోగలగాలి. ఎప్పుడూ ఇంకొకరి నుంచి ఏమి ఆశించని స్థితి లో ఉంటారు. కేవలం ఆధ్యాత్మిక సాధకుడే అట్లా ఉన్నప్పుడు ఆధ్యాత్మికతత్త్వము ఇంక ఎట్లా ఉంటుందీ? తన మీద ఆధారపడిన దానిమీద ఆధారపడని వాడే దేవుడు!

మాష్టరు గారి తో camps వెళ్ళినప్పుడు మామూలుగా మన పెట్టే, ఆయన పెట్టే మనం మోస్తాం. మోద్దాం అనే బుద్ధి మనకుంటుంది. కానీ ఎక్కడికన్నా దిగి వెళ్ళే సరికి ఆయన నా పెట్టే, ఆయన పెట్టే తీసేసుకునేవారు ముందు. తీసుకుంటే అప్పుడు నేను ఆయన చేతుల లో నుంచి తీసుకునే వాడిని. అట్లా వంద సార్లు జరిగింది మా ప్రయాణాల లో. నేను ఆయన పెట్టె మోస్తానని తెలిసిన తరువాత కూడా. మన బోటి వాళ్ళయితే వాడు తెస్తాడ్లే అని అసలు చూడనే చూడము. మాష్టరు గారు ఎప్పుడూ కూడా తన పెట్టె, నా పెట్టె కూడా అందుకోవటానికి సంసిద్ధులై ఉండేవారు. అంతకన్నా teaching ఏమి కావాలి. అంటే తనది తను మోసుకోవటమే కాక ఇతరులకు కూడా మోయటానికి సంసిద్ధత. అలా నీవు ఎప్పుడూ సంసిద్ధుడవై ఉండు. నువ్వు పని చేస్తుంటే నీతో సహకరించడానికి ఎవరైనా వస్తే, allow him to cooperate but don't depend on him mentally. Psychological layers లో వాడి మీద వాలి పోక. వాలి పోతే వాడు లేనప్పుడు నువ్వు ఇబ్బంది పడతావు. మోస్తాడు కదాని పల్లకి ఎక్కి కూర్చునే వాళ్ళు నిజమైన యోగులు కాదు. యోగం వేరు, మిగతా విషయాలన్నీ వేరు. అందుకనె శ్రీ కృష్ణుడు అన్నీ చెప్పి 'నువ్వు యోగివైతే బావుంటుంది అర్జునా' అని చెప్తాడు. శ్రీకృష్ణుడు యోగీశ్వరులకే యోగేశ్వరుడు! యోగేశ్వరుడవటం వలన తను అందరికీ ఆధారంగా నిలబడ్డాడు. Awareness కొలతబద్ద గా తీసుకుంటే, శ్రీకృష్ణుడికి ఉన్నటువంటి ప్రజ్ఞ స్థితి ఏమిటి, అర్జునుడి ప్రజ్ఞ స్థితి ఏమిటి? అర్జునుడికి ఈయన రథచోదకుడవడమేమిటీ? శ్రీకృష్ణుడు ఎవరి మీద ఆధారపడలేదు మొత్తం నూట ఇరవై ఆరు సంవత్సరాల జీవితంలో. కానీ ఎన్ని వేల మంది ఆయన మీద ఆధార పడ్డారూ?

శిష్యుడి చేత సేవ చేయించుకునే వాడు గురువు ఎప్పుడూ కాదు. శిష్యుడు అతనికున్నటువంటి శ్రద్ధా భక్తుల వలన సేవ చేయటానికి సంసిద్ధుడై ఉండవచ్చు. అది వేరే సంగతి. అంతమాత్రం చేత దానికి నువ్వు అభ్యాస పడి, ఆధారపడకూడదు.

విష్ణుతత్త్వం సాధాన పరంగా చెప్పుకుంటున్నాం కాబట్టి అంటే మనం భగవంతుని యొక్క గొప్పతనం గురించే కాకుండా సాధన పరంగా ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాం కనక, భగవంతుని ఈ తత్త్వం ఎలా మనలో బాగా పెంపొందించగలమో చూసుకోవాలి. రోజూ, లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే లోపల మన పనులలో ఎన్ని విషయాలలో ఎంత మంది మీద ఆధారపడుతున్నాము. వాళ్ళు లేకపోయినా చేసుకోగలమా, లేదా అని చూసుకోవాలి. లేదా నెమ్మదిగా అవస్థితి చెందుతాము. వాళ్ళు మన చుట్టూ లేనప్పుడు చాల అవస్థలు పడిపోతాం. కాని యోగి ఎక్కడ ఉన్నా సంసిద్ధుడై ఉంటాడు కాబట్టి, ఎవరన్నా సంసిద్ధత చూపించినప్పుడు అంగీకరిస్తాడు తప్ప, సంసిద్ధత చూపించనప్పుడు, ఏమాత్రం complaint చేయకుండా, తన పని తను చేసుకుంటూ ఉంటాడు. మన మాస్టరుగారు అట్లా చేసి చూపించారు. ఆయనతో పని చేసినప్పుడు ఉధృతంగా ఆవేశంగా చేసారు, మధ్య మధ్య లో వాళ్ళకి moods వచ్చి వెళ్ళిపోతూ ఉండే వాళ్ళు. అంత మాత్రం చేత ఆపకుండా ఆయన తన పని తను చేసుకుంటూ ఉండేవారు. మళ్ళి వస్తూ ఉండే వాళ్ళు. మళ్ళి వచ్చినప్పుడు సాధించరు. 'మరి అప్పుడు పోయావు కదా ఇప్పుడు ఎందుకు వచ్చావు' అనరు. మళ్ళీ ఇస్తారు. మనం వదిలేసినంత మాత్రాన పని ఆగేది కాదు. మనం వదలటం, పట్టుకోవటం తో సంబంధం ఆయన పెట్టుకోలేదు. మనం పట్టుకోవటానికి వచ్చినప్పుడు కూడా, సంసిద్ధుడయ్యాడు కాబట్టి అవకాశం ఇద్దాం అనుకున్నారు తప్ప, ఆధార పడేవారు కాదు. దేని మీదా ఆధార పడనటువంటి స్థితి, అది నిజమైన యోగి చూపించేటటువంటిది. అటువంటి వాళ్ళకి ఈ దుర్మర్షణ అనే పదం చాలా స్వచ్ఛమైనటువంటి పదం. అంతా జయమే! వారిని ఎవరూ జయించలేరు. ఎందుకు జయించలేరూ అంటే వారు దేనిమీదా ఆధారపడరు కనక!

పదవి లో ఉండేటటువంటి వారిని ఎట్లా జయిస్తారండీ? ఎవరైనా కొత్త ఆఫీసరు ఊరికి వస్తే, ఆయన చేత పనులు చేయించుకోవల్సిన వాళ్ళు ముందు ఏం ఆలోచిస్తారు, ఈయనకి ఏవిటి ఎక్కువ ...బలహీనతలేవిటి ఉన్నాయి అని చూస్తారు. ఆయన బలహీనతలేవో వాటిని సప్లై చేస్తూ వారి పన్లు చేయించుకుంటారు. లొంగతీసుకోరు . పదవి లో ఉందేటువంటి వారినీ అధికారం లో ఉండేటువంటి వారినీ, లొంగతీసుకోవచ్చు కదా! అదీ తెలివి. అట్లా శకుని అందరినీ లొంగతీసేసాడు. ఎవరికి ఏది బలహీనతో దాని మీద ఒక్క వేటు వేసే వాడు, పడుండే వాళ్ళంతే! ఏ బలహీనతా లేని వాడు కృష్ణుడు ఒక్కడే ఉన్నాడు. అందుకే పోటి వాళ్ళిద్దరి మధ్యే! శకుని కి ఏ బలహీనతలూ లేవు. కాకపోతే ఒకటే బలహీనత! తన మేధస్సు ని మించినటువంటి ఒక తత్త్వం ఇక్కడ ఆవరించి ఉంది కృష్ణుడి తో అని ఆయన నమ్మడంతే! దాని మీద నమ్మకం లేదు ఆయనకి. కృష్ణుడు అందరికీ ఆధారభూతుడయ్యాడు తప్ప తను ఎవరి మీదా అధారపడలేదు. తనయందే తను ఆధారపడి ఉన్నవాడు. ఈ గ్రహగోళాదులు, సౌరకుటుంబములు సమస్తమూ ఎవరి మీద ఆధారపడి ఉందో వాడు దేనిమిదా

ఆధారపడడు. శకుని అది గ్రహించలేకపోయాడు. ఈ సృష్టి అంతటికీ ఆయనే ఆధారం కాబట్టి కృష్ణుని ఎవరూ గెలిచే ప్రసక్తి లేదు. మనం కూడా అలా దుర్మర్షులమవ్వాలని మహాత్ములు మధ్యమధ్య అలా మెరిసి జీవించి చూపించారు.

## 214 శాస్త్రా

శాసించేటటువంటి వాడు. ప్రకృతి ధర్మములను పరిపూర్ణంగా అనుసరించే వారికి శాసన శక్తి వస్తుంది. అందరికీ రావు. మొత్తం ప్రకృతిలో భగవంతుడుండబట్టి ఉప్పు ఉప్పగాను, మిరపకాయ కారంగాను, పంచదార తియ్యగాను ఇలా ఉన్నాయి. అవి ధర్మాలు. పులి జింకలా ఉండదు, జింక పులి లాగ ఉండదు. ఎనిమిది ప్రకృతలలో నుండి భగవత్ తత్వం వ్యక్తమైనప్పుడు, అందులో ఉన్న ధర్మముల రూపములో భగవంతుడు ఉండి శాసిస్తూ ఉంటాడు. అందువల్లనే ఇన్ని లోకాలలోని ఇన్ని జీవులు అదే రకమైన గుణాలని వ్యక్తం చేస్తూ ఉంటారు. మరి మానవులు ఎందుకు చేయడం లేదు? మానవుడికి స్వేచ్ఛ అనే గుణం extra గా ఇచ్చారు. నీ అంతట నువ్వు ఉండు నాలాగ చూద్దాం అని. కానీ స్వేచ్ఛని బాధ్యతగా ఎరగక స్వేచ్ఛని హక్కుగా అనుకోవడంతో దెబ్బతింటాం. మనకి ఎవరన్నా స్వేచ్ఛనిస్తే ఆ స్వేచ్ఛని మనం బాధ్యతగా గుర్తించాలి. అప్పుడు మనకి సుఖం. ఇప్పుడు మనకెవరన్నా కారు ఇచ్చి నువ్వు కావలసినప్పుడు వాడుకోమన్నారనుకో. ఎందుకంటారలా? దానికి రెండు కారణాలు ఉండవచ్చు. ఒకటి మనతో పని ఉండడం వల్ల కావచ్చు. రెండు మన మీద శ్రద్ధాభక్తుల వల్ల కావచ్చు. అప్పుడు స్వేచ్ఛగా వాడుకోమంటే మనం బాధ్యతగా వాడుకుంటామా లేదా ఇచ్చారు కదాని ఇష్టం వచ్చినట్లు వాడుకుంటామా? మన అవగాహనలో తేడా ఉన్నది. ఎట్లా పడితే అలా వాడుకుంటే అది స్వేచ్ఛ కాదు. అప్పుడు స్వేచ్ఛయే బంధం అయిపోతుంది. మోక్షము బంధము. మోక్షమనుకొని ఇష్టం వచ్చినట్లు ఉంటే దాన్నుండి బంధాలు ఏర్పడిపోతాయి. స్వేచ్ఛ ఎప్పుడూ బాధ్యతతో కూడి ఉంటుంది. ఈ సమస్త సృష్టినుండి తాను వ్యక్తమైనప్పుడు వాటిలో కనిపించే గుణములన్ని తానుగా వ్యక్తమౌతాడు ఎన్నిసార్లు ఉప్పు తిన్నా ఉప్పగానే ఉంటుంది. పంచదార తియ్యగా ఉంటుంది తప్పా మరోలా ఉండదు. పులి పులి లాగానే ఉంటుంది. కానీ మనిషి విషయం లో అలా చెప్పలేము. ఎదుటి వ్యక్తితో పని ఉంటే మనం జింక అయిపోతాము. ఎదుటి వ్యక్తికి మనతో పని లేకపోకపో తే పులి అయిపోతాము. స్వేచ్ఛ అంటే బాధ్యత ఉండదనుకుంటారు. కానీ అలా ఉండదు. అంతేకాదు స్వేచ్ఛ బాధ్యతతో కూడి ఉంటే శాసించే స్థితి ఎక్కువ అవుతుంటుంది. నమ్మి మనకి పని అప్పజెప్పితే దానియందు మనము బాధ్యతాయుతంగా పనిచేస్తే మనకి ఇంకొంచము స్వేచ్ఛ ఇస్తారు. నమ్మినబంటుకి తాళంచెవులు కూడా అప్పచెప్తారుగా! అలా నమ్మకం పెరిగే కొద్దీ స్వేచ్ఛ పెరుగుతుంది. ఎప్పుడైతే బాధ్యత పడుతుంటావో శాసించే స్థితిలోనికి నీవు ఎదగవచ్చు. స్వేచ్ఛ బాధ్యతకి మరోపదం. Responsbility and Liberation. Those who are responsible are already liberated. బాధ్యతారహితంగా స్వేచ్ఛ అనుభవిద్దామనుకున్నవాళ్ళంతా బంధింప బడుతుంటారు. స్వేచ్ఛ అని ఇంద్రియాలని ఇష్టం వచ్చినట్లుగా వాడితే రోగాలు వస్తాయి. స్వేచ్ఛ అని

శరీరాన్ని ఇష్టం వచ్చినట్లు వాడితే శరీరం బంధిస్తుంది. శరీర బంధనాలు, ఇంద్రియ బంధనాలు, మనో బంధనాలు చాలా ఎక్కువ. మనకి ఇచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేయడంవల్ల వాటిని శాసించే స్థితి నుండి పతనం చెంది ఉన్నాము. శరీరాన్ని బాధ్యతాయుతంగా వాడుకుంటే అది మనకి సహకరిస్తుంది. మాస్టారికి శరీరం అలా సహకరించింది. ఆయనకి ఎంత సహకరించిందంటే ఒక వెయ్యిమంది చేసే పని ఆయన ఒక్కరూ ఒక 12 ఏళ్ళల్లో చేసినట్లుగా అయ్యింది. ఆయన అంత బాధ్యతపడ్డారు కనక అంత స్వేచ్ఛ ఇవ్వబడింది. బాధ్యత పడడం బంధం అనుకోవడం సరైన అవగాహన లేకపోవడమే! బాధ్యత పడేకొద్దీ స్వేచ్ఛ పెరుగుతుంది. శాసించే స్థితి ఎక్కువగా ఉన్నా ఆయన శాసిస్తాడేమో అని మిగతా వాళ్ళు పనిచేస్తుంటారు తప్పా, ఆయన శాసించడు. అది చాలా అత్యుత్తమమైన స్థితి. ఒక గురువు శాసిస్తాడని శిష్యులు అణకువగా ఉంటారు తప్పా గురువు శాసించడు. తండ్రి తమని కోప్పడవచ్చని భయభక్తులతో పిల్లలు పెరుగుతుంటారు తప్ప ఆయన కోప్పడడు. అలాక్కాక ఎప్పుడూ కోప్పడుతూ, కొడుతుంటే పిల్లలు  తండ్రి ఇంట్లో ఉన్నంతసేపూ ఒకలా ఉంటారు, ఆయన బయటకు వెళ్ళగానే మరోలా ఉంటారు, బయటకి ఎప్పుడు వెళతాడాని చూస్తుంటారు. శాసించే హక్కు ఉన్నది కదాని దాన్ని దుర్వినియోగం చేయరాదు . వారియందు నువ్వు బాధ్యతాయుతంగా ఉంటే వారూ బాధ్యతాయుతంగా ఉంటారు. మనబట్టే మన పిల్లలూను అని మాస్టారు చెప్పేవారు. సమస్తమునూ శాసించే తత్వము శాస్తా! దాన్ని ఆయన వాడడు కానీ అది ఉండడం వల్ల పని జరుగుతుంది. అది మనలో కూడా ఉన్నది. మన దగ్గర అణ్వాస్త్రము ఉన్నదిటా అంటే చాలు. దానిని మనం వాడనక్కరలేదు. పని జరిగిపోతుంది. లేకపోతే ప్రతివాడూ మనమీదకి వచ్చేస్తాడు. శాసించే స్థితి ఉన్నా శాసించని వాళ్ళద్వారా చాలా కార్యక్రమాలు అవుతాయి.

## 215 విశ్రుతాత్మా

విశ్రుతి చెందుతూ ఉంటాడు భగవంతుడు. విశ్రుతులు అంటే తెలిసిన వారు, జ్ఞానులు. వారి రూపం లో ఉంటాడుట. ఈ గుణాలన్నీ ఉన్నవారందరి చుట్టూ వాళ్ళ కనుసన్నల్లో మెలుగుతూ తమను తాము ఉద్ధరించుకునేటటువంటి వాళ్ళు బోలెడు మంది చేరుతూ ఉంటారు. వాళ్ళందరి ద్వారా ఈయనే పని చేస్తూ ఉంటాడు. ఎవరిని చూసినా మాస్టరు గారి స్ఫూర్తి తో లేకపోతే ఇంకో గురువుగారి స్ఫూర్తి తో పని చేస్తున్నారు అనుకోండి. ఆ గురువుగారు ఎక్కడో ఉంటారు వీళ్ళెక్కడో ఉంటారు, ఆయన స్ఫూర్తి వీరి లోంచి పని చేస్తుందంటే, ఈయన విశ్రుతి చెందినట్టా, కాదా? చెందినట్టే కదా! ఆ రోజు గురువుగారు నాకు అట్లా చెప్పారని ఈ రోజుకి కూడా చేస్తూ ఉంటారు. అంటే వ్యాపనం చెందినట్టే కదా! అట్లా విశ్రుతి చెందినటువంటి వాళ్ళ రూపం లో భగవంతుడు ఉంటాడు. గురువుగారు ఉన్నారుట ఆయన పాదాలు పట్టుకుందాం అని ఎందుకు అనిపిస్తుంది? మనకన్నా ఎక్కువ విశ్రుతి చెందిన వాళ్ళ దగ్గరికి వెళ్ళాలి అనే భావన మనకి కలుగుతుంది. వెళ్ళి, ఆయన చెప్పిన విషయాలు మన జీవితం లో ఆచరణ లో పెట్టుకుందాం. అనుకుంటాం. కనీసం భావన ఉంటుంది ఆచరణ సంగతి ఎట్లా ఉన్నా! విన్నప్పుడు మనం కూడా ఇట్లా ఉంటే బావుంటుంది, ఈయన చెప్పినట్టు వింటే చాలా చక్కగా ఉంటుంది అనుకుంటారు, మళ్ళీ మళ్ళీఎందుకు వెడుతున్నారంటే ఆ చైతన్యం యొక్క విశ్రుతి కారణం! అట్లా వెళ్ళి రోజుల తరబడి వేలాది మంది జనం ఒక మహాత్ముడి చుట్టూ పడి ఉండటం మనం గమనిస్తాం కదా! ఎందుకు? శాసించక పోవటమే కారణం! ఎవరూ ఆయన్ని జయించకపోవటమే కారణం! అంటే ఇతరుల చేత జయింపబడని తత్త్వం కలిగి ఉండడం. ఇంత మంది రూపం లో ఉన్న భగవంతుడు, మహాత్ములు రూపం లో మనకి అవతరణ చెంది కనిపిస్తూ ఉంటాడు. భగవంతుని సమస్తమైనటువంటి వ్యాపనమే మొత్తం సృష్టి. అందరిలో నిండి ఉన్నాడు. అందరి గా ఉన్నాడు. అందరినీ ఆకర్షిస్తూ ఉంటాడు. ఆకర్షించే వాళ్ళుగా మళ్ళీ కొన్ని చోట్ల అక్కడా అక్కడా పుడతాడు. వాళ్ళనే మహాత్ములు, గురువులూనూ! మనము వారి వద్దకు చేరి, వారి మార్గం లో నడవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాం. విశ్రుతి మనలో కూడా ఎట్లా జరుగుతుంది అంటే అంతకు ముందు చెప్పిన రెండు నామాలు/పదాలు మనం సాధన చేసుకుంటే! దుర్మర్షణుడు అంటే, దేనిచేతా జయింపబడక పోవటం. దేనిమీదా ఆధారపడకుండా తాను సమస్తానికీ అధారపడేటువంటి ఒక సాధన. అందులోంచి వస్తున్నటువంటి స్వేచ్ఛని బాధ్యత గా భావనచేసుకుంటూ వెళ్ళడం రెండవ సాధన. అలామనం వెళ్తూ ఉంటే మనకి జరిగేది విశ్రుతి! మనం విశ్రుతాత్మ అవుతాము. వీరిలో చైతన్యం యొక్క వ్యాపనం ఎక్కువ అవుతూ ఉంటుంది. విశ్రుతి చెందుతూ ఉంటుంది. ఎక్కడో ఉన్నా తెలుసుకుని, విని, ఆచరించి, బాగుపడదాం అనే పద్ధతి లోకి వచ్చేస్తూ

ఉంటారు. చూస్తే ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది. వీరి రహస్యం ఏమిటి అంటే వీళ్ళ లో నుండి వాడు విచ్చుకుంటున్నాడన్న మాట. వీళ్ళు వాడియందు ఉంటూ ఉంటారు. మహాత్ములందరూ కూడా తాము చెయ్యటం వల్ల కార్యాలు జరుగుతున్నాయి అనుకోరు. తాము భగవంతుని యందు నిలబడటం వల్ల, తమ నుంచి భగవంతుడు వ్యక్తం అవుతున్నాడనుకుంటారు. భగవంతుడు విశ్రుతి చెందుతున్నాడు, తనని వాహిక గా చేసుకుని అని అనుకుంటారు. వారూ భాగవతోత్తములు! అందుకని ఎప్పుడైతే అట్లా పరిపూర్ణంగా భగవంతుని యందు నిలబడి ఉంటాడో, సృష్టి అంతా కూడా ఆయనే వ్యాపన చెంది ఉన్నాడు కాబట్టి, ఈ విధమైనటువంటి భావన కలిగిన వారి ద్వారా మొత్తం మళ్ళీ వ్యాపనం చెంది అందరికీ మార్గదర్శకత్వాన్ని వహిస్తాడు. అందుకని పరిపూర్ణమైనటటువంటి జ్ఞానులు తమలోంచి పనిచేసే వాడు భగవంతుడు అని గుర్తుఎరిగి ఉంటారు. ఆ జ్ఞానం పరిపూర్ణత లేని చోట అతను చేస్తున్నట్టుగా భావన చేసుకుంటూ ఉంటాడు. దానికి చాలా చిన్న పరిధి ఉంటుంది. అపరిమితంగా ఉండదు.

## 216 సురారిహా

మనం విశ్రుతి చెందుతూ ఉంటే మనలో ఉండే అసురులందరూ కూడా దమింపబడతారు. సురారిహా అంటే సురులకు అరి అంటే శత్రువులను హ అంటే సంహరించినటువంటి వాడు. హాకారం అంటే హరింపబడటం. మనలో ఎప్పుడైతే చైతన్యం బాగా విశ్రుతి చెందుతూ ఉంటుందో రాక్షసత్వం అనేటువంటిది నశిస్తుంది లేక దమిస్తుంది లేక మరణిస్తుంది. అదీ సురారిహా!

విష్ణుసహస్రనామాల్లో మనకీ నామాల యొక్క గొలుసు ప్రతి నాలుగు నామాలకి ఒక సాధన పరంగా కూడా కనిపిస్తుంది. ఒకదానికొకటి మనం చూసుకున్నట్లైతే చక్కగా link up అయిపోతుంది. మనలో రాక్షస సంహారము జరిగి దైవత్వము నిండి, దేవుని కార్యక్రమములు మన నుంచి వ్యక్తం అవుతూ ఉంటాయి. ఆ అనుభూతి మనది, కార్యక్రమం ఆయనది. అట్లా జరుగుతుంది. అడ్డంకులు ఉండవు. ఎందుకంటే రాక్షసులందరూ కూడా సంహరింపబడ్డారు. ఎక్కడున్నారు రాక్షసులంటే మన లోపలే! లోపల రాక్షసులు చావటమే! లోపల రాక్షసులే మనకి అడ్డుపడుతూ ఉంటారు మనం చేసే పనులకి. అంటె మన లోపల దేవదానవ యుద్ధం ఒకటి జరుగుతుంటుంది. వీళ్ళందరూ మనం విశ్రుతి చెందిన కొద్దీ దారిచ్చేస్తారు. మనం ప్రకృతి ధర్మాలకి విరుద్ధం గా పని చేస్తున్నప్పుడు రాక్షసులు లోపల విజృంభిస్తారు. ఎందుకంటే వాళ్ళు సృష్టి ధర్మాన్ని రక్షిస్తుంటారు. వాళ్ళ పేరసలు రక్షస్సులు! బ్రహ్మ ని చంపడానికి కొంతమంది తయారైతే, బ్రహ్మని చంపకుండా ఆపిన వాళ్ళని రాక్షసులన్నారు. మనం చేసే పనులన్నీ కూడా మనని మనం చంపుకునే పన్లే! అప్పుడు ఏం చేస్తారంటే కొన్ని బాధల రూపం లో హద్దులు పెడుతూ ఆ పనులు చేయకుండా మనని ఆపుతూ ఉంటారు. సంపూర్ణమైనటువంటి చైతన్యం వికాసమై శరీరం నుంచి, ఇంద్రియాల నుంచి మనసు నుంచి, అది వ్యక్తమై అందరికీ ప్రశాంతత కలిగిస్తూ, తాను ప్రశాంతం గా ఉన్నవాడి జోలికి రాక్షసులు వెళ్ళవలసిన అవసరమే లేదు. వారంతా సురారిహులు. అటువంటి వారిలోని రాక్షసులు దమింపబడడంతో వారి నుండి పరిపూర్ణమైన ఆత్మతత్వం వెదజల్లబడుతుంది.

## 217, 218, 219 గురుః, గురుతమః, ధామః

గురు, గురుతముడు, ధామ అంటే ధాముడు- ఈ మూడు నామాలూ కలిపి ఒక్కసారిగా మనం అవగాహన చేసుకుందాము. గురువు, గురువుకి గురువు, ఆ తరువాత మార్గము. వెలుగుదారిని ధామం అంటారు. గురువు, గురువుకి గురువు, వెలుగుదారి. ఈ మూడు నామాలు భగవంతుని నామాలు. గురువు అంటే చాలా విశేషమైన అర్థం వుంది. భగవంతుడు తానే గురువుగా దిగివచ్చి, తననుంచి వచ్చిన జీవులను తానే ఉద్ధరించుకుంటూ వుంటాడు. అందులో కార్యక్రమంగా గురువుగారు దిగిరావడం ఒకటి వుంటుంది. అంతేకాక ప్రతీవాడిలోనూ, వాడిలో గురువుగా వుండి, వాణ్ని ఉద్ధరించుకోవడం వుంటుంది. గురువులకి గురువులు వుంటారు. ఆ గురువులకి గురువులు వుంటారు. అలా ఒక నిచ్చెన, వెలుగుదారి ఒకటి ఉన్నది. ఇది ఈ మూడు నామాలకి సంబంధించిన విషయం. సంస్కృతంలో 'గ' అనే శబ్దానికి గమనము కలిగినది, వ్యాపనము కలిగినది అని అర్థం. అందుకని, గణేశుడు అంటాం. గ- 'గం గణపతయే నమః'. వ్యాపనం చెందే శక్తి వున్నశబ్దాన్ని 'గం' అన్నారు. గురు శబ్దంలో 'గ' శబ్దం వుంది. వ్యాపనమే కాకుండా 'ఉ' అనే శబ్దం వుంది. సృష్టి, స్థితి, లయములలో స్థితికారక అనే శబ్దాన్ని 'ఉ' అంటారు. ఓంకారంలో 'అ' 'ఉ' 'మ' అనే మూడు శబ్దాలు వున్నాయి. ఈ మూడు శబ్దాలలో 'అ' 'ఉ' 'మ' లలో 'అ' ని శివుడిగాను, 'ఉ' ని విష్ణువు గాను, 'మ' ని బ్రహ్మగాను, అంటే 'మ' అనే శబ్దం సృష్టి కార్యక్రమానికి, 'ఉ' అనే శబ్దం స్థితి కార్యక్రమానికి, 'అ' అనే శబ్దం సృష్టి ఉద్భవానికీ, లయానికీ రెండిటికీ. అందుకే శివుణ్ని 'లోహితాక్షుడు' అంటారు, ఎర్రటి కన్నులు కలిగినవాడు అని. అది సృష్టి మొదలు లోనూ ఎరుపుగా వస్తుంది, అది సృష్టి లయంలోకి వెళ్ళిపోయినప్పుడూ ఎరుపుగా వస్తుంది. అది మనకి తెలియాలంటే సూర్యోదయం చూస్తే పొద్దున్న ఉదయించే ముందు ఎరుపుదనం వచ్చి తరువాత ఉదయం జరుగుతుంది. ఆ తరువాత మధ్యాహ్నానికి విష్ణువు తత్వం ఏర్పడుతుంది. మళ్ళీ సాయంకాలానికి అస్తమించే సమయంలో కూడా ఎరుపుదనం వస్తుంది. అందుకే ఉదయాస్తమయాల్లో అన్నిట్లో కూడా శివుని యొక్క తత్త్వం పనిచేస్తూ వుంటుంది. పెరుగుదల అంతా బ్రహ్మ క్రింద వుంటుంది. స్థితి అంతా కూడా విష్ణు తత్త్వం క్రింద వుంటుంది. అందుకని ఈ 'గ' కి కొమ్ము ఇచ్చి 'ఉ' కారం కలిసినప్పుడు 'గు'అవుతుంది. గమనించే, వ్యాపనం చెందే శక్తి ఏదైతే వుందో, ఈ మొత్తం సృష్టిని అంతా ఆవరించే ప్రజ్ఞ ఏదైతే వుందో, అది స్థితి కారకం అయిన ప్రజ్ఞతో అనుసంధానం చెందుతుంది. 'ర' అనే శబ్దం మనకి రక్షణకు సంబంధించిన శబ్దం. మనకి రక్షణ కలిగించేవాడు కాబట్టి రాముడయ్యాడు. 'రం' అనే శబ్దాన్ని అగ్నిబీజంగా చెప్తారు. అగ్నిబీజం అంటే మిగతా మలినాలన్నిటినీ దహించివేసి, మనని తేజోవంతులుగా వుంచడం. మనని తేజోవంతులుగా వుంచడం కన్నా రక్షించడం

ఇంకొకటి లేదు. మిగత రక్షణలు అన్నీ కూడా చిల్లర రక్షణలు. ఎవరైనా, ఎప్పుడైనా, ఎవరికైనా నిజంగా రక్షణ ఇచ్చారుట అంటే వాళ్ళని తేజోవంతులుగా తీర్చిదిద్దుకోవడానికి కావలసిన స్ఫూర్తి, ప్రచోదనం కలిగించడమే! వారు నిజమైన రక్షకులు తప్ప మనకి రోజూ వచ్చిపోతుండే ఈతి బాధలనుండి రక్షించడం కాదు. ఈతి బాధల్లో రక్షణ చేసేవాడు కాదు గురువు. ఈతి బాధలకి అతీతమైన తనయొక్క స్వస్వరూప సంధానం చేసుకుని తద్వారా ఈ జీవితంలో వచ్చే సమస్యలన్నిటినీ కూడా తనకు తానే ఎదుర్కొని చక్కగా ప్రశాంతతతో నిర్వహించే శక్తిసామర్థ్యాలు ఇచ్చేవాడు గురువు. గురువు అంటే రకాలు వున్నాయి గురువులలో. అన్నీ నేను చేసిపెడతాను అనేది వీలుపడదు. ప్రతీ వ్యక్తికీ తనకి సంబంధించిన కర్మ ఒకటి నడుస్తూ వుంటుంది. అది సంచితం అంటారు. పోగేసుకుని, సంచీలో వేసుకుని తెచ్చుకున్నాడన్నమాట జన్మజన్మలకీ. మన వెనుక ఎప్పుడూ మన సంచీ వుంటుంది. సంచితం మనని పీడిస్తున్నప్పుడు, మనం బాధలు పడుతున్నప్పుడు, ఈ బాధలలో జీవించకుండా దానికి అతీతమైన, దివ్యమైన మన అసలు జీవితం మనం జీవించేలా మనల్ని ఉద్ధరించడానికి సరైన మార్గాన్ని ఇచ్చేవాడు గురువు. అలా కాకపోతే ఏం జరుగుతుంది అంటే మాటిమాటికీ మనం బురద పూసుకు వచ్చి గురువుని తుడిచిపెట్టమంటూ వుంటాం. మనకి అర్థం కాదుకదా! ప్రతీసారీ గురువు బురద కడుగుతూ వుంటే, శిష్యుడు మళ్ళీ బురద పూసుకుంటూనే ఉంటాడు. అందుకని బురద పూసుకోకపోవడం అనే బుద్ధి/తెలివి శిష్యుడికి ఇవ్వడం గురువు యొక్క కర్తవ్యంగానీ, బురద పూసుకున్నప్పుడల్లా కడుగుతూ వుండడం అనేది గురుతత్త్వం కాదు. అజ్ఞానం వల్ల ఈరోజుల్లో గురుతత్వాన్ని చాలా దురవగాహన చేసుకుంటున్నారు. పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారు. అంటే గురువుగారి పాదాలని పట్టేసుకుంటే మన సమస్త దోషాలన్నీ కూడా ఆయన పుచ్చుకుని, మనకి ఎటువంటి కష్టాలూ రాకుండా, మనం అనుకున్నవన్నీ అనుకున్నట్టు జరిగిపోయేవిగా చూసేవాడు గురువని అనుకుంటూ వుంటారు. కాదు. అలా వుండదు గురుతత్త్వం. అలావుంటే మనం ఎప్పటికీ బాగుపడం. మనం ఎప్పటికీ రక్షింపబడం. అంటే నేను దొంగతనం చేసాను, నన్ను రక్షించండి. నేను దొంగతనం చేస్తూనే వుంటాను, నన్ను రక్షిస్తూనే వుండండి. నేను ఇతరులని హింసిస్తూ వుంటాను, అయినా మీ పాదాలు పట్టుకున్నాను కాబట్టి మీరు రక్షిస్తూ వుండండి. ఎలా రక్షిస్తాడంటే, దొంగతనం చెయ్యకుండా వుండే బుద్ధి నీలో కలిగేలా రక్షిస్తాడు. ఇతరులని హింసించే బుద్ధి నీలో నిర్మూలనం అయ్యేట్టుగా నిన్ను రక్షిస్తాడు. అంతే తప్ప, నేను వెధవపనులు చేసి వస్తూ వుంటాను, మీ పాదాలమీద పడుతూ వుంటాను, మీరు నేను చేసే పనులకు వచ్చే ఫలితాలన్నీ నాకు బాధ కలిగించకుండా చూడండి అని గురువు వద్దకు వెళ్ళినవాడు తెలివితక్కువ వాడు. అలా చేస్తాను అనేవాడు అంతకన్నా తెలివితక్కువ వాడు. వాడికంటే ఎక్కువ తెలివితక్కువ వాడు కాబట్టి, ''తెలివితక్కువతనం''లో గురువు అవ్వొచ్చు తప్ప,

ఇంకో పద్ధతుల్లో గురువు అవ్వడానికి అవకాశం లేదు. అందుకని రక్షణ చేసేవాడు గురువు. ఎలా రక్షిస్తాడయ్యా అంటే సరైన అవగాహన ఇచ్చి రక్షిస్తాడు. సరైన స్థితిని, సరైన స్థిరత్వాన్ని ఇచ్చి రక్షిస్తాడు. ఒకావిడ షిరిడీ సాయిబాబా భక్తురాలు. ఆవిడ మరణించింది. మరణిస్తే వాళ్ళ అబ్బాయి గోల పెట్టాడు. నీ భక్తురాలు కదా ఎలా మరణిస్తుంది? అని. నువ్వు బతికించలేవా? నీకు బతికించే శక్తి ఉందా? లేదా? అంటే, అప్పుడు షిరిడీ సాయిబాబా అంటాడు, /వచ్చిన వాళ్ళు వెళ్ళవలసిందే కదా? ఎవరు ఎలా వెళ్తారు అనేది వాళ్ళ కర్మని అనుసరించే వుంటుంది. నువ్వు నన్ను బతికించమని అడుగుతున్నావు, ఈ ఊళ్ళో కానీ, ఈ దేశంలో గానీ ఏ ఇంట్లో చావు లేదో, అటువంటి ఇల్లు చూపించినట్లయితే నీ ఇంట్లో కూడా నేను చావు లేకుండా చేస్తాను.' అంటే గురువు ప్రకృతి ధర్మాలకు వ్యతిరేకంగా పనిచెయ్యడు. అలా పనిచేస్తే గురువు అవ్వడు, ఇంకొకటి అవుతాడు. ప్రకృతి ధర్మాలకి వ్యతిరేకంగా తన శక్తి సామర్థ్యాలన్నీ పెట్టి పనిచేసినవారు రావణాసురుడు, హిరణ్యాక్ష-హిరణ్యకశిపులు అలా వుంటారు. ప్రకృతి ధర్మాలని అనుసరించి పనిచేసే గురువు, ఇతరులను కూడా ప్రకృతి ధర్మాలను అనుసరించేట్టుగా చేస్తాడు. ఈ సృష్టిలో జరుగుతున్నదానిలో, స్థిరమైన దానిలో మనల్ని నిలబెడతాడు, అస్థిరమైన విషయములయందు మనం బాధపడుతూ వుంటే అక్కడ్నుంచి మనల్ని ఉద్ధరిస్తాడు. మనకి అప్పటికప్పుడు ఆ విధంగా స్థిరం కలిగిస్తాడు. 'వ్యాపారం చేస్తూ వుంటాను, నాకు ఎప్పుడూ లాభమే రావాలి' అని అనుకుని మనం వ్యాపారం చేసినా, నష్టంగా వస్తుంది. ఎందుకంటే వ్యాపారం అంటే రెండు అవకాశాలూ వున్నాయి. 'నాకు ఎప్పుడూ వ్యాపారంలో లాభమే రావాలి' అని కోరుకున్నాడనుకోండి ఒక శిష్యుడు గురువు దగ్గర, ఎప్పుడూ వ్యాపారంలో లాభాలు రావడం అనేది వుండదు. అప్పుడప్పుడు నష్టాలు వస్తాయి. ఎప్పుడూ పగలే వుండదు, రాత్రి వస్తుంది అన్నట్లుగా. ఎప్పుడూ మెలుకువగా వుండము, అప్పుడప్పుడు నిద్రపోతూవుంటాము అన్నట్టుగా. ఎప్పుడూ సృష్టిలో ధర్మాలు నాకు అంటకూడదు అనుకునేవాడు బాగుపడలేదు, హిరణ్యాక్షుడు-హిరణ్యకశిపుడు అలా చెప్తారు. హిరణ్యకశిపుడు 'నాకు చావు వుండకూడదు' అని అడిగాడు కదా! రకరకాలుగా అడిగాడు, కుదరలేదు. రావణాసురుడు మరొకరకంగా అడిగాడు, కుదరలేదు. కర్ణుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు ఎవరో ఒక్కొక్కరూ ఒకోరకంగా తప్పించుకుందామని చూసారు, ధర్మాన్ని అనుసరించడం ద్వారా రక్షింపబడటమే తప్ప, ధర్మాన్ని అనుసరించకుండా తనని రక్షించేయమని ఏ శిష్యుడైనా అడిగితే గురువు రక్షించేది వుండదు. ప్రకృతి ధర్మాలకి తలవంచి అంటే శిరసావహించి ప్రకృతి ధర్మాల్ని తను చూస్తూ అందులో తను జీవిస్తూ ప్రశాంతంగా ఉండడం లోకి శిష్యుని ఉద్ధరించడం గురువు యొక్క అసలైన రక్షణ. అది అవగాహన చేసుకున్నట్టయితే మనకి నిరాశ వుండదు గురువుయందు. లేకపోతే మనం చేసే పనులకి మనకి వచ్చే ఫలితాలకి ఈ గురువుగారు ఏమీ లాభంలేదని అనిపిస్తుంది. గురువుగారితో కూడా

లాభనష్టాలు పెట్టుకుంటే అదికూడా వ్యాపారమే అయిపోతుంది. మన ప్రపంచం అంతా కూడా లాభనష్టాలతో నడుస్తోంది. వీడితో మనకి పని ఉందా? లాభం ఉందా లేదా? వుంటే వుందాం లేకపోతే లేదు. ఇది లాభానష్టాలకి అతీతంగా సర్వకాల సర్వావస్థలయందూ ప్రశాంతంగా ఉండడానికి ఇవ్వబడే మార్గం కాబట్టి, గురువు ఆ విధంగా రక్షిస్తాడు తప్ప, నీకు కష్టాలు రావు, ఎప్పుడూ సుఖాలే వుంటాయి అని ఏ గురువూ చెప్పడు. నీకు నష్టాలు రావు, ఎప్పుడూ లాభాలే వుంటాయి అని ఏ గురువూ చెప్పడు. నీకు అసౌకర్యం వుండదు, ఎప్పుడూ సౌకర్యమే వుంటుంది అని ఏ గురువూ చెప్పడు. అలా చెప్తే గురువు కాదు, తెలిసినవాడు కాదు. జీవితం అనే దాంట్లో లాభ-నష్టాలు, సుఖ-దుఃఖాలు, సౌకర్య-అసౌకర్యాలు, జయ-అపజయాలు వుంటాయి నాయనా! అవి వచ్చినప్పుడు ఒకదానికి పొంగడం అఖ్ఖర్లేదు, రెండవదానికి క్రుంగడం అఖ్ఖర్లేదు. 'పొంగు-క్రుంగు లేని ప్రశాంతమైన, స్థిరమైన చైతన్యమునందు నువ్వు నిలబడడానికి కావలసిన మార్గం నా దగ్గర వుంది. అది నీకు నేను ఇస్తాను' అని చెప్పేవాడు గురువు. కాబట్టి గురు శబ్దంలో 'ర' కారం రక్షణకి సంబంధించినది. 'ర' కారానికి కూడా మళ్ళీ 'ఉ' కారం వుంది అంటే దానియందు కూడా స్థితికారకుడు. రక్షణయందు స్థిరత్వాన్ని ఇస్తాడు. 'నన్ను నమ్ముకున్నవాడు ఎవ్వడూ వినాశనం చెందడు' అని చెప్తాడు శ్రీకృష్ణుడు. చెందేరా? చెందలేదా? ఒకవిధంగా చూస్తే చెందేరు, ఒకవిధంగా చూస్తే చెందలేదు. అంటే మనస్సు, ఇంద్రియములూ, శరీరంగా మనల్ని మనం భావన చేసుకుంటే నాశనం అయ్యారు. కానీ, తనని తాను జీవాత్మగా భావనచేసుకునే స్థితిలోకి శ్రీకృష్ణుడి చేత ఉద్ధరింపబడినవారు శాశ్వతులై నిలిచిపోయారు. కాబట్టి గురువుని నమ్ముకున్న శిష్యుడు నాశనం చెందడు అనే పదానికి అర్థం ఏమిటంటే తనయొక్క అశాశ్వతమైన స్థితి నుండి శాశ్వతమైన స్థితిలోకి గురువు ఆధారంగా ఉద్ధరింపబడటం వుంటుంది. 'నేను' అనే తత్వం మనలో శాశ్వతంగా వుంటుంది. దాని వెలుగు ఆధారంగా మనస్సు, ఇంద్రియములూ, శరీరం పనిచేస్తూ వుంటాయి. మనస్సు, ఇంద్రియములూ, శరీరం అశాశ్వతములు. నేను అనే తత్వం శాశ్వతము. దానియొక్క వెలుగు శాశ్వతము. మనలోశాశ్వతమైనది, నేను వున్నాను అని అనుకోవడం, దానికి వుండే వెలుగు. ఆ వెలుగు ఆధారంగా పనిచేసేవన్నీ పడిపోతాయి అదిమాత్రం అలాగే వుంటుంది. ఇంతవరకూ అంటే ఇందులోకి ఉద్ధరింపబడేవాళ్ళు అంటే నేను అనే తత్త్వం యొక్క వెలుగులోకి ఉద్ధరింపబడేవారు ఇక మృతి చెందరు. మనసులో బ్రతికేవాళ్ళు మృతి చెందుతారు. ఇంద్రియములు, కోరికలు, భావావేశములో బ్రతికేవాళ్ళు మృతి చెందుతారు. శరీరమే తాము అనుకునే వాళ్ళు మృతి చెందుతారు. ఈ రెండిటిలో కూడా మనం ఉన్నాము. నేనుగా వున్నాను, నా బుద్ధిగా వున్నాను, నా మనసుగా అంటే నా భావములుగా ఉన్నాను, నా కోరికలుగా వున్నాను, అవి తీర్చుకోవడానికి ఇంద్రియములుగా పనిచేస్తూ వుంటాను. నా శరీరముగా కూడా

నేనే వున్నాను. ఒకే నేను ఇన్ని రకములుగా వ్యాప్తి చెంది వుంటుంది. ఆ వ్యాప్తి చెందడమే 'గం' అనే శబ్దం. ఆకాశంలో 'ఖం' అనే శబ్దం రావడంతో సృష్టి మొదలయ్యింది అని వేదంలో చెప్తారు. 'ఖ' అనేది పరుషము. 'గ' అనేది సరళము. సరళం అనే శబ్దం ద్వారా వ్యాపనం జరుగుతుంది. మనం అన్నిటియందు వ్యాపించి వున్నాం. 'నేను' అనే దేవుని దగ్గరనుంచీ 'నేను' అనే శరీరం వరకూ సమస్తమూ వ్యాపనం చెందివున్న స్థితి. అందులో అంటే మనలో వున్న కొంతభాగము శాశ్వతమైనది. కొంతభాగము అశాశ్వతమైనది. అశాశ్వతమైనదాన్ని పట్టుకుని 'అది పోయింది, వాడు పోయాడు' అని మనం కూర్చున్నామనుకోండి, పోనివాడి/బ్రతికున్నవాడి గురించి ఆలోచించాలి తప్ప, పోయేవాడి గురించి అలోచించి ఉపయోగము ఏముంది? ఉదాహరణకి ఎవరైనా ఒక స్త్రీకి తన భర్త వెళ్లిపోయాడనుకోండి, వెళ్లిపోయాడంటే ఎవరు వెళ్లిపోయాడు? పోనీ వెళ్లిపోకుండా ఆ శరీరం అక్కడ ఉంచితే వాడు ఉండిపోయినట్టేనా? ఉత్తి శరీరం అక్కడ ఉంచుతాం, వాడు వెళ్లిపోయాడు అని చెప్తాం, ఎవరు వెళ్లిపోయాడని చెప్తాం? వెళ్లిపోయిన వాడు 'అసలు ఉన్నవాడు', మిగిలినది 'అసలు పోయినది'. అంటే పనికిరానిది. మనవరకూ ఆ స్త్రీకి ఆ భర్త ఉన్నట్టా ఆ శరీరం ఉంటే? శరీరం ఆధారంగా ఏది వుండి మనతో ప్రవర్తిస్తోందో, అది వుంటే వున్నట్టు తప్ప, అది లేకుండా ఉత్త శరీరం వుంటే, అంటే బూటు, ప్యాంటు, చొక్కా లాగ మిగిలి వున్నాయి అనుకోండి మూడు, అంటే మనసు-ఇంద్రియములు-శరీరం కలిపి కదా శరీరం. అవి మాత్రం వుండి, వాడు లేకుండా వున్నాడనుకోండి, ఆ భర్త ఆ స్త్రీకి ఉన్నట్టా లేనట్టా? ఉత్త శరీరం కదా మనం చూస్తున్నది. ఆ శరీరం అక్కడ వుంది, మిగతాది ఏమీ లేదు. భర్త స్త్రీకి ఉన్నట్టా లేనట్టా? కాబట్టి ఏదైతే పోతుందో దానిలో భర్తని చూసుకోవడం కన్నా, పోని భర్తని చూసుకోవాలి. అంటే శరీరంలో వున్నా, శరీరంలో లేకపోయినా ఉండేవాడు ఒకడున్నాడే, వాణ్ని చూసుకున్నామనుకోండి వాడు ఎప్పుడూ ఉంటాడు. వాడే ఇన్నిరకాలుగా వస్తూ ఉంటాడు కాబట్టి, గురువు ఏం చేస్తాడంటే ఎప్పుడూ పోకుండా వుండేవాణ్ని మనకి తగిలిస్తాడు. ఇక వాడు పోవడం వుండదు, పోవడం వుండదు కాబట్టి, రావడం వుండదు. పోనివాడు వచ్చేది ఏముంది? గోపికల స్థితి అది. వాళ్లకి శ్రీ కృష్ణుడు ఎప్పుడూ వ్రజం వదిలేసి పోలేదు. మిగతావాళ్ళకి పోయినట్టుగా అనిపించాడు కానీ గోపికలకి ఎప్పుడూ వ్రజంలో శ్రీకృష్ణుడు వున్నాడు. అసలు వెళ్తే కదా వాళ్లకి. వాళ్ళ దృష్టి అదీ! అది అవగాహన కావాలంటే చాలా స్థిరత్వం కావాలి. మనలో స్థిరంగా ఉన్నటువంటి దానియందు నిలబడినవాళ్లకి మాత్రమే అటువంటిది సాధ్యం. మాస్టరుగారు పోయారనుకునే వాళ్ళు కొంతమంది వుంటారు, మాస్టరుగారు ఉన్నారనుకునే వాళ్ళు కొంతమంది వుంటారు. ఎందుకంటే మాస్టరుగారి శరీరంలో 'మాస్టరు' ఏది? ఏది పనిచేసింది 'మాస్టరు'గా ఆయన శరీరంలోంచి? శరీరమా మాస్టరు? ఆయన ముఖకవళికలా మాస్టరు? ఏమిటి ఆయనలో మాస్టరు? మాస్టరు

అనేది ఆయన శరీరం ఆధారంగా పనిచేసింది, మళ్ళీ పని చేస్తుంది, ఎప్పుడూ పని చేస్తూనే వుంటుంది. శరీరం వదిలేసినంత మాత్రాన మాస్టరు లేరు, అనుకోకూడదు. శరీరం వుండి మాస్టరే లేకపోతే మాస్టరు వున్నారు అనుకోము కదా? ఎవరో గురువుగారికి మతి చెడిందనుకోండి, ఏం చెడకూడదా? చెడొచ్చు. మతి చెడిన తరువాత ఎవరైనా ఆయనని గురువుగారిలాగ భావన చేస్తారా! పాపం ఆయన ఒకప్పుడు గురువండీ, ఇప్పుడు పిచ్చివాడయిపోయాడు అంటాం. పిచ్చివాడి కింద లెఖ్క ఇప్పుడు, గురువు గారి కింద లెఖ్క కాదు కదా! అంటే వుండే దేనిని చూసి మనం గుర్తిస్తున్నామో, దేనిని చూసి మనం ప్రవర్తిస్తున్నామో దానియందు స్థిరంగా మనని ఏర్పరుస్తాడు, అదీ గురువు! పోయేదానియందు పట్టుకుని కూర్చునే వాణ్ని పోనిదానియందు పెట్టి ఉద్ధరిస్తాడు. ధర్మంలోకి ఉద్ధరిస్తాడు, అది కదా అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసాడు. 'నువ్వు ధర్మం కోసం యుద్ధం చేస్తున్నావు తప్ప, ఎదో మీ తాతయ్యతోనూ, cousin brothers తోనూ, గురువు తోనూ యుద్ధం చేస్తున్నాను అనుకోబోకు. ధర్మం తరపున యుద్ధం చేస్తున్నావు. ధర్మం తరపున అధర్మంతో యుద్ధం చేస్తున్నావు' అని అర్జునుడికి చెప్తాడు. సత్యం, ధర్మాధర్మాలు అనేవి సృష్టిలో ఎప్పుడూ వుంటాయి. నువ్వు అనుకున్న రూపాలు ఎప్పుడూ వుండవు. కానీ ఆ రూపాల్లో వున్న వాళ్ళు ఎప్పుడూ వుంటారు. గురు రక్షణ ఎలా వుంటుంది అంటే మనకి ఉన్నటువంటి ద్వంద్వాల నుంచి మనని ఉద్ధరిస్తాడు. కాసేపు ఇలా వుంటాం, కాసేపు అలా వుంటాం కదా మనం. చంద్రుని యొక్క స్థితుల వలె ఉంటాయి మన యొక్క ముఖకవళికలు. కళలు తగ్గుతూ వుంటాయి, కళలు పెరుగుతూ వుంటాయి. ఎప్పుడూ పౌర్ణమిగా వుండే స్థితి యోగ స్థితి. అప్పుడప్పుడు బావుంది, అప్పుడప్పుడు బావుండదనే స్థితి ఇతరమైన స్థితి. యోగ స్థితి కాదు. ఎప్పుడూ బావుండేలా చూసేవాడు మంచివాడా, నిజమైన రక్షకుడా?

ఎదో మనకి అప్పడప్పడు బావుండనప్పుడు బాగుచేసేట్టు గా కనిపించే వాడు రక్షకుడా? అయినా అలా ఎంతకాలం చేస్తాడు? ఎంతకాలం చేయించుకుంటాం? నా ఉద్దేశ్యంలో ఈ రోజు ఇక్కడకి వచ్చిన వాళ్ళందరూ గురువు అనుగ్రహం వల్ల వచ్చినట్లుగా నేను భావన చేస్తున్నాను. మనకి ఇక్కడ floating population ఉంటూ వుంటుంది. ఒకరోజు వచ్చిన వాళ్ళు ఒక రోజు రారు. అలా కాకుండా కొంతమంది స్థిరంగా వస్తూ వుంటారు. ఈ స్థిరంగా వచ్చే వాళ్ళు గురు స్థితిలో అంటే గురువు యొక్క అనుగ్రహంలో వున్నట్టు. వచ్చి పోయేవాళ్ళు మృత్యు స్థితిలో వున్నట్టు. కాసేపు వచ్చే తెలివి, కాసేపు పోయే తెలివి. వచ్చే తెలివి-పోయేతెలివి వున్నా వాళ్ళని ఎప్పుడూ వుండే తెలివి లోకి ఉద్ధరించేవాడికన్నా రక్షకుడు ఎవరండీ? నాకో లక్ష రూపాయలు నష్టం వస్తోంది అన్నారనుకోండి ఎవరైనా, నీకు లక్ష రూపాయలు నష్టం రాకుండా చూస్తే రక్షకుడు అని నువ్వు అనుకోవచ్చు. వాడు కాదు రక్షకుడు. నీకు లక్ష రూపాయలు పోయినా సరే, లక్ష రూపాయలు పోయాయి అనే భావన నిన్ను బాధించకుండా వుండే స్థితిలోకి నిన్ను

ఉద్ధరించాడనుకోండి. వాడు గురువు. అంటే సుఖ దుఃఖాలు అనేవి నిన్ను తాకని వుండే స్థితిలోకి మార్గం చూపించాడనుకొండి. వాడు నిజమైన రక్షకుడు. అలా రక్షించేవాడు గురువు అవుతాడు. మనకి కలికాలంలో అన్ని సాంప్రదాయాలు అడుగంటినట్టే, గురు సాంప్రదాయం కూడా అడుగంటుతూ వుంటుంది, మనం మాటిమాటికీ అడుగంటకుండా చూసుకుంటూ వుండాలి. గురువు అంటే మనకి వున్న సమస్యలు ఆయన మొహం మీద పారేస్తే, ఆయన solve చేసుకుంటాడు, మనం మామూలుగా ఎద్దులాగ తిరగొచ్చు అనుకుంటూ ఉంటాడు, అలా వుండదు గురుతత్త్వం. మేము ఇలాగే వుంటాం, మీరేమో మాకు జరుగుతున్నవి అన్నీ clean చేస్తూ వుండండి అంటే అది గురువుని ఆశ్రయించినట్టు వుండదు. మామూలుగా మనవాళ్ళందరూ ఏంచేస్తారంటే 'గురువుకి సమర్పణ చేసుకున్నాం' అంటూ వాళ్ళ యొక్క సమస్యలని సమర్పణ చేస్తారు తప్ప, వారిని వారు సమర్పణ చేసుకోరు. సమస్యని సమర్పణ చేసుకున్నా పెద్ద ఉపయోగంలేదు ఎందుకంటే, ఈ రోజు ఇన్ని సమస్యలు నువ్వు పుట్టించుకున్నావు అంటే మళ్ళీ పుట్టించవు అని ఏమిటి guarantee? సమస్యలను పుట్టించే స్వభావం నీలో వున్నప్పుడు, ఆ స్వభావాన్ని మార్చాలని గురువు ప్రయత్నం చేస్తాడు. నువ్వు సమస్యని చూడమని గురువుకి చెప్తూ ఉంటావు, గురువు సమస్యని చూడడు. సమస్యకి వెనుక వున్న కారణాన్ని చూస్తాడు. నువ్వు, నీలో వుండే స్వభావం. దానికి మార్పు చేయడానికి ప్రయత్నం చేస్తాడు, తద్వారా సమస్యలు పుట్టని స్థితిలోకి నువ్వు ఉద్ధరింప బడతావు. అది నిజమైన, శాశ్వతమైన రక్షణ తప్ప ఈ చిల్లర రక్షణలు రక్షణ కావు కాబట్టి, గురువు రక్షణ ఆ విధంగా వుంటుంది. నిజమైన గురువు ఆ విధంగా ఏం చేస్తాడంటే తన దగ్గరకి వచ్చిన ప్రతీవాడికీ, నెమ్మదిగా తానెవరో గుర్తుచేస్తాడు. వచ్చినవాడికి వాడియొక్క నిజస్వరూపం ఏమిటో గుర్తు చేస్తుంటాడు మాటిమాటికీ. అంటే నీవు జీవుడిగా దేవుడియొక్క అంశవు. కాబట్టి జ్యోతిస్వరూపుడవు, కాబట్టి శాశ్వతుడవు. నీకు వుండే మనసు, ఇంద్రియములూ శరీరం అశాశ్వతములు. మనసు, ఇంద్రియములూ, శరీరముతో నీవు ఏర్పరచుకున్న సంబంధములన్నీకూడా తాత్కాలికములు, నీవు శాశ్వతుడవు. నీకు వుండే బహిర్గతమైన సంబంధములన్నీ కూడా అశాశ్వతములు అనేది మాటిమాటికీ, అనేక రకములుగా నీకు గుర్తుచేసి పెడుతూ ఉంటాడు, వాడు గురువు. ఎవరు గురువు? అంటే గుర్తుచేసేవాడు గురువు అన్నారు. ఏవిటి గుర్తుచేస్తాడు? రోజూ పూజ చేసుకోలేదేమి? రోజూ ప్రార్థన చేసుకోలేదేమి? రోజూ విష్ణు సహస్రనామం చదువుకోలేదేమి? రోజూ అది చెయ్యట్లేదేమి? రోజూ ఇది చెయ్యట్లేదేమి? అని సతాయించేవాడు గురువు కాదు. ఎప్పడు తన దగ్గరకి వచ్చినా వాడియొక్క అసలు స్థితి వాడికి గుర్తు చేసి పంపిస్తూ ఉంటాడు. నువ్వు ఇది కదా! వీటిల్లో వున్నావేంటి? అని. నువ్వు జీవుడిగా దేవుడియొక్క అంశవి కదా! దాన్నే వాళ్ళు క్రైస్తవ మతంలో నేను దేవుని యొక్క కుమారుడని చెప్పారు. మనం అంతా కూడా అదే. దేవుని యొక్క అంశలమన్నా, దేవుని యొక్క కుమారులమన్నా

ఒకటే. ఈ దైవ కుమారుడనే భావన కూడా ఎక్కడనుంచి వచ్చిందంటే kumaras అనేది మనకి పురాణాల్లో కనిపిస్తాయి.  సనక, సనందన, సనత్కుమారాదులు, నారదుడు, సప్తర్షులు వీరందరూ కుమారులుగా భగవంతుని యొక్క తత్త్వముగా దిగివచ్చినవారు. భగవంతుని తత్త్వమే మళ్ళీ దిగివచ్చి పనిచేస్తూ వుంటుంది. దిగివచ్చిన తత్త్వాన్ని కుమారతత్త్వంఅంటారు. దాన్నే జీవతత్వం అంటారు. కాబట్టి నీవు జీవుడవు సుమా! జీవుడుగా నువ్వు దేవుడియొక్క 'అంశ' సుమా! దేవుడియొక్క 'కిరణము' సుమా! కిరణం గా దిగివచ్చిన నీవు మనస్సూ, ఇంద్రియమూ, శరీరమూ బహిర్గత ప్రపంచంతో ప్రవర్తించడానికి ఇవ్వబడిన వాహికలు సుమా! పనిముట్లు సుమా! అని తెలుపుతాడు మాటిమాటికీ. తెలిపి తనకి తానెవరో తనకి గుర్తు చేస్తూ ఉంటాడు. నిజస్థితిని గుర్తుచేస్తూ ఉంటాడు.  మనస్సు ఇంద్రియములు శరీరముతో మనం పొందేవి అన్నీ కూడా మనకి తాత్కాలికమైన ఆనందం కలిగించేవి తప్ప, పరిపూర్ణమైన ఆనందాన్ని కలిగించవు. ఆ క్షణానికి వుంటుంది, ఆ తరువాత వుండదు. మనకి రుచితో పొందే ఆనందం ఆ క్షణానికి వుంటుంది, ఆ తరువాత వుండదు. మామూలుగా రుచిగా ఉండేవన్నీకూడా తరువాత కడుపుని పాడుచేసేవే. అదేమిటో భగవంతుని సృష్టిలో మనకి రుచించేవి మనకి ఆరోగ్యంగా  ఉండేవిగా వుండవు. మనకి ఆరోగ్యంగా ఉండేవి మనకి రుచించవు. పోనీ ఆరోగ్యంగా ఉండేదే రుచిగా తయారు చేసుకున్నా, తిన్న తరువాత ఎంతసేపు వుంటుంది ఆనందం? అయిపోయింది కదా? ఆనందం శాశ్వతం అయితే అదే మళ్ళీ తినడానికి మనం ప్రయత్నం చెయ్యం కదా! ఒక మామిడిపండు తింటే మనకి ఆనందం అనుకున్నాం అనుకోండి మామిడిపండు తిన్నాక ఎంతసేపు వుంది ఆ ఆనందం? ఐదు ఇంద్రియాలతో మంచి పాట వింటే ఆనందం. ఎంతసేపు వింటావు? ఎంతసేపు ఆనందంగా ఉంటావు? విన్నంతసేపు మాత్రమేనా? ఏదైనా చలికాలంలో వెచ్చగా వుండేది ముట్టుకుంటే ఆనందం. వేసవికాలంలో చల్లగా వుండేది ముట్టుకుంటే ఆనందం. ఎంతసేపు వుంది ఆనందం? స్పర్శతో సంబంధించిన ఆనందము, రుచితో ఉన్న ఆనందము, ముక్కుతో ఆనందము ఎంతసేపు ఉంటుంది? వాసన వస్తోంది, అగరువత్తులు పెడతావు. ఎన్ని పెడతావు? ఎన్నాళ్ళు పెడతావు? మహా పెడితే పొద్దున్న ఒకటి, సాయంకాలం ఒకటి పెడితే సరిపోతాయి. రోజంతా అగరువత్తులు చుట్టూ పెట్టుకుని తిరగం కదా! ఎన్నాళ్ళు, ఎంతసేపు వస్తుంది ఆనందము? తాత్కాలికమే కదా! అలాగే చూసి చూసి ఆనందం, సినిమాకి వెళ్తే ఆనందం. ఎంతసేపు? సినిమా చూస్తే ఆనందం పరిపూర్ణం అయితే ఇంకో సినిమా చూడఖ్ఖర్లేదు. కానీ దానికి కాల పరిమితులు వున్నాయి. ఆ క్షణానికి ఆనందం కలిగించినట్టుగా అనిపించి మోసం చేస్తుంది తప్ప, పరిపూర్ణమైన ఆనందాన్ని ఇవ్వదు. అలాగే మనుసులోని భావనలు, వినే సంగీతం. చెవి, కన్ను, ముక్కు, నోరు ఇంద్రియాల నుంచి వచ్చే ఆనందం, ఏదీ శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వదు. వాటికోసం వెతుక్కుంటూ మనం తిరుగుతూ వుంటే, అవి ఆనందం ఇస్తున్నట్టుగా భ్రాంతిలో పడేసి మనని అవి

తిప్పుతూ వుంటాయి. అక్కడికి వెళ్తే ఆనందం. ఇక్కడికి వెళ్తే ఆనందం. ఆ పుణ్యక్షేత్రానికి వెళ్తే ఆనందం. అక్కడికి వెళ్లి ఆ పూజ చేస్తే ఆనందం. ఇంకొకడు వచ్చి ఈ పూజ చేసాను అంటాడు. అయితే ఈ పూజ కోసం మళ్ళీ పోతూ వుంటాం. అయ్యో! సుప్రభాత సేవకి మీరు వెళ్ళలేదా ? చాలా బావుంటుంది అంటాడు ఎవడో. అంటే మళ్ళీ పరిగెడతాం. వాడు మళ్ళీ తోమాలసేవ అంటాడు, ఇంకో అర్చన అంటాడు, కల్యాణం అంటాడు, మరొకటి అంటాడు, ఎన్ని చేయిస్తే ఆనందం? ఇలా రావు ఆనందాలు. అందుకే గురువు ఏంచేస్తాడంటే, 'పరిగెత్తక! ఆనందం రాదు, లోపల వుంది ఆనందం' అని చూపిస్తాడు. నీలోపల నీవు ఎవరో, నువ్వు తెలుసుకుంటే నీకు ఆనందం కలుగుతుంది. అప్పుడు ముక్కుకి సువాసన భావం లేదు, దుర్వాసన భావం లేదు, రుచి భావనలేదు, ఆకర్షణమైనవి చూడాలని భావనలేదు. ఏవో వినాలని భావనలేదు. నీకు నువ్వే ఆనందంగా ఉంటావు ఇవన్నీ అఖ్కర్లేకుండా. అంటే ఖర్చులేకుండా ఆనందంగా వుంటాం. ఇప్పుడు చూడండి మనం ఆనందం కోసం ఎంత ఖర్చు పెడుతున్నాం. అది మనకి దొరకడంలేదు. ఇది మనకి బొత్తిగా fees లేని పద్ధతి, గురువు ఇస్తాడు. దానికి మన అసలు స్వరూపం మనకి అవగాహన అయ్యేట్టుగా చేస్తాడు. ఎప్పుడూ అదే పని. ఇంకో పని వుండదు. ఎన్ని చెప్పినా వైవిధ్యంతో మన మనసు ఆకర్షింప బడుతుంది అనే ఉద్దేశ్యంతో, రకరకాలుగా రకరకాలుగా చెప్తున్నప్పటికీ మళ్ళీ దీని దగ్గరికే తీసుకొస్తూవుంటాడు మాటిమాటికీ. తీసుకురావడంవల్ల ఏమవుతుంది అంటే, తానెవరో తనకి తెలిసినటువంటి వాడికి, తనకి ఇవ్వబడింది మనసు, ఇంద్రియాలు, శరీరం, వాటిని వాడుకుని అనుభూతి పొందుదాం, తాను తానుగా వుందాం అనే స్థితిలో వుండే వాళ్ళకి ద్వంద్వాలు బాధించవు. ద్వంద్వముల యొక్క బాధలనుంచి రక్షించేవాడు గురువు, అలా రక్షించడానికి మనలో మనం ఎవరో మనకి గుర్తు చేసేవాడు గురువు. మనలో వున్న గురువుని చూపించినవాడు అసలైన గురువు. మన శరీరానికి ఇంద్రియములు గురువు. ఇంద్రియములకి మనసు గురువు, మనసుకి బుద్ధి గురువు, బుద్ధికి తాను గురువు, తనకి తాను అంటే తనలో వుండే జీవాత్మ తత్త్వం దేహాత్మ తత్త్వానికి గురువు. అందుకే జీవుడిగా మనం దేహాత్మని అధిష్టించి పనిచేసుకుంటూ వుంటాం. దేహాత్మకి, జీవాత్మ గురువు అవుతాడు. అందుకని, తనలో తానెవరో తనకు చూపించడం మొట్ట మొదటగా గురువు చేసే ప్రయత్నం. అంటే శిష్యుడు వికేంద్రీకృతుడై బాధ పడుతూ వుంటే, వాణ్ని కేంద్రీకృతుణ్ని చేసి సరైన పద్ధతిలో పెడుతూ ఉంటాడు. ఆ విధంగా దేహాత్మభావం వుండే వాళ్లకి జీవాత్మభావం గురువౌతుంది. జీవాత్మభావం వుండేవాళ్ళకి దైవాత్మభావం గురువు. అంటే తాను జీవుడైనప్పుడు తనలో దేవుడిగా వున్న తత్వము, పరిసరములలో దేవుడిగా వున్న తత్త్వం. పరిసరములలో దేవుడిగా వున్న తత్త్వం చూపించినప్పుడు దైవాత్మ తత్త్వంలోంచి విశ్వాత్మ తత్త్వంలోకి చేరతాడు. అంటే ఒకొక్కటి ఒకో మెట్టు అన్నమాట. దేహాత్మతత్త్వం, జీవాత్మతత్త్వం, ఆత్మతత్త్వం, విశ్వాత్మతత్త్వం. విశ్వాత్మ అయిన

గురువుని మనం విశ్వం అంటూ వుంటాం. విశ్వంవిష్ణుర్వషట్కారో అంటాం. విశ్వాత్మతత్వానికి పైన గురువుగా పరమాత్మ తత్త్వంవుంటూ వుంటుంది. అంటే విశ్వమునకు 'అవ్వల' వున్న దేవుడన్నమాట.

'పెంజీకటికవ్వల నెవ్వండేకాకృతి వెలుగు అతని నే సేవింతున్' అంటాడు గజేంద్రమోక్షంలో అంటే పరమాత్మతత్త్వం.

పరమాత్మతత్త్వం నుంచి విశ్వాత్మతత్త్వం, విశ్వాత్మతత్త్వం నుంచి ఆత్మతత్త్వం, ఆత్మతత్త్వం నుంచి జీవాత్మతత్త్వం, జీవాత్మతత్త్వం నుంచి దేహాత్మతత్త్వం. ఇవన్నీ మెట్లన్నమాట. ఇదే దారి. ఈ దారినే ధామం అంటాం. ఇదంతాకూడా వెలుగుతో కూడిన దారి. అందుకని 'ధామ' అనే పదం భగవంతునికి ఒకటి ఇచ్చారు. గురు గురుతమో ధామః. ధామం అంటే వెలుగు వ్యాప్తిచెంది, వెలుగు దారి అటునుంచి ఇటు పరమాత్మ నుంచీ దేహాత్మ వరకూ, దేహాత్మ నుంచీ పరమాత్మ వరకూ వుండే దారి ఏదైతే వుందో, ఆ దారి మనలో మూలాధారం నుంచీ సహస్రారం వరకూ సుషుమ్నలో వున్నది. ఆ దారిలోంచే జీవులు ఊర్ధ్వలోకాల్లోకి వెళ్తూ వుంటారు. ఆ దారిలోంచే దేవతలు మర్త్య లోకాలకి వస్తూ వుంటారు. మన పురాణాలలోనికథలని తీసుకున్నట్లయితే, ఎవరైనా తన జీవన కార్యక్రమం పూర్తయిన తరువాత ఉత్తర దిశగా నడిచి వెళ్ళిపోయాడు అని చెప్తారు. తూర్పుగా వెళ్లి ఉత్తరానికి వెళ్తూ వుంటారు. తూర్పుగా వెళ్ళడం అంటే 'ఆజ్ఞ' కి రావడం. అక్కడినుంచి ఉత్తరంగా వెళ్ళడం అంటే నుదుటి పై భాగానికి అంటే సహస్రారానికి వెళ్ళిపోవడం. ఇలా ఉత్తర దిశగా నడిచి వెళ్ళారని చెప్తారు. ధర్మరాజాదులు ఉత్తర దిశగా నడిచి వెళ్ళారు. రుషభుడు ఉత్తర దిశగా నడిచి వెళ్ళారు. శంకరాచార్యులవారు ఉత్తర దిశగా నడిచి వెళ్ళారు. ఇలా అందరూ ఉత్తర దిశగా నడిచి వెళ్తారు, జీవన కార్యక్రమం అయిన తరువాత. ఉత్తర దిశగా నడిచి వెళ్ళడం అంటే ఊర్ధ్వగతుల్లోకి వెళ్ళడం అని అర్థం. ఊర్ధ్వగతుల్లోకి వెళ్తున్నకొద్దీ వెలుగు ఎక్కువ అవుతూ వుంటుంది. ఊర్ధ్వగతుల లోంచి అధోగతులలోకి వస్తున్నకొద్దీ వెలుగు తక్కువగా వుంటుంది, కానీ వెలుగు వుంటుంది. అంటే ఒక చోట గుడ్డి దీపం వుంటే, ఒకచోట చాలా దేదీప్యమానమైన దీపంగా వెలుగు వుంటుంది. వెలుగు యొక్క హెచ్చు-తగ్గులుగా వుంటాయి లోకాలన్నీ. ఈ భూమికి సంబంధించిన లోకం యొక్క వెలుగు కన్నా సూర్యుడికి సంబంధించిన లోకం యొక్క వెలుగు ఏడు రెట్లు ఎక్కువగా వుంటుంది. శుక్రుడికి సంబంధించిన లోకం భూమికి సంబంధించిన లోకంకన్నా రెండు రెట్లు ఎక్కువ వెలుగుగా వుంటుంది. బుధునికి సంబంధించిన లోకం భూమికి సంబంధించిన లోకంకన్నా ఆరురెట్లు ఎక్కువ వెలుగుగా వుంటుంది. అంతా వెలుగు దారులే. ఈ వెలుగు మార్గం ఏదైతే వుందో, అంటే వెలుగు యొక్క హెచ్చు-తగ్గులుగా సృష్టి అంతా జరుగుతూ వస్తోంది కాబట్టి ఈ జరుగుతున్న సృష్టిలో ఒకరికి ఒకరు గురువుగా తానే, ఒకరికి ఒకరు శిష్యుడిగా తానే దిగివచ్చాడన్నమాట. నారాయణ తత్త్వం నుంచి బ్రహ్మ తత్త్వం

పుట్టుకొచ్చినప్పుడు, బ్రహ్మకి నారాయణుడు గురువు. బ్రహ్మ నుండి సృష్టి మొదలైన తర్వాత అందులోంచి పుట్టుకొచ్చిన కుమారులకు బ్రహ్మ గురువు. కుమారులు పన్నెండు మంది వున్నారు, సప్తఋషులు వున్నారు, నలుగురు కుమారులు సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు వున్నారు, నారదుడు వున్నాడు. కలిపి పన్నెండుమందీ లోకాలన్నిటికీ గురువులు. మళ్ళీ వాళ్ళనుంచి పుట్టుకొచ్చినవాళ్ళున్నారు- ప్రజాపతులు, మనువులు. వాళ్ళు గురువులు. ఇలా నిచ్చెన నిచ్చెనగా గురుశిష్య సాంప్రదాయంగా మొత్తం సృష్టి వుంటుంది. తనకన్నా కింద ఉన్న చైతన్యస్థితి, పైన ఉన్న చైతన్యస్థితికి శిష్య స్థితి. పైన ఉన్న చైతన్యస్థితి, కింద ఉన్న శిష్య చైతన్యస్థితికి గురువు. గురువు అనే పదానికి 'గ' 'ఉ' 'ర' 'ఉ' అనే ఒక అర్థం కూడా వున్నది. తరువాత గుర్తు చెప్పేవాడు అనే ఒక అర్థం వున్నది. అది కాకుండా గురు శబ్దానికి 'అన్నిటికన్నా పెద్దవాడు' అని అర్థం. ఏం గురూగారూ? అంటూ వుంటాం కదా! మనకన్నా పెద్దవాడు మనకి గురువు, అతడికన్నా పెద్దవాడు అతడికి గురువు. అలా వుంటుంది గురుత్వం. అన్నిటికన్నా పెద్దవాడు అన్నిరూపాల్లోనూ కనిపిస్తూ ఉంటాడు. అందుకని అన్నిటికన్నా పెద్దవాడినే మేము ఆశ్రయిస్తాము, మిగతావాళ్ళని ఆశ్రయించం అంటే వాళ్లకి మార్గం దొరకదు. అన్నిటికన్నా పెద్దది దాన్ని ఆశ్రయిద్దాం అని పెట్టుకుంటే మనకి దారి దొరకదు. ఎందుకంటే అన్నిటికన్నా పెద్దదే మనవరకూ వచ్చి వున్నది. మన పరిసరాల్లో వున్నది. మన పరిసరాల్లో మనకి అందుబాటులో వున్నదాని ద్వారా అన్నిటికన్నా పెద్దదాన్ని మనం చేరుకోవాలి తప్ప ఇంకో పద్ధతిలో లేదు. విద్యుత్తు ని ఉదాహరణగా తీసుకున్నాం అనుకోండి, మన ఇంట్లో విద్యుత్ ఎక్కడ నుంచి వచ్చింది? Meter నుంచి వచ్చింది. ఇంటి విషయం వరకూ meter అన్నిటికన్నా పెద్దది. ఇంట్లో ఉండే బల్బులన్నిటికీ గురువు main switch. ఈ main switch యొక్క గురువుగారు బయట electric pole మీద ఉంటాడు. దానికి గురువుగారు transformer మీద ఉంటాడు, దాని గురువుగారు, ఈ వూళ్ళో అందరికీ విద్యుత్ సింహాచలం దగ్గర నుంచి వస్తుంటే అక్కడ ఉంటాడు. దానికి గురువుగారు ఎక్కడో మాచ్కండ్ లోనో మరెక్కడో వుంటాడు. దానికి గురువుగారు--- అలా అలా వెళ్తే ఆకాశం వుంటుంది. అన్నిటికన్నా పెద్ద ఆకాశం కాబట్టి, ఆకాశం పట్టుకుందాం అనుకుంటే అవుతుందా? ఈ light ది ఏముందండీ, ఆకాశం నుండి దిగివచ్చింది, నేను సరాసరి ఆకాశాన్ని పట్టుకుంటాను అంటే అవ్వదు. అది గురు పరంపరలో ఉన్న మహత్తరమైన విషయం. అలాగే నీళ్ళు తీసుకోండి, మన ఇంట్లోకి వచ్చే నీళ్ళు ఎక్కడినుంచి వచ్చాయి? మునిసిపల్ పంపులోంచి, పంపులోకి ఎక్కణ్ణుంచి వచ్చాయి? reservoir నుంచి. Reservoir లోకి ఎక్కణ్ణుంచి వచ్చాయి? నదికి అడ్డుకట్ట వెయ్యడం వల్ల. నది ఎలా వచ్చింది? పుట్టుకస్థానం వల్ల? పుట్టుక స్థానం దగ్గర నది ఎలా ఏర్పడింది? వర్షం వల్ల. వర్షం ఎక్కణ్ణుంచి వచ్చింది? సముద్రం వల్ల. అంటే ఈ సముద్రంలో నీళ్ళు తాగుతావా సరాసరి? కొంత మందికి పిచ్చి వెర్రితలలు వేస్తూ వుంటుంది. అంటే 'the biggest'

పట్టుకుందాం అనుకుంటాడు. 'the biggest' అఖ్కర్లేదు. గురువు ద్వారా భగవంతుని చేరుకోవడం అనేది సులభమైన మార్గం. ఎక్కడో కార్లు, స్కూటర్లూ తయారు చేస్తున్నారు. అయితే స్కూటరు ఎవరో dealer ఇస్తున్నాడు. అంటే సదుపాయమే కదా? ఇక్కడ తీసుకోకుండా నేను తయారుచేసే చోటుకి పోతాను అంటే, ఇక్కణ్నుంచి regional ఆఫీసు, అక్కణ్నుంచి zonal ఆఫీసు, అక్కణ్నుంచి head ఆఫీసు. అది తెలివా? ఇది తెలివా? ఏది తెలివి? ఎక్కణ్ణుంచి తయారవుతోందో అది మనవరకూ నడిచి వచ్చే మార్గం ప్రతీదానికీ లేదూ? స్కూటర్లకి, నీటికి, విద్యుత్తుకి అన్నిటికీ మార్గం వుంది. అన్నీ మనవరకూ వస్తూ వుంటే, మనం దానికోసం దీన్ని వదిలేసిపోతే దొరుకుతుందా? అది అవివేకం అవుతుంది. అందుకని పెద్దలు ప్రత్యేకంగా భారతీయ మార్గంలో గురు సాంప్రదాయం ఒకటి పెట్టారు. అంటే నీకు భగవంతుడు కావాలా? కావాలి అంటే ఎవరు భగవంతుణ్ణి ఎరిగి వున్నారో, వాణ్ని పట్టుకున్నట్లయితే భగవంతుణ్ణి పట్టుకున్నట్టే. Magnet కావాలనుకోండి, magnet కి తగులుకున్న pin పట్టుకున్నా magentic current మనకి వస్తుంది. Magnetకి ఒక సూది పెట్టాం, సూదికి కూడా magnetism అంటింది. సూదికి మరొక సూది పెట్టాం. Magnetism అంటుకుంది. ఆ సూదికి మరొక సూది పెట్టండి అంటుకుంటుంది. అన్నీ సరాసరి original magnet కి మాత్రమే పెట్టాలి అని లేదు. ఆ విధంగా ఎక్కడ నేను-తాను అనే తత్వాన్ని తాను ఎరిగి ఇతరులకు అందిస్తాడో అతడు గురువు. మనకి చెప్పారు ఎవరండీ గురువు? రకరకాల గురువులు వుంటారు కదండీ, మోసపోతూ వుంటాం కదండీ అంటే మోసపుచ్చే వాడు మోసగించే గురువు దగ్గరకి వెళ్తాడు. ఎవడి గురువు వాడికి ఉంటాడు. మోసగించే వాడికి వాడికన్నా బాగా మోసగించేవాడు గురువుగా దొరుకుతాడు. అలా తనకి వుండే స్వభావానికి తగ్గట్టు తనకి గురువు దొరుకుతాడు. అసలు గురువు ఎలా ఉంటాడు? అంటే ప్రహ్లాదుడు చెప్తాడు. విశ్వాత్మకుడైన భగవంతుడు ఏ ఏ రూపాల్లో ఎలా ఉంటాడో చెప్తూ, నీ రూపంలో కూడా ఎలా ఉన్నాడో నీకు చూపించే వాడు నీకు గురువవుతాడు అని చెప్తాడు. అక్కడా ఇక్కడా తిరగఖ్ఖర్లేదు. నిజమైన గురువు దగ్గరకు చేరితే ఖర్చు వుండదు. అక్కడికీ ఇక్కడికీ తిప్పడు. అదీ ఇదీ కొనుక్కోమనడు. ఏదీ కొనుక్కోవఖ్కర్లేదు, గురువుగారి photo కూడా కొనుక్కోవఖ్కర్లేదు ఎందుకంటే నీలో వుండే గురువుని చూపిస్తాడు. నీలో వుండే గురువుకి photo ఏవుంది? వేరే బయటనుంచి మనం కట్టుకుని photos పెట్టుకోవఖ్కర్లేదు. అలా నెమ్మదిగా తనమీద ఆధారపడేవాళ్ళని, వాళ్ళమీద వాళ్ళు ఆధారపడేలా చేసి వాళ్ళల్లో వుండే గురుతత్వం వాళ్లకి చూపిస్తాడు. చూపిస్తే అక్కణ్నుంచి వాళ్ళు అందుకుని సాగి ముందుకు వెళ్ళిపోతారు. ఇక్కడ గురువు తనలో వుండే ప్రతీ ఒక్క జీవికీ తనలో వుండే గురువుని దర్శనం చేయిస్తాడు. పైన వున్న మనం అనాహతంలో/ హృదయంలో వున్న గురువుని చూసాం. చూస్తే హృదయంలో వుండే గురువు ఏం చేస్తాడంటే, 'నేను కేవలం వాయుతత్వంలో వుండే గురువుని.

అంతకు మించి ఆకాశతత్త్వంలో వుండే గురువుని చూపిస్తాను' అని చెప్పి కంఠంలో వుండే గురువుని చూపిస్తాడు. అందుకని తనకి ఇక్కడ హృదయంలో తిరిగే గురువు, ఆకాశంలో తిరిగే గురువుగా దొరుకుతాడు. అతడే నారదుడు! నారదుడు ఎప్పుడూ ఆకాశంలో తిరుగుతూ ఉంటాడు, గురువులందరికీ గురువు! ప్రహ్లాదుడికి గురువు, ధృవుడికి గురువు, ఏ పేరు చెప్పండి వారందరికీ గురువు నారదుడే! సప్తర్షులందరికీ కూడా గురువు నారదుడే! పధ్నాలుగు లోకాలలోనూ తిరుగుతూ అందరికీ link ఇచ్చేవాడు. కాబట్టి, వాయుతత్త్వంలో మనం గురువుని చూస్తే ఆయన తీసుకెళ్ళి ఆకాశతత్త్వంలో వుండే గురువుని చూపిస్తే, ఆకాశతత్త్వంలో వుండే గురువు తీసుకెళ్ళి మహత్తత్త్వంలో వుండే గురువుని ఆజ్ఞలో చూపిస్తాడు. చూపిస్తే అప్పుడు మనకి బావుందనిపిస్తుంది. అంతకంతకీ వెలుగు పెరిగి 'చాలా బావుంది సార్' అంటే వాళ్ళు ఏవంటారంటే 'మరేమనుకున్నావ్? అని అనడు. 'నాదేముంది నాకన్నా పెద్దాయన వున్నాడు' అని చూపిస్తాడు. అతడే అసలైన గురువు. 'నేనే గురువు, నా వెనకాల అసలు ఏమీ లేదు' అని చెప్పేవాడు గురువు కాదు. గురువు ఎవరయా అంటే అతడి వెనకాల వుండే వాడికి అప్పటికి అదే గురువు. ముందు మనకి మట్టే గురువు! అదేకదా మనకి భృగువల్లిలో చెప్తారు. తండ్రితో కొడుకు అంటాడు, 'నాన్నా! ఏమీలేదు ఈ ప్రపంచం అంతా మట్టి' అంటాడు. 'అవునురా, ధ్యానం చెయ్యి' అంటాడు తండ్రి. ధ్యానం చేస్తూ వుంటే 'మట్టేకాదు నీళ్ళు కూడా' అంటాడు. అవునంటాడు తండ్రి. 'నీళ్ళవల్ల ఆవేశం అవీ ఇవీ కలుగుతున్నాయి, మనలోపల ఉద్రేకం కలుగుతోంది' అంటే అవునంటాడు తండ్రి. ఇంకా మళ్ళీ కొంచెం తపస్సు చెయ్యమంటాడు. 'ఈ నీళ్ళకు వెనకాల అగ్ని కనిపిస్తుంది నాన్నా!' అంటాడు. అవునని ఊరుకోడు తండ్రి. మళ్ళీ ఇంకొంచం తపస్సు చెయ్యమంటాడు. తపస్సు చేస్తే వాడు అగ్ని నుంచి వాయువు కనుక్కుంటాడు, వాయువు నుంచి ఆకాశం కనుక్కుంటాడు, ఆకాశం పైన వెలుగు కనుక్కుంటాడు, వెలుగు పైన ఆ వెలుగుకి ఆధారమైన స్థితి ఎదో కనుక్కుంటాడు-ఇలా ఏడు స్థితులూ, భగవంతుని యొక్క సప్త లోకములూ తెలుసుకుంటాడు. 'అవును అబ్బాయి!' అంటాడు తండ్రి. 'అదంతా నేనే' అంటాడు తరువాత కొడుకు. అవునంటాడు తండ్రి. 'నువ్వుగా కూడా అదే వుంది' అంటాడు. 'మొత్తం అదే ఇంకేం లేదు' అంటాడు కొడుకు. అవునంటాడు. ఇంతే సంగతులు, చిత్తగించవలెను. అలా నేర్పుతాడు. జ్వాలాకూల్ మహర్షి చెప్తారు. 'చిన్న గురువు అని ప్రపంచంలో అనిపించుకునేవాడి దగ్గరనుంచీ Christ దాటిన వరకూ అంతా గురువులు వున్నారు. Christ దాటిన తరువాత కూడా ఎంతవరకూ వున్నారయ్యా అంటే, పరమాత్మ తత్త్వం వరకూ అంతా గురువులే'. ఒక్కడే గా! తనకన్నా పైవాడు తనకి గురువు. అలా ఒక నిచ్చెన ఎక్కిన తరువాత ఒక నిచ్చెన, ఆ నిచ్చెనలో ఇలా మెట్టెక్కి మెట్టెక్కి మెట్టెక్కి ఇవన్నీ ఏమైంది చివరకి? గురువుకి గురువు, ఆ గురువుకి గురువు, ఆ కనపడుతున్నవాడే ఇంతమందిగా ఉన్నాడని తెలుస్తుంది. అది దారి. దాన్నే

Christ ఏమి చెప్పాడంటే I am the way, నేనే మార్గం అన్నాడు. అంటే Christ మార్గం అనికాదు దాని అర్ధం. నేనే మార్గం అంటే 'నేను' గా ఇన్ని స్థితులలో వున్నవాడు మార్గం. అదీ 'ధామం' అంటే. నేనే మార్గం అనేదానికి తెలుగు పదానికి సరైన అర్ధం ఏమిటంటే సంస్కృతంలో 'ధామము'. 'ధామః' అనే భగవంతుని యొక్క నామమే Christ చెప్పినటువంటి I am the way అనే భావం. I am the way అన్నప్పుడు తానే మార్గముగా ఏర్పడి వున్నాడు భగవంతుడు. ఎటువంటి మార్గముగా ఏర్పడి వున్నాడు అంటే, వెలుగు మార్గంగా ఏర్పడి వున్నాడు. కాబట్టి ఆ రకమైన వెలుగు మార్గంలో మనని నడిపిస్తాడు. ఎంత సేపూ మనం మనస్సూ, ఇంద్రియాలలో కొట్టుకుంటూ ఉంటామండీ, దానికి బాగా అలవాటు పడిపోయి. గురువు దగ్గరకి వస్తే ఏం చేస్తాడంటే, బుద్ధిలోకాల్లోకి ఉద్ధరిస్తుంటాడు. ఆత్మ గురించి ఆలోచనచెయ్యగానే, వెలుగు వస్తుంది. ఆత్మకి సంబంధించినది వెలుగు. సూర్యుని వెలుగు సూర్యునికి సంబంధించినది కదా? వెలుగు వుందిట అంటే సూర్యుడు వున్నాడనా? లేడనా? మనం సూర్యుని యొక్క భావన చేయంగానే, సూర్యునియొక్క వెలుగు అవినాభావంగా మనకి వచ్చి పడుతుంది . సూర్యుని వెలుగు ఏ విధంగా సూర్యుని నుంచి అవినాభావంగా ఉన్నదో, నేను అనే ప్రతీయొక్క జీవుడు కూడా తన యొక్క వెలుగుతో అవినాభావ సంబంధం కలిగి ఉంటాడు. సూర్యుడు-సూర్యుని వెలుగు, తాను-తన యొక్క వెలుగు, దేవుడు-దేవుని యొక్క వెలుగు, ఇవన్నీ ఎప్పడూ కలిసే వుంటాయి. కాబట్టి, ఆత్మతత్వాన్ని గుర్తుచేయడం ద్వారా, వెలుగు యందు మనిషిని వుంచి, అంతకన్నా తక్కువగా కనిపించే చిల్లర విషయాలన్నీ కూడా తేలిగ్గా కనిపించేట్టు చేస్తాడు. శ్రీకృష్ణుని ఆశ్రయించిన వాళ్ళందరూ పుట్టినదగ్గర నుంచీ చచ్చిపోయేవరకూ, బాగా సుఖపడ్డారా? లేక సుఖ దుఃఖాలను రెండూ అనుభావించారా? భాగవతంలో కనిపించే శిష్యకోటి అంతా కూడా ఎప్పడూ ఆనందంగా వున్నారా? దుఃఖం కూడా పడ్డారా? గట్టిగా చూస్తే చాలా దుఃఖపడినట్లు వుంటుంది. వాళ్లకి వచ్చిన కష్టాలలో ఒక లక్షవ వంతు కూడా మనకి రాలేదు. అయినప్పటికీ మనం చాలా పెద్ద కష్టమొచ్చినట్లుగా బాధపడిపోతూ వుంటాం. అది మనకి వుండే అలసత్వం, మందబుద్ధి. ధర్మరాజుకి వచ్చిన కష్టాలు మనకి వస్తే, మనం ఉంటామా? పేలిపోతాం. నలుడికి వచ్చిన కష్టాలు మనకి వస్తే, మనం ఉంటామా? పేలిపోతాం. భాగవతం కథల నిండా వీళ్ళే వుంటారు. మహాత్ములకు కూడా కష్టాలు వుంటాయిరా అబ్బాయి! అని చెప్తూ వుంటారు. కాకపోతే, మనం కృంగి పోయినట్లు వాళ్ళు కష్టంలో కృంగిపోరు. కర్తవ్యంలో జీవిస్తారు. అది వాళ్లకి ఇవ్వబడినటువంటి గురు అనుగ్రహం. రామునికి కష్టాలు ఉన్నాయా, లేవా? మన దృష్టిలో చూస్తే కష్టాలు వున్నాయి, ఆయన దృష్టిలో చూస్తే లేవు. కష్టం అనుకుంటే కష్టం, లేకపోతే లేదు. కర్తవ్యంలో వుండే వాడికి కష్టం గుర్తుండదు. కష్టంలో వుండే వాడికి కర్తవ్యం గుర్తుండదు. ఇదీ తమాషా. ఏవండీ! ఈ మధ్య రావడంలేదు మీరు? అంటే, 'ఏవిటోనండీ అన్నీ

కష్టాలే’ అంటారు. కష్టాలు ఎక్కువ ఎందుకు వుంటాయంటే, కర్తవ్యంలో ఉండకపోతే వుంటాయి. కర్తవ్యంలో వుంటే కష్టాలు ఉండవని కాదు, కష్టాలయందు దృష్టి వుండదు. చాలు కదా ? దానియందు భావనవల్ల ఎక్కువ అవుతాయి తప్ప by itself ఆ event వల్ల భాద ఏమీ వుండదు. అది వూరికే information మాత్రమే అవుతుంది. కానీ, దాని గురించి మనం చేసేదంతా కూడా బాధ కలుగుతుంది. కాబట్టి, గురించి చేసేవాళ్ళందరూ కూడా ‘పొగలో’ ఇరుక్కున్న వాళ్ళవుతారు. గురువు ఏమి చేస్తాడంటే, ‘అమ్మా! పొగ బాగా పేరుకుంటోంది, కొంచం విసురుకో,’ అని చెప్తాడు. విసురుతుంటే, నిప్పు ఎక్కువ ప్రజ్వలంగా కనిపిస్తుంది. విసురుకోకపోతే, నిప్పు చల్లారిపోతూ, పొగ ఎక్కువ అవుతూ వుంటుంది. ఒకదాన్ని పొగ మార్గం అన్నారు, ఒకదాన్ని వెలుగు మార్గం అన్నారు. పొగ పేర్చుకోనివ్వకూడదు పొగ పేర్చుకోవడం అంటే అలా కూర్చుని, బంక తీసినట్టు బాధపెట్టే ఆలోచనలు తీస్తూ కూర్చోవటం. మనం కూర్చుంటే మన మనస్సు ఏం చేస్తుందంటే, మనకి బాధ కలిగించేవాటినే గుర్తుచేస్తుంది. అదేమిటో దానికి అదో సరదా. మన స్వభావం, మనని ఏది బాధపెడుతుందో దాన్ని తీసుకొచ్చి మాటిమాటికీ గుర్తుచేస్తూ వుంటుంది. అది గుర్తు వుండకుండా వుండాలంటే ఏంచెయ్యాలంటే, ఎదో ఒక కర్తవ్యంలో ఇమిడి వుండాలి. కర్తవ్యం ఏమిటంటే, మనకేవో పనులు వుంటాయి, అవి చేసుకోవడం. ఏవీ లేవనుకోండి సద్గ్రంధపఠనం చెయ్యండి, లేకపోతే సత్సంగానికి బయలుదేరండి. అలా చేస్తే అవి కూడా కర్తవ్యంలో భాగాలే! అక్కడా, ఇక్కడా, తన్నులో, తాపులో ఏవో తగుల్తూ వుంటాయి రోజూ. ఎక్కడికి వెళ్తున్నా కుక్కలాగే ఎక్కడో తగుల్తుంది దెబ్బ. తగిలితే, అది పట్టుకుని అలా ఆ దెబ్బను నాక్కుంటూ కూర్చోవడం కన్నా, ఒకసారి ఒక సత్సంగం చేసుకున్నాం అనుకోండి, అవన్నీ సమసిపోతాయి మనసుకి. అందుకని మహాత్ములు సత్సంగం రోజూ పెట్టుకున్నారు. ఎందుకంటే daily basis clean చేసుకోవచ్చు. మనకి మంచి విషయాలకి time వుండదు కాబట్టి వారానికి ఒకసారో, రెండు సార్లో, మూడు సార్లో పెట్టుకుంటున్నాం. ఎందుకు ఇది పెట్టుకుంటారంటే, on a daily basis, పొగ రాజుకోకుండా చూసుకుంటారు. నిప్పు రాజుకునేట్టు, పొగ కమ్ముకోకుండా ఉండేట్టు పెట్టుకుంటారు. అందుకని మాటి మాటికీ గురువు దగ్గరకి వెళ్ళినప్పుడు, గురువు ఏంచేస్తాడంటే, పొగ తీసేస్తూ ఉంటాడు. మళ్ళీ విసురుకునేట్టుగా చేస్తాడు. మళ్ళీ విసురుకోగానే పొగ తగ్గుతుంది, వెలుగు పెరుగుతుంది. విసురుకోవడం మానేస్తే పొగపెరుగుతూ వుంటుంది, వెలుగు తగ్గుతూ వుంటుంది. ఎంత పొగ బాగా కమ్మేస్తే అంత కృంగిపోతూ వుంటాం. ఎంత వెలుగు బాగా వస్తూవుంటే అంత ప్రజ్వలించి కర్తవ్యాలలో పనిచేస్తూ, ఇంకా ఏవన్నా మంచిపనులు చేద్దామా అని ఎదురు చూస్తూ వుంటారు. నిజంగా సాధకులు వారి యొక్క మంచి పనులని సంవత్సరం, సంవత్సరం పెంచుకుంటూ వుంటారు. చేస్తున్నటువంటి కార్యక్రమములు వ్యాప్తి చెందుతూ వుంటాయి ఎందుకంటే, గురుతత్త్వం పని చేస్తూ వుంటే, వ్యాప్తి వుంటుంది. ఎందుకంటే, గురువులో

'గ' అనే శబ్దం వుందిగా! మరి వాడు ఊరుకుంటాడా? నిజంగా గురువుని ఆశ్రయిస్తే వ్యాపనం ఎక్కువ అవుతుంది. ఏవిటి వ్యాపనం? అంటే ఆరేళ్ళ క్రితం మనం ఏం చేస్తున్నాం? ఇప్పుడు మనం ఏం చేస్తున్నాం? ఆరు నెలల క్రితం మనం ఏం చేస్తున్నాం? ఇప్పుడు మనం ఏం చేస్తున్నాం? ఆరు రోజుల క్రితం మనం ఏం చేస్తున్నాం? ఇప్పుడు మనం ఏం చేస్తున్నాం? అంతకంతకీ అడుగంటిందా లేదా పెరిగిందా అనేది, మనం తత్త్వంలో నిలబడ్డామా లేదా అనేది మనకి చూపిస్తూ వుంటుంది. తత్త్వంలో నిలబడలేకపోయాము అనుకున్నప్పుడు ఎక్కువ గురు సముఖానికి వెళ్తూ వుండాలి, కర్తవ్యాలు బోధిస్తుంటాడు గురువు. అంతేకానీ కూర్చుని పురాణ కాలక్షేపం చెయ్యడు. తన దగ్గరకి వచ్చినటువంటివాణ్ని కర్తవ్యోన్ముఖుణ్ని చేసేవాడే గురువు తప్ప, తనకి వచ్చినటువంటి విజ్ఞానాన్ని అలా వెదజల్లి, అవతల వాణ్ని దిగ్భ్రాంతి చెందించేవాడు గురువుకాదు. పండితులు వాళ్లకి వచ్చిన సమస్తాన్ని ఇతరులకి చూపించి, భయపెట్టి, దిగ్భ్రాంతిలో వుంచి, ఆశ్చర్యపరచి, ఇతడు గొప్పవాడు అనేట్టుగా వాడు ఒప్పుకునే పరిస్థితుల్లో వాణ్నిపెట్టి, పండితుడు అలా కూర్చుంటాడన్నమాట. అంతకుమించి ఏమీ వుండదు. గేటు దాటి వెళ్ళిన తరువాత ఏమి చేయాలో తెలీదు. నిజమైన గురువు దిగ్భ్రాంతి చెందించడు. పెద్దపెద్ద విషయాలతో బాధ పెట్టడు. జీవితంలో ఏంచెయ్యాలో చెప్తాడు. ఎవరి జీవితంలో వారు ఏం చేసుకుంటే ప్రశాంతతతో, స్థిరచిత్తంతో, ఆనందంగా ఈ సుఖదుఃఖాలు అనేటువంటి ద్వంద్వాలు దాటి జీవించగలడో అది చెప్తాడు. అది మనకి నచ్చదు. ఎందుకంటే అది చెయ్యాలి కదా! చెయ్యవలసినది చెప్పే గురువు నచ్చడు మనకి. అలా కాసేపు మెరుపు చూపించేస్తే అబ్బో! అనుకుంటాం వచ్చేస్తాం. ఆ తరువాత మనకీ ఏం పనుండదు, ఆయనకీ ఏం పనుండదు. కానీ సరైనటువంటి గురుశిష్య సాంప్రదాయంలో గురువు దగ్గరనుంచి శిష్యునకు దొరికేవి కర్తవ్యములు మాత్రమే. మరొకటి దొరకదు. ఎందుకంటే కర్తవ్యముల ద్వారా మార్గంలో నిలబెడతాడు. పోసుకోలు కబుర్లకి అవకాశం వుండదు. ఎంతెంత కర్తవ్యాలు మోస్తూ వుంటే ఇంకొంచం కర్తవ్యాలు అందిస్తూ ఉంటాడు. చిన్న చిన్న పనులు బాగా చేస్తూ వుంటే, ఇంకొంచం పెద్ద పనులు అప్పజెప్తారు. ఆ పనులు బాగా చేస్తే, ఇంకొంచెం బాధ్యతతో కూడిన పనులు అప్పజెప్తారు. ఆ బాధ్యత బాగా చేస్తూ వుంటే, సమాజంలో బాధ్యతతో కూడిన పనులు అప్పజెప్తారు, అవి కూడా బాగా చేస్తూ వుంటే, ఇంకా భూగోళానికి సంబంధించిన పనులు అప్పజెప్తారు. ఇలా పెంచుతూ వుంటారు. అందుకని వెలుగు పెరిగిన కొద్దీ బాధ్యత పెరుగుతూ వుంటుంది. బాధ్యతలోనే ఆనందం చూస్తాడు నిజమైన సాధకుడు. Responsibility is the source for rejoicing అన్నట్టుగా వుంటుంది. అంతేకానీ ఎగ్గొడితే ఆనందంగా వుంటాం అనేది ధూమ్ర మార్గం అయిపోతుంది. అడుగంటే మార్గం. బాధ్యత పడుతూ పెరగడం అనేటువంటిది, వెలుగుకి సంబంధించిన మార్గం. అందుకని తాను బాధ్యత పడి తద్వారా ఇతరులకి స్ఫూర్తినిస్తాడు. 'చూసావా,

నేను ఈ విధంగా బాధ్యత పడ్డాను, నువ్వు కూడా బాధ్యత పడు' అని చెప్పడు. 'నేను కూడా బాధ్యత పడాలి ఈయనలాగా' అని వాడికి అనిపించేట్టు తన యొక్క ప్రవర్తన వుంటుంది. అంటే కేవలం తన యొక్క ప్రవర్తన ద్వారా ఇతరులను ఉద్ధరించడం వుంటుంది తప్ప, తన యొక్క ప్రవచనాల ద్వారా కాదు. ఎప్పుడూ కూడా మనం ఎన్ని చెప్పినా, అవతలవాడు ఏం చేస్తాడో అది చేస్తాం తప్ప, అవతలవాడు ఏం చెప్పాడో అది చెయ్యం. ఇంట్లో తల్లిదండ్రులు ఏం చేస్తే పిల్లలు అది చేస్తారు. కదా! ఇంట్లో తల్లిదండ్రులు రోజూ ఓంకారం చేస్తే పిల్లలకి ఓంకారం చేసుకోమని చెప్పఖర్లేదు, automaticగా చేసేస్తారు. ఓంకారం జరిగే ఇంట్లో ఓంకారం జరుగుతుంది. పేకాట ఆడే ఇంట్లో పిల్లలు అదే ఏడవ సంవత్సరంనుంచీ పుచ్చుకుంటారు. అదే ఉపనయనం. ఉపనయనం అయ్యిందా? అంటే అయ్యిందని. అంటే ఏమిటంటే 52 ముక్కలుంటాయి, నాలుగు రంగులుంటాయి. ఒక్కొక్క రంగుకీ 13 ముక్కలుంటాయి అని ఉపనయనం అవ్వవు. కొన్ని ఇళ్ళల్లో అవుతాయి. ఇంకొన్ని ఇళ్ళల్లో వాడు పధ్నాలుగు ఏళ్లకే బజారున పడి, ఏదో రకరకాలైన అమృతాలు పుచ్చుకుంటూ ఉంటాడు. ఏవిట్రా? అంటే మా నాన్న పుచ్చుకున్నాడు అంటాడు. ఏది మనం చేస్తామో వాళ్ళు అది చేస్తారు కాబట్టి మనం ఏది ఆచరిస్తే వాళ్ళు అది ఆచరిస్తారు. మంచి ఆచరిస్తే మంచి ఆచరిస్తారు కాబట్టి గురువు, ఇలా చెయ్యండి, అలా చెయ్యండి అని చెప్పకుండా అలా-ఇలా చేస్తూ ఉంటాడు. చేస్తూ వుంటే చేసే వాళ్ళు చేరి, వాళ్ళు నేర్చుకుని, వాళ్ళకీ ఇది బావుందనుకుని చేసుకుంటూ వుంటారు. అది మార్గం. తను ఆచరించి తన ఆచరణయే ఇతరులకి బోధనగా అందించేవాడు ఆర్యుడు అన్నారు. ఆచార్యుడు అన్నారు. మన మాస్టరు గారిని తీసుకుంటే ఆయన ఆచార్యులు. ఎందుకు ఆచార్యులు అంటే, ఆర్య ధర్మాన్ని తాను ఆకళింపజేసుకుని, తాను ఆకళింపజేసుకున్నదాన్ని తాను ఆచరించడం, తాను ఆచరిస్తుంటే దాని చూసి ఇతరులు స్ఫూర్తి పొందే అంత చక్కగా ఆచరించడం. స్ఫూర్తి పొందాలని ఆచరించడం కాదు. అంటే మీరందరూ చూస్తారు కాబట్టి, బాహాటంగా చేయడం కాదు. ఆయన ఏదైనా చేస్తూ వుంటే, ఇతరులు తాను చేస్తూవున్న దానిలోని పరిపూర్ణతను బట్టి ఇతరులకు స్ఫూర్తి వస్తుంది తప్ప, డంబాచారంగా చేస్తే రాదు. చిన్న చిన్న విషయాలలో పెద్ద పెద్ద వాళ్ళు ఎలా ప్రవర్తించారో చూసి, నేర్చుకుంటూవుంటారు చిన్నవాళ్ళు. అందుకని చేసేది పరిపూర్ణంగా చేస్తారు తప్ప, ఇతరులు ఆచరించాలి అన్న భావనతో చెయ్యరు. ఇది మూడవ స్థితి. మొదటి స్థితి అవగాహన. రెండవ స్థితి ఆచరణ. మూడవస్థితి పరిపూర్ణమైన ఆచరణ, తద్వారా దానిలోంచి పుట్టే ఆకర్షణ. అదీ గురువులో వుండే ఆకర్షణ. ఏవిటి ఆకర్షణ అంటే, అతను చేసే పని యొక్క ఆకర్షణ. అది మూడో స్థితి. నాల్గవ స్థితి ఆ ఆకర్షణ వల్ల అలాగే తయారు చేసేవాళ్ళు పుట్టటం. ఈ నాలుగూ పూర్తయిన వాళ్ళని ఆచార్యుడు అంటాం. లేక ఆర్యుడు అంటాం. అతడూ గురువు అంటే! అలా తాను ఆచరిస్తూ, తాను ఆచరించినదే ఇతరులకి అందేట్టుగా పద్ధతిలో జీవించే గురువు ఏంచేస్తాడంటే, తన

దగ్గరకి చేరినవారికి, ఆత్మతత్వాన్ని దర్శనం చేయడానికి సమస్తమైనటువంటి సరంజామా అక్కడ చేరుస్తాడు, చేరిస్తే అప్పుడు వాడు మార్గమునందు నిలబడతాడు. మార్గమునందు నిలబడితేనే నిజంగా శిష్యుడవుతాడు. మార్గమునందు నిలబడనంతసేపూ శిష్యుడు కాదు. అందుకే మనకి ఈ భగవద్ తత్వాన్ని ఉపాసించడం ఒకటి వున్నది, అనుసరించడం ఒకటి వున్నది. గురువుని మనం ప్రశంసించుకుంటూ మేము ఆయన పార్టీ వాళ్లమండీ అని మన పనులు చేసుకుంటూ తిరగడం ఒక పద్ధతి వుంటుంది. ఒక emblem వుండక్కడ. ఏదో షిరిడీ సాయి emblem, సత్య సాయి emblem, EK emblem, ఇంకో emblem, ఇంకో emblem అలా మనకి బోలెడు మంది వున్నారు మహాత్ములు. నేనిది పెట్టుకుంటే మీ దగ్గరకి వచ్చినప్పుడు మీరు ఇది చూస్తారు ఓహో మీరు కూడా మాస్టారి శిష్యులా? అని ఆదరిస్తారు. అంటే మీ అర్హతతో సంబంధం లేకుండా మాస్టరు గారి మీద వున్న గౌరవం కొద్దీ మిమ్మల్ని ఆదరిస్తారు. తద్వారా మనకి పనులు అయిపోతూవుంటాయి. అది అనుసరణ మార్గం కాదు. అనుసరణ మార్గం ఏమిటంటే, గురువు చేసినది మనం చేస్తూ వుంటే అది అనుసరణ. గురువును ప్రశంసిస్తూ తద్వారా బహిర్గతమైన కార్యక్రమాలలో, మన లబ్ధి మనం పొందుతూ వుండడం అనేది ఉపాధి. కాబట్టి మనం ధామం కి వచ్చేసరికి ఏమౌతుంది అంటే గురుశిష్య సాంప్రదాయంలో శిష్యుడు మార్గంలో నిలబడతాడు. నిలబడడం అంటే, తన హృదయమునందు తాను నిలబడడం వలన తనకి ఒక అనంతమైన మార్గం గోచరిస్తుంది, దానికి ఎదురుగా వుండే ధ్యేయం కనిపిస్తూ వుంటుంది. ఆ ధ్యేయం దగ్గరకి వెళ్ళిన తరువాత అక్కణ్నుంచి ఇంకో ధ్యేయం కనిపిస్తుంది. అక్కణ్నుంచి ఇంకొకటి, అక్కణ్నుంచి ఇంకొకటి, అప్పుడు ఈ మార్గం అనంతం అని తెలుస్తుంది. ఆ అనంతుడిలో తాను ఎలా జీవించి ఉన్నాడో తెలుస్తుంది. తెలిసి మొత్తం అంతా మార్గంలో పైనుంచి కింద వరకూ కూడా పాము పడగ నుంచీ, పాము తోక వరకూ పొరలు పొరలుగా, పూసలు-పూసలుగా ఎలా వుంటుందో అలా లోకాలన్నీ అమరి వున్నాయి. అన్నిటికీ ఒకే దారి. అదే తాను-నేనూ అనే వెలుగు అనేటువంటి దారి. ఆ దారిలో తాను నడుస్తున్నాడు, తాను కూడా అదే అని తెలుస్తుంది. అందుకనే, తానే మార్గం అని తెలుస్తుంది. అంటే దండ వుందనుకోండి, దండలో ప్రతీ పువ్వు ఒక భాగమే కదా! ఒక పువ్వు తీసేస్తే? దండ దండ గా కనిపించదు కదా! మార్గంలో వెళ్తూవుంటే మనకి ఎక్కడైనా గండి పడిందనుకోండి మార్గం అనం కదా. అలా ఈ అనంతమైన సృష్టిలో అందరం కూడా అందులో భాగంగా, మార్గంగా వున్నాం. మనకి సంబంధించిన slot లో అంటే గడిలో వున్నాం. అలా ఆదిశేషుని యొక్క తల నుంచి తోక వరకూ అందరం దాంట్లో నిలబడి ఉండడం వలన ఇవన్నీ ఒకదానితో ఒకటి, ఒకదానితో ఒకటి link up అయిపోయి వున్నాయి. మట్టి నుంచి చెట్టు, చెట్టు నుంచి జంతువు, జంతువు నుంచి మనిషి, మనిషి నుంచి దేవతలు, దేవతలనుండి వసువులు, వసువుల నుంచి రుద్రులు, రుద్రుల నుంచి ఆదిత్యులు,

ఆదిత్యుల నుంచి అలా ఒకదాన్ని మించి ఒకదాన్ని మించి ఒకటి మార్గంగా ఉంటుందన్నమాట. ఈ మార్గం అంతా కూడా తానే అని తెలుస్తుంది. తెలిసి ఈ వెలుగు దారిలో తను నిలబడి తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటాడు. భగవంతుణ్ణి తెలుసుకున్న తరువాత ఇంక పనేం వుండదు అని అనుకోకండి, భగవంతుణ్ణి తెలుసుకోవడం వలన ఆ మొత్తంలో తన పనేమిటో తనకి తెలిసి వుంటుంది. తన పని తన వంతుగా తను చేస్తూ ఉంటాడు. చేస్తూ ఆయనయందు శాశ్వతుడై నిలిచి ఉంటాడు. అదీ ఈ మూడు నామాలకీ వుండే అవగాహన. ఇది బాగా నెమరు వేసుకోండి. ఇది చాలా పవిత్రమైన సాధన మార్గం. ఇది ఎంత నెమరు వేసుకుంటే మనకు అంత మంచి జరుగుతుంది. మార్గంలో నిలబడడానికి అవకాశం ఏర్పడుతుంది.

## 220 సత్యః

సత్యము భగవంతునికి ఒక పేరు. ఉన్నది సత్యం అంటాం. ఏమిటి ఉన్నది అంటే అన్నింటిలో ఉన్నది. దానిపైన మనం ఏర్పరచుకున్న భావాలన్నీ కూడా మారుతూ ఉంటాయి. ప్రతి మనిషి రూపం మనకు ముందు సత్యంగా కనిపిస్తుంది ఎందుకంటే మొదట మనకు కనిపించేది భౌతికంగా శరీరం. కానీ దానికి మార్పులు ఉన్నాయి, దానికి హాని వృద్ధులు ఉన్నాయి. కాబట్టి హాని వృద్ధులు ఉన్న శరీరం తాత్కాలికంగా ఉండేది కాబట్టి, దానికన్నా ఇంకొంచెం ఎక్కువ కాలపరిమితిలో ఉండే తత్వం ఏమిటి? స్వభావం! శరీరం మారినంత త్వరగా స్వభావాలు మారవు. మనుషుల్లో ఈ స్వభావం మారడం కోసమే మనం ఆధ్యాత్మిక సాధన చేసుకోవడం అనేది జరుగుతున్నది. సత్యం గోచరించకపోవడం, సత్యం గోచరించడం రెండూ స్వభావం కారణంగానే జరుగుతుంది. దైవీ స్వభావం కలిగి ఉన్నట్లయితే మనకు సత్యం గోచరిస్తుంది. ఆసురీ స్వభావం కలిగి ఉన్నట్లయితే సత్యం గోచరించదు. "అహమస్మి" నేను ఉన్నాను అనేది సత్యం. ఈ నేనుగా ఉన్న తత్వం ఏదైతే ఉన్నదో అది ఎప్పుడూ ఉంటుంది. అది చైతన్యవంతం అవుతూ ఉంటుంది. చైతన్యవంతమై ఆ తర్వాత మనసు అనే పరిధిలోకి దిగి వస్తుంది. అక్కడ నుంచి ఇంద్రియముల ద్వారా వ్యక్తమవుతూ ఉంటుంది. మన శరీరం ద్వారా వ్యక్తమౌతుంది. మన వాక్కు ద్వారా వ్యక్తమౌతుంది. ఈ వ్యక్తమైన వాటన్నిటికీ కూడా మూలము సత్యం. మనలో జరిగే వాక్కు ఏదైతే ఉన్నదో దానికి రెండు పొయలుగా మనలో ఒక చైతన్య స్రవంతి జరుగుతూ ఉంటుంది. ఒకటి ఆలోచన వచ్చి ఆ ఆలోచన ఒక భావంగా మారి ఆ భావానికి, ఒక భాష ఏర్పరచుకొని, ఆ భాషను వాక్కుగా మాట్లాడుతూ ఉంటాం. ఈ వాక్కు ఆధారంగా మనలో నిశ్వాస ఉన్నది. నిశ్వాస లేకపోతే మాటరాదు. ఆ నిశ్వాసకు ఆధారంగా ఉఛ్వాస ఉన్నది. ఉఛ్వాస నిశ్వాసులుగా శ్వాస పనిచేస్తూ ఉంటుంది. మాట్లాడే మాటల కన్నా శ్వాస ఎక్కువ నిత్యం. శ్వాస కన్నా శ్వాసను నడిపించే స్పందన ముఖ్యం. కాబట్టి స్పందనం శ్వాస కన్నా ఎక్కువ నిత్యమైనది. శ్వాసను మనలో ఎవరు నిర్వర్తిస్తున్నారో, ఈ ఆలోచనలు ఎక్కడి నుంచి మనకు పుట్టుకు వస్తున్నాయో, ఆ కేంద్రమే మనలో సత్యమైన విషయం. అది ఎప్పుడూ ఉంటుంది. అది విశ్వమంతా వ్యాపనం చెంది ఉన్నటువంటి తత్వం. మనకు దైవీస్వభావం లేకపోవడం వల్ల దానిని మనం గుర్తించలేము. ఆసురీ స్వభావం కలిగి ఉండటం వలన గుర్తు లేక పోతుంది. స్వభావం అంటే స్వంతం చేసుకునే స్వభావం కలిగి ఉండటం అంటే ఇది నా ఇల్లు, నా భార్య, నా పిల్లలు, ఇది నా ఆస్తి ఇట్లా అనుకునేవాడు ఆసురి స్వభావం కలిగి ఉన్నట్లుగా పెద్దలు చెప్తారు. నా భార్య, నా ఇల్లు, నా పిల్లలు, నా ఆస్తి, నా నా అనేది ఏదైతే ఉన్నదో అది మొదటి అచ్చు తప్పు. సర్వము భగవంతునిది అని గుర్తుండాలి. నా శరీరము అనుకోవడానికి వీల్లేదు. భగవంతుడు ఇచ్చినటువంటి

శరీరం, భగవంతుడు ఇచ్చినటువంటి ఇంద్రియములు, భగవంతుడు ఇచ్చినటువంటి మనసు, భగవంతుడు ఇచ్చినటువంటి శ్వాస, భగవంతుడు ఇచ్చినటువంటి స్పందనము. అంతా సమస్తము భగవంతునిదే! మనని వినియోగించుకుని ఆనందము చెందమని తానే మనగా దిగివచ్చాడు. ఒక పెద్ద నేను చిన్న చిన్న నేనులుగా తయారై తానే అనుభూతి చెందడానికి దిగి వచ్చాడు. కాబట్టి ఈ సమస్తానికి యజమాని భగవంతుడు అని గుర్తుండాలి. తనది అనుకున్న వాళ్ళందరూ కూడా ఆసురీ స్వభావము కలిగి ఉండి, తనది చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. తనది చేసుకోవడానికి ప్రయత్నం చేయడం అక్రమం. తనది కాదు ఏదీనూ. సమస్తము భగవంతునిది. భగవంతుడు తానే పరమ పురుషుడిగాను, పరా ప్రకృతిగాను ఏర్పడి ప్రకృతి పురుషుల యొక్క క్రీడగా ఈ సమస్త సృష్టిని తయారు చేసుకుని అన్నిటియందు వారిద్దరూ నివసించి ఉన్నారు. ఒకరేమో అందులో ఉండే సత్యముగాను మరొకరేమో దానికి వాహిక గాను. కాబట్టి ఈ మొత్తం అంతా వారిది. కాబట్టి తల్లిదండ్రులది. దానికి మనం సుతులమై దీనిని అనుభవిస్తున్నాం అన్నమాట. తల్లిదండ్రుల ఆస్తి అనుభవిస్తున్న పుత్రుడు ఏ విధంగా భావన చేసుకోవాలో మనం కూడా మన దగ్గర ఉన్నటువంటి సమస్తము ఆ విధంగా భావన చేసుకోవాలి. అంటే మనలో ఉన్న బుద్ధి భగవంతుని యొక్క బుద్ధి. మనలో ఉన్న మనసు, ఇంద్రియములు, శరీరము ఇంకా మిగతావన్నీ అంతర్గతంగా ఉన్నవీ ఆయనవే! బహిర్గతంగా ఉన్నవి కుటుంబం, భార్యాబిడ్డలు, ఇల్లు వాకిలి, ఆస్తి, ఉద్యోగము ఇవన్నీ కూడా భగవంతునివే అని గుర్తున్నవాడు దైవీ స్వభావం కలిగినటువంటి వాడు. ఇచ్చినప్పుడు భగవంతుడు ఇచ్చినట్లు భావన చేసుకుంటే, పుచ్చుకున్నప్పుడు అంటే వెళ్ళిపోయినప్పుడు భగవంతుడే తీసుకువెళ్లాడని భావన చేసుకుంటాడు. ఎవరైనా ఒకరు మన దగ్గర ఒక వస్తువుగాని, ఒక మనిషిని గాని, కొంత ఆస్తి గాని అప్ప చెప్పి వెళ్లారు అనుకోండి. అప్పజెప్పి వెళ్ళిన దాన్ని మళ్ళీ తీసుకొని వెళతారని మనకు గుర్తుంటుంది కదా! అట్లాగే మనకు మనుషుల్ని అప్ప చెప్పాడు భగవంతుడు. వారే మనం ఎరిగిన కుటుంబ సభ్యులు. అలాగే మనకు ఆస్తులను, శరీరాన్ని అప్పజెప్పాడు. సమస్తము మనకు ధర్మకర్తగా ఉండేట్లుగా అప్పజెప్పాడు నమ్మకం కొద్దీ. అలా ఉంచినప్పుడు మనం దానియందు ఏ విధంగా ప్రవర్తించాలి ? ధర్మకర్తగా ప్రవర్తించాలి. ఆయన ఆస్తి చెడకుండా చూడాలి అంటే ఆయన చేత అప్పజెప్పబడిన స్త్రీని జాగ్రత్తగా చూసుకుని ఆమె వృద్ధి పొందే లాగా చూసుకోవాలి. ఆమె చే కలిగిన సంతానం కూడా ఆయన ఇచ్చినదే కాబట్టి సరైన భావములతో పెరిగేట్లుగా చూసుకోవాలి. ఆయన ఇచ్చిన సంపద, ఆయన గురించి వ్యయం చేసి వినియోగం చేసే పద్ధతుల్లో ఆయనకే సమర్పణగా సమస్తమును నిర్వర్తిస్తూ ఉండాలి. ఇల్లు మనది అనుకోకూడదు, ఆయన ఇస్తాడు మనం ఉంటున్నాం కాబట్టి ఆయన పనులకు ఎక్కువ వాడాలి. అలాగే ఉద్యోగం కూడా ఆయన ఇస్తాడు కాబట్టి ఆయన పనులకు ఎక్కువ వాడాలి. మా నాన్నగారు ఆ విధంగా వాడారు ఉద్యోగాన్ని.

ఆయనకు ఉద్యోగం ముందు రాలేదు అన్నారు. రాలేదంటే మూడు రోజులపాటు నిద్రాహారాలు మానేసి రామనామం చేసుకుంటూ కూర్చుండి పోతే మళ్ళీ ఉద్యోగం వచ్చింది. ఎట్లా వచ్చింది అంటే, మీ పేరు వ్రాయబోయి పొరపాటున ఇంకొకరి పేరు వ్రాశాము, అందుకని మీకు ముందు రాలేదని వచ్చింది కాగితం ఇప్పుడు వచ్చిందని వచ్చింది కాగితం అన్నారు. కాబట్టి ఆయన నమ్మకం రాముడే తనకు ఈ ఉద్యోగం ఇచ్చాడు అని తను నిర్వర్తించిన సమస్త కార్యక్రమములు, ఉద్యోగము ద్వారా కూడా రాముని పేరున నిర్వహించాడు. రాముడి ఇచ్చిన ఉద్యోగం కాబట్టి రామునికి కైంకర్యముగా రామునికి సేవగా ఉద్యోగాన్ని నిర్వర్తించారు. అట్లాగే ఇతరమైన వృత్తులు చేసుకోవచ్చు. సమస్తము ఆయనది. ఆయన ఆధీనంలో ఉంచి చేసుకున్న వాళ్లు దైవీస్వభావం కలిగి ఉంటారు. తనవి అనుకునే వారు ఆసరి స్వభావము కలిగి ఉంటారు. ఆసురీ స్వభావం కలిగి ఉన్న వారికి సత్యం గోచరించదు. ఉన్నదానికి ఇంకొకటి కనిపిస్తూ ఉంటుంది. ఎందుకంటే తనది కానిది తనది అనుకోవడంలోనే ఉన్నది మొత్తం అంతా. ఉన్నది సత్యం అని అంటారు జగన్మిథ్య అని చెప్తారు. ఏ జగత్తు మిథ్య ? మనం చూసే పద్ధతిలో ఉన్నది మిథ్యంతా. ఈమె నా భార్య అని అనుకుంటే అది మిథ్య. మిథ్య అంటే భ్రమ. ఈమె నా భార్య అంటే మొత్తం ఒక స్త్రీ శరీరంలో దేన్ని చూసి ఈమె నా భార్య అని చెప్పగలరు ? అది నీకు ఆమెకు ఉన్న పవిత్రమైన సంబంధం తప్ప అంతకుమించి ఆమె కూడా భగవంతుని యొక్క అస్తిత్వమే అని గుర్తు ఉండాలి. నీవెంత భగవంతుని యొక్క అస్తిత్వమో ఆమె కూడా అంతా భగవంతుని యొక్క అస్తిత్వం అని గుర్తు ఉండాలి. వీరు నా పిల్లలు అనుకున్నప్పుడు కూడా భగవంతుని యొక్క అస్తిత్వమే ఈ రూపంలో మన దగ్గర ఉన్నదని గుర్తించాలి. అన్నిటియందు అసలు ఎవరు ఉన్నారు అని గుర్తించినట్లయితే, అసలుగా ఎవరు ఉన్నారో దానిమీద పొరలు పొరలుగా బట్టలు వేసినట్లుగా, ముసుగులు వేసినా ముసుగుల లోపల ఉన్న వాడిని చూడగలిగిన వాళ్ళని దైవీస్వభావం కలిగిన వారు అంటారు. ముసుగులు మాత్రమే చూసి అసలు విషయం చూడని వాళ్ళు మోసపోతారు అందుకని ఈమె భగవంతుని యొక్క స్వరూపము నాతో భార్యగా ప్రవర్తించడానికి వచ్చింది. వీళ్ళు భగవంతుని యొక్క స్వరూపము నన్ను తండ్రిగా భావన చేసుకుంటూ పెరిగే పద్ధతిలో వీళ్లు ఉన్నారు. అట్లాగే అన్ని విషయములయందు. మన ఇంట్లో కుక్క ఉన్నా, ఆవు ఉన్నా కూడా అంతే! ఆ రూపంలో మన ఇంట్లో భగవంతుడు మనకు అప్పచెప్పినట్లు చూసుకోవాలి. ఏమున్నా అంతే! మనతో ప్రవర్తించడానికి భగవంతుడు ఏర్పరిచిన ఒక సన్నివేశం కాబట్టి ఆ విధంగా ప్రవర్తించడంలో మరపు లేకుండా ఉన్నవాడు సత్యాన్ని ఎప్పుడూ దర్శిస్తూ ఉంటాడు. అట్లా దర్శిస్తే ఈ మొత్తం అంతా ఉన్నది ఆయనే అని తెలుస్తుంది అదీ నిజమైన సత్యం! ఆ సత్యం ఎవరికైతే గుర్తుంటుందో వారు ఈ సత్యస్వరూపుడైన భగవంతుని దర్శనం చేయడానికి వీలుపడుతుంది. తాను జీవునిగా దేవుని యొక్క అంశ అని గుర్తుపెట్టుకుని, సమస్తము

తనకు భగవంతుని చేత ఇవ్వబడినది అని గుర్తుపెట్టుకుని తనకు ఇవ్వబడిన దానిని భగవత్ కైంకర్యంగా వాడుతూ ఉండాలి.

కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేష సాయికి మొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని చింతించు దినము దినము
చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పడి గురువు
తండ్రి! హరిజేరుమనియెడి తండ్రి తండ్రి.

అని చెప్తాడు ప్రహ్లాదుడు. ఈ చేతులతో పనిచేస్తుంటే అది భగవత్ కైంకర్యముగా చేయాలి. అప్పుడు చేతులు చాలా పవిత్రంగా ఉంటాయి ఆ చేతులతో ఎవరినైనా ముట్టుకుంటే వాళ్లకు ప్రశాంతత, ఆరోగ్యము అవి వస్తాయి. అసలు చేతులే బాలేవనుకో... చేతులు బాలేవంటే తెల్లగా ఉన్నాయా నల్లగా ఉన్నాయా అని కాదు అక్కడ point. ఏ పని చేస్తున్నా భగవంతుని అర్చించుకుంటున్నాం అనే భావనతో చేస్తే అది భగవదార్చనే! అవీ కమలాక్షునర్చించు కరములు కరములు! భగవంతుని పని వేరే ఏదో ఉందనుకొని కొన్ని భగవంతుని కార్యాలని చేస్తూ కొన్ని మనం సొంతానికి చేసుకోవడంలోనే ఉంది మొత్తం మోసం అంతా కూడా. ఎంత చేస్తున్నావ్ భగవంతుని కార్యం, ఎంత నీ కార్యము చేస్తున్నావు అని చూస్తే ఏదో 10% ఆయన కార్యం గాను మిగతా 90% మన కార్యం గాను జరుగుతుంటాయి కదా మనకు. అంటే 90% నువ్వు భ్రమలో ఉన్నట్లే!

శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ...

ఎవరినైనా మనం పొగిడితే వాడిలో ఉండే కళ్యాణ గుణాలను చూసి అవి భగవంతుడి యొక్క అస్తిత్వంగా భావన చేసి పొగడ్త చేయాలి. శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ అంటే...నేను ఊరికే విష్ణు స్తోత్రాలు చేస్తాను, సహస్రనామమే చదువుతాను మిగతా అప్పుడు మాట్లాడను అంటే He is not a yogi. జీవితంలో మనము యోగిగా

జీవించాలి. అంటే ప్రకృతి పురుషులు ఇద్దరికీ సమమైన అవగాహన కలిగి ఉండాలి. తల్లిదండ్రుల ఇద్దరి యందు సమమైన ఆదరణ కలిగిన వాడు యోగి. తండ్రి యందు ఎక్కువ ఆదరణ కలిగి తల్లి యందు ఆదరణ లేనివాడు ప్రపంచానికి అంత ఉపయోగపడని జ్ఞాని. తనకు తెలుసు తానేమిటో కానీ ప్రపంచానికి ఉపయోగం ఏమీ లేదు ఆయన వలన. తండ్రిని ఎరుగక కేవలం తల్లే తెలిసి తండ్రి లేడనుకునే వాళ్ళు కొంతమంది ఉంటారు. వాళ్ళని విధవ కొడుకులు అంటారు. Widow's sons అంటారు. తండ్రిని గుర్తించని వాళ్లంతా విధవ కొడుకులే! వాళ్లు తండ్రిని గుర్తించరు. తండ్రంటే జగన్నాథుడు! 'జగద్గురుర్జగన్నాథో వేణునాద విశారదః' కదా! జగన్నాథుని గుర్తిస్తే మనం కుమారులం అవుతాం. లేకపోతే మనం కుమారులం, కుమారీలము కాదు. కుమారుడు /కుమారి ఎప్పుడు అవుతారంటే, ఎప్పుడూ తండ్రి ఉన్నాడు అని గుర్తు ఉన్నప్పుడు. వాళ్లనే అన్నారు The son of God అని, దైవ కుమారులు అని. అలా గుర్తుపెట్టుకుని పనిచేసుకుంటూ ఉండాలి. 'సుర రక్షకుని చూచు చూడ్కులు చూడ్కులు' అన్నప్పుడు మనం అందర్నీ చూస్తూనే ఉన్నాం. అందరిలోంచి వాళ్ళ కళ్ళల్లోకి చూస్తున్నాం. వాళ్ల కళ్ళల్లోంచి వాళ్లలో ఉన్నటువంటి వెలుగు మనకు కనిపిస్తూ ఉంటుంది కాబట్టి చూసేటప్పుడు 'సురరక్షకుని చూస్తున్నాం' అంటే భగవంతుడ్నే చూస్తున్నాం అని ఉండాలి. ఫలానా వారిని చూస్తున్నాం, వీరిని చూస్తున్నాం అని అనుకోవడం వలన ఆ చూపులు వ్యర్థమైనటువంటి చూపులు అవుతాయి. ఈ పద్యం సత్య దర్శనానికి చాలా దగ్గర దారి. చేతులతో చేసే పనులు, నాలుకతో చేసే పనులు, కళ్ళతో చేసే పనులు, చెవులతో చేసే పనులు, పొద్దున లేచి సాయంత్రం వరకు చేసే పనులన్నీ కూడా నీకోసమే చేస్తున్నానయ్యా నువ్వే కదా ఇన్ని రూపాలలో ఉన్నావ్. అంటే ఏం చేసినా కూడా నీతోనే కదా నాకు పని... కాబట్టి నేను చేసేదంతా నీ సేవ అనే భావనలో ఉంటే, సత్యముగా ఏదైతే ఉన్నదో అది మనకు నిత్యముగా మిగిలి కనిపిస్తుంది. అది తప్ప మిగతా అన్ని మారుతూ ఉంటాయి. సత్యం ఒక్కటే ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి ఆ సత్య దర్శనం మనకు జరగాలి. సత్యం అనే నామాన్ని ఆ విధంగా భగవంతుని యొక్క నామంగా మనం గుర్తించాలి. అందరిలో ఉన్నాడు. రాయిలో ఉన్నాడు. రాయి ఉన్నది అంటే భగవంతుడు ఉన్నాడని అర్థం. చెట్టు ఉండటం అంటే భగవంతుడు ఉండటమే! భగవంతుడే జంతువుగా ఉండటం. మనిషి ఉన్నాడు. ఏదైనా ఉన్నాడంటే వాడు ఉన్నాడని అర్థం. ఎప్పుడూ ఉండేవాడు రకరకాల వేషాలు వేసుకుంటూ ఉంటాడు మనం రోజుకో dress వేసుకున్నట్లు. కాబట్టి ఇన్ని రూపాలలోనూ ఉండేవాడు ఒక్కడే అని ఎప్పుడైతే గుర్తుంటుందో అది సత్యం అని తెలుస్తుంది. అట్లా దర్శనం చేసుకుంటూ ఉంటే సత్యదర్శనం అవుతుంది. ఆ విధంగా మనం చెట్టు పుట్ట అన్నిట్లో కూడా ఉండే వాడిని ఎప్పుడు గుర్తుపెట్టుకుంటూ ఉంటే వాడు నెమ్మదిగా మనకు దగ్గరవుతాడు. కేవలం మనం గుర్తుపెట్టుకోవడం ద్వారా దగ్గరవుతాడు ఇంకో పద్ధతిలో అసలు దగ్గర అవ్వడు. కొన్ని

చూసి కొన్ని చూడకపోతే. ఎన్నిట్లో చూస్తున్నావో అంతవరకు సత్యం ఎన్నిట్లో చూడటం లేదో అంతవరకు అసత్యం.

## 221 సత్యపరాక్రమః

ఈ నామములో సత్యము ఉన్నది, పరాక్రమము ఉన్నది. పరాక్రమంలో మళ్లీ మూడు పదాలు ఉన్నాయి. క్రమము, ఆక్రమము, పరాక్రమము. పరాక్రముడు పర+ ఆ+ క్రమః. ఇట్లా మూడు పదాలు ఉన్నాయి. పద్ధతి ప్రకారం జరిగేదాన్ని క్రమము అంటారు. నది ఒక పద్ధతి ప్రకారం ప్రవహిస్తుంది. విద్యుత్ ఒక పద్ధతి ప్రకారం ప్రవహిస్తుంది. జంతువు ఒక పద్ధతి ప్రకారం ప్రవర్తిస్తుంది. చెట్టు ఒక పద్ధతి ప్రకారం ఫలాలను ఇస్తూ ఉంటుంది. మనిషి కూడా ఒక పద్ధతి ప్రకారం ఉండాలి. కాని ఏ పూట ఎట్లా ఉంటాడనేది వాడికే తెలియదు. ఈ క్రమం అందరికీ ఉంది ఒక్క మనిషికి తప్ప. వీడికి అన్ని ఆక్రమించాలనే యావ! మిగతా వాటికి ఆక్రమించాలనే యావ వుండదు. దాని పద్ధతి ప్రకారం అది ఉంటుంది. ఆక్రమించడం అంటే ఏమిటి? స్వంతం చేసుకోవడం. మనది చేసుకోవడం తద్వారా వాడు లేకుండా మనం ఉండటం అన్నమాట. లేదంటే వాడు మనకు వశుడిగా ఉండటం అన్నమాట. ఆక్రమణం. ఈయన కూడా ఆక్రమిస్తాడు. మనం ఆక్రమిస్తున్నామట అంటే ఆక్రమించే బుద్ధి మనకు ఎక్కడ నుంచి వచ్చిందీ అంటే ఆయన ఆయన దగ్గర ఉంది కాబట్టి వచ్చింది. కాకపోతే ఆయన అక్రమించే పద్ధతికి మనం ఆక్రమించే పద్ధతి బోర్లా వేసినట్లు ఉంటుంది. పర ఆక్రమము అంటే పరులను ఆక్రమించడం. పరులను ఆక్రమించడం పెద్దవాళ్లు చాలామంది చేస్తూ ఉంటారు. ఎంతసేపూ పక్కవాళ్ళను మన గుప్పెట్లో పెట్టుకుని ఉండాలని point ఒకటి ఉంటుంది. ఆస్తులు , మనుషులు మన వశంలో ఉండాలి. అన్నీ మన వశంలో ఉండాలి అనే ఒక భావన మనలో జరుగుతూ ఉంటుంది. ఆ భావన సత్య పరాక్రమం అవ్వదు ఇంకొక పరాక్రమం అవుతుంది. అక్కడ వశం చేసుకోవడం ఉంటుంది తప్ప సహజంగా ఆక్రమించడం అనేది జరగదు. కాబట్టి క్రమముగా ఉండే వాళ్ళు ఆక్రమించే పద్ధతి ఒకటి ఉంది. ఆక్రమించడంలో కూడా పరులను కూడా ఆక్రమించే ఒక పద్ధతి ఉన్నది. పరులను ఆక్రమించడంలో కూడా సత్యముగా ఆక్రమించడం అనే పద్ధతి ఒకటి ఉన్నది. సత్యముగా పరులను ఆక్రమించినటువంటి వారంతా కూడా సత్యపరాక్రములు అవుతారు. భగవంతుడు ఆ విధంగా ఉంటాడు. సత్యపరాక్రమం అంటే అది మనం మహాత్ముల వద్ద చూస్తాం. మహాత్ముల దగ్గర ఇతరులు వారంతట వారు వచ్చి చేరుతారు. రమ్మని వారేమీ అడగరు. అట్లా వాళ్ల చుట్టూ చేరి, వాళ్ల దగ్గర ఉండి, వాళ్లకు వశం అయిపోతూ ఉంటారు. మహాత్ముల వద్ద వశం చేసుకోవడం ఉండదు. అలా రాముడికి, కృష్ణుడికి వశమైన వాళ్ళున్నారు. అలాగే మహాత్ములకు వశమై తమను తాము ఉద్ధరించుకుంటున్న వాళ్ళు చాలామంది మనకు కనిపిస్తారు. వీరందరూ ఏ విధంగా ఉన్నారంటే వీరందరినీ సత్యము చేత వాడు ఆక్రమించి ఉన్నాడు. సత్యము చేత ఈరోజున 5000

సంవత్సరములు అయినా సరే కృష్ణుని నామము చాలామందిని ఆక్రమించి ఉన్నది. ఇక అంతకన్నా మనసులను గెలవడం ఏమున్నది? రాముడు దాదాపు కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఈ భూమి మీద నడిచి వెళ్లిన వాడు. కానీ ఎంతమంది హృదయాలని ఆయన ఆక్రమించి ఉన్నాడు. ఎందుకని సత్య పరాక్రముడిగా చెప్తారంటే ఈ భూమి ఉన్నంతకాలం కూడా రాముడిని మరిచే పరిస్థితి లేదు. రాముడు ఆ విధంగా అందరినీ కూడా ఆవహించి ఉన్నాడు. రాముడికి వశమై జీవులు ఉన్నారు. రాముడు ఎవరినీ వశం చేసుకోలేదు. కృష్ణుడు ఎవరినీ వశం చేసుకోలేదు. వారు దేహమునందు లేకపోయినప్పటికీ కూడా వారికి వశమై ఈరోజుకి కూడా జీవులు ఉన్నారు. క్రీస్తు 2000 సంవత్సరాల క్రితం ఎక్కడో తను చేసినటువంటి సత్య బోధనము, సత్య ప్రవర్తనము కారణంగా ఈరోజున భూమి మీద దాదాపు 80 శాతం ప్రజలు క్రైస్తుకు వశులై ఉన్నారు. ఎవరూ నిర్బంధించి పెట్టినది కాదు. నిర్బంధిస్తే నిలబడదు. అందుకని మహాత్ముల యందు మనం ఈ సత్య పరాక్రమాన్ని బాగా దర్శించాలి. కేవలము వారు సత్యము నందు నిలబడటం వలన ధర్మము నందు నిలబడటం జరుగుతుంది. సత్యము నందు నిలబడడం అంటే ఉన్న దానిని ఎప్పుడూ గమనిస్తూ ఉండటం! ఏమిటి ఉన్నది? భగవంతుని యొక్క తత్త్వము! శాశ్వతంగా ఎప్పుడూ సృష్టి యందు, సృష్టికి అవతల, సృష్టి పుట్టినప్పుడు, సృష్టి వృద్ధి పొందినప్పుడు, సృష్టి లయమైనప్పుడు కూడా ఉన్నటువంటి తత్త్వము నందు తాను స్థిరపడినవాడు సత్యదర్శనుడు. ఆ విధంగా ఉన్నటువంటి వారి నుంచి సత్యమే ప్రవహించడం వలన, ఇతరుల యందు ఉన్నది కూడా సత్యమే కాబట్టి వారు వీరికి వశులై పోతుంటారు. వశీకరణమేమీ ఉండదు. మీరు పుట్టపర్తి వెళ్లారనుకోండి. ఎంతోమంది పెద్ద పెద్ద రాజకీయ నాయకుల దగ్గర నుంచి, అధికారుల దగ్గర నుంచి తెల్లవారుజామున లేచి అక్కడ చలైనా, ఇసకైనా, మట్టైనా అక్కడ కూర్చుంటారు, ఎప్పుడో దర్శనమిస్తారు అంటే. ఎవరైనా కూర్చోమని చెప్పారా? పుట్టపర్తి రండి మీరు, మీరు వస్తే గాని నాకు కుదరదు అని చెప్పారా? లేదుగా! అయినా వెళ్లి ఎందుకు కూర్చుంటారు? ఆయన్ని చూడడం కోసం ఇన్ని వందల దేశాల నుండి వచ్చి అట్లా పడిగాపులు కాసి చూసి, మళ్లీ అన్నం తిని మళ్లీ చూడటానికోసం కూర్చుని, మళ్లీ పడుకుని, మళ్ళీ లేచి కూర్చుని-- ఎందుకు? రమ్మని ఎవరైనా అడిగారా? తిరుపతి వేంకటేశ్వర స్వామి మీరు రాకపోతే నాకు కుదరదు అని చెప్పాడా? అలా ఎంతసేపు పడిగాపులు కాస్తామండీ! అట్లాగే మాస్టర్ గారిని తీసుకోండి. ఈ రోజున ఎన్ని చోట్ల ఎన్ని హోమియో వైద్యాలయాలు వాటంతట అవి నిర్వర్తింపబడుతున్నాయంటే, అక్కడ నిర్వర్తించే వారందరినీ కూడా ఆయన ఆక్రమించి ఉన్నారు. కాబట్టి అవి నడుస్తున్నాయి తప్ప, లేకపోతే నడవవు. ప్రతి ఒక్కరికి వారిలో ఉన్న స్ఫూర్తి మాస్టర్ E.K! వైద్యం చేయండి, విద్య చెప్పండి, సహాయం చేయండి, ఏదైనా చేయండీ, ఒక గురువు ఒక శిష్యుని ద్వారా అట్లా పనిచేస్తూ ఉంటాడు. అక్కడ ఆక్రమణ ఎట్లా ఉంది అంటే వశం చేసుకోవడం అనేది లేకుండా వశులైపోవడం

ఉన్నది. అదీ సత్య పరాక్రమం అంటే! వశం చేసుకున్నచోట విముక్తి కోసం ఎప్పుడూ ఒక ప్రయత్నం ఉంటుంది. విముక్తిని కోరకుండా తమను తాము పరిపూర్ణంగా సమర్పణ చేసుకుంటూ ఉంటారు సత్యపరాక్రమము గలవారికి. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, క్రీస్తు, షిరిడి సాయి, సత్యసాయి, మాస్టర్ గారు ఇట్లా ఎంతోమంది మహాత్ముల నుండి ఎవరు పనిచేస్తున్నారు ? ఎవరు పనిచేయడం మూలంగా ఇంతమంది వశులై ఉన్నారు ? ఆయనని 'జగద్గురువు' అంటారు. అదీ World Teacher అంటే! పేర్లు ఎన్నైనా ఉండొచ్చు. రూపాలు ఎన్నైనా ఉండొచ్చు. ఎవరికైతే మనకు మనం స్వచ్ఛందంగా అర్పణ చేసుకుంటామో ఆయనని జగద్గురువు అంటారు. ఎందుకంటే ఆయనకి అందరూ అర్పణ అయిపోతూ ఉంటారు. ఆ జగద్గురుకు అందరూ ఆ విధంగా వశమైపోతూ ఉంటారు. ఒక్కోసారి ఆసురీ స్వభావం కలిగినటువంటి వాళ్ళు కూడా ఆ విధంగా వశమైపోతూ ఉంటారు. అది మనకు కనిపిస్తుంది కృష్ణ కథలో. వాళ్ళు తిడుతూ ఆయన ధ్యానం చేస్తూ, ఆయనకు వశమైపోయి ఆయనలో కలిసిపోయారు కంసుడు, శిశుపాలుడు మొదలైన వాళ్ళందరూ కూడా. ఏదో ఒక పద్ధతిలో ఆయనకు వశమై ఉంటారు, వారితో వారి యొక్క సంకల్పముతో సంబంధం లేకుండా, వారి వ్యక్తిగతమైనటువంటి నిర్ణయములతో సంబంధం లేకుండా. అలా ఉంటుంది సత్య పరాక్రమము. దుర్యోధనుడంతటి నీచుడు శ్రీకృష్ణుడు సభకు రాయబారానికి వస్తున్న సందర్భంలో సభలోని వాళ్లందరికీ కూడా ఒక శాసనం చేస్తాడు. 'శ్రీకృష్ణుడు సభలోకి వస్తున్నప్పుడే అతనిని మనం అవమానించాలి. కాబట్టి ఎవరూ కూడా లేచి నిలబడటానికి వీలు లేదు. వచ్చేది దూత అయినప్పటికీ, చాలా గొప్పవాడు అని అందరూ అనుకున్నప్పటికీ నా దృష్టిలో కాదు కాబట్టి ఎవరూ లేచి నిలబడటానికి వీలు లేదు' అని చెప్తాడు. అందరినీ ఆ విధంగా శాసించి ఆయన కూర్చుంటే శ్రీకృష్ణుడు, సభలోనికి అడుగుపెట్టగానే ఒక్కసారి దుర్యోధనుని కళ్ళలోకి చూసి నవ్వుతాడు. బాగున్నావా అని, అంటే ఠక్కున లేచి నిలబడతాడు. ఎందుకంటే మిగిలిన వాళ్లు సహజంగా లేచి నిలబడదాం అనుకున్న వాళ్ళు, వీడు నిలబడకుండా వశం చేసి ఉంచినవాడు. ఈ వశం చేసి ఉంచిన వాడు ఏ విధంగా చూడండి వివశుడైపోయాడో! సత్యం ముందు అలా వివశులై పోతారు. సత్యం యొక్క పరాక్రమం అటువంటిది. విశ్వామిత్రుని యొక్క శక్తి సామర్థ్యాలు అన్నీ కూడా వశిష్ఠుని సాన్నిధ్యంలో వివశమయిపోయినాయి. రాముని యొక్క మొదటి దర్శనంలో రావణాసురుని యొక్క శక్తి సామర్థ్యాలు వివశం అయిపోయినాయి. కృష్ణుని యొక్క చూపులతో ఎదురుగా ఉన్నటువంటి శత్రువులందరూ వివశులైపోయారు. ఎందుకు అయిపోతారంటే వీళ్ళు చూశారంటే వాడి లోపల ఉన్నవాడిని చూస్తారు. వాడు వీడు ఒక్కడే! ఏరా బాగున్నావా అంటే బాగున్నా, అంటాడు. వాడు, వీడు ఒకడు అయిపోగానే అక్కడ ఉట్టి డొల్ల మిగులుతుంది. ఆ విధంగా సత్యము చేత ఇతరులను ఆక్రమించే వాడు ఒక్కడే! వాడు భగవంతుడే! అతడికి మనం విష్ణువు అని పేరు పెట్టుకున్నాం. ఎందుకంటే

వ్యాపనం చెందేటటువంటి ప్రజ్ఞ కాబట్టి. విష్ణు సహస్రంలో వచ్చే రెండవ నామం విష్ణువు. మొదటి నామం విశ్వం. కాబట్టి వీటన్నిటిలో నుంచి మనం చూస్తున్నది భగవంతుని యొక్క తత్వమే. కాబట్టి ఇంతమంది మహాత్ములలోను దానిని చూడగలిగిన వాడు ధన్యుడు. ఇంతమంది మహాత్ములు వేరుగా ఉన్నారు అని చూసే వాడు మూర్ఖుడు. ఎవరికి వారు వేరువేరుగా ఉన్నారు అనుకునే వాడు మూర్ఖుడు. వాడి మూర్ఖత్వం ఏదో ఒక రోజు వాడే పోగొట్టుకుంటాడు. ఎవడు? జగద్గురువు! అంతవరకు అందులో బతుకుతూ ఉంటారు వాళ్ళు. కానీ ఇందరిలో ఉండే ఒకే ఒక్క సత్యాన్ని గమనించే వాడి నుండి కూడా సత్యం వ్యాపనం చెందుతూ, వ్యాపిస్తూ ఉంటాడు. ఏమిట్రా వీడిట్లా పెరిగిపోతున్నాడు? అనిపిస్తుంది. పెరగటానికి కారణం ఏమిటయ్యా అంటే సత్యము నందు నిలబడటం ఒక్కటే కారణం! మనం సత్యమునందు నిలబడితే, సత్యం మన నుంచి వ్యాప్తి చెందుతుంది. మహాత్ములందరి నుంచి వ్యాప్తి చెందేటువంటిది ఆ దైవీ స్వభావమే తప్ప వేరే ఉండదు. దైవీ స్వభావం కాక ఇతరమైనది వ్యాప్తి చెందితే వాటికి తాత్కాలికమైన భోగం, వైభవం ఉంటుంది. ఆ తర్వాత పడిపోతుంది. కానీ మహాత్ముల నుంచి వ్యక్తం అయిన వైభవం సత్య పరాక్రమం! అది వారి దేహాంతరం కూడా వ్యాప్తి చెందుతూ ఉంటుంది. ఎక్కడో మారుమూల గ్రామంలో పదిమందికి ఇట్లా మంచి విషయాలు చెప్పిన క్రీస్తు ఈ రోజున భూమంతా వ్యాపించాడు. ఆ రోజుల్లో ఆయనకు ఏమైనా tape records ఉన్నాయా, mikes ఉన్నాయా, అచ్చేసిన పుస్తకాలు ఉన్నాయా, T.V. లు ఉన్నాయా, radio లున్నాయా ఏమున్నాయి? ఇంకా శ్రీకృష్ణుడు సమయంలో చాలా గొప్ప వైభవం ఉంది భారతదేశంలో. కానీ క్రీస్తు అతి సామాన్యమైన ప్రదేశంలో, అతి సామాన్యమైన మనుషులతో, అతి సామాన్యంగా అసామాన్యమైన ధర్మాన్ని బోధ చేసి వెళ్ళిపోయారంతే! అది రూపాయి కి పదహారణాలు సత్యం కాబట్టి ఎక్కడో మారుమూల గ్రామంలో చెప్పుకున్న విషయం ఇవాళ భూమంతా ఎలా పాకిందండి? ఎవరైనా అట్లా organise చేస్తే అవుతుందా? It organises itself. సత్యం దానంతట అదే సమకూర్చుకుంటుంది. ఆక్రమించుకుంటుంది. ఎక్కడ సత్యం ఉంటే దానికి అడ్డు ఆపు ఉండదు. అలాగే షిరిడీ! షిరిడి ఒక కుగ్రామం. ఆ కుగ్రామంలో ఏదో పదిమంది ఉన్నచోట ఉన్నవాడు ఈరోజున మొత్తం అంతా విజృంభించాడు దేహం చాలించిన తర్వాత. సత్యపరాక్రమం ఉన్నచోట ఆయన దేహం వదిలేసిన తర్వాత వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఒక వ్యక్తి సత్య పరాక్రముడా, కాదా అనేది ఆయన దేహమును వదిలిన తరువాత జరుగుతున్న కార్యక్రమములను బట్టి నిర్ణయం అవుతుంది. మరణించిన వారి యొక్క గొప్పతనం మరణించిన తర్వాత ఎక్కువ తెలుస్తుంది. మంచివారు ఎప్పుడూ వారు ఉన్నప్పుడు అంతా గోప్యంగా ఉంచుతారు. వారు వెళ్ళిపోయిన తర్వాత అందరి హృదయముల ద్వారా అది విజృంభిస్తూ ఉంటుంది. అలాకానివారు వెళ్లిపోయిన తర్వాత వాళ్లని మర్చిపోతారు వెంటనే. ఒక కథ ఉన్నది. ఒక ఊళ్లో ఒక జమీందారు గారి కుక్క

చచ్చిపోయిందట. ఊరంతా వచ్చి చూస్తుందట. ఎందుకంటే జమీందారు గారికి కోపం వస్తుంది వెళ్ళి చూడకపోతే. జమీందారు గారు చచ్చిపోతే ఊళ్ళో కుక్క కూడా వెళ్ళదుట చూడటానికి. చచ్చాడు కదా ఇంక మనకు భయం లేదు అని. సత్య పరాక్రమంలో అనేదాంట్లో మనం నేర్చుకోవాల్సినది we should live free and we should allow others to live free. మనం ఎంత స్వాతంత్ర్యం కోరుకుంటామో మన చుట్టూ ఉండే వాళ్ళు కూడా అంత స్వాతంత్ర్యం కోరుకుంటారు అని గుర్తుపెట్టుకోవాలి. వారి స్వాతంత్ర్యానికి భంగం రాకుండా మనకి వారికి ఉండే సంబంధం ఏదయితే ఉందో అది నిర్వర్తించాలి. అంతేగాని కేవలం మన దగ్గర పనిచేస్తున్న వాడు కాబట్టి వాడి స్వాతత్ర్యం మనం దోచేస్తే, వాడు ఎప్పుడు మనం ఊరెళ్ళిపోతామాని చూస్తూ ఉంటాడు. హాయిగా ఉండొచ్చు అనుకుంటాడు. తల్లిదండ్రులు కూడా పిల్లల స్వాతంత్ర్యానికి అడ్డు తగలకుండా వాళ్లను మలచాలి. పిల్లలంటే మనమేదో వాళ్ల మీద అధికారం ఉందని అనుకుంటే మన నుంచి ఎప్పుడు పారిపోదామా అని వాళ్ళు చూస్తూ ఉంటారు. వాళ్లకి ఇచ్చే స్వాతంత్ర్యం వాళ్లకిచ్చి, మనకిచ్చే స్వాతంత్ర్యం మనం పుచ్చుకొని ఇద్దరి మధ్య ఉండే ధర్మాన్ని correct గా నిర్వర్తిస్తూ ఉంటే మనం పొమ్మన్నా పోడు వాడు. అంటే మానసిక లోకాల్లో, ప్రేమమయమైన లోకాలలో అనుబంధం ఎప్పుడూ చెడదు. దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా అది ఎప్పుడూ ఉంటుంది. అది office లోనైనా అంతే! ఇంట్లో అయినా అంతే! సంఘంలో అయినా అంతే! ఎక్కడైనా నీవు నీకెంత స్వాతంత్ర్యం కోరుతావో ఇతరులు కూడా తమకంత స్వాతంత్ర్యం కోరుతారు కాబట్టి ఎవరి స్వాతంత్ర్యం భంగపరచకుండా, మన స్వాతంత్ర్యం తాకట్టు పెట్టకుండా జీవించడం అనేది నేర్చుకున్నట్లయితే అది మొదటి మెట్టు అవుతుంది సత్య పరాక్రమానికి. రెండవ మెట్టు ఏమిటంటే ఇతరులకి ఈ పద్ధతిలోనే ఉంటూ ఇతరుల స్వతంత్రాన్ని భంగపరచకుండా నీ స్వతంత్రాన్ని భంగపరుచకోకుండా నీవు ఇతరులకు మేలు చేస్తున్నట్లయితే ఏమి జరుగుతుందంటే ఇతరులకు నీ యందు ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి నువ్వు చేస్తున్న మంచి పనుల వలన తప్ప నీ యందు కాదు. అది గుర్తుపెట్టుకోవాలి. మన యందు వీళ్ళకు ఆసక్తి ఉన్నది కాబట్టి రేపటి నుండి మనింట్లో బూటు తుడిపించుకుందాము అంటే అవ్వదు. అట్లా నువ్వు చేస్తే మరునాడు అది జారిపోతుంది అది ధర్మం కాదు కాబట్టి. ఆసక్తి వాళ్లకు పెరుగుతున్న కొద్దీ నువ్వు చేస్తున్న పనుల వల్ల వాళ్లకు ఆసక్తి పెరుగుతుంది కాబట్టి ధర్మం పెరుగుతూ ఉంటే నీలో, ఇతరులకు ఆసక్తి పెరుగుతుంది. ధర్మం తగ్గితే నీలో ఇతరులకు ఆసక్తి తగ్గుతూ ఉంటుంది. ఇతరుల ఆసక్తి తగ్గటం, పెరగటం అనేటువంటి దృష్టి నీలో ఉండకపోవడం అనేది అసలైన సత్య పరాక్రమం. నీవు ధర్మమునందు ఎప్పుడైతే నిలబడతావో సత్యమే వ్యాపనం చెందుతూ ఉంటుంది కాబట్టి ఆసక్తి పెరుగుతూ ఉంటుంది. ఆసక్తి ఇతరులకు మన యందు పెరగాలి అని అనుకోవటం మళ్లీ ఇంకొక వ్యామోహం. ఇది మహాత్ముల జీవితంలో కనిపిస్తుంది. ఎక్కడో కుంభకోణంలో ఆయన పదిమందికి మంత్రం ఇస్తే దాన్ని ఈరోజున

భూమి మీద ఐదు ఖండాల్లోనూ ఆ మంత్రం పొద్దున్న సాయంత్రం స్మరించడం జరుగుతూ ఉంది. ఆయన అప్పుడు చెప్పారు కుంభకోణంలో కావేరి ఒడ్డున కూర్చుని ఓ లుంగీ కట్టుకుని పైన కూడా ఏమీ బట్టలేకుండా 'ఒరేయ్ ఇవాళ నేను చెప్పే విషయం ఒక 80 ఏళ్లలో మొత్తం భూమి మీద అన్ని చోట్ల కూడా మొదలవుతుంది' అని . ఎట్లా ఉంటుంది వినే వాళ్ళకి ? ఇది సాధ్యమా అనిపిస్తుంది. మరి జరిగింది కదా! ఎట్లా జరిగింది ? అదీ సత్య పరాక్రమం అంటే! ఇంకొకటి చెప్పారాయన. '240 సంవత్సరాలకి మన సంగతి ఈ భూమి మీద మనుషులకి తెలుస్తుంది. అంతవరకు ఏమీ తెలియదు' అని. 'అదేంటి సార్ ఇప్పుడు తెలిస్తే బాగుంటుంది కదా' అంటే 'ఇప్పుడు తెలియకూడదు' అని చెప్పారు. '2000 సంవత్సరాలకి ఈరోజున శ్రీకృష్ణుడిని ఏ విధంగా దర్శనం చేస్తోందో మానవజాతి, అలా దర్శనం చేస్తారు మాస్టర్ CVV గారిని' అని E.K. మాస్టర్ గారు చెప్పారు. ఎందుకంటే సత్యం అట్లా ఆక్రమిస్తుంది నెమ్మదిగా. ఇతరులకు అవగాహన కలిగి, తద్వారా వారికి వారు సమర్పణ చేసుకోవడం జరుగుతుంది అది సత్య పరాక్రమం.

## ౨౨౨, ౨౨౩, ౨౨౪ నిమిషః, అనిమిషః, స్రగ్వీ

నిమిషులంటే కనులు ఆర్పేవారు. అనిమిషులు అంటే కనులు ఆర్పని వారు. ఇద్దరి రూపాలలో కూడా ఆయనే ఉన్నారు. ఒక్క దేవతలే కనులు ఆర్పరు. మిగతావాళ్లంతా అంటే చెట్లు తప్ప మనం, జంతువులం కనులు అర్పుతాం. అనిమిషుల రూపంలోనూ, నిముషుల రూపంలోనూ అంటే మానవుల/ జీవుల రూపంలోనూ, దైవం రూపంలోనూ ఉన్నవాడు తానే అన్న భావన మనకు ఇక్కడ. కనురెప్ప పాటు ఉంటుంది. పాటు అంటే పడటం, మళ్ళీ లేవటం. నిమిషం అంటే ఒక కన్ను రెప్పపాటు కాలాన్ని నిమిషం అంటారు. మనం ఇంగ్లీషులో చెప్పకునే minute కి తెలుగులో నిమిషం అని మార్చుకున్నాం 60 సెకండ్లు. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క కాలపరిమితి ఉన్నది ఆర్పడానికి. కొంతమంది తొందరగా కన్ను ఆర్పుతూ ఉంటారు. మనకు ఒక సామెత కూడా ఉన్నది 'కళ్ళు ఆర్పేవారు ఇళ్ళు ఆర్పుతారు' అని. కన్నురెప్ప త్వరగా ఆర్పని వాళ్లు కొంతమంది ఉంటారు. దైవీతత్వం ఎక్కువున్న చోట కనురెప్పపాటు duration ఎక్కువ ఉంటుంది. మిగతా వాళ్ళకి duration తక్కువ ఉంటుంది. దేవతలకు అసలు కన్నురెప్పలు ఆర్పరు. మహాత్ములు వీరిద్దరికి మధ్య ఉంటారన్నమాట. అంటే దేవలోకంలో లేరు, అలా అని బొత్తిగా మానవులోకంలో ఇరుక్కుని లేరు. మధ్యస్థంగా ఉంటారు. వాళ్లుట నైముషులు. అంటే నైమిశారణ్యం అని ఒకటి ఉంది. నైమిశారణ్యం అంటే ఎక్కడ ఉంటుంది ? నైమిషులు ఎక్కడుంటే అక్కడ ఉంటుంది. అంతే తప్ప నైమిశారణ్యం అనేది ఒక place మాత్రమే కాదు. కొన్నాళ్ళు రాధామాధవం నైమిశారణ్యం అనుకోవచ్చు. మాస్టర్ గారు ౨౦ ఏళ్లు ఉన్నారు. ఆ తర్వాత నైమిశారణ్యం ఉన్నదా లేదా అన్నది ఉండే వాళ్ళని బట్టి ఉంటుంది. ఎక్కడ భగవంతుని యొక్క తత్త్వం గురించి భావన చేసుకుంటూ భగవంతునికి అంకితంగా జీవితం జరుగుతూ ఉంటుందో అక్కడల్లా ఉన్నది నైమిశారణ్యం. నైమిశారణ్యం అనేది ఒకటి ఉత్తరప్రదేశ్లో సరస్వతీ నది ఒడ్డున అంటే గంగ ఒడ్డున సరస్వతి అంతర్వాహిని కాబట్టి సీతాపూర్ అనే districtలో, నిమిశార్ అనే ఊరిగా ఇప్పడు ఉన్నట్లుగా పెద్దలు చెబుతారు. అక్కడ ఇదివరకు శౌనకుడు ౧౨ ఏళ్లు యజ్ఞం చేసి అందరికీ పురాణాలన్నీ కూడా వినిపించడం జరిగింది అప్పడు అక్కడ చాలామంది చేరి చాలా కాలం భగవత్ తత్వంలో ఉన్నారు కేవలం మర్త్యులే/మానవులే అయినప్పటికీ కూడా భగవత్ తత్వంలో జీవించడం కారణం చేత వాళ్లు మర్త్యులకన్నా ఎక్కువ, దేవతల కన్నా తక్కువ అనేటటువంటి స్థితిలో ఉన్నారు, కాబట్టి వాళ్లను నైమిషులు అన్నారు. వాళ్లు ఉన్నటువంటి ప్రదేశం నైమిశారణ్యం. నైమిశారణ్యం గురించి మాస్టర్ గారు భాగవతంలోని మొదటి భాగంలో ఎక్కడ వీళ్ళుంటే అక్కడల్లా నైమిశమే అని రాశారు. నైమిశారణ్యము అని తెలుగులో చెప్పారు తప్ప సంస్కృతంలో దానికి నైమిషము అనే తప్ప నైమిశారణ్యము అనేది లేదు అని, చెప్పారు. మనకు అవగాహన కోసం అట్లా

నైమిశారణ్యం అని అన్నారు. కానీ వ్యాసుడు భారతంలో గాని భాగవతంలో గాని నైమిషము అనే రాశాడు. పోతనామాత్యులు గారు నైమిషము అనే దానిని తెలుగులోకి అనువదించారు అని చెప్పి మాస్టర్ గారు రాస్తూ, నైమిషులు అంటే అటు దేవతా ప్రవృత్తి పూర్తిగా ఉన్నవాళ్ళు కాదు, అలా అని పూర్తిగా మానవ ప్రవృత్తి కాదు. అంటే మహాత్ములన్నమాట! దైవతత్వమును మానవులకు అందించే వాహికలుగా ఉన్నవాళ్ళు. గురుపరంపర అంతా కూడా అందులోకి వస్తారు. వారెక్కడ ఉంటే అక్కడల్లా నైమిశమే! వారు మనకన్నా తక్కువ కళ్ళార్పుతారు. దేవతలు అసలు ఆర్పరు. మనుషులకు ఈ కళ్ళు ఆర్పటం ఎక్కడి నుంచి వచ్చింది? మనం ఎందుకు ఆర్పుతున్నాం కళ్ళు? ఎక్కువసేపు వెలుగును భరించలేక ఆర్పుతూ ఉంటాం మధ్యలో. ఎక్కువ గాలి వస్తే ఆర్పుతూ ఉంటాం. ఈ ఆర్పటం దేవతలకు ఉండదు. మహాత్ములకు చాలా తక్కువగా ఉంటుంది. వాళ్ల కళ్ళు తేజోవంతంగా ఉంటాయి కాబట్టి వచ్చిన దాన్ని ప్రకృతి లో ఉండే పంచభూతములు చేసే కార్యక్రమాలకు వాటిని నిరోధించి తాను చూడగలిగినటువంటి శక్తి, తేజస్సు కలిగి ఉంటాయి. కళ్ళ ద్వారా తేజస్సు ప్రసరిస్తూ ఉంటుంది. మొదట్లో మానవులం కళ్ళు ఆర్పే వాళ్ళం కాదుట తర్వాత కళ్ళు ఆర్పటం మొదలుపెట్టాము. నిమి అనే చక్రవర్తి ఒకాయన కారణంగా ఈ కళ్ళు ఆర్పటం అనేది మనకు వచ్చింది. నిమి తండ్రి ఇక్ష్వాకు. ఇక్ష్వాకు తండ్రి వైవస్వతమనువు. వైవస్వతమనువు తండ్రి వివస్వతుడు అని మనం ఇప్పుడు ఎరిగినటువంటి సూర్యుడు. ఇక్ష్వాకు కొడుకులలో నిమి ఒకడు. నిమి చక్రవర్తి. వివస్వతుడు అనే సూర్యుడు మన యొక్క ఆత్మతత్వం. వైవస్వతమనువు అనేది మనలో ఉండే బుద్ధితత్వం. ఆయనకు పుట్టిన ఇక్ష్వాకు మనలో ఉండే మనోతత్వం. మనోతత్వానికి పుట్టిన, ఇంద్రియ తత్వానికి సంబంధించిన వాడు నిమి. ఈ నిమిచక్రవర్తికి ఒకసారి ఒక పెద్ద యజ్ఞం చేద్దామనిపించి, మొత్తం తన సామ్రాజ్యంలో ఉన్న మహాత్ములైన వారిని, ఋషులని అందరినీ కూడా ప్రార్థిస్తే వాళ్లంతా 'తప్పకుండా చెయ్యి మేమంతా నీ యజ్ఞానికి వస్తాం' అని అంటారు. అందరినీ సంప్రదించిన తర్వాత ఇంటికి వచ్చి, ఇంట్లో గురువుగారిని 'నేను యజ్ఞం చేద్దామనుకుంటున్నాను 500 ఏళ్లపాటు. ఈ 500 ఏళ్ళు ఈ యజ్ఞానికి మీరు బ్రహ్మగా ఉండి నడిపిస్తే బాగుంటుంది' అని అంటాడు. ముందు ఈయన్ని అడిగి తర్వాత వాళ్ళని అడగాలా... ముందు వాళ్ళందరినీ అడిగి వచ్చి వాళ్ళంతా ఓకే అన్నారు వాళ్లు రేపు వచ్చేస్తున్నారు మరి నువ్వు మొదలు పెడతావా అని అడిగితే ఈయనేం చెప్తాడు. వశిష్టుడు ఏమన్నాడంటే 'నువ్వు నాకు ముందు చెప్పకపోతివి. నిన్ననే ఇంద్రుడు వచ్చి అడిగాడు ఇదే యజ్ఞం చేయాలని 500 సంవత్సరాల పాటు. ఆయన యజ్ఞం లో నేను పాల్గొనటానికి మాట ఇచ్చాను కాబట్టి ఆయన యజ్ఞం 500 సంవత్సరాలు పూర్తిచేసిన తరువాత నీ యజ్ఞానికి నేను ఆధ్వర్యం వహిస్తాను' అని చెప్తాడు. ఈయన '500 సంవత్సరాల పాటు ఎక్కడ నేను wait చేస్తానండి, నేను ఇంకొకరిని పెట్టుకుని చేసుకుంటాను' అని చెప్తాడు. వశిష్ఠుడు వెళ్ళి

ఇంద్రలోకంలో యజ్ఞం చేస్తూ ఉంటాడు. ఇంద్రుడికి ఈయన ఇక్కడ యజ్ఞం 500 ఏళ్ళు మొదలుపెడతాడు. అక్కడికి ఇక్కడికి కాల పరిమితిలో తేడా ఉంటుంది. కనక అక్కడ త్వరగా పూర్తి అయిపోతుంది. అందుకని వశిష్టుడు నిమి చక్రవర్తి వద్దకు వస్తాడు. ఇక్ష్వాకు వంశానికి కులగురువు కదా వశిష్టుడు. నిమి రోజూ అట్లా సంవత్సరాల తరబడి యజ్ఞాలు చేస్తూ, మధ్యాహ్నం పూట కాస్త నిద్రపోతూ ఉంటాడు. వశిష్టుడు మధ్యాహ్నం పూట సరిగ్గా రెండున్నర, మూడు ప్రాంతం లో వస్తే అప్పటికే యజ్ఞం అయి భోజనం చేసి పడుకుంటారు. అప్పుడు వస్తాడు గురువుగారు. ఎన్నో రోజుల తర్వాత ఈయన శిష్యుడిని చూడడానికి వచ్చాడు. భటులకు చెప్పాడు ఇట్లా 'వశిష్ఠుడు వచ్చాడు' అని చెప్పండి అని. చెప్తే భటులు వాళ్లు 'చక్రవర్తి నిద్రపోతున్నారు లేపితే బాగుండదు, పైగా కోపం రావచ్చు' అనుకుంటారు. అందులోనూ రాజులకు కోపం వస్తే కొంచెం కష్టం. బ్రాహ్మణులకు కోపం వస్తే పోతుందిట తొందరగానే భారతం మొదట్లోనే చెప్పారు. రాజులకు కోపం వస్తే కష్టంట. రాజులు పైకి మెత్తగా మాట్లాడుతారు లోపల గట్టిగా ఉంటారు, బ్రాహ్మలు పైకి గట్టిగా మాట్లాడుతారు లోపల మెత్తగా ఉంటారు అని చెప్తారు పురందరోపాఖ్యానంలో. అందుకని తీరా ఆయన కోపం వస్తే మనం మసైపోతాం కదా అనే ఒక భావన, ఆయనను నిద్ర నుంచి లేపకూడదు అనేది ఇంకో భావన. అందుకని ఆ భటులు ఏం చేస్తారంటే లోపలికి వెళ్తారు కానీ నిద్ర లేపరు. బయట కూర్చున్న వశిష్టుడికి బాగా కోపం వస్తుంది. కోపం వచ్చేసి, తక్షణం వీడికి దేహం పడిపోవాలి అని శపించేస్తాడు. ఇట్లా ఈయన అనంగానే, అక్కడ నిమి లేస్తాడు. లేచిన తరువాత భటులు చెప్తారు. భటులు చెప్పేసరికి వస్తాడు. వస్తే శాపం సంగతి తెలుస్తుంది. అంతే నిమికి కోపం వచ్చింది. 'ఎందుకయ్యా అకారణంగా నీకు శక్తి ఉందని చెప్పి శాపం ఇచ్చావు. భటులు నన్ను లేపి, నేను రాకపోతే నువ్వు శాపం పెట్టినా అర్థం ఉంది. నన్ను లేపనేలేదు. వాళ్ళు ఎందుకు లేపలేదంటే అది వాళ్ళని అడుగు. నేను రాకపోవటం కాదు వాళ్లు నన్ను లేపకపోవడం వలన నేను రాలేదు. నిష్కారణంగా శాపం ఇచ్చావు కాబట్టి నేనూ నీకు శాపం ఇస్తున్నాను నీకూ అదే, same to you' అంటాడు. అనేసరికి వశిష్టుడు చాలా విభ్రాంతి చెందుతాడు శిష్యుడు తిరిగి శాపం ఇచ్చాడు అని. తత్ క్షణమే వశిష్ఠుడు బ్రహ్మ దగ్గరికి వెళ్ళి జరిగింది చెప్తాడు. అంటే బ్రహ్మ 'నువ్వు చేసింది తప్పు కాబట్టి శాపం తప్పదు. దీన్ని (శరీరం) వదిలేసి నీ తేజస్సును తీసుకెళ్లి మిత్రా వరుణలలో ప్రవేశపెట్టేసేయ్' అని చెప్తాడు. మిత్రావరుణులు చాలా తేజో స్వరూపులు.అంటే సృష్టికి వాళ్లు కుడి ఎడమల లాంటివాళ్ళు అంటే ఇడా,పింగళ లాంటి వాళ్ళు, లేక స్త్రీ పురుషుల లాంటివాళ్ళు. అశ్వినీ దేవతలు అంటారు పక్షికి రెండు రెక్కల లాంటి వాళ్లు. నాసత్యులు అంటారు వారిని. అంటే అసత్యం కాదూ, సత్యం కాదు అనే స్థితి వాళ్ళది. ఉన్నారు, లేరు అని simultaneous గా రెండు స్థితులలో ఉండే వారు. కుంభ యుగంలో సంభవించినవారు. నాసత్యులు. 'వాళ్ల తేజస్సులో నీ తేజస్సు ప్రవేశపెట్టేసేయ్. మళ్ళీ వాళ్ళ లోంచి దిగి వద్దువు గానిలే' అని చెప్తాడు బ్రహ్మ.

అంతేనా అంటే. 'మరి అంతకన్నా scope ఏమీ లేదు నేను మొత్తం అకౌంట్ చూసాను,' అని చెప్తాడు. వశిష్ఠుడు తన దేహం వదిలేసి వాళ్ళ తేజస్సులోనికి తన తేజస్సు ప్రవేశపెడితే, ఈ మిత్రా వరుణుల తేజస్సులో వశిష్ఠుడి తేజస్సు నిబడీకృతమై ఉండగా, ఊర్వశిని చూసిన సందర్భంలో ఈ మిత్రా వరుణులకి వీర్య స్కలనం జరిగి ఇద్దరిలోంచి వశిష్టుడు, అగస్త్యుడు మళ్లీ కవలలలాగా దిగి వస్తారు. అందుకని మిత్రావరుణుల యొక్క కవల పిల్లలుగా అగస్త్యుడు, వశిష్ఠులను చెప్తారు. అట్లా దిగివచ్చి మళ్ళీ వాళ్ళు దైవకార్యంలో నిమగ్నమై ఉంటారు. మరి వశిష్ఠుడు శాపం ఇచ్చాడు కదా నిమికి. శాపం ఇచ్చేసరికి, నిమి వెళ్లి గబగబా ఇంట్లో ఉన్న ఋషులకు 'ఈ విధంగా జరిగింది, నాకు ఇలా శాపం ఇచ్చారు. ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు మరి యజ్ఞం ఆగిపోతుంది కదా' అంటే వాళ్ళు దివ్య దృష్టితో ఆలోచించి 'వశిష్ఠుడి శాపం కారణంగా నీ దేహం నిలబడటానికి అవకాశం లేదు. కాకపోతే ఒక పని చేస్తాము. నీవు జీవుడుగా ఉంటే నీ శరీరం ఏమాత్రం చెడిపోకుండా ఈ యజ్ఞం పూర్తయ్యేంత వరకు కూడా దాన్ని ఔషధులతోనూ, రకరకములైన మంత్రపూరితమైన శబ్దములతోనూ దీన్ని కాపాడి ఈ యజ్ఞాన్ని పూర్తి చేస్తాం. అప్పుడు యజ్ఞ ఫలం నీకు దక్కుతుంది' అని చెప్తారు. ఆ విధంగా ఆయన ఒప్పుకుంటాడు. ఆ దేహం పడిపోతుంది. పడిపోతే జీవుడిగా అక్కడే ఉంటాడు. యజ్ఞం నడుస్తూ ఉంటుంది. ఆ దేహాన్ని కాపాడి. ఆ యజ్ఞాన్ని 500 సంవత్సరాలు ఋషులు పరిపూర్తి గావిస్తారు. కావించిన సందర్భంలో మరి 500 సంవత్సరాలు యజ్ఞం నిర్వర్తించారంటే ఇంద్రుడితో సమానం నిమి చక్రవర్తి. అప్పుడు దేవతలు దిగివచ్చి 'నీ యందు మాకు చాలా ఆదరం కలిగింది, అభిమానం కలిగింది, అనుగ్రహం కలిగింది, ఆశీర్వదించడానికి వచ్చాం నువ్వు మాతో పాటు దేవలోకంలో ఉంటావా, వీళ్లతో పాటు భూలోకంలో ఉంటావా' అని అడిగితే 'భూలోకంలో ఉన్నాను కదా దేవలోకంలో ఉంటాను' అంటే అప్పుడు దేవతలు వరం ఇస్తారు. ఈ మనుషులకు కనులు ఎంతో సేపు చూడలేని పరిస్థితి. అందుకని వాళ్లలో కనురెప్ప పాటుగా నువ్వు పని చేస్తూ ఉండు. అంటే ఆ ప్రజ్ఞ గా నువ్వు పని చేస్తూ ఉండు' అని చెప్పి నిర్ణయం చేస్తారు. అది నిమి, నిమిష. ఆ విధంగా నిమిచక్రవర్తి మనందరి కళ్ళల్లోనూ కనురెప్ప పడటం, లేవటంగా పనిచేస్తూ ఉంటాడు. ఆయనెప్పుడు ఒకసారి రెప్ప ఆర్పి, మళ్ళీ రెప్ప తెరుస్తాడో అది ఒక నిమిషం అన్నమాట. ఆ విధంగా నిమి శాశ్వతుడై, ఈ సృష్టిలో మానవులు ఉన్నంతకాలం ఆయనని స్మరించే పద్ధతిలో జీవుని ఆ విధంగా సంస్కరించుకుని, ఆయన మన యందు, జంతువుల యందు కూడా దేవతల ప్రజ్ఞ గా పనిచేస్తున్నాడు. అందరి యందు కనురెప్పపాటుగా పని చేసేవాడు నిమి చక్రవర్తి. నిమిషం అందులోంచి వచ్చింది ఒక రెప్పపాటు నిమిషం అంటూ ఉంటాం. ఆ తర్వాత ఏమైందంటే ఈయన జీవుడైతే ఆ విధంగా ఉద్ధరింపబడ్డాడు దేహం ఏమైపోతుంది? అప్పుడు ఋషులు ఏం చేశారంటే అ దేహాన్ని తీసుకుని శుభ్రంగా చిలికారంట. అగ్ని పుట్టి, వేడి పుట్టి ఆ దేహం పంచ

తత్త్వాల్లోనూ కలిసిపోయేట్లుగా దాన్ని మథనం చేశారు. ఆ మథనం చేయడాన్ని, చిలకడాన్ని సంస్కృతంలో 'మిథి' అంటారు. అట్లా మిథి చేస్తే శరీరంలోంచి ఒక తేజోమయమైన శరీరం పుట్టింది. ఒక విశిష్టమైన దేహం పుట్టిందిట. అదే విదేహం. ఆ దేహమే జనకుడు. ఆ మిథి అనే కార్యం నుండి పుట్టాడు కాబట్టి ఆయన 'మిథిల' అనే నగరానికి విశిష్టమైన దేహం కలిగినవాడిగా ఉండడం జరిగింది. అప్పటి నుంచి విశిష్ట దేహాలు కలిగిన వాళ్ళందరూ ఆయన దగ్గర చేరి, అక్కడ నుంచి చిరంజీవులు అయి, కార్యక్రమములు నిర్వర్తించేది ఒకటి మొదలయ్యింది. ఇక్ష్వాకు వంశం వాడు అయిన నిమి చక్రవర్తి తేజస్సు కనురెప్ప పాటుగా పనిచేస్తూ ఉంటే, నిమి చక్రవర్తి దేహము విశిష్ట దేహంగా ఈ భూమి మీద ఏర్పడింది. అందుకే మనలో కూడా ఆ విశిష్ట దేహాలు తయారవుతాయి. అదే మాస్టర్ సి.వి.వి గారి యోగంలో ఆయన చేసింది. 12 సంవత్సరాల్లో ఈ విదేహ స్థితి మీకు కలిగేటట్లు చేస్తాను, మీరు గనక నేను చెప్పినది ఆచరణలో పెట్టినట్లయితే అని చెప్పారు. దానినే భాగవత శరీరం అంటారు, దానినే అంతఃకరణ శరీరం అంటారు, దానినే సూక్ష్మ శరీరం అని చెప్తారు. ఆ దేహంలో శాశ్వతంగా ఉండవచ్చు. సీతాదేవి అటువంటి దేహంతో పుట్టింది. విదేహరాజ పుత్రిక కదా! మిథిలలో ఉండే జనకుడు రాజ్యంలో ఉండేవాళ్లంతా కూడా వీళ్లే! కాబట్టి ఈ నిమిష, నైమిష, అనిమిష అనే శబ్దములు వచ్చినప్పుడు ఈ విషయములు తప్పకుండా చెప్పకోవాలి. చెప్పకుంటే వీళ్ళందరి యొక్క అనుగ్రహం మన మీద ఎక్కువ ప్రసరిస్తుంది. భగవంతుడు నిమిషుడిగా ఉన్నాడు, అనిమిషుడిగా ఉన్నాడు. నిమిషం అనే కాలముగా ఉన్నాడు. నిమిషానికి, అనిమిషానికి మధ్య సంధాన కర్తగా ఉన్న వాళ్ళు ఎవరయ్యా అంటే మహాత్ములు. దేవతలకు, మానవులకు మధ్య ఎవరయ్యా వంతెన అంటే మహాత్ములు. దేవతా ప్రజ్ఞలన్నీ కూడా మహాత్ముల సాన్నిధ్యం నుంచి పనిచేస్తూ ఉంటాయి. మనకు ఆశీర్వచనం ఇస్తూ ఉంటాయి. సృష్టికి సంబంధించిన సమస్త దేవతలు కూడా మైత్రేయుడి నుంచి ఎప్పటికప్పుడు వ్యక్తం అవ్వటానికి సంసిద్ధులై ఉన్నారు అని చెప్తారు. ఏడు లోకములకు సంబంధించిన సమస్త దేవతా ప్రజ్ఞలు, ఈ భూమి వరకు, మైత్రేయ మహర్షి నుంచి వ్యక్తమవ్వటానికి సంసిద్ధులై ఉంటారు ఎప్పుడూ. అవసరాన్ని బట్టి ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా వ్యక్తం కావాలో ఆ విధంగా వ్యక్తం అవ్వటానికి ఆయనకు ఆ రకమైన అనుగ్రహం ఇవ్వబడి ఉంది. అందుకని ఆయన వాహికగా నిలబడ్డారు పరలోకాలకి, మనలోకానికి/భూలోకానికి మధ్య. ఇవి అన్నీ గుర్తుపెట్టుకొని ఆచరించుకోవటంలో అనుభూతి ఉన్నది. విన్నంతవరకు కొంత పని చేస్తుంది. ఆచరిస్తే స్థిరపడుతూ ఉంటుంది కాబట్టి స్థిర పడే పద్ధతిలో మనందరం ముందుకు సాగి వెళ్ళిపోదాం.

## 225 వాచస్పతిః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

వాక్ అతి పవిత్రమైనది. వాక్కుని ఋగ్వేదం అంటారు. వేదాలు పుస్తకంలో ఉండేవే కాదు. మనలో కూడా 4 వేదాలు ఉన్నాయి కాబట్టి పని చేయగలుగుతున్నాం. స్వరపేటికలో నిశబ్దము, శబ్దముగా మారే దానిని 'రేఫము' అంటారు. దానినే రిషభం అన్నారు. అంటే అవ్యక్తమైన తత్వం వ్యక్తం అవుతుంది ఇక్కడ. అంత క్రితం ఏర్పడిన భావం మన నుంచి వ్యక్తం అవుతుంది. మన నుంచి భావం పుట్టి కార్యరూపం దాలుస్తుంది. అలాగే సృష్టి కూడా భావం గా వ్యక్తమౌతుంది. వాహిక లేకుండా వ్యక్తమవదు కదా! Vocal cords వల్ల వ్యక్తమవుతుంది. నిశ్వాస వల్ల మాట బయటకు వ్యక్తమవుతుంది. అనాహత శబ్దం నిశ్వాస వాహికగా బయటకు వస్తుంది. గాలి పీలుస్తూ మాట్లాడలేము. ఉచ్ఛ్వాస నిశ్వాసకి ఆధారం. ఉచ్ఛ్వాస, నిశ్వాసలకి స్పందన ఆధారం. విశుద్ధి కి వృషభం వాహిక. స్పందనం వాహికగా నాదం వ్యక్తమవుతుంది. స్పందనం భగవంతుని సంకల్పం గా జరుగుతుంది. దాన్ని స్వయంభూః అంటారు. సంకల్పం మన వశం లో లేదు. సంకల్ప శక్తి అమ్మవారు. అయితే నిర్వికల్ప సమాధి స్థితిలో సంకల్పాలు ఉండవు. ఆ భావాలు లేని స్థితికి మనం చేరాలి. ఒక ఆలోచన వస్తే గర్భం ధరించినట్లు. బ్రహ్మ నుండి వచ్చిన సరస్వతి వెనుక బ్రహ్మ పరుగెట్టడం అంటే ఒక ఆలోచన పుట్టిస్తే అది మనల్ని పరిగెట్టిస్తుంది. వాచస్పతి ఓమ్ కార స్వరూపుడు. వాక్కుని ఛందోబద్ధం గా వ్యక్తం చేయడమే సామవేదం. స్పందన గరుత్మంతుడిగా చెప్తారు. ఆయన్ని బాగా పెంచుకుంటూ పోతే విష భావాలనే సర్పాలని తినేస్తుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఎరుక కలిగి చేస్తే చాలా ప్రశాంతం గా ఉంటుంది. అసలు స్పందన బాగుంటే భావముల అపవిత్రత తగ్గుతుంది. మనల్ని మనం తెలుసుకోవడమే వేదాలు తెలుసుకోవడము. అలా తెలుసుకోవడానికి జ్యోతిష్యం, నిరుక్తం, వ్యాకరణం, ఛందస్సు, సూక్తాలు అనే keys ఇచ్చారు. సూక్తాలలో king పురుష సూక్తం, queen శ్రీ సూక్తం. ఇవి రోజూ చదవాలి. అలాగే వసంతనవరాత్రులు అయ్యవారి పూజలూ, శరదృతువు అమ్మవారి పూజలు చేసుకోమని పెద్దలు చెప్పి ఉన్నారు. ఋక్, సామం కలిపితే మనమేమిటో తెలుస్తుంది. అన్నీ క్రమమైన పద్ధతిలో వ్యక్తం చేస్తే జయం అవుతుంది. దాన్నే యజుర్వేదం అన్నారు. ఋక్ బాగుండి, ఛందోబద్ధ గా వ్యక్తం చేయగలవాడు ఋషి.

## 226 ఉదారధీ

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

వెలుగుతో కూడిన సంకల్పం తనకు తానుగా వ్యక్తమయింది. దీనినే స్వయంభు అంటారు. సంకల్పం అమ్మవారు- self emanating idea. అది Thought గా మారటం బ్రహ్మ పుట్టడం అంటారు. చిన్న కాలువ మహానదిగా మారుతుంది. సంకల్పం వ్యాపనం చెందుతూ ఉంటుంది. భావము లేని స్థితి మౌనం. లోపల రాట్నాలు తిప్పుతూ ఉంటే, మౌనం లేదు. భావాలు pressure ఎక్కువైతే మౌనంగా ఉండం. వాచస్పతి ఓంకార స్వరూపుడు. సంకల్పం మొదటి గర్భం- వ్యక్తం అయిన వాక్ కి అధిపతి. వాక్ ని లీనం చేయడం సామం. సృష్టి సంకల్పము ఎప్పుడో ఏర్పడింది. మనం ఆ సృష్టి సంకల్పాన్ని బట్టి మన సంకల్పాన్ని అనుసంధానం చేసుకోవాలి. From the centre where the will of God is known. బ్రహ్మ సంకల్పం కాలం ప్రకారం నడవాలి. Let my plan be an epitome of the divine plan. కాలానికి ఎదురీదక ఆ వాలుని బట్టి నడవాలి. ఆ సంకల్పమునకు సమర్పణ చేసుకోవాలి. భగవత్ సంకల్పం ఎరిగి చేసుకుంటే ప్రశాంతత లభిస్తుంది. తద్వారా అనుభూతి, ఆనందం. పరమాత్మలో కలుస్తాడు. గురువు సంకల్పించిన వాటిని అనుసరించి చేస్తూ ఉండాలి. కోరికలు, కామం, ధర్మయుక్తమై ఉండాలి. అలాటివాడి డబ్బు ధర్మానికి ఉపయోగపడితే మోక్షం లభిస్తుంది. అర్థము కామము ధర్మానికి సమర్పించుకుంటూ జీవించాలి. కేంద్రాలు ఏర్పరుచుకొని వ్యక్తమై వెళుతూ ఉంటే. ఆలోచనలు తగ్గే కొలది ఉచ్ఛ్వాస నిశ్వాసలు తక్కువగా ఉంటాయి. మన మనసు ప్రశాంతత ఉన్నచోట హంసలు తక్కువగా ఉంటాయి. ఋక్ ని సామసమములో కలిపితే భగవంతుని లోకి వెళతాం. Thought- భావం, ప్రణాళిక - knowhow, మనసు యజుర్వేదం. నీ plan బాగుంటే sucessess అవుతుంది. వీటిని నేర్చుకునే వాటిని బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు అంటారు. మనలో భావాలు ఎలా ఉన్నాయి, భావనలోని పవిత్రతను ఋగ్వేదం తెలుపుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు బాగా ఉంటే సామవేదం. చక్కటి స్పందన ఉన్నచోట, భావాల అపవిత్రత తగ్గుతుంది. గరుత్మంతుని నీలో పెంచుకో, స్పందన పెంచుకుంటే గరుత్మంతుడి మీద ఎక్కిన విష్ణు రావటం జరుగుతుంది. రోజుకి 24 సార్లు గట్టిగా ఉచ్వాస విశ్వాసలు చేయాలి. పురుష సూక్తం రోజు ఒకసారి చదువుకోవాలి, విని అనటం నేర్చుకోవాలి. మనలో సంకల్పాలు బాగా లేనప్పుడు వాచస్పతి నామం చదువుకోవాలి. మంచి భావాలు ఉండాలి. పవిత్రతతో ధర్మంగా జీవించాలి. మంచివాడు, చేతనైన వాడు అయితే వైభవం ఉంటుంది. ప్రణాళిక నువ్వు వ్యక్తం చేయాలి. Let virtue be the strength of my intelligence. తెలివికి సద్గుణములు బలం ఇస్తాయి. శక్తి సామర్థ్యాలు, మంచితనం,

రెండు చక్కగా ఉండాలి. సంకల్పాలు పవిత్రంగా ఉండాలి. plan చేసుకోవాలి. Time table ఉండాలి. సామము యజస్సు రెండు, రెండు కాళ్ళగా నడిచి వస్తుంది.

## 227 అగ్రణి

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

సృష్ట్యి మొదటి నుండి ఉన్నది. మొట్టమొదట. అందరికంటే ముందు నుంచి ఉన్నవాడు. ఎప్పుడూ ఉండేవాడు. అజుడు, అనంతుడు. మొదటి సంకల్పం భగవత్తత్వం. త్రిగుణాత్మకమైన సృష్టి. తెర ఆధారంగా బొమ్మలు ఎలా పడతాయో, భగవంతుడి నుంచి సంకల్పం పుట్టి త్రిగుణాత్మకముగా వెలవడుతుంది. ఎరుపు శివుడు, నీలం విష్ణువు, పసుపు బ్రహ్మ. తెలుపు అమ్మవారు. (గాయత్రి) భగవంతుని సంకల్పం ప్రకృతి. మనలోని తెలివికి ఆధారమైన వాడు అగ్రణి. ఈ తెలివి వచ్చిన తర్వాత మనకు ఆలోచనలు, మాటలు, చేతలు వస్తాయి. 'నేను' అనే అంతర్యామి తత్వమే భగవంతుడు. మనలో ఏది ఉండబట్టి నిద్ర నుండి తెలివి రావడం జరుగుతున్నదో, ప్రాణస్పందనం జరుగుతున్నదో అదే అగ్రణి. అది తెలుసుకున్నవాళ్ళు మహాత్ములు. మనం తెలుసుకునే దానికి ఆధారభూతుడు. నేనుగా ప్రతి వారిలో భగవంతుడు ఉంటాడు. తెరగా ఉండబట్టి బొమ్మ పడుతుంది. మనలో ఉన్న చైతన్యం, సృష్టి, తెలివితేటలు భగవంతుడివే. నేను వెలుగును, నా వెలుగుకి ఆధారంగా భగవంతుడు ఉన్నాడు అని తెలియాలి. మనలో ఎలా ఉన్నాము. ఎక్కడ ఉన్నాము? నేనెవరు? ఎక్కడి నుంచి లేచాను? అనే ప్రశ్నలు వేసుకుంటూ ఉండాలి. మూలానికి వెళ్ళే ప్రయత్నం చేయాలి.

## ౨౨౮, ౨౨౯ గ్రామణి, శ్రీమాన్

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

### గ్రామణి -

భగవత్ తత్వం ఉన్నచోట జనం గుంపులు గుంపులుగా ఉంటారు. అలా సమీకరణ చేసే శక్తిగా భగవంతుడు ఉంటాడు. Manifest అవుతారు. కలుపుకునే ఆకర్షణ శక్తి ప్రేమ. ఆత్మకి మూడు శక్తులు ఉన్నాయి. Love- ప్రేమ తత్వం ఉన్నచోట జీవుల సమీకరణం ఉంటుంది. Light- వెలుగుతత్వం ఉన్నచోట జీవులు చేరుతారు. Power- ఉన్నచోట చేరుతూ ఉంటారు. బ్రహ్మ విష్ణు శివుడు. మనలో Power, Will విశుద్ధిలో, Love Heart కేంద్రంగా, Light భ్రూమధ్యం లో ఏర్పడి, చుట్టూ ఉన్న వాటిని సంరక్షిస్తూ ఉంటారు. Organisation గా మనలో ఆరు గ్రామాలు ఉన్నాయి. మనం ఏడో గ్రామం. పంచభూతాలు, మనస్సు, నేను అన్నమాట. మనపై వాడు అష్టమ గర్భం. కేంద్రము ఏర్పరిచే తత్వం. విస్తరణకు, సమీకరణకు గ్రామణి తత్వం, తానే కేంద్రం, తానే పరిధి తత్వం. అంటే తానే ఒక కేంద్రమై పరిధి ఏర్పడి, మరల పరిధి కేంద్రం గ ఇంకో పరిధి ఏర్పడి, మరల ఆ పరిధి ఇంకొక కేంద్రమై మరో పరిధి ఏర్పడడం ఇలా సాగుతుంది. అది ఆయన గ్రామణి తత్వం.

### శ్రీమాన్ -

ఎప్పుడూ శ్రీతో కొలవబడతాడు. శ్రీ ఆయన మీద ఆధారపడుతుంది. లక్ష్మీ దేవిని, సరస్వతీ దేవిని, విషాన్నీ కూడా

శ్రీ అంటారు. విద్యకి, బుద్ధికి, అష్టకళలకి, తెలివికి, ఆయనే ఆధారం. పెంచడానికి, తగ్గించడానికి లక్ష్మి. పెంచే విద్య సరస్వతి. తన సృష్టి మీద భగవంతుడు ఆధారపడడు. శ్రీ కి ఆయన ఆధారభూతుడు. ఆయనలాగే మన నుంచి పుట్టిన వాటి మీద మనం ఆధారపడకూడదు. ఆత్మ యందు స్థిరపడిన వారు- మహాత్ములు శ్రీమంతులు. వారు ఉపకారం చేసిన వారి మీద ఆధారపడరు. వారి నుంచి ఏమీ ఆశించరు. ఇతరుల నుండి లబ్ధి పొందరు. ప్రజలకి ఆధారంగా ఉంటారు. ఇతరుల ధనం తమ వాడుకోరు. చుట్టూ ఉండేవారు భగవత్ స్వరూపులుగా భావించి సేవ చేస్తారు. కర్మలు కల్మషము లేకుండా చేస్తారు. అమృతత్వస్థితి పొందుతారు. ఇతరులకి ఆధారంగా ఉంటారు.

## ౨౩౦ న్యాయః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

న్యాయం రూపంగా భగవంతుడు ఉంటాడు. న్యాయం ధర్మం ఉన్నచోట భగవంతుడు ఉంటాడు. అందరిలోనీ న్యాయం ఉంటుంది. అందరికీ అన్యాయం చేసిన వాడు కూడా న్యాయం, అంటే భగవంతుని కోరుకుంటాడు.

## 231 నేతా

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

అంటే Leader. అందరికీ నాయకుడు! ఎక్కడికక్కడ అన్ని స్థితులలో నాయకుడు ఉంటాడు. 10 మంది యోగక్షేమములు చూస్తూ, వారికి రక్షకుడిగాఉంటాడు. రక్షణ కల్పించటం నాయకుడి లక్షణాలు. ఏ నాయకుడిలో అయినా విష్ణుతత్వము ఎంత ఉన్నదీ దాన్నిబట్టి నేతగా నిలబడతాడు. అసలు విష్ణు తత్వం లేని వాడు రాజు కాలేడు, నేతగా భగవంతుడు మొత్తం సృష్టిని నడిపిస్తున్నాడు. నాయకుడిలో న్యాయం లేకపోతే పోతాడు. King is God. ఆపదలో ఇతరులను రక్షించుటకు తనను తాను సమర్పించుకుంటాడు. అసలు మనలోనే నాలుగు వర్ణాలూ ఉన్నాయి.

1. శరీర శ్రమతో, కాళ్లు చేతులుతో పని చేసినప్పుడు మనం శూద్రులం.
2. ఇచ్చి పుచ్చుకోవటం, వ్యాపారం చేసినప్పుడు వైశ్యులం.
3. ఇతరులని క్షమించగలతత్వం ఉండి, ఇతరులు మేలు కోరినప్పుడు బ్రాహ్మణులం.
4. రక్షణ కల్పించినప్పుడు క్షత్రియులం.

యుద్ధం సమయంలో మరణించిన వారికి ఉత్తమ గతులు ఉంటాయి. A man who can sacrifice his life for others. కష్ట సమయంలో కూడా ధర్మంలో ఉంటాడు. సన్నివేశము వచ్చినప్పుడు అక్కరకు వస్తాడు. కొంచెం అహంకారం ఉంటుంది. కొంచం పొగుడుతూ ఉండాలి. నాయకునిలో విష్ణు తత్వం ఉంటుంది. విష్ణువు అనుగ్రహంతో పదవిలో ఉంటాడు. జగత్తుకి ప్రభువు, పరిపాలకుడు విష్ణువు. కుర్చీలో ఉన్న అధికారిని విష్ణువుగా చూస్తే మన పనులు అవుతాయి. భగవంతుని స్మరణ వలన ఆయన సాన్నిధ్యంలో ఉంటాము. సాన్నిధ్యం విద్యుత్ లాంటిది. స్మరణ ఆగిపోతే ఉత్తి మనం ఉంటాం. భగవత్ స్మరణ తోడు కారణంగా మనలో Process జరుగుతూ ఉంటుంది. స్మరణ ద్వారా సాన్నిధ్యంలో ఉండాలి. Every man is led by a primary thought. భూమికి నాయకుడు సనత్కుమారుడు. ప్రతి ఉదయం భగవద్గీత, రాత్రి భాగవతం, రామాయణం చదవాలి. ఆలోచన పుట్టుక స్థానం చైతన్యం. అది నేత అని తెలుసుకోవాలి. భావముల యొక్క పుట్టుక స్థానం గాయత్రి లేక వెలుగు అంటారు.

## 232 సమీరణః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

వాయుతత్వం. సమీరునుడు అంటే వాయువు లేక గాలి తత్వం. కదలికను భగవత్తత్వం గా అవగాహన చేసుకోవాలి. కదిలించే శక్తిని వాయు అంటారు. స్పందనలో ఉండే కదలికను సోహం, హంస గా అవగాహన చేసుకోవాలి. స్పందనం కదలిక ద్వారా మనలోని కదలికని గమనించవచ్చును. చక్కగా ఉఛ్వాస నిశ్వాసలు చేయాలి. మూడుసార్లు slow, soft, deep and uniform గా చేయడం వలన ఆ gap లో సోహం/ స్పందన వినిపిస్తుంది. అలా 24 సార్లు 3 times each, giving an interval after 3 times. హృదయం అంటే హృత్ అయాం. Here I am, అతడే నేను I am that Iam. ఉచ్ఛ్వాస నిశ్వాసల మధ్య gap లో స్పందనం వినాలి. ఓమ్ కారం వినాలి. సోహం స్పందన- ఉచ్ఛ్వాస నిశ్వాసలు. వాడు కదలకుండా వాటిని కదిలిస్తున్నాడు. It is stability. వాయుతత్వాన్ని దాటగలిగితేనే stability. అంటే మనము కదిలిపోకుండా మొత్తాన్నీ చూడాలి. ఓమ్ కారం ఆగిపోవడం ఉండదు సృష్టిలో. It is eternal. Aquarian Master. వాయుపుత్రుడు. ఆకాశం లో నిశ్చలంగా ఉంటాం.

## 233, 234, 235, 236 సహస్రముర్ధా, విశ్వాత్మా, సహస్రాక్షః, సహస్రపాత్

(ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం. జరుగుతున్నది.)

## 237 ఆవర్తనుడు

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

వృత్తములు వృత్తములుగా గోళం గోళం గా సృష్టి ఏర్పడుతుంది. గోళం పరిపూర్ణం కాబట్టి సృష్టి పరిపూర్ణం గా ఉంటుంది. భగవంతుని సృష్టి తిరిగి తిరిగి ఆయనలోనే కలిసిపోతుంది. అలాగే మన ఆలోచనలూ తిరిగి మన వద్దకే వస్తాయి. అలా మనలోనూ ఏడు కేంద్రములూ చక్రాల రూపం లో ఉంటాయి. కేంద్రములో లయమవుతాయి. కేంద్రములు సృష్టించి, సృష్టిని నడిపించే ప్రజ్ఞా ఆవర్తనుడు అంటారు.

## 238 నివృతాత్మ

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

కేంద్రాలు తాను ఏర్పరిచి, అందులో ఉండి, దానిలో బందీ కాకుండా అతీతంగా ఉంటాడు. మునులు, జ్ఞానులు కూడా వేటికీ బందీ కాకుండా ఉంటారు. సొంత భావాలలో మనం ఇమిడిపోతాం పరిమితత్వం చెందుతాం. భావములో బంది కాకూడదు. పరమితుడు కాని వాడు భగవంతుడు. ముక్తసంగుడు, మోక్షజీవి. నువ్వు పాత్ర పోషణ చేసే వేషధారివి అని తెలుసుకోవాలి. తండ్రి, కొడుకు, భర్త- ఆ పాత్రలో లీనమై నటించిన తర్వాత, తాను తానుగా ఉండాలి. సన్నివేశములలో నర్తకునిగా ఉండాలి. చక్రం తిరుగుతున్నప్పుడు తిప్పేవాడు వేరే ఉంటాడు. ఆ తిప్పేవాడిని చూడడమే మనం నేర్వవలసినది. ప్రవృత్తి అంటే తిరిగే దానితో పాటు మనం తిరగడం. నివృత్తి అంటే తిరిగే దాన్ని చూస్తూ ఉండడం. దాన్నే వైరాగ్యం అంటారు. భగవంతుడు తన నిజస్థితి కోల్పోనట్టి వాడు, అవస్థితి చెందని వాడు. చక్రం తిప్పేవాడే కానీ అందులో ఇమడడు. మనలోంచి వ్యక్తం అయ్యే భావం మన సృష్టి. భావానికి ముడి విడాలి. నిర్వర్తించటమే తప్ప ఇరుక్కోకూడదు. ఏ భావాల్లో, ఏ సిద్ధాంతాలలో ఇరుక్కోనివాడు యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు.

## 239 సంవృతః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

తాను నిర్మించిన దానినంతా లోపల బయట ఆవరించి ఉంటాడు. మనం నిర్మించిన దానికి మనం శ్రద్ధ చూపకపోతే అది క్షీణించి పోతుంది. Example పిల్లలు, వ్యాపారం, ఆట. That, which you neglect, neglects you. భగవంతుడు తన సృష్టిలో ప్రతి వస్తువుని పోషించి, పాలించి, పరిపూర్ణత చెందిస్తాడు. భగవంతుడు ~దానికి సాధ్యమును ఇస్తాడు. దానియందు శ్రద్ధ లేకపోతే, అది పరిపూర్ణత చెందదు. Energy follows thought. దేనిని మనలో పెంపొందించుకోవాలని అనుకుంటామో దానికి కావలసిన జ్ఞానం కూడా మన నుంచి వస్తుంది. సాధన కావాలి. మన ప్రభావం దానిమీద ఉండాలి. ఆవరించి ఉండుట ఉద్యోగం.

## 240 సంప్రమర్దనః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

అణచి వేయుట పరిమితిలో ఉంచుట. తననించి వ్యక్తమైన ధర్మములను కాదని స్వతంత్రంగా ప్రవర్తించే వారిని గదతో మొత్తుతాడు. సృష్టిలో ఉండే Law and Order తత్వం ఇదే. నేను భగవంతునిలో భాగం అని తెలుసుకోవాలి. మన అస్తిత్వానికి కారకుడు భగవంతుడే. స్వతంత్ర భావాలు కలిగి అధర్మంగా జీవించేటప్పుడు భగవంతుడు నిర్మూలిస్తాడు. అనారోగ్యము అనగా ఆహారం, నిద్ర, అలవాట్లు సరిగ్గా లేకపోవడం.
అలవాట్లు మార్చుకొని, శరీర తత్వానికి అనుగుణంగా తినాలి. మనల్ని మనం మార్చుకుని బుద్ధిమంతుడుగా ఉండాలి. మన ఆరోగ్యాన్ని మనమే పరిష్కరించుకోవాలి. లేదంటే భగవంతుడు కాలం రూపంలో మార్పులు చేస్తాడు.

## 241 అహా

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

అమ్మవారు అయ్యవారిలోంచి పుట్టుకొచ్చిన చైతన్యం. హా అమ్మవారి తత్వం. అహర్ అనగా తెల్లవారుట, మేల్కొనుట. మనం లేచి కూడా చీకట్లో ఉంటాం. యోగులు రాత్రి కూడా మేల్కొన్ని ఉంటారు. భావం మార్చుకుంటే ముఖం మారుతుంది. నేను ఉన్నాను అనే భావంలో మేల్కొంచి ఉండాలి. మనం నిద్రించేటప్పుడు కూడా భగవంతుడు మేల్కొన్ని ఉంటాడు. Awareness అంటే చైతన్యం లో ఉండడము.

It comes to pass. మంచయినా, చెడయినా వచ్చింది వెళ్ళిపోతుంది. ఎప్పటికీ ఉండిపోదు. అందుకే వస్తుంటే ఆనందం, పోతుంటే ఏడుపు ఉండకూడదు. వైభవం-ఆపద, వెలుగు- నీడ, హాని- వృద్ధి, మేల్కొంచుట అనగా చైతన్యంల్లోకి రావడం. పొద్దున్నే లేవగానే ఏం తినాలి అని కాకుండా ఏం చేయాలి అని ఆలోచించాలి. ఎప్పుడూ నిద్రపోని వాడు.

## 242 సంవర్తకుడు

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

అగ్ని. పరిణామం చెందించే అగ్ని! మూలస్థానానికి చేరే సాధనం! Friction చేయుట, వేడి పుట్టుట సంకల్పాగ్ని. మొగ్గ పువ్వుగా విచ్చుకొనుట. మార్పులు చేసుకుంటూ వెళ్ళుట. ఖనిజాలు మార్పు చెందుట. ఇవన్నీ నిర్వర్తించే తత్వం.

## 243 వహ్నా

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

వాహిక, Messenger. వాహనంగా పనిచేసే అగ్ని. ఇంద్రాయ స్వాహా! అని అగ్ని లో హవిస్సు వేస్తాము. మనలో అగ్ని ముఖం. తిన్నది శరీరంలోని అన్ని కేంద్రాలకి అందజేస్తుంది. అగ్ని మన ముఖముగా ఉంటుంది. Conductor.

## 244, 245 అనిలః, ధరణీధరః

(ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం. జరుగుతున్నది.)

## 246 సుప్రసాదః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

భగవంతునికి చక్కని పద్ధతిలో సమర్పింపబడటం వలన ఆయన యొక్క అస్తిత్వము, ఆయన ప్రభావం, ఆ వస్తువులో ఎక్కువగా ఉంటుంది. అదే నైవేద్యము. ఎవరితో ప్రవర్తిస్తున్నా భగవంతుడిగా భావించాలి. దేవుని ప్రసాదం స్వీకరించుట అంటే ఏది మనకి వచ్చినా భగవంతునికి సమర్పించాలి. అప్పుడు ఆ వస్తువు ప్రసాదం అవుతుంది కుటుంబం, వృత్తి, కొత్త పుస్తకాలు, బట్టలు, వస్తువులు, తనని కూడా, సమర్పణ చేసుకోవాలి. అప్పుడు భగవంతుడు మన ద్వారా వ్యక్తమవుతాడు. తాను ప్రసాదంగా సమర్పించుకోవడమే సాధనకి పరాకాష్ట. ఒకడు మూడుగా దిగి వచ్చాడు. అందులో ఒకరు మనమయితే మిగిలిన రెండూ ఆయనే!

## 247 ప్రసన్నాత్మ

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

ప్రసన్నత అంటే చక్కగా స్థిరపడి శుభలక్షణములతో వ్యక్తమగుట. 'సన్న' అంటే వ్యక్తమవటం, స్థిరపడుట అంటే అవతరణ చెందటం. అంటే దిగి రావడము. ఆత్మతత్వం ఎంత స్థిరపడితే భగవంతుడు అంత ప్రసన్నంగా దిగివస్తాడు. యోగసాధన ద్వారా మనలోని మురికిని పోగొట్టుకోవాలి. నిత్యపూజ చేయటం వలన మనలో కళ పెరుగుతుంది. ముఖంలో కళ అంటే bulb లోకి విద్యుత్ రావడం లాంటిది. విద్యుత్ రావటం బట్టి bulb కాంతి ఉంటుంది. అలాగే ఆత్మతత్వం బాగా స్థిరపడటం వలన శుభలక్షణములతో కూడిన కళ మనలో పెరుగుతుంది. భగవంతుడు గురువారంనాడు, ఏకాదశి నాడు, మార్గశీర్షమాసమునందు, మరి జీవనది గంగలోను ఎక్కువగా అవతరణ చెందుతాడు. ప్రసన్నత్వము ఎక్కువగా ఉంటుంది. మర్రిచెట్టు, రావిచెట్టు, బంగారము, హంస, పావురము, వజ్రములు, నీరు, పుష్పములు, ఫలవృక్షములు, సముద్రము, పర్వత శిఖరములు, సత్ పురుషులు, గోవు ఇటువంటివాటిలో భగవంతుని అస్థిత్వాన్ని గుర్తించాలి. వాటిలోని కళని నీ చూపు ద్వారా పొందాలి.

## 248, 249 విశ్వసృడ్, విశ్వభుక్

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

విశ్వసృడ్ అంటె విశ్వాన్ని సృష్టించేవాడు. విశ్వభుక్ అంటె విశ్వాన్ని భోజనం చేసేవాడు. మనల్ని పుట్టించినవాడు కాలస్వరూపములో మనల్ని భోజనం చేస్తూ ఉంటాడు. సృష్టికి అవతల భగవంతుడుంటాడు. ఇవతల త్రిమూర్తి తత్వం , మధ్యలో కాలస్వరూపం. ఒకరి నుండి ముగ్గురు పుట్టి మళ్ళీ లయమవుతూ వుంటారు. మనలో కూడా త్రిమూర్తులు పుడుతూ వుంటారు. నీవు తెరలా ఉండగలగాలి. బొమ్మలు వస్తూ పోతూ ఉన్నట్లే, మననుంచి వ్యక్తమవుతూ ఉంటాయి, లయమవుతుంటాయి. ప్రతి వస్తువుకు కాలపరిమితి వుంటుంది. మనకు హాని చేసేవాటిని పెరగనీయ కూడదు. నీవు కూర్చున్న కొమ్మని నీవే నరుక్కోరాదు. అలాగే పీటముడి వేసుకొని ఇరుక్కోరాదు.

## 250 విభుః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

విభుః అంటే పుట్టించి రక్షణ ఇచ్చేవాడు. సంకల్పాలు పుట్టించి వాటిని పరిరక్షించేవాడు ప్రభువు. పిల్లల్ని పుట్టించి పోషించాలి. లేకపోతే నీవు తండ్రివి కాలేవు. సృష్టించి, పోషించి, మమకారం లేకుండా ఉండాలి. విత్తనము బట్టే చెట్టు ఉంటుంది. ఎంత మంచి విత్తనమైనా దానిని పోషిస్తేనే బతుకుతుంది కదా! పెంచిన దానిమీద వ్యామోహము లేకుండా ఉండాలి. మనం పెంచి పోషణ చేయలేని వాటిని సృష్టి చేయరాదు. సృష్టి, స్థితి, లయములలో, కాలం రూపములో, భగవంతుడు శ్రద్ధగా వుంటాడు.

## 251 సత్కర్తా

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

సత్కార్యములు అంటే ఇతరుల హితం కోరి పనులు చేసేవాడు. మనం కూడా అది నేర్చుకోవాలి. రాగద్వేషాలతో కార్యక్రమములు చేయరాదు. చేసే పనులలో సత్యము, ధర్మమూ ఉండాలి. ఇవి ఉంటే ప్రేమ ఉంటుంది. మన ఉపయోగం కోసం చేసేది సత్కార్యము కాదు. ఇతరుల హితం కోసం చేస్తే అది సత్కార్యం అవుతుంది. మనం చేసే పనులలో సత్యము వుందా, లేక అహంకారం వుందా, అని చూసుకోవాలి. భగవంతుడు చేసేవన్నీ హితము కోసం, ధర్మము కోసం చేసేవే! కాబట్టి ఆయన 'సత్కర్త' అయ్యాడు.

## 252 సత్కృతః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

శాశ్వతమైన కీర్తి కలిగిన వాడు. సత్కర్తయితే విశేషమైన పుణ్యం వచ్చి వేల సంవత్సాలు ఆ సత్యం నిలబడి ఉంటుంది. మంచి, చెడు కాలము నిర్ణయిస్తుంది. సత్కార్యానికి ఎప్పుడూ భగవంతుని గుర్తింపు ఉంటుంది. శాశ్వతమైన కీర్తి చేసిన పనిలో వున్న సత్యంపై ఆధారపడి ఉంటుంది. సత్యములో నిలబడి వున్నవారిని కాలము పైకి తీసుకు వస్తుంది. శాశ్వతముగా యుగయుగాలుగా ఉండిపోతుంది. అందుకు ఉదాహరణ శ్రీరాముడే! ఆయన భూమి ఉన్నన్నాళ్ళు ఉంటాడు . అందుకే 'రామో సత్యపరాక్రమః' అని అన్నారు కదా! No good-work done will be left unnoticed. అలాగే మహాత్ములు, వారు చేసిన పనులు అలా నిలబడి ఉంటాయి.

## 253 సాధుః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

"సాధుః" అంటే సత్కార్యములు చేసి తాను వెనక వుండిపోయినవాడు. కిరణములు వలెనే సూటిగా ప్రవర్తించువాడు సాధువు. సాధువు ధర్మము తెలిసి దానిని సూటిగా ప్రవర్తింప చేసేవాడు. గోవుది కూడా సూర్యకిరణ తత్వం. సిద్ధి సాధన అంటే ధర్మము తెలిసి ప్రవర్తించు వాడు. అలవాటు చేసుకోవాలి. అది అలవాటు చేసుకోవడమే సాధన! ఋజుప్రవర్తన కలిగి ఉండాలి. ఆడంబరములు లేకుండా జీవించాలి. అప్పుడు సాధకుడు కూడా సాధువు అవుతాడు. చేసే పనులన్నీ త్రికరణశుద్ధిగా చెయ్యాలి. మనం సాధువుల రూపంలో భగవంతుని చూడవచ్చు.

## 254 జహ్నుః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

"జహ్ను" అంటే ఆజ్ఞా కేంద్రం. నరనారాయణులు కలిసి ఉండేది. చైతన్యం దిగి రావడమే గంగానది అవతరణం. అత్యత్తమమైన మానవప్రజ్ఞకి జహ్ను కేంద్రం. అది పిట్యూటరీ గ్రంథి. ఆజ్ఞ నారాయణ తత్వం. జహ్ను నర నారాయణ గుహ. ఊర్ధ్వలోకములో నారాయణుడు పని చేస్తూ ఉంటాడు. ధ్యానస్థితి తరువాత ధారణ స్థితి. శరీరం మీద నరుడు స్వామిత్వం సంపాదించుకోవాలి. మనల్ని మనము అవగాహన చేసుకోవాలి. అత్యున్నత స్థితి జహ్ను కేంద్రం. హృషీకేశము విశుద్ధి. హరిద్వార్ హృదయం. మూలాధారం నుండి విశుద్ధిమార్గం ద్వారా మూడునాడులూ కలిసేది అక్కడే! నారాయణుడు నరుడు అవటం శ్రీకృష్ణుడు. నరుడు నారాయణుడు అవటం అర్జునుడు.

## 255, 256 నారాయణః, నరః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

వ్యక్తమయ్యే సృష్టి అవ్యక్తము లోనికి వెళ్లిపోవడం, మళ్ళీ అవ్యక్తమైనదాని నుండి వ్యక్తమై సృష్టిలోనికి దిగి రావటం. దీనిని 'నారాయణీయం' అంటారు. ఉత్తరాయణంలో నదులు ఊర్ధ్వగతి చెందటం. దక్షిణాయణం లో నదులు అధోలోకాలకు ప్రయాణం చేయటం. అలాగే లేవడము దిగివచ్చుట, నిద్రించుట వెళ్లిపోవుట. Forward and Backward route నారాయణం. మానవరూపంలో ఊర్ధ్వగతి చెందవచ్చును, అధోలోకాలలోని అనుభూతిని చెందవచ్చు. భూమి మీద వుండే చెట్లు, చేమలు, జంతువులు దేవతలుగా, దేవుడుగా ఉండగలరు. కాని దేవతలు భూమి మీదకు రాలేరు. వాళ్ళ పాదాలు భూమికి పైన ఉంటాయి. నరుడు నారాయుణునికి సన్నిహితమైనప్పుడు, వారికి దేవతలు బాగా సహకరించి వుపకరిస్తారు. నరునిలోని దైవత్వము నారాయణుడు, నారాయణుని లోని మనసు నరుడు. సాధకుడి సాధన బాగా జరగాలి. లోపల భగవంతుని తలచుకోవాలి. గరుత్మంతుడు మనలోని 'హంస తత్వం.' హంస ఆధారంగా స్పందన జరుగుతుంది. హంసకి పరంగా వుండి తాను నడిచేవాడు, నడిపించేవాడు 'పరమహంస'! అలా అంతర్యామి సాధన చేసేవారు యోగులు. వాళ్ళు బంధింపబడనివారు.

మనం కొంచెం అయ్యి నారాయణుడు ఎక్కువగా ఉండాలి. భగవత్ తత్వము నందు మనస్సు లగ్నం చేసుకున్నవారు బ్రాహ్మణులు . తానై తాను రక్షణ కోరనివాడు ధర్మరాజు. వాడే నరుడు. నరుడు నారాయణునికి సన్నిహితమైనప్పుడు వానికి దేవతలు బాగా సహకరిస్తారు. God made man in his own image అన్నారు కదా! నర అనే తత్వాన్ని ఇచ్చేవాడు నారదుడు అంటారు. 'ద' అంటే ఇచ్చేవాడు అని. ఆలా సాధకుడిని నారాయణుడు ఎల్లప్పుడూ కాపాడుతూ ఉంటాడు. అదేగా మహాభారతంలో మనం చూసాము శ్రీకృష్ణుడి రక్షణ . మనము కూడా భగవంతుని శరణు లో, మాస్టర్ సీవీవీ గారి శరణులో ఉండాలి. దేహాభిమానం, ఇతరమయిన ఆలోచనలు తగ్గించు కోవాలి. అప్పుడు 'నారాయణీయం' తప్పక జరుగుతుంది.

## 257, 258, 259, 260, 261 అసంఖ్యేయో, అప్రమేయాత్మ, విశిష్టః, శిష్టక్రత, శుచిః

(ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది)

## 262 సిద్ధర్థాః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

సిద్ధార్థ: అంటే ఏది కోరితే అది జరగడం. అది ప్రత్యక్షమవడం. అంటే పరిపూర్ణత్వము. మానవ జన్మ అన్నింటికన్న విలువైనది. అలా అని మనకు సంకల్పించినవన్నీ జరగవు. కానీ దొరికిన వాటితో తృప్తి చెందటమే పరిపూర్ణత్వము. ఉన్నదానితో తృప్తిపడక లేని దాని గూర్చి తాపత్రయ పడడం పరిపూర్ణత్వము నుండి జారిపోవడమే!

## 263 సిద్ధ సంకల్పః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

అంటే సంకల్పించినివి సిద్ధించడము. దేహంలో వున్నప్పుడే సిద్ధి పొందటము. ఆయన నుండి జరిగే సంకల్పమే వస్తుంది. భగవంతుడు నిత్యతృప్తుడు, సిద్ధి స్వరూపులు అయ్యేవే అంటారు కాని సిద్ధించని/జరగనివి అనరు. శుచి పెరిగిన కొలది ఆకర్షణ బాగా వస్తుంది. శుచి అనగా పవిత్రత, వెలుగు. వెలుగు అమ్మవారు. సంకల్పం మనసుని ఇంద్రియాలను, శరీరాన్ని నడిపిస్తుంది. మనకు క్షేమం కలిగించేవే సంకల్పాలుగా రావాలని గణపతికి రోజూ మొదట నమస్కరించాలి, పనికాలేదు అంటే శుచి పెరగాలి. మనగురించి మరచిపోయి ఇతరుల గురించి శ్రమపడాలి. గురువుకి సమర్పణ చెందినవారు తమ గురించి ఆలోచించరు. తనను గురించి ఆలోచించడం మరచిపోయినవాడు నిజమైన సాధకుడు. భగవంతుడు కర్తవ్యరూపం లో మన వద్దకు వస్తుంటాడు. కర్తవ్యాన్ని కాలం రూపం లో అందిస్తాడు.

## 264 సిద్ధిదః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

సిద్ధత్వము లో కలిగే జ్ఞానము. జరిగే సంకల్పాలలో నుండి కలిగే జ్ఞానము. ఆవిధముగా సిద్ధులుగా తయారు చేయగలవాడు.

## 265 సిద్ధిసాధనః

(ఈ వివరణ సాధకుల notes నుండి సేకరించినవి. గమనించ గలరు.)

సాధనతో సిద్ధి కలుగుతుంది. ఇతరుల కోసం నేనేమి చేయాలి అనేది సిద్ధిసాధనకు మొదటి మెట్టు. పరహితము పరమధర్మము. కర్తవ్యాలను కాలం రూపంలో భగవంతుడు అందిస్తూ ఉంటాడు. నిజంగా నీవు నా శరణు తీసుకుంటే ఇక నీ గురించి ఆలోచించకు. ఇది సాధన. శ్రద్ధ చూపించే కొలది ప్రతిఫలం వస్తుంది. దేవుడికి కళ పెంచితే దేవుడు మన కళ పెంచుతాడు. సమర్పణ చేసుకోవడమే ! We will receive according to our offers. కదా! ఇది ఎలాగంటే మేత పెట్టకుండా ఆవు పాలు పితకడం వంటిది. మేత పెట్టకుండా పాలు ఎలా వస్తాయి? రావు కదా! పనికాలేదు అంటే మనలో ఇంకా శుచి పెరగాలి. ఇతరుల గురించి బాగా శ్రమ పడాలి తన గురించి మరిచిపోయి. లోకా సమస్తా సుఖినో భవంతు.`అందరికి క్షేమము కలిగించే సంకల్పములు రావాలని విఘ్నేశ్వరునికి మొదట నమస్కరించాలి.

## 266 వృషాహి

వృషాహి అంటే వృషభమును సంహరించినవాడని ఒక అర్థం. శ్రీకృష్ణుడు వ్రజంలో వున్న సమయంలో ఒక వృషభాన్ని సంహరిస్తాడు. కాబట్టి శ్రీకృష్ణునికి 'వృషాహి' అనే నామం వుంది. అలాగే మామూలుగా ఆధ్యాత్మిక సాధనలో ప్రతివాళ్ళూ కూడా ఒక ఎద్దును చంపాల్సి వుంటుంది. ఆ ఎద్దును చంపితేగానీ ఆ మార్గంలో నిలబడడానికి అవకాశం వుండదు. ఈ ఎద్దు వృషభరాశిలో ఒక భాగం. ప్రతి రాశి మూడు భాగాలుగా వ్యక్తమవుతూ వుంటుంది. మొదటి 10 డిగ్రీలు ఒక భాగం, రెండవ 10 డిగ్రీలు ఒకభాగం, మూడవ 10 డిగ్రీలు ఒక భాగం. వృషభరాశి అంటే వైశాఖమాసం. వైశాఖమాసం మనందరికీ చాలా పుణ్యమైన మాసంగా పెద్దలు చెబుతారు. ఆకామావై అంటారు. అంటే ఆషాఢం, కార్తీకం, మాఘము, వైశాఖము. ఇవి చాలా పుణ్యమైన మాసాలని చెబుతారు. అన్ని మాసాలూ పుణ్యమైనవే! అన్ని మాసాల ద్వారా భగవదనుభూతికి అవకాశం వున్నది. అందులో కొన్ని మాసాలు ఎక్కువ నానుడిలోకి వచ్చాయి తప్ప శ్రావణమాసమేమీ తక్కువది కాదు. శ్రావణమాసం ద్వారా భగవత్ చైతన్యం పొందడమనేది ముందు ముందు వాళ్ళకి చాలా ఎక్కువగా తెలుస్తుంది. మనకి ఎద్దుని వైశాఖమాసానికి సంకేతముగా ఇచ్చారు. ఎద్దు మూడు రకాలుగా కనిపిస్తూ వుంటుంది. అందులో ఒక ఎద్దు శివుడికి వాహనంగా పనిచేసేది. దానిని 'నంది' అంటాము. ఇంకొక ఎద్దు పొలాలన్నీ దున్ని, పాడి పంట నిర్వర్తించేది. మరొక ఎద్దేమో అలా ఎద్దల్లే తిరిగేది. మూడు రకాల ఎద్దులున్నాయి. ఇందులో ఒక ఎద్దుని మనం సంహరించాలి. బాధ్యతారహితమైన ప్రవర్తన నుండి బాధ్యతలు మోసే ప్రవర్తనలోకి ప్రవేశించడమనేది మొదటి ఎద్దుని హరించడము. బాధ్యతల యొక్క నిర్వహణలో పరిపక్వత పొందినవాళ్ళు భగవత్ సేవకు అర్హత సంపాదించుకుంటారు. భగవత్ సేవకు అర్హత సంపాదించుకోవడమే భగవంతుని యొక్క ప్రణాళికకు, భగవంతుని యొక్క వాక్కుకు వాహనంగా వుండటం అని చెప్పవచ్చును. నంది భగవంతుని సేవకు సంసిద్ధత చూపే ఒక వాహనంగా మనకి కనిపిస్తుంది. అక్కడ నుంచి మనం ఇక్కడ ఎద్దుకి ఇంకొక సంకేతం వుంది. వేద సంప్రదాయం లో మనలోంచి వ్యక్తమయ్యే వాక్కును కూడా ఎద్దు అంటారు. దానికి రేఫమనే పేరు వుంది. "రే" అనే ఒక శబ్దంగా అది వ్యక్తమవుతూ వుంటుంది. దాని నుంచే ఋగ్వేదమనేది వ్యక్తమైంది. ఈ మొత్తం సృష్టి ఒక వాక్కు రూపంలో వ్యక్తమైంది కాబట్టి ఆ వ్యక్తమైన నాదమేదైతే వుందో, శబ్దమేదైతే వుందో, దాన్ని 'వాక్కు' అన్నారు. ఆ వాక్కును కూడా వృషభమనే పిలుస్తారు. ఒక వృషభము నందీశ్వరుడిగా దేవుని వాహనంగా పనిచేసేది. దేవుని యొక్క ప్రణాళికలో భాగంగా పనిచేసేది. అట్లాగే వృషభమంటే సృష్టి విత్తనం నుంచి చెట్టు ఎలా విచ్చుకుంటున్నదో, అలాగే నాదం నుండి ఈ మొత్తమంతా వ్యక్తమైనదాన్ని కూడా వృషభమంటారు. ఒక వృషభాన్ని శ్రీకృష్ణుడు చంపినట్లుగా కృష్ణుని యొక్క జీవితచరిత్రలో కనిపిస్తుంది. ఇలాగే Greek సాంప్రదాయంలో కూడా Herculas అనే భాగవతోత్తముడు ఒక ఎద్దుని చంపినట్లు వుంది. Herculas అంటే మాస్టరుగారు ఇచ్చారు 'హరికులేశుడు' అనే పదాన్ని

కొంచెం మారి Herculas అవుతుంది. హరికులేశుడంటే హరి భావనలో జీవించేవాడు. అంటే భాగవతమార్గంలో జీవించేవాడు. ప్రతివాడూ కూడా ఒక ఎద్దుని చంపాలి. ఆ ఎద్దు మనలో వాక్కును వినియోగించడంలో వుండే నిర్లక్ష్యము. దానిని చంపాలి. ఇది మొదటి స్థితి, వాక్కును వినియోగించినప్పుడు ఎంతో బాధ్యతతో వినియోగించాలి. ఇది రెండవ స్థితి. బాధ్యతా రహితంగా వాక్కును మనం వినియోగించడం మానేస్తే అది మన నుండి ఉద్భవిస్తూ వుంటుంది, అది మూడవ స్థితి. మనం మాట్లాడటం మానేస్తే మన నుండి మాటలు ఉద్భవిస్తాయి. పెద్దవాళ్ళందరూ అలా మాట్లాడతారు. వాళ్ళు మాట్లాడుతున్నామని అనుకోరు. వాళ్ళ మనస్సు, ఇంద్రియములు, శరీరము ప్రశాంతంగా వున్నప్పుడు, వాళ్ళ నుండి వాక్కు ప్రవాహం వలె వ్యక్తమై, ఇతరులకు ఆనందం కలిగించి, ఇతరులకు ఆశీర్వచనం కలిగించి, ఇతరులకు ఉత్సాహం కలిగించేటట్టుగాను, ఇతరులకు జ్ఞానం కలిగించేటట్లుగాను వ్యక్తమౌతూ వుంటుంది. ఎందుకంటే వ్యక్తమయ్యే స్వభావం వాక్కు కి వుంది కాబట్టి. మొట్టమొదట వాక్కును బాధ్యత లేకుండా వినియోగించడం అనేది మానేస్తే తప్ప భగవత్తత్వం అవగాహన అవడానికి అవకాశం లేదు. ఏదో మాట్లాడే బదులు మాట్లాడకుండా వుండడం ఉత్తమము. మనుష్యుల కొక్కళ్ళకే ఈ వాక్కు ఇచ్చాడు కాబట్టి దానిని సద్వినియోగం చేసుకొంటే, తానే వాక్ స్వరూపుడుగా తనకి గోచరిస్తాడు. దుర్వినియోగం చేసుకొంటే అది కారణంగానే పతనం చెందుతాడు. సాధన చేస్తున్న వారికి మనమనుకొనే డబ్బుకన్నా వాక్కు చాలా విలువైనది. మనం విలువైనవి అని అనుకొనే వాటన్నిటికన్నా చాలా విలువైనది. అందుకని దానిని సవ్యమైన పద్ధతిలో వినియోగించుకోకపోతే, మనసు తనను తాను పతనం చేసుకొంటుంది. ఎవరో పతనం చేయనక్కరలేదు. మాట సరిగా లేకపోతే పతనమైపోతారు. అందుకనే మహాత్ములు మానవుని వాక్కుని బట్టి గుర్తిస్తారు. వాళ్ళ మాటను బట్టి వాళ్ళు ఏ రకమైన చైతన్యస్థితిలో వున్నారన్నది గమనిస్తారు. మామూలుగా మాట్లాడితే మనగురించి గొప్ప. ఇంకొకళ్ళ గురించి చెడు. ఈ రెండూ లేకుండా మాటలుండవు. అలా కాకుండా మాటల్ని కేవలం అవసరానికే వినియోగించాలి. వినియోగించేటప్పుడు కూడా అవసరమయ్యే పదములే వేయాలి. ఎక్కువ పదములు వేయకుండా మాట మాట్లాడేటప్పుడు మనలో వుండే భావాలను స్పష్టంగా వ్యక్తం చేయగలిగి వుండాలి. మనకి ఇంకొకరు భావం అందించితే, దానిని ఇంకొకరికి అందించేటప్పుడు వున్నది వున్నట్లుగా అందించగలిగి వుండాలి. మామూలుగా ఏం జరుగుతుందంటే వాళ్ళు చెప్పేది ఒకటి, మనం వినేది ఇంకొకటి. అందుకనే మనం ఇంకొకళ్ళతో చెప్పేటప్పుడు ఆ మొదటివాళ్ళు చెప్పిన మాట, చెప్పినట్లు చెప్పగలిగినవాళ్ళు చాలా తక్కువమంది వుంటారు. అలా చెప్పకపోతే వికృతి చెందుతూ వుంటుంది. నష్టం జరిగిపోతూ వుంటుంది. గురువు దగ్గర నుండి చక్కగా వచ్చినమాట శిష్యుడు గనక సత్యమందు నిలబడి వుండకపోతే, శిష్యుడి ద్వారా వక్రత చెందుతూ వుంటుంది. అట్లా వక్రీభవించి కొన్ని శతాబ్దాల తరువాత గురువుగారు చెప్పిన మాట ఒకటి, వాళ్ళు అనుకొనే మాట ఒకటి అవుతుంది. ఆ విధంగానే ప్రతి మహాత్ముడు చెప్పిన బోధలు వక్రీభావం చెందుతూ వుంటాయి. కారణమేమంటే ఆయన చెప్పినదే మనం చెబుతున్నామని అనుకుంటూ, మన స్వభావం దానికి జోడించి చెప్పటం వుంటుంది. అందుకని సత్యం సత్యంగా, యధాతథంగా, వున్నది వున్నట్లు బయటకురాదు. అలా

బయటకు రావాలంటే వాక్కుకి సంబంధించిన సాధన బాగా చేయాలి. వాక్కుకి సంబంధించిన సాధన ఎంత బాగా జరిగితే అంత ఈ బహిర్లోకంలో మనకున్న యావలు, వ్యామోహాలు నెమ్మదిగా తగ్గిపోతాయి, బహిర్గతమైన జీవితంలో తీరని విషయాలు బోలెడుంటాయి మనకి. ఆ విషయాల యందు మనకి ఒకరకమైన విరక్తి ఏర్పడాలంటే వాక్కుతో కూడిన తపస్సు చేసుకొంటూ వుండాలి. దానికి 'వాక్ తపస్సు' అంటారు. అందుకనే జ్యోతిష పరంగా ఏం చెబుతారంటే ఈ వైశాఖమాసంలో జీవిస్తున్న ప్రజ్ఞ, కార్తీకమాసంలోకి రావాలంటారు. వైశాఖమాసంలో మనకి కనిపించే సంకేతం ఎద్దు. ఎద్దు ఏ చేలో పడితే ఆ చేలో తింటూ, ఎక్కడబడితే అక్కడ మేస్తూ, అక్కడా ఇక్కడా దెబ్బలు తింటూ, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తూ వుంటుంది. కార్తీకమాసంలో మనకి తేళ్ళు, పాములు విపరీతంగా కనిపిస్తాయి. తేళ్ళు, పాములకి సంకేతమేమిటంటే బహిర్గతమైన ప్రపంచంలోంచి అంతర్గతమైన ప్రపంచంలోకి తనను తాను తిరోధానం చేసుకోవడం. అందుకనే కార్తీకమాస ప్రజ్ఞలోకి ప్రవేశించాలి వైశాఖమాసం నుండి. మళ్ళీ తిరిగి వైశాఖమాసంలోకి వెళ్ళవచ్చును. కార్తీకమాసంలో కార్తికేయుడుంటాడు. వైశాఖమాసంలో వైశాఖుడుంటాడు. అంతా ఒకటే, కాకపోతే సాధనలో ముందు మనం బయట ప్రపంచంలో చొచ్చుకొనిపోవడం అనే యావ తగ్గించుకొని, మన లోపల ప్రపంచంలోకి చొచ్చుకుని వెళ్ళినట్లైతే ఈ బయట విషయాలన్నీ కూడా గింజ తక్కువ, పొట్టు ఎక్కువ అని తెలుస్తుంది. నీరు తక్కువ, నురుగెక్కువ అని తెలుస్తుంది. సముద్రపు అలయొక్క నురుగులో సముద్రమెంత వుందో బయట జీవితంలో ఎక్కువభాగం అట్లా వుంటుంది. ఊకలో గింజలేరుకుందామనుకొంటే ఎన్ని వుంటాయో అలాగే వుంటుంది. అంతరంగ జీవితంతో ముడిపడి బహిరంగ జీవితంలో జీవించేవాళ్ళకి సారవంతమైన జీవితం వుంటుంది. కాబట్టి సారవంతమైన జీవితంలోకి ప్రవేశించాలంటే, మామూలుగా మనకి వుండే విలువలకీ, ఆధ్యాత్మిక సాధనలో వుండేవాళ్ళ విలువలకీ తేడా వుంటుంది. ఆధ్యాత్మిక సాధనలో వుండేవారికి బయట ప్రపంచంలో వున్న విలువలతో సంబంధముండదు. వాటిని కేవలం మన్నించడం వుంటుంది తప్ప వ్యామోహం వుండదు. వాటిచుట్టూ తను తిరగడం వుండదు. తనలో వుండే ఆత్మతత్వం వైపు తను తిరగడం వుంటుంది. దీనినే జ్యోతిషపరంగా బయట ప్రపంచంలో వుండే ఆకర్షణవైపు మొగ్గి, వాటికోసం తిరుగుతున్నవాళ్ళు మనసు ప్రధానంగా జీవిస్తున్న మనుష్యులని చెబుతారు. ఇక్కడికెళ్ళి ఇవి చూద్దాం, అక్కడికెళ్ళి అవి చూద్దాం అని ఇట్లా తిరుగుతున్నామనుకోండి. ఎక్కడ చూద్దామనుకుంటున్నావో అక్కడ ముందు ఆధ్యాత్మికపరంగా లోపలే దర్శనం చేయడం అనే దీక్ష ఒకటి తీసుకోవాలి. తీసుకున్న తరువాత ఆ దీక్షలో భాగంగా, నీ బాధ్యతలతో ముడిపడి కొన్ని కొన్ని ప్రదేశాలకు వెళ్ళవచ్చు. కొంతమంది మహాత్ములను దర్శనం చేయవచ్చు. అలాకాకుండా ఊరికే ఉత్సాహం కొద్దీ, కుతూహలం కొద్దీ చేయడమన్నది తగ్గిపోతుంది. బయట ప్రపంచంలో కుతూహలం ఆధారంగా చేసే కార్యక్రమాలన్నీ కూడా మనసు ప్రధానంగా చేసే కార్యక్రమాల క్రింద వస్తాయి. మనస్సును జ్యోతిష పరంగా చంద్రునితో పోలుస్తారు. చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతూ వుంటాడు కదా! కనుక పదార్థమైన ప్రపంచం చుట్టూ తిరుగుతూ వుంటారు. తన అంతరంగంలోకి వెడితే బుద్ధితో, ఆత్మతత్వాన్ని దర్శనం చేయడానికి అవకాశం వుంది కాబట్టి బుధుడు సూర్యుడి చుట్టూ ఎలా తిరుగుతున్నాడో

అట్లా తిరగడం వుంటుంది. చంద్రుడు భూమిచుట్టూ తిరిగినదానికీ, బుధుడు సూర్యుని చుట్టూ తిరిగినదానికీ చాలా తేడా వుంటుంది. మనలో వుండే బుద్ధి అంటే పవిత్రీకరణ చెందిన మనస్సు ఆత్మతత్త్వం వైపు ఎప్పుడూ మ్రొగ్గి వుంటుంది. అదీ బుధుడు సూర్యునికి దగ్గరగా వుండటమంటే. మన సూర్యమండలంలో సూర్యునికి అతిదగ్గరగా వున్న గ్రహం బుధుడు. బుధగ్రహ మెప్పుడూ సూర్యునిచుట్టూ తిరుగుతూ వుంటుంది. అతి సమీపంగా వుంటుంది. అంటే ఆత్మతత్త్వానికి అతి సన్నిహితంగా వుంటుంది. చంద్రుడు భూమికి సన్నిహితంగా వుంటాడు. అలాగే మన మనస్సు ఈ పంచభూతాలతో తయారుచేయబడిన ఈ ప్రపంచము నందు వ్యామోహం చెంది అందులో జీవించడం మొదలు పెడితే మనస్సు ప్రధానంగా జీవించడం జరుగుతుంది. మనస్సు ప్రధానంగా జీవించడం కాకుండా, బుద్ధి ప్రధానంగా జీవించే మార్గం ఈ 'వృషాహీ' అనే పదంలో బాగా ఇచ్చారు. ఎందుకిలా ఎద్దును చంపాలన్నారంటే బయట ప్రపంచంలో ఎలాబడితే అలా జీవించడం కాకుండా ఒక కట్టుబాటుకి లోబడాలని. ప్రతీ చేలో పడి తినే ఎద్దు ముక్కుకి ఒక తాడు వేసి, ఒక బాధ్యతకి కట్టుబడేలా చేసి, ఆ బాధ్యత సరిగ్గా నిర్వర్తిస్తున్నారో లేదో చూస్తారు. బాధ్యతలు మూడు నాలుగు రకాలుగా వుంటాయి. ఒకటి తల్లితండ్రులకు తనయుడిగా సేవ చేయవలసిన బాధ్యత. సోదరులకు సోదరుడిగా చేయవలసిన బాధ్యత, ఒక కుటుంబంలో భార్యగానో, భర్తగానో కుటుంబానికి చేయవలసిన బాధ్యత, అలాగే సంఘంలో చేయవలసిన బాధ్యత. ఈ బాధ్యతలను నిర్వర్తించడం ఎలాగో, అలాగే వాక్కుకు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించాలి. ఎవరైనాసరే చిన్నతనం నుండీ వాక్కుకు సంబంధించిన బాధ్యతలు స్వీకరించినట్లైతే, వారి జీవితం వృథాగా గడిచిపోదు. వాళ్ళెప్పుడూ నిస్సంశయంగా జీవిస్తూ వుంటారు. వాక్కులో మామూలుగా జరిగేది ఉన్నది లేనట్టు చెప్పడం. మనం కొంతమంది మనుష్యులు నచ్చితే వారి గురించి చెబుతూ వాళ్ళల్లో లేని మంచి విషయాలు కూడా చెబుతూ వుంటాము. కొంతమంది మనుష్యులు మనకిష్టం లేకపోతే వాళ్ళల్లో లేని చెడ్డ విషయాలు కూడా చెబుతూ వుంటాము. అంటే మనం ఎవరి గురించి మాట్లాడినా, దేని గురించి మాట్లాడినా ఉన్నది వున్నట్లు మాట్లాడే ఒక స్థితిని కోల్పోయాము. కారణమేమంటే మాటలు ఇష్టాయిష్టాల మీద వస్తూ వుంటాయి. మనకో ప్రదేశం ఇష్టమనుకోండి ఆ ప్రదేశం గురించి వున్న దానికన్నా ఎక్కువ చెబుతాము. ఒక ప్రదేశం ఇష్టం లేదనుకోండి వున్న దానికన్నా తక్కువ చెబుతాము. లేని చెడు విషయాలు చెబుతాము. ఇది మనుష్యుల విషయంలో సత్యం. ప్రదేశాల విషయంలో సత్యం. సన్నివేశాల విషయంలో సత్యం. ఉన్నది వున్నట్లుగా మాట్లాడగలగడమనేది ఒక సత్యమే! అలా మాట్లాడగలగడమనేది మొదటి సాధన. వాక్కుకు సంబంధించిన తపస్సు చాలా ముఖ్యమైన తపస్సు. అది వుంటే అవసరమైన కార్యకలాపాల్లో వుండటం వీలుపడుతుంది. బాధ్యత పడడానికి వీలుపడుతుంది. ఎప్పుడైతే వాక్కు సరియైన పద్ధతిలో వినియోగం జరుగుతూ వుంటుందో, ఎద్దు ముక్కుకి తాడు వేసి పొలంలో పనిచేయిస్తారు. లేకపోతే బండికి కట్టి లాగిస్తారు. అంటే నలుగురికీ పనికివచ్చే పనిచేయడంగా వుంటుంది. బాధ్యతపడి జీవించడంగా వుంటుంది. ఆ విధంగా మనం వాక్కుకి ముక్కు తాడు వేసామనుకోండి, వాఙ్మయమము గలిగిన శరీరం చేసే పనుల్లో ధూళి అంతాపోయి పంటగా మారుతుంది. శరీరాన్ని పంటభూమిగా

తయారుచేయడానికి వాక్కు చాలా ప్రధానం, వాక్కు ఎంత చక్కగా వుంటే, అంత చక్కగా తయారవుతుంది శరీరం. వాక్కు బాలేకపోతే శరీరం క్షీణిస్తుంది. అందుకే ఎద్దు చేత ఏ విధంగా పొలం దున్నిస్తామో, అలాగే ఈ వాక్కు చేత మన శరీరాన్ని పునర్నిర్మాణం చేసుకోవచ్చును. అందుకే ఓంకారం చేయటం. అందుకనే సూక్తాలు చదవడం, అందుకనే స్తోత్రాలు చేయడం, అందుకనే పూజలు చేయడం, భజనలు చేయడం. ఇవి చేయడం వలన శరీరం సారవంతమై మనకి ఆధ్యాత్మిక సాధనకు ఎక్కువ తోడ్పాటు చేస్తూ వుంటుంది. మన పెద్దలది గ్రహించి, భగవంతుని అనుభూతి పొందే మార్గాల్లో ఒక తాళంచెవిగా, రోజూ ఒక గంట సేపు వాక్కుతో పవిత్రమైన శబ్దాన్ని ఉచ్చరించే ఒక మార్గం చెప్పారు. దాని పేరే 'శిక్ష'. మనకి వేదాంగాలలో ఒకటి 'శిక్ష'. శిక్ష అంటే పవిత్రమైన శబ్దాలని రోజూ ఒక గంట సేపు ఉచ్చరించటం. అందుకని విష్ణుసహస్రనామం 20 నిముషాలు చేసుకొని, తరువాత విషయాలు చెప్పకుంటున్నాము. ఎందుకంటే పవిత్రమైన వాక్కుతో అనుసంధానం చెంది, తరువాత పవిత్రమైన విషయాలు ప్రసంగించుకోవచ్చని. ఎప్పుడూ కూడా ఓంకారం చేసిన తర్వాత మాట్లాడితే ఎక్కువ బాగుంటుంది. రావటం రావటం మనం గభాల్న కూర్చొని మాటలు మాట్లాడుకొంటే, మనలో సరస్వతి చక్కగా ప్రవహించడానికి అవకాశం వుండదు. అందుకని పెద్దలు మనకు సాధనలో భాగంగా ప్రతి ఉదయం ఏవో మాటలు మాట్లాడడానికి ముందుగా ఓంకారం చేయడం, గాయత్రీ మంత్రం పారాయణ చెయ్యడం. మనవరకు కొన్ని సూక్తములు వినడం, కొన్ని స్తోత్రములు చేయడం, గీతములు పాడడం, భజనలు చేయడం ఇన్ని రకములుగా ఇచ్చారు. ఓంకారము మనలో వుండే ప్రజ్ఞ, సృష్టి ప్రజ్ఞతో అనుసంధానం చేసుకొనేటట్లు ఒక అమరిక చేసియున్నది. అందుకనే ఓంకారం చేయడం. ఓంకారం చేసిన తరువాత, నాలుకకు ఒక గంట సేపు మంచి విషయాలు ఉచ్చరించడం అలవాటు చేస్తే, ఆదే నాలుకతో మరొక విషయం మాట్లాడడానికి బుద్ధి కొంచెం అడ్డుపడుతుంది. మాట్లాడే ముందు ఎందుకులే ఈ మాటలు అనిపిస్తుంది. అట్లా అనిపించడం లేదనుకోండి ఈ చేస్తున్నవన్నీ కూడా వృధా! ఎందుకు మనం చేస్తున్నామంటే, ఈ స్తోత్రాలని చేయడం వలన భగవంతుడు చాలా ఆనందించి మనల్ని ఉద్ధరిస్తాడని అనుకోవడం సత్యం. కానీ దానికి కీలకమైన విషయమేమిటంటే భగవంతుడు అనుగ్రహించడానికి కావలసిన వాక్కుకి సంబంధించిన మార్గం మనలో సుస్థిరమవడానికి మనం ఈ ఉచ్ఛారణ చేయాలి. సూక్తములంటే చక్కగా ఉచ్చరింపబడినవి. చక్కగా ఉచ్చరించడమే మనకి స్వభావమైనదనుకోండి తరువాత మనం శాస్త్రాధ్యయనం చేయవలసిన అవసరం లేదు. మన మాటలు భగవంతుని పరంగా వ్యక్తమవుతూ వుంటాయి. భగవంతుని వాణిగా వ్యక్తమవుతుంటాయి. మహాత్ముల యొక్క మాటలు మంత్రాల్లా పనిచేయడానికి కారణం ఏమిటంటే, మనలాగ వాళ్ళు మాట్లాడరు కాబట్టి. వారు అక్కడ నుండి వచ్చే వాక్కుకి ఇక్కడ తాము వాహికగా వుంటారు. అందుకనే సాధన చేసుకొనేవారు రోజూ ఒక గంట సేపు సూక్తాలు చదవాలి. అదీ ఉదయమైతే మరీ మంచిది. రోజంతా వాక్కును వాడతాము కాబట్టి సరైన పద్ధతిలో వాక్కు వాడడానికి అవకాశమేర్పడుతుంది. అలా జరగనప్పుడు ఏమవుతుందంటే మన గొంతులో వున్న ఒక కేంద్రం దానికి అడ్డువస్తుంది. మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరగడానికి, గట్టిగా గాలి పీల్చడానికి బొడ్డులో ఒక కేంద్రం

వున్నది. ఆ కేంద్రం బాగా బలంగా వుంటేనే గాలిని అంటే ప్రాణవాయువును బాగా పీల్చగలము. అలాగే పూర్తిగా గాలి వదలాలంటే దానికి సంబంధించిన పట్టు, గొంతులో విశుద్ధి చక్రం దగ్గరగా వుంటుంది. సరిగ్గా మాటలు మాట్లాడక, మాటల ద్వారా ఇతరులను ఇబ్బంది కలిగించినవారు, మాటల ద్వారా ఇతరులకు కష్టాలు కలిగించిన వాళ్ళు, మాటల ద్వారా ఇతరులను బాధ పెట్టేవాళ్ళు గాలి సరిగ్గా వదలలేరు. ఎందుకంటే ఇక్కడ వుండే బలం తగ్గిపోతుంది. గాలి సరిగ్గా వదలకపోవడం కారణంగా బొగ్గుపులుసు వాయువు దేహంలో బాగా చోటు చేసుకుంటుంది. గాలి బాగా వదలడం ద్వారా మనలో వుండే carbon అంతా బయటకు వదులుతాము, నిర్మూలిస్తాము. ఎప్పుడైతే ఈ నిర్మూలనం సరిగ్గా జరగడంలేదో వాక్కు సరిగ్గా లేదని అర్థం. వాక్కు సరిగ్గా లేనివాళ్ళకి carbon deposits ఎక్కువైపోతాయి. దానివలన శరీరంలో వ్యాధులు ప్రబలుతాయి. మొట్టమొదటి వ్యాధి ఏమిటంటే మలబద్ధకం. మలబద్ధకం వున్నదంటే ఆయుర్వేద మార్గంలో లేక యోగమార్గంలో అసలు మాటలు ఎలా వున్నాయని చూస్తారు. అక్కడ నుండి మొదలుపెడతారు. ఎన్ని మందులేసుకున్నా మాటలు బాగుండకపోతే మందులు పనిచేయవు. ఎందుకంటే మాటలకు సంబంధించిన పట్టు విశుద్ధి కేంద్రం లో వున్నది. కాబట్టి విశుద్ధి కేంద్రం బాగా బలహీనపడటం వలన, మనలో వుండే carbon expel కాదు. అలాగే బొడ్డు దగ్గర వుండే మణిపూరక చక్రంలో బలం తగ్గుతుంది. దాని కారణంగా విశుద్ధి దగ్గర బలం తగ్గుతుంది. ఎప్పుడైతే గాలి సరిగ్గా వదలలేమో, గాలి సరిగ్గా పీల్చలేము. ఇలా ఒకదానికొకటి గొలుసల్లే ముళ్ళు పడిపోతాయి. ఎట్లా మాట్లాడాలో అన్నది నిజంగా మానవుడు ఈ 20 వ శతాబ్దంలో మర్చిపోయాడు. ఎంతో విషయంలో misrepresentation వుంటుంది. మాటల విషయంలో criticism వుంటుంది. మాటల విషయంలో miss judgement వుంటుంది. కొన్ని కొన్నింటికి వారిట్లా, వీరిట్లా అని మాట్లాడుకుంటాము కదా! మహాత్ములు ఎవరి విషయంలోనూ అలా మాట్లాడరు. హాస్యంగా ఏదో మాట్లాడుకోవడం వుంటుంది తప్ప, ఒకళ్ళ గురించి పరీక్షలు చేసి, తనే మార్కులు వేసి, తప్పు రైటు తక్కెడ వేయడం వుండదు. వాళ్ళ స్వభావాన్నెరిగి, దానికి తగినట్లుగా వీళ్ళ స్వభావాన్ని అనుసంధానం చేయడం వుంటుంది. శ్రీకృష్ణుడంతటి వాడు 'అలా మాట్లాడబోక, తెలిసినవాళ్ళు, తెలియనివాళ్ళు అని వున్నారు తప్ప, మంచి చెడు అని లేదు ఈ ప్రపంచంలో' అని చెప్తాడు. తెలిసినవాళ్ళు, తెలిసినవాళ్ళతో తెలిసినట్లు ప్రవర్తించడం వున్నది. తెలియని వాళ్ళకి ఎలా ప్రవర్తించాలో తెలియదు. కాబట్టి మనం ఎదుటి వ్యక్తితో ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించడం ముఖ్యం తప్ప, వాడు ఎలా ప్రవర్తించాడన్నది కాదు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, భాగవతంలో ఇవ్వబడ్డ మహాత్ములు వీళ్ళందరూ వాళ్ళ మాటల్ని ఏ విధంగా వినియోగించారు అన్నది మనం చూసుకోవాలి. అలాగే మన రోజూ సాధనలో కూడా ఒక గంట సేపు చక్కగా గొంతువిప్పి స్తోత్రాల పారాయణ సాధన చేసినట్లైతే, బీడుభూమి అంతా పంటభూమిగా మారినట్లుగా ఈ శరీరం సారవంతమై మనకి ప్రజ్ఞ ప్రవహించడానికి ఎక్కువ అవకాశం ఏర్పడుతుంది. అది జరగాలంటే ముందు కొన్ని చావాలి. ఏమిటి చావాలంటే, పిచ్చి పిచ్చి మాటలన్నీ చచ్చిపోవాలి. అదే 'వృషాహి'! ఎద్దును చంపటమంటే అదీ! బాధ్యతారహిత మైన మాటలు, బాధ్యతారహిత మైన చేష్టలు, మనకి కాని పనులలో వేళ్ళు పెట్టే స్వభావాలు, ఏ ఇద్దరో మాట్లాడుకుంటూ వుంటే వెళ్ళి మధ్యలో మాట్లాడడము కూడదు.

మనకి సంబంధించినది కాకపోయినా సరే ఇద్దరు మాట్లాడుకుంటున్నప్పుడు మూడవవాడు అక్కడ వుండటమే సమంజసము కాదు. ఉన్నా, మౌనంగా వుండటము ఉత్తమము. మనకు ప్రతీవాళ్ళమీద, సన్నివేశాల మీద, ప్రదేశాల మీద స్థిరమైన అభిప్రాయాలు వుంటాయి. ఇవన్నీ తొలగించుకోవడమనేది ఈ వృషభాన్ని చంపటం వంటిది. చంపితే, అది ఆధారంగా వీడిలో బాధ్యతలు పెరగటమే కాకుండా వీడు 'వృషాహీ'అవుతాడు.

# 267 వృషభః

'వృషభం' అంటే మనలో నుండి వ్యక్తమయ్యే వాక్కు. మనలో నుండి వాక్కు ఎలా వ్యక్తమవుతున్నది? నిశ్వాస ఆధారంగా వ్యక్తమవుతున్నది. నిశ్వాసకి ఆధారం ఉచ్ఛ్వాస. ఉచ్ఛ్వాస, నిస్వాసల కాధారం శ్వాస. శ్వాస కాధారం స్పందనం. స్పందనాని కేదైతే ఆధారమో అదే వాక్కు. స్పందనం జరగడంవలన ఉచ్ఛ్వాస, నిశ్వాస జరుగుతూ వుంటాయి. స్పందనానికి ఏమిటి ఆధారం? దానినే 'దైవ'మన్నారు. దానినే 'నాద'మన్నారు. ఆ నాదం బయలుదేరి వస్తూ వుంటే, స్పందనం జరిగి, స్పందనంలోంచి వ్యక్తమవుతూ వుంటుంది. స్పందనం జరగడానికి నాదం కారణం. నాదం వ్యాపనం చెందడానికి స్పందనం కారణం. అంటే నాదం వ్యాపనం చెందడానికి స్పందనం కావాలి. స్పందనం జరగడానికి నాదం కావాలి. స్పందనం జరిగించే ప్రజ్ఞను 'నాదము' లేక 'దైవ' మంటారు. దానినే 'వాక్కు' అంటారు. దానినే 'ఓం' అంటారు. దానినే 'శబ్దబ్రహ్మ' అంటారు. దానినే బైబిల్ లో 'The Word' అన్నారు. అది వ్యక్తమవడానికి స్పందనం కావాలి. విష్ణుమూర్తి తిరగాలంటే గరుత్మంతుడు కావాలి. గరుత్మంతుడు లేకపోతే విష్ణుమూర్తి తిరగలేడు. మనం తిరగాలంటే మనకి స్కూటర్లు, కార్లు కావాలి కదా! కాళ్ళతో తిరగటమనేది మానేసాము. ఏమయ్యా రాలేదు అంటే, కారు లేదు స్కూటరు లేదు అంటాడు. కాళ్ళున్నాయని మర్చిపోయాడు ఈ యుగంలో. అట్లా తిరగటానికి, వ్యాపనం చెందటానికి స్పందనం కావాలి. ఏది? వాక్కు! అసలు స్పందనం జరగడానికి వాక్కు కావాలి. వాక్కును 'ఋగ్వేద' మన్నారు. స్పందనని 'సామవేద' మన్నారు. అందుకనే మనకి పెద్దలు చెప్పేది ఎట్లా వుంటుందంటే, రెండిటిలో ఏది ముఖ్యం అంటే ఒకళ్ళేమో సామవేదం గొప్ప ఋగ్వేదం కన్నా అని, ఇంకొకరు ఋగ్వేదం గొప్ప సామవేదం కన్నా అని. రెండూ ముఖ్యం అని మనకు 'గరుడోపాఖ్యానం' లో తెలుస్తుంది. విష్ణువు గరుత్మంతుని కోరుకొంటాడు. గరుత్మంతుడు విష్ణుమూర్తిని కోరుకొంటాడు. విష్ణువు గరుత్మంతునికి వరాలిస్తాడు. గరుత్మంతుడు విష్ణువుకి వరాలిస్తాడు. విష్ణువుకి వరాలిచ్చినవాళ్ళు ఇంకెవరూ లేరు గరుత్మంతుడు తప్ప. గరుత్మంతుడు విష్ణువుని నువ్వు కూడా కోరుకో రెండు వరాలిస్తున్నా నంటాడు. ఎందుకిది చెప్పారంటే ఒకటి నాదం, ఒకటి స్పందనం. ఒకదానికొకటి అనుసంధానం చెందుతాయి. ఎప్పుడైతే వాక్కు సరిగాలేదో, ఈ మొత్తమంతా మనం భ్రష్టు పట్టిస్తాము. వాక్కు బాగాలేకపోతే స్పందనం దెబ్బ తింటుంది. స్పందనం దెబ్బ తింటే శ్వాస దెబ్బ తింటుంది. శ్వాస దెబ్బ తింటే ప్రాణం దెబ్బ తింటుంది. ఎప్పుడైతే సరైన పద్ధతిలో వాక్కు నిర్మాణం చేసుకుంటూ వస్తామో, అప్పుడు ఆ 'వృషభం' పనిచేస్తుంది. ఎక్కడనుండి? మొదటి వాక్కు స్పందనం నుండి వ్యక్తమై, అదే మళ్ళీ శ్వాసగా వ్యక్తమై, అదే మనసుగా ఇలా అది ప్రతిచోటా వ్యక్తమవడాన్ని 'ఉచ్ఛరణం' అంటారు. ఈ మొత్తమంతా కూడా ఉచ్ఛరణ! భగవంతుని యొక్క ఉచ్ఛరణే ఈ సృష్టిగా వ్యక్తమైందని చెబుతారు. మనం ప్రవర్తించే తీరులో వుండే అవకతవకలను తీసేయడం వలన అసలైన వృషభం మనకు దొరుకుతుంది. ఆ వృషభం ఏమిటంటే వ్యాపనం చెందే నాదం! శివుడు అందుకే దాన్నెక్కి వస్తాడు అని చెప్తారు. శివుడు ఇన్ని

వాహనాలుంటే ఎద్దునే ఎందుకు ఎన్నుకున్నాడు? వేదంలో నాదం వ్యక్తమవడానికి సంకేతముగ ఎద్దుని చెప్తారు. అందుకే దీన్ని 'రేఫ' మన్నారు. 'వృషభ 'మన్నారు. దాన్నే 'ఋక్' అన్నారు. అది ఎక్కి, మూలతత్వం వ్యాపనం చెందుతూ వుంటుందన్నమాట! దానికి అనుసంధానం చెంది ఏ వాక్కు అయితే వ్యాపనం చెందుతుందో, దాన్ని అనుసంధానం చేసే ప్రజ్ఞ కూడా భగవంతుడే! మనకి ఈ పిచ్చిమాటలు, పిచ్చిఆలోచనలు, పిచ్చి జీవితము వద్దు, ఏదైనా పద్ధతిలో జీవిద్దామనే భావన ఏ రోజైతే కలిగిందో, ఆ రోజు 'వృషాహీ' అనే భగవత్తత్వం మనలో పనిచేయడం మొదలు పెట్టిందన్నమాట. ఏదో రకరకాలుగా జీవిస్తాం కదా! ఏదో ఒక రోజు ప్రతివాడికీ పుడుతుంది, ఇలావద్దు ఇంకొంచెం బాగా జీవిద్దామని. Let us organise ourselves. ఒక పద్ధతి ఏమైనా పెట్టుకుందాం. మరీ దరిద్రంగా తయారవుతున్నాము జీవితంలో, అని ఎవరికి వారికి అనిపించాలి. అప్పుడు మొదలవుతుంది. నిజమైన సాధన. అంతేకానీ ప్రక్కవాడు తోమితే రాదు. 'అధ యోగానుశాసనం' అంటే అక్కడ నుండి యోగసూత్రాలు! ఎప్పుడైతే తనను తాను నియమించుకుంటాడో, అతడికి 'వృషభః' అనే భగవంతుని యొక్క తత్వం అవగాహన అవడానికి అవకాశం వుంటుంది. ఒకే తత్వం లో నుండి స్పందనం వచ్చి, స్పందనం నుండి ఈ మొత్తం సృష్టంతా వచ్చింది. మనలో కూడా ఆ స్పందనం ఆధారంగానే ఈ మానవ శరీరమంతా నడుస్తున్నది. దానిని మనమేమీ నడిపించడం లేదు. స్పందనం మనం చేయడం లేదు. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు మనం చేయడం లేదు. మనం oxygen పీల్చి carbondioxide వదులుతున్నామనేది భ్రమ. ఎందుకంటే మనకి oxygen, carbondioxide అని చెప్పక ముందు నుంచీ జరుగుతున్నాయి కదా! ఎప్పుడో స్కూల్లో తెలుసుకొన్నాము మనం oxygen తీసుకొని, carbondioxide వదిలివేస్తామని. కానీ ఇది చెప్పకముందు నుంచీ కూడా జరుగుతున్నది కదా లోపల? మన తెలివితేటలతో oxygen పీల్చి, మన తెలివితేటలతో carbondioxide వదిలేస్తున్నామా? లేదు కదా! అలా చాలా ప్రజ్ఞలు మనలో జరుగుతున్నవన్నీ, వ్యక్తమై వున్నవి కూడా అవన్నీ ఆ విధంగా పనిచేయడానికి కారణం ఈ స్పందనమే! అలా వ్యక్తమయ్యేది అంతర్యామి అయిన భగవంతుడే! ఊహ కందనటువంటివాడు మొట్ట మొదటిగా మనకి స్పందనాత్మకుడుగా దర్శనమిస్తాడు. స్పందనానికి పైన ఎవరున్నారంటే, 'నేనే' అని తెలుస్తుంది. నిశ్చలమైన 'నేను'. ఆ 'నేను' కి పేరుండదు, రూపం వుండదు. ప్రక్రియలేమీ వుండవు. అక్కడ నుండి స్పందనంగా వ్యక్తమయ్యాక, ఇన్ని రకాలుగా మనలో కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వుంటాడు. మన లోపల పెద్ద పెద్ద రసాయన కర్మాగారాలున్నాయి, పరిశ్రమలున్నాయి. మన కాలేయంలో మొత్తం chemistry అంతా జరుగుతూ వుంటుంది. మనం పుచ్చుకున్న ప్రతీదీ కూడా మనకి శక్తినిచ్చే పదార్థంగా మారుస్తూ వుంటుంది కదా! జీర్ణకోశం, కాలేయం, పెద్దప్రేవులు, చిన్నప్రేవులు ఇవన్నీ వున్నాయి కదా! అట్లాగే వినబడేవి, కనబడేవి, వాసన చూడగలేవి, స్పర్శనిచ్చేవి. ఇవన్నీ వ్యక్తమవడం కూడా ఈ వృషభత్వానికి సంబంధించిన శబ్దంలో వున్నాయి. ఏమీ లేనటువంటి స్థితినుండి, అన్నీ వున్నటువంటి స్థితికి వ్యక్తమవడం అనే కార్యక్రమం వున్నది. ఆ వ్యక్తమవడమే వృషభత్వం! ఎక్కడ ఏది వ్యక్తమవుతున్నా, దాన్ని 'వృషభుడు' గా దర్శనం చేయాలి. మనలో వృషభుడు ముందు ఈ స్పందనానికి ఆవతల వుండి, క్రమంగా వ్యక్తమవుతూ, అక్కడనుండి ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా వ్యక్తమవుతూ, అక్కడనుండి

మనలో భావంగా వ్యక్తమవుతూ, భావం భాషగా వ్యక్తమవుతుంది. భాష నుండి మళ్ళీ బయటికి వైఖరీ వాక్కుగా వ్యక్తమైనప్పుడు, కంఠం దగ్గర ఈ వృషభం వున్నది. భావంగా వున్నది, స్పందనంగా వున్నది. అంతకుముందు ఎప్పుడూ శాశ్వతంగా వుండే స్థితిలో వున్నది. శాశ్వతుడైన భగవత్తత్వాన్ని బయటకు వ్యక్తం చేసే స్థితిలోకి గనుక మనం ఎదిగినట్లైతే, మన స్థితి 'నంది'! సూక్తములను ఉచ్చరించుకొంటూ, మంచిమాటలు చెప్పుకుంటూ, మంచిని ప్రచారం చేసుకుంటే, మంచికే నాలుకను వాడితే, The tongue of good report అంటారు Messanic lodge లో. 'The tongue of good report అంటే వీళ్ళ గురించి అందరూ మంచి చెబుతున్నారు. అందుకని వీడిని తీసుకోవచ్చును సాధనలోకి' అని అనుకొంటారు. కానీ వీడి గురించి అందరూ మంచి చెప్పడం లెక్కగాదు. ఎందుకంటే ఊళ్ళో పలుకుబడి వుండేవాళ్ళ గురించి, అధికారంలో వుండేవాళ్ళ గురించి ప్రతివాడూ మంచే చెబుతాడు కదా! లేకపోతే ఇబ్బంది. వీళ్ళందరి గురించి మంచి చెప్పేవాళ్ళు The tongue of good report క్రింద లెక్కకాదు. 'ఇతని నాలుక నుండి ఎప్పుడూ అపశబ్దంబులు రాలేదు. ఈయన్ని చూసుకోండి' అని ఒక పద్ధతి వుంది మనకి. కొన్ని పవిత్రమైన విద్యాలయాలు ఈ భూమిమీద అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ వున్నాయి. అవి రహస్యమైన స్థావరాల్లో వుంటాయి. వాటికి ప్రవేశం ఎట్లా వుంటుందంటే మనిషి వాక్కుకి వున్న పవిత్రతను బట్టి! వాక్కులో పవిత్రత పెరుగుతున్న కొద్దీ ఇతనికి పరిశుద్ధమైన వాక్కు వున్నది, అని గమనిస్తారు. అదీ tongue of good report అంటే! మంచే పలుకుతుంది ఆ నాలుక! Good reports ఇస్తుంది తప్ప, bad reports ఇవ్వదు. ఏవో పిచ్చి పిచ్చి reports ఇవ్వదు. It always gives good report. అలా వున్న వాళ్ళకి నిజమైన సాధన మార్గాలు దొరుకుతాయి. మనకి భక్తి పేరున ఎన్నో చెల్లుబాటు అయిపోతూ వుంటాయి గానీ నిజానికి ఋషి ప్రోక్తమైన మార్గము, సనాతనమైన ధర్మమార్గములోకి మనం ప్రవేశించామా లేదా అన్నది మన మాటబట్టి తెలుస్తుంది. మాటల్లో కసి, కోపం, ద్వేషం అన్నీ వ్యక్తమౌతున్నాయనుకోండి పాములా వుంటాయి. ఆ స్థితి నుండి, మాటల నుండి మంత్రాలు వ్యక్తమౌతున్నాయనుకోండి ఆ స్థితికి ఎదగడానికి సంబంధించిన కార్యక్రమం అంతా వృషాహీ, వృషభో: ఎప్పుడైతే మనం ఆ విధంగా వృషభంగా తయారవుతామో ప్రజ్ఞ చాలా సులభంగా వ్యాపనం చెందుతుంది.

## ౨౬౮ విష్ణు:

"విష్ణు:" అంటే వ్యాపకశక్తి. సృష్టిలో విష్ణు పదాన్ని వ్యాపకశక్తిగా వాడాలి. ఈ మొత్తం సృష్టి అంతా ఒక వలయాకారంగా, ఒక గ్రుడ్డుగా భావన చేసినట్లైతే, ఆ గ్రుడ్డులో అన్నీ ఏర్పడడానికి విష్ణువు యొక్క వ్యాపనం చెందే శక్తి కారణమన్నమాట. ఒకే ఒక తత్త్వం వ్యాపనం చెందింది. ఎట్లా వ్యాపనం చెందింది అంటే, స్పందనం ద్వారా వ్యాపనం చెందుతూ వుంటుంది. మనకి కూడా మనం వ్యాపనం చెందాలనే వ్యాపకం ఒకటి వుంటుంది. ప్రతివాడికీ ఒక సరదా వుండదూ? సరదాలుండకపోతే sickness అన్నమాట, అస్వస్థతన్న మాట. మనసులో ఏదో ఒక విధంగా పెరుగుదామనే అనుకొంటాడు ప్రతీవాడూ కదా! ఒక్కటే మనకి నిజంగా జరుగుతున్నది మిగతావన్నీ జరగట్లా. అదేమిటంటే వయస్సు. శరీరానికి మాత్రం వయస్సు పెరుగుతుంది తప్ప, మిగతావన్నీ పెరుగుతున్నాయా, లేదా అంటే పెరగటమనే తత్త్వం మనలో ఎంత పనిచేస్తుంటే, విష్ణువు అంత పనిచేస్తున్నట్లు, ఇట్లాగే వుండిపోకూడదు అని పెరగాలనే భావన మనలో కలిగిందనుకోండి విష్ణువు పనిచేస్తున్నట్లు. విష్ణువు వృద్ధికి సంబంధించినవాడు. తరువాత వస్తుంది "వర్ధనో వర్ధమానశ్చ వివిక్త శృతిసాగరః" అని. ఇదే శ్లోకంలో రెండోపాదం. ఈ ౨౮ వ శ్లోకం ఈ మొత్తం తత్త్వమంతా కూడా శబ్దము, దాంతో మనం చేయవలసిన సాధన. శబ్దం ఏ విధంగా వ్యాపనం చెంది ఈ సృష్టి అంతా ఏర్పడుతున్నదో చెప్పే శ్లోకమిది. "వృషాహీ వృషభో విష్ణు:" ఎప్పుడైతే వాహిక సరిగ్గా వుంటుందో, మనం పరుచుకోవడం సులభంగా వుంటుంది. కదా! వాహిక బాగా లేకపోతే ఏం తిరుగుతాము? వాహనం బాగా లేకపోతే ఇంట్లో కూర్చుంటావు. అంతేకదా! ఏంటండీ వెళ్ళలేదంటే, car చెడిపోయిందనో, puncture అయిందనో లేకపోతే engine పాడైపోయిందనో అనుకుంటూ వుంటాము కదా! శరీరం, మనసు, ఇంద్రియాలు మూడూ కలిపి శరీరం అంటారు. మన భాషలో మనం శరీరమంటే పైకి కనిపించేది. పెద్దలకి శరీరమంటే అవగాహన మనసు, ఇంద్రియాలు, శరీరం కలిపి శరీరం. అది వాక్కుకు అనుసంధానం చెందినట్లైతే, వాక్కు ఆ శరీరం నుండి వ్యక్తమవుతుంది. ఇప్పుడు mike సంబంధించిన connections అన్నీకూడా సవ్యంగా వుంటే వాక్కు ఎక్కువ వ్యాప్తి చెందుతుంది. Connections సరిగ్గా లేవనుకోండి వ్యాపనం చెందదు కదా! అట్లాగే మన మనస్సు, ఇంద్రియాలు, శరీరం సరైన పద్ధతిలో అనుసంధానం చెందియున్నట్లైతే, అది ఆధారంగా వాక్కు వ్యాపనం చెందడం జరుగుతుంది. అది విష్ణుతత్త్వం! ఈ భూమిమీద విష్ణుతత్త్వం వృద్ధిపొందే తత్త్వంగా, వ్యాపనం చెందే తత్త్వంగా వుంటుంది. ఈ మొత్తం సృష్టి అంతా కూడా వ్యాపించినటువంటి తత్త్వం అది! అలాగే ఒక్కొక్క మనిషిలో కూడా ఆ తత్త్వం పనిచేస్తూ వుంటుంది. వాడు అట్లా ఇట్లా పెరిగి అట్లా పగిలిపోయేటట్లు వుండదు. బెలూన్లా ఉబ్బి, మర్నాడు ఎవరో సూది పెట్టి పొడిస్తే, మొత్తమంతా తుస్సుమని పోయినట్టుగా వుండదు. మనకి రాముని చరిత్ర అట్లా ఆనాటి కానాటికి వ్యాపనం చెందిందే తప్ప, తరుగుండదు.

అట్లాగే కృష్ణుని చరిత్ర. అట్లాగే క్రైస్తు చరిత్ర. అట్లాగే బుద్ధుని చరిత్ర. అట్లాగే నారద, ప్రహ్లాదుల చరిత్రలు. కాలాన్ని అధిగమించి వుంటాయి.

## ౭౬౨ వృషపర్వః

సృష్టిగా వ్యక్తమవుతున్నప్పుడు కొన్ని కొన్ని junction points, కేంద్రాలుంటాయి. ఆ కేంద్రాల నుండి ఇంకో మలుపు తిరుగుతూ వుంటుంది. సృష్టి మూడు లోకాలుగా వచ్చిందని, ఏడు లోకాలుగా వచ్చిందని, ౪౯ లోకాలుగా వచ్చిందని మనకి ఓపిక వున్నకొద్దీ ఎన్నయినా చూసినవాళ్ళు చెప్పకోవచ్చును. చూసినవాళ్ళు మలుపులు తిరుగుతున్నప్పడల్లా, ప్రతి మలుపులోనూ అది మార్పు చెందుతోందనే కాలజ్ఞానం తెలియటమనేది భగవంతుని వృషపర్వ స్థితి! బాగా మంచి పద్ధతిలో వెళుతున్న జీవితంలో టక్కున ఒక మలుపు తిరగవచ్చును. మానవజీవితం ఎన్ని మలుపులు తిరిగితే అవుతుంది. ప్రతి జీవితం ఒక వృషపర్వం అని తెలుసుకోవాలి. మనం చెరుకుగడ పట్టుకొని నమిలేస్తున్నామనుకోండి తియ్యగా వస్తూ వుంటుంది. Sudden గా ఒక చోట చప్పగా వస్తుంది. ఏమిట్రా చప్పగా వచ్చింది అంత తియ్యగా వుంది కదా అంటే ఇక్కడ కణుపుందని తెలుస్తుంది. దాన్నే 'పర్వ' మన్నారు. దాన్నే 'స్కంధ' మన్నారు. ఈ పర్వాన్నే 'వృషపర్వ' మన్నారిక్కడ. వృషస్సంటే బృహ్మణము చెందే తత్వం. అలా వ్యాపించియుండే తత్వానికి మధ్యమధ్యలో కణుపులు వస్తూ వుంటాయి. కణుపులు దీనికి కూడా వున్నాయని చెప్పడమన్నమాట. అది పాము పొరల్లా గా, పొరమీద వున్న పొలుసుల్లాగా మనకి చెప్తారు భాగవతం లో అనంతదర్శన భాగంలో! వాటిమీద కూడా చిన్న చిన్న గీతలు కనిపిస్తాయి కదా! ఒక్కొక్క గీత ఒక్కొక్క పర్వమన్నమాట. అట్లాగే చెరుకుగడలో ఒక్కొక్క కణుపు ఒక్కొక్క పర్వం. అట్లాగే మానవ జీవితంలో కొన్ని పర్వాలు. పుస్తకంలో chapters వుంటాయి కదా! ఒక chapter నుండి ఇంకో chapter కి వెళ్ళేముందు కొంచెం ఖాళీ వస్తుంది. మళ్ళీ ఇంకో heading పెడతారు. అంటే అక్కడనుండి తత్వం మారిందని చెప్పడం. నీ జీవితానికి సంబంధించిన కాలమనే తత్వం మారిందని చెప్పడం. Line మారుతోందన్నమాట. Station వస్తుంటే line మారుస్తాడు కదా! Line మార్చినప్పడు, line మారిన పద్ధతిలోనే మనం కూడా మారినప్పడు కాలానుగుణంగా అంటే కాలాన్ని అనుసరించి మారితే, కాలజ్ఞానం కలిగి జీవించడం! ఎప్పడూ ఒకే పద్ధతిలో ఏ జీవితమూ నడవదు. ఎవరి జీవితం అలా నడవలేదు. ఒకసారి ఇటు తిరుగుతుంది. ఒకసారి అటు తిరుగుతుంది. కుడి, ఎడమగా తిరుగుతూ వుంటుంది. కుడివైపు ఒకసారి తిరిగితే, ఎడమవైపు తిరగడం ఒకసారి వుంటుంది. పైకి వెళ్ళడం ఒకసారి వుంటే, క్రింద కెళ్ళడం ఒకసారి వుంటుంది. ఇవి వచ్చినప్పడు ఇవి కాలము యొక్క ప్రభావమని తెలిసి జీవిస్తున్నదట భగవత్తత్వం! ఇక మన సంగతేమిటి? సృష్టికి అవతల వున్న భగవంతుడు కాలానికి అతీతుడు తప్ప, సృష్టిలోకి వచ్చిన భగవంతుడు కాలాన్ని మన్నించి తిరగాల్సిందే! సృష్టికి భగవంతుడే కాలము మరియు చోటు! Time and space! సృష్టిలో కాలాన్ని అనుసరించే ప్రవర్తించాలి తప్ప, అధిగమించి ఎవరూ ప్రవర్తించలేరు. సృష్టికి అవతల కాలం, ఆ తత్వంలో ఇమిడివుంటుంది కాబట్టి అక్కడభగవంతుడు కాలాన్ని అధిగమించినవాడుగా మనకి చెప్తారు. సృష్టిలోకి భగవంతుడు తానే దిగివచ్చినా కూడా కాలం కలిసిరావాలి అని చెబుతూ వుంటారు.

శ్రీకృష్ణుడంతటివాడు పాండవుల విషయంలో కాలం కోసం వేచియుండవలసి వచ్చింది. అలాగే హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపులు సృష్టంతా అల్లకల్లోలం చేస్తూ వుంటే అందరూ వెళ్ళి గోలపెడితే, కాలం కలిసిరావాలని చెప్తాడు. ఎందుకంటే Within the creation Time is God. అందుకనే 24 తత్త్వాలు సృష్టిలో వుంటే, ఈ 24 తత్త్వాలనీ నడిపిస్తున్న సూత్రంగా కాలాన్ని చెబుతారు. నడిపిస్తున్న సూత్రాన్ని కాలంగా, 25 వ తత్త్వంగా చెబుతారు. సృష్టిలో 24 తత్త్వాలున్నాయి. అదే మనకి గాయత్రీ మంత్రంగా ఇచ్చారు. ఈ 24 తత్త్వాలకి సంబంధించినవన్నీ కూడా కాలానుసారంగా నడుస్తాయి. కాబట్టి కాలం 25 వ తత్త్వం. ఆ తత్త్వం అనుసరించే సృష్టిలో అన్నీ ఏర్పడుతూంటాయి కాబట్టి ఎంత పెద్దవాడికైనా సరే ఒక క్లిష్టమైన పరిస్థితి రావచ్చును. నలుడంతటివాడికి వచ్చింది. హరిశ్చంద్రుడంతటివాడికి వచ్చింది. ధర్మరాజంతటివాడికి వచ్చింది. సృష్టిలోకి వచ్చినపుడు కృష్ణుడు, రాముడు వాళ్ళందరికీ వచ్చింది. కానీ మహాత్ములకున్నటువంటి కళ్యాణగుణ మేమిటంటే, ఇక్కడ ఒక పర్వం, ఒక కణుపు వచ్చింది. కాబట్టి వేచియుందాం అనుకోవటమే గానీ గింజుకోవడం వుండదు. మనకి వేర్వేరు కణుపులున్నాయి. మాసంలో కణుపులున్నాయి. సంవత్సరంలో కణుపులున్నాయి. సృష్టిలో అలా ప్రతీచోటా ఈ కణుపులు కనిపిస్తూ వుంటాయి. పర్వాలు కనిపిస్తూ వుంటాయి. ఆ పర్వాల సందర్భంలో అనుసంధానం చెందటమే తప్ప, అప్పుడేవో కార్యక్రమాలు చేసేసుకుందా మనుకోవడం ముఖ్యం కాదు. అది మన పెద్దలు ఇచ్చిన ఒక రహస్యం.ఉదయం సూర్యోదయం ఒక పర్వం. అట్లాగే మిట్టమధ్యాహ్నం ఒక పర్వం. సాయం సంధ్య ఒక పర్వం. ఈ మూడు పర్వాలతోనూ అనుసంధానం చెందడమే తప్ప, అప్పుడు మనసులో ఎక్కువ తీవ్రత గలిగి, ఏవో కార్యక్రమాలలో నిమగ్నమై వుండవద్దని చెప్తారు. ఇది అనుసంధానం చెందే సమయం. మనచుట్టూ వుండే ప్రదేశంలో కాలం కారణంగా ఏదో మార్పు జరుగుతూ వుంటుంది. ఆ జరిగే మార్పులకు మనం అనుసంధానం చెంది మళ్ళీ ప్రయాణం సాగించాలి. అందుకనే 'Junction Points' అని చెప్పాను. Junction కి వెళ్ళిన తరువాత ఆ బండి దిగి, ఇంకొక బండి ఎక్కాలి కదా! ఇక ఆ బండి అంతటితో ఆగిపోతుంది. ఇంకో బండి ఎక్కాలి. అలా కాలంలో సంధ్యా సమయాలన్నిటిలో కాలం వలన దేహంలో జరిగే రసాయన మార్పులన్నీ తెలుసుకొని, తద్వార అనుసంధానం చెంది జీవించడమనే పద్ధతి ఒకటి వున్నది. అక్కడే జ్యోతిష్యము యొక్క ప్రాముఖ్యత వస్తుంది. కాలం మారినా, railway time table మారినా మనం పాత time table ప్రకారమే ప్రయాణం చేద్దామనుకొంటే ఏ రైలూ దొరకదు. అందుకే సంధ్యాసమయాల్లో అనుసంధానం చెందడమన్నది పెద్దలు ఇచ్చారు. సంధ్యాసమయంలో అనుసంధానం చెందక అర్జునుడు ఘోరంగా ఒకళ్ళ చేతిలో ఓడిపోతాడు. ద్రౌపదీ స్వయంవర సమయంలో వాళ్ళందరూ ఏకచక్రపురం నుండి ద్రుపద రాజ్యానికి వెళుతూ వుంటే, దారిలో సాయంసంధ్యా సమయంలో వాళ్ళు అనుసంధానం చెందరు. మనకి ప్రతిదానికీ time అయిపోతుంది అనే భ్రమ ఒకటి వుంటుంది కదా! ఏమిటండి. సాయంత్రం 6 గంటలకు ఇక్కడ కూర్చుంటే, మనకి time అయిపోవడం లేదా? ఆ time అయిపోతుందని నువ్వనుకొంటావు తప్ప, ఆ time లో నువ్వు చేసేదంతా ప్రక్కదారులు పట్టించేదే అని నీకు తెలియదు. పాండవులందరూ పాంచాలరాజ్యం చేరుకోవాలనే భావనలో సాయంసంధ్య నెరవేర్చరు. వాళ్ళు అలా బయలుదేరి వెళుతూ వుంటే దాహం

వేస్తుంది. మంచినీళ్ళు త్రాగుదామనుకొంటే గంధర్వులు అడ్డుపడతారు ఇది మా సరస్సు ముట్టుకోవడానికి వీలుపడదని. అదేమిటయ్యా మంచి నీళ్ళు త్రాగుతామంటే, వీలు లేదంటారు. వీలులేదంటే అర్జునుడికి కోపం వస్తుంది. బాణాలు తీస్తాడు. మన ప్రతిభ చూపిద్దామని బాణం వేస్తే, పూచికపుల్లల్లా పడిపోతూ వుంటాయి. ఏ బాణం వేసినా పనిచేయదు. అప్పుడు గంధర్వుడొస్తాడు. 'నీవు చాలా ప్రతిభావంతుడవు, శక్తిమంతుడవు, చాలా సమర్థుడైనవాడవు కానీ నీ బాణాలు ఇలా పూచిక పుల్లలవడానికి కారణాలు చెప్తా విను. సాయంసంధ్యా సమయంలో మీరు కాలంతో అనుసంధానం చెందలేదు. అది కారణంగా ఇంత నిర్వీర్యులయ్యారు. ఇటువంటి నిర్వీర్యత్వంతో రేపు ప్రొద్దున మత్స్యయంత్రాన్ని ఏంకొడతారు?' అని అడుగుతాడు. 'మిమ్మల్ని ఆశీర్వదించాలని చూస్తున్నవాళ్ళం. మీరు దైవీప్రకృతి గలవాళ్ళు. దైవీస్వభావం కలిగినవారు. అటువంటి మీరు వృద్ధిలోకి వస్తే సృష్టికి మంచిది. మీ అందరి మంచి కోరేవాళ్ళం మేము. మీరుకూడా ఇలా చేయడం మంచిది కాదు. మీరు ప్రకృతితో అనుసంధానం చెందండి. లేకపోతే మీరు ఇబ్బంది పడతారు' అని చెప్తాడు గంధర్వుడు అర్జునునితో. ఇది మహాభారతంలో వున్న కథ. మనమందరం చదువుకోవాలి. సంధ్య వార్చడమంటే పంచపాత్రలో నీళ్ళు హరివాణంలో పోసుకోవడం కాదు. మనకి అవగాహన పోయి, పంచపాత్రలు మిగిలిపోయినాయి. ఆ సమయంలో పనులేవీ పెట్టుకోకుండా ప్రశాంతంగా కూర్చుంటే చాలు. సంధ్య వారిస్తే మంచిదే కానీ, అవగాహనతో చేయాలి. మనం చేయవలసిన దేమిటంటే కాలం యొక్క పర్వాలేవైతే వున్నాయో, కణుపులేవైతే వున్నాయో ఆ సమయంలో ఉత్తిష్ఠ అవకుండా తిష్ఠ వేసుకొని కూర్చోవాలి. అప్పుడేదో గబగబా పనిచేసుకోవడం కాకుండా ఒక 5 నిముషాలు, ఒక ముహూర్త కాలమన్నారు వాళ్ళు. ఎక్కువగా చెప్పలేదు. ముహూర్తమంటే 4 నిముషాలు. 4 నిముషాలపాటు ఏమీ చేయకుండా కూర్చోగలవా? అని, ఏమీ చేయకుండా కూర్చోవడం కష్టం. కనీసం శరీరాన్ని అలా పడేసి కాస్త pause ఇచ్చి, మళ్ళీ పనిలోకి వెళ్ళమన్నారు. అది ఎప్పుడు? ప్రొద్దున్న, మధ్యాహ్నం, సాయంత్రం! అర్ధరాత్రి ఎట్లాగూ pause లోనే వుంటాము. అట్లాగే ప్రతినెలా అమావాస్య, శుక్లాష్టమి, పౌర్ణమి, కృష్ణాష్టమి pause ఇమ్మన్నారు. ఎందుకంటే అప్పుడు pause ఇస్తే, 7 రోజుల తర్వాత ఏం జరిగినా కూడా చక్కని అనుసంధానంలో జరిగిపోతుంది. అట్లా చేయడం వారానికోసారి మనకి ఆదివారం క్రింద జరిగిపోతున్నది. ఈ ఆదివారం సాంప్రదాయం మనకి ఆంగ్లేయులు వచ్చిన తరువాత వచ్చింది కానీ, అంతకుముందు ఆదివారం పని చేసుకోకపోవడమనే సాంప్రదాయం మనకి వుండేది కాదు. 7 రోజులు పనిచేయటం, 8వ రోజు విశ్రాంతి తీసుకోవటము. విశ్రాంతి తీసుకోవటం దేనికి? అనుసంధానం చెందటం కోసం. అంతేకాని ఊరికే పడుకోవటానికి కాదు. ఇప్పుడు ఆదివారం అంటే శుభ్రంగా కడుపు నిండా తిని, నిద్రపోవడమనే కార్యక్రమము వచ్చింది కానీ ఇదివరకు 7 రోజులు పనిచేసిన తరువాత అంటే శుక్ల ప్రతిపత్ నుండి అష్టమి వరకు పనిచేసాక అష్టమి నాడు అనుసంధానం చెందడం. మళ్ళీ 7 రోజులు పనిచేసాక పౌర్ణమి నాడు అనుసంధానం చెందడం మళ్ళీ 7 రోజులు పనిచేసాక కృష్ణాష్టమి నాడు అనుసంధానం చెందడం. మళ్ళీ 7 రోజులు పనిచేసాక అమావాస్య నాడు అనుసంధానం చెందడం ఇట్లా వుంటుంది. ఈ రోజుల్లో కూడా కాలానికి సంబంధించిన మార్గంలో నడుద్దామనుకొన్న వాళ్ళు అట్లా

చేసుకోవాలి. అట్లా చేసుకొనేవాళ్ళు కాబట్టి వాళ్ళేమన్నారంటే అష్టమి, అమావాస్య, పౌర్ణమి బయట పనులు పెట్టుకోవద్దంటే, ఇవాళేం చెబుతున్నారంటే అష్టమి మంచిది కాదు అని. అష్టమి మంచిది కాదనే పద్ధతి ఎక్కడా లేదు. అష్టమి బయట పనులకి కాదురా, లోపల పనులకి అని చెప్పారు. పౌర్ణమి, అమావాస్య, అష్టమి నిన్ను నువ్వు శుచియైన ప్రదేశంలో, కాలం ఇచ్చిన ప్రభావంతో అనుసంధానం చెందమని చెప్పారు. అట్లా అనుసంధానం చెందినవాడు 'వృషపర్వ' మనే నామంతో ఇట్లా కణుపులు కణుపులుగా కాలంలో వచ్చే మార్పులను చక్కగా గమనించి, దానితో tune up అవుతాడు. ఆ tuning up వల్ల బండి సాఫీగా నడుస్తుంది. Tune up కాకపోతే మనం అట్లా ఎద్దలే నడిచిపోతూ వుంటాము. చేను వస్తూ వుంటుంది, ముళ్ళకంచె వస్తూ వుంటుంది. ఎక్కడో అక్కడ గుంటలు వస్తుంటాయి. పడిపోతూ వుంటాము. చూసి వెళ్ళాలి కదా! అలాగే సంవత్సరం వచ్చేసరికి ప్రతి మాసానికి ఒక సంక్రమణం వున్నది. అంటే సూర్యుడు రాశి మారినప్పుడు ఆ రోజు మళ్ళీ దానికి సంబంధించిన అనుసంధానం చెందడం జరగాలి. ప్రతీ 21, 22 తారీఖులలో సూర్యుడు రాశి మారుతూ వుంటాడు. ఆ సంక్రమణాలప్పుడు అనుసంధానం చెందాలి. అట్లాగే సంవత్సర మొత్తంలో మనకి 4 రోజులు వున్నాయి. పగలు, రాత్రి సమానంగా వుండే రోజులు రెండు వున్నవి. పగలు.. ఎక్కువగాను. రాత్రి తక్కువగాను వుండే రోజు, రాత్రి ఎక్కువగాను, పగలు తక్కువగాను వుండే రోజు మొత్తం 4 రోజులు. అవికూడా అనుసంధానం చెందవలసిన రోజులు. ఇట్లా అనుసంధానం చేసుకుంటూ జీవించడమనేది వేదసాంప్రదాయములో వున్నది. ఇలా అనుసంధానం గనక చెందకపోతే, సృష్టి చక్రం నుండి విడివడిపోతాం. ఆ సృష్టి చక్రంతో అనుసంధానం చెందడమనే తత్వాన్ని 'వృషపర్వ' మనే నామం ఎక్కువగా సూచిస్తూ వుంటుంది. మనం దానికి అనుసంధానం చెంది జీవిస్తూ వుండాలి. అది 'వృషపర్వం'.

## ౨౭౦ వృషోదరః

మొదట చెప్పినట్లు ఎద్దల్లే తిరిగే పరిస్థితి పోయి, బాధ్యతతో ప్రవర్తిస్తూ, వాఙ్నియమము కలిగి, వాక్కుతో అనుసంధానం చెంది జీవిస్తూ, ఊరికే వ్యామోహంలో పడకుండా కాలం యొక్క పర్వాలని గమనించుకొంటూ వ్యాపనం చెందుతూ వుంటే, వృషోదరం అంత వస్తుందిట. 'వృషోదర' మంటే ఎద్దు కడుపు. చాలా తినగలదు ఎద్దు. అందుకనే తింటున్నప్పుడు కూడా మరీ ఎద్దల్లే తింటున్నావని అంటారు. అట్లా ఎంతైనా వ్యాపనం చెందవచ్చు. అమితంగా వ్యాపనం చెందవచ్చును. ఈ principles అన్నీ సరిగ్గా follow అయితే. అంటే expansions limit లేదు. ఇవి చిన్నప్పటినుండీ సాధనలో పెట్టామనుకోండి సులువవుతుంది. పెద్దయ్యాక కొంచెం కష్టము. అందుకనే మనవాళ్ళు దీన్ని ఉపనయనం పేరున ౭వ సంవత్సరంలోనే మొదలు పెట్టారు. మగవాళ్ళైనా, ఆడవాళ్ళైనా సాధన ఒకటే! ఆ సాధనలో మనం ముందుకు వెడుతూంటే, ఇంత వ్యాపనం మనం చెందుతాము.

## 271, 272 వర్ధనః, వర్ధమానః

వర్ధనో అంటే అట్లా పెరుగుతూ వుంటుందన్నమాట. వర్ధమానః అంటే ఆ పెరగడం present continuous గా వుంటుంది. Ever growing! ఎప్పుడూ పెరుగుదలేనట. ఎప్పుడూ పెరుగుదలే ఎట్లా వుంటుందంటే, సృష్టిలో అట్లా వుంది. చెట్టు ఎప్పుడూ పెరుగుతూనే వుంటుంది. కొన్ని రాలిపోతూ వుంటాయి. కొన్ని పుడుతూ వుంటాయి. పుట్టినవి పెరుగుతూ వుంటాయి. కొన్ని రాలిపోతూ వుంటాయి. మళ్ళీ కొన్ని పుడుతూ వుంటాయి. ఈ పుట్టేవీ, ఆ పోయేవీ సమానంగా వుండి, మధ్యలో దీనికొక అస్తిత్వం వుంటుంది. మనలో కూడా కొన్ని అణువులు పుడుతూ వుంటాయి. కొన్ని లయమవుతూ వుంటాయి. మధ్యలో మనం వుంటూ వుంటాము. ఆ ఉండటంలో వర్ధమానత వుంటుంది. అంటే పెరుగుదల! విష్ణువు స్థితికి కారకుడు కదా! అందుకే ఎప్పుడూ కూడా వృద్ధి అలాగే వుంటుంది. ఒకటి పోతూవుంటే, దాని స్థానంలో ఇంకొకటి వస్తూ వుంటుంది. సృష్టిలో ఏదీ అయిపోవడం అంటూ వుండదు. ఒకడు వెళ్ళిపోయే లోపల వాడి కొడుకు వస్తాడు. Office లో కూడా ఒకడు retire అయ్యి వెళ్ళిపోతే, ఇంకొక వస్తాడు. వాడు retire అయ్యి వెళ్ళిపోతే, ఇంకొక వస్తాడు. Office ఎప్పుడూ run ఆవడం లేదూ? School కూడా కొంతమంది పిల్లలు అయిపోయి వెళ్ళిపోతే, క్రొత్తగా కొంతమంది వస్తారు. School ఎప్పుడూ పూర్తిగా run అవుతూనే వుంటుంది కదా! Collage లో కూడా మనుష్యులు మారడమే తప్ప, collage ఎప్పుడూ నిండుగా run అవుతూనే వుంటుంది. అట్లాగే సృష్టి అనే ఈ విశ్వవిద్యాలయంలో కూడా అన్నీ ఎప్పుడూ వుంటూనే వుంటాయి. అంటే ఈ భూమి అయిపోయే లోపల ఇంకో భూమి అక్కడ తయారవుతుంది. ఈ సూర్యమండలం అయిపోయే లోపల ఇంకో సూర్యమండలం తయారవుతూ వుంటుంది. అట్లా కొన్ని తిరోధానం చెందే స్థితిలో వుంటే, కొన్నేమో అప్పడే వ్యక్తమయ్యే స్థితిలో వుంటాయి. కొన్ని వ్యక్తమవుతూవుంటాయి, కొన్ని వృద్ధి పొందుతూ వుంటాయి. కొన్ని తిరోధానం చెందుతూ వుంటాయి. ఒక ఇంట్లో చూడండి పసిపిల్లవాడు, నెలల గ్రుడ్డు, చిన్నపిల్లలు, యుక్తవయస్కులు, పెద్దవాళ్ళు, ముసలివాళ్ళు అంతా వుంటారు కదా! ఒక మధ్యవయస్కుడు ముసలి వాడైపోయే లోపల ఇంకొక కుర్రవాడు. మధ్య వయస్కుడవుతూ వుంటాడు. పిల్లవాడు యువకుడవుతూ వుంటాడు. ఎప్పుడూ run అవుతూనే వుంటుంది. మన హిందూ సమిష్టి కుటుంబము చూసినట్లైతే నాలుగు తరాలవాళ్ళు continuous గా వుంటూనే వుంటారు. ఒకడు వెళ్ళిపోతూ వుంటే ఇంకొకడు వస్తూనే వుంటాడు. అట్లా సృష్టిలో కూడా ఎప్పుడూ నిండుగా అన్నీ వుంటాయి. ఏదీ లేకుండా వుండే స్థితి వుండదు. ఏదీ లేకుండా వుండనటువంటి స్థితిని 'వర్ధమాన' స్థితి అంటారు. మనలో కూడా అది జరుగుతూ వుంటుంది. కొన్ని వెళ్ళిపోతూ వుంటాయి. క్రొత్తవి వస్తూ వుంటాయి. వెళ్ళిపోయిన వాటి గురించి బాధపడకుండా, వచ్చేవాటి గురించి ఆనందపడుతూ వుండటమనేది ఎప్పుడూ పరిపూర్ణంగా వుంటుంది. కాబట్టి వర్ధమాన స్థితి అనుభూతి చెందవచ్చును. మొదటి నాలుగు నామాలు మన సాధనకు

సంబంధించినవి. తరువాతవి దానివల్ల జరిగే అనుభూతికి చెందినవి. వృషపర్వం తరువాత వృషోదరుడు, వర్ధనుడు, వర్ధమానుడు. మహాత్ముల విషయాలలో ఇవన్నీ సత్యంగా గోచరిస్తాయి. ఉదాహరణకి సత్యసాయి బాబా గారిని తీసుకొన్నారనుకోండి ఎంత అక్కడ వర్ధమానత్వం వుంది? ఎంత వర్ధిల్లుతున్నది? అంతా అలా పుడుతూనే వుంటుంది. ఎందుకంటే ఆ మూలసూత్రాలన్నీ అక్కడ భాసింపబడుతూ వుంటాయి. ఆయన యందు గానీ, ఆయన వాక్యమందు గానీ, ఆయన చేతల యందు గానీ ఆ మొత్తం తత్త్వం అలా వ్యక్తమవుతూ వుంటుంది. అవుతున్నకొద్దీ అట్లా అది పెరుగుతూనే వుంటుంది. పెరిగినదాంట్లో వృద్ధి అందరికీ ఆనందం కలిగిస్తూ వుంటుంది. మాస్టారు గారు చెప్పారు శ్రీకృష్ణుని సమయంలో వున్న వైభవము ఇప్పుడు మళ్ళీ చూద్దామనుకుంటే సత్యసాయి దగ్గర చూడవచ్చని చెప్పారు. ఎందుకు చూడవచ్చంటే అట్లా సృష్టి సూత్రాలతో పరిపూర్ణంగా అనుసంధానం చెందిన పరిస్థితి ఎక్కడైతే వున్నదో, అక్కడ అటువంటి వృద్ధి వుంటుంది. లేకపోతే పెరుగుతున్నట్లుగా వుండి పెరక్క, పెరుగుతున్నట్లు doubt గాను ఇలా వుంటాయి. మామూలు జీవితానికీ, ఆ జీవితానికీ పోల్చి చూస్తే మనకి అవగాహన సులువుగా అవడానికి అది ఒక ఉదాహరణ.

## 273 వివిక్తః

"వివిక్తః" అంటే ప్రత్యేకంగా వున్న వాడనీ, కొంత దూరంగా వున్న వాడనీ, వేరుగా వున్న వాడనీ, భగవంతుని తత్వానికి సంబంధించిన ఒక నామం. వేరుగా వున్నా, దూరంగా వున్నా, విడిగా వున్నా అందులో అర్ధమేమిటంటే తననుండి వ్యక్తమైన ఈ సమస్తం నుండి ఈ సమస్తమైన సృష్టి యందు తాను వున్నప్పటికీ తాను దానితో బంధింపబడి వుండడని చెప్పడం. సృష్టి అంతా భగవత్తత్వం నుండి వ్యక్తమైనప్పడు, వ్యక్తమైన ప్రతి వస్తువు యందు తను నివసించి యున్నప్పటికీ కూడా తాను ఏ వస్తువు చేత బంధింపబడకుండా వుండే తత్వం! ఇది యోగసాధనకు చాలా ముఖ్యమైన అభ్యాసం. దీనినే వైరాగ్యమని కూడా పెద్దవాళ్ళు చెప్తారు. తన నుండి వ్యక్తమైన సృష్టికి తను సహకరిస్తూ, దానిలో తను నివసిస్తూ, పరిపూర్ణంగా దానియందు వుంటూ అలా అని దానిచేత బంధింపబడకుండా వుండని స్థితి. సృష్టి యందు తాను వుండటం వలన సృష్టి వున్నది. సృష్టిలో వున్న జీవరాశులను, గ్రహగోళాలను చూస్తే సృష్టి ఎంత విపులంగా ఏర్పడిందో, ఎంత వ్యాపనం చెందినదో తెలుస్తుంది. తను సహకరించి, తను నివసించి, తనవల్ల వృద్ధి పొందిన సృష్టి యందు తను వుండి. బంధింపబడకుండా వుండటం అనే స్థితి. అలా వుండగలిగినట్లైతే మానవజీవితం పరిపూర్ణంగా అనుభూతి పొందడానికి అవకాశం వున్నది. మన నుంచి వ్యక్తమైన జీవితంలో మనం వుంటూ, మన భావములచే మన జీవితం వ్యక్తమవుతూ వుంటుంది. భగవంతుని భావము శక్తిగానూ, అమ్మవారుగానూ వుంటుంది. అలాగే వ్య క్తిగతంగా మనలో నుండి సంకల్పాలు పుట్టి, ఆ సంకల్పాల నుండి వివిధములైన కార్యక్రమాలు పుట్టి, ఆ కార్యక్రమాల నుండి వివిధములైన రూపముల నిర్మాణం జరిగి, వాటిలో మనం జీవిస్తూ వుంటాము. ఇల్లు కట్టుకొని ఇంట్లో జీవించినట్లు. ఇల్లు కట్టుకొని ఇంట్లో జీవించినప్పుడు ఇల్లు మనల్ని బంధించకూడదు. వైవాహిక జీవితం లో స్త్రీ పురుషునితో, పురుషుడు స్త్రీతో సహజీవనం చేస్తే, ఒకరిని ఒకరు ఆదరించుకొంటూ ఒకరినొకరు బంధించుకోకుండా వుండగలగడము. వృత్తి ద్వారా ధనమును, కీర్తిని సంపాదించి ఆ ధనము, కీర్తితో బంధింపబడకుండా వుండటం. ఏ పూటకాపూట మనల్ని బేరీజు వేసుకొని, ఏ భావంలో కట్టుబడి వున్నామో. పరిశీలించి, ఆ భావం మనం కాదని అవగాహన చేసుకొని, క్షాళన చేసుకొని, భావాలన్నిటికీ అతీతంగా మనం వుండగలిగి వుండాలి. మన భావం కారణంగానే ఒక కార్యక్రమం నిర్వర్తించగలుగుతాము. భావంలో వుండే పటిష్టతను బట్టి కార్యక్రమం యొక్క బలం వుంటుంది. భావంలోనే పటుత్వం లేకపోతే దాన్నుండి వ్యక్తమైన కార్యక్రమం కూడా పటుత్వం వుండదు. అందుకనే పెద్దలు మనకేం చెబుతారంటే సంకల్పబలం చాలా గట్టిగా వుండాలి. సంకల్పబలం గట్టిగా వుండటం వలన దానియందు మనం బలంగా బంధింపబడే అభ్యాసం వుంది. సన్నివేశాల్లో కూడా మననుంచి వ్యక్తమైన వాటిలో బంధింపబడి వుంటాము. అది ధనం కావచ్చు, కీర్తి కావచ్చు, సంపదకావచ్చు. అవన్నీ మననుండి పుట్టినవే. మననుండి ఎలా పుట్టినవంటే, మనలో ఒక భావం ఏర్పడి, ఆ భావాన్ని కార్యరూపంలోకి మార్చడం వలన, ఆ కార్యంలో

వచ్చే సిద్ధి కారణంగా రకరకములైన సంపద లేర్పడతాయి. ఇవన్నీ భగవంతుని వైభవంగా భావన చేసుకొని, మనం వాటియందు పరిపూర్ణంగా జీవిస్తూ, బంధింపబడకుండా వుండాలి. అదీ యోగస్థితి! దీనికేం చెబుతారంటే, సముద్రంలోకి వెళ్ళామనుకోండి. సముద్రంలోకి వెళితే అలలన్నీ చాలా ఉధృతంగా ఇటూఅటూ క్రింద పడేస్తూ వుంటాయి. వెళ్ళకపోతే ఏమి? అనే ఒక భావన. వెళ్ళి ప్రయత్నం చేస్తే మునిగిపోతామనే పరిస్థితి కూడా వుంది. వెళ్ళకుండా వుంటే అనుభూతి లేదు. వెళ్తే మునిగిపోతాం. అందుకని వెళ్ళటమూ, వెళ్ళకపోవటమూ అంటే ఒకసారో, రెండుసార్లో మునిగితే  నెమ్మదిగా నేర్చుకొని తేలటం మొదలు పెడతావు. అందులో అనుభూతి అవగాహన అవుతుంది. సంఘమొకటి, కుటుంబమొకటి, వృత్తి ఒకటి, సేవా కార్యక్రమాలు ఒకటి ఇట్లా రకరకాల దృక్కోణములు జీవితం లో ఉంటాయి. వాటిని మక్కువగా నిర్వర్తించుకుంటూ వాటియందు మమకారం లేకుండా వుండాలి. మక్కువ లేకపోతే నిర్వర్తించలేము. కొంతమంది వైరాగ్యం పేరుతో ఏమీ చేయరు. ఏమీ చేయకపోవటమనేది భగవత్తత్వములో లేదు. ఆయనేమీ చేయకపోతే ఇన్నీ రావు కదా! ఆయన నుండి చాలా వ్యక్తమౌతూ వుంటే, వాటన్నిటి యందు ఆయన ఉండి, అందులో ఆయన బంధింపబడకుండా వాటికి ప్రత్యేకంగానూ, దూరంగానూ వున్నాడు. వివిక్తుడంటే Aloof అని, away అని. 'తామరాకు మీద నీటిబొట్టు' అనే పద్ధతిలో వున్నాడు. బొమ్మలు పడుతూ వుంటే వెండితెర ఎట్లా వుంటుందో, వెండి తెర లేకపోతే బొమ్మలు ఎట్లా పడవో, వెండితెరకు బొమ్మ ఎట్లా అంటదో అలా వున్నాడు. మనకు కూడా ఎన్నో రకాల భావములు మనలో నుండి ఉద్భవిస్తూ వుంటాయి. ఇంట్లో వుంటే కొన్ని రకాల భావాలు, ఆఫీసుకి వెడితే మరికొన్ని రకాల భావాలు, పూజ చేస్తే ఒక భావం, సేవ చేస్తుంటే ఒక భావం, స్నేహితుడితో ఉంటే ఒక భావం, పైన తిరుగుతూ వుంటే ఒక రకం భావం, ఇలా మనలోంచి ఎన్నో రకాల భావాలు వస్తూ వుంటాయి. ఈ భావాలన్నిటినీ కూడా త్రిభుజాలుగా చెప్పారు. పెద్దవాళ్ళు, ఈ త్రిభుజమైన, భావయుక్తమైన చట్రంలోకి, త్రిగుణాత్మకమైన తత్వంలోకి, త్రిగుణాతీతుల మైన మనం జొరపడతాము. అలా జొరపడితే కానీ కార్యక్రమం వుండదు. జొరపడిన తరువాత ఆ భావానికి సంబంధించిన భాష, కార్యము అయిపోగానే ఆ త్రిగుణాత్మకమైన తత్వం లోంచి మళ్ళీ బైటకు వచ్చేస్తే 'వివిక్తః' అనే స్థితిలో వుంటాము. మామూలుగా మనం కొన్ని కొన్ని విషయాలలో ఇరుక్కుపోయి, అతుక్కు పోయి వుంటాం. కొడుకుతో ప్రవర్తిస్తున్నప్పుడు తండ్రిగా కనిపిస్తాం. తండ్రిగా మనం వేస్తున్న భావయుక్తమైన వేషం, స్నేహితుడు వచ్చాడనుకోండి తండ్రి వేషం తీసి స్నేహితుడి వేషం వేస్తాం. ఎప్పుడు తండ్రి వేషం తీసామో! ఎప్పుడు స్నేహితుడి వేషం వేసామో! మనకే తెలియనంత త్వరగా మార్చేసుకుంటాం వేషాన్ని, ఈ లోపల స్నేహితుడు అదృశ్యుడై భార్య వచ్చిందనుకోండి భర్త వేషం వచ్చేస్తుంది. మనకుండే హావభావాలన్నీ మారుతాయి. ఇంతలో మన క్రింద పనిచేసే అతను వచ్చాడనుకోండి యజమానిగా వేషం వేసుకుంటాం. ఆ తరువాత మన పైన పనిచేసే యజమాని వచ్చాడనుకోండి కొంచెం భుజాలు వంచి, కొంచెం కంగారుపడుతూ, మర్యాద చేస్తూ ఇంట్లో ఆవిడని కాఫీ తెమ్మని-- మారిపోతాం. మనక్రింద పనిచేసేవాళ్ళు వస్తే అవన్నీ చేయం కదా! ఇలా రకరకాలుగా ఒక్కొక్క భావం మనల్ని ఒక్కో రకమైన రూపాల్లోకి తర్జుమా చేస్తూ వుంటుంది. రోజూ కొన్ని వందల

భావాలు వుంటాయి. భావాన్ని బట్టి వందల రకాలుగా మనం వేషభాషలు మారుస్తూ వుంటాము. ఇవన్నీ బాగా పరిశీలించి చూస్తే, అప్పటికప్పుడు వాటిల్లో దిగుతూ వుంటాము. అది మార్చి ఇంకో దాంట్లో దిగుతూ వుంటాము. కొడుకు వున్నప్పుడు తండ్రిగా, స్నేహితుడున్నప్పుడు స్నేహితుడుగా వుంటాము, యజమాని వున్నప్పుడు సేవకుడిగా, సేవకుడున్నప్పుడు యజమానిగా వుంటాం. ఇవన్నీ అవతల ఇంకొకడుండబట్టి జరుగుతున్నాయి. అందరి దగ్గరా అదే వేషం, భాష తో ఉండము. ఎదురుగా ఒక బహిర్గతమైన సన్నివేశం కారణంగా మనకి ఒక రకమైన వేషం, భాష వుంటుంది. అసలు ఎదురుగా ఎవ్వరూ లేరనుకోండి. ఒక్కళ్ళమే వున్నామనుకోండి. మనం ఎవరితోనూ మాట్లాడవలసిన అవసరం లేదు. అప్పుడు మీరేమిటి? భర్తా? తండ్రా? కొడుకా? యజమానా? సేవకులా? స్నేహితులా? ఏమిటి మన పరిస్థితి అప్పుడు? In relation to something మనకి ఒక relative positioning వుంది తప్ప, కాకపోతే మన స్థితి ఏమిటి? అప్పుడు మనం ఏం చేస్తామంటే, వీటికి సంబంధించిన ఏవో ఒక భావాల్లో జీవిస్తూ వుంటాము. ఊరికే ఒక్కళ్ళమే కూర్చుంటే  భార్య గురించిన భావంలో భర్తగా జీవిస్తూ వుంటాం. అక్కడ భార్య లేదు. పిల్లల గురించిన భావంలో తండ్రిగా జీవిస్తూ వుంటాం. అక్కడ పిల్లలు లేరు. లేనిది వున్నట్టుగా పెట్టుకొని ఆ భావాల్లోనే వుండిపోతాము తప్ప, ఆ భావాల అవసరం అప్పుడు మనకేమి వుంది? ప్రతీ భావం కూడా జీవుడు వ్యక్తమవడానికి ఒక వాహిక లాంటిది. భావం లేకపోతే మనం వ్యక్తం కాలేము. అలా భావాలు బహిరంగ ప్రపంచంలోకి వ్యక్తమవడానికి సృష్టిలో ఇవ్వబడిన ఒక అమరిక. భావం, భాష, చేత! మనం ఇప్పుడు చేయవలసిన పనేమీ లేదు. మాట్లాడవలసిన అవసరం అంతకన్నా లేదు. మనచుట్టూ ఎవరూ లేరు. అప్పుడు మనకుండే భావాలు ఏవైతే వుంటాయో, అవి మన స్వభావం. స్వస్వభావం! ఎవరూ లేకుండా కూడా వాటిలోనే వున్నామనుకోండి. అంటే ఇంట్లో ఊరికే పడకకుర్చీలో పడుకొంటే ఉద్యోగం గుర్తు వస్తుంది. ఇంట్లో ఉద్యోగంతో సంబంధం లేదు కదా! ఆ ఏమీ లేని సమయంలో భావంలో వుండటమంటే బంధింపబడి వుండటం. అంటే 'వివిక్త' స్థితి మనకు లేనట్లు. మనమంతా ఆత్మవంతుల మైనప్పటికీ కాలానికీ, దేశానికీ, సన్నివేశానికీ తగిన రూపాలు దాలుస్తాము. సన్నివేశం ఏమీ లేకుండా నిశ్శబ్దమైన స్థితిలో వున్నప్పుడు 'స్వ' రూపంలో వుండాలి. 'స్వరూపం' అంటే మనయొక్క రూపం నిజరూపం. అది భావములు లేనటువంటి రూపం. అందుకని పెద్దలేం చెప్పారంటే ప్రొద్దున్నే లేచిన తరువాత ఒక పావుగంట నిశ్శబ్దంగా కూర్చోమంటారు. ఆ సమయం లో దేనికి సంబంధించిన భావాలు మనలో బాగా ఊరుతున్నాయో వాటియందు మనం బాగా చిక్కులు పడి వున్నట్లు లెక్క! ఎందుకంటే అవసరం లేకపోయినా వస్తున్నాయి కాబట్టి! అవసరం లేకుండా మనల్నిఊరికే అందులో త్రిప్పుతున్న భావాలు ఏవైతే వున్నాయో వాటియందు మనం ఎక్కువ ఇరుక్కున్నట్లు. కొంతమంది పరపతి గురించి, కొంతమంది ధనం గురించి, కొంతమంది కుటుంబం గురించి, ఇలా రకరకాలుగా ఆలోచించవచ్చును. ఎక్కడో వున్నవాళ్ళ గురించి ఇక్కడ కూర్చుని ఆలోచిస్తూ వుండవచ్చును. ఏమిటి ఉపయోగం? దాన్ని 'వికల్ప' మంటారు. ఎందుకంటే దానికి సంబంధించిన ఉపాధి అక్కడ లేదు. తల్చుకోవటం వలన బాధ తప్ప. ఎవరూ మనచుట్టూ లేని సన్నివేశంలో మనలో ఏ భావములు వ్యక్తమవుతున్నాయో, ఆ భావములన్నీ కూడా

సూచించేదేమిటంటే ఈ aspects of life లో మనం బంధింపబడి వున్నామని. అందుకనే మన పెద్దవాళ్ళేం చెప్పారంటే ప్రొద్దున్నే లేచి ఒక పావుగంటో, అరగంటో అలా కూర్చోమన్నారు. ఇది ధ్యానం కాదు. భావానికి అతీతంగా, ఆత్మవస్తువుగా తనను తాను తెలుసుకొని, ఉచ్ఛ్వాసతో అనుసంధానం చేయడం ధ్యానం. భావాలతో మనం చేసేదంతా ప్రార్థన. 'భావములకు అతీతంగా తాను తానుగా, జీవుడిగా, ఈ శరీరము నందు నివసిస్తూ వున్నాను' అనే భావములో వున్నవాడు ఆత్మతత్వంలో వున్నవాడు. అప్పుడు విశ్వాత్మతత్వంతో అనుసంధానం చేసుకుంటాడు. ఎందుకంటే అటునుండి ఇటు శక్తిప్రసారానికి, ప్రజ్ఞ ప్రసారానికి, భగవత్ ప్రణాళికకు సంబంధించిన కార్యక్రమాలు తననుండి నిర్వర్తింపబడడానికి ధ్యానంలోకి నిమగ్నమై, దైవసంకల్పం వ్యక్తం చేస్తూ వుంటాడు. ధ్యానమనేది అష్టాంగయోగంలో ఏడవమెట్టు. మనం రోజూ 6 గంటలకు చేసే ప్రేయరులో నిశ్శబ్దంగా వుండే సమయంలో ఊరికే కుండపోతగా మన ఆలోచనలను బైటపడేస్తాము. వాటిని గమనిస్తూ వుండమన్నారు మాస్టర్ సి.వి.వి. ఎందుకు గమనించమన్నారంటే వేటితో మనం బాగా సంగమము కలిగివున్నామో తెలుస్తుందని, అప్పుడు వున్నా ఉపయోగమేముంది? కానీ వాటిని తెలుసుకొని, వాటికి కావలసిన పరిష్కారాలు నిర్వర్తించుకొంటూ, నెమ్మదిగా భావాలకు అతీతంగా జీవిస్తే, ఆఫీసు కెళ్ళినపుడు ఆఫీసు భావం, ఇంట్లో వున్నపుడు ఇంటికి సంబంధించిన భావం, త్రోవలో వున్నప్పుడు త్రోవకు సంబంధించిన భావం, పూజ చేసినపుడు పూజకు సంబంధించిన భావం, ఎక్కడ ఏ పరిస్థితిలో ఆ భావంతో పనిచేస్తే, ఆ భావానికి సంబంధించిన కార్యక్రమం అయిపోయిన తరువాత మరి ఇక ఆ భావంలో జీవించకపోవడం అభ్యాసమవుతుంది. దానికి మనకేం చెప్పారంటే, అయిపోయిన భావంలో జీవించవద్దని, ఇప్పుడున్న భావనలో జీవించమని! ఏ భావనా లేకపోతే వెండితెరల్లే వుండమన్నారు. ఎప్పుడూ సినిమా వేసుకోనక్కరలేదు కదా! సినిమా పడినప్పుడు పడుతుంది. పడనప్పుడు మనం వెండి తెరలా వుండాలి. ఏదో ఒక బొమ్మకి నిలబడిపోకూడదు. ఇదీ మనకు భగవత్తత్వంలో కనిపిస్తుంది. భాగవతులలో కనిపిస్తుంది. భాగవతులను మీరెవరు అని అడిగితే, నవ్వుతారు తప్ప సమాధానం వుండదు. "నేనెవరు ?' అన్న ప్రశ్నకు సమాధానమేమీ వుండదు. ఎందుకంటే పేరు కూడా బహిర్గతమైన ప్రపంచంలో మనం చేసే వ్యాపారానికి పెట్టినది తప్ప, అంతరంగంలో అవసరం లేదు. అందుకే దానిని వ్యవహారిక నామం అన్నారు. కాబట్టి అంతరంగంలోకి వెళ్ళినప్పుడు, నేనెవరంటే దానికి సమాధానం లేదు. నేను, "నేను" గా వున్నటువంటి వాడుగా వుంటాడంతే! తాను జీవునిగా దేవుని యొక్క కిరణము. నేనుగా, వెలుగుగా వున్నటువంటి భావంలో వుండవచ్చును. నేను, నేనుగా వున్నాననే భావంలో వుండవచ్చు. బహిర్గతమైన జీవితంలో నేను తండ్రిని, నేను కొడుకును, నేను అది, నేను ఇది అని రకరకాలుగా మనం చెప్పుకుంటూ వుండవచ్చును. మనం ఒక భావంలో జీవిస్తున్నటువంటి వాళ్ళం ఇంకొక భావంలోకి మారేలోపుగా విశ్రాంతిగా వుండే సమయం వుంటుందే. ఆ సమయంలో నీ నిజస్థితిని గుర్తు పెట్టుకొంటే, మళ్ళీ ఇంకొక భావంలోకి వెళ్ళవచ్చును. బోల్డు రకాల frames ఉంటాయి. ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క frame అన్నమాట! దాన్నే 'తత్వ' మన్నారు. Frame లో బిగింపబడితే మనం బయటకు

రాలేము. Frame లోకి వెళ్ళి పనిచేయాలి. Frame లో దిగితేనే త్రిగుణాత్మకమైనట్లు. అందుకే thought is triangular అని చెప్తారు. Mathematical గా ఏం చెప్తారంటే,

1. విశ్వాత్మకమైన చైతన్యం అంతా వ్యాపించియున్నది.

2. మనం అందునుంచి ఒక అలలాగ వ్యక్తమైనవాళ్ళం.

3. మననుండి వ్యక్తమైన భావం or thought. అందుకని 3 అంకెకు, త్రిభుజానికి సంబంధంగా thought is triangular అని మనకు వేదంలో చెప్పబడివున్నది.

అంతకుముందు ఈ triangular thought లోకి దిగకముందు మనం కేవలం ఒక బిందువుగా వున్నవాళ్ళం. అవ్యక్తమైన స్థితి నుండే వ్యక్తమైన దానిని బిందువని చెప్తారు. అమ్మవారికి ఆ పేరుంది. మొత్తం అవ్యక్తంగా వున్నచోట ఒక బిందువు పెడితే, అది అవ్యక్తస్థితి నుండి వ్యక్తమైన స్థితిని సూచిస్తూ వుంటుంది. మనం నిద్రలేచిన తరువాత మనం వున్నామని మనకి తెలుసుకదా! నిద్రలో వున్నప్పుడు వున్నాంగానీ, వున్నామని తెలియని ఒక అవ్యక్తస్థితిలో వుంటాము. అవ్యక్తస్థితి నుండి వ్యక్తమైన స్థితిలోకి రావడాన్ని విశ్వాత్మ, జీవాత్మగా రావడంగా చెప్తారు. జీవాత్మ నుండి సంకల్పం వస్తుంది. ఇదే మనకు పురుష సూక్తంలో కూడా వుంటుంది. అదే పరబ్రహ్మతత్వం వ్యక్తంలోకి రాగానే పురుషుడుగా వస్తాడని. పురుషుడంటే ప్రవేశించినవాడు. దేనిలో ప్రవేశించాడంటే, తను ఒక పరిధిలోకి ప్రవేశించాడు. ఇక్కడ ఒక తెల్లని ఏమీ రాయని board వుందనుకోండి. దానిమీద ఒక వృత్తం గీసినట్లైతే ఆ వృత్తానికి లోపలున్న board గా, ఆ వృత్తానికి బయటవున్న board గా కనిస్తుంది, board ఒకటైనా! తన మాయ చేత తన్ను తాను సృష్టించుకున్నప్పుడు భగవంతుని పురుషుడంటారు. అదే పురుషసూక్తంలో పురము నందు ప్రవేశించాడంటారు. పురమంటే ఒక పరిధిలోకి తన్ను తాను నియమించుకొన్నాడని. అట్లాగే మనల్ని మనం ఒక్కో సన్నివేశంలోకి నియమించుకొంటాం. నియమించుకొన్న తరువాత, మనం అదే అని నమ్మితే ఎట్లా? వృత్తిలో auditor గా నన్ను నేను నియమించుకొంటా office కి వెళ్ళగానే! Office నుండి బయటకు వచ్చిన తరువాత కూడా నేను auditor అని గుర్తుంటే కష్టం. ఇంట్లో ఆవిడకు auditor ని కాదు. స్నేహితులకు కాదు. అలాగే ఏ భావంలో జీవిస్తూ వుంటామో, ఆ భావం నుండి బయటకు వచ్చేయాలి. అన్నిటికన్నా ముఖ్యమైంది నేను 'పార్వతీకుమార్' అన్న భావన నుండి బయటకురావడం. మిగతా భావనల నుండి కాస్తో కూస్తో బయటకు రాగలము గానీ నేను ఫలానా అనే పేరుంటుంది కదా! ఆ పేరులోంచి బయటకు రాలేము. అది చివర వరకు వుండిపోవలసిన తత్వం. ఈ తత్వాలన్నీ కలిపే 'వృత్రాసురుడ'ని చెప్పారు. తత్వంలోకి ప్రవేశించి. కార్యక్రమాలన్నీ నిర్వర్తించుకొని, తత్వంలోంచి బయటకు రాగలిగినవాడు యోగి! అట్ల రాగలిగినవాళ్ళు కృష్ణార్జునులుగా,

రాలేనివాళ్ళు మిగిలిన పాండవులుగా చూపిస్తారు. పద్మవ్యూహం లోకి వెళ్ళడం, పద్మవ్యూహం లోంచి బయటకు రావటంగా చెప్తారు. అభిమన్యుడికి పద్మవ్యూహం లోకి ప్రవేశించడమే తప్ప, తిరిగిరావడం తెలియదు. మనం కూడా అంతే. రోజంతా ఏవో భావాల్లో జీవించి, చివరకు సాయంకాలం అలిసిపోయి పడిపోతాము. పడిపోతే మళ్ళీ మనల్ని మోసుకొొచ్చి, అంతా శుభ్రం చేసి, ప్రొద్దున్న మళ్ళీ ఆడమని పంపిస్తారు. మనకి నిద్ర అందుకు వస్తోంది. యోగులకు నిద్ర రాదు. ఎందుకు రాదంటే వాళ్ళు అలా పడిపోరు కాబట్టి. పడిపోవడం, నిద్రపోవడం అన్నది ఆటలోకి వెళ్ళి, బాగా దెబ్బలు తగిలి స్పృహ కోల్పోయినవాడిని తీసుకొొచ్చి శరీరం అంతా శుభ్రం చేస్తే, మర్నాడు మళ్ళీ ఆటలోకి వెడుతున్నట్లుగా వుంటుంది మన పరిస్థితి. యోగి పరిస్థితి ఎట్లా వుంటుందంటే, ఆ ఆటాడే play ground లోకి వెళ్ళి, ఆట ఆడి, బయటకు వచ్చేస్తారు. మళ్ళీ ఆటకు వెడతారు. వచ్చేస్తారు. ఆట జరుగుతున్నప్పుడే ఆటలోకి వెడతాడు. లేకపోతే తాను, తానుగా వుంటాడు. మనకి వెళ్ళటం తెలుసు. రావటం తెలియదు. ఎందుకు తెలియదంటే ఈ 'వివిక్తః' అనే తత్త్వం అవగాహన లేకపోవడం వలన. వెండితెర మీద బొమ్మగాను, తామరాకు మీద నీటిబొట్టు గాను ఇట్లా అర్థం చేసుకోవాలి. మనలో వచ్చే భావాల నుండి మనం విడిపడగలమా? అదే మనకి మాస్టర్ సి.వి.వి. గారు మనకి ప్రార్థనలో ఇచ్చారు. 'నీ లోతట్టున ఏయే భావములు కలుగుతున్నాయో పరికించుచుండుము' అని. పరికించినప్పుడు భావాలుండవు. పరికించడం మర్చిపోయినప్పుడు గబగబా తెరలు తెరలుగా ఉధృతంగా వచ్చేస్తాయి. అట్లా రోజూ గమనించడం మనకి ప్రార్థనలో ఇచ్చారు. గమనిస్తూ వుంటే, వాటికా ఉధృతం తగ్గుతుంది. ఊరటం తగ్గుతుంది. పుడుతూనే వుంటాయి భావాలు. ఊరే భావాలను గమనించినప్పుడు ఊరటం మానేస్తాయి. మనకి ఏవి ఊరుతున్నాయో తెలుసుకొంటే, ఓహో మనం ఇందులో చిక్కుకున్నామని తెలుస్తుంది. ఈ ఊట ఏదో గమనించుకొని ఈ ఊట వల్ల ఉపయోగం లేదని తెలుసుకోవాలి. కేవలం కర్తవ్య నిర్వహణ మాత్రమే గుర్తుంచుకొని, ఆ కర్తవ్య నిర్వహణలో ముందుకు వెళ్ళిపోతున్న వాళ్ళకి కీర్తి, ప్రతిష్ఠ, ధనం, వైభవం ఇవన్నీ వెనక నడిచివస్తాయి. ఇవన్నీ కలిగినప్పుడు వాటిని చూడ్డం మొదలు పెట్టి కర్తవ్యం మర్చిపోతే అవన్నీ క్షీణిస్తాయి. పరమగురువులు ఒక వాక్యం చెప్పారు. నువ్వు ఏదైనా సత్సంకల్పంతో సత్కార్యం చేస్తున్నావనుకో! దానిలోని సత్యమును బట్టి దానికి వృద్ధి కలుగుతూ వుంటుంది. వృద్ధి కలుగుతున్నప్పుడు నీచుట్టూ కొంతమంది మనుష్యులు చేరతారు. నువ్వు చేస్తున్న సత్కర్మ వల్ల ప్రేరణ పొంది, అది కారణంగా నీతో కలిసి పనిచేయడం మొదలు పెడతారు. ఏది కారణంగా తనతో కలిసి పనిచేస్తున్నారో మర్చిపోయి, వాళ్ళను మనం వాడుకుంటూ వున్నామనుకోండి. అప్పుడు సత్కార్యం తగ్గిపోవటం వలన వారంతా జారిపోతారు. ఏ కర్తవ్యాన్ని ఆధారం చేసుకొని వారంతా జేరారో, దానిని వీరందరూ చేరడం వల్ల ఇంకా బాధ్యతగా నిర్వహించాలి అని చెప్తారు పరమ గురువులు.

చేస్తున్న కొద్దీ కీర్తి, ప్రతిష్ఠ, ప్రశంసలు వస్తూ వుంటాయి. అవి మన నీడ లాంటివి. వాటిల్లో మనం జీవించడం మొదలుపెడితే, ఏ కారణంగా అవి వచ్చాయో అవి చేయటం మానేస్తాము. మానేయటం వలన ఇవన్నీ నెమ్మదిగా జారుకుంటాయి. భాగవతమార్గంలో భాగవతులను చూస్తే, వాళ్ళు ఇవేవీ పట్టించుకోరు. అన్నిట్లోనూ భగవత్తత్వాన్ని చూస్తూండడం కారణంగా బుద్ధి ప్రచోదనం చెందుతుంది. బుద్ధి వెలిగి, కర్తవ్యం ఎప్పటికప్పుడు తెలుస్తుంది. లేకపోతే కర్తవ్యం మర్చిపోతాం. నలుగురు పొగిడితే చేయాల్సిన పని మర్చిపోతాం. 6 గంటలకి prayer చేయడం కూడా మర్చిపోతాం. కర్తవ్యాన్ని మరపించే సంభాషణంలోకి కూడా దిగిపోతాము. అందుకని రోజూ ప్రొద్దున లేచినపుడు మనకొచ్చే భావాల్ని observe చేయడం ఒకటి. రెండవది అసలు ఈ రోజు మనం ఏమిటి చేయాలి? What is it that we have to do today? ఈ రెండూ పెట్టుకొని, కర్తవ్యం వైపు నడుచుకుంటూ వెళ్ళి, కర్తవ్యమునందే నిమగ్నులమై ఉండాలి. పరిపూర్ణంగా నిమగ్నమై, ఆ సత్సంకల్పాలకు ఇంకా ఎక్కువ కార్యరూపం కలిగిస్తూ ముందుకు నడిచి వెళ్ళినట్లైతే, మనని బంధించే ఈ చిల్లర రకాలైన భావాలన్నీ వాటంతటవి రాలిపోతాయి. ఎందుకంటే వాటికి సమయం ఇవ్వలేనంతగా ఈ కార్యాలలో నిమగ్నమయి ఉంటాం కాబట్టి. శరీరానికి అలసట కలిగేంతవరకు ఒక 10, 12 సంవత్సరాలు ఏదో ఒక కర్తవ్యం నిర్వర్తిస్తూ ముందుకు వెడుతూ వుంటే, అప్పుడు మనలో ఒక రకమైన స్థిరత్వం ఏర్పడుతుంది. ఈ స్థిరత్వం కోసం, ఈ కర్తవ్యమందు మనం నిలబడటం కోసం ఈ విధంగా ఇదివరకు పనిచేసినవాళ్ళు మనకి ఆదర్శం కాబట్టి, వాళ్ళ స్ఫూర్తి మనకి కలిగేటట్టు ప్రార్ధనలు చేసుకోవాలి. దీనికి ఒక భాగవతోత్తముని ఆదర్శంగా తీసుకోవడమే! మనవరకు మాస్టర్ E.K. ఆ విధంగా జీవించారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఎప్పుడు, ఎట్లా మాట్లాడారో, సమయాన్నే విధంగా వినియోగపర్చారో, తనకున్న శక్తిసామర్థ్యాలని ఏ విధంగా వినియోగించారో, హృదయంలో నింపుకొని ఆ విధంగా పనిచేయడం అన్నది ఒక దీక్షగా పెట్టుకొని, ప్రక్కదారులు తొక్కకుండా నెమ్మదిగా ఈ దారిలో వెళితే, మనకున్న పట్లన్నీ రాలిపోతాయి. లేకపోతే ఏవో మొసళ్ళు పట్టుకొంటూనే వుంటాయి. ఇంటి విషయాలో, ఆఫీసు విషయాలో, బంధువుల విషయాలో,ఏవో ఒకటి. కొంతమంది సంఘం విషయంలో ఏమై పోతుందో అని బాధ పడిపోతుంటారు. అది మనకి సంబంధించినది కాదు. మనం బాధపడటం వల్ల అది బాగుపడదు. "ఇలావుంది కదా ప్రపంచం, మనం ఇలా ఇలా చేస్తే బాగుంటుంది కదా!" అని Denmark లో ఒక doctor వచ్చి, మాస్టరుగారికి ఒక గంట సేపు ఉపన్యాసం ఇచ్చాడు. 'అదంతా బాగానే వుంది కానీ, ఆ మొత్తంలో మనం చేయగలిగిందేదో చేయటం మొదలు పెడితే బాగుంటుంది తప్ప, మనం ఎన్నిసార్లు ఉపన్యాసం చెప్పకున్నా ఇట్లాగే వుంటుంది. మీరు చెప్పిన విషయాలన్నీ సత్యమే! అందులో సందేహమేమీ లేదు. వ్యక్తిగతంగా మానవునికి ప్రశాంతత లేదు.

సామూహికంగా, సంఘపరంగా కూడా ప్రశాంతత లేదు. ప్రశాంతత రావాలంటే ఏం చేయాలో అది మీరు చేస్తున్నారు. ఆ చేయవలసిందేదో మొదలు పెట్టి చేస్తూ వుంటే ముందు వ్యక్తిగతంగా ప్రశాంతత వస్తుంది. వ్యక్తిగతంగా ఎవరికైతే ప్రశాంతత వస్తుందో, వారిచుట్టూ ప్రశాంతత పొందడానికి మిగిలినవాళ్ళు చేరతారు. అట్లా ఒకళ్ళ నుంచి ఒకళ్ళు, ఒకళ్ళ నుంచి ఒకళ్ళు నెమ్మదిగా అందుకొని సంఘపరంగా కూడా ప్రశాంతత పొందవచ్చును. కానీ ఇట్లా మనం ఉపన్యాసాలు దంచుకొంటూ కూర్చుంటే రాదు కాబట్టి ఈ మొత్తంలో నాకు చేతనైనది నేను చేస్తున్నాను. మీకు చేతనైనది మీరు చేయండి. నేనేం చేయాలో మీరు చెప్పడం, మీరేం చేయాలో నేను చెప్పడం వలన సమయం వృథా అవుతుంది' అని చెప్పారు మాస్టారు. ఆ డాక్టరుగారు చాలా విశాలమైన హృదయం కలిగినవాడు. వెంటనే అర్థం చేసుకొన్నాడు. ఆయన నాతో అన్నాడూ 'He is the man who can face troubles can give solutions in life. జీవితానికి ఒక పరిష్కారం చూపించగల వెలుగు ఈయన. రకరకాలుగా మనం మన భావాల్లోనే చిక్కుకొనిపోయి వుంటాము. ఆయన వాటియందు చిక్కుపడకుండా తను చేయవలసినదాని మీదనే లగ్నమై వుంటాడు. కాబట్టి ఈయన ద్వారా జరగవలసినది తప్పకుండా జరుగుతుంది. ఆయనెవరో, ఎంతటి మహాత్ముఁలో నాకు అర్థమైంది.' అని ఆయన చెప్పడం జరిగింది. మనం కూడా మాస్టరుగారిని ఆదర్శంగా తీసుకున్నప్పుడు ముఖ్యంగా భాష, వాక్కు, సమయము, వనరుల యొక్క వినియోగము ఏ విధంగా చేస్తున్నామో చూసుకొని, సన్మార్గంలో వెడుతున్నట్లయితే త్వరితగతిని 'వివిక్తః' అనే స్థితిలోకి చేరడానికి అవకాశం వున్నది. దీనిని ప్రత్యేకించి ఏ భావాలు మనల్ని పట్టి ఉంచుతున్నాయని సాధనపరంగా చూసుకోవాలి. భావానికి అతీతంగా వున్న వాళ్ళం, భావంలోకి దిగుతాము. దిగంగానే త్రిగుణాత్మకమైన పరిస్థితులలోకి వస్తాము. అక్కడ నుండి మనం ఇంద్రియాల ద్వారా పనిచేసినప్పుడు పంచారము, లేదా పంచ భుజి, 5 pointed star లోకి దిగుతాము. అక్కడనుండి శరీరంలో పనిచేస్తున్నప్పుడు 7 pointed star అంటే 7 ముళ్ళు, 5 ముళ్ళు, 3 ముళ్ళు వున్నాయన్నమాట. ఈ ముళ్ళు విప్పకొంటూ వుండాలి. తరువాత 7 నుంచి 5, 5 నుంచి 3,3 నుంచి 2, 2 గా 1 గా సంబంధం పెట్టుకొని కూర్చోవాలి. పనికాగానే అది ఆధారంగా పెట్టుకొని, పని త్వరగా చేసుకొని, మళ్ళీ వెనక్కి వెళ్ళిపోవాలి తప్ప, పని ఎట్లా అయిపోయిందో నిన్న అని ఇవాళ మనం ఒక seminar, చర్చ పెట్టుకొని ప్రయోజనం లేదు. ఆ విధంగా జీవించడమన్నది 'వివిక్తః' అనే నామంలో మనం సాధనపరంగా తీసుకోవాలి.

## 274 శృతిసాగరః

'శృతిసాగరుడు' అంటే mouth to ear పెద్దలు చెప్పారు. అంటే ఒకళ్ళు చెప్పేది ఇంకొకళ్ళు వినాలి. చెప్పడం, వినడం రెండు ముఖాలు. అంటే రెండు భాగాలు లాంటివి. చెప్పడమనేది 'సరస్వతి' అంటారు. వినడం 'బృహస్పతి' అంటారు. వినడానికి మనలో బృహస్పతి బాగా వుండాలి. బాగా వినేవారికి బృహస్పతి బాగా పెరుగుతూ వుంటాడు. ఎంత బాగా వినాలంటే పెద్ద చెవులు పెట్టుకొని వినాలిట. అందుకనే మనకి వినాయకుణ్ణి ఇచ్చారు ప్రార్ధనకి. వినాయకుడు మనకేమి చెప్తాడంటే బాగా వినమని. బాగా మాట్లాడమని చెప్పలేదు. బాగా విన్నవాడు బాగా మాట్లాడడానికి అవకాశం వున్నది. అసలు విననివాడు ఏమీ మాట్లాడలేడు. వినటమంటే ఎదుటివాళ్ళు చెప్పింది వినటం ఒకటి వుంటుంది. పైనుండి చెప్పేది వినటం ఒకటి వుంటుంది. చుట్టుప్రక్కల చెప్పేది వినలేనివాడు, ఊర్ధ్వలోకాల నుండి వచ్చేది అసలు వినలేడు. అందుకని సాధనలో 'శృతివిద్య' చాలా ముఖ్యమైనది. శృతివిద్య అంటే మాట్లాడడం తగ్గించి, వినటం నేర్చుకోవడం. Auditing జరగాలన్న మాట. Auditing అంటే accounts, పనిచేయడం అనుకుంటారు. నిజంగా auditing అంటే వినడమన్న మాట. బాగా వినాలి ఎంత బాగా వింటే, అంత బాగా అవగాహన అవుతుంది. అందుకని వినటాన్ని positive sound అన్నారు. Positive aspect అన్నారు. ధనసంజ్ఞ అంటారు. చెప్పడం negative sound. ఋణసంజ్ఞ. వినకుండానే చెప్పేస్తూ వుంటారు కొంతమంది. అవతలవాళ్ళు మాట్లాడుతూ వుంటే, వీళ్ళు మాట్లాడేస్తారు. వాళ్ళు చెపేది వినరు. సుమతీ శతకం పద్యంలో చెప్పారు. 'వినదగు నెవ్వరు చెప్పిన' వాడు వీడు అనికాదు. ఎవరు చెప్పినా సరే. 'వినినంతనే వేగపడక వివరింప తగున్' ఎవరైనా సరే పూర్తిగా వినడమంటే, వాడు చెప్పేది వినటం కాదు. వాడిలోంచి చెప్పేవాడిని వినడం! చెప్పేవేవో చాలా వుంటాయి. చెప్పేవాడు చెప్తూ వుంటాడు. చెప్పేది మనకు నచ్చలేదనుకోండి. వాడు చెప్పేది వినటం మానేసి, వాడిలోని చెప్పేవాడిని వినాలి. అట్లా వినవచ్చును. అట్లా వినేవాడికి పెద్ద చెవులున్నట్లు లెక్క. వాడేం చెప్పాడో, ఎందుకు చెప్పాడో కాకుండా అసలు అందులో చెప్పేవాడున్నాడే, వాడిని వింటూ వుంటాడు. అట్లా వింటూ వుండే వాడు క్రమశః ఇంకో రకమైన వినికిడి ఏర్పడుతుంది. ఏమిటి ఆ వినికిడి అంటే, బయట చోటులోంచి కూడా చెప్పబడేవి వినే స్థితిలోకి వస్తాడు. ఎందుకంటే చెప్పే భాషలో కాకుండా చెప్పేవాడిలో లీనమై వున్నాడు కాబట్టి, ఆ చెప్పేవాడు మొత్తం చోటులో వున్నాడు కాబట్టి, వాడికి చోటులో నుండి విషయాలు వినిపిస్తూ వుంటాయి. వినిపించినవి తననుండి వ్యక్తం చేస్తాడు. అదీ వాక్యాన్ని విస్తరించడమంటే! 'పలికించెడివాడు రామభద్రుండట' మనం పలకడం కాదు. మనం పలికించబడతాము. మహాత్ములంతా కూడా పలికింపబడిం దానికి సహకరించి పలికారు. అంతేకానీ వాళ్ళ కై వాళ్ళు నోరుంది కదా అని పలకలేదు. అందుకని ఈ బృహస్పతి మార్గంలో బాగా వినటం కావాలి. వినటం ఎంత దూరం వెళ్ళాలంటే, 'బయలాలకించి' అని ఒక పదం వుంది గజేంద్రమోక్షంలో. చోటుని కూడా వింటాడన్నమాట. ఎవరూ ఉండనక్కరలేదు వినబడతాయి. 'కర్ణపిశాచి' అంటారు. వినబడ్డవి తననుండి అప్రయత్నంగా వ్యక్తమవుతాయి. అంతుంది వాక్కు సాధనలో.

వాళ్ళేదైనా అంటే, ఆలోచించి, మనసులోది అనటం కాదు. వాడి నుండి అలా వ్యక్తమవుతుంది అంతే! వ్యక్తమైతే వెళ్ళిపోతూ వుంటుంది. ఎందుకంటే జరగాల్సినది, వీడినుండి అనబడుతున్నది తప్ప, జరగటం కోసం వీడు అనటం లేదు. ఏదన్నా ఒకటి prediction ఇచ్చి, అది అయ్యేవరకూ పీక్కుంటూ వుంటాము అవుతుందో, అవదో అని కదా! ఎందుకంటే అనేది మనం కాబట్టి! మహాత్ములట్లా వుండరు. అయ్యేది అంటారు. అయ్యేది కాకపోతే ఏమీ అనరు ఊరుకొంటారు. మరీ పెద్దవి వస్తూ వుంటే 'చూద్దాంలే బంగారూ!' అని అంటారు. నవ్వుతారు. మరిపించేస్తారు. ఇంకొకటేదో అడుగుతారు. ఈలోగా వీళ్ళు మర్చిపోతారు. అంతే తప్ప అవనిది అనరు. అయేది అంటూ వుంటారు. అయ్యేదే వారి నుండి వ్యక్తమవుతుంది తప్ప, వేరే మాటరాదు. పాపం కుంతీదేవి అట్లాగే కదా! ఐదుగురూ పంచుకోండి అంది. ఐదుగురూ పంచుకోవడ మేమిటది? ధర్మరాజంటాడు 'అమ్మ ఏదో అందిలేరా ఐదుగురం ఎలా పంచుకొంటాము?' అని. ఆయన ఎప్పుడూ యదార్థ స్థితిలో వుంటాడు. ఎప్పుడూ యోగస్థితిలో వుంటాడు. అప్పుడు అర్జునుడు 'అమ్మ నోటినుండి, అట్లా ఏదో వాక్కు వస్తుందా?' అని అడుగుతాడు. అటువంటి అమ్మకు పుట్టామా? మనం అని. (అలా అనడానికి ఎంత ఆత్మస్థైర్యం వుండాలి?) అడిగితే అప్పుడు ధర్మరాజు మళ్ళీ ఆలోచించాడు. ఆలోచిస్తే వాళ్ళ అమ్మ అన్నది సత్యమని తెలుస్తుంది. అట్లా వుంటుంది సత్యం! మహాత్ములు ఏదో తమాషాగా మాట అనేస్తారు కానీ చాలా జాగ్రత్తగా వినాలి. పెద్దవాళ్ళ దగ్గరకి వెళ్ళినపుడు మనమేదో చెప్పేద్దామనుకొంటాం మనం చేస్తున్న సాధన, మనలో వున్నాయనుకున్న కళ్యాణగుణాలు వాళ్ళకి చెప్పేద్దామనుకుంటాం. వాళ్ళకి మనగురించి తెలియదు చెప్పేసుకుందాం అనిపిస్తుంది. నిజానికి పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళినప్పుడు వినటం ఎక్కువ పెట్టుకోవాలి. వినని వాళ్ళకి సందేశం ఏమీ వుండదు. సరాసరి సూటిగా చెప్పినా వాళ్ళకి అందదు. కుంతి అన్న మాటను ధర్మరాజు కాకతాళీయంగా తీసుకొంటాడు. ఎందుకంటే ఫలమనుకొని చెప్పిందని. ఫలం తెచ్చామంటారు వీళ్ళు. అయితే ఐదుగురూ పంచుకోండి, అంటుందావిడ. ఐదుగురూ పంచుకోండి అంటే ఫలం అని చెప్పింది తప్ప, ఈ ఫలం అంటే 'కన్యాఫలం' అని అనుకోలేదు కదా! కాబట్టి దానికి పెద్ద ప్రాముఖ్యత ఇవ్వనక్కర లేదంటాడు, ధర్మరాజు. అప్పుడు అర్జునుడు నిలదీస్తాడన్నమాట. అమ్మ నోటి నుండి అలా ఊరికే వాక్యం వస్తుందా? అని. అర్జునుడు అలా నిలదీస్తే అప్పుడు ధర్మరాజు తనలో తను పరీక్ష చేసుకొని చూసుకొంటే ద్రౌపది మీద తనకు కూడా అనురాగం కనిపిస్తుంది. ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడు ఎటువంటివాళ్ళంటే, తమతో సంబంధం లేని స్త్రీ మీద కామమైన భావం కలుగదు. పవిత్రమూర్తులకి వాళ్ళకి భార్యగా దిగివచ్చిన జీవియందే అనురాగం వుంటుంది తప్ప, ఊళ్ళో వాళ్ళందరి మీదా అట్లా కనిపించదు. అది పవిత్రతకు మొదటి సూచన. ద్రౌపదీ స్వయంవరానికి కృష్ణుడు కూడా వస్తాడు. కృష్ణుని చుట్టూ వుండే గోపకులంతా కూడా నువ్వు కొట్టకూడదా ఆ మత్స్యయంత్రాన్ని, అంటారు. కృష్ణుడు, ఇది మనది కాదు. మనకి సంబంధం లేదు, అని చెప్తాడు. అట్లా వుంటుంది. ఎందుకంటే మనుష్యులలో పవిత్రత పెరిగినకొద్దీ తమ ధర్మపత్ని, తమ ధర్మపత్ని కావలసిన జీవి యందు తప్ప, మిగతావాళ్ళ యందు వేరే భావం కలుగదు. ధర్మరాజు మరి చాలా పవిత్రుడే! ఏ స్త్రీ కనబడితే, ఆ స్త్రీ యందు వ్యామోహం కలిగేవాడు కాదు. అటువంటివాడు తనను తాను పరిశీలించుకొని ద్రౌపది

మీద తనకు అనురాగం వుందని తెలుసుకొంటాడు. అట్లాగే భీముడు ఎటువంటివాడు? కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తే, శివుడు ప్రత్యక్షమయ్యేటంత తపశ్శాలి భీముడు. శివుడు ప్రత్యక్షమవడమంటే cosmic power ఏదైతే వుందో, ఆ విద్యుత్ శక్తిని సరాసరి తనయందు ఆవాహన చేసుకోవడం. అటువంటి వాళ్ళు చిల్లర భావాలలో వుండరు కదా! ఆయన కూడా తన లోపల చూసుకొంటే, తనకి ద్రౌపది మీద అనురాగం వున్నట్లు తెలుస్తుంది. అట్లాగే నకులుడికి, సహదేవుడికి అందరికీ ఆలాగే అనిపిస్తుంది. అప్పుడు ఆశ్చర్యమేస్తుంది ధర్మరాజుకి. తనలో తను చూస్తాడు. తన తమ్ముళ్ళందరిలోనూ చూస్తాడు. అప్పుడు అమ్మో! అమ్మ చెప్పింది చాలా పెద్ద సత్యం. మనకి అర్థం కాలేదని అనుకొని, సరే! అందరం అమ్మ చెప్పినట్లు చేద్దాం, అనే నిర్ణయానికి వస్తారు. మరునాడు వివాహానికి ద్రుపదరాజు పిలిస్తే, ఐదుగురూ పీటల మీద కూర్చుంటే, ద్రుపదుడు ఒప్పకోడు. ఇదేమిటయ్యా ఒకళ్ళని పిలిస్తే ఐదుగురు వచ్చారు అని. మా అమ్మ చెప్పిందంటాడు, ధర్మరాజు. అమ్మ చెపితే అది నాకు ప్రమాణం కాదు కదా! ఐదుగురూ చేసుకోవడానికి ఏమిటి ప్రమాణం? అని అడుగుతాడు ద్రుపదుడు. 'నాకు తెలియదు. మా అమ్మ చెప్పింది. మా అమ్మ చెప్పింది సత్యమని మాత్రం నాకు తెలుసు. అది ఎట్లా సత్యమో నేను నీకు చెప్పలేనంటాడు.' 'నువ్వు చెప్పలేకపోతే పీటల మీద కూర్చోవడానికి వీలులేదంటాడు' ద్రుపదుడు. ధర్మరాజు మీద చాలా గౌరవముంది. ద్రుపదునికి. సాక్షాత్తూ ధర్మం రూపుగట్టుకొని వచ్చినవాడని విశ్వాసం వున్నది. కానీ రేపు ప్రజలు కూడా ఇలాంటి పనులే చేస్తారు. నేను రాజును కదా! కాబట్టి నాకొక సమాధానం కావాలి, అని అడుగుతాడు. ధర్మరాజు నా దగ్గర సమాధానం లేదు. మనసుకిది ధర్మమని తెలుస్తున్నదని అంటాడు. నీ మనసుకి ధర్మమని తెలిసినది నేను గౌరవిస్తాను తప్ప, రాజుగా నేను రేపొద్దున దీనికి సమాధానం చెప్పకోలేను కాబట్టి ఏదైనా పరిష్కారం చూపించమని అడుగుతాడు. నా దగ్గర పరిష్కారం లేదు. ఈ అమ్మాయిని మేము ఐదుగురం పరిణయమాడుట అనేది ధర్మమని తెలుసు. ఎలా ధర్మమో నేను చెప్పలేనంటాడు. అంతలో వేదవ్యాసుడు వస్తాడు. వ్యాసుడు పూర్వాపరాలు తెలిసినవాడు కాబట్టి ఆయన్ని అడుగుతారు. ఆయన ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతం, ఈ పాండవుల పూర్వజన్మ వృత్తాంతం, ఆవిడ చేసిన తపస్సు, శివుడిచ్చిన వరం ఇవన్నీ చెప్తాడు. గదిలోకి తీసుకొనివెళ్ళి, Personal consultation ఇస్తాడన్నమాట! ఇస్తే అప్పుడు 'నువ్వు చెప్పింది కాదనను. నువ్వు మహాత్ముడివి. నువ్వు చెప్పేదాంట్లో సత్యముంది. కానీ ఈ పూర్వజన్మ వృత్తాంతమంతా ప్రజల కెట్లా చెప్పగలము?' అని అడుగుతాడు. ప్రతీవాడూ ఒక పూర్వజన్మ వృత్తాంతం పట్టుకొస్తాడు నా దగ్గరకి. ప్రక్కవాడి భార్యని చూపించి, క్రిందటి జన్మలో నా భార్య, ఇప్పుడు చేసుకుంటానంటే నేనేం చేయను రాజుగా? అని అడుగుతాడు. అప్పుడు వ్యాసుడు 'ఇన్ని ప్రశ్నలెందుకు? నీ కూతుర్నే అడిగిచూడు' అంటాడు. ఇంత జరుగుతూ వుంటే, ఆవిడ ఏమీ అనదు. ఆవిడ object చేయదద్దూ ఐదుగురేమిటని? ఆవిడ ఇదంతా చూస్తూ వుంటుంది. ఎందుకంటే అంతరంగంలో సమ్మతమైన విషయం. జన్మజన్మల నుండి వచ్చిన సంస్కారమటువంటిది. వరమటువంటిది. కాబట్టి సహజంగానే ఆవిడకి వాళ్ళు ఐదుగురూ తన భర్తలనిపిస్తుంది. నీ కూతురినే కనుక్కో, ఆవిడేం అంటుందో, అన్నప్పుడు, ఆవిడను చూస్తే ద్రుపదుడికి సమధానం దొరుకుతుంది. ఇట్లా మనస్ఫూర్తిగా అందరూ

అంగీకరించాకే ధర్మసమ్మతమైన ప్రమాణం మీద ఆ వివాహం చేస్తాడన్నమాట! ఇదంతా ఎందుకు చెప్పానంటే కుంతిమాట. కుంతిమాట ఎట్లా వచ్చిందో? ఎటువంటి మాట అది? ఇంతకుముందు జన్మలలో జీవుల కథకు సంబంధించిన సన్నివేశం, ఇప్పుడు ఫలమవడానికి ఆవిడ నుండి వాక్కు వచ్చింది. ఆవిడకే తెలియదు. ఎట్లాగమ్మా అని అంటే, నేను చెప్పాను కాబట్టి మీరు చేసుకోండి, అని కుంతి పట్టుపట్టదు. అర్జునుడు పట్టుపడతాడు. అట్లా వుంటాయి సత్యవాక్కులు. అప్పుడన్నదానికి ఏ అవగాహన వుండదు కానీ, ఒక్క గురువాక్యం 10, 12 ఏళ్ళు పడుతుంది అవగాహన అవడానికి. చెప్పినప్పుడు ఏమిటోగా, చప్పచప్పగా ఉప్పు, కారం లేనట్టు వుంటాయి. కానీ సాధన మొదలు పెట్టి చేస్తూ వుంటే, ఒక 10, 12 ఏళ్ళకి అందులో వుండే మహత్తరమైన సత్యం తెలుస్తుంది. ఆ తరువాత ఈయన చేసినకొద్దీ, గురువు అదృశ్యమయ్యాక మరీ విపరీతంగా తెలుస్తుంది. అప్పుడు గురువు మీద గౌరవం పెరుగుతుంది. గురువు భౌతికంగా దొరకడు. దొరకలేదని విరహవేదన పడుతూ వుంటాడు. అట్లాగే గురువాక్యం సత్యవాక్యంగా పరిణమిస్తుంది. అందుకనే మహాత్ములు ఏవైనా ఇట్లా చేసుకో అని చెప్తే, దానికి పూర్వాపరాలు చూడకుండా, మన మనసుకి సంబంధించిన logic apply చేయకుండా అట్లా చేసుకొంటూ వెళ్ళిపోతాం. అది మన పెద్దలిచ్చిన మార్గం. మూడు ప్రమాణాలిచ్చారు. ప్రత్యక్ష ప్రమాణం, అనుమానం, ఆగమం. 'ఆగమం' అంటే పెద్దలు చెప్పిందని. నువ్విల్లా చేసుకో అని ఎవరైనా పెద్దలు చెపితే, దానిమీద ప్రశ్నలు లేకుండా చేసుకొని వెళ్ళిపోవడమే! అదొక పద్ధతుంది. మన పెద్దవాళ్ళు అలా ఇచ్చారు. ఏమీ తెలియనివాడి logic కి సరిపోయినట్టుగా చెప్పే అవకాశం వుండదు. ఈ రోజుల్లో అదో పెద్ద గొప్పతనం అనుకుంటున్నారు చాలామంది. 'మాకర్థమైతేనే మేం చేస్తాం' అని. నీకర్థమయ్యేదెంత? నీవడుగుతున్నదే ఇంత. అందులో నీకర్థమయ్యేది నలుసంత. తెలిసే మనకేం చెప్తారంటే, నీకు ఒక వ్యక్తి ప్రవర్తన మీద, ఆయనకుండే దైవీస్వభావం మీద నమ్మకం వుంటే, ఆయనేం చెపితే అది చేసుకొని వెళ్ళిపో. నీకే పిల్లిబుర్రంత వుంటుంది. దానిలో విశ్వానికి సంబంధించిన అవగాహన రాదు కాబట్టి, నడిచి వెళుతుంటే నీ అవగాహన పెరుగుతుంటుంది. అట్లా గురువాక్యం, పెద్దల వాక్యం అనుసరించి చకచకా వెళ్ళిపోయినవారు వున్నారు. కైకేయిమాత మాట అనుసరించి రాముడు అలా వెళ్ళిపోలేదూ? ఈ dimension ఈ రోజుల్లో తగ్గిపోతున్నది. ఎందుకంటే మాకు తెలిసినంత ఆచరిస్తామని అంటున్నారు. దాంట్లో కొంత అభివృద్ధి వేగం తగ్గుతుంది కానీ మనకున్న పరిస్థితులలో అదే సత్యం. నిజానికి మనకి మాస్టారు లాంటివారో, సి.వి.వి. లాంటివారో, మైత్రేయుడో, రాముడో, కృష్ణుడో లేక భగవద్భక్తులో ఎవరో ఒకర్ని పట్టుకొని బయల్దేరండి. ఇక దాని విషయంలో ఎటువంటి confusions, compromises లేకుండా వెళ్ళిపోతే, సరాసరి మనం ఆ మార్గంలో వెళ్ళి స్థిరపడిపోతాం. అంతుంది పెద్దల వాక్కులో! అది పట్టుకొని అట్లా బయలుదేరి వెళ్ళినవారి కథలు బోలెడుంటాయి భారతంలోనూ, భాగవతంలోనూ. దాన్ని పట్టుకొని ఆ దారిన పోవడమే! దాన్ని మాత్రం వదలకూడదు. ఏదైనా గురువాక్యాన్ని 'ఆప్తవాక్యం' అంటారు. నీ కేది మంచి కలిగిస్తుందో ఆలోచించి, ఇట్లా చేయమని చెప్తాడు. మన మనస్సుతో దానిని విచికిత్స చేయలేము. బేరీజు వేయలేము. చేసుకొంటూ వెళ్ళడమే. ఆది మనకి కుంతీదేవి ప్రవర్తనలోను, ధర్మరాజు ప్రవర్తనలోనూ కనిపిస్తుంది.

వేదవ్యాసుడంతటి వాడు వస్తే తప్ప, ఆ మొత్తాన్నంతా అవగాహన చేసికొని చెప్పే స్థితి కనిపించదు. అందుకని 'శృతిసాగరః' అనే పదానికి అర్ధమేమిటంటే వినటం, చెప్పటం గా మొత్తం ఈ సృష్టి అంతా ఏర్పడింది. 'శృతి' అంటే ఒకళ్ళు ఇంకొొకళ్ళకి చెవిలో చెబుతారని. Mouth to ear. ఏమి నేర్చుకోవాలన్నా ఒకళ్ళ నుండి ఇంకొకళ్ళు పుచ్చుకోవడమే తప్ప, మధ్యలో ఇంకో medium వుండడానికి వీలులేదు. అది సవ్యం అవుతుంది. మనం పుస్తకాలు చూసి రుద్రాభిషేకం నేర్చుకుంన్నామనుకోండి అది అంత సవ్యమైన విద్య అవదు. ఒక నేర్చుకున్న మనిషి ద్వారా నేర్చుకుంటే అది సవ్యం ఆవుతుంది. ప్రవాహానికి ఒక continuity వుంది. అలా కాకుండా నేర్చుకున్న దానికి continuity వుండదు. అందుకనే ఈ శృతివాక్యం పెద్దల దగ్గరనుండి పిన్నలకి, ఆ పిన్నలు పెద్దవాళ్ళయ్యాక వాళ్ళ దగ్గరనుండి ఇంకొకళ్ళకి, వాళ్ళనుండి ఇంకొకళ్ళకి, వాళ్ళనుండి ఇంకొకళ్ళకి ఇలా అందుకొంటూ నడిచి వెళ్ళిపోవడమే! సి.వి.వి.గారి దగ్గర నుండి మాస్టరుగారి దగ్గరకు, మాస్టరుగారి దగ్గర నుండి మన దగ్గరకు, మన ప్రవర్తన బట్టి ఇంకొకళ్ళకి అందుతూ వుంటుంది. మనలో సత్యం వున్నప్పుడు అది ఇంకొకళ్ళకి అందించడానికి వీలుంటుంది. అవి నిండుకుండలా వుంటాయి. లేకపోతే ఒట్టి కుండల్లా వుంటాయి. శృతివిద్య ఒక నిండుకుండ నుండి ఒట్టికుండకు transfer అవుతూ వుంటుంది. Transmission జరుగుతూ వుంటుంది. అందుకనే మనం ఎప్పుడూ ఒక నిండుకుండ నుండి నీళ్ళు తీసుకోగలము గానీ ఇంకో కుండ నుండి తీసుకోలేము కదా! నిండని కుండ నుండి నీళ్ళు రావు కదా! గ్లాసులో నీళ్ళుంటే ఇంకొకళ్ళకు పోయవచ్చును. లేవనుకోండి ఇంకేమి పోస్తారు? అది continuity కి తార్కాణం. అనుశ్యూతంగా నడవడమంటారు. సృష్టంతా కూడా అలా నడుస్తున్నది. ఒకళ్ళ నుండి ఒకళ్ళకి, వాళ్ళనుండి ఇంకొకళ్ళకి, వాళ్ళనుండి మరొకళ్ళకి. ఈ మొత్తమంతా ఒకే చైతన్యం. ఇన్నిటిలో వ్యాపనం చెంది వున్నది. ఎక్కడా దీనికి తెగటమనేది లేదు. Cuts వుండవు. Continuous play వుంటుంది. ఇలా విని, చెప్పడం ఆచరిస్తే, దానియొక్క అనుభూతి పొందవచ్చు. భగవంతుడు కూడా అట్లా చెప్తాడుట వినే వాళ్ళకి. వినని వాళ్ళకి చెవిటి వాడి ముందు శంఖంలా ఉంటుంది. ఎట్లా చెప్తాడు? ఎట్లాగైనా చెప్పచ్చు. 'మీకు 24 రకాలుగా చెప్తానని చెప్తాడు శ్రీకృష్ణుడు ఉద్ధవగీతలో. గురువని వేషం వేసి, గురువని పేరు సంపాదించి చెప్పనక్కరలేదు. మనిషిగా చెప్పవచ్చు. ఒక చెట్టుగా చెప్పచ్చుట. ఒక పక్షిగా చెప్పవచ్చుట. ఒక జంతువుగా చెప్పవచ్చును. ఒక వేశ్యగా కూడా చెప్పచ్చు. ఎక్కడ నుండైనా రావచ్చును నా వాక్యం నీ దగ్గరకి. కాబట్టి చెవులు బాగా విప్పి పెట్టుకొని వుండు' అని. అరవిందుని అడుగుతారు మీ గురువుగారు ఎవరని? 'నాకు చాలామంది గురువులున్నారు. Human agency యే అక్కరలేదు, గురువాక్యం వినటానికి', అని చెప్తాడు. మనం గురువంటే మనిషి రూపంలో వుండాలనుకుంటాం. ఒకాయన తేనెటీగ, కొండచిలువని గురువులుగా భావించి పెద్దవాడయ్యాడు. అదే భాగవతంలో వుంది. ఎవరైనా సందేశం ఇవ్వచ్చు. ప్రత్యేకించి 24 రకాల వాహికలున్నాయిట సందేశం ఇవ్వడానికి ప్రకృతిలో. సత్యలోకంలోకి మనం ప్రవేశించడానికి 24 రకాల వాహికలున్నాయి. యోగికి, ఎందులో నుండైనా అందవచ్చు. ఎప్పుడు వినిపిస్తుందంటే చెవులు పెద్దవి చేసుకున్నప్పుడు. మనం వినడానికి చాల ఉద్యుక్తులమై వుండాలి. వినడంలో నిర్మలత్వం వుండాలి. అభిప్రాయాలతో కూడిన పద్ధతిలో వినకూడదు. మనకే కొన్ని అభిప్రాయాలుండి, వీడేం చెబుతాడో చూద్దామన్నట్లు

వుండకూడదు. రోడ్డు మీద వెళ్ళే బిచ్చగాడు చెప్పచ్చును. వినేవాడికి వినే బుద్ధి వుంటే, ఎక్కడనుండైనా భగవంతుడు పలకడానికి రెడీగా వుంటాడు కాబట్టి ఈ "శ్రుతిసాగరః" అనేది భగవంతుని యొక్క సందేశంగా, స్వరంగా భావన చేసినట్లైతే వినబడుతున్నవన్నీ కూడా వింటూ వుండడమే జాగ్రత్తగా. వినబడినవన్నీ వింటూ వుండడం అనే ఒక సాధన వున్నది. అట్లా వినేవాడికి చెట్టు దగ్గర నుండీ సందేశమే! రోడ్డు మీద కుక్క దగ్గర నుండీ సందేశమే! చెత్తకుండీ మీద వ్రాలే కాకి కూడా సందేశం ఇవ్వగలదు. శృతివిద్యలో భాగంగానే సరస్వతీ సూక్తంలో ఏం చెబుతారంటే 'నన్ను చూస్తూనే వుంటావు కానీ చూడవు. నన్ను వింటూనే వుంటావు కానీ వినవు. నేను ఏం చేయను?' 'ఉతత్వ పశ్యన్ దదర్శ వాచమ్, ఉతత్వ శృణ్వన్ శృణోత్యేనామ్'. చూడగలగాలి. వినగలగాలి. చూసినకొద్దీ దర్శనం జరుగుతుంది. విన్నకొద్దీ సందేశం దొరుకుతుంది. 'శృతిసాగరః' అనే నామంలో వినటం అనే తత్వంగా భగవంతుడు అందరినీ వింటూ వుంటాడు. మనం మాట్లాడేవన్నీ కూడా వింటూ వుంటాడు. ఎవరూ లేరని ఇంకొకళ్ళ గురించి మనం మాట్లాడినవి కూడా వింటూ వుంటాడు. ఎవరూ లేరని మనం చేసేవన్నీ కూడా వాడు చూస్తూ వుంటాడు. చూసేవాడు, వినేవాడు ఒకడెప్పుడూ వుంటాడు కాబట్టి కనీసం మనం అదన్నా మనసులో పెట్టుకొని బాగా వినటం నేర్చుకోవాలి. వినటం అనేది కూడా ఒక విద్య. ఒకళ్ళు చెప్పేది వింటున్నారా, లేదా అన్నది ముఖ్యం. ఎంత వింటే అంత. చెప్పేవాడి మాటలు, భావాలు కాకుండా చెప్పేవాడిగా వున్నవాడిని వినడం అనే తత్వంలోకి ప్రవేశించవచ్చును. అట్లా ప్రవేశిస్తే చాలా వినచ్చు. అట్లా విని తెలుసుకున్నది కొన్ని జన్మలు పుస్తకాలు చదివి తెలుసుకొన్నదానికన్నా ఉత్తమంగా, సూటిగా, సత్యంగా వుంటుంది. మన సాధన మార్గంలో 'శృతిసాగర:' అనే పదానికి అవగాహన.

శృతిసాగరమంటే 'శృతి' అంటే చెప్పడం, వినడం. Mouth to ear. ఒకళ్ళు చెపితే ఇంకొకళ్ళు వింటూ వున్నారుట. ఒక Broad casting system, ఒక Receiving system. అదేకదా మనం రేడియోలకి చూస్తూంటాము. ఒక Transmitting centre, ఒక Receiving system వుంటుంది. సృష్టి మొత్తమంతా అలాగే ఏర్పడింది. ఆయన నుంచి వ్యక్తమైన వాక్కు నుంచి పుట్టినవాటిలోంచి మళ్ళీ ఆయన వ్యక్తమౌతూ వుంటే, ఆ పుట్టినవాటిలోంచి ఇంకొకటి పుడుతూ వుంటుంది. తనలోంచి గ్రుడ్డు పుడితే, గ్రుడ్డులోంచి తను పుట్టాడుట. అదే పురుషసూక్తంలో "తస్మాద్విరాడజాయత విరాజో అధిపూరుషః సజాతో అత్యరిచ్యత పశ్చాద్భూమి మధోపురః". అక్కడ నుండి తూర్పుకు వెళ్ళడం మొదలు పెట్టి, అక్కడ నుండి పశ్చిమానికి వెళ్ళి, పశ్చిమం నుండి కిందకి/ అధో కి వెళ్ళిపోయాడుట. అంటే చైతన్య స్థితి నుండి పదార్ధము లోనికి ప్రవేశించి, దక్షిణంగా ప్రయాణం చేసి, సూక్ష్మం గా ఉండే ప్రకృతి లోని పదార్ధములోనికి ప్రవేశం చేస్తాడు. అందులో ప్రవేశము చేసినవాడు అంతకంతకి స్థూలమవుతూ వస్తుంటాడు. స్థూలం లోనికి రాగానే ఆయన మరుగైపోతాడు. తూర్పు నుండి పడమరకు వచ్చి పడమర నుండి అధో లోకాలకి వస్తాడు. తూర్పు నుండి పడమరకి రావడమంటే సంకల్పములోనికి రావడం. అందుకే ఈ సంకల్పాన్ని అమ్మవారు అంటారు. అవ్యక్తుడు వ్యక్తం అవడమే

ఉత్తరదిశగానూ, వ్యక్తమైనవాడు వెలుగవడము తూర్పుదిశగానూ, వెలిగినవాడు పదార్ధమయుడవడం దక్షిణము నుండి పశ్చిమమునకు చేరుటను, పదార్ధము కరుడు గట్టి చీకటిలోకము లేర్పడుట అధోముఖము చేరుటను వేదము తెలుపుతున్నది. మన తిరుగు ప్రయాణము కూడా అధస్సు నుండి పశ్చిమమునకు చేరుట. అనగా మూలాధారము చేరుట. అచటనుండి దక్షిణము చేరుట. అనగా దాక్షిణ్యము కలిగిన హృదయమును చేరుట. అచటనుండి తూర్పు అను ఆజ్ఞా కేంద్రము చేరుట. అచటనుండి ఊర్ధ్వముఖమై ఫాలభాగము పైకి చేరుట (ఉత్తరము) అచటనుండి. అవ్యక్తము చేరుటగా జరుగును. భగవంతుని అధోపురమునందు కూడా వుండునని తెలియజెప్ప సమగ్రజ్ఞానమే వేదము. అనగా చీకటి బజారులయందు కూడా వుండునని కూడా తెలియును. నరకములు, పాతాళములు అవీ ఇవీ అని అనక అన్నిటియందూ అతడుందుటకు సమర్ధుడు మరియు సమ్మతుడు. భగవంతుని సంకల్పం అమ్మవారు. మన సంకల్పం మన స్వభావం. మన అమ్మవారన్నమాట.. మన అమ్మవారిలో మనం ప్రవేశించినప్పుడు మన సృష్టి మొదలవుతుంది. ఆయన అమ్మ వారిలోకి ఆయన ప్రవేశించినప్పుడు ఆయన సృష్టి మొదలవుతుంది. ఏముంది అందులోంచి ఇంకొకటి పుట్టుకొస్తుంది. మనలోంచి కూడా ఇంకొకటి పుట్టుకొస్తుంది. పుట్టుకొచ్చిన వాడినుండి మనకు బాధలొస్తున్నాయా? సుఖాలొస్తున్నాయా? కొడుకుల కోసం తాపత్రయ పడే తల్లితండ్రు లెంతమంది లేరు? సంతానమంతా కూడా ఏదో అవాలి కదా! అవకపోతే మనకి బాధ వాడికన్నా. ఆ బాధ కోసం వాడిని బాధ పెట్టడం ఇటువంటివి రకరకాలుగా, అట్లా అధోలోకాలకి వెళ్ళిపోతూ వుంటాము. ఏదో ఒకటి మనలోంచి బయలుదేరింది అది అలా మనని కిందకి దింపుకొంటూ వస్తుంది. అది సృష్టిలో వుంది. 'ప్రతీచి' అన్నారు ప్రకృతిని. ఎందుకంటే పశ్చిమంగా వుంటుందిట. అందుకని పెళ్ళిళ్ళల్లో కూడా స్త్రీని పశ్చిమంవైపు వుంచి తూర్పుకు చూసేటట్లు కూర్చో పెడతారు. పురుషుణ్ణి తూర్పు వైపు కూర్చోబెట్టి పశ్చిమాన్ని చూసేలా కూర్చోబెడతారు. పురుషుడు పశ్చిమాన్ని చూస్తాడు. అంతే! సృష్టిలో కూడా పురుషుడు పశ్చిమాన్ని చూడ్డం వలన, వాళ్ళిద్దరూ ఆకర్షింపబడడం వలన పురుషునిలో వున్న తత్వం స్త్రీలోకి వ్యాపనం చెందుతుంది. అక్కడ నుండి సృష్టి మొదలైంది. అట్లా ముందు పశ్చిమంగా వెళ్ళాడుట. అట్లా సూక్ష్మ మైన సృష్టి అట్లా అట్లా బరువెక్కి స్థూలమైంది. అంటే నెమ్మదిగా అమ్మవారిలో అయ్యవారు అదృశ్యులైపోయారు. ఉన్నాడు కానీ వున్నట్టు ఎవరికీ తెలియనట్టు అయిపోయాడు. అట్లాగే మన భావాల్లోంచి మనం మొదలు పెట్టి పనిచేసి, జీవితం లో మొత్తం మనచుట్టూ concrete కట్టేసుకుంటాము. జీవితంలో ఒక్కొక్కళ్ళు వేసుకొనే చిక్కులు ఇంతా అంతా కాదు. ఎందుకంటే నిపుణత లేకపోవడం వలన. ఆ పైన గజేంద్రమోక్షం లో లాగ ఎందుకు ఇవన్నీ పెట్టుకొన్నాను? అనవసరంగా ఇరుక్కుపోయానని అనిపిస్తుంది. ఎరక్కపోయి వచ్చాను. ఇరుక్కు పోయానన్నది సత్యం. మనం తెలియక ఉత్సాహంగా

పెట్టుకున్నవాటిల్లో మనం ఇరుక్కుపోతాము. ఇరుక్కు పోకుండా చేస్తూ ఉత్సాహంగా వుండాలి. ఇరుక్కున్న వాడేం చేయగలడు? ఇరుక్కోనివాడు క్రొత్త క్రొత్త పనులు చేయగలడు. పనులు జరుగుతూ వుంటాయి. వాట్లో ఉంటాడు గానీ తప్పించి తిరగడు. కొంతమంది మొదలు పెట్టేసి పారిపోతారు. ఇంకొకళ్ళ నెత్తిన పెట్టి వాళ్ళు చూస్తార్లే అని వెళ్ళిపోతారు. అలా కాదు. భగవంతుడు సహకరించి, ఉండిపోయాడు కదా! ఇటునుండి వ్యక్తమైనది చెప్పటం, అటు నుండి విన్నది గర్భం ధరించడం జరుగుతుంది. చెప్పటమంటే transmission. వినటం reception. పుచ్చుకోవడం వలన/వినటం వలన కదా మనం భావగర్భం ధరిస్తాము. ఒక సంకల్పంలోకి మనం దిగటం బట్టి దానికి బలం వస్తుంది. కదా! దిగిన తర్వాత ఊరుకుంటుందా? సంకల్పం లోకి దిగిన తర్వాత సంకల్పం మనల్ని తీసుకొనివెడుతుంది. కదా! ఎంతదూరం తీసుకొనివెడుతుందో మనం చెప్పలేము. అదే మనకేం చెప్పారంటే పెద్దలు బ్రహ్మ, సరస్వతిని పుట్టించి ఆవిడ వెంట పడ్డాడని చెప్తారు. బ్రహ్మ నుండి వ్యక్తమైన వాక్కు ఏదైతే వుందో, అది వ్యక్తమయ్యేసరికి దాంట్లోకి ఈయన దిగాడన్నమాట! మనం కూడా అట్లాగే దిగుతాం కదా! ముందు సంకల్పం వస్తే, ఆ సంకల్పంలో మనం వసించడం వలన ఆ సంకల్పం పనిచేస్తూ వుంటుంది. అందులో వసించకపోతే ఆ సంకల్పం పనిచేయదు. అందుకనే 'శృతి' అనేది తీసుకొన్నట్లైతే there is a transmission and reception. Reception లో ఏమవుతుందంటే అందులోకి receive అయి, మళ్ళీ ఇంకో transmission లోకి వెడుతుంది. మళ్ళీ ఒక reception, మళ్ళీ ఒక transmission. దాన్నే ధనసంజ్ఞ, ఋణసంజ్ఞ positive pole, negative pole అన్నారు. Negative నుండి positive చేస్తుంది. ప్రతీ negative లోనూ ఒక positive వుంటుంది. అంటే సవితృలోకం నుండి సూర్యలోకంలోకి వెలుగొస్తే, సూర్యలోకం నుండి భూమికి వచ్చి, భూమి మనందరికీ అది మనకు వేడిమిగా పంచి, మన శరీరంలో పనిచేస్తున్నట్లు. అంటే మనం శృతి శబ్దానికి సంబంధించినదే అనుకొంటాము. అది చెబుతూ వుంటే, వింటూ వుంటాం.అసలు వాక్కు మొత్తం సమస్తానికి ఆధారం. ఆ వాక్కు బ్రహ్మ నుండి వ్యక్తమైతే, ఆయన నుండి సృష్టి వ్యక్తమౌతుంది. అట్లాగే మనం కూడా మేల్కాంచి, ఆలోచించడం మొదలు పెడితే, అది బ్రహ్మస్థితి అన్నమాట! అంతకుముందు వున్న స్థితి వి ష్ణుస్థితి. నిద్ర లో వున్న స్థితి శివస్థితి. శివస్థితి నుండి లేవగానే విష్ణువు అవుతాము. ఇక అక్కడ నుండి బ్రహ్మల్లే మొదలు పెట్టేస్తాము. ఇక లేచిన దగ్గర్నుండి Programmes కదా! Programmes వచ్చినపుడు, రోజంతా ఇక్కడకీ, అక్కడకీ దాని వెంట మనం వెడుతున్నాము కదా! అట్లా బ్రహ్మను తిప్పిందట సరస్వతి! అప్పటి నుండి బ్రహ్మ పరిగెత్తుతూనే వున్నాడట సరస్వతిదేవి వెనకాల. సరస్వతి తను ప్రవహిస్తున్నది. వెనకాల బ్రహ్మగారు వస్తున్నారు. సరస్వతీ ప్రవాహం అంటే అదే అర్థం. మనం కూడా మన సంకల్పం ఆధారంగా పరిగెడుతూ వుంటాము కదా! ఇక్కడకు పరిగెట్టి, అక్కడకు పరిగెట్టి ఇప్పుడు వేగం పెరిగింది కాబట్టి

ఇంకా పరిగెడుతున్నాం. ఇదంతా సరస్వతి, లేక శబ్దము యొక్క transmission. 'శృతిసాగర' మంటే ఆయనే! సాగరమంటే మొత్తం వీటన్నిటికీ కలయిక. నీళ్ళు ఉద్భవించి, సముద్రంలోంచి కదా ఆకాశంలోకి వెడతాయి గ్రీష్మఋతువులో. మళ్ళీ వర్షఋతువులో అక్కడా, అక్కడా భూమి మీదపడి, కాలవలో చేరి, పిల్లకాలవలన్నీ కలిసి నదిలో చేరి, నది మళ్ళీ సముద్రంలో కలుస్తూ వుంటుంది కదా! The source for transmission and reception of the one energy is called the Sound. శబ్దం కారణంగానే ఈ ప్రపంచమంతా పుట్టిందని, 'శబ్దబ్రహ్మ' అంటారు. ఈ శబ్దానికి రెండు భాగాలున్నాయి. వినిపించే భాగం, వినే భాగం. మనం కూడా అంతేకదా! వినిపిస్తూ వుంటాం, వింటూ వుంటాం. వినిపించినప్పుడల్లా ఏం జరుగుతుందంటే, మనం externalise అవుతూ వుంటాము. మనం మాట్లాడుతున్నప్పుడు బైటకు వ్యక్తమవుతూ వుంటాము. మనం వింటున్నప్పుడు internalise అవుతూ వుంటాము. అందుకని ఆధ్యాత్మిక సాధనలో వినటం అనేదానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఎందుకని? ఇది internalise అవవలసిన కార్యక్రమము కాబట్టి. Externalise అవాల్సిన కార్యక్రమము కాదు. ఈ internalisation process వల్ల కదా మనని మనం తెలుసుకొని, తద్వారా సృష్టి రహస్యములు తెలుసుకొని, నిపుణతతో జీవించడం కోసం కదా! మొత్తం అంతా ఈ సృష్టి రెండు భాగాలుగా శబ్దం పనిచేస్తుంది కాబట్టి, ప్రసారమయ్యే భాగాన్ని 'సరస్వతి' అంటారు. వినే భాగాన్ని 'బృహస్పతి' అంటారు. ఒకటి positive, ఒకటి negative! వింటున్నకొద్దీ మనం positive అవుతాము. చెప్తున్నకొద్దీ negative అవుతూ వుంటాము. అది ఒక రహస్యం. అందుకే పెద్దలు ఎక్కువ చెప్పరు. మౌనంగా వ్యాఖ్య చేసే వారు వున్నారు. వాళ్ళకి ప్రసారం అట్లా జరుగుతూ వుంటే, సముద్రం వంటి విశ్వాత్మ చైతన్యంతో అనుసంధానం చెంది వుంటారు. కాబట్టి వాళ్ళకి అట్లా వస్తూనే వుంటుంది. విశ్వాత్మ చైతన్యంతో అనుసంధానం చెంది వుండకపోతే, పరిపూర్ణులు కాకపోవడం వలన చెప్పేవాళ్ళకి నీరసం వస్తుంది. చెప్పేవాడు వింటూ చెప్తున్నాడనుకోండి circuit complete అవుతుంది. మనం చెప్తున్నామని చెప్పే వాళ్ళుంటారు. విని చెప్పే వాళ్ళుంటారు. విని చెప్తే circuit complete ఆవుతుంది. వినటం, చెప్పటం రెండు జరుగుతున్నాయనుకోండి చెప్పేవాడిలో. ఏమవుతుంది? ప్రజ్ఞ disperse అయిపోదు. అందుకని 'విన్నది చెప్తాను' అని చెప్తారు పెద్దవాళ్ళు. ఏమిటి విన్నది చెప్తాను? నిన్న, మొన్న విన్నది, ఆ ముందు చదువుకున్నది కాదు. తనకి వినబడుతూ వుంటుంది. తను చెబుతూ వుంటాడు. వినబడుతూ వుంటుంది చెప్తూ వుంటాడు. అదీ చెప్పటం! అది తెలియాలంటే, Spiritual Astrology లో 'Mercury' అధ్యాయంలో మాస్టారు వ్రాసింది చదువుకోవాలి. మనం బహిర్గతంగా తెలుసుకున్నవి చెప్పటం, మామూలు చెప్పటం క్రింద వస్తుంది. విని చెప్పటం, అసలు చెప్పటం. అందుకనే మాస్టారు ఓంకారం వినేది కానీ, అనేది కాదు అనేవారు. అంటే ఓంకారం విని, అనాలని. ఓంకారం విని, తను

విన్న ఓంకారాన్ని అంటూ వుంటాడన్నమాట! మళ్ళీ విని, మళ్ళీ అంటూంటాడు. విని అంటూ వున్నప్పుడు అది సాగరతత్వం కలిగివుంటుంది. ఎందుకని? సాగరంలోంచే అన్ని జలాలూ పైకి వెళ్ళి, సాగరంలో చేరుతున్నాయి కదా! అట్లా circuit complete అయింది కాబట్టి. చెరువు లెండిపోతాయి తప్ప సముద్రాలు ఎండిపోవు. సముద్రం ఎండిపోవడానికి అవకాశం లేదు. అలాగే ఇక్కడ కూడా చెప్పటం, వినటం ఒకచోటే జరుగుతున్నప్పుడు చెప్పేటప్పుడే వినటం వుంటుంది కాబట్టి ఎండిపోవడం వుండదు. అంటే అయిపోవడం వుండదు. అట్లా అయిపోకుండా దీనిని నడిపిస్తున్నాడాయన. తనే చెప్పేవాడు, తనే వినేవాడు కదా! ఎవరు చెప్తున్నారు చెప్పేవాడిలో? చెప్పాలంటే మనకి శ్వాస వుండాలి. నిశ్వాస ఆధారంగా చెబుతూ వుంటాము. నిశ్వాస వుండాలంటే అంతకుముందు ఉచ్ఛ్వాస వుండాలి. కదా! ఉచ్ఛ్వాస లేకుండా నిశ్వాస లేదు. ఉచ్ఛ్వాస చేస్తూ చెప్పలేము. నిశ్వాస చేస్తూ చెబుతాము. ఉచ్ఛ్వాసకు నిశ్వాస ఆధారం. నిశ్వాసకు ఉచ్ఛ్వాస ఆధారం. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు శ్వాస ఆధారంగా జరుగుతూంటాయి. శ్వాస స్పందనం ఆధారంగా జరుగుతూంటుంది. స్పందనం చేయించే అనాహత శబ్దమేదైతే వుందో, అది ఆధారంగా ఈ చెప్పటం జరుగుతుంది. వినేవాడు ఎట్లా వింటున్నాడు? అది ఆధారంగానే వింటున్నాడు. అది లేకపోతే వినలేడు. వినేవాడు కూడా తన లోపలికెళ్ళి, బుద్ధి అంతా దానియొక్క వెలుగే కనుక ఆ బుద్ధిలో ప్రవేశించి, ఆ విధంగా చెప్పేవాడుగా, circuit complete అవుతూ వుంటుంది. ఒకే ఒక శబ్దం ఒకప్రక్క నుంచి వ్యక్తమవుతూ వుంటే, రెండోప్రక్క నుండి గ్రహణం చేస్తూ వుంటే, ఆ గ్రహణమైంది. వ్యక్తం చేస్తూ, ఆ వ్యక్తం చేసేది గ్రహణం చేస్తూ అట్లా జరుగుతూ వుంటుంది. Negative becoming positive and transmitting into another negetive. దక్షిణధృవం వుందనుకోండి. ఉత్తరధృవం ఆధారంగా దక్షిణధృవం ఏర్పడింది. ఉత్తరధృవం లేకపోతే దక్షిణధృవం లేదు. ఇంటికి క్రింద ఒక నేల అంటూ వుంటే, దానికి roof వస్తుంది. కదా! ఆ roof, పైన వుండే అంతస్తుకు నేల అయింది. ఆ నేలకు మళ్ళీ ఇంకో roof వచ్చింది. క్రిందకు చూస్తే నేల, పైన చూస్తుంటే roof. ఒకే నేల ఒక దిక్కులో చూస్తే నేల, ఇంకో దిక్కులో చూస్తే roof. అట్లాగే మనిషిలో కూడా positive, negative వున్నాయి. అట్లాగే సృష్టిలో కూడా positive, negative ఉన్నాయి. దాన్ని మనవాళ్ళు 'శృతి' అని చెప్పారు. శృతి అంటే cosmos నుంచి వినిపించేది. వాళ్ళు చెప్పింది, వీళ్ళు చెప్పింది కాకుండా దానినే మనం వినవచ్చును. చెప్పేవాడూ మనలో వున్నాడు. వినేవాడూ మనలో వున్నాడు. హాయిగా కూర్చుని వింటూ వుండవచ్చును. ఆ వినటం కోసమే ఋషులు హిమాలయాల్లో, ఎన్నో వందల సంవత్సరాలుగా వుండిపోయారు. ఆ వినటం ఎంతో బాగుంటుంది. ఏమిటి వింటారయ్యా అంటే ఓంకారనాదాన్ని వింటారు. వింటూ, అంటున్నదాన్ని మళ్ళీ చెప్పకోగలిగి వినే పద్ధతి ఒకటి వుంది. అది అలావుండగా "శృతిసాగరః" అంటే ఏమిటంటే, Transmission and reception రెండూ కలిసిన

సముద్రం మొత్తం తనే! సముద్రం లో ఏ విధంగా ఇవన్ని ఉద్భవించి, మళ్ళి అందులోనే ఎలా కలుస్తాయో ఆయన లో నుండి వాక్ప్రవాహము ప్రవహిస్తుంది. అందుకే భగవంతుని వాక్ స్వరూపుడు అంటారు. భగవంతుని నాదం/ శబ్దం ఓం అంటాం. ఆయన వర్ణం నీలం అంటాం. భగవంతుని రూపం గోళం అంటాం. ఆయన పేరుట నేను. ఇలా చెప్పారు. అందుకని మనం ఓం వింటున్నప్పుడు భగవంతుని శబ్దం వింటున్నట్లు. ఆ శబ్దం అన్నప్పుడు కాదు విన్నప్పుడు. ఆ శబ్దానికీ, మొత్తానికీ  మూల స్థంభం/ మూలమైన వాడు భగవంతుడు. మొత్తమంతా Space globe అని, హిరణ్యగర్భమని, హిరణ్యాండమని అంటారు. కనుక ఇవన్నీ తనలోంచి వ్యక్తమై, మళ్ళీ వాటిలోంచి తనలోకి ప్రవేశించడం వలన మళ్ళీ వ్యక్తమవుతుంది. ఇలా జరుగుతూ ఉంటుంది. విత్తనంలోంచి మొక్క పుడుతుంది. మొక్క చెట్టై, చెట్టులోంచి పువ్వు పుట్టింది. పూవులోంచి కాయ పుట్టింది. మళ్ళీ కాయలోంచి విత్తనం పుట్టింది. అదీ occurence అంటే. Occurence అంటే అర్థమేమిటంటే 'వ్యక్తమగుట' అని అర్థం. ఉత్పత్తి అన్నమాట. ఒకదానిలోంచి ఒకటి  అలా cyclic గా నడుస్తుంది. మనకి కూడా అంటే There is a path which transmits, and a path which receives. The receiving path becomes transmitting path. తండ్రి నుండి కొడుకు పుడితే, మళ్ళీ కొడుకు నుండి ఇంకో కొడుకు పుడుతున్నాడుగా! గురువు నుండి శిష్యుడు పుడితే, ఆ శిష్యుడి నుండి ఇంకో శిష్యుడు పుడతాడు. అంతకుముందు శిష్యుడు గురువవుతాడు. ఎవరికి? ఆ శిష్యుడికి. అంతేకానీ గురువు గారికి గురువు కాదు. ఆ మధ్య ఎవరో అడిగారు, మీరు గురువు గారెప్పుడు అయ్యారని? నేను గురువు అవలేదు. నేను నేనుగానే వున్నానని, చెప్పాను. కాదు మిమ్మల్ని గురువు అనడం విన్నానని, అన్నాడు. అనుకున్నవాడికి నేను గురువు తప్ప, అందరికీ ఎలా గురువవుతాను? వాడికర్థం కాలేదు. అనుకున్నవాడికి గురువై, అనుకోనివాడికి కాకపోవడమేమిటి? అనుకున్నాడు. అప్పుడు, మీ ఆవిడకు నువ్వు ఏమవుతావు? అని అడిగాను. మొగుడవుతానన్నాడు. కానీ అందరికీ మొగుడవు కాదు కదా! అట్లాగే కొడుక్కి తండ్రి కానీ, అందరికీ తండ్రవుతావా? నువ్వు తండ్రి ఎప్పుడయ్యావు? కొడుకు పుట్టినప్పుడు. నువ్వు మొగుడెప్పుడయ్యావు? నీకంటూ ఒక స్త్రీ దొరికి పెళ్ళి చేసుకున్నప్పుడు. అట్లాగే నాయనా ఇదికూడా! అని చెప్పాను. General గా గురువంటే నీ మాట మీద విశ్వాసం వుంచి, నీవెంట నడిచేవాళ్ళు కొంతమంది నిన్ను గురువుగా చూస్తారు తప్ప, నువ్వు గురువు అవ్వవు. నువ్వు గురువని శిష్యుడికి సత్యం తప్ప, గురువుకి సత్యం కాదు. గురువు 'నేను గురువు' అని అనుకోవడానికి వీలులేదు. శిష్యుడనుకోవచ్చును ఆయన గురువని. ఎందుకు గురువయ్యాడంటే ఆయన మాటమీద వీడికి గురుత్వం. నమ్మకం, విశ్వాసం ఏర్పడటం వలన వాడు ఫలానావారు నా గురువు గారని చెప్పకుంటూ వుంటాడు. అంతేకానీ ఇటునుండి ఆయన  నా శిష్యుడని చెప్పకోవడానికి వీలులేదు. అది చాలా సత్యం! ఆ విధంగా ఈయన దిగివచ్చి

మారిపోతూ వుంటాడు. మారిపోతే ఒకళ్ళనుండి ఒకళ్ళు వ్యక్తమవుతూ వుంటారు. గురువు నుంచి శిష్యుడు వ్యక్తమవుతూ వుంటాడు కదా! శిష్యుడు గురువవుతాడు. ఎప్పుడవుతాడు? వాడి మాటలు వినేవాళ్ళు ఒకళ్ళు రావాలి కదా! అంతేతప్ప, నేను ఇవాళనుండి గురువని బోర్డు పెట్టుకొని రండి రండి అని పిలిస్తే అవడు. అట్లాగే తండ్రి నుండి కొడుకు పుడతాడు. వాడు తండ్రి ఎప్పుడవుతాడంటే, వాడికంటూ ఒక కొడుకు పుట్టినప్పుడు కదా! ఇలా అన్నిచోట్లా ఇదే సత్యం వర్తిస్తూ వుంటుంది. ఏమిటంటే ఒకటి నుండి తను రెండుగా మారి, రెండు నుండి మళ్ళీ ఒకటిగా వస్తూ వుంటాడు. అది మళ్ళీ రెండవుతుంది. ఇలా ఒకటి రెండు, ఒకటి రెండు గా ఆడే ఆట అంతా కూడా ఈ సృష్టిలో మీరు, నేను ఆడుకొనే ఆట గా చెప్పుకుంటారు వాళ్ళిద్దరూ. అంటే Positive, Negative ఆడుకుంటున్నారు ఈ ఆట అంతా! సృష్టి! కాకపోతే రూపాలు స్థితిభేదం పొంది, అలా జరిగి జరిగి బాగా స్థూలమైపోతుంది. కాబట్టి సాగరమంత అయ్యింది వాళ్ళిద్దరూ ఆడుకుంటూ వుంటే. చెప్పటం వినటం అనే ఆట ఇద్దరూ ఆడుకున్నారండి వాళ్ళు. ఇట్నుండి వ్యక్తమైనది దాంట్లో ఆడాడు. ఇంకొకటి వచ్చింది. అందులో మళ్ళి ఆడాడు. ఇంకొకటి వచ్చింది. అట్లా అట్లా శృతికి సంబంధించిన సాగరంగా భగవంతుని తత్వం మనం చూడాలి. అది మనకు ఎప్పుడూ కనిపిస్తుంది. ఒక దాంట్లోంచి ఒకటి వస్తుంది. వీటన్నిటిలోంచి ఆయనే వ్యాపనం చెందుతూ వస్తాడు. ఎక్కడో వున్న వెలుగు సవితృమండలం చేరి, సవితృమండలం నుండి సూర్యమండలం చేరి, అక్కడ నుండి భూమండలం మీదకు చేరింది కదా! మనకొచ్చే వెలుగు సూర్యుని నుండి వస్తున్నది అని మనం అనుకోవటం చాలా సత్యం కానీ సూర్యుడు నేను ఇస్తున్నానని అనుకోవటానికి వీలులేదు. ఇందాక చెప్పినట్లు తను గురువని గురువుగారు అనుకోవటానికి ఎట్లా వీలులేదో, అట్లాగే సూర్యుడు నేనే వెలుగిస్తున్నానని అనుకోవడానికి వీలులేదు. సూర్యుడివ్వటం లేదు. అతడి నుండి వస్తున్నది తప్ప, ఆయన ఇవ్వటం లేదు. అందుకే మనం ఇవ్వటం లేదు. మన నుండి ఇవ్వబడుతున్నదని జ్ఞాపకం వుండాలి. ఏదీకూడా మనం చేసేస్తున్నామని అనుకోకూడదు. అదే భక్తి! ఏది? మనకంటే ఎప్పుడూ ఒకడు పైన వున్నాడని గుర్తు పెట్టుకొని, ఆయన అదుపాజ్ఞలలో, పర్యవేక్షణలో మనం జీవిస్తున్నామని గుర్తు పెట్టుకోవడం. లేకపోతే చాలా ఆహంకారం వచ్చేస్తుంది. అంతా మనమే చేస్తున్నామనే అహంకారం రావడం చాలా సులభం. ఎందుకంటే నీకెవరూ ఇంకొకడొచ్చి చెప్పట్లేదు. నీ లోపలనుండి చెబుతున్నాడు. మనకొచ్చే సంకల్పం లోపల నుండే వస్తుంది కదా! మనకొచ్చిందనుకొంటాం కానీ మన నుండి వచ్చింది. అది గుర్తు పెట్టుకొంటే, దానిని జాగ్రత్తగా నిర్వర్తించుకొంటూ వెళ్ళవచ్చును. అందుకనే తనపైన యజమాని వున్నాడనే భావనలో వుండేవాడు, తనను తాను అహంకరించుకుండా చేసుకుంటూ వెళ్ళిపోతాడు. మననుండి వ్యక్తమవుతున్నదనే భావన లేనివాడు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, రావణాసురుడు. అప్పుడప్పుడు ఇంద్రుడు. ఇంద్రుడు

మర్చిపోయినప్పుడల్లా క్రింద పడిపోతూ వుంటాడు. మళ్ళీ గుర్తు వచ్చినప్పుడు కుర్చీలో కూర్చుంటూ వుంటాడు. ఇట్లా జరుగుతూ వుంటుందన్నమాట! Basic గా ఇవన్నీ there are two parts అని చెప్తున్నాయి సృష్టిలో. రెండు భాగాలు. ఒకటి వ్యక్తమవుతూ వుంటే, రెండోది దాన్ని గ్రహించి మళ్ళీ వ్యక్తం చేస్తూ వుంటుంది. పురుషుని యొక్క వీర్యాన్ని గ్రహణం చేసిన స్త్రీ, మళ్ళీ ఆ పురుషుడినే వ్యక్తం చేస్తుంది తనయుడిగా! జీవరాశి అంతా అట్లాగే ఏర్పడింది. గోళాలన్నీ అట్లాగే ఏర్పడినాయి. సూర్యమండలాలన్నీ అట్లాగే ఏర్పడినాయి. ఒకటి వ్యక్తమైతే, మూలస్థానం నుండి ఏది మూలంగా వ్యక్తమైందో, మళ్ళీ అదే వ్యక్తమవుతుందని చెప్పడానికి. అదే సముద్రం నుండి మేఘాలేర్పడి, వర్షం వచ్చి నదులేర్పడి, మళ్ళీ ఆ నీరంతా సముద్రంలోకి వెళ్ళిపోయినప్పుడు, మనం మేఘాలను వేరుగా చూస్తాం. నదులని వేరుగా చూస్తాం. వర్షాన్ని వేరుగా చూస్తాం. ఇవన్నీ సముద్రంలో భాగమని గుర్తుండటం కష్టం కదా! అందుకని సాగరంలాగా వ్యక్తము, మళ్ళీ గ్రహణశక్తి positive and negative aspect, the speaking and hearing aspect రెండూ తానే అని మనం అవగాహన చేసుకోవాలి. ఆ రెండూ ఎక్కడ balance అవుతాయో అక్కడ యోగత్వం వుంటుంది. వినటం, చెప్పటం balance లో వుండాలి. Balance లేనప్పుడు అది యోగస్థితి కాదు. వ్యక్తమవుతూనూ వుంటూంటుంది. అవ్యక్తంగానూ వుంటుంది. అవ్యక్తంగా వున్న దాన్నించి వ్యక్తం చేస్తూ వుంటే, మళ్ళీ అవ్యక్తంగా వుంటూ, మళ్ళీ వ్యక్తం చేస్తూ వుండే సాధన ఒకటి వున్నది. The Sound' అనే పుస్తకంలో వ్రాసాను దానిగురించి. వివరాలు అందులో చూసుకోండి. అవగాహన మాత్రం భగవంతుడు ఈ రెండు తత్వాలు కలిపి మొత్తంగా అవగాహన చేసుకోవాలి. కాబట్టి మనం కూడా అలా ఆయనని వినటానికి చేసే ప్రయత్నములో, 'ఓంకారం' చేసేటప్పుడు 'ఓంకారము' ను అనాహతంగా వింటూ, అనాలి. వినటమంటే ఏమీలేదు. నిశ్శబ్దముగా కూర్చొని లోపల స్పందనను గమనిస్తూ వున్నట్లైతే, ఆ స్పందనలో చైతన్యము ఝుంకార శబ్దంగా వినిపిస్తుంది. ఆ వినిపించేదాన్ని విని, అనడం చేత ఆ నిశ్శబ్దాన్ని పాటిస్తూ వుంటారు. అందుకని మనం అంతదూరం వెళ్ళక పోయినా, ప్రాధమికదశలో పెద్దలు చెప్పింది విని, అనటం అంటే దాన్ని ఆచరిస్తూ వుండాలి. మళ్ళీ వింటూ వుండాలి. మళ్ళీ ఆచరిస్తూ వుండాలి. ఒక స్థితిలో అట్లా చెప్పకోవచ్చును. విన్నది, ఆచరించకపోతే ఇంకోసారి విన్నా ఉపయోగం లేదు. ఎన్నిసార్లు వింటే ఏం లాభం? గారెలు వండడమెలాగో ఎన్నిసార్లు వింటాం? ఏదో ఒకరోజు వండాలి తినాలి కదా! విన్నది ఆచరణలోకి తీసుకువచ్చినవాడికే మళ్ళీ వినటంలో ఉపయోగముంది తప్ప, లేకపోతే వినటం ఒక వ్యసనం క్రింద తయారవుతుంది. విన్నది ఆచరించడం మొదలు పెడితే మళ్ళీ వినడానికి system open అవుతుంది. Receptive గా వుంటుంది. లేకపోతే receptive గా వుండదు.

## 275 సుభుజః

సుభుజుడు అంటే మంచి భుజములు కలవాడు. అంటే మనకి రక్షణ కలిగించేవాడని! 'రాజన్యః కృతః' అని మనకి పురుష సూక్తంలో ఇవ్వబడినట్లుగా, రక్షణ కలిగించడానికి రక్షకుడివలె దిగివచ్చే భగవంతుడు పురుషాకారంలో ఉన్నపుడు, చేతులు రక్షణ కలిగించేవిగా చెప్తారు. మనం కూడా ఎప్పుడైనా పడిపోయినప్పుడు చేతులు ఆధారంగా పడిపోకుండా అడ్డుకోవడానికి ప్రయత్నం చేస్తుంటాం. అంటే చేతులు మనకు రక్షణ కలిగిస్తూ వుంటాయి,

అలాగే భగవంతుడి యొక్క చేతులు చక్కటి రక్షణ కలిగిస్తుంటాయి కాబట్టి ఆయన బాహువులను కూడా దర్శనం చేసి, ధ్యానం చేస్తూ ఉండాలి. రక్షణ కావాలి అనే పరిస్థితి ఉన్నపుడు, విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు, మరొక దేవత ఆరాధన చేస్తున్నపుడు, పారాయణ చేస్తున్నపుడు, ప్రత్యేకించి బాహువులను బాగా ధ్యానం చేయాలి. ప్రస్తుతం ప్రతీ జీవికీ కూడా రక్షణ కావాల్సినటువంటి సమయం. కాబట్టి ఎక్కువ భగవంతుడి యొక్క బాహువుల్ని ధ్యానంలో దర్శనం చేసి, ఆరాధన చేస్తూ ఉండాలి. కనకనే భగవంతుడి యొక్క హస్తములు ఒకటి వరద హస్తం గానూ, ఇంకొకటి అభయ హస్తం గానూ ఉంటాయి. రక్షణ రెండు విధాలుగా ఉంటుంది. మన దైనందిన జీవితంలో మనకి సమస్యలందు మనం చిక్కుకుపోయి, క్లేశములు పొంది, దుఃఖమును పొంది, కృంగిపోయి, కృశించిపోయి ఉండే సన్నివేశాలు కాస్తో కూస్తో ప్రతి వారికి ఉంటాయి కాబట్టి, వాటినుంచి రక్షణ పొందటానికి బాహువుల యొక్క ధ్యానం చేయాలి. దానికి రక్షణ కోరాలి. అది ఒకటి. రెండవది భగవంతుని సాన్నిధ్యం చేరటానికి సాధన చేసే సాధకునికి, సాధనలో అంతరాయములు కలగకుండా ఉండటానికి రక్షణ కోరాలి. ఎందుకంటే అనారోగ్యం ఒక అంతరాయము, అలాగే క్లిష్టమైన పరిస్థితులు, కుటుంబంలో ఉండే సమస్యలు, ఇలా మనకి అనేక అంతరాయములు కలుగుతూ ఉంటాయి. పధ్నాలుగు విధములైన అంతరాయములు మనకి యోగశాస్త్రంలో చెప్పారు. ఈ అంతరాయములు ఏవి వచ్చినా సరే మనకి సాధన జరగదు, భగవంతునితో సన్నిహితత్వం పెంచుకునే సాధనకి, అడ్డువచ్చే వాటన్నిటి నుంచి మనల్ని రక్షించమని ప్రార్ధన చేసుకోవాలి. మనలో సత్కార్యములకు, దైవకార్యములకు సంబంధించిన కార్యక్రమములలో పాల్గొనకుండా ఉండే భావములు కొన్ని అప్పడపుడు మొలకెత్తుతూ ఉంటాయి. ఇవాళ వెళ్లకపోతే ఏం? ఇవాళ పూజ చేయకపోతే ఏం? ఇవాళ ప్రార్ధన చేయకపోతే ఏం? ఇటువంటివన్నీ మనకి కలుగుతాయి కదా! ఈ భావములన్నీ కూడా జీవునిగా దేవుని చేరుకునే మార్గంలో అంతరాయం కలిగించే భావనలు. అటువంటి భావముల నుంచి మనల్ని రక్షించమని ఎక్కువగా కోరాలి. అది నిజమైన రక్షణ! భగవంతునితో మనం పెట్టుకునే సంబంధం ఏదైతే ఉన్నదో, ఆ సంబంధం నిత్యముగా,

సత్యముగా, స్థిరముగా, శాశ్వతముగా నిలబడి వుండేటట్టుగా, తదితరములైన భావములనుంచి మనల్ని రక్షించమని కోరాలి. భగవంతుని యొక్క బాహువులయందు ఉండేవాడు ఎప్పుడూ రక్షించబడతాడు. ఆయన బాహువులయందు మనం ఉండటం వేరు, ఆయన చేతులు మనం పట్టుకోవటం వేరు. మనం పట్టుకుంటే మన బలం కొద్దీ ఉంటుంది పట్టు. ఆయనయందు, ఆయన వొళ్ళో మనం కూర్చున్నాం అనుకుంటే! మనల్ని ఆయన పట్టుకునేట్టుగా చూసుకోవాలి, మనం ఆయన్ని పట్టుకోవడం కాకుండా! మనల్ని ఆయన పట్టుకోవాలంటే ఆయన చేతులు వాడతారు. కాబట్టి 'సుభుజో' అనే నామానికి ఒక అవగాహన బాహువుల ద్వారా రక్షణ కల్పించేవాడు, అందుకని మంచి బాహువులు కలిగినటువంటి వాడు. ఏ బాహువులైతే రక్షణ కల్పిస్తాయో, ఆ బాహువులని మంచి బాహువులని చెప్తారు. మనవి కూడా పరిశుద్ధమైన చేతులా, కాదా అనేది తెలియాలంటే ఈ చేతుల్తో చేసే పనిని బట్టి ఉంటుంది. ఈ చేతులు పుచ్చుకోటానికి పనికొస్తున్నాయా? ఇవ్వటానికి పనికొస్తున్నాయా? ఈ చేతులు రక్షణ పొందటానికి పనికొస్తున్నాయా? ఇతరులకి రక్షణ ఇవ్వటానికి పనికొస్తున్నాయా? పోషించడానికి పనికొస్తున్నాయా? పోషింపబడటానికి పనికొస్తున్నాయా? ఇటువంటివన్నీ మనం చూసుకోవాలి. కాబట్టి బాహువుల ద్వారా రక్షణ మనం పొందుతూ మనం ఈ బాహువులని ఇతరుల రక్షణ కోసం, ఇతరుల పోషణ కోసం వాడినట్టయితే ఎక్కువ రక్షణ కలుగుతుంది, ఇది ఇందులో ఇంకొక పొర. మనం భగవంతుడియొక్క ప్రతిరూపాలే కాబట్టి, ఆయన యొక్క సుభుజత్వం మనలో కూడా ప్రకాశించాలంటే మనం చేసే పనులు ఇతరులకు పనికొచ్చేవిగా ఉండాలి. చేతుల వినియోగం ఇతరులకు రక్షణ కలిగించే విధంగా, ఇతరులకి పోషణ కలిగించే విధంగా ఉండాలి. 'కమలాక్షునర్చించు కరములు కరములు' అన్నారు కదా? అంటే ఆయన అర్చనంటే జీవకోటికి చేసే సేవ! జీవకోటి అంటే అందులో మానవులు, పశుపక్ష్యాదులు కూడా అందులో ఉంటాయి. బాహువుల ద్వారా రక్షణ పొందుదాం అనుకునే వాళ్ళు, బాహువుల యొక్క ధ్యానం చేయటమే కాకుండా తమకి భగవంతుడు ఇచ్చినటువంటి బాహువులని, భగవంతుడు తన బాహువులని ఏ విధంగా వినియోగం చేస్తున్నాడో మనం కూడా ఆ విధంగా వినియోగం చేయటానికి ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నంలో లోపం ఉన్నట్లయితే ఈ భగవంతుడి యొక్క తత్త్వం మనల్ని కాపాడటానికి, తన వడిలో మనల్ని ఉంచడానికి, మనల్ని సృష్టిలో రక్షించడానికి కొంచెం అవకాశం తగ్గిన వాళ్ళమౌతాము. ఈ రక్షణ పెంచుకోవడం అంటే రెండు విధాలుగా పెంచుకోవాలి, ఒకటి భగవంతుడియొక్క పురుషాకారంలో ఉన్న బాహువుల ధ్యానము, తద్వారా ఆయన రక్షణ కోరడం, రెండవది రక్షణ మనం ఇవ్వడం, ఈ రెండు చేస్తే బావుంటుంది. బాహువులు కుడి, ఎడమగా రెండు కనిపిస్తాయి. భగవంతుడి యొక్క మొత్తం అస్తిత్వం అంతా, ఈ సృష్టి అంతా కుడి-ఎడమ ఆధారంగా ఉంది, అంటే భగవంతుడి నుంచి వ్యక్తమైన స్త్రీ పురుష తత్వాన్ని మనం కుడి-ఎడమ తత్త్వంగా

చెప్తాము. అర్ధనారీశ్వరులుగా కుడి పక్క శివుడు, ఎడమ పక్క అమ్మవారు అని మనకి చెప్తారు. ఎడమ అంటే 'ఇడ' అనే తత్వానికి సంబంధించినది, కుడి అంటే 'పింగళ' అనే తత్త్వంకి సంబంధించినది. ఒకటి వెలుగు, రెండవది దానికి సంబంధించిన పదార్థము. ఈ రెండిటి కలియికల వలన సృష్టి మనకీ స్థితిలో కనిపిస్తుంది. అందుకని నిజంగా భగవంతుని యొక్క రెండు బాహువులు ఏవయ్యా? అంటే గరుత్మంతుడి రెక్కలుగా చెపుతారు. ఎడమ రెక్క-కుడి రెక్క. బేసిసంఖ్యలు-సరిసంఖ్యలు. కుడిరెక్క పరమార్ధానికి సంబంధించినదైతే, ఎడమరెక్క పదార్థానికి సంబంధించినదై, పరమార్థ-పదార్థములయొక్క కలయికగా ఈ సృష్టి నిలబడి ఉంది. అందుకని మొత్తం సృష్టి అంతా కూడా రెండు భుజములుగా చెప్తారు. ఇది సుభుజముల మూడవ పొర. కుడి-ఎడమ గా ఉన్న భగవంతుని యొక్క చేతులు, కుడి అంటే ఆత్మతత్వము పురుషతత్వముగా దిగిరావడం, ఎడమ అంటే ఆ పరమాత్మతత్వం ప్రకృతి తత్వంగా దిగిరావడం. అంటే నేను నాదిగా దిగి రావటం! మనలో కూడా నేను-నాది అనేది వుందిగా! నా మనస్సు, నా ఇంద్రియములు, నా శరీరము, నా కుటుంబము, నా సంపద, నా వారు. ఇలా మనకి 'నాది'గా కొంత సృష్టి ఉంటుంది, మనలో మనమే వ్యక్తిగతంగా, 'నేను' గా ఉన్నాము, 'నేను' గా ఉండబట్టి ఈ నాది అనే దానియందు మనం ప్రవర్తిస్తూ వున్నాము. అలాగే సృష్టిలో కూడా ఒకే ఒక్క పరమాత్మ తత్త్వం పూర్ణమైనది, తన నుంచి సంకల్పం రాగానే తాను, తన సంకల్పం, అని ఇద్దరుగా దిగింది. తన సంకల్పం తన నుంచి వ్యక్తమైనది ప్రకృతిగా వస్తుంది. భగవంతుడి యొక్క సంకల్పంగా సృష్టి దిగి వస్తుంది, మన సంకల్పంగా మన వ్యక్తిగతమైన సృష్టులు దిగివస్తూ ఉంటాయి. మనకి 'నేను' కాక మిగతావన్నీ నావే! నా బుద్ధి, నా మనస్సు, నా ఇంద్రియములు, నా శరీరము, ఇలా అంతా నాదిగా ఉండే భావమొకటి వుంది. అదంతా కూడా ప్రకృతి తత్వానికి సంబంధించింది. 'నేను' కు ఆధారంగా 'నాది' ఏర్పడుతూ ఉంటుంది. దీనికే I am and I have అంటారు ఆంగ్లంలో, నేను, నాది. అలాగే సృష్టిలో కూడా ఒకే ఒక పూర్ణమైన తత్త్వం దిగివచ్చినపుడు, సంకల్పంగా దిగిరావడంచేత, సంకల్పం దిగివచ్చిన స్థితి నుంచి సంకల్పంగా వచ్చేసరికి తనూ-తన సంకల్పం. నేను-నా భావన. తనూ-తన సంకల్పంగా దిగివచ్చినపుడు రెండుగా ఉంటుంది, అదీ భుజములు. ఈ రెండు ఆధారంగా ఏం జరుగుతుందంటే మనకి positive and negative కరెంటు పుడతాయి, పుట్టి రెండూ ఒకదాని తో ఒకటి ప్రత్యేకంగా వాటికి ఉండే అన్యోన్య ఆకర్షణ కారణంగా అందులోంచి మనకి సృష్టి దిగి వస్తుంది. ఈ రెండు భుజాలని రజోగుణం, తమోగుణంగా కూడా చెప్పచ్చు. రజోగుణం తమోగుణం సమపాళ్ళలో ఉన్నపుడు సత్వగుణం లో జీవించడం ఉంటుంది. తమస్సు పదార్థానికి సంబంధించింది, రజస్సు శక్తికి సంబంధించింది. శక్తి-పదార్థము, ఈ రెంటి మధ్య సమమైన అనుసంధానం జరిగినపుడు పురుషుడు మళ్ళీ అక్కడ సృష్టిగా దిగిరావడానికి అవకాశం ఉంది. ఈ నేను-నాది ని రజస్సు-తమస్సు గా

మనం తీసుకున్నట్లయితే రజస్సు-తమస్సు, కుడి-ఎడమల్లాంటివి, అంటే table కి ఇటు పక్క రెండుకాళ్ళు, అటుపక్క రెండుకాళ్ళు సమంగా ఉంటే table మనకి ఉన్నట్టుగా ఉంది కదా! ఇందులో ఎటు పక్క రెండు కాళ్ళు లేకపోయినా table లేదక్కడ. ఈ కుడి-ఎడమ రెండూ సమంగా ఉంటేనే మనం table చూస్తాం! లేకపోతే చూడలేము. అలాగే ఒక పందిరి వేసాము అనుకోండి, పందిరికి కుడి పక్క కొన్ని రాటలు, ఎడమ పక్క కొన్ని రాటలు పెట్టినప్పుడు రెండూ సమంగా ఉన్నప్పుడు పందిరి చూడటానికి బావుంటుంది. ఒక పక్క ఒరిగిపోయి ఉంటే అప్పుడు పందిరి వికారంగా కనపిస్తుంది. అలాగే సృష్టిలో రజస్సు-తమస్సు ఒకదాన్నొకటి అనుసంధానం చేసుకుంటూ, ఒకదానితో ఒకటి ఏకాభిప్రాయం కలిగి ఉన్న సమయంలో సృష్టి ఉన్నట్టుగా మనకి గోచరిస్తుంది. కుడి రెక్క-ఎడమ రెక్క సరిగ్గా సమంగా పనిచేస్తూ ఉండటం వల్ల, సమానమైన బలం కలిగి ఉండడం వల్ల పక్షి గాల్లో ఉంది. లేకపోతే ఆ పక్షి గాల్లో నిలబడలేదు. అలాగే భూమి అనే గోళం కూడా కుడి-ఎడమల ఆధారంగా అలా చోటులో నిలబడి ఉంది. అలాగే మనలో కూడా కుడి ఎడమలు పదార్థాన్ని తయారుచేసేవి కొన్ని, పదార్థాన్ని లయం చేసేవి కొన్ని కేంద్రములుగా మనలో ఉన్నాయి. పదార్థము ఎప్పటికపుడు పుడుతూ ఉంటే అది ఒక పక్కనుంచి లయం అయిపోతూ ఉంటే మనం ఉన్నట్టుగా గోచరిస్తుంది. పక్షి ఒక రెక్క లేకపోతే ఎట్లా ఆకాశంలో ఉండలేదో, ఒకపక్క కోడు లేకపోతే మంచం ఏ విధంగా ఉన్నట్టుగా ఉండదో, అలాగే రజస్సు-తమస్సులు సమమైన పాళ్ళలో లేకపోతే సత్త్వమనేది గోచరించదు. విష్ణువుని స్థితికారకుడుగాను, బ్రహ్మని సృష్టికారకుడుగాను, శివుణ్ణి లయకారకుడుగాను చెప్తారు కదా! ఈ లయము-సృష్టి రెండూ సమపాళ్ళలో జరుగుతున్నపుడు స్థితి ఉంటుంది. మనలో పుట్టే అణువుల కన్నా లయం అయిపోయే అణువులు చాలా ఎక్కువగా జరిగితే, అంటే సృష్టి తత్త్వం కన్నా శివతత్త్వం ఎక్కువగా పనిచేస్తోంది, అప్పుడు మనం నెమ్మదిగా అలా క్షీణించి కనిపించకుండా మాయం అయిపోతాము. మనలో అణువుల పుట్టుక కన్నా అణువులయొక్క లయం అవటం తక్కువగా జరిగితే అప్పుడు మనిషి ఇలా 'ఒక ఆకారం'గా ఉండడు. అలా పెరిగి పెరిగి పెరిగి, విపరీతంగా పెరిగిపోయి స్థితి లేకుండా పోతుంది. అలాక్కాక ఒక పక్క పెరుగుదల, మరొక పక్క తరుగుదల రెండూ సమానంగా జరుగుతూ ఉంటే, మనకి మధ్యలో 'అది' (స్థితి) ఉన్నట్టుగా గోచరిస్తూ ఉంటుంది. ఒక షామియానా మనం రెండు పక్కలా తాళ్ళు వేసి లాగితే షామియానా ఉన్నట్టు కనిపిస్తుంది. ఒక పక్క తాడు తీసేయండి, ఇంకేముంది షామియానా నేల మీద ఉంటుంది. అప్పుడు షామియానా ఉన్నట్టు కాదు కదా! అలాగే త్రాసు మనం చూసినట్లయితే త్రాసులో ఒక పక్క బరువును వేసి, మరొక పక్క కూరగాయలు వేసుకున్నామనుకోండి, మనమేంచేస్తాం? ముందు త్రాసును బాగా చూస్తూ ఉంటాము, కేజీరాయి వేసిన తర్వాత వంకాయలు ఇటు పక్క సరిగ్గా తూగుతున్నాయా లేదా? బాగా తేడా ఉన్నపుడు అక్కడే చూస్తూ ఉంటాము, కుడి

ఎడమ త్రాసులను చూస్తూ ఉంటాము. రెండూ బాగా సమంగా వచ్చేసరికి మనం ఏంచేస్తామంటే, కేంద్రంలో ఉన్న ముల్లును చూస్తాము. అప్పుడిక మనం పళ్ళాలు చూడము, అంటే ఈ రెండూ బాగా సమమైపోతే ఈ రెండూ అదృశ్యమై ఆ వున్న'ఒకటి' గోచరిస్తుంది. మనలో కూడా సత్త్వగుణం బాగా గోచరించాలంటే రజస్సుకి, తమస్సుకి ఒక రకమైన agreeability రావాలి. రజస్సుకి, తమస్సుకి agreeability రాని చోట సత్త్వం వుండదు. సత్త్వం పెంచుకోవాలి, సత్త్వం పెంచుకోవాలి అంటారు కదా! సత్త్వం పెంచుకోవటం అంటే adjustment of రజస్సు and తమస్సు! అంటే అతిగా విశ్రాంతి తీసుకునేవాడు, అతిగా పనిచేసే వాడు, వాళ్ళిద్దరికీ సత్త్వం రావటానికి అవకాశం లేదు. సత్త్వం ఎక్కడొస్తుందంటే పనికి, విశ్రాంతికి సరి అయిన అనుసంధానం చేసే వాడికి, సరిగ్గా దాన్ని సమానంగా చేసే వాడికి, వాటి యందు సమత్వం కలిగిన వాడికీను! అందుకనే శ్రీకృష్ణుడు 'యోగం అంటే ఏం లేదు సమత్వం' అని చెప్పాడు, సమత్వం యోగఉచ్యతే! సమత్వం అంటే ఏవిటి ? అంటే balance in the concept. ఏ extreme లోనూ ఉండకూడదు. కొంత మంది భగవత్తత్త్వం పేరున ప్రకృతి తత్త్వాన్ని అశ్రద్ధ చేస్తారు. కొంత మంది ప్రకృతి తత్త్వం పేరున భగవత్తత్త్వాన్ని అశ్రద్ధ చేస్తారు. వాళ్ళు యోగులవటానికి అవకాశం లేదు. అంటే భక్తిలో, సాధనలో కూడా రజోగుణ ప్రవృత్తి కలిగిన వారుంటారు. మొదలుపెడితే అది విపరీతంగా చేసి, రక రకాల బాధలు తెచ్చుకునే వారుంటారు. నువ్వు ఎంత సాధన చేస్తే అంత అగ్ని పుట్టి, అగ్ని దేహాన్ని దహించేస్తుంది. తమస్సుని, రజస్సుని balance చేయటానికి అగ్ని పుట్టాలి తప్ప మొత్తం కాల్చేయటానికి కాదు. అంటే ఒకళ్ళు తండ్రి, ఒకళ్ళు తల్లి అయినపుడు, తండ్రియందు ఎక్కువ మక్కువ తల్లియందు తక్కువ మక్కువ ఉండటం లేక తల్లియందు ఎక్కువ మక్కువ తండ్రియందు తక్కువ మక్కువ ఉన్న కుమారుడు, సరైనటువంటి కుమారుడు కాడు. తల్లితండ్రులయందు సమానమైన భక్తి గౌరవములు, ప్రేమ ఉన్న వాడు సరైన కుమారుడు. అలాగే మనకు కూడా చేసే కార్యక్రమములో దివ్యము-దివ్యముకానివి అని అనుకుంటారు, అలా ఏమీ ఉండవు, మొత్తం దివ్యమే! భగవంతుడు దివ్యము! భగవంతుడి నుంచి సంకల్పంగా ఏర్పడిన ఈ సృష్టి కూడా భగవంతుడంతటి దివ్యత్వం కలిగినదే! మామూలు వేదాంతులకీ, యోగ సాధన చేసుకునే వారికీ ఒక వ్యత్యాసం ఉంది. యోగసాధన చేసుకునే వాళ్ళు ఏంచేస్తారంటే, ఈ సృష్టిని సృష్టిగా చూడరు, భగవంతుడి యొక్క రూపంగా చూస్తారు. మిగతా వాళ్ళు ఏం చూస్తారంటే ఇదంతా ఏముందండీ, ఇది కాదు ఏదో చూద్దాం అనుకుంటుంటారు. రూపంలో కనపడని వాడు, రూపం లేకుండా ఎలా కనిపిస్తాడు ? సృష్టిని సృష్టిగా చూడటం, అంటే ప్రకృతిని ప్రకృతి శక్తులుగా this is all nature అని english లో మాట్లాడటం కాదు, ఇవాళ english నేర్చుకున్నాం కదా అని! ఏదో ఇదంతా అర్థమైపోయినట్టు. ఎక్కడి నుంచి వచ్చింది ఈ ప్రకృతి ? భగవంతుడి యొక్క శరీరమే ప్రకృతి, అని గుర్తు పెట్టుకోవాలి. మన ప్రకృతి మన

శరీరం. మన భావాలను బట్టే ఉంటుంది మన శరీరం. ఎవరెవరి భావాలు ఎలా ఉంటాయో ఆ భావాలను బట్టి శరీరం యొక్క నేత జరుగుతూ ఉంటుంది. అనారోగ్యం ఉందిట అంటే, దానికి సంబంధించిన భావాలు లోపల ఉన్నాయని అర్థం! ఏ అనారోగ్యానికైనా కారణం ఆహార విహారాదులతో పాటు, భావం. ఆహారం బావుండి, విహారం బావుండి, భావం బావుంటే అనారోగ్యం ఉండటానికి అవకాశం లేదు. మన ప్రకృతిని ప్రకృతిగా చూడక భగవంతుడియొక్క రూపంగా చూసేవాడు నిజమైన యోగ సాధకుడు. భగవంతుడియొక్క రూపమే ఇతడికి గుర్తు వున్నపుడు భగవంతుడిగా గుర్తు వున్నాడు కదా! ఇప్పుడు గురువుగారి చొక్కా అన్నపుడు చొక్కాతో పాటు గురువుగారు కూడా గుర్తు వస్తున్నారు కదా! గురువుగారి చొక్కా, గురువుగారి చెప్పులు, గురువుగారి కళ్ళజోడు, గురువుగారి పెన్ను, గురువుగారి పుస్తకాలు, గురువుగారి కుర్చీ ఇలా పెట్టుకుంటాం కదా! గురువుగారి మంచం అంటే మంచం కాదు కదా అక్కడ మనం చూసేది, అటువంటి మంచాలు ఊళ్ళో చాలా వున్నాయి, కానీ ఆ మంచం చూస్తే ఏమౌతుంది మాస్టరుగారు గుర్తొస్తారు అంటే మాస్టరుగారిని గుర్తు తెలిపే రూపం అది కదా! అలా ఈ సృష్టిలో కనపడుతున్నవన్నీ కూడా సృష్టికి ఆధారభూతమైన భగవత్తత్త్వాన్ని గుర్తుచేసే రూపం అని గుర్తున్నవాడు ధన్యుడు. అలా కాకుండా వాటిని వాటిగా చూసి, దేవుడు వేరే అని ప్రార్థన చేసేవాడు శుష్కవేదాంతి అయిపోతాడు, వాడికి ఎప్పటికీ మార్గం దొరకదు, తాళం చెవి దొరకదు, ఊరికే తిరుగుతూ ఉంటాడు అలా, ఏదో సాధిస్తున్నాను అనుకుంటూ తిరుగుతూ ఉంటాడు. బాగా ప్రవృత్తిలో రజస్సు పెంచుకుని ఎన్నో తపస్సులు, ఎన్నో రకములైనటువంటి సాధనలు, ధ్యానాలు అన్నీ చేస్తూ వుంటాడు, అవ్వవు. ఎందుకు అవ్వవు అంటే, కనపడుతున్నదాన్ని చూడకుండా, దాన్ని neglect చేసి ఎక్కడో చూద్దామనుకుంటాడు. అంటే ఎదురుగా గురువుగారి రూపం కనిపిస్తుంటే గురువుగారి రూపం కాదండి, గురువుగారిని చూస్తానన్నట్టుగా ఉంటుంది. రూపంలో ఉన్నవాడిని, రూపం ఆధారంగా చూస్తూండే సాధన బాగా జరిగినపుడు, రూపం లోపల వున్నవాడితో సంబంధం ఏర్పడుతుంది. రూపంలో వున్నవాడితో సంబంధం ఏర్పరచుకోకుండా వాడిని చూద్దాం అంటే వీలుపడదు. అదీ సాలోక్యం! దగ్గరికి చేరాలి. కన్నుల నుంచి కన్నుల్లోకి చూసినపుడు దగ్గరవుతాం కదా! ఆ దగ్గరవడం లోంచి అంటే ఈ సాలోక్యంలోంచి సామీప్యం చెందుతాము. ఒకటైపోతాం. కుక్క కన్నులోకి చూసినా కూడా వాడిని/భగవంతుణ్ణి చూసినట్టే! వాడిదే ఆ రూపం. ఇది చాలా ముఖ్యం. ఇది పెద్ద రహస్యం. భాగవతం ఏకాదశ స్కంధంలో శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి 'సృష్టిని సృష్టిగా చూసినవాడెవడూ నన్ను అర్థం చేసుకోలేదు, కృష్ణుడిని ఆ రూపంగా చూసినవాడు అర్థం చేసుకున్నాడు కాబట్టి కనపడుతున్న రూపాన్ని ఆరాధన చేసుకో' అని చెప్తాడు. రూపం ద్వారా రూపంలో పనిచేస్తున్న వాడిని చూస్తూ ఆరాధన చేసుకోవడం సులభం. ఆ విధంగా చేసుకునే వాడు యోగ సాధకుడు! అలా సాధన

చేసుకోవడంతో సృష్టిలో మనం నిర్వర్తించే మొత్తం జీవితం అంతా కూడా ఇది ఇహలోక జీవితం, ఇది పరలోక జీవితం అని ఏమీ ఉండదు. అలా అయితే నువ్వు గీత గీసుకున్నట్టే! గీత నువ్వు పెట్టుకున్నదే తప్ప అక్కడ లేదు, అలా గీతలు గీసేసి మన మొహాన ఇన్ని పుస్తకాలు పారేశారు కొంతమంది సగం తెలిసి, సగం తెలియని వాళ్ళు. నిజానికి గీతెక్కడుంది? భూమధ్యరేఖ ఇలా ఉంటుందని మనకేదో explain చేయటానికి గీత గీస్తే, ఆ గీత కోసం భూమి మీద వెతుక్కున్నట్టుగా ఉంటుంది. భూమి మీద భూమధ్యరేఖ ఎక్కడ వెతుకుతారండి? ఇక్కడ వరకు అరేబియా సముద్రం, ఇక్కడ వరకు బంగాళాఖాతం, ఇక్కడ వరకు హిందూ మహా సముద్రం, ఎక్కడున్నాయండి గీతలు? మొత్తం భూమి మీద నీరంతా అయిదు సముద్రాలని చెప్తారు, ఎక్కడున్నాయి అయిదు సముద్రాలు? ఉన్నదొక్కటే నీరు. పేర్లు పెట్టుకున్నాం మన అవసరం కొద్దీ. మనకి facility అది. ఒక సులువుకి పెట్టుకున్న పేరు నిజమని నమ్మితే ఎలా? సమస్తం భగవంతుడిగా చూడడమే సాధన. రూపం ఆధారంగా లోపల వాడ్ని చూడడమే సాధన. కుడి-ఎడమగా తనే ఉన్నాడు. ప్రకృతి, పురుషుడు వేరు చేసేసి అది కాదు ఇది, ఇది కాదు అదీ అని అంతా mind నిండా పెట్టుకుంటే ఇంక ఆ జన్మకి ముక్తి కష్టం. ముక్తి దొరకాలంటే ఉన్నదొక్కటే, మన అవగాహన కోసం రెండుగా, మూడుగా, నాలుగు గా, అయిదుగా, ఏడుగా, తొమ్మిదిగా, పన్నెండుగా, పద్దెనిమిదిగా, ఇరవై ఒకటిగా, ఇరవై నాలుగ్గా, ముప్పైగా, ముప్పై ఆరుగా, ముప్పైమూడుగా, నలభైతొమ్మిదిగా, తొంభైతొమ్మిదిగా చూడవచ్చు. మీ ఇష్టం, ఎన్ని రకాలుగా అయినా చూడవచ్చు. ఎన్ని రకాలుగా చూడడం అనేది మన వైభవానికి సంబంధించింది తప్ప ఉన్నదొక్కటే. అది మర్చిపోతే ఏమౌతుంది అంటే మొత్తం అంతా గల్లంతై పోతుంది. ఇరుక్కుపోతాం. కాబట్టి భగవంతుడి యొక్క కుడి-ఎడమ భుజములుగా మొత్తం తత్త్వము, తత్త్వముయొక్క రూపాన్ని చూసినవాడు పరిపూర్ణమైన యోగంలో ప్రవేశించడానికి అర్హత సంపాదించుకున్న వాడౌతాడు. అలా ఉన్నపుడు జీవితంలో ఏ భాగము దివ్యము, ఏ భాగము దైత్యము? మొత్తం దివ్యమే! భావన బట్టి జీవనం అంతా దివ్యమే. కొంత దివ్యం కాదు కొంత దివ్యము, అని మనం ఏర్పరచుకుంటే నువ్వు అనుకున్నావు కాబట్టి నువ్వాగీత గీసుకున్నావు కాబట్టి నీకదుంటుంది, తప్ప నిజానికి అక్కడ లేదు. భగవంతుడికి కుడి భుజం ముఖ్యమా ఎడమ భుజం ముఖ్యమా? ఒక భుజం తీసేసి ప్రార్థన చేసుకున్నామనుకోండి ఎలా ఉంటుంది? శంఖం ముఖ్యమా చక్రం ముఖ్యమా? ఎందుకంటే శంఖం, చక్రం, గదా, పద్మం ఉంటాయి కదా! ఏది తీసేస్తారు ఇందులో? పోనీ మనం బాగా ఆధ్యాత్మికంగా విపరీతంగా సాధన చేసేస్తున్నామనుకొని, మాకసలు భగవత్తత్త్వం తప్ప మిగతావాటి మీద interest లేదండి, అవన్నీ చేయకూడదండి, అవన్నీ చూడకూడదండి అని కొంతమంది సాధకులు చెపుతూ వుంటారు. ఏం చేయకూడదు, ఏం చూడకూడదు గీతలు గీస్తూ ఉంటే చాలా గీతలు ఉంటాయి, ఎందులో ఉన్నా భావం ఒక్కటే ఉంటే

పరవాలేదు. ప్రకృతిని నిరాదరణ చేసిన వాడికి ఇంక ఎడమ కాలు అక్కర్లేదని కుడికాలు మీద నడిచేయగలను అన్నట్టుగా ఉంటుంది. 'ఆ మొత్తం అంతా నా వైభవం. హాయిగా అనుభవించారా!' అని వాడు పంపిస్తే, 'కొంత తీసేస్తాను కొంత ఉంచుకుంటాను' అంటే 'నీ ఇష్టం ఏడు!' అంటాడు. రెండు గోడల మీద Roof వేసిన తర్వాత, ఒక గోడ తీసేస్తే ఎలా ఉంటుందండీ? ఇది కేవలం శాస్త్రాలు, వేదాలు బాగా పాండిత్యం ఉన్న వాళ్లకి అందే విషయం కాదు ఎందుకంటే ఇది పామరులకు సరాసరి అందినటువంటి సులువైన విషయం. పాండిత్యం mind నిండా ఎక్కేసరికి ఇది అందదు. కుడి-ఎడమ భుజాలలో ఒక పక్క నుంచి ప్రకృతితత్త్వం ఒక పక్క నుంచి పురుషతత్త్వం, వాళ్ళిద్దరి మధ్య జరిగే క్రీడలే మొత్తం అంతా దిగి వచ్చి, జలిమిగా మొత్తం అల్లుకుని ఉంది. ఇందులో అది ఉంది, అందులో ఇది ఉంది. పదార్థంలో పరమార్థం ఉన్నట్లే పరమార్థంలో పదార్థం ఉంది, లేకపోతే ఎక్కడి నుంచి వస్తుంది ఇది? ఈ రెండింటినీ సమంగా ఆరాధన చేయాలి మనం. అంటే ఏమిటి? ఓ విరగబడి పని చేయటమే కాదు, తగినటువంటి విశ్రాంతి కూడా తీసుకోగలగాలి, లేకపోతే వాడు యోగి కాదు. విరగబడి విశ్రాంతి తీసుకోవటం కాదు పని సమంగా చేయాలి, అదేదో ఊళ్ళో ముగ్గురు సోదరులు ఉన్నారు ఒకడెప్పుడూ నిద్ర పోతాడు, ఒకడెప్పుడూ అసలు నిద్రే పోడు, ఇంకొకడు సమంగా ఉంటాడు అని చెప్తారు కదా, అదే కదా లంక. ఒకడు నిద్రపోతుంటాడు ఎప్పుడూ, ఒకడస్సలు నిద్రేపోడు. వాడికి పగలూ రాత్రీ పనే. రాత్రి వాడు ఎక్కడెక్కడ అందమైన స్త్రీలు దొరుకుతారా? అని వేటకు పోతూ ఉంటాడు. పగలంతా రాజ్యం ఏలాలి, 24hrs రజోగుణం, వీరిద్దరి మధ్య యింకొకడున్నాడుట. అలా ఈ ఇద్దరినీ సమం చేసినవాడు ఎవరైతే ఉంటాడో వాడు సత్త్వంలో నిలబడగలుగుతాడు. ఎడమభుజం-కుడిభుజంలో ఏది తగ్గినా సత్త్వం దొరకదు. సత్త్వం దొరికితే, సత్త్వం అనే ఒక passage ద్వారా గుణాతీతంలోకి వెళ్ళటానికి వీలు ఉంటుంది. సత్త్వం అనేది ఎటువంటిదంటే త్రిభుజంలో రెండు భుజాలు సమానమైన కోణంలో కనుక కలిసినట్లయితే అక్కడినుంచి ఏర్పడిన ఒక passage కారణంగా లోపలికి వెళ్ళడానికి వీలు పడుతుంది. అప్పుడు గుణాతీతం తెలుస్తుంది. కొంతమందికి గుణాల్లో ఉండే భగవంతుడు కన్నా గుణాతీతుడు ఏదో పెద్ద అనేది ఒక glamour. అవన్నీ ఉండకుండా ఉండాలంటే ఈ సుభుజుడ్ని ప్రార్థన చేయాలి, సుభుజుడు అంటే సమాంతర భుజములు కలిగినటువంటి త్రిభుజం గా కూడా ప్రార్థన చేసుకోవచ్చు. సమంగా ఉండాలి, ఏమిటి? రజస్సు-తమస్సు సమంగా ఉండటంవలన ఏర్పడిన సత్త్వం ద్వారా సత్త్వమునకు అతీతమైన చైతన్యస్థితియందు నిలబడవచ్చు. అంత ఉంది ఈ త్రిభుజంలో. రెండు భుజాలు సమంగా వాడేవాడు భగవంతుడు. తననుంచి వచ్చిన తత్త్వంలో ఎక్కడికెళ్లాలో తెలీకుండా ఎక్కడికెళ్తావు నువ్వు? ఇవి అయిపోవాలండీ, ఈ కుటుంబం వ్యవహారాలైపోవాలి, అద్దైపోవాలి, ఈ ఉద్యోగం అయిపోతే మనకి పనైపోతుంది--. ఏమీ ఉండదట్లా. నువ్వు వున్నది వున్నట్టుగా చూడటం మానేసిన నాడు ఏమొచ్చినా

ఒక్కటే. చూస్తూ ఉంటే ఇవన్నీ చుట్టూ ఉన్నా ఎక్కడ వున్నా వున్నది అదే కదా! ఇవి మానేయాలండీ ఇంక మీరు అంటుంటారు కొంతమంది, ఏవి మానేయాలి? కనపడుతున్న దాంట్లో దాన్ని చూస్తూ ఉంటే ఏదీ మానేయక్కర్లేదు, ఊరికే దేవుడి బొమ్మ ముందు కూచుంటేనే భక్తుడా? చెట్టు చూస్తే భక్తుడు కాదా? పుట్ట చూస్తే భక్తుడు కాదా? నిజంగా భక్తుడనే వాడికి ప్రపంచంలో భక్తుడు అనిపించుకోవాలి అనే వ్యామోహం ఉండదు. రూపము, రూపమునకు ఆధారమైనటువంటిది, నేను-నాది, అవి రెండు భుజాలు, మొత్తం సృష్టికి అవి ఎప్పుడూ ఉంటాయి. ఈ రెండు భుజాల్లోంచే మొత్తం కథంతా నడుస్తుంది, అదే అర్ధనారీశ్వర తత్త్వం! అదే గరుత్మంతుడి యొక్క కుడి-ఎడమ రెక్కలు! అవే మనలో ఇడ-పింగళ అని పనిచేసే రెండు ప్రజ్ఞలు! ఇచ్ఛాశక్తి- క్రియాశక్తి- జ్ఞానశక్తి అన్నారు కదా! జ్ఞానం ఆధారంగా ఒక పక్క క్రియ ఇంకో పక్క ఇచ్ఛ, ఇలా workout అవుతూ ఉంటాయి. దాన్నే మనకి love, light and will అన్నారు. Will and light గనుక equipoise లో ఉంటే love అనేది experience అవుతుంది. అలాగే మనలో కూడా దివ్యత్వం ఉన్నది. మనలో కొంతమంది వెలుగునిచ్చే దేవతలు శిరస్సులో పనిచేస్తున్నారు. ఆ తర్వాత ఉదరవితానంకి పైన కొంతమంది దేవతలు పనిచేస్తున్నారు, వాళ్ళందరూ ప్రాణాన్ని సరి చూస్తూ వుంటారు. ఉదరవితానంకి కింద జననేంద్రియముల వరకు కొంతమంది దేవతలు పనిచేస్తూ వుంటారు, వాళ్ళందరూ శరీరాన్ని సరిగ్గా ఉంచేట్టు చూస్తారు, శరీరం బావుండాలంటే ఉదరవితానంకి కింద ఉన్న కేంద్రాలన్నీ సరిగ్గా పనిచేయాలి, అవి బాగా పనిచేయాలంటే దానికిపైనున్న ప్రాణానికి సంబంధించిన దేవతలందరినీ సరిగ్గా పనిచేయనివ్వాలి. దానికి పైన దివ్యమైన వెలుగు కిరణాలను ప్రసారం చేస్తూ మనలో తెలివిగాను, ప్రాణంగాను పనిచేసే మూలస్థానాలు శిరస్సులో ఉన్నాయి. ఆదిత్యులంతా ఈ శిరస్సులో ఉన్నారంటారు. ప్రాణానికి సంబంధించిన రుద్ర కార్యక్రమమంతా కూడా ఉదరవితానంలో హృదయంలో స్పందన గాను, ప్రాణస్పందన గాను, ఉఛ్వాస నిశ్వాసలు గాను, రక్తప్రసారంగాను ఉన్నాయి. ఉదరవితానం కింద ఉన్న కేంద్రాల్లో శరీరాన్ని తయారుచేసే దేవతలందరూ ఉన్నారు. ఈ శరీరాన్ని తయారుచేసే దేవతలందరినీ పితృదేవతలంటారు. ఈ ముగ్గురు రకాల దేవతలు సరిగ్గా పనిచేయాలి. ఈ శిరస్సు, ఈ ఉదరవితానం కిందనున్న కేంద్రాలు సరిగ్గా పనిచేస్తే, హృదయం లో మనం స్థిరపడి, హృదయంలోంచి అంతర్గతంగా వెళ్ళటానికి వీలు పడుతుంది. అందుకని ఏది మనం అశ్రద్ధ చేసినా యోగంలో ఆ గుహ ఏదైతే ఉందో, ఆ గుహలోకి దూరడానికి వీలు పడదు. గుహలోకి దురాలంటే రెండూ సమం అవ్వాలి, రెండు సమం అయితే అపుడు ఆ రంధ్రం దొరుకుతుంది, ఆ రంధ్రం లోంచి లోపలికి నడిచి వెళ్ళడం జరుగుతుంది.

మనం శ్రీ కృష్ణుడి బొమ్మ, రాతి విగ్రహం పెట్టుకున్నాం. భావన కృష్ణుడి మీద ఉంటుందా? రాయి మీద ఉంటుందా? కృష్ణుడి మీదే వుంటుంది, రాయి మీద వుండదు

కదా? అసలు రూపంతోనే మనం సంబంధం పెట్టుకున్నాం కదా! అసలు ఏదైతే వుందో దానితో ధ్యానం పెట్టుకోవడానికి ఒక నిమిత్తంగా ఇది పనిచేస్తోంది. కాబట్టి మనం దీన్ని ధ్యానం చేయడంలేదు. రూపం ఆధారంగా, రూపాన్ని ఆవరించి ఏదైతే వుందో దాన్ని ధ్యానం చేస్తూవుంటాం. ఆ తరువాత ఈ రూపం మనసులో స్థిర పడుతుంది. కళ్ళు మూసుకుని, మనసులోనో, భ్రూమధ్యంలోనో, హృదయంలోనో దాన్ని ధ్యానం చేసుకున్నప్పుడు రాయి లేదుగా! ఏవుంది అక్కడ? Your own energy transforms into it, ఉంటుంది అక్కడ. దానిలో వెలుగు పెరుగుతూ వుంటుంది, పెరుగుతూ వుంటే, నెమ్మదిగా ఇక్కడ రాయిలో వుండే పదార్థం అంతా వదిలేసాము. రాతిలో ఉన్నంత పదార్థం మన గుండెల్లోకి ఎక్కించుకుంటే, మన గుండె బరువెక్కి పగిలి చచ్చిపోతాం. స్థూల రూపమైన పదార్థాన్ని వదిలేసి, దాని సూక్ష్మ రూపాన్ని తీసుకున్నాం. ఆ సూక్ష్మ రూపం మనకి నెమ్మదిగా ఒక వెలుగు గా గోచరిస్తూ వుంటుంది. వెలుగు బాగా పెరిగేసరికి రూపం కూడా పోతుంది, వెలుగు ఒక్కటే మిగులుతుంది. ఒక చిన్న దీపం పెట్టామనుకోండి, ఆ వెలుతురు కనిపిస్తుంది, పెట్టిన సెమ్మె చిన్నగా కనిపిస్తుంది. భగవద్ తత్త్వం దగ్గరకి, రూపం నిమిత్తంగా వెళ్ళడం తప్ప, రూపం తో వుండం మనం.

భావం is the subtle form for which you are using an outer form. బయట ఎదో ఒక రూపాన్ని నిమిత్తంగా, సూక్ష్మం తోనే మనం బాగా అనుసంధానం చెందుతాం. మనం ఏదైనా మంచి పదార్థం తింటే, మనసు తినిపిస్తుంది. మనసు హల్వా తినగానే, హమ్మయ్య! హల్వా తిన్నాం అనుకుంటాం. ఎవరు తిన్నారు హల్వా? తినిపించింది మనసు. అది తినలేదు, నాలుక మీద పడేసింది. నాలుక్కి కూడా దక్కలేదు, అది పొట్టలోకి వెళ్ళిపోయింది, కదా! ఇటు నాలుకకీ దక్కలేదు, అటు మనసుకీ పదార్థం దక్కలేదు కానీ, ఏమిటి దక్కింది మనసుకీ? తృప్తి దక్కిందా లేదా? మనసు ఎలా satisfy అయ్యింది? అది పుచ్చుకోలేదుగా హల్వా? పుచ్చుకున్నది నాలుక, మింగింది పొట్ట. తృప్తి పొందింది మనస్సు.

మనం ultimateగా interact అయ్యేది పదార్థంతో కాదు, పరమార్థం తోనే. పదార్థం లేకపోతే interaction లేదు, అలా ఆకాశంతో interact అవ్వమంటే మనకు చేతకాదు కాని, రూపాతీతం తో ప్రవర్తించడం బాగా అలవాటుపడినవాడు ఆకాశంతో కూడా interact అవ్వగలడు. వాడు ఆకాశాన్ని వింటాడు, ఆకాశాన్ని చూస్తాడు, ఆకాశంతో మాట్లాడుకుంటూ వుంటాడు. భగవంతుణ్ణి మనం సుభుజుడిగా చూడడం అంటే ప్రకృతిలో వున్న పురుషుడిని దర్శనం చేయడం. అంటే ప్రకృతిని ముందు భగవంతుని రూపంగా ఆరాధన చెయ్యాలి. దాన్ని అశ్రద్ధ చేయకూడదు. ఇదంతా ఏమీ లేదు, దీని పైన ఇంకేదోవుంది అని అనుకోకూడదు. వున్నది చూడడం మొదలుపెడితే, నెమ్మదిగా వున్న వాడి శరీరం కనిపించి, ఆ తరువాత వాడి స్వభావం కనిపించి, అక్కణ్ణుంచి వాడిలో చైతన్యం కనిపించి, అక్కణ్ణుంచి వాడిలో వున్న సత్యం గోచరించి,

ఇలా పొరలు పొరలు విడి లోపలి వెళ్తాడు, చూడడం మొదలుపెడతాడు. ఇది యోగశాస్త్రం. ఈ సుభుజుడి దగ్గరనుంచీ సమాంతరమైన త్రిభుజం, సమకోణమైన త్రిభుజం ఏర్పడుతుంది. అక్కడ త్రిగుణాలన్నీ కూడా agreeability వచ్చినప్పుడు గుణాశక్తి నుండి గుణాతీత స్థితిలోకి వెళ్తాడు. గుణత్రయవిభాగయోగంలో మనకి దీని గురించి బాగా ఇచ్చాడు. గుణత్రయవిభాగం ఎందుకు చేసారంటే అవగాహనకి. కానీ యోగం అన్నాడు మళ్ళీ అక్కడ. విభాగాన్ని యోగీయం చేస్తే మనం దానికి అవతల వున్నాం. ఒక్కొక్క భావం ఒక్కో త్రిభుజం. ప్రతీవాళ్లల్లోంచి ఒక్కో భావం వస్తూవుంటుంది. వాడొక భావంలోకి వచ్చాడు అంటే ఒక త్రిభుజంలోకి వచ్చినట్లు. ఆ త్రిభుజం, సత్త్వం అయిన భావంలోకి వచ్చినట్లయితే, సమాంతర, సమకోణత్రిభుజంలోకి వచ్చినట్లు. అది రజోగుణ సంబంధమైన భావం అయితే ఒక కొమ్ము కాస్త ఎక్కువ ఉన్నట్లు, తమోగుణ భావం వస్తే ఇంకో కొమ్ము ఎక్కువగా వున్నట్లు. ఏం వింటాం? ఏం చేస్తాం? ఎప్పుడూ ఉండేదే కదా అని అనిపించింది అనుకోండి, అది తమోగుణం. అశ్రద్ధ, నిర్లక్ష్యం, నిద్రపోదాం అనుకోవడం తమోగుణం. విపరీతంగా వొళ్ళు విరుచుకుని అవతలివాడిపనీ, ఇంకొకళ్ళపనీ, ఊళ్ళోవాళ్ళపనీ, మనదికానిది, మనదైనదీ చేస్తూ వుండడం అంతా రజోగుణం. భావంలో మనకి మన పని వదిలేసి పక్కవాడి పని చేద్దాం అనిపిస్తుంది. అది రజోగుణం. మనకి వచ్చే భావంలో ఎప్పుడూ కూడా రజోగుణ, తమోగుణ సంపన్నులకి సమకోణ త్రిభుజమైన భావం రాదు. అందుకని రజోగుణం వాడికి ఏం చేస్తారంటే, కొంత వేగం తగ్గిస్తారు, తమోగుణం వాడికి కొంత వేగం పెంచుతారు. రజోగుణం వాడు వేగం తగ్గించుకుంటే, తినే దెబ్బలు కూడా కొంచెం తగ్గించుకుంటాడు నెమ్మదిగా. తమోగుణం వాడికి తిండి కూడా దొరకదు. ఎందుకంటే, ఏమీ చేయడుకదా! తప్పక మొదలుపెడతారు వాళ్ళు, ఎలాగైనా సరే సత్త్వగుణంలోకి వస్తారు, ఈ రెండిటినీ balance చేసుకుంటూ. మనం ఏ భావంలో దిగితే, ఆ భావం సత్త్వగుణ ప్రధానంగా వుంటే, అందులోంచి మనం కార్యక్రమం నిర్వర్తించి ప్రశాంతంగా ఉండడానికి అవకాశం వుంటుంది. రజస్సు తమస్సు పాలు ఎక్కువ-తక్కువ వున్నప్పుడు సత్త్వం అదృశ్యం అవుతుంది. అయినప్పుడు ఏమవుతుందంటే చేసిన పనిలో మనం ఇరుక్కుంటాం. మనమంతా మనం చేసిన పనిలో ఇరుక్కుంటూ వుంటాం. ఏద్దైనా సరే. Anything that we do we are experts in getting caught by it. ఏది చేసినా మనల్ని మనం ముళ్ళువేసుకుంటాం, కారణం రజోగుణం, తమోగుణం balance కాకపోవడం. మాస్టారు అంటూ వుండే వారు చేయవలసినదా? చేయదలచినదా? అని. సత్త్వంలో నిలబడినప్పుడే, మన కర్తవ్యం మనకి గోచరిస్తుంది. రజస్సు, తమస్సు లలో వున్నప్పుడు గోచరించదు. సత్త్వంలో వుండడం ఎలా? భగవంతుని ఆరాధన చేయడంవల్ల సత్త్వంలో నిలబడతాం. భగవంతుని ఆరాధన చేసిన తరువాత, ఈ రోజు నేను ఏమి చెయ్యాలి? అని ప్రశ్న వేసుకుంటే, సమంగా వస్తుంది. ఎందుకంటే, we have

positioned ourselves, we have aligned ourselves, ఒక ప్రశాంతమైన మనసు మనకి ఏర్పడిన తరువాత ఇవాళ మనం ఏంచెయ్యాలి అని ఆలోచిస్తే, చేయవలసినవి మాత్రం తెలుస్తాయి. చేయవలసినవి మాత్రమే చేసి, అనవసరమైనవి వదిలేయడం అనేది సాధనలో పెంచుకుంటూ వుండాలి. ప్రసన్నమైన మూర్తిని ఆరాధన చేస్తే మనలో ప్రసన్నత సత్త్వగుణ ప్రధానంగా పెరుగుతుంది. అందుకని, మనం ఆరాధన చేసే విగ్రహాలు కూడా సత్వగుణ ప్రధానంగా వుండాలి. వుంటే పెరుగుతుంది. పెరిగితే ఈ రెండు భుజాలూ సమం అవుతాయి. ఒక చెయ్యి సన్నం ఒక చెయ్యి లావు కాకుండా. 'సుభుజుడు' చాలా పెద్ద concept. Basic గా మనం అర్థం చేసుకోవలసినది, 1) రక్షణ పొందుదాం, రక్షణ ఇద్దాం. ఆ తరువాత 2) రక్షణ ఇవ్వడం ద్వారా రక్షణ పొందుదాం, 3) మొత్తం భగవంతుని తత్త్వంగా దర్శనం చేద్దాం. అది పూర్ణయోగం అవుతుంది. దేన్నీ అశ్రద్ధ చెయ్యొద్దు. మనకి వచ్చిన కర్తవ్యం మేరకు భగవంతునితోనే మనం ప్రవర్తిస్తున్నాం అనే భావంతో మొత్తం అంతా workout చేద్దాం. కుటుంబంలో అయినా అంతే, ఉద్యోగంలో అయినా అంతే, సంఘంలో అయినా అంతే, సాధనలో అయినా అంతే, సాధనచేసే సోదరులతో అయినా అంతే. అన్ని చోట్లా వున్నది ఒక్కడే కాబట్టి, వాడినే చూస్తూ వుంటాం అన్నిచోట్లా. ఏవిటో అండీ ? ఉద్యోగం గొడవ అయిపోతోందంతా అంటే, ఉద్యోగంలో కనిపించేవాళ్ళంతా వాడే అనుకుంటే, ఉద్యోగం గొడవ అయిపోదు. లేచిన దగ్గర్నుంచీ ఏం చూసినా వాడే అనే భావనలో పడిపోతే, మొత్తం సాధనే అయిపోతుంది. అది జరగాలంటే ఈ demarcations పెట్టుకోకూడదు. Demarcation పెట్టుకున్నావో, నీ అంతట నువ్వే పెట్టుకున్నావు కాబట్టి నిన్ను నువ్వే రెండు ముక్కలు చేసినట్లు అవుతుంది. నిన్ను నువ్వే రెండు ముక్కలు చేసుకున్నప్పుడు ఇక అతుక్కునే ప్రశ్న ఏమి వుంటుంది.

## 276 దుర్ధరః

దుర్ధరుడంటే జయింపలేనటువంటివాడు అని అర్థం. ఆయన్ని ఎవ్వరూ జయించలేరుట. జయించాలి అనే భావం రజోగుణానికి సంబంధించినది. రజోగుణంలో వుండే వాడు సత్త్వగుణంలో వుండే వాడిని ఎప్పుడూ గెలవలేడు. ఎందుకంటే సత్త్వగుణం గుణాతీతంకి అనుసంధానం అంటే link అయ్యి వుంటుంది, ముడిపడి వుంటుంది. అంటే సత్త్వగుణం గుణాతీతం అనే చైతన్యానికి ముడిపడి వుంటుంది కాబట్టి, విశ్వ చైతన్యంతో link up అయ్యివుంటుంది. సత్త్వగుణంలో వుండే వాడిని, రజోగుణం వాడు ముట్టుకుంటే, మొత్తం విశ్వం అంతా కూడా alert అయిపోతుంది. Respond అయిపోతుంది. Alert అయిపోయి వీడి ద్వారా express అవుతుంది. అదీ వశిష్ఠుడికి విశ్వామిత్రునికి జరిగిన గొడవంతా. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కాకముందు రజోగుణంతో బాగా ఉన్నప్పుడు, వశిష్ఠుడితో comparisions తో బాధపడుతూ ఉంటాడు. వశిష్ఠుడికన్నా నేను గొప్పవాడిని కావాలి అని అనుకున్నంతకాలం కాలేకపోతాడు. ఎందుకు కాలేక పోతాడు ? ఇంకొకళ్ళకన్నా మనం గొప్పవాళ్ళం అవుదాము అనే భావమే రజస్సు! రజస్సులో 'జయించాలి' అనే భావం వుంటుంది. సత్త్వంలో 'జీవించాలి' అనే భావం వుంటుంది. Sense of achievement ఎక్కువగా వుంటుంది రజోగుణసంపన్నుడికి. సత్త్వగుణం కలవాడికి Sense of being వుంటుంది. ఉండడం వాడికి తెలుసు. జీవనంలో వుండే వైభవం దర్శనం చేస్తూ జీవిస్తూ ఉంటాడు తప్ప, జయించాలి, సాధించాలి, ఆక్రమించాలి అనే భావాలు వుండవు. వశిష్ఠుడు అటువంటి సత్త్వగుణ ప్రధానుడు. విశ్వామిత్రుడు రజోగుణ ప్రధానుడు అవటం వలన జయించాలి అనుకున్నప్పుడు అంతా ఓడిపోతూవుంటాడు. పాండవ-కౌరవుల మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు, యుద్ధం వాళ్ళని ప్రకటించనీ, మనం ఎందుకు ప్రకటించాలి ? అంటాడు కృష్ణుడు. యుద్ధం వాళ్ళు ప్రకటించిన తరువాత మొత్తం రెండు సైన్యాలు అక్కడ నిలబడి readyగా వున్నప్పుడు, వాణ్ణి శంఖం ఊదనీ, ఆ తరువాత మనం ఊదుదాం అంటాడు కృష్ణుడు. వాణ్ణి బాణం వేయనీ, ఆ తరువాత మనం వేద్దాం అంటాడు. వాడు కదా జయిద్దాం అనుకుంటున్నాడు మనని? మనం జయిద్దాం అనుకోవడం లేదు కదా వాణ్ణి? ఎప్పుడూ జయించుదాం అనే భావం ఉండేవాడు ఓడిపోతాడు. అందుకని బుద్ధిమంతుడు అటునుంచి మొదలయ్యేలా చూస్తాడు. అదీ యోగంలో ఆరంభ పరిత్యాగం! నువ్వేం మొదలుపెట్టక. Already మొదలుపెట్టిన దానిలో నువ్వొక భాగంగా వున్నావు. వచ్చే files dispose చెయ్యి తప్ప, నువ్వేమీ files propose చెయ్యకు, అంటాడు. రజోగుణం వున్నచోట చాలా విపరీతంగా పుడుతూ వుంటాయి. నీలోంచి పుట్టినవన్నీ నువ్వే మళ్ళీ పూర్తిచేసుకోవాలి. నాలోంచి పుట్టి నీ వరకూ వచ్చినవి నువ్వు చూస్తూ వుంటే, నువ్వు కూడా నాలాగే ఉంటావు. భగవద్గీతలో

నీ సృష్టి నువ్వు dissolve చేసుకోవాలి, నా సృష్టి నేను క్షణంలో dissolve చేసుకోగలను అని చెప్తాడు, కృష్ణుడు. నువ్వు చేస్తున్న పనులు నిన్ను బంధించేలా తయారు చేసుకుంటున్నావు. నువ్వు చేస్తున్న పనుల మీద నీకు స్వామిత్వం వుండాలి. నేను చేస్తున్న పనుల మీద నాకు స్వామిత్వం వుంది. ఏరోజు కావాలంటే ఆరోజు అలా మూసేయగలను. పిల్లలు ఆడుకుంటూ అలా బొమ్మలు పేర్చి, ఒకేసారి ఠప్పని కొట్టేస్తారు. అలా కొట్టేయగలమా? ఇల్లు కట్టుకున్నాం ఇది కొట్టేయ్యమంటే? నా గుండెలో బాకు పెట్టి పొడిచేయండి, ఈ ఇల్లు నేను కొట్టేయ్యలేను అని చెప్పే పరిస్థితిలో వుంటాం మనం. అది కొట్టేస్తుంటే మనని కొట్టేస్తున్నట్టు వుంటుంది. కట్టడం, తీసేయడం రెండూ సులభం వాడికి. మనకి కట్టుకోవడం చేతనౌను, అందులో ఇరుక్కోవడం చేతనౌను కానీ కొట్టెయ్యడం చేతకాదు. ఇవన్నీ ఎందుకు వస్తున్నాయి అంటే వాడికి వుండడం ఒకటే తెలుసు. తనలోంచి వస్తున్న దానిలో కూడా ఉంటాడు. దుర్ధరుడు ఎందుకయ్యాడయ్యా? అంటే వాడికి జయించాలి అన్న ఆసక్తి వుండదు. దేన్ని జయిస్తాడు, అన్నీ తనలోంచి వచ్చినప్పుడు? నాపిల్లవాడి మీద నాకు జయం కలగాలి అని ఎవరైనా అనుకుంటాడా? ఒకటి, తన నుంచి పుట్టుకొచ్చిన మొత్తం జీవరాశుల్లో దేన్ని జయించాలి ఆయన? రెండవది, అసలు జయించాలి అన్న భావనే లేనివాడు.

శ్రీకృష్ణుడు కాలయవనుడితో యుద్ధం చేసినప్పుడు వాడు యుద్ధానికి వస్తే, 'చేసుకో యుద్ధం అంటాడు. ఈయన, చేయడు. ఎంతసేపటికీ చేయడు. వాడు ఊరికే యుద్ధం' చేసేద్దామని tension పెంచుకోవడమే తప్ప! చివరికి ఈయన యుద్ధం చేయకుండానే వాడు చచ్చిపోతాడు. ఈ రోజున మనకి far east countries లో, martial arts లో ఇదొక పెద్ద secret గా చెబుతారు. నీకై ఎవరితో పోట్లాటకి వెళ్ళకు, నీతో ఎవరైనా పోట్లాటకి వస్తే let him make the first hit, మొదట వాణ్ని కొట్టనీ అని చెప్తారు. అంతేకాదు ఇంకొక technique కూడా చెప్తారు. అసలు resistance లేకపోవడంవల్ల గెలుస్తావు అని చెప్తారు. ఇవన్నీ మనకిప్పుడు సినిమాల్లో చూపిస్తున్నారు. తత్త్వంలో వుంది. ఏవిటా తత్త్వం? అంటే ఏద్దైనా జయించాలనే భావన పెట్టుకోవద్దు జీవించాలనే భావన పెట్టుకోండి. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, రావణాసురుడు రజోగుణం ప్రవృత్తితో తపస్సులు చేసారు. తపస్సులో రజోగుణం వుంటే పడిపోతాం. తపస్సులో సత్త్వగుణం వుండాలి. ఉన్నది ఉన్నట్టుగా మనకి గోచరించడానికి ప్రయత్నం చెయ్యాలి తప్ప, రజస్సు పెంచకూడదు. తపస్సులో ఆక్రమించడం, పెంచడం అనే భావనలో వుండకూడదు. ఉండడం అనే భావనలో వుండాలి. నేను ఎలా వున్నాను? అని తెలుసుకోవడం నిజమైన తపస్సు. అంతేగానీ ఎదో ఒకటి దొరకాలని చేసే తపస్సులో అగమ్యగోచరంలో పడిపోతాం. ఎలా వున్నాను? భావనలో వున్నాం. భావానికి అతీతంగా స్పందనంలో వున్నాం. స్పందనానికి అతీతంగా స్పందనాన్ని వ్యక్తంచేసే వాడిగా వున్నాం. కాబట్టి వుండడం తెలుసుకోవాలి తప్ప, జయించడాలు

పెట్టుకోకూడదు. జయించడాలు పెట్టుకున్నవాడు ఎవ్వడూ ఇప్పటివరకూ జయించలేదు. Alexander, Napoleon Bonaparte కథలు వున్నాయి కదా? ఆక్రమించిన వాళ్ళంతా వదిలేసి వెళ్ళిపోవలసి వచ్చింది. కాబట్టి భగవంతుడు 'దుర్ధరుడు' జయింపబడనివాడు అని. ఎందుకు జయింపబడనివాడంటే, తనకై ఏదీ జయించవలసిన భావన లేనివాడు. నిజమైన దుర్ధరుడు వాడు. కాబట్టి అందరూ ఆయనతో పోట్లాడుకుని ఆయన లో కలిసిపోతూ వుంటారు. పూర్ణపురుషుడి నుంచి వచ్చిన అంకెల లాంటి వాళ్ళు మిగతావాళ్ళంతా! ఈ జీవరాశులన్నీ ఒకే తత్త్వం లో నుంచి వచ్చినవి కాబట్టి, దాని దగ్గరకి వెళ్ళేసరికి, అవన్నీ 'అది' అయిపోతాయి తప్ప, వేరుగా ఉండడానికి అవకాశం లేదు. అదీ mathematical equation. ఎంత number అయినా దాన్ని సున్న తో హెచ్చవేస్తే సున్నా అయిపోతుంది. సున్నాతో భాగారిస్తే సున్నా అయిపోతుంది. ఎందుకని? దాని నుంచి ఇవన్నీ వచ్చినవి కాబట్టి, దాని దగ్గరకి వెళ్తే అవన్నీ 'అది' అయిపోతాయి అని చెప్పడానికి చెప్పిన equation. మొత్తం అన్నీ అగ్ని లోంచి వచ్చినవి. మనం అగ్నిలోకి వెళ్లి దాన్ని జయిద్దాం అనుకుంటే, మనం కూడా అది అయిపోతాం అంతే. అదృశ్యం అయిపోతాం. ఏది అన్నిటికీ పుట్టుక స్థానమో దాన్ని జయించడానికి అవకాశం లేదు కదా! భాగం ఎప్పుడూ కూడా మొత్తాన్ని జయించలేదు. భగవత్తత్వం మొత్తం కాబట్టి, ఆ మొత్తం లోంచి బయటకు వచ్చింది, మొత్తంతో పోట్లాడితే మొత్తంలో భాగమైపోతుంది. శిశుపాలుడు, కంసుడు, నరకాసురుడు వీళ్ళందరూ ఆయనలో కలిసిపోయారంటే అదీ అర్థం. వాడితో x mark పెట్టుకున్నారు, పెట్టుకుంటే వాడయిపోయారన్నమాట. అదీ దుర్ధరుడు! ఆయన్ని జయించే ప్రశ్న ఎవ్వరికీ లేదు. దుర్ధరుడిని తలచుకుంటే మనకి జయం కలుగుతుంది. జయం అంటే రెండు అర్థాలు వున్నాయి. జయం అంటే గెలవడం అనే అర్థం వుంది, పరిపూర్ణత్వం అనే అర్థం కూడా వుంది. మహాభారతానికి అసలు వేదవ్యాసుడు పెట్టిన పేరు జయము. తరువాత మహాభారతం అన్నారు దాన్ని. ఆయన ఎందుకు జయము అని పెట్టారంటే మనకి పరిపూర్ణసిద్ధి కలగాలని, అంటే fulfillment. ఎలా కలుగుతుంది జయం? యజం చేయడం వల్ల జయం కలుగుతుంది అంటారు. తనని తాను సమర్పణ చేసుకోవడం యజ్ఞం. తనకి వున్నవి సమర్పణ చేయడం యజ్ఞం అవ్వదు. Disciples అనే పుస్తకంలో జ్వాలాకూల్ గారికి ఒకాయన ఉత్తరం రాసి 'నేను గత 30 ఏళ్ళుగా నా time, నా energy, నా money అంతా నీ కోసం spend చేసాను, మీరు ఎందుకు కనపడరు?' అని Bailey ద్వారా పంపిస్తాడు ఆయన. అప్పుడు జ్వాలాకూల్ గారు 'నాకు నీ యందు మాత్రమే interest, నీకు ఉన్న వాటిమీద interest లేదు. నువ్వు నీకు ఉన్నవన్నీ ఇచ్చావు గానీ, నిన్ను నువ్వు నాకు ఎప్పుడూ ఇచ్చుకోలేదు. నిన్ను సమర్పణ చేసుకోకుండా నీకు వున్నవి అన్నీ సమర్పణ చేసావు, కాబట్టి నేను నీకు కనపడడానికి అవకాశం లేకపోయింది. నీవన్నీ నీ దగ్గర ఉంచుకుని, నిన్ను నువ్వు సమర్పణ చేసుకుంటే ఎప్పుడో

కనపడేవాడిని. Baileyకి నీకు అదే తేడా! అని చెప్తారు. భగవంతుడు ఆ విధంగా 'తనని తాను సమర్పణ చేసుకోవడంవల్ల సృష్టి వచ్చింది. అదే కదా 'పురుష మేధం' అంటే. పురుష సూక్తంలో మొత్తం అంతా అదే! ఆయన్ని శుభ్రంగా పశువుని కట్టేసినట్టు కట్టేసి, సర్వహుతం అనే యజ్ఞం చేయడం కారణంగా, మొత్తం కాల్చేసారుట ఆయన్ని ఏమీ మిగలకుండా. ఆయన్ని కాలుస్తూ వుంటే అన్ని పుట్టుకుంటూ వచ్చాయిట. ఒక మనిషి తన జీవన కార్యక్రమంలో తనని తాను త్యాగం చేసుకుంటూ, సమర్పణ చెందుతూ వుంటే, అందులోంచి జయం పుట్టుకొస్తుంది. Fulfilment పుట్టుకొస్తుంది. త్యాగం లేకుండా పరిపూర్ణత రాదు. అలా త్యాగం చేసుకుంటూ వుండేవాడు జయించుకుంటూ వెళ్ళిపోతూ ఉంటాడు. ఎక్కడో ఎడారిలో, ఎవరో తన మీద విరోధం పెంచుకుని, తనని సిలువ వేసి చంపేస్తే, ఒప్పుకున్నాడు. ఆయన్ని సిలువ వేసి, జయించాం అనుకున్నారు ఆరోజుకి. ఆ తరువాత ఈయన మొత్తం భూగోళం అంతా జయించేసాడు. ఓడిపోయి గెలిచాడు. ఎలా ఓడిపోయి గెలిచాడు? తనని తాను సమర్పణ చేసుకున్నాడు. ఈ మధ్యకాలంలో అలా పురుషమేధం కి సమర్పణ చెందిన సిద్ధులు కనిపించరు. అంతకు ముందు వున్నాయి కానీ, Christదే latest. అంటే స్వచ్ఛందంగా తనని తాను సమర్పణ చేసుకున్నాడు. అది కారణంగా దివ్య శరీరంతో ఆరోజు నుంచీ ఈ రోజు వరకూ భూమి మీద వున్నాడు. అది ఒకటి. రెండవది ఎవరైతే తనని నిర్మూలించాలి, నామరూపాలు లేకుండా చెయ్యాలి అనుకున్న వారందరికీ కూడా, దిగ్భ్రాంతి చెందేలా వాళ్ళ ముందే విలయతాండవం చేసి విశ్వరూపం దాల్చేసాడు మొత్తం భూమ్మీద. ఎనభై శాతం మానవజాతి ఈరోజు క్రీస్తుని ఆరాధన చేస్తోంది. ఎలా జరిగిందీ? జయించాలనే భావన లేకపోవడంవల్ల జరిగింది. ఎలా జయించాడంటే, ఇక్కడ జయం అంటే యజము చేయబడ్డాడు. యజము చేయడం వల్ల వచ్చే జయం భగవంతుడు. కాబట్టి ఆయన్ని ఎవ్వరూ జయించలేరు. అలాగే శిబి చక్రవర్తి, హరిశ్చంద్రుడు, వీరందరూ అలా త్యాగం చేసిన వాళ్ళు. చేయడం వల్ల వాళ్లకి నిజమైన జయం వచ్చింది. మనకి వచ్చే జయం material గా వస్తూ వుంటుంది, పోతూ వుంటుంది. వచ్చినట్టుగా వుంటుంది రాదు. అందుకని నిజంగా జయం కలగాలంటే త్యాగం వుండాలి. అదే యజ్ఞం. Sacrifice. 'తస్మాత్త యజ్ఞాత్ సర్వహుతః' ఆ యజ్ఞం మొదలుపెట్టంగానే, అందులోంచి చాలామంది పుట్టుకొచ్చారు. ఎవరు? ఈయనే అన్ని రూపాలుగా వచ్చాడన్నమాట. ఒకడు పోయి వందమంది అయ్యాడన్నమాట. పురుషుడి తత్వం సృష్టిలో ఆహుతి చేయబడితే, అందులోంచి మొత్తం అన్నీ తానైపోయాడు. అలాగే త్యాగం చేసినవాడు ఇంత మందిలో జీవిస్తాడు. ఈరోజున మనం మాస్టరుగారికి ఎందుకు దండం పెడతాం? ఆయన చేసిన త్యాగనిరతి వల్లే కదా! త్యాగం చేయని వాళ్ళు ఎంతోమంది వున్నారు. వాళ్ళు వున్నప్పుడు ఎంతో పేరు వున్న వాళ్ళు. ఆ తరువాత జాతి మర్చిపోతుంది వాళ్ళని. ఎప్పుడైనా సరే అందరి హృదయాలలో జీవించాలి అంటే త్యాగం ద్వారా మాత్రమే జీవించగలరు. అమృతత్వం కూడా దాని వల్ల ఏర్పడుతుంది. దుర్ధరుడు

భగవంతుడు. అలాగే దుర్ధరత్వం సాధించిన మహాత్ములు వున్నారు, వాళ్ళు భాగవతోత్తములు. వాళ్ళని వాళ్ళు సృష్టి కార్యానికి సమిధలుగా సమర్పణ చేసుకున్నారు. దేనికి సమర్పణ అయ్యా అంటే, మన చుట్టూ వుండే జీవరాశికి సేవ చేసుకుంటూ సమర్పణ చెందిపోవడం. తద్వారా ఈ దుర్ధరత్వం మనకి కూడా ఏర్పడుతుంది. ఎందుకంటే భగవద్ తత్వంలో, భగవంతుని అండ చేరాలంటే ఇవన్నీ మార్గాలు. ఊరికే రోజూ ఆయన్ని సతాయించేసినంత మాత్రాన మనకి qualification ఏది ఆయన్ని చేరుకోవడానికి ? బాగా భజన చేసాం అనుకోండి, పొద్దున్నుంచీ రాత్రివరకూ, ఎక్కువ తృప్తి పొందడు. ఈ మార్గంలోనే ఎక్కువ తృప్తి పొందుతాడు.

## ౽౭౭ వాగ్మి

వాగ్మీ అంటే వాక్కు కలవాడు అని అర్థం. దానిలోంచే వాఙ్మయం అంతా వచ్చింది. వాక్కు గురించి చెప్పకుంటే మొత్తం ఋగ్వేదమంతా చెప్పకున్నట్లే. మనలోంచి ఆ వాక్కే వ్యక్తమై స్పందనం కలిగిస్తూ వుంటుంది. వాక్కు ఆధారంగా స్పందన కలుగుతూ వుంటే, స్పందన ఆధారంగా మళ్ళీ మనం ఇంకొక వాక్కు వైఖరిలోకి పట్టుకొస్తాం. వాక్ప్రవాహం ఆయన దగ్గర నుంచి బయలుదేరుతుంది. దాన్ని bible లో, in the beginning there was the word, the word was with God and the word was God అంటారు. వాక్కు అక్కణ్ణుంచి బయలుదేరి పరా పశ్యంతి మాధ్యమా వైఖరి గా బయటకి వస్తుంది. మనమే మన వాక్కు! మననే మనం ఉచ్చరించుకుంటూ వుంటాం. 'నేను' అనే చైతన్యం ఏదైతే మొత్తం విశ్వాత్మ చైతన్యంగా వ్యాపనం చెందిందో, అది మనలో ఒక కేంద్రంగా మేల్కాంచుతూ వుంటుంది నిద్ర లేచినప్పుడు. మొత్తం సముద్రంలోంచి ఒక అల ఎలా వచ్చిందో, మనం కూడా పొద్దున్న లేచేసరికి ఒక అలగా బయటకి వస్తాం సముద్రంలోంచి. అంటే మనని ఉచ్చరించాడన్నమాట. ఉచ్చరించగానే మనం వున్నాం అనుకుంటాం. వాడు ఉండటమే మనగా వుంటాం. మనం మేల్కాంచడం అంటే మనలో వాడు మేల్కాంచడం. 'ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యం దైవమాహ్నికం'. అంటే మనం లేచిన దగ్గరనుంచీ, వాడి దగ్గర నుంచి మనం లేచాం వాడు ఆధారంగా, వాడు ఎందుకు లేపాడో ఆ పని చెయ్యం. వీణ్ని లేపితే వీడు వాడి పని చేసుకుంటాడు, మన పని మరచిపోయాడు అనుకుంటాడు. మనం ఎవడికైనా lift ఇస్తే, ఆ తరువాత వాడి సంగతి వాడు చూసుకుని, మనని మర్చిపోతే, మనకి ఎలా వుంటుంది? అలా భగవంతుడు మనని లేపగానే, మనం busyగా మన పనులు మనం మొదలుపెట్టేసుకుంటాం కదా! అయినా మళ్ళీ మర్నాడు విసుగు లేకుండా మళ్ళీ లేపుతాడు, ఈ రోజు ఏమైనా వీడికి బుద్ధి వస్తుందేమో అని. మళ్ళీ అదే పని, మళ్ళీ అదే పని, మళ్ళీ అదే పని. కానీ నిజానికి ఆయన ఉచ్చరించడం చేత మనం నిద్రలేచాం. నిద్ర లేచిన వెంఠనే మనం ఆయన్నే ఉచ్చరించనివ్వాలి. జీవుడు దేవుడికి వాహిక, శరీరం జీవుడికి వాహిక. ఇలా 3 in 1, 1 in 3. ఆయన మనల్ని లేపినప్పుడు 'చెప్పండి సార్, మీ పనేవిటి ఈ పూటకి?' అని మనము అనాలన్నమాట. ఈ లోపలే మనం చాల పనులు చేసేసాం కాబట్టి, ఇవాళ అడిగితే కుదరదు. ఎందుకంటే, 'ఇవన్నీ పూర్తి చేసుకుని రా' అని చెప్తాడు. ఎందుకంటే, బయటకి వెళ్లి ఆయన పని చేద్దాం అనుకుంటే, మన పనులన్నీ అడ్డంగా వచ్చేస్తాయి. మనం ఇవాళ దేవుడి కార్యం మొదలుపెడదాం అనుకుంటే, మనం ఇదివరకు అప్పు తీసుకున్నవాడు వచ్చి, నా అప్పు ఎప్పుడు తీరుస్తావు అంటాడు. 'నేను దైవకార్యం చేస్తున్నాను నీ అప్పు గురించి అడక్క' అంటే దైవకార్యం తరువాత చేద్దూ గాని ముందు నా అప్పు తీర్చు, అంటాడు. మనని మనం ఉచ్చరించుకుని నిద్ర లేవలేదు కదా, ఉచ్చరించబడ్డాము, అందుకనే నిద్రలేచాం. ఆ ఉచ్చరణమే ఋగ్వేదం. అక్కడ ఆ ఉచ్చారణ జరిగితే, అక్కణ్ణుంచి అన్నీ పుట్టుకొచ్చి, ఆ పుట్టుకొచ్చిన వాటిల్లోంచి మనం పుట్టుకొచ్చాం. మనం ఎలా వచ్చాం? ఎవరికో ఒకరికి సంకల్పం వచ్చింది పిల్లవాణ్ని కందాం అని. దాని ఆధారంగా మనం దిగి వచ్చేసాం. రోజూ నిద్రలేవడం కూడా అలాగే లేస్తాం. ఎలా

లేస్తాం? We utter forth as a wave, ఒక పెద్ద సరస్సులో ఒక తరంగంలా వస్తాం బయటకి. వచ్చిన వాళ్ళం మళ్ళీ అందులోకి పోయే వాళ్ళమే. ఆ తరంగం ఉచ్ఛరించినది ఆయన కాబట్టి, ఆయన భావం కోసం లేచిన తరువాత వున్నామంటే, దివ్యమైన భావాల్లో conduct చేస్తూ వుంటే, చూసి ఆనందిస్తూ వుంటారు. వాళ్ళు నిజమైన యోగులు. అదే ప్రహ్లాదుడు వాళ్ళ నాన్నకి 'సర్వము అతని దివ్యకళామయము అటంచు విష్ణు నందు ఉల్లము చేర్చి' అని చెప్తాడు, మనం కొంచం పక్కగా వుంటే మనలో నుండి ఆయన work చేసిపెడతాడుట. మనం అవగాహన లేక చేస్తున్న పనికి అడ్డుపడితే అది ఆగిపోతుంది. అడ్డుపడిపోయాక, అడ్డుపడిపోయాం అని బాధ పడుతూ ఇంకా గొడవ చేసి ఇంకా ఎక్కువ అడ్డు పడిపోతాం. ఏం చెయ్యాలో తెలియక పాడుచేస్తాం. వాక్కు యొక్క ప్రవాహం అలా అనుస్యూతంగా జరిగిపోతూ వుంటుంది. దాని వెంట వెళ్ళిపోతూ ఉంటాడుట బ్రహ్మ. అతడి నాభిలోంచి కమలం వస్తే, కమలంలోంచి మనం బయటకి వస్తే, మనలోంచి సృష్టించాలి అన్న సంకల్పం సరస్వతి గా వస్తే, దాని వెంటపడి మనం వెళ్తే బ్రహ్మ సృష్టి అలా వచ్చేసింది. అలా వెళ్తూనే వుంది ఓ ప్రవాహంలా అది. అది వాక్ప్రవాహం. అది ఎక్కణ్ణుంచి వచ్చింది? సరస్వతీ దేవినుంచి రాలేదు. సరస్వతీ దేవి ఎక్కణ్ణుంచి వచ్చింది? బ్రహ్మలోంచి వచ్చింది. బ్రహ్మ ఎక్కణ్ణుంచి వచ్చాడు? కమలంలోంచి వచ్చాడు. కమలం ఎక్కణ్ణుంచి వచ్చింది? నాభి నుంచి వచ్చింది. ఎవరి నాభి? భగవంతుని నాభి, అంటే అవ్యక్తమైన తత్వం. ఆ తత్వం లోంచే వ్యక్తమయ్యాం మనం పొద్దున్నే. వ్యక్తమైన దగ్గర నుంచీ మనకి ఒక భావం వస్తుంది కదా, అది మన సరస్వతి! ఎవరి సరస్వతి వాళ్ళదే లేచిన దగ్గరనుంచీ. కానీ అందరిలోనుంచి వ్యక్తమయ్యే సరస్వతి ఒకటి వుంది అదే ప్రవాహం! ఆ ప్రవాహంలో చేరిపోవాలి. సరస్వతి అంతర్వాహిని కదా! అంతర్వాహినిలో చేరకుండా గంగ, యమున చూస్తాం. అంటే ఇడ, పింగళ లోకి పడిపోతాం. మనకి కనిపించేవి ఇడ పింగళ తప్ప సుషుమ్న ఎక్కడ కనిపించింది? గంగ యమునాయే తప్ప సరస్వతి ఎక్కడ కనిపించింది? త్రివేణీ సంగమం లో సరస్వతి నది అంతర్వాహినండీ, అంటారు. సత్యం! మనం చేసే పనులన్నిటికీ ఆ ఉచ్చారణే ఆధారం. అది లేకపోతే మనం చేసేది ఏమీ లేదు. ఉచ్ఛరింపబడడం వల్ల మేల్కొంచాము, ఉచ్ఛరింపబడడం వల్ల భావాలు వస్తున్నాయి. భావాలు ఉండటంవల్ల మాటలు, చేతలు వస్తున్నాయి. ఇదంతా సరస్వతే! ఇదంతా వాక్కే! ఎవరో ఒకావిడ 'నీ పేరు ఏంటిరా అబ్బాయి?' అని కృష్ణుడ్ని అడిగిందిట, చిన్నపిల్లవాడు కదా అని. గభాలున ఛెంగున ఎగిరి ముద్దు పెట్టుకుని వెళ్లిపోయాడుట. అదేమిటి? పేరు అడిగితే ముద్దు పెట్టుకుంటే ఏమైనా బావుంటుందా? వాక్ స్థానం అని చెప్పడానికి. దాని route కి పోవటానికి గుర్తు చేయడానికి symbolic గా చెప్పిన విషయం. వాక్కు యొక్క పుట్టుక స్థానం 'నేను'! అది వాగ్మీ అంటే! ఆ వాక్కు ఉచ్ఛరింపబడడం వల్ల జగత్తు, జగత్తులో జీవులు మేల్కొంచుతారు. మనం మేల్కొంచిన తరువాత భావంగా ఉచ్ఛరింపబడుతుంది. భావం కలగడం అనే ప్రక్రియ భగవంతుని యొక్క ఉచ్చారణే! వాక్కే! ఎటువంటి భావం కలిగింది అనేది మన సంస్కారం బట్టి ఉంటుంది. భావం భాషలోకి మారింది అంటే, సరస్వతి యొక్క ప్రవాహమే, వాక్కు యొక్క ప్రవాహమే. అలాగే భావం ఆచరణలోకి వచ్చిందంటే అది కూడా సరస్వతి యొక్క ప్రవాహమే. అంటే ఏమిటీ? జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలు వీటన్నిటినీ నడిపిస్తుంది

వాక్కు. అంటే మనని నిద్ర లేపి, మనకో భావాన్నిచ్చి, ఆ భావం ఆధారంగా ఇంద్రియాలని కదిలించి, శరీరాన్ని కదిలించి, మొత్తం అంతా కదిలించేది ఏదివుందో అది వాడి దగ్గర వుందిట. అది వాడే! తన నుంచి వ్యక్తమవుతే ఇవన్నీ వస్తూ వుంటాయి. ఆపేస్తే అన్నీ లోపలకి వెళ్ళిపోతాయి. అందుకని 'the one who knows the sound has known all' అన్నారు. ఈ వాక్కు యొక్క ఉత్పత్తి, ప్రవాహం అదే కాలంలో ఏ విధంగా ప్రవర్తించి పుట్టుక స్థానంలోకి వెళ్ళిపోవడం ఎవరికి తెలుసో వాడికి అంతా తెలిసినట్లే. మాట్లాడినప్పుడు మనం ఎలా మాట్లాడుతున్నాము? ఉచ్ఛ్వాస తీసుకున్నప్పుడు మాట్లాడలేము. మాటకి నిశ్వాస ఆధారం. నిశ్వాసకి ఉచ్ఛ్వాస ఆధారం. ఉచ్ఛ్వాస నిశ్వాసలకి స్పందన ఆధారం. స్పందనానికి స్పందనం చేస్తున్న వాక్కు ఒకటి వుంటుంది. అది అనాహతం. ఉచ్ఛరింపజేసే వాక్కు వుంటుంది. ఆ వాక్కుని 'రిషభము' అంటారు. ఇక్కడ ఉచ్ఛరించేది నాలుగో స్థితిలో. మన గొంతు దగ్గర vocal cords ఉంటాయి. తెలుగులో స్వరపేటిక అంటాం. అక్కడకి వచ్చేది నాల్గవ స్థితిలో. స్వరపేటిక లోకి రాక ముందు మూడు స్థితులు వున్నాయి. స్పందన కలిగేలా ఒక ప్రేరణ ఇస్తుంది. అది రిషభం. అక్కణ్ణుంచి మొదలై మనకి భావం గా మారి, భావం భాషగా మారి, భాష వైఖరిలో మనం బయటకి చెప్తాం. ఇవన్నీ ఎవరు? మనమే! అదీ తెలియాలి. ప్రతీసారీ ఉచ్ఛరింపబడేది మనమే అని తెలియాలి. మనమే మన భావంగా బయటకి వస్తున్నాం కదా! మన భాషతో బయటకి వస్తాం, మన శరీరం నుంచి బయటకి వస్తాం, వచ్చేది మనమే తెలిసినప్పుడు, ఈ వాక్కుగా వ్యక్తమవుతున్నది నేనే అని దర్శనం చేసి, వాక్కు వ్యక్తమయ్యే స్పందనానికి అవతలపక్క ఉన్నదాన్ని వినడం మొదలు పెడితే, అది లోపల ఒక ఝుంకార శబ్దంగా, ఓంకార శబ్దంగా వుంటుంది. అది వుండటం వలన, ఆ ఓంకారం అనే ప్రవాహం అనాహతంగా జరుగుతూ వుండటం వలన అందులోంచి ఒక్కొక్కరమూ చినుకుల్లాగా బయటకి వస్తూవుంటాం. ప్రవాహం లోంచి చిందులు బయటకి వచ్చినట్టు, ఒకో మాట, ఒకో చేత బయటకి వస్తూ వుంటాయి. ప్రవాహమే లేకపోతే, చిందులు లేవు. ఆ ప్రవాహంగా మనతో మొదటి నుంచీ చివరి వరకూ ఈ శరీరం వున్నంతకాలం వుండేది మనలో వాగ్మీగా భగవంతుడు ఉండడం. వాగ్మీ అని చెప్పడంలో అర్థం- భగవంతుని యొక్క శబ్ద రూపము! భగవంతుని శబ్దం ద్వారా గుర్తించడం ఒకటి వుంది. భగవంతుని వర్ణన ద్వారా గుర్తించడం ఒకటి వుంది. వెలుగుగా గుర్తిస్తారు. One is the sound aspect of the Lord; one is the colour aspect of the Lord తప్ప Lord Absolute కాదు అక్కడ. ఓంకారం తెలిసేసరికీ, ఓంకారాన్ని నడిపించేవాడిగా దాని వెనుక ఉంటాడు మళ్ళీ. కాబట్టి ఈ ఓంకారం లోపల జరుగుతూ వుంటే మనకి సుషుమ్నలో అది ఒక ఝుంకారనాదంలా ఉంటుంది. దాన్నే భ్రమర గీతం అన్నారు, దాన్నే అనాహతం శబ్దం అన్నారు. అది జరుగుతూవుంటే, అది ఆధారంగా మన అన్ని కేంద్రాలు ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి. పనిచేస్తూ వుంటే మనకి ఈ కార్యక్రమాలన్నీ నడుస్తున్నాయి. కాబట్టి, దాన్ని వినడం కోసం, దానితో అనుసంధానం చెందడం కోసం ఓంకారం చేస్తూ వుంటారు. ఆ వాక్కుగా మనలో వున్నవాడు అలాగే సృష్టిలో కూడా వున్నాడు. ఉండబట్టే ఇవన్నీ వున్నాయి. Withdraw చేస్తే కింద పడిపోతాం. మనలో కూడా ఆ ఝుంకారం జరగడం మానేస్తే శరీరం పడిపోతుంది.

మనలో ఆ విధంగా వున్న భగవంతుణ్ణి ధ్యానం చేసుకోవడం, దర్శనం చేసుకోవడం ఒక సాధన.

## 278 మహేంద్రః

మహేంద్రః అనే పదానికి అర్ధం ఇంద్రునకు ఇంద్రుడు అని. అందుకని భగవంతుని యొక్క నామాల్లో మహేంద్ర నామం ఒకటి చేర్చబడింది. ఇంద్రుడు సృష్టి నిర్వహణ కర్త. మనలో కూడా సమస్తమైన కార్యములను నిర్వర్తించే శక్తిగా పనిచేస్తుంటాడు. ఇదం ద్ర అంటే ఈ మొత్తాన్ని రక్షించే వాడు, పరిపాలించే వాడు అని. ఇంద్రుని స్వర్గలోక అధిపతిగా చెప్తారు. దేవతలను అందరిని కూడా నియమించి, సృష్టి కార్యాన్ని చక్కగా నిర్వర్తించే కార్యనిర్వహణ అధికారిగా మనం ఇంద్రుణ్ణి చెప్పకోవచ్చు. కార్యనిర్వహణ అధికారి నిర్వహించాల్సిన కార్యం అంతకు ముందే నిర్ణయం అయి వుంటుంది. నిర్ణయింపబడిన కార్యం నిర్వర్తించే వాడు అని అర్ధం. వాడిచే నిర్ణయింపడిన కార్యాన్ని చక్కగా అనుకున్న విధంగా నిర్వర్తించే వాడు కార్యనిర్వహణ అధికారి. అటువంటి అధికారం కలిగిన వాడు ఇంద్రుడు. అంటే సృష్టిలో దేవతలను నియమించి వాళ్ళందరిని సృష్టి ధర్మముల ప్రకారం ప్రవర్తింపచేసి, తద్వారా భగవంతునిచే సంకల్పింపబడిన సృష్టిని యధాతధంగా నిర్వర్తింపచేసేవాడు. మనకి మామూలుగా చిన్న చిన్న సంస్థలలో కూడా సిద్ధాంతీకరణ ఒకళ్ళు చేస్తే అంటే policy making body ఒకటి వుంటే దాన్ని నిర్వహించే వాళ్ళు ఒకళ్ళు వుంటారు. వాళ్ళని మనం Managing Director, Executive Director అంటూ వుంటాము. నిర్వహణ అధికారి నిర్వహించడమే తప్ప, నిర్ణయించడం ఆయన పని కాదు. ఏ పని చేయాలి అనేది నిర్ణయం పైనే జరుగుతుంది. అయితే నిర్వర్తించే వాడికి అధికారాలు వుంటాయి. లేకపోతే నిర్వర్తించ లేడు కదా! సృష్టిని వ్యక్తం చేసి ప్రజాపతులు మనువులు వచ్చిన తర్వాత కశ్యప ప్రజాపతి నుండి ఇంద్రుడు వచ్చినట్లుగా మనకి పురాణాల్లో కధ వుంది. అంటే అటు నుంచి దిగి వచ్చిన దాన్ని ఇట్లా ఇట్లా చేసుకుంటే బాగుంటుంది అని ఒక నిర్ణయం అయిన తర్వాత, ఆ నిర్ణయం ప్రకారం నిర్వర్తించేవాడు అన్నమాట. ఎక్కడ నిర్వహణ అధికారి బాగా పనిచేస్తాడో అక్కడ కార్యక్రమాలు చక్కగా నిర్వర్తింపబడతాయి. అది లేనిచోట కార్యక్రమాలు అడ్డగోలగా వుంటాయి. చక్కగా నిర్వర్తించబడిన కార్యంలో నుంచి అనుభూతి వస్తుంది. అందుకని సృష్టిలో ఇట్లా చక్కగా నిర్వర్తిస్తూ వున్నప్పడు ఆ సృష్టిలో సమస్త దేవతలు, పితృ దేవతలు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు అందరూ ఆయన నియమించిన ప్రకారం పని చేస్తూ వుంటారు. ఆయన ఎలా నియమిస్తాడు అంటే భగవంతుని సంకల్పం మేరకు నిర్వహిస్తాడు. ఇంద్రునికి ఎప్పడన్నా భగవత్ సంకల్పానికి వ్యతిరేకంగా భావం కలిగితే, అతనికి పతనం కలిగినట్లుగా మనకి పురాణాల్లో వుంది. అలాగే మనలో కూడా ఇంద్రియములకు అధిపతిగా ఇంద్రుడు వున్నాడు. మనలో ఇంద్రియములను నియమించి తద్వారా బహిర్గతమైన ప్రపంచములో మనకి అనుభూతి కలిగించడానికి మనలో పనిచేస్తున్న అధిదేవతగా ఇంద్రుణ్ణి చెప్తారు. కాబట్టి ఇంద్రత్వం అంటే ఇంద్రియములను నియమించే స్థితి. ఎట్లా నియమిస్తాడు అంటే భగవత్ సంకల్పం మేరకు నియమించి, పనిచేయించి, అనుభూతి కలిగేటట్లుగా చేస్తాడు. భగవత్ సంకల్పం ఏమిటో తెలిసి ఇంద్రుడు సృష్టి నిర్వహణ చేస్తున్నాడు. అలాగే ప్రతిజీవి దేవుని యొక్క వాహిక లేక వాహనం. జీవునకు వాహనం శరీరం. అంటే మనకు మన శరీరం

వాహనం. దేవుడు తన యొక్క ప్రణాళిక జీవుడి ద్వారా నిర్వర్తించుకుంటాడు. జీవుడు లేకపోతే దేవుడుకి ఇంక activity లేదు. కాబట్టి దేవుడు తన సంకల్పాలు నిర్వర్తించు కోవడానికి జీవుని పుట్టించి, జీవుడి ద్వారా work out చేస్తుంటాడు. మనకు వచ్చిన సంకల్పంలో నుంచి మనం కూడా ఏమన్నా పని చేయాలంటే, కొంత మందిని చేర్చుకొని, వాళ్ళ ద్వారా పని చేస్తూ వుంటాము కదా! సంకల్పం వచ్చిన దాన్ని నిర్వర్తించే ప్రజ్ఞ ఇంద్రుడు! సంకల్పం ఇంద్రుడిది కాదు. Order వచ్చింది దాన్ని నిర్వర్తించండి అని చెప్తారు. అది కదా Managing Director కి Board of Directors చెప్తారు. భగవంతుని యొక్క సంకల్పాన్ని నిర్వర్తింప చేసే ఇంద్రుడు మొత్తం సృష్టి అంతా ఆవరించి వుంటాడు. అంటే సృష్టి యొక్క మనస్సుగా చెప్పకోవచ్చు. ఇంద్రియాలకి అధిపతి అయిన ఇంద్రుడు మనస్సులో కూడా పని చేస్తాడు. అట్నుంచి వచ్చే సంకల్పాన్ని తన యందు గర్భితం చేసుకొని, తను దర్శనం చేసుకొని ఆ దర్శనం చేసుకొన్న సంకల్పాన్ని రూపకల్పన చేయడం అన్నమాట. మనం రేపు దుర్గా పూజ చేసుకుందాం అనుకుంటే అది సంకల్పం! ఆ సంకల్పం ఎవరిది అంటే అమ్మవారిది అనుకోవాలి. ఎందుకంటే దుర్గాపూజలు మనం చేద్దాం అనుకుంటే చేయలేము, చేయకూడదు అనుకుంటే ఆపలేము. అది అంతే! ఆమె చేయించుకోదల్చుకుంటే అట్లా చేయించుకుంటుంది అది జీవుని యొక్క వాహికగా. సంకల్పం వచ్చిన తర్వాత నిర్వర్తించడానికి సంబంధించిన ప్రణాళికను తయారు చేసుకొని నిర్వర్తింప చేసే ప్రజ్ఞ మనలో ఏదైతే వుందో అది ఇంద్రుడు! ప్రణాళిక నిర్వర్తింప చేయాలి అంటే మనలో ఇంద్రుడు అనే ప్రజ్ఞకి ఇంద్రియాలు సహకరిస్తాయి. ఇంద్రియముల ద్వారా సంకల్పింపబడిన విషయానికి ఒక రూపకల్పన చేసి, ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వేసి నిర్వర్తిస్తే, సూక్ష్మ లోకాల నుంచి మనకు వచ్చిన సంకల్పాన్ని అవతరింప చేయడానికి అవకాశం వుంది. అయితే సంకల్పాలు నిర్వర్తింపచేయడంలో పారిశుధ్యం, పవిత్రత లేకపోతే రకరకాల అవరోధాలు వస్తుంటాయి. అందుకని అటుప్రక్క వాళ్ళు సంకల్పిస్తే, ఇటుప్రక్క దాన్ని నిర్వర్తించే వాడు, రక్షించే వాడు ఇంద్రుడు! ఇదం అంటే ఇది అని. ద్ర అన్న పదానికి సంస్కృతంలో అర్థం రక్షించడం. ఇటు ప్రక్కవి రక్షిస్తాడట. మనం మనసుతో ఎంత తాపత్రయం పడుతామో మనకు వున్నవి రక్షించుకోవాలని! ఇటు ప్రక్కవి రక్షించడానికి మనసు, ఇంద్రియాలు, శరీరం. ఈ ఇంద్రియాలు, శరీరం మీద ఆధిపత్యం మనసుకు. అటుప్రక్క నుంచి వచ్చిన సంకల్పాన్ని నిర్వర్తించడం ఎలా అనేది ఒకటి వుంటుంది. సంకల్పం రాంగానే అట్లా బయలుదేరి వెళ్ళిపోతే అవదు పని. ఇల్లు కడదాం అనే సంకల్పం రాగానే గబగబా ఇటుకలు, సున్నం, సిమెంటు, కలప తెచ్చేసుకొని మనం ఏదో కట్టేద్దాం అనుకుంటే ఇల్లు అయిపోదుకదా! సంకల్పం రావటమే ఋగ్వేదం అన్నారు. వచ్చిన సంకల్పానికి రూపకల్పన చేయాలి. అది ఎలా చేయాలి? How to do it? దాన్ని Know how అంటారు. మనకి పరిశ్రమలు నిర్మాణం చేసేటప్పుడు, దాన్ని నిర్మాణం ఎలా చేయాలో ఒక know how ఉంటుంది. అంటే ఎట్లా చేయాలి అనేది తెలుకోవడమే! ఏ పని చేద్దామనుకున్నా మనకి లేడికి లేచిందే వేళ అన్నట్టుగా పరిగెత్తకుండా వచ్చిన సంకల్పాన్ని దగ్గర వుంచుకొని, దాన్ని ఏవిధంగా నిర్వర్తించాలి అని, దానికి చక్కటి ప్రణాళిక వేసే ప్రజ్ఞ ఏదైతే మనలో వుందో అది ఇంద్రుడు! వచ్చిన సంకల్పాన్ని నిర్వర్తించడానికి కావలసిన శ్రద్ధ, దాన్ని గురించి ఆలోచించి, దానికి చక్కటి ప్రణాళిక వేసి దానికి సంబంధించిన

వనరులను, మిగతా జీవులను పోగేసుకొని కాలాన్ని చూసుకొని, దేశాన్ని చూసుకొని, పరిసరాలను చూసుకొని, ఆ కార్యం నిర్వరించాలి. అది చేయడంలో వుండే పవిత్రత, మనం చేకూర్చిన వాటి పవిత్రత బట్టి సిద్ధి వుంటుంది. దుర్గాపూజలు మనకు అనుభూతి ఇవ్వాలి అంటే మనం తెచ్చుకొనే, మనం వండుకొనే, మనం అక్కడ చేసుకొనే అన్నిటిలోనూ ఎంత పవిత్రత ఉంటే అంత సిద్ధి! సిద్ధి అంటే అనుభూతే! ఏ పని అయినా అనుభూతి కలిగేటట్లుగా చేసుకోవాలి. వండుకొని తింటాం కదా! ఏదో బజారులో తిరగడానికి తింటున్నాం, అన్నట్లు ఉంటుంది. చాల హడావుడిగా తినేసి వెళ్లిపోతుంటాం కదా! ఎప్పుడూ పరిగెత్తటమే! ఉద్యోగం కోసం ప్రొద్దున తినడం, ఉద్యోగంలో మధ్యాన్నం ఏదో గబగబా కొంచెం తినడం, మళ్ళీ సాయంత్రం ఇంటికి వచ్చాక ఏదో తినడం. అట్లా తినడం కాదు, ఏ పని చేసినా సరే, చేసే పనికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక మనసులో వేసుకొని అలా చేయాలి. ఏం చేయాలి అనేది ముందు. ఎలా చేయాలి అనేది యజుర్వేదం! యజుర్వేదము plan of work అన్నారు. plan లేకుండా work చేస్తే ఏదో అవుతుంది తప్ప సరియైన పద్ధతిలో అవదు. ఎట్లా వండుకోవాలో తెలియకుండా వంట చేస్తే, ఆ వంట ఎట్లా తినలేమో, చేసే పనులు ఎలా చేయాలో తెలియకపోతే అంత అస్తవ్యస్తంగా వుంటాయి. చాలా మందికి చేద్దాం అనే ఆవేశం ఎక్కువ వుంటుంది, చేయడం ఎలా అనేది తెలీదు. అంటే మనలో ఇంద్రుడు లోపించడమే! తన ప్రణాళిక నిర్వర్తించుకోవాలంటే నరుడిగా, నారాయణుడు పని చేస్తాడు అని చెప్తారు. నర నారాయణులు దిగి వచ్చి పని చేస్తారు అని కదా! అర్జునుని పట్టుకొని కృష్ణుడు భారతయుద్ధం జయించి ధర్మ సంస్థాపన చేయించినట్లు, నరుడు వాహిక నారాయణునికి. కాబట్టి ఈ నరుడు ఎటువంటి వాడు అయివుండాలి అంటే ప్రశాంతమైన మనస్సు కలిగి వుండాలి. ఏది ఏ విధంగా చేయాలో అనే సరియైన అవగాహన కలిగిన వాడై వుండాలి. మనం చేసే పనులు అన్నీ కూడా అలా చేసుకుంటే ఇటుపక్క చేసుకున్నవి రక్షింపబడుతాయి. ఇటుప్రక్క చేసుకోవడం అంటే మనలో కలిగే ఆలోచనలకి మనం ఒక సృష్టి చేస్తున్నాం కదా! మనం ఇది చదువుకొందాం, ఈ ఉద్యోగం చేసుకుందాం, ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుందాం, పిల్లల్ని కందాం, వీళ్ళకి చదువు చెప్పిస్తున్నాం ఇలా ఒక రకమైన సామ్రాజ్యం వుంటుంది ప్రతివాళ్ళకి. ఇదంతా ఎక్కడ నుంచి వచ్చింది? మనలో నుంచి వచ్చిందే! మనం పెళ్ళి చేసుకుందామనే సంకల్పమే లేకపోతే తర్వాత సృష్టే లేదు! వచ్చింది కదా! వచ్చినప్పుడు ఎటువంటి స్త్రీని వివాహమాడాలి? ఎలా వుండాలి ఆ స్త్రీ తో? ఎటువంటి కాపురం ఏర్పరుచుకోవాలి? ఏది ఆశయంగా పెట్టుకోవాలి? ఇవన్నీ తెలిసి జీవించడం అనేది ఒక పద్ధతి వుంది. ముందు తెలిసికొని తర్వాత చెయ్యి. లేకపోతే చేసిన దానిలో నుంచి చేసే తప్పలను, వాటిలో నుంచి వచ్చిన అనుభవములను చూసి, తప్పులు దిద్దుకొని, మళ్ళీ సరిగ్గా చేసుకుంటూ వుండాలి. అయితే చేసి తప్పలు వచ్చిన తర్వాత తప్పలు దిద్దుకోని వాళ్ళని ఎవరు ఏమీ చేయలేరు. చెయ్యడం వలన తెలియడం వుంటుంది. తెలియడం వలన చేయడం వుంటుంది. తెలిసి, చేయని వాడి వల్ల ఉపయోగం ఏమీ లేదు. తెలియక చేసిన వాడి వల్ల ఉపయోగం అంత లేదు. మన భారతీయులకు ఇది చాలా ముఖ్యమైన భగవంతుని నామం, ప్రత్యేకించి సాధన చేసుకోవలసినది, మనం ఎట్లా పడితే అట్లా చేస్తూ వుంటాము. వాడు మనకి సహాయం చేయట్లేదు అనుకుంటూ వుంటాము. Wire,

plug అన్నీ సరిగ్గా connect కాకుండా current రాకపోతే దేవుడు కరుణించ లేదు అన్నట్టుగా వుంటుంది మన జాతి. ఇంటి వరకు current వుంది, మన current connection సరిగ్గా లేక మన వరకు రాదు, ఎట్లా పెట్టుకోవాలో తెలియక. అట్లా మనము ఎట్లా పడితే అట్లా వుంటే అటు నుంచి వచ్చే సంకల్పాన్ని ఇటు అవతరింప చేసే అవకాశం లేదు. అది ప్రాశ్చాతులలో మనకన్నా చాలా ఎక్కువ వుంది. వాళ్ళకి అటుప్రక్క తెలియక పోవచ్చు, కాని వచ్చింది వచ్చినట్లు ఆకళింపు చేయగలిగిన సామర్థ్యం వాళ్ళలో కనిపిస్తుంది. మనలో ఎందుకు కనిపించదు అంటే మనం ఎట్లాగైనా వుండవచ్చు అనుకుంటాం. చొక్కాకు గుండీ వుండకపోయినా పర్వాలేదు, లుంగి చినిగిపోయినా పర్వాలేదు. అన్నం ఎట్లా తిన్నా పర్వాలేదు, ఎక్కడ తిన్నా పర్వాలేదు. ఏం తిన్నా పర్వాలేదు. అలా వుండబట్టి ఏమవుతుంది అంటే ఇటు ప్రక్కది అంతా మనకు రక్షింపపడదు. ఇటు ప్రక్కది రక్షింపబడాలంటే మనసునందు ఒకరకమైన పారిశుధ్యం వుండాలి. మనకి మనసు పారిశుధ్యం భగవంతుడు ఇచ్చిన తత్త్వం! అది ఎందుకు పోయిందంటే, మనసుమాట అనేది ఇంద్రియాలు వినడం మానేసి, ఇంద్రియాల నుంచి, శరీరం నుంచి వచ్చేది మనసు వినటం మొదలుపెట్టింది. మామూలుగా దైవ సంకల్పం దిగి వస్తే వచ్చిన సంకల్పాన్ని మనసు అందుకొని, మనస్సు ఇంద్రియాల ద్వారా, శరీరం ద్వారా బయట దాన్ని నిర్వర్తింప చేసి, అవతరింపచేయాలి. అప్పుడు సంకల్పం సిద్ధి పొందుతుంది. వాళ్ళూ సంకల్ప సిద్ధులు! అంటే వారికి తలపెట్టిన కార్యం తలపెట్టినట్లుగా అయిపోతూ వుంటుంది. ఎందుకు అయిపోతుందంటే తలపెట్టిన దానికి ఒక ప్రణాళిక వుంటుంది. ఆ ప్రణాళికకు కావలసిన వనరులన్నీ చేకూర్చుకొని, తద్వారా వాటిని నిర్వర్తించడం వుంటుంది. ఈ ఇంద్రుని యొక్క ప్రజ్ఞ లోపించినప్పుడు, వచ్చింది వచ్చినట్లుగా ఒక place, ఒక time ఏం చూసుకోకుండా అడ్డగోలగా మొదలు పెట్టేస్తారు. అది అడ్డగోలగా వుండిపోతుంది. దాని వల్ల బాధ పెరుగుతుంది. వాళ్ళు అట్నుంచి విని ఇటు చేసుకోవాల్సింది. అటు ఉన్నవాడు విష్ణువు. ఇటు ఉన్నవాడు ఇంద్రుడు. ఇంద్రావిష్ణువు అంటే అది! ఇద్దరూ లేకపోతే పని అవదు. అటు కూర్చున్న వాళ్ళ మాట విని, ఇటు తీసుకు రాలేకపోతే అది ఎంతవున్న దాని వైభవం నలుగురికి అందించలేరు. ఇటువున్న వాడు అటు మాట వినక పోతే పని కాదు. ఇంద్రుడు ఎప్పుడయితే విష్ణువుని మర్చిపోతాడో, అప్పడల్లా ఇబ్బందులు పడ్డట్లుగా పురాణాలలో వుంది. అటుప్రక్క నుంచి ఇటు తీసుకురావడానికి నేను వున్నానని మరచిపోయి, ఇటుప్రక్క వున్న దాంట్లో వ్యామోహం పెరుగుతుంది. అట్నుంచి ఇటు వస్తుంటే సరఫరా ఇట్నుంచి అటు వచ్చే దానినిగా చూస్తాం. ఇట్నుంచి అటు వచ్చేటట్లుగా అయితే శరీరం కోరుకున్నది, ఇంద్రియాలు కోరుకున్నవాటికి మనస్సు బానిస అయిపోయి, ఇంద్రియాలు కోరుకున్నవాటినే దేవుణ్ణి కోరడం అవుతుంది. అంటే ఇంద్రుడు సింహాసనం కోరుకుంటాడు తప్ప భగవంతుని కోరుకోడు. అట్లాగే మనం కూడా ఇటుప్రక్క తయారుచేసుకున్న వాటిని కోరుకొని ఇది ముఖ్యం అవటం, అది తక్కువ అవటంవల్ల అటునుంచి ఇటు సరఫరా చేసే ప్రజ్ఞ విషయంలో తికమక అయిపోతుంది. తల్లక్రిందులు అయిపోతుంది. అప్పుడు ఇట్నుంచి ఇంద్రియాల రూపంలో బహిర్గతమైన ప్రపంచంలో నుంచి వచ్చిన కోరికలను నెరవేర్చుకోవడం కోసం అటు దేవుడికి విన్నపాలు పెరిగిపోతాయి. ఈ పనులు చేసి పెట్టమని మనం ఒకణ్ణి పెట్టుకొని, వాడ్ని పిలిచి ఈ పని

చేయరా అంటే, అది సరే కానీయండి, నాకు ఆ పని చేసి పెట్టండి, అని వాడు మనని అడిగితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. జీవుడు దైవం యొక్క అంశ! దైవం యొక్క కార్యములు జీవుడి ద్వారా నిర్వర్తించబడుతున్నప్పుడు జీవుడికి మనస్సు, ఇంద్రియాలు, శరీరం ఇస్తారు. వీరు వాడికి చెప్తూ వుంటే ఆయన పని వీళ్ళు చేయడం మానేసి, పై వాళ్ళకు చెప్తారట నా పని నీవు చేసి పెట్టమని. అప్పుడు ఆయన వెళ్లి దాగుకుంటాడు, కనపడడు. ఎప్పుడు అయితే మనకు ఇటు ప్రక్కవి ముఖ్యమైతే అటు కనపడడం మానేస్తుంది. కానీ అటు ప్రక్కవి ముఖ్యం. దాన్ని ఇటు తీసుకురావడంగా పెట్టుకుంటే అన్నీ చక్కగా ఒక order లోకి వస్తాయి. జీవాత్మ తత్వంలో వుండే బుద్ధి అనే వెలుగు, ఆ వెలుగులో పని చేసే నిర్వహణ అధికారి మనస్సు. వాడి క్రింద ఐదు ఇంద్రియాలు, శరీరం, కలిసి అటునుంచి ఇటు పని చేస్తూవుంటే బాగుంటాయి. ఇటు నుంచి అటు పని చేయడం మొదలు పెడితే అన్నీ గందరగోళం. ఎంతో భక్తులు అనుకొనేవాళ్ళు కూడా చేసేది ఏమిటంటే, ఇటు ఇంద్రియాలతో బహిర్గతమైన ప్రపంచంలో జరుగుతున్న సన్నివేశాలలో మనకు ఏర్పడుతున్న వాటి గురించి, ఇటు నుంచి అటు పంపిస్తుంటారు. కాగితాలు అందిస్తుంటాం ఇటు నుంచి అటు. అందిస్తుంటే భగవంతుడు కరుణామయుడు కాబట్టి అది తీరుస్తూ వుంటాడు. తీరుస్తూవుంటే ఇంకా కొన్ని పెంచుకొంటు వుంటాం. అవీ తీరుస్తూ వుంటాడు. ఇంకా పెంచుకుంటాం. దాన్ని తీరుస్తూ వుంటాడు. ఎంతసేపటికీ వీడికి తృప్తి లేదు అన్న తర్వాత తీర్చడం మానేస్తాడు. మొదట్లో బాగానే వుండేదండి దణ్ణం పెట్టుకుంటే ఇప్పుడు ఎందుకో జరగడం లేదు, అంటూ వుంటారు. ఎన్నాళ్ళు ఇలా ? క్రింద వాడు పని చేయడానికి పై వాడు, క్రింద వాడు అడిగినవి ఏదో చేసి పెడుతూ వుంటే, ఎప్పుడూ క్రింద వాడే పై వాడికి చెప్పడం మొదలు పెడితే ఎట్లా ? ఇంద్రుడు ఎటువంటి వాడు అంటే ఆత్మతత్వం నుంచి ప్రసారమయ్యే ప్రణాళికని నిర్వర్తింప చేసే వాడు. నిర్వర్తింప చేసే వాడు తను గ్రహించి దాన్ని వర్తింప చేస్తాడు. అది జీవుడి దగ్గర నుంచి ప్రసారం అవడం మొదలు పెట్టినప్పుడు, జీవుడి యొక్క జన్మ సార్థకం అవుతుంది. ఇతను ఎందుకు వచ్చాడో దానికి సంబంధించిన కార్యక్రమం చేసుకోడానికి వీలుపడుతుంది. లేకపోతే manager చెప్పినట్లు owner వినడం మొదలు అవుతుంది. శరీరం జీవుడికి సంబంధించినది. జీవుడు దేవుడుకి సంబంధించిన వాడు. అందుకని నీ సంకల్పం ఏమిటో దాని మేరకు పని చేసే శక్తిని నాకు ఇవ్వు, అని ప్రార్థన చేసుకోవాలి. భగవంతుని యొక్క సంకల్పం ఏమిటో! మనం ఇట్లా తీసుకొని రాబడ్డాం కాబట్టి 'మనం ఎందుకు వచ్చాం ?' అని ప్రతి రోజూ ప్రశ్న వేసుకోవాలి. Office వాళ్ళు మనల్ని ఏదన్నా ఊరు పంపిస్తారనుకోండి, వాళ్ళు ఎందుకు పంపించారో మరచిపోయి, మన పని ఏదో చేసుకుంటే ఎట్లా వుంటుందో, అట్లాగే ఇక్కడకు వచ్చిన తర్వాత ఇక్కడకు ఎందుకు వచ్చామో మర్చిపోయి ఏమిటేమిటో చేస్తున్నాం. అందుకని పెద్దలు ఏం చెప్పారంటే ప్రతి రోజూ లేవంగానే నేను ఏమి చేయాలి ? నేను ఎవరు ? అని ప్రశ్నించుకోమన్నారు. అవి బ్రహ్మకు పడ్డ ప్రశ్నలే! ప్రతి రోజు వేసుకోవాలి. నేను ఎవరు ? నేను ఏం చేయాలి ? అని నువ్వు శ్రద్ధగా అడిగితే నువ్వు ఏం చేయాలో ఆ రోజు వస్తుంది. అసలు ఏం చేస్తున్నావు అని ముందు ఒక ప్రశ్న వేసుకో ? నువ్వు చేస్తున్నవి అన్నీ పనికి వచ్చేవా ? పనికి రానివా ? ఎందుకు చేస్తున్నావు ? ఇవన్నీ చేయాలా, అక్కర లేదా ? ఏంచేయాలి ? అని ప్రశ్నించుకోవాలి. అందుకని పెద్దలు, ప్రొద్దున పూట ప్రతి వాళ్ళు తమకని ఒక 15 నిముషాలు పెట్టుకోమన్నారు. లేచిందే

పరుగులా కార్యక్రమాలు అవటం వల్ల, మనకు ఈ ప్రశ్నలు వేసుకొనే సందర్భమే రాదు. రాకపోవడం వల్ల మనం లేచేసరికే మన programme అంతా రెడీగా ఉంటుంది కాబట్టి, అది మనల్ని సాయంత్రం వరకు తిప్పేస్తే, అలసి పడుకుంటాం, మళ్ళీ ప్రొద్దున లేవగానే అదే పని! కాబట్టి తెమలదు. అందుకని ఈ చేస్తున్నది ఏమిటో ఒక సారి చూసుకొని, ఇందులో పుచ్చు, చచ్చు తీసేసి అందులో సరకు మాత్రమే వుంచుకొని మిగతాదంతా ప్రక్కన పెట్టగలగాలి. నిజంగా జీవితాన్ని పొట్టు జీవితంగా కాకుండా, గింజ జీవితంగా చేసుకోవాలి. రోజూ దైనందిన కార్యక్రమంలో ఏ విధంగా సమయాన్ని వినియోగిస్తున్నాం అని మనం చూసుకుంటె అందులో పనికి రానిది చాలా కనిపిస్తుంది. అనవసరమైన విషయాల యందు సమయాన్ని వెచ్చించడంతో మానవాళి దారి తప్పింది. అలా కాకుండా చూసుకుంటే మనం ఏం చేయాలి అనే దానికి దగ్గర అవుతాం. ఈ ప్రశ్న వేసుకున్నాక ముందు Essentials and Non essentials మనకు తెలుస్తాయి. Essentials చేసుకుంటూ వుండడమే. Non essentials కి option పెట్టుకోవాలి. బొత్తిగా పనికి రానివి చేయనే కూడదు, కాలం వృధా అవుతుంది కాబట్టి. ఆ విధంగా మనం వర్గీకరణం చేసుకోవాలంటే మనస్సు వుండాలి. అది మనస్సు చేయగలదు. ఏమిటి office ఇట్లా వుంది అని manager ఒక్కసారి review చేస్తుంటే, తను చేయవలసిన pending బోలెడు కనిపిస్తే, అక్కరలేనివి బోలెడు చేస్తున్నట్లు కనిపిస్తాయి. నిజానికి ప్రతి office లో జరిగేది ఇదే! పెద్ద పెద్ద officers ఇంటికి files తెచ్చుకొని చూసుకుంటారు. ఎందుకంటే ఆఫీసులో వాళ్ళు అనుకున్న పని చేయలేక! అది నిర్దిష్టంగా నిర్ణయించుకొని పని చేయడానికి చాలా సామర్ధ్యం కావాలి. అలా చేసుకుంటే essentials గా వుండడానికి వీలు వుంటుంది. జీవితంలో మనకి ఏది అవసరమో దాని యందు జీవిస్తూ ఉన్నట్లయితే అప్పుడు మనకి నియమించడం అనేది ఏర్పడుతుంది. అలా నియమించడం ఏర్పడితే ఇంద్రియాలను నియమించడంగా కూడా వస్తుంది. అవసరం లేకుండా మనం బోలెడు తింటూంటాం. అవసరం లేకుండా బోలెడు మాట్లాడుతుంటాం. అవసరం లేకుండా కన్ను, ముక్కు, చెవి, చర్మం ఇవన్నీ వాడుతుంటాం. నిజానికి రెండు ఇంద్రియాలు మనల్ని బాగా బంధించి వుంచుతాయి. అవి ఒకటి నాలుక, రెండు స్పర్శ. నాలుక రెండు పనులు చేస్తుంది. మన చేత మాట్లాడిస్తూంటుంది. మనకు లోపల తిండి వేస్తుంటుంది. మనకు పనికి వచ్చేదా కాదా అని తెలిసి కూడా, ఎంతో లోపల వేసి మనం బోలెడు రకాలుగా శరీరాన్ని పాడుచేసుకుంటున్నాం కదా! మాట మీద నియమం లేని వాడికి తిండి మీద నియమం వుండదు. తిండి మీద నియమం లేనివాడికి మాట మీద నియమం వుండదు. ఇందులో ఏం సందేహము లేదు. ఒకటి వుంటే రెండోది ఉంటుంది. ఒకటి మంచిది అయితే రెండో దాన్ని ఉద్ధరించుకుంటూ వస్తుంది. ఒకటి చెడ్డది అయితే రెండో దాన్ని పాడు చేసుకుంటూ వస్తుంది. మాట నియమం, తిండి నియమం అదే మనకు బయటి ప్రపంచంతో connection. ఈ ప్రపంచానికి, మనకి పదార్థమయమైన సంబంధం నాలుకతో, స్పర్శతో వుంటుంది. కళ్ళతో చూసిన దానికి అంత భౌతికమైన స్పర్శ లేదు. వినడంలో అంత భౌతికమైన స్పర్శ లేదు. వినటంలో, చూడడంలో, వాసన చూడడంలో కన్నా ఎక్కువ, మనకు భౌతికంగా స్పర్శ నిచ్చేది తిండి. స్పర్శ. ప్రతిదీ ముట్టుకుందాం అనే భావన ఎవరికైతే వుంటుందో వాళ్ళందరికీ శరీరం మీద మమకారం పోదుట. అది పతంజలి మహర్షి చెప్పిన విచిత్రం. శరీరం మీద మమకారం పోవాలంటే

దేన్నీ ముట్టుకుందాం అనే తాపత్రయం ఉండకూడదు ఒకటి. రెండోది నోటి నుండి లోపలికి వెళ్ళేది ఏది, ఎంత అవసరమో అది తప్పించి ఇంకొకటి తీసుకోనటువంటి ధైర్యం ఉండాలి. నియమం ఉండాలి. అదే చెప్తాడు శ్రీకృష్ణుడు ఉద్ధవుడుతో ఉద్ధవ గీతలో! 'ఇంద్రియాలని జయిద్దాం, ఇంద్రియాలని జయిద్దాం అని తాపత్రయపడుతుంటారు. ఆహారాన్ని నియమం చేసుకుంటే అక్కడ నుంచి అన్ని ఇంద్రియాలు మనకు సహకరిస్తాయి' అని చెప్తాడు శ్రీకృష్ణుడు. ఆహార నియమం లేని వాళ్ళకి ఏ ఇంద్రియం సహకరించదు అని చెప్తాడు. Taste is the leader ట. రుచి మరిగిన వాళ్ళు బహిర్గతమైన ప్రపంచంతో చాలా గట్టి సంబంధం పెట్టుకుంటారు. మనకు మామూలుగా అవసరం కన్నా availability is the basis, ఉంది కదా అని తింటాం. Table మీద sweets డబ్బా ఉంది అనుకో, అట్లా పోతూ sweet కనిపిస్తే తీసికొని నోట్లో వేసుకుంటాం. మనకి ఇంద్రుడు పనిచేయలేని దానికి ముఖ్య కారణం, మనకి తిండి మీద నియమం లేక పోవడం. అది నియమించుకున్నప్పుడు మళ్ళీ ఇంద్రుడికి బలం వస్తుంది. మామూలుగా మనలో ఇంద్రియాలే ఇంద్రుణ్ణి జయించి వున్నాయి. ఆ స్థితి దాటాలంటే ఎట్టి పరిస్థితిలోనూ ఒక నియమాన్ని ఉల్లంఘించనటువంటి స్థితి వుండాలి. అది ఉన్నప్పుడు మనకి మళ్ళీ పైలోకాలతో సంబంధాలు ఏర్పడడానికి అవకాశం వుంది. రుచులు నియమించబడనప్పుడు మాటకు కూడా నియమం వుండదు. ఈ రెండూ ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది మనల్ని నడిపిస్తూ వుంటాయి. అందుకనే రుచి నియమాలు వచ్చినాయి ఆధ్యాత్మిక సాధనలో. అది తప్ప ఇంకొకటి తీసికోనని నియమించుకోవాలి. మహర్షుల విషయంలో అట్లాగే వుంటాయి. వాళ్ళు ఏది తినాలో, ఏది తినకూడదో ఒక నిర్ణయం చేసికొని దాని ప్రకారం జీవిస్తారు. ఏం తినాలి, ఎప్పుడు తినాలి, ఎంత తినాలి. ఇలా అన్నీ నిర్ణయించుకుంటారు. మిగతా సమయములో మీరు గీ పెట్టినా వాళ్ళు తినరు. మొహమాట పెట్టినా తినరు. మనం మొహమాట పెడితే తింటాం. ఎందుకంటే లోపల మనకి దానికి సంబంధించిన కోరిక, మోహం వుండిపోవడం చేత. ప్రకృతిలో మానవుడు తప్ప మిగతావేవీ అట్లా తినవు. మాస్టారు ఒక example ఎప్పుడూ చెబుతుండేవారు. గేదెకి ఒక bucket కుడితి పెట్టిన తర్వాత, ఒక అర గంట తర్వాత minister గారు వచ్చారని, మళ్ళీ ఇంకో bucket కుడితి ఆయన చేత పెట్టిస్తే మూతి కూడా అందులో పెట్టదట. social values అనుకొని మనల్ని మనం పాడుచేసుకొనేవి బోలెడు వుంటాయి. గేదెకు వున్న జ్ఞానం మనకు లేదు కదా అంటుండేవారు. ఆకలి తీరిన తర్వాత మళ్ళీ అన్నం వైపు చూడడం మిగతా జీవుల్లో లేదు మానవులలో తప్ప. అట్లాగే ఋతువుల ప్రకారం స్త్రీ పురుషుల యొక్క సంబంధం వుంటుంది తప్ప ఇంకో పద్ధతిలో వుండదు. ఒక్క మానవుడికే ఇవన్నీ. ఇవన్నీ ఇంద్రుడిలో భాగాలు. ఇంద్రుడు weak అయిపోతుంటే మనల్ని ఈ ప్రపంచంతో ముడి వేసేస్తాడు. నిజానికి ఇంద్రుడు, విష్ణువు వాళ్ళిద్దరూ twins లాంటి వాళ్ళు. కృష్ణార్జునులు అంటే వాళ్ళే! అర్జునుడు కృష్ణుడు చెప్పినది విన్నంత సేపు సవ్యంగా జరిగిపోతుంది కదా! కృష్ణుడు చెప్పింది చేయకుండా స్వంతంగా చేసినప్పుడు దెబ్బ తింటుంటాడు. అందులో మనకి సందేశం ఉంది. భారతయుద్ధానికి ముందు అర్జునుడు కృష్ణుని వద్దకు వెళ్ళినప్పుడు 'ఎందుకు వచ్చావు? ఏం కావాలి నీకు,' అని అడిగితే 'నువ్వు నా రథంలో వుండాలి, నువ్వు నడిపించినట్లుగా నేను నడుస్తాను' అని చెప్పాడు అర్జునుడు. అదీ ఒప్పందం! ఆయన నడిపించినట్లు

అర్జునుడు నడచినప్పుడు ఎప్పుడూ శ్రేయస్సు కలిగింది. తనకు తోచినట్లు నడచినప్పుడు ఇబ్బంది పడ్డాడు. అది కదా మనకు అర్జునుని కథలో కనిపిస్తుంది. అర్జునుడు తనకు తోచినట్లు ఎందుకు చేసాడు? బయట జరిగే సన్నివేశాలు తన మీద ప్రభావం చూపించినప్పుడు, ఆ బయట సన్నివేశాలకు లోబడి, లోపల వుండే వాడి మాట వినలేదు అన్నమాట! రథంలో వున్నాడంటే శరీరంలో వున్నాడని అర్థం. లోపల వున్న వాడి మాట మనం వినేటట్టుగా వుంటే, లోపల వుండేవాడు మనం అడిగితే చెప్తాడు. రోజూ విష్ణు సహస్రనామం చేసుకోకూడదా అని ఒక సలహా ఇస్తాడు. చాలా సున్నితంగా ఇస్తాడు. నువ్వు చేసుకోవాలి, ఎట్టి పరిస్థితిలోను చెయ్యాలి, అనడు. Suggestive గా వుంటుంది భగవంతుడిది. ఎందుకంటే మన యందు ఆయనకి చాలా గౌరవం. మనల్ని సమానంగా చూసుకుంటాడు. Suggestive గా వుంటుందే తప్ప ఒక order వేసినట్టు వుండదు. రోజూ గాయత్రి చేసుకుంటే బాగుంటుందేమో అనిపిస్తుంది. అనిపిస్తే దాన్ని వెంటనే మొదలు పెట్టాలి. మంచిది ఏదన్నా అనిపించినప్పుడు వెంటనే చెయ్యాలి. రావణాసురుడు 'లోపల నుండి మంచి అనిపించినప్పుడు వెంటనే చేయడం మొదలు పెట్టు, చెడు ఎవన్నా చెపితే postpone చేసేయడమే!' అని చెప్తాడు. కాబట్టి మనకు అటువంటి ఒక భావం వస్తే దాన్నిఊరికే casual గా తీసికోకూడదు. Casual గా తీసుకుంటే, అటునుంచి వచ్చింది మనం ఇటు వినలేదు అన్నమాట! విన్నాం కాని దాన్ని పట్టించుకోలేదు! పట్టించుకోక పోతే ఎప్పుడో మనం బాధలో వున్నప్పుడు మళ్ళీ అడుగుతాం. అప్పుడు మొదటి నుంచి ఇట్లా చేసికుంటే బాగుండేదేమో అని అనిపిస్తుంది. ఇట్లా చేసికుంటే బాగుంటుంది అని మనకు దైవం విషయంలో ఏదన్నా అనిపించి మానేసావో మళ్ళీ నీకు పరిష్కారం దొరకదు. అట్లా చేసుకుంటూ వుండాలి మళ్ళి ఇంకోటి చెప్పేవరకు. ఒకటి చేస్తూ వుంటే మళ్ళీ ఇంకోటి చెప్తారు. ఇంకోటి చెప్తారు. అట్లా చేయించి, చేయించి వీడికి పరిపూర్ణత కలిగిస్తాడు, సిద్ధిని ఇస్తాడు, అనుభూతిని ఇస్తాడు. చాలా చేస్తాడు, ఎందుకంటే వింటున్నాడు కాబట్టి. మనకు మధ్య మధ్యలో అనిపిస్తుంది ఇది ఎందుకు చేయాలి అని అనిపిస్తుంది. లేకపోతే ఇది చేయకపోతే ఏం అనిపిస్తుంది. మనకు ఇటునుంచి కొన్ని సలహాలు వస్తుంటాయి. వచ్చినప్పుడు అవి మనలో కొంచెం తేడా పడినప్పుడు చేస్తున్నపనులు ఆపటానికి కావలసినటువంటి సంకల్పాలు మనలో లోపలి నుంచి వస్తున్నాయంటే, మనస్సు కొన్ని better things suggest చేస్తుంటుంది. ఈ రోజు నిద్రపోతే ఏం? ఈ రోజు పూజ చేయకపోతే ఏం? లేకపోతే ఈ దుర్గా పూజలు చేయక పోతే ఏం? ఇట్లా వస్తుంటాయి మనకు. అవి రాక పోవు. అనిపించినప్పుడు ఓహో అని అనుకొని, ఒక్కసారి కూర్చుంటే మళ్ళీ సరియైన ఆలోచనలు వస్తుంటాయి. ఇంద్రియాలని నియమించాలంటే భగవంతునికి అప్పచెబితే సులభంగా నియమింపబడుతాయి. అది అర్జునుడు చేసాడు. అప్పుడప్పుడు ఏదో మాట వినకపోయినా, మొత్తం మీద విన్నాడు. మొత్తంగా చూసుకుంటే అర్జునుడు కృష్ణుడు చెప్పిన మాట విన్నట్లే లెక్క. అట్లా అప్పుడప్పుడు వినకపోతే ఏం జరిగింది చూపించాడు. అట్లాగే మనకు పురాణాల్లో ఇంద్రుడు, విష్ణువు చెప్పిన మాట వినక పోతే ఏం జరిగింది అనేది చూపించారు. ఇంద్రుడి కొడుకే కదా అర్జునుడు. కాబట్టి మనస్సు చెప్పింది వినడం కాదు మనం చెప్పింది మనస్సు వినాలి. మనస్సుకు తోచింది చేయడం కాదు, నీ మనస్సుకు తోచింది చేయరా అంటుంటారు అట్లా చేయకూడదు. కొట్టి చంపేస్తారు. నీకు

తోచింది నీ మనసుకు తోచాలి. వీరిద్దరూ రెండు భాగాలు అన్నమాట. ఏ పని చేయాలో చెప్పేవాడు ఒకడు వున్నాడు. వాడు మనలో మిత్రుడుగా వుంటాడు. ఆ మిత్రుడి కథ మనకు పురంజనోపాఖ్యానములో వస్తుంది. ఆ 'మిత్రుడు' అనే ఒక స్నేహితుడితో, పురంజనుడు అనేటువంటి వాడు అట్లా ఆకాశంలో తిరుగుతూ వుంటాడు. పురంజనుడు అంటే పురం నందు ప్రవేశించినటువంటి వాడు. జయించి నటువంటి వాడు. పురం అంటే శరీరమే! నవద్వారపురం. ఇందులోకి దిగి అట్లా చూస్తూ చూస్తూ తిరుగుతుంటారు ఆయన, ఆయన స్నేహితుడు. అలా చూస్తూ చూస్తూ మానవ జన్మ చూసి,ఈ పురం బాగుందంటాడు పురంజనుడు. అంటే అందులో land అవ్వాలని. అప్పుడు ఆ స్నేహితుడు 'అది చాలా బాగుంటుంది కాని లోపలికి వెళ్ళిన తర్వాత మనల్ని మనం మర్చిపోతాం', అని చెప్తాడు. అంటే అట్లా ఎందుకు మర్చిపోతాం? మనకి memory బాగానే వుందిగా, అంటాడు. అయి ఉండవచ్చు కాని అక్కడ ఉన్న విషయం అటువంటిది, మరపింప చేస్తుంది, అంటున్నా ఏం మరచిపోం దిగి చూద్దాం. ఎందుకు మర్చిపోతానో చూద్దాం, అని పురంజనుడు అంటాడు. ఎందుకు మర్చిపోతామో చూసే లోపల మర్చిపోతావ్. సరే దిగుతాడు. దిగంగానే నానా గొడవ అయిపోతుంది. దిగుతున్నప్పుడు, 'ఎప్పుడైనా పిలిస్తే నేను వస్తాను. నన్ను గుర్తు పెట్టుకో,' అంటాడు మిత్రుడు. లోపలే ఉంటాడు. ఈయన దిగుతాడు. దిగంగానే అక్కడ (కథ మీరు చదువుకోండి, అంతా ఇక్కడ చెప్పడానికి కాదు) ఒక ఐదు తలల పాము. ఐదు తలల పాము. ఇంద్రియాలు. ఐదు ప్రాణాలు. లాగేస్తాయి లోపలికి. మకరం అన్నమాట. మకరం అంటే మొసలి! మకరం పట్టు పట్టిందంటే అంతే సంగతులు. అట్లా ఆకర్షించి లోపలికి తీసికొనివెళ్తుంది. లోపలికి వెళ్ళిన తర్వాత అటు నుంచి తలుపు వేసేస్తారు. మనం ఎవరో మనకు గుర్తువుండదు బయటికి వచ్చేటప్పటికి. అప్పుడు అడగాలి నేను ఎవరు అని? అడిగితే వాడు ఆ మిత్రుడు చెప్తాడు మనం ఫలానా అని. ఎందుకు దిగాం? అది గుర్తుపెట్టుకోవాలి. అట్లా కానప్పుడు మనం ఇట్లా మిగిలిపోతాం, అది అటు వుండిపోతుంది. ఇద్దరిమధ్య తలుపు పడిపోతుంది. అటువాడు నేను అంటూ వుంటాడు, ఇటు మనం నేను అంటూ వుంటాం. నేను అని ప్రతిధ్వని వినిపిస్తుంది తప్ప, మనం నేను అనుకున్నది ఆ నేను కాదు. ఎవరు? అంటే నేను, అంటాడు. నేను అంటే ప్రతివాడికి, వాడికి ఒక నిర్వచనం వుంటుంది వేరే. మరి వీడిని రక్షించాలంటే ఆ ఇంద్రుడికి మరొకడు ఉన్నాడు కాబట్టి, ఆ ఇంద్రుడు వాడిని తలచుకుంటే వాడు ఈయనని రక్షిస్తాడట. అదీ మహేంద్రో నామం. ఇంద్రుడికి ఇంద్రుడు అని ఎందుకు చెప్తారంటే ఇంద్రుడు మనల్ని ఏవిధంగా ఇక్కడ ఈ లోకాన్ని manage చేస్తున్నాడో, నిర్వర్తిస్తున్నాడో అట్లాగే ఇంద్రుని యొక్క మొత్తం కార్యాన్ని నిర్వర్తించే వాడు మహేంద్రుడు! ఇంద్రుడికి ఎప్పుడన్నా ఇబ్బంది వస్తే ఈయన దిగుతాడు. మనం ఏ నామం చెప్పకుంటున్నామో దానికి సంబంధించిన విష్ణు తత్త్వం. దిగి నిర్వర్తింప చేస్తాడు. మన plans అన్నీ కూడా కొంత అడ్డుగోలగా తయారవుతాయి. సరిగ్గా అవగాహన చేసుకొని చేసుకునేది తక్కువ, అవగాహన లేకుండా చేసుకునేది ఎక్కువ. ఇంద్రియాలకి తోచింది చేసుకునేది ఎక్కువగా వుండడం వల్ల మనకు ఇబ్బందులు వస్తాయి. అవి చూడడంలో గానీ, వినడంలో గానీ, మాట్లాడడంలో గానీ, తినడంలో గానీ, స్పర్శ లో గానీ వీటిలోంచే వస్తాయి ఇబ్బందులు. బయట ప్రపంచం లోకి మనం దిగినప్పుడు మడిగానే దిగుతాం. దిగిన తర్వాత ఏదేది

అంటించుకున్నాం అనేది ముఖ్యం. ఆ అంటించుకున్నవన్నీ మనకు మనం వదిలించుకోలేం. ఎందుకంటే మనం కావాలని అంటించుకోవడం వల్ల వాటికి బలం పెరుగుతుంది. అప్పుడు వాడ్ని పిలవాలి. ఈ అంటించేసుకున్నందువల్ల ఇంద్రియాలలో వుండే వెలుగు తగ్గిపోతుంది. వెలుగు తగ్గడమే అసురత్వం. సురత్వం అంటే వెలుగు. వెలుగు తగ్గిపోయి అసురత్వం మనలో ఎక్కువైపోయినప్పుడు వాడ్ని పిలిస్తే, మళ్ళీ చక్క పరుస్తాడు. అందుకని మనకి మన plans అంత బాగా నడవక పోతే మనం చేయాల్సింది ఒకటే ఒకటి. ఏమిటయ్యా అంటే మనలో ఉండే ఆ దైవాన్ని, మన చుట్టూ వున్న దానిలో గాని, మనం చూసే రూపంలో గాని, నామంలో గాని బాగా ప్రార్థన చేసి, నేను ఏం చేయాలో నీ సంకల్పం మేరకు మేం పని చేసేటట్టుగా చూసుకోమని రోజూ అడగాలి. మనం ఏం చేస్తామంటే మనకు తోచిన మనకంటూ కార్యక్రమాలు వుంటాయి కదా! అవి సరిగ్గా జరిగేటట్టుగా చూడమని అడుగుతాం. అంటే అంతా మనం నిర్ణయించేసి నాకు తోచినట్టుగా నువ్వు చెయ్యి, అని చెప్పడం వాడికి. అలా చెప్తే పని అవదు. అక్రూరుడు పురుష మేధంలో తనకు తోచినట్లు యాగం చేసి, వర్షం కురిపించు చూద్దాం, అంటాడు. అదేమిటి, వాళ్ళు వర్షం కురిపించాలంటే వాళ్ళు చెప్పినట్లు వీళ్ళు చేయాలి. నేను చెప్పినట్లు నువ్వు వంట చెయ్యి చూద్దాం అని, వంట చేసాక ఇట్లా వుందే అని అడిగితే కుదరదు కదా! కాబట్టి మనం చేసుకున్నవి అన్నీ ఇట్లా ఇట్లా వున్నాయి, ఇందులో ఏదన్నా సరియైనది వుందా లేదా? plan బాగుందా అని అడిగి, plan సవరణ ఇస్తే తీసుకునే వాడు బుద్ధిమంతుడు. అసలు నా plan కు మీ blessings కావాలని అడుగుతుంటారు కదా! అది అసలు అవసరమో కాదో? కాబట్టి మనం చేసే పనులు నిర్ణయించేసి, వాటికి మీ blessings ఇవ్వమని అడగడం కాదు. మనం చేసే పని నీ సంకల్పంతో చేస్తున్నదా? నా స్వంతంగా ఏర్పడినదా? స్వంత తెలివి ఒకటి ఇచ్చాడుగా. అందుకని రోజూ file అక్కడ పెట్టడమంటే, ప్రొద్దునే కూర్చొని అడగడం. వాళ్ళకి చెప్పేసుకొని నువ్వేమంటావ్ అడుగుతూ వుండాలి. అడగడం అనేది ఒక సాధన చేస్తే వాళ్ళు చెప్పేది మనకు వినబడుతుంది, ఇట్లా చేసికో అని. అట్లాగే కదా వింటాడు బ్రహ్మ మాటిమాటికి. మనం కూడా అంతేగదా! దిగివచ్చాం. ఇక్కడ నుంచి బ్రహ్మణం చేస్తాంగా. లేచిందగ్గర నుంచి మనం చేసేది సృష్టే! బ్రహ్మణం చేసేటప్పుడు ఏమిటి బ్రహ్మణం చేయాలి? అంటే ఏది సృష్టి చేయాలి? మనం చేసేదానికీ, వాడి దానికీ సంబంధం వుందా లేదా అని check చేసికోవాలి ఒకటి రెండు సార్లు. మనకు అటు నుంచి conformation వస్తే, అప్పుడు అది మొదలు పెట్టాలి. వాడి పనిగా చేసుకోవాలి. అందుకని మనకు అడ్డగోలగా వున్న సమయంలో దాన్నంత తీసుకొనివెళ్ళి, ఇదంతా ఏదేదో నాకు తోచింది చేసేసాను, అంతా అయిపోయింది, రకరకాల ఇబ్బందులు పడిపోయాను, ఇక ఇప్పుడు ఏం చేయాలో చెప్ప అంటే ఎప్పుడైనా సరే He is ready to help us. మొత్తం అంతా పూర్తి చేశాను నాకు తోచినంత, ఇప్పుడు దీన్ని ఏమైనా నేను చేయగలనా అంటే అక్కడ నుంచి పట్టుకొని బయలు దేరుతాడు. కానీ మొదలు పెట్టాక మళ్ళీ చేయి పెట్టగూడదు. అప్పచేప్పేయాలి. అదే అంటూ వుంటారు పెద్దవాళ్ళు. మాస్టర్ జ్వాలాకుల్ చాలాసార్లు 'మీకు చెప్తే అర్థం కాదు నాకు అప్పచేప్పేసేయి, నేను చెప్పినట్లు నీవు చేసుకో' అన్నారు. చాలా ధైర్యం కావాలి వాళ్ళకు అప్పచెప్పాలంటే! మనంతటి వాళ్ళం మనం వుండగా ఇంకొకళ్ళకి అప్పజెప్పగలమా? కానీ అట్లా వాడికి అప్పచెప్పి చేస్తే, ఇంద్రుడు,

మహేంద్రుడు మధ్య సఖ్యత వుంటుంది. అట్లా అప్పచెప్పింది చేస్తూ వుంటే వాడి పనే మనం ఇక్కడ చేస్తున్నాం. అది ఎందుకు చేస్తున్నాం అంటే, వాడిలో అనుభూతి చెందడానికి అని తెలుస్తుంది. భగవంతుడు పనులు మన చేత చేయించడం ద్వారా ఏం వస్తుంది? మనల్ని ఏమన్నా వెట్టిచాకిరి చేయించడానికా? కాదు. ఈ చేయడంలో మనకు అనుభూతి అందుతుందని మనల్ని చేయమంటారు. చేయడంలోనే అనుభూతి వుంది. కాబట్టి ఈ ఇంద్ర తత్త్వం, మహేంద్ర తత్త్వం మధ్య సరియైన అనుసంధానం జరగాలి. ఇంద్రుడుకి, వృత్రాసురుడుకి జరిగినట్లు. వృత్రాసురుడు ఆ ఇంద్రుణ్ణి జయించి విష్ణువుని పట్టుకు కూర్చుంటాడు. ఇంద్రుడికన్నా బలవంతుడు అయిపోతుంటే ఇంద్రుడికి భయం వేసి ఆ వృత్రాసురుడిని చంపేద్దాం అనుకుంటాడు. ఎన్ని సార్లు యుద్ధం చేసినా వృత్రాసురుడే గెలుస్తూ ఉంటాడు. ఇంద్రుడు విష్ణువు దగ్గరకి వెళ్ళిపోయి తపస్సు చేస్తే విష్ణువు ప్రత్యక్షం అయ్యి ఏం కావాలి అంటే, నా కుర్చీకి ఇబ్బంది వస్తున్నది, అంటాడు. ఈ కుర్చీకి ఇబ్బంది ఏమీలేదూ. వృత్రాసురుడు అట్లా పెరిగిపోతుంటే అతడికి భయం, ఏమన్నా చేస్తాడో ఏమో అని. నువ్వు నాకు ఏమన్నా power ఇస్తే నేను వాడితో పోట్లాడుతాను, వాడిని గెలిచేస్తాను అంటాడు. అడిగింది power, ఇస్తాడు. అది పెట్టుకొని పోరాడితే మళ్ళీ పోతుంది. అదేమిటి విష్ణువుని consult చేసినా కూడా పోతున్నది, అని అనుకుంటాడు. నవ్వుతాడు వృత్రాసురుడు. నువ్వు నన్ను చంపలేవ్, అంటాడు. ఎందుకు చంపలేను? అంటాడు. విష్ణువుని ప్రార్థన చేసాను కదా! అయన శక్తి ఇస్తున్నాడు కదా ఎందుకు చంపలేను అంటే ఏ శక్తి ఇచ్చినా నువ్వు నన్ను చంపలేవు. విష్ణువుని ఏం చేయాలి అని అడగలేదు. నీ plan ఆయన దగ్గర ఇచ్చి దానికి కావలసిన సరకు అడిగావు, అందుకని నీకు పని కాదు, అంటాడు. అసలు ఎందుకు చంపలేను నిన్ను, అని అడుగుతాడు. ఎందుకంటే నన్ను చంపడానికి కారణం లేదు నీ దగ్గర నీ భయం తప్ప. అది కారణంగా నువ్వు నన్ను చంపలేవు, అని చెప్తాడు. నారాయణ కవచం ఇంద్రుడికి వృత్రాసురుడు ఉపదేశం చేస్తాడు. ఇది చదువుకొని నన్ను చంపు అని. లేదంటే వజ్రాయుధం లాంటిది వేస్తే పూచిక పుల్ల అయిపోతుంది. ఏమిటి నీ గొప్పదనం అంటే ఏంలేదు నాది అంతా వాడే అంటాడు. నువ్వు నేను ఈ మొత్తం అంతా ఇక్కడ కనిపిస్తుందే ఇవన్నీ ఏం లేవు మొత్తం అంతా వాడే వున్నాడు. వాడే నేను, నేనే వాడు. నువ్వు నన్ను శత్రువుగా చూస్తున్నావు నేను నిన్ను విష్ణువు యొక్క ఒక రూపంగా చూస్తున్నాను. విష్ణువు సర్వవ్యాపి కాబట్టి ఆయనకు అంతం లేదు, ఆది లేదు ఏమీ లేనట్టి శాశ్వతునిలో భాగంగా నేను వున్నప్పుడు నువ్వు ఏమీ చేయలేవు, నువ్వు అయినా కావాలనుకుంటే ఇదిగో ఈ నారాయణ కవచం చదువుకొని అప్పుడు దాని యొక్క బలంతో నన్ను గెలుచుకో! అంటాడు. నారాయణ కవచంలో అంతా వాడే అని వుంటుంది. అప్పుడు విష్ణువే అంతా అని తెలుసుకొన్న తర్వాత ఇంద్రుడు వృత్రాసురుడిని చంపాడు అని వుంటుంది. చంపడం అంటే ఏం లేదు వీడిలో ఆ భయం పోయింది. ఆ చావని వాడిని ఎట్లా చంపుతారు. ఇట్లా ఉంటాయి కథలు. ఏం జరుగుతుంది అంటే మనస్సు అక్కడ submit చేసి ఇక్కడ alert గా చూడమంటం కాదు అసలు మన scene ఏమిటో అడగాలి. Let purpose guide the little wills of men అంటూ వుంటాం కదా! దైవ సంకల్పం ప్రకారం జరగాలి కదా! 'కర్తవ్యం దైవ మాహ్నికం' అంటాం. లేచిన తర్వాత నీ కార్యం చేయడానికి నేను లేచాను కదా, అని గుర్తు ఉండాలి. మన పనులు చేయడానికి

లేచా అనుకుంటాం. అట్లా గాకుండా వుంటే బావుంటుంది. అది ఇంద్రత్వం, మనలో వున్నది సృష్టిలో వున్నది. సృష్టిలో ఇంద్రుడికి తేడా వచ్చినప్పుడు విష్ణువు సరిదిద్దుతాడు. మనలో ఇంద్రత్వం బాగా తగ్గితే మనం విష్ణువు పాదాలు పట్టుకొని మళ్ళీ తెచ్చుకోవాలి సరియైన పద్ధతులలో. ఎందుకు ఇంద్రుడు మాయం అవుతాడంటే మనం ఇంద్రియాలకి లోబడడం వల్ల! ఆ మాయమైనప్పుడు ఒక్కొక్కసారి తనతో పాటు ప్రాణాలను కూడా పట్టుకుపోతాడట ఇంద్రుడు. అదే భాగవతం కథలలో ఇంద్రుడు అశ్వమేధయాగం లో అశ్వాన్ని తీసికెళ్ళిపోతాడు అని ఉన్నది. అది కారణంగా మన యొక్క ఆరోగ్యాన్ని, మన ప్రాణాన్ని అన్నింటిని కూడా హరించే పరిస్థితి తెచ్చుకున్నాం. ఇటుప్రక్క కథ కొంత ఉంది, అటుప్రక్క కథ కొంత వుంది. అటుప్రక్క కథ ఇటు ప్రక్క జరిగేటట్టుగా చేసేవాడు ఇంద్రుడండి. అటుప్రక్క కథ ఇటుపక్క నడిపిస్తున్నంత సేపు ఇటు ప్రక్క జరుగుతున్న దానికి రక్షణ కూడా చేసి పెడతాడు. అటు పక్క కథ మర్చిపోయి, ఇటు మనం సొంత కథ పెట్టుకొని పని చేస్తున్నట్లయితే దాంట్లో నుంచి మనకు చిక్కులు వస్తాయి. ఇది మొత్తం యజుర్వేదం, పుస్తకంగా కాకుండా తనకి తానుగా తెలిసిన యజుర్వేదం. తనలో వచ్చిన సంకల్పం ఋగ్వేదం. దానికి ఇచ్చిన ప్రాణ శక్తి సామవేదం. దాన్ని నిర్వర్తించే తెలివి యజుర్వేదం. ఆ నిర్వర్తించడం అనేది ఒక పద్ధతి ప్రకారం జరగాలి. అందుకని ఎట్లా చేయాలో తెలియకుండా చేయడం మొదలు పెడితే ఇబ్బందులు పడతారు. ఏదైనా సరే తెలియకుండా చేయకూడదు. ఇంద్రుడు మొత్తం సృష్టి దేవతలలో నాయకుడు. ఎందుకంటే సృష్టి పరిపాలకుడు కాబట్టి. ఇంత పరిపాలకుడికి కూడా ఇంకొక సలహాదారుడు మహేంద్రుడు వున్నాడు. ఆ మహేంద్రుడ్ని మర్చిపోయినప్పుడు ఇబ్బందులు పడతాడు. అట్లాగే మనలో కూడా ఈ విధంగా పని చేస్తాడు కాబట్టి, ఈ చెప్పిన విషయాలలో మీరు గమనించదగినవి ఏమైనా వుంటే అవి సాధనలో తీసుకొని మనం work out చేసుకుంటూ వుండాలి.

## 279, 280 వసుదః, వసుః

వసుదః అంటే సంపదని ఇచ్చేవాడు. భగవంతుడే సంపద! భగవంతుడు సంపద ఇస్తే సంపద వల్ల మనకి ఆనందం. భగవంతుడు సంపద ఇవ్వడం అంటే ధర్మమైన పద్ధతులలో సంపదని ఏర్పరుచుకోవడం అన్నమాట. ఆ సంపద అనుభవాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. లేకపోతే చాల ప్రోగువేసుకుంటూ దాన్ని కాపాడుకుంటూ జీవిస్తారు తప్ప, దాన్ని అనుభవించే అర్హత మాత్రం వుండదు. ఉన్న కాస్త అనుభవించే వాడు ఒకడు వుంటాడు. ఒక వాచీ వున్నది అనుకోండి, వాచీని కూడా అనుభవించడం ఒక పద్ధతి వున్నది. వేసుకొనే బూట్లు, వేసుకొనే బట్టలు, ఏదో వేసుకుంటున్నాం, వాటి మీద శ్రద్ధ లేక ఏదో తిరుగుతున్నాం అనేవాళ్ళు కొందరు ఉంటారు. ఇళ్ళు, మంచి ఆస్తి, కుటుంబం, మనకు వుండే పశు సంపద అన్నీ చక్కగా వాటినన్నిటినీ అనుభవించే యోగ్యత అందరికీ వుండదు. ఉన్నది అనుభవించడానికి కూడా అవకాశం వుండదు. సంపద భగవంతుడు ఇచ్చింది అనుభవించాలంటే ధర్మమైన మార్గంలో చేరినటువంటి సంపదే చక్కగా అనుభవించడానికి అర్హత ఇస్తుందే తప్ప, అధర్మంగా సంపాదించిన దానివల్ల, అది పెరుగుతూ ఉంటుందే తప్ప మనలో శాంతి తగ్గుతుంది. సంపద పెరుగుతున్న కొద్దీ శాంతి తగ్గుతుందట అంటే సంపాదిస్తున్న విధానంలో ఏదో తేడా వుందని అర్థం. చాలా మంది ఎక్కువ సంపాదించుకొని ఎక్కువ కష్టాలు తెచ్చుకొంటుంటారు. చాల తక్కువ వుండి ఆనందంగా వుండే వాళ్ళు కొంతమంది ఉంటారు. ఇంత ఉంటే చాలు ఇంత కన్నా ఎక్కువ వుంటే problem అనుకుంటారు కొంతమంది. కొంతమంది బాగా విపరీతంగా సంపాదించి, సంపాదించిన కొద్దీ ఇరక పెట్టుకుంటారు. ముళ్ళు వేసుకుంటూ వుంటారు. ఇక మూడో రకం వాడు వున్నాడు పెరిగిన కొద్దీ వైభవం కూడా పెరుగుతూ వుంటుంది వాడికి. పెరిగిన కొద్దీ వైభవం పెరగడం అంటే ఏమిటంటే అది భగవంతుడి సంపద వీడుగా నిర్వర్తించుకుంటూ, భగవంతుడికి కైంకర్యం చేసి జీవిస్తుంటాడు. ఇది నీ సంపద, నాకు అప్పచెప్పావు నువ్వు నాకు ఇచ్చిన సంకల్పం మేరకు దీన్ని సద్వినియోగం చేస్తున్నాను, అనే భావనలో జీవించే వాళ్ళు వుంటారు. మనది అనుకున్నా వాడేమీ అనుకోడు. ఓహో వాడిది అనుకుంటున్నాడు, అని అనుకుంటాడు. మనది కాదు ఆయనదే మనకు అప్పచెప్పాడు, పెంపొందింప చేస్తున్నాడు, ఎందుకురా అంటే అందరికీ వినియోగింపబడానికి, నువ్వు కూడా అనుభవించడానికి. నువ్వు గోచి గుడ్డ కట్టుకొని కూర్చోనక్కర లేదు నువ్వు కూడా అనుభవించవచ్చు. నువ్వు కాక ఇంకా మిగతా వాళ్ళకి కూడా పంచే పద్ధతిలో వుండేవాళ్ళకి మొత్తం సృష్టి సంపద అంతా దగ్గరికి చేరుతూ వుంటుంది. సృష్టి సంపద చేరి అందరికీ పంచే మహాత్ములు మనకు కనిపిస్తుంటారు. అది ఎంత చేరుతుంది అంటే కోకొల్లలుగా చేరుతూవుంటుంది. చేరిన కొద్దీ వాళ్ళు చేసేది ఏం వుంది ? వాళ్ళు తినేది

ఇంతే. వాళ్ళు వేసుకొనే బట్ట ఒక బట్టే. మిగతాదంతా ఎక్కడో బ్యాంకు లో దాచిపెట్టడం, పాతిపెట్టడం, share market లో పెట్టడం కాకుండా మిగతా జీవుల కోసం దాన్ని వినియోగం చేస్తుంటారు. వాళ్ళకి తరగని సంపద వుంటుంది. సృష్టి సంపదకి తరుగే వుండదు. ఒక వైపు అయిపోతుంటే, ఇంకొక వైపు నుంచి వస్తుంటుంది. మనం అయిపోవడం చూస్తుంటాము కాని, రావడం చూడము మామూలుగా. ఎవరో శాస్త్రజ్ఞులు లెక్కవేసి, సూర్యుడు ఇంతకన్నా వెలుగు ఇవ్వలేడు కొన్నాళ్ళు పోయిన తర్వాత అయన వెలుగు అయిపోతుందని చెప్పారు. చాలా simple గా చెప్పకోవాలి అంటే ఈ glass నీళ్ళు తాగితే అయిపోతుంది అనుకుంటాము. అంతే కదా! అయిపోతే మళ్ళీ ఇందులో పోస్తామని కూడా ఒకటుందిగా! మన tank లో నీళ్ళు అయిపోతే tank లోకి మళ్ళా నీళ్ళు వస్తున్నాయి కదా! మామిడి చెట్టు నిండా పళ్ళు అన్నీ కోసుకొని తినేస్తే మళ్ళీ మామిడిపండ్లు వస్తున్నాయి కదా! సృష్టిలో అయిపోవడం అనేది లేదు. శంఖారావం చదువుకుంటే మాస్టర్ ఒక మంచి మాట చెప్పారు. ఇంట్లో బియ్యం బస్తా చూసి, ఈ బియ్యం బస్తా తినేస్తే ఎలాగు మనకేం వుండదు కదా అనుకునేవాడు ఎంత మూర్ఖుడు ? బియ్యం బస్తా తెచ్చి ఇంట్లో పెట్టాడు ఇంటాయన, వండుకు తింటున్నారు, అయిపో వస్తుంటే ఇంటావిడకు ఈ బియ్యం బస్తా అయిపోయే లోపల ఇంకో బియ్యం బస్తా ఆయన తెస్తాడని తెలుసు. అట్లా అనుకోకపొతే ఈ బియ్యం బస్తా ధారాళంగా వండుకొని తినలేరు కదా. సృష్టిలో ఏది అయిపోవటం అనేది లేదు, మన బుర్రలో వుండే అనారోగ్యం తప్ప. అయిపోతుంది అనుకునే వాడు భయస్తుడు. అయిపోవడం అనేది లేనివాడు ధారాళంగా అందరికీ పంచి ఇస్తుంటాడు, ఇస్తున్న కొద్దీ వస్తుంటుంది. అణువులు రోజూ శరీరంలో నుంచి అయిపోతుండగానే మళ్ళీ కొత్త అణువులు పుడుతున్నాయి. అయిపోవడం అనేది మనకు తెలియక అనుకునే విషయం. అందుకని సంపద అయిపోతుందేమో అని దాచుకోవడం, ముందుకు వుండదేమో అని ప్రోగు వేసుకోవడం ఇటువంటివన్ని యోగుల దగ్గర వుండవు. వున్నది వాళ్ళు పదిమందికి ఉపయోగిస్తుంటే వాళ్ళ దగ్గర పెరుగుతూ ఉంటుంది. ఎందుకంటే వాళ్ళని ఒక ధర్మకర్తగా భగవంతుడు నియమించాడు, అందుకని అతడికి ఎక్కువ అప్పచెప్తుంటారు. పదిమందికి పెడుతున్నాడు కాబట్టి వాడికే ఇద్దామని. పదిమందికి పెట్టకుండా దాచుకొనేవాడికి ఆ సంపదే వాడ్ని ఇబ్బంది పెడుతుంది. సంపద వల్ల ఇబ్బంది పడడం కన్న తెలివితక్కువ ఇంక ఏం లేదు. ఆరోగ్యంగా ఉండి ఇబ్బంది పడుతున్నాను అండి అంటాడు అనుకోండి, ఆరోగ్యం వుంటే ఇబ్బంది వుండదు కదా శరీరానికి. అలా సంపద వుండి ఇబ్బంది పడుతున్నారట అంటే చాలా తెలివి తక్కువ వాడు అని అర్థం. సంపద యొక్క వినియోగం తెలియక అట్లా చేస్తారు. సంపద ఇస్తూ వుంటాడట భగవంతుడు వసుధ అని. తన యొక్క సృష్టి జీవులను సంరక్షించుకోవడానికి అట్లా ఇస్తుంటాడు. అట్లా సృష్టిలో వుండే పెద్ద పెద్ద ధనరాసులు యొక్క రహస్యములు కూడా వాళ్ళకి తెలుస్తుంటాయి. అవసరం అయితే

తీసి వాడుతుంటారు. ధర్మరాజుని భారత యుద్ధం అంతా అయిపోయిన తర్వాత మళ్ళీ ఒక యజ్ఞం చేయమంటారు. 'యుద్ధం లో ఆయుధాల కోసం, రధాల కోసం మొత్తం భూమి మీద ఉన్నదంతా ఖర్చు పెట్టేసారు. మొత్తం ధనం అంతా పోయింది. ఇప్పుడు ఎక్కడ నుంచి తెస్తాం ఇవన్నీ చేయడానికి' అని అంటే కృష్ణుడు హిమాయాలలోకి తీసుకెళతాడు అర్జునుడ్ని. అక్కడ ధనరాసులు ఉంటాయి. అవి తెచ్చి, మీరు వాటిని వాడుకోమంటాడు. అంటే ఆయనకు ఎట్లా తెలిసింది? మహాత్ములకు ఈ భూమి మీద ఎక్కడెక్కడ ఏ ధనరాసులు ఉన్నాయో తెలిసి, అక్కడ నుంచి తెచ్చి వినియోగం చేయగలిగిన స్థితి వాళ్ళకు ఎందుకు ఏర్పడిందంటే వారు దాన్ని వినియోగించడం లో స్వంతం లేకపోవడం వల్ల. ధర్మకర్తగా పనిచేయడం మనం నేర్చుకున్న కొద్దీ మన దగ్గర సంపద పెరుగుతూ, అనుభూతి కూడా పెరుగుతుంది. సంపద అనుభవించే అదృష్టం ఉంటుంది. సంపద లేకపోవడం వల్ల కూడా బాధే, సంపద వుండి కూడా బాధే. సంపద లేనివాడు ఎంత బాధ పడుతున్నాడో, సంపద వున్న వాడూ అంతే బాధ పడుతున్నాడు. కారణము ధర్మమైన సంపద కాక పోవడం వల్ల ఒకటి, వచ్చిన సంపదని వినియోగించడం అనే తెలివి లేకపోవడం రెండు. కాని భగవంతుడు ఇద్దరికీ ఇస్తూనేవుంటాడు సంపద. ఇచ్చిన దాంట్లో పాడుచేసుకొనేది ఒకటి, ఇచ్చిన దాంట్లో పెంపొందించుకొని అనుభూతి చెందింది ఇంకొకటి.

వసు: అంటే ఆయనే సంపద! సంపద ఇచ్చేవాడూ ఆయనే! సంపద రూపంలో ఆయన వున్నాడు. సంపద అంటే మనం లక్ష్మీదేవి అని చెప్పకుంటాం. లక్ష్మిదేవి ఆత్మతత్త్వం వున్న చోట ఎక్కువ ఉంటుంది. ఆత్మ తత్త్వం యొక్క వెలుగే లక్ష్మి. లక్ష్మీ దేవి వచ్చింది అంటే ఆయన కూడా వచ్చాడని అర్థం. ఆయనను మర్చిపోయి లక్ష్మిని ఎట్లా పడితే అట్లా వాడుతుంటే వెళ్ళిపోతుంది. అందుకని లక్ష్మి చంచల అంటారు. అమ్మవారి కళ వచ్చింది అక్కడ అంటే అయ్యవారు లోపల వున్న కొద్దీ అమ్మవారు వెలుగుతూ వుంటుంది. అయ్యవారి యొక్క రూపం అమ్మవారే! అయ్యవారికి వేరే రూపం ఏమీ లేదు. అమ్మవారిదే! అది లోపల వున్నంత సేపు ఇది వెలుగుతూ వుంటుందన్న మాట. విద్యుత్తు మనకు కనపడదు కదా! అవ్యక్తంగా వుంటుంది. అది ఇట్లా bulb లోకి వస్తే మనకు బ్రహ్మాండమైన వెలుగు కనిపిస్తుంది. ఆ bulb దా వెలుగు? అది bulb వెలుగు ఎట్లా కాదో అట్లాగే అయ్యవారికి రూపాన్నిచ్చేది అమ్మవారు. మన దగ్గరికి వస్తున్నకొద్దీ అర్థం చేసుకోవలసింది ఏమిటంటే భగవంతుడు కరుణిస్తున్నాడని అర్థం చేసుకోవాలి. భగవంతుడు వస్తున్నాడు అని అర్థం చేసుకోవాలి. కాబట్టి వినయ విధేయతలతో వచ్చింది సద్వినియోగం చేయాలి. వచ్చింది సద్వినియోగం చేసిన వాళ్ళకే సరియైన పద్ధతులలో ఇంకా ఇవ్వబడుతుంది. వచ్చిన దాంట్లో commission కొట్టేయడం, వచ్చింది దాచుకోవడం, వుండి మిగతావాళ్ళకు పెట్టక పోవడం, అలాంటివారికి ఇవ్వబడదు. కొంత మంది ఉంటే మేము కూడా పెడతాము అంటారు, అది వచ్చినప్పుడు

చెప్పాలి ఆ మాట. ఈ వున్నవాళ్ళు అంతా ఎందుకు మంచి పనులు చేయరు అని లేనివాళ్ళు అనుకుంటూ వుంటారు. నేను మాస్టారుని ఒక సారి అడిగా ఇది, నీకు వస్తే నువ్వు చేయవులే, అని అన్నారు అయన. అదేమిటి మాస్టారు, అంటే 'అది అంతే! వచ్చినప్పుడు చెప్పాలి దాని సంగతి, రానప్పుడు దాన్ని గురించి మాట్లాడకూడదు. అది వచ్చినప్పుడు అది నీకు ఇవ్వబుద్ధి వేస్తే అప్పుడు లెక్క తప్ప, రానప్పుడు అట్లాగే వుంటుందోయ్. సంపద చేరిన తర్వాత కూడా నలుగురికీ చేయాలనే బుద్ధి వుండడం అనేది గొప్ప సంస్కారం. అది కూడా పెద్ద అనుగ్రహం. పెద్ద యోగం' అని చెప్పారు. మనకు వున్న దాంట్లోనే మిగిలింది చూసుకుంటే ఇంకొకళ్ళకు ఇవ్వగలిగింది ఏదో ఉంటుంది. మనకు బాగా వుంటే ఇద్దాం అనేది చాలా తప్పుడు theory. బాగా ఉన్నవాడు ఎందుకు ఇవ్వడంలేదు అనేది ఇంకా భయంకరమైన theory. నీ దగ్గర వుంటే నువ్వు ఇవ్వు. నీ దగ్గర ఉన్నది నువ్వు ఇవ్వలేవు. ఇంకోడు ఎందుకు ఇవ్వలేడు అనడం చాలా తప్పు. వాడు ఎందుకు ఇవ్వలేదు అనేది వాడి place లో నీవు వుంటే నీకు తెలుస్తుంది. ఇచ్చేవాడికి ఇవ్వడం అనేది తనలో వున్న గుణం తప్ప తన దగ్గర వున్న దాంతో సంబంధం లేదు. వున్న దాంట్లోనే ఇవ్వచ్చు ఇద్దాం అనుకుంటే! ఇద్దామని లేకపోతే మన దగ్గిర ఏం లేదు కదా. అనుకుంటాం. అదే దరిద్రం! ఇస్తూ వుంటే వస్తూ వుంటుంది. ఒక బ్రాహ్మణుడు అట్లా నడిచి వెళ్తూ వున్నాడట. వెడుతుంటే ఒక చెట్టుక్రింద కొంతమందికి గౌతమ బుద్ధుడు బోధ చేస్తూ, ఆ రోజు ఇవ్వడం గురించి చెప్తున్నాడట. ఇవ్వడం, ఆ ఇవ్వడంలో వుండే గొప్పతనం, దానిలో నుంచి దైవానుగ్రహం ఎట్లా కలుగుతుంది అన్నీ చెప్పకుంటూ వస్తుంటే, ఈయనకి చాలా ఆనందం కలిగి తన ఒంటి మీద చూసుకుంటాడు. ఏముంది ఇప్పుడు మనకు immediate గా ఇవ్వడానికి అని చూసుకుంటే ఏం వుంటుంది పైన ఒక కండువా వుంటుంది, క్రింద ఒక ధోతీ వుంటుంది. చూస్తాడు ధోవతి ఇస్తే బాగుండదు కాబట్టి, కండువా మనకు లేక పోయినా ఇబ్బంది లేదు కాబట్టి ఈ కండువా ఇచ్చేద్దాం అని కండువా ఇచ్చేస్తాడు. ఇచ్చేసి నేను ఇవ్వగలిగాను, నేను ఇవ్వగలిగాను అని చాలా ఆనంద పడిపోతాడు. ఇస్తుంటే ఒక ఆనందం వుంటుంది ఏడవకుండా ఇస్తే. ఇచ్చేసి పది మందికి చెప్పకుంటూంటే పోతుంది. ఇవ్వటంలోనే వుంది ఆనందం. వాడు ఇచ్చేసి సంతోషపడుతూ వెళుతూ ఒహోహో తెగ ఆనంద పడిపోతుంటాడు. ఎవరికి ఇచ్చింది ? బుద్ధుడికి! ఎట్లా దానం చేయాలో భగవద్గీతలో ఒకసారి చూసుకోండి. ఎవరికి దానం చేయాలి, ఎప్పుడు దానం చేయాలి, ఎట్లా దానం చేయాలి మూడు వున్నాయి. ఇవ్వటంలో కుడా ఒక పద్ధతి వుంది. బుద్ధుడికి ఇచ్చాడు. దాంతో మరీ ఆనందం ఎక్కువ అయిపోయింది. ఆనందంలో వెడుతూ వుంటాడు. రాజు బుద్ధుడ్ని చూద్దామని అటు గుర్రాల మీద వస్తుంటే దారిలో ఈ బ్రాహ్మణుడు కనిపించాడు. ఏమిటి ఇంత విపరీతమైన ఆనందంతో వెడుతున్నాడు, ఎదురుగా ఇంత పెద్ద రధం మీద రాజు అట్టహాసంగా వస్తుంటే కూడా ఈయన పట్టించుకోడు. అని ఆపుతాడు రధాన్ని.

‘వాడు నిష్కారణంగా అంత ఆనందంగా ఎందుకు ఉన్నాడో కనుక్కోండి ఒకసారి’ అంటాడు. అందుకని భటులు వెళ్ళి కనుక్కుంటారు. వాడు పిచ్చి వాడు, అని చెప్తారు, ఎందుకు అని అడిగితే, ఏదో ఒక కండువా ఇచ్చాడట ఎవరికో అందుకని ఇంత ఆనందంగా ఉన్నాడు అని. ఆశ్చర్యపోయాడు. కండువా ఇస్తే ఇంత ఆనందంగా ఎలా వుంటాడు? పిలిపిస్తాడు. పిలిపించి ఏమిటి అంటే ‘నేను ఏమీ లేని వాణ్ణి, ఏ పూట ఏమి దొరికితే అది తింటు వుంటాను, నాకు వున్నది పైన ఒక వస్త్రం, క్రింద ఒక వస్త్రం. అయన చెప్పిన ఉపన్యాసం విన్నాను, నేను కూడా ఏదో ఇవ్వాలనుకున్నాను, నాకు కనిపిస్తే ఇది ఒకటి వున్నది, ఇచ్చేశాను. ఎంత ఆనందంగా వుందో, హాయిగా వున్నాను’ అంటాడు. పోల్చి చూస్తే రాజుకి ఉన్నదెంత? వీడికి వున్నదెంత? వీడు ఇచ్చినదెంత? రాజుకు చాలా సంతోషం వేసి, కొన్ని బట్టలు ఈయనకు ఇచ్చి, నీ దగ్గర ఉంచు నాకు చాల ఆనందంగా వుంది నీ లాంటి పౌరుడు నా దేశంలో వున్నాడని, చెప్పి సంతోషించి బుద్ధుడి దగ్గరకు వెళ్తాడు రాజు. వెళ్ళి అక్కడ కూర్చొని మంచి విషయాలు వింటూ వుంటే, మళ్ళీ బ్రాహ్మడు వస్తాడు. వచ్చి, రాజు ఇచ్చినవన్నీ అక్కడ ఇచ్చేస్తాడు. అదేమిటంటే, ఇదొకటి చాలుగదా! ఆయనకు ఇస్తే ఆయన నలుగురికి ఇస్తారు కదా! ఇది వరకు ఒకటితోనే వుండే వాణ్ణి కదా, ఇప్పుడు పది వస్తే ఏం చేసుకోవాలి?’ అంటాడు. మనకి ఆదాయం కన్నా ఖర్చు పెరుగుతూ వుంటుంది. ఆదాయం పెరుగుతుందట అంటే ఆదాయం పెరిగే లోపల అంతకన్నా మించి ఖర్చు పెంచుకుంటాం. అంటే మన అవసరాలు పెరిగిపోతూ వుంటాయి. మన కాలిజోళ్ళు దగ్గర నుంచి, వేసుకొనే బట్టల దగ్గర నుంచి, అన్నీ పెరుగుతూ వస్తుంటాయి. ఎవ్వరికీ ఏమీ ఇవ్వం. అలా నిండిపోతూ వుంటాయి. ఇంకా చాలదు అనుకుంటాము. ఆ బ్రాహ్మడు ఒక marking పెట్టుకున్నాడు, దాని పైన ఏమి వచ్చినా ఇచ్చేస్తుంటాడు. ఇచ్చేస్తే, రాజు ఇతగాడు అప్పడే తెచ్చి ఇచ్చేసాడే అనుకొని, అతన్ని పట్టుకొని రాజ్యానికి తీసుకొని వెళ్ళి, ఇటువంటి వాడికి ఏమన్నా ఇస్తే మనకు కుడా ఆనందంగా ఉంటుంది అని ఒక పెద్ద అగ్రహారం ఇచ్చేస్తాడు. కొన్ని గోవులు ఇచ్చేస్తాడు. చాలా సంపద ఇస్తాడు. ‘ఇప్పడు నువ్వు హాయిగా వుండు, నువ్వు పొందిన ఆనందం సంగతి దేవుడెరుగు, నిన్ను చూస్తుంటేనే నాకు ఆనందంగా వుంది’ అంటాడు రాజు. కొన్నాళ్ళు పోయిన తరువాత రాజు ఈ బ్రాహ్మడు ఏం చేస్తున్నాడో చూద్దాం అని వెళ్తే ఆ బ్రాహ్మడు లేడు. భటులు వెళ్ళి చూస్తే ఎవరూ వుండరక్కడ. ఎప్పడో వెళ్ళిపోయాడట, అగ్రహారం ఎవరికో ఇచ్చేసాడు. రాజుకు ఆశ్చర్యమేసి అగ్రహారం ఎవరికి ఇచ్చాడో చూస్తే బుద్ధుని దగ్గర వుండే శిష్యులు అందరూ అక్కడ గోవులు పోషించుకుంటూ ఒక ఆశ్రమం లాగా పెట్టుకుంటారు. రాజు వెళ్ళి అడిగితే ఆ బ్రాహ్మడు మాకు దానం చేసాడు. ఎన్నాళ్ళ నుంచో అనుకుంటున్నాం ఒక ఆశ్రమం వుంటే బాగుండును మాకు అని, అతడి ద్వారా ఏర్పడింది అని చెప్తారు. అప్పడు రాజుకు ఆశ్చర్యమేసింది అతడికి ఇస్తే వీళ్ళకి ఇవ్వడమేమిటి? అని బుద్ధుడు ఏడి అని అడిగితే ఇక్కడ

లేరు, అని చెప్తారు. బుద్ధుడు ఎక్కడ వున్నాడో వేగుల ద్వారా కనుక్కోని బుద్ధుడి దగ్గరికి ఒక్కణ్ణే వెళ్ళి కలుద్దాం అని బుద్ధుడి దగ్గరకు వెళ్ళంగానే బుద్ధుడి ప్రక్కన బ్రాహ్మడు కూర్చొని ఉంటాడు. ఆశ్చర్యపోతాడు రాజు. మళ్ళీ ఇక్కడ చేరావేంటి నువ్వు అంటే ఏంచేస్తా? నాకు ఇదొకటి ఉందిగదా, అంటాడు. అతడు అంతే! ఆనందమే మిగతావేవి అతడికి అక్కర లేదు. అంత ఆనందంలో వుంటాడు. అంటే బుద్ధుడు అంటాడు 'వాడు నీకు ఎంత అనందం కలిగించాడో, నాకూ అంత ఆనందం కలిగించాడు. చూసావా నేను ఎంత హాయిగా వున్నానో! ఇప్పుడు శిష్యుల గోల లేదు నాకు అంటాడు. ఎందుకంటే శిష్యులతో బాధ పడిపోతున్నాడు అయన. మామూలుగా శిష్యులతో గురువుకు గోల పెరిగిపోతుంది. బుద్ధుడు వీళ్ళందరినీ పోషించాలి. బుద్ధుడికి తినడానికి ఏం అవసరం లేదు. లేకపోయినా వుంటాడు, శిష్యులు అట్లా వుండరు కదా! బుద్ధుడు మంచి నీళ్ళు త్రాగి ఉండి పోగలడు. శిష్యులు చేరిన తర్వాత ఒక విద్యుక్త ధర్మం ఏర్పడుతుంది. వాళ్ళు సరిగ్గా తింటున్నారా, చేస్తున్నారా చూసుకోవాలి కదా! ఇతనికి నువ్వు ఇచ్చావు. ఇతను వాళ్ళకి ఇచ్చాడు. వాళ్ళకి కావలసిందీ అదే! వాళ్ళకు అది దొరకంగానే నన్ను వదిలివేసారు, నాకూ తెరిపి వచ్చింది, వాళ్ళకీ తెరిపి వచ్చింది. మేమిద్దరం ఇక్కడ హాయిగా వున్నాము' అని, 'ఇతడు రజో యజ్ఞం చేయడం ద్వారా జ్ఞాన యజ్ఞం లోకి ఉద్ధరింపబడి, తనకు ఏమీ అవసరం లేని స్థితిలో నిలబడిపోయాడు. కేవలం ఆనందమే అతడికి. ఇంక ఏమీ అవసరం లేదు. మనం చూడండి మనం వెయ్యిరూపాయలు వచ్చినప్పుడు, రెండు వేలు వచ్చినప్పుడు, మూడు వేలు వచ్చినప్పుడు, నాలుగువేలు వచ్చినప్పుడూ, ఐదు వేలు వచ్చినప్పుడూ, ఆరు వేలువచ్చినప్పుడు, పది వేలు వచ్చినప్పుడూ, పదిహేను వేలు వచ్చినప్పుడు ఎప్పుడూ చాలదు అది ఏమిటో! అదేమిటి? ఏ పూటకా పూట వచ్చేది పెట్టుకుంటారు. మిగతావన్నీ రానీయకుండా, వచ్చినవి వచ్చినట్లు పంచేస్తుంటారు. యోగులు అట్లా వుంటారు. వాళ్ళు రేపటి సంగతి ఆలోచించరు. మనం ఏమో beyond our life, plan చేసుకుంటూంటాము. అంటే మన పిల్లలకి, మనవలకి వాళ్ళకి, వీళ్ళకి. వాళ్ళకి తెలుసు భగవంతుని యొక్క సంపదని యే విధంగా వినియోగించాలో. అటువంటి వాడికి ఎంతైనా ఇచ్చేస్తారు.కృష్ణుడు ఇస్తాడుకదా ! ఎంత ఇస్తాడంటే అంటే ఎక్కి తొక్కి. ఎందుకయ్యా అంటే ఏం చేసుకోడు దాన్ని తను ఏమీ తినడు అందులో. ఏమీ తినని వాడికి అప్ప చెబితే వాడు తినకుండా నలుగురుకు పెడతాడు. ఆ విధంగా ఇస్తారు కదా! కృష్ణుడు రుక్మిణి దేవి అడిగితే కుచేలుడు ఇచ్చిన దాంట్లో నేను ఏమీ ఇచ్చాను, అంటాడు. కుచేలుడికి ఉన్నదంతా ఆ గుప్పెడు అటుకులే, ఇంక ఏం లేవు. అవన్నీ ఇచ్చేసాడు. అలాటప్పుడు కృష్ణుడు తనకు వున్న దాంట్లో చాలా తక్కువ వంతు ఇచ్చినట్లేగా? మనం quality చూడాలి quantity కాదు. అందుకని కృష్ణుడు కుచేలుడికి నేనేమీ ఇవ్వలేదు అంటాడు. ఆ కథలో చాలా రహస్యాలు వున్నాయి. ఎవరైనా సరే వాళ్ళ ఆర్థిక పరిస్థితి ఇంకా బాగుపడాలి, ఇంకా బాగుపడాలి, ఇంకా బాగుపడాలి

అనుకోవడం మానేసి, వున్న దాంట్లోంచి కొంత తీసి ఇంకోళ్ళకు ఇవ్వడం నేర్చుకోవడం మొదలుపెడితే కొన్నాళ్ళ తర్వాత అది ఎట్లా పరిణమిస్తుందో చూడండి. ఒక bold experiment చేయండి. మనకు వచ్చే దాంట్లో రూపాయైనా ప్రక్కన పడేసుకోవడం ఒక అలవాటు అవ్వాలి. అయితే మహత్కార్యాలు చేయగలిగినంత సంపద వస్తుంది దగ్గరికి. వీడు పక్కన పది పైసలు పడేసుకున్నా వాడు ఇస్తాడు, ఎందుకంటే పది పడేసుకున్నాడుగా అని! మీ సంపాదనలో కొంత శాతం పక్కన పడేసి సంవత్సరానికి దాన్ని ఒక మంచి కార్యానికి చేయడానికి పెట్టుకోండి. మనం ఖర్చు పెట్తామే, ఆ ఖర్చు పెట్టిన దానిలో నుంచి ఒక పది శాతం పక్కన పెట్టండి. సంపాదించిన దానిలో నుంచి అక్కర లేదు. ఖర్చు తగ్గుతుంది అప్పుడు. ఆ తగ్గింది ప్రతి నెల ఆ bank లో వెయ్యడం కాకుండా, ఈ bank లో వేయండి. దాన్ని ప్రోగేసుకొని వాడండి. Each one of us is capable of helping much more than what we understand we can do. మనం అనుకుంటాం ఇంతే చేయగలం అని అంతకి వంద రెట్లు ఎక్కువ చేయగలం ఇది అలవాటు చేసుకుంటే! ప్రతి వాళ్ళు చేయగలరు. అట్లా ఇస్తాడు. ఎందుకంటే నీకు ఎప్పుడైతే ఈ భావం వుంటుందో ఆ భావానికి అనుగుణంగా వనరులు మళ్ళీ అక్కడ refill అవుతుంటాయి. అట్లా resourcing జరుగుతూ వుంటుంది. అది experiment చేస్తే కాని తెలియదు. ఈ రోజున భగవత్పరంగా కోట్లాది కోట్లు ఖర్చుపెట్తున్న వాళ్ళందరూ కూడా అట్లా చేసిన వాళ్ళే. మొదటినుంచి కోట్లు వుండి చేయడం కాదు కదా! అది ఎందుకు చేరదు కొంతమందికి అంటే, దానికి సంబంధించిన పద్ధతులలో ఆ తత్వాన్ని అవగాహన చేసికొని, దానితో పనిచేయక పోవడం వల్ల తప్ప, తెలుసుకొని చేస్తే వస్తుంది. లేదంటే ఇది కూడా How to do it అనే దగ్గరే వుంటుంది. ఒక పద్ధతి ప్రకారం ఉద్ధరించుకుంటే సంపద మనకు పెరగడమే కాకుండా పది మందికి పనికి వచ్చేటట్లుగా వుంటుంది, లేకపోతే ఎవరికో కట్టబెట్టి వెళతాం మనం వెళ్ళంగానే వాళ్ళు టప్పున ఖాళీ చేస్తారు మొత్తం అంతా కూడా. మనం వుండంగానే చేసేస్తే అప్పుడే పోతాం, మనం వెళ్ళిన తర్వాత చేస్తే అది మనకు తెలియదు కాబట్టి కొంతవరకు చూస్తాం. అట్లా జరుగుతూ వుంటుంది. సంపద రూపంలో ఉన్నది భగవంతుడే అని గుర్తు పెట్టుకోవాలి. బంగారం బంగారం గాను, currency ని currency గాను, building building గాను చూడవద్దు. ఎందుకంటే వసువు అనే నామం కూడా భగవంతునికి వున్నప్పుడు సంపద రూపంలో భగవంతుడు వున్నాడు అని తెలియాలి. సంపదగా వచ్చినవాడు, ఇచ్చినవాడు భగవంతుడు అని తెలియాలి. అట్లా పెట్టారు ఈ నామాలు. సంపద భగవంతుడు అయినప్పుడు, భగవంతుడు ఇచ్చింది అయినప్పుడు, దాన్ని ఇవ్వడంలో నీకు చాల శ్రద్ధ వుంటుంది. అలా కానప్పుడు ఇంకో రకంగా వుంటుంది. ఈ దానం ఎట్లా ఇవ్వాలనేది భగవద్గీత లో శ్రద్ధాత్రయ విభాగ యోగంలో వున్నది. ఎప్పుడు ఇవ్వాలి దానం? పగలే ఇవ్వాలి. పగలు ఇస్తే దానికి ఆనందం ఎక్కువ ఉంటుంది ఇచ్చిన వాడికి. పగలులో కూడా

పుణ్యమైన దినాలలో ఇచ్చిన  దానానికి ఎక్కువ ఆనందం కలుగుతుందిట. రెండోది ఎక్కడ ఇవ్వాలి ? మనం దానం ఎక్కడ పడితే అక్కడ ఇవ్వకూడదు.  పుణ్యమైన ప్రదేశంలో ఇచ్చిన దానం అంటే దైవకార్యం ఎక్కడ జరుగుతుంటే అక్కడ పునీతం అవుతుంటుంది కాబట్టి అక్కడ ఇచ్చిన దానం ఎక్కువ ఆనందం కలుగచేస్తుంది. ఎట్లా ఇచ్చాం అనే దాంట్లో ఎంత శ్రద్ధతో ఇచ్చాం అనే దాన్ని బట్టి ఉంటుంది. ఇట్లా విసిరేయడం కాదు దానం. పది మందిని పిలిచి వాడిని insult చేస్తూ అక్కడ సభలో ఇచ్చేది కాదు దానం. ఎంత శ్రద్ధతో ఇచ్చావు ? ఎంత శ్రద్ధ అంటే మీ ఇంట్లోవాళ్ళకు నువ్వు చేస్తున్నట్లు ఉళ్ళో వాళ్ళకు చెప్పం కదా మనం.  మా ఆవిడకు చీర కొన్నానని ఊరంతా చెప్పం కదా!  ఎందుకు చెప్పం ? ఎంతో ఆత్మీయకరమైన విషయం కాబట్టి. అంత ఆత్మీయతతో నువ్వు దానం చేసినప్పుడు బయట ఎందుకు చెప్పాలి? చెప్పావంటే నీకు అంత ఆత్మీయత లేదన్నమాట. ఆత్మీయతతో చేసిన దాంట్లో నుంచి ఆనందం కలుగుతుంది,  ఎవరికి ఇచ్చావ్ అనే దాంట్లో కూడా ఆనందం వుంది.  ఎవరికి ఇచ్చావు ?  ఎట్లా ఇచ్చావు ?  ఎక్కడ ఇచ్చావు ? ఎప్పుడు ఇచ్చావు ?  నాలుగు చెప్తాడు శ్రీకృష్ణుడు.  అది చూడండి. అట్లా  ఇస్తున్నకొద్దీ దాంట్లోంచి ఒక తెంపు వస్తుంది. ఇదంతా know how. ఇది తెలిసినకొద్దీ మనం దీంట్లో నుంచి ఎక్కువ అనుభూతి పొందుటానికి అవకాశం ఏర్పడుతుంది.

వసు అంటే సంపద. వసుధా అంటే సంపదని ఇచ్చే వాడు. సంపద రెండు రకాలుగ ఉంటుంది. మనకి ఆనందాన్ని, అనుభూతిని ఇచ్చే సంపద ఒకటి. దుఃఖాన్ని ఇచ్చేది కూడా ఒక సంపదే! సంపదతో సుఖ పడొచ్చు, సంపదతో దుఃఖ పడొచ్చు. సంపద కావాలనుకొని బాధ పడుతూ ఉండొచ్చు. ధర్మబద్ధమైన ఆర్జన మనకి ఆనందాన్ని కలిగిస్తుంది. ధర్మబద్ధం కాని ఆర్జన దుఃఖాన్ని కలిగిస్తుంది.  మనకి బాగా సంపాదన పెరుగుతూ ఉంటె, ఇంకో పక్క ఏదో మునిగి పోతుంటుంది అనుకుంటాం. ఒక పక్క పెరుగుదల ఉండి, ఇంకో పక్క తరుగుదల ఉండవచ్చు. ఎదో ఒకటి మనని బాధిస్తూనే ఉంటుంది. మనకి సంపదని అనుభూతి చెందటానికి అవకాశం ఉండదు. ధర్మబద్ధమైన సంపాదనే అనుభవించడానికి మనకి అవకాశాన్ని ఇస్తుంది. లేకపోతే అది ఉన్నా కూడ లేనివాళ్ల లాగే ఉంటాం. బాగా సంపద వుండి ఇంట్లో ఎవరికో ఒకరికి తీవ్రమైన అనారోగ్యము ఉంటుంది. సంపద ఉందని గుర్తు తక్కువ ఉంటుంది. తీవ్రమైన అనారోగ్యము గురించి భావన ఎక్కువ ఉంటుంది. సంపద బాగా ఉండవచ్చు, పిల్లలు పైకి రాకపోవచ్చు. పిల్లలు ఇంకో రకముగ తయారై దుఃఖం కలిగించవచ్చు. సంపద అంటే మనం డబ్బు అనుకుంటాము. అది కాదు. సంపద అంటే మనం బాగుండడం, ఆరోగ్యముగ ఉండడం, మన కుటుంబ సభ్యులందరు ఆరోగ్యముగ ఉండడం, అభివృద్ధి చెందుతు ఉండడం, సత్సాంప్రదాయాలతో పెరుగుతూ ఉండడం, క్రమబద్ధంగా జీవిస్తూ ఉండడం. మన చుట్టూ ఉండే వాతావరణంలో మనకి ప్రతికూలత తక్కువై, అనుకూలత ఎక్కువ అవటం సంపద వృద్ధి చెందడమే! చాల మంది శత్రువులు ఉన్నారనుకోండి,

మనకి ఎంత సంపద ఉన్నా ఉపయోగము లేదు. ఎందుకంటే శత్రువులు గురించే ఆలోచించటం తోనే సరిపోతుంది. పిల్లలు బాగా చదువుకోడం లేదు. వాళ్ళకి మనం లక్షలు కట్టి seat ఇప్పించినా ఇంకో అలవాట్లు నేర్చుకుంటారు. సంపద అంటే కేవలం ధనమే అనుకోవడం కాదు. ధనం అనే పదానికి 'ధనమగ్నిర్ధనం వాయుర్ధనంసూర్యోధనం వసుః' అంటాం మనం. మనకి సమృద్ధి, ఆనందం కలిగించే పరిసరములు, అనుకూలత కలిగిన సన్నివేశములు, ప్రతికూలత లేని సన్నివేశములు ఇవి సంపద. రాముడు వెళ్ళిపోయాక దశరథుడికి రాజ్యములో ఏమి ఆనందము ఉన్నదీ? అలా ఉంటుంది. అసలు ఆయన లేకుండ బోలెడు సంపద ఉందనుకున్నా, ఉపయోగము లేదు. అందుకని భగవంతుని సరైన సంపదని కోరాలి అనే సద్బుద్ధి మనకి కలిగి, ఆ కారణముగా మనం ఆర్జన చేసుకొని, తద్వారా జీవిస్తూ ఉంటె, మనకి అంతకు ముందు బాగుండనివి కూడ సంపద పెరగటంతో పాటు, బాగుండడంగ తయారు అవుతాయి. నోట్ల కట్టలు బాగా వచ్చి, ఆస్తులు వచ్చి, ఇంట్లో వాళ్ళకి బాగుండక, శత్రువులు పెరిగిపోయి, మానసిక అనారోగ్యము బాగా పెరిగిపోయి, ఇట్లా ఉంటె మనకి సంపద సరిగ్గా లేదనుకోవాలి. ఆర్జన సరిగ్గా లేని వారికి, జీవితములో ఆ ఆర్జన కారణముగ మిగత వాటిలో success కాలేరు. అందుకని సక్రమము అయిన మార్గములో మన చుట్టూ చేరినవన్ని కూడ మనకి ఆనందాన్ని ఇస్తాయి. మనచుట్టూ దుఃఖాన్ని ఇస్తున్నాయి అనుకోండి, అది సంపద కింద రాదు. పుత్రుల వల్ల దుఃఖము, బంధువుల వల్ల దుఃఖం, స్నేహితుల వల్ల దుఃఖం, సంఘం వల్ల దుఃఖం సంపద కాదు. ఇవన్నీ మనం చేసే వాటిలో ఏమైనా తేడాలు ఉంటె వస్తాయి. అందుకని మొత్తము మనకి కనిపించేది, మనచుట్టూ ఉండేది కూడా సంపద కాదు. ఎట్లా ఉంటుందంటే, మనం మంచి ఖరీదైన కూరలు తెచ్చుకొని మంచి భోజనం తాయారు చేసుకుంటే తీరా తినటానికి నోచుకోలేని స్థితి ఉంటుంది. లేదా వండుకున్నా రుచిగా ఉండకపోవచ్చు. అంటే అనుభవించటానికి యోగ్యత లేదని అర్థము. అనుభవించగలిగింది సంపద కానీ, అనుభవించటానికి అందని సంపద, సంపద కాదు. అనుభవించ లేని సంపద ఉన్నా లేనట్టే! పెళ్లి చేసుకున్నాడట, డబ్బుసంపాదన కోసం అమెరికా వెళ్ళాడుట, పెళ్ళాం ఇక్కడ ఉండిపోయింది, visa రాలేదుట. ఆయన అక్కడ ఉండిపోయాడు, ఈవిడ ఇక్కడ. డబ్బులు బాగా ఉంటాయి సుఖము లేదు. భారత జాతికి ఇప్పుడు శని గ్రహము అధిదేవతగ పని చేస్తున్నాడు. మకర రాశి, శని గ్రహము. అంటే ధర్మంతో యోగం చేసుకొని, తత్ ప్రకారము క్రమశిక్షణతో జీవించటానికి ప్రయత్నించక, డబ్బు కోసం, పదవి కోసం జీవించటం చాల ఎక్కువగా ఉంది కాబట్టి జాతికి, చక్కటి శిక్షణ ఇస్తేనే తప్ప అనుభూతి పొందటానికి అర్హత లేదు. అందుకని మనకి ఏ అనుభూతులు లేవు. మనం నీళ్లు త్రాగలేము. రోడ్లు మీద నడవలేము. ఇంట్లో fans పెట్టుకున్నా దోమలు కుడుతూనే ఉంటాయి. Railway platform లాగే ఉంటుంది ప్రపంచము అంత కూడ. కలి యొక్క

ప్రభావం భారత దేశము మీద ఎక్కువ. ఆ కారణము చేత నిజముగా సంపద మనకి కావాలంటే చేసేది ధర్మ బద్ధముగా ఉన్నదా లేదా అని చూసుకొని చేయగలిగి ఉండాలి. అలా చేయని వాడికి ఏదీ అనుభూతి ఇవ్వదు. అనుభూతి ఇవ్వలేదని తెలిసినప్పుడు ఎక్కడో పొరపాట్లు ఉన్నాయి అని మనం సరి దిద్దుకోవాలి అనుకోవాలి తప్ప, బయట ఏవో కారణాలు చూడకూడదు. లోపల కారణాలు వెతుక్కోవాలి. లోపల కారణాలు మనం బాగా సరి దిద్దుకున్నట్టయితే అనుభూతి పరమైన సంపద మనకి ఉంటుంది. ప్రశాంతముగ ఒక పూట భోజనము చేయగలిగితే అదే మహా భాగ్యము పరుగెత్తుకుంటూ జీవించే జీవితము కన్నా! మనకి అందుకే అప్పుడపుడు ప్రశాంతమైన ప్రదేశాలకి వెళ్తే అనిపిస్తుంది. ఏవిటో, ఇలాంటి జీవితాలు జీవిస్తున్నాం నగరాలలో పడి. అది సత్యం. కారణము ఏమిటంటే, జీవనం లేదు. ఎదో జీవించేటట్టుగా, అర్ధ రహితమైన జీవితము ఎక్కువగా ఉండటం వల్ల సంపద అనుభూతి పొందగల అర్హతనంతా పోగొట్టుకున్నాం. అందుచేత ఎంత ఉన్నా అనుభూతి లేని దుస్థితి ఏర్పడింది. ఎంత ఉన్నా తృప్తి లేని జీవితము కన్న, కొంత అనుభూతి ఉండి తృప్తిగా ఆనందంగా జీవించగలిగాలి. ఉన్నదాన్ని అనుభూతి చెందగలిగాలి. ఆ చెందగలనివ్వడం అనేది మన యొక్క ధర్మ బద్ధతని బట్టి ఉంటుంది. ధర్మ బద్ధత లేకపోతే ఉండదు. అందుకని భగవంతుడు సంపద రూపంలో అనుభూతిని ఇస్తాడు, శిక్షణ కూడా ఇస్తాడు. ఎందుకంటే సంపద ద్వారా దుఃఖపడి తద్వారా తనని మార్చుకోడానికి ఒక ప్రయత్నం లోకి ఇస్తాడు. అందుకని వసు రూపంలో భగవంతుడు ఉన్నాడు.

వసుద అనే పదానికి అర్ధము 'ఇచ్చే వాడు'. సంపదలో అనుభూతి చెందింపజేసి, ఆహ్లాదాన్ని మనకి కలిగేటట్టుగా ఇస్తాడు. కొంత మంది ఇళ్లల్లోకి చూస్తే, కొబ్బరి చెట్టు పూర్తిగా కాపు కాసిన తరువాత, రేపు దింపుకుందాము. అనుకుంటే, ఆ రోజు రాత్రి దొంగలు కొబ్బరికాయలు దింపుకొని ఎత్తుకుపోతారు. ఎందుకు ఇట్లా ఉంటుందంటే అనుభవంతో కూడిన సంపద అక్కడ లేదు. సంపద మాత్రమే ఉన్నది. చాల పొలాలున్నాయండి కాని పంట చేతికి రాలేదంటారు. వాళ్ళు వీళ్ళు మన దగ్గర డబ్బులు తీసుకుపోయి మనకి ఇవ్వరు. ఇలా ఎదో విధంగా మొత్తానికి అనుభవించడానికి అర్హత లేకుండా ఉంటారు. వసుధ అంటే ఉన్నది అనుభవింపజేసేటట్టుగ చేయటం. మనం కూడ ఇతరులకి ఇచ్చేది వారికి అనుభూతి కలిగే విధముగా ఇవ్వటం. సాధన పరముగ చేయాలి. శ్రద్ధ అనేది ఉండాలి. మూడు రకాలైన శ్రద్ధ. 1. ఎదుటి వ్యక్తియందు నారాయణుని దర్శనము చేస్తూ ఇవ్వటం, 2. కాలం ఎరిగి ఇవ్వటం, 3. దేశము ఎరిగి ఇవ్వటం. కాలము, దేశము, పాత్రత. ఈ మూడు శ్రద్ధాత్రయం లో వస్తాయి. కాలం ఎరిగి ఇవ్వాలి, అంటే సూర్యుడు సాక్షిగా ఇవ్వాలి. దేశం ఎరిగి ఇవ్వాలంటే, పుణ్యమైన ప్రదేశములో, దివ్యమైన అంటే దైవ సాన్నిధ్యము ఉన్న ప్రదేశములో దానము ఇవ్వమన్నారు. దైవ సాన్నిధ్యము బాగా ఉండటం అంటే, ఇచ్చేటప్పుడు మనలో ఉండాలి

దైవ సాన్నిధ్యము. ఇచ్చేవాడు, పుచ్చుకొనేవాడు ఒకటే అని తెలిసి ఇవ్వాలి. మూడోది ఇస్తున్నవాడు, పుచ్చుకుంటున్నవాడు నారాయణుడే అన్న భావనతో ఇవ్వాలి. ఆ భావన లేకపోతే మనం ఇచ్చినా తృప్తి ఉండదు. అందుకని ఈ మూడు విధాలుగా ఇవ్వటం జరుగుతుంది. భగవంతుడు అందరికి ఆ విధంగా ఇస్తున్నాడు. పాత్ర ఎరిగి ఇస్తున్నాడు. ఎవరికి పడితే వారికి ఇవ్వటం లేదు సంపద! కదా ? కాలం ప్రకారము వస్తూ ఉంటుంది. Time రావాలండి, jupiter లగ్నం లోకి వస్తోంది అంటుంటారు కదా. దేశం, పాత్రత కాలము ఎరిగి యటల మన దగ్గరకి సంపద చేరుతుందో, మనమూ కాలము, దేశము, పాత్రత ఎరిగి దానము చేయకపోతే ఆనందము రాదు. చాల మంది ఎంతో ఉపయోగకరమైన పనులు చేసి బాధ పడుతుంటారు. కారణము పాత్రత లేకపోవడం. Untimely అవటం. కాని ప్రదేశములో ఇవ్వటం. ఈ మూడు కారణముగ ఆనందము కలగదు. కాబట్టి, మనకి భగవంతుడు ఏ విధంగా కాలానుసారంగ, ధర్మానుసారంగ, పాత్రత ఎరిగి ఇస్తున్నాడొ, మనము కూడ అదే విధంగా దానము ఇవ్వాలి. మన వద్దకు సంపద చేరినప్పుడు, భగవంతుడు మన దగ్గరకు చేరాడని గుర్తుండాలి. సంపద వచ్చినప్పుడు భగవంతుడి తత్వమే వచ్చిందని గుర్తు ఉండాలి. ఎవరికైనా ఇచ్చినా కూడ భగవంతుడికే ఇస్తున్నామని గుర్తుండాలి. ఇచ్చేవాడు వాడు, అని గుర్తు ఉండాలి. మనము ఇచ్చామని కాదు. ఆ విధంగా ఇవ్వటం మొదలు పెడితే మనం పెరగటం మొదలు పెడతాం.

## 281 నైకరూపః

నైకరూపో అంటే అనేక రూపాలు కలిగినటువంటి వాడు భగవంతుడు అని. ఎన్నో రూపాలుగా ఏర్పడిన భగవత్ తత్త్వానికి పెట్టిన పేరు నైకరూపః. ఎన్ని రూపాలు అంటే ఎన్నయినా ఉంటాయి. మనకి కనిపించే రూపాలన్నీ భగవంతుడే! విష్ణూపాసన అని మనము చెప్తూంటాం. అయితే ప్రతి రూపము భగవంతుడిదే అని చెప్పకోడము సులభం, ఆచరణకు కష్టం. ఎవరినైనా పిలిస్తే వారిలో 'విష్ణువు' ని చూడగలగాలి. కాని చూడలేము. మనల్ని పొగిడినప్పడు మనవాడు అనుకుంటాం. తిడుతున్నపుడు వాడు చెడ్డవాడు అనుకుంటాము. కేవలము మనుషులలో కాదు, సమస్త జీవ కోటిలో భగవంతుడిని దర్శనము చేయగలిగినపుడు 'నైకరూప' అనే నామం మనకి అవగాహన అయినట్లు. జ్యోతిషపరం గా కూడా రాశులలో అనేక జంతువులను చూస్తాము. సకల జీవరాశులలో రూపము ధరించి ఉన్నవాడు 'ఈ నైకరూప' అని గుర్తుంటే మనకి పై పొర విడిపోతుంది. లేకపోతే ఆ పొర అట్లాగే ఉంటుంది. అది విడనిదే లోపలకి వెళ్ళటానికి మార్గము లేదు. కనబడుతున్నదంతా వాడి యొక్క స్వరూపము అని గుర్తు లేకపోతే బాధలు పడతారు. ప్రవర్తిస్తున్నది అంతా వాడే అనుకోవడం ఆ తరువాత. ఆ తరువాత నీ ప్రవర్తనకి ఆధారభూతము అయిన చైతన్యము కూడ వాడే! మూడు అవుతాయి. ఒక పక్కనేమో రూపం! ప్రతి రూపమూ ఒక విధంగ ప్రవర్తిస్తుంది. నక్క లాగ కుక్క ప్రవర్తించదు, కుక్క లాగ నక్క ప్రవర్తించదు. గాడిదలాగ మనిషి ప్రవర్తించడు. ఏ రూపానికి సంబంధించిన ప్రవర్తన ఆ రూపానికి ఉంది. ప్రవర్తనలో ప్రవర్తకుడిని చూడాలి. ప్రవర్తకుడు ఒకడే, ప్రవర్తనలు చాలా ఉన్నాయి. రూప కల్పన చేసే ప్రజ్ఞ ఒక్కటే, రూపాలు చాలా ఉన్నాయి. ఒకటే బంగారము అయినా రూపాలు రకరకాలు చేసుకుంటాము కదా! ఒకే మట్టి అయినా రకరకాల వస్తువులు దానితో చేస్తుంటాము. అంటే రూపం తయారు అవటానికి మూల పదార్థము ఒకటే! అదే చాలా రూపాలుగా తయారు అవుతోంది. అలాగే ఒక్కొక్క రూపం ఒక్కొక్క రకముగా ప్రవర్తిస్తూ ఉంటుంది. మనము ఏది ఎట్లా ప్రవర్తించినా, అది అట్లాగే ఉంటుంది అనుకొని, దాని ప్రకారము మన ప్రవర్తన సరిచేసుకోవాలి తప్ప, దాని ప్రవర్తన సరిచేద్దాము అనే భ్రమలో ఎప్పడూ పడ కూడదు. పక్కవాళ్ళు బాగుంటే బాగుండును, అని అనుకోడం ఎప్పడూ ఉపయోగము లేని ఆలోచన. పక్క వాళ్ళతో ఎప్పడూ బాగుండదు, అలాకాక వాళ్ళు ఎప్పడూ ఇంతే, అని అనుకున్నాము అనుకోండి, ముందు సగం ప్రశాంతత వస్తుంది. అవతల వాడి స్వభావాన్ని బట్టి మనం ఎట్లా మెలగాలో తెలుసుకోవాలే తప్ప, ఎవరినీ మార్చే ప్రయత్నాలు ఏమి ఉండవు. అక్కడ మనం చూసుకోవాలి. ఎదుటి వ్యక్తి చైతన్యముతో మనము ప్రవర్తిస్తున్నప్పడు, ప్రవర్తన వెనకాల చైతన్యము ఉంది కద అని గుర్తుండాలి. ప్రతి వాడు చైతన్య స్వరూపుడే! చైతన్యము మీద ఉన్న వెలుగు ప్రవర్తన. ప్రవర్తన మీద వెలుగు రూపం. మనం మాటిమాటికి ఎవరితో మాట్లాడాలి, చైతన్యముతో మాట్లాడాలి. మనం చైతన్యముతో మాట్లాడాలంటే మనం చైతన్యవంతులమై మాట్లాడాలి. చైతన్యము ఉన్నవాడు, ఎదుట వ్యక్తి రూపం లో ఉన్న చైతన్యముతో మాట్లాడినపుడు అది ఆధారంగా అతనికి మార్పు రావటానికి అవకాశము ఉంది. అది ఒక రసాయన చర్య. అలా కాకపోతే

రాదు. అందుకనే చైతన్యస్ఫూర్తి గలవారు ఏదైనా మాట్లాడితే, ఎదుటి వారిలో మార్పు రావటానికి అవకాశము ఉంటుంది. అలా లేనప్పుడు ఎవరు పడితే వారు చెపితే మార్పు రాదు. ఒక పిల్లవాడు బాగా sweets తింటూ ఉంటాడు. పిల్లవాడి తల్లి వచ్చి రామకృష్ణ పరహంస తో 'మా పిల్లవాడు ఎక్కువ sweets తింటున్నాడు, మీరు వద్దని చెప్పండని.' చెప్తుంది. ఈయన 'ఓ మండలం రోజులైనాక మళ్ళీ రండి', అని చెప్తాడు. అప్పుడు మళ్ళీ పిల్లవాడిని తీసుకువస్తుంది. వస్తే రామకృష్ణ పరమహంస 'sweet అలా తినకూడదు నాయనా, తప్పు, జబ్బు చేస్తుంది, అమ్మ చెప్పినట్టుగా తిను,' అని చెప్తారు. పిల్లవాడు మాట వింటాడు. వాళ్ళ అమ్మ ఇస్తే కాని తీసుకోడు sweet కోసం ఎగపడటం కాని, కొనుక్కోవడం కాని చేయడు. అప్పుడు వాడి తల్లికి ఏమిటి ఈ ప్రక్రియ అని కుతుహలం కలుగుతుంది. ఆమె రామకృష్ణుల వద్దకు వెళ్ళి 'మొదటి సారి వచ్చినప్పుడే ఎందుకు చెప్పలేదు తినవద్దని, రెండో సారి ఎందుకు చెప్పావు' అని అడుగుతుంది. అంటే 'నేను బాగా sweet తినే ప్రవర్తన కలిగి ఉన్నాను. తీయని నోటితో తీయని వస్తువులు తినకూడదు అని పిల్లవాడికి చెప్తే పని చేయదది. మనం ప్రవర్తించి, ఇతరులకు చెప్తే అది ప్రభావము చూపిస్తుంది. అందుకని నా ప్రవర్తనలో నేను మార్పు తెచ్చుకొని, నేను ఆ మాట చెప్పడము వలన ఆ విధంగా అతనిలో మార్పు కలిగింది, తినడం మానేసాడు' అని చెప్తాడు. వాస్తవికంగా మనం ఆచరించి అప్పుడు చెప్తే దాని ప్రభావము ఉంటుంది. ఎందుకంటే అది చైతన్యము నుంచి సరాసరి వ్యక్తమై ఎదుటి వ్యక్తి లోని చైతన్యాన్ని మేలు కొలిపి, ఆ చైతన్యము ఆధారంగా స్వభావంలో మార్పు తీసుకు వస్తుంది. అది మహాత్ములు చేసే నిర్ణయాలు. నాదస్వరానికి నాగు పాములు ఎట్లా ఊగుతాయో, అట్లా మహాత్ములొక్క వాక్కుకి పామర జనులు అనుసంధానము చెందుతారు. సమన్వయము జరుగుతుంది. తద్వారా ఆ వాక్కు లోపల చైతన్యాన్ని మేల్కొల్పడం వలన లోపలి నుంచి సహజముగ మార్పు వస్తుంది. అట్లా మార్పులు తీసుకురావటమే మనకి పెద్దలు చేసే పని. వాళ్ళు మనలో ఉండే స్వభావాన్ని చూసి ఏకీభవించకుండా, సరాసరి చైతన్యముతో మాట్లాడడానికి ప్రయత్నము చేస్తారు. తద్వారా చాల మందికి అవగాహనలో, స్వభావములో మార్పులు రావటానికి అవకాశము ఏర్పడుతుంది. అలా కాకుండా చెప్పినపుడు, ఏ ఉపయోగమూ ఉండదు. అందుకని, రూపం వెనకాల ప్రవర్తన, ప్రవర్తన వెనకాల ప్రవర్తకుడు. రూపంలో ఉన్న పదార్థము ఒకటే, రూపాలు వేరు. ప్రవర్తనలు వేరు, ప్రవర్తకుడు ఒకడే! అందుకని ప్రవర్తకుడిని 'వాసుదేవుడు' అన్నారు. వాడు ఏమి మాట్లాడాడు అని చూసుకుంటే, మాటలలో మనకి బాధ కలిగించవచ్చు. వాడు మాట్లాడటం అనేది ఒకటి చేస్తోందిగా లోపల, అది వాసుదేవుడు. మాటలకి వేరువేరు అర్థాలు ఉంటాయి, కానీ మాట్లాడటం అనేదొకటి ఉంది కద. అది కూడా వాసుదేవుడే. అది కాక ప్రతివాళ్ళు వాళ్ళు చేసే పనుల్లో, వాళ్ళ ప్రవర్తనలో కనిస్తుంది, వాడిని 'నర్తకుడు' అంటారు. అది రెండో దశ. మొదటిది రూపాన్ని చూడాలి. అది రూపం చూసినప్పుడు గుర్తులేకపోతే సాధన ఉండదు. రూపాలలో చూసినపుడు గుర్తుకువస్తేనే ఆ పొర వీడుతుంది. పొర విడకుండ ఎన్ని నేర్చుకున్నా ఉపయోగము లేదు. కొన్ని రూపాలని చూస్తే ఆనందముగ ఉంటుంది, కొన్ని రూపాలని చూస్తే అంత ఆనందముగ ఉండదు. మంచిరూపాల ద్వారా, రూపాతీతమైన అందాన్ని పొందటానికి ప్రయత్నించాలని చెప్తారు. అందాన్ని పట్టుకొని ఆత్మజ్ఞానం పొందడమనేది ఉంది. మనిషి

బాగుండకపోయినా, వాడి ప్రవర్తన బాగుంటే వాడితో చాల మంచి సఖ్యతతో ఉంటారు. మనిషి చాలా బాగుండి, ప్రవర్తన బాగుండకపోతే ఎన్నాళ్ళు ఉంటారు వాడితో? ఏది ఎక్కువ ఆనందాన్ని ఇస్తోంది మనకి? Behavior as beauty ఒకటి, Form as beauty ఒకటి. Form as beautiful లో నే ఎక్కువ జీవిస్తుంటారు మనుషులు. పాశ్చాత్య దేశాలలో రూపాన్ని చూసి స్త్రీ పురుషులు ఆకర్షితులై, మళ్ళా ఆరునెలలలో విడిపోతూ ఉంటారు. ఎందుకంటే ఆరునెలలలో ప్రవర్తన ఒకదానికి ఒకటి ఢీ కొని ఉంటాయి. అందుకనే రూపములో కంటే ప్రవర్తనలో అందము ఎక్కువ ఉన్నది. ప్రవర్తన కన్నా, దాని వెనకాల చైతన్యము ఇంకా అందముగా ఉంటుంది. అది తెలిసినపుడే పరమప్రేమ అనేది మనలో నుంచి వ్యక్తము అవుతుంది. అందరిలో ఉండే చైతన్యము 'నేనే' అని తెలిసినపుడు, సహజముగ ప్రేమ వ్యక్తము అవుతుంది. అందుకని Beauty as Pure Love ఒకటి ఉన్నది. పరిపూర్ణమైన ప్రేమ కన్నా మించిన అందము ఇంకొకటి లేదు. అందుకు రావణాసురుడు రాముడిని చూసి సీతతో 'చూసావా అతడు ఏమ్ బావున్నాడు? అతడితో ఎందుకు, నాతో వచ్చెయి' అని చెప్తాడు. ఎందుకనీ? తన దగ్గర ఉన్న తన ఒంటిమీదవి, తల మీదవి చూడమంటూ, నా రథం చూడు, నా గుర్రాలు చూడు అంటూ అన్ని చూపిస్తూ ఉంటాడు. రాముడేమో నెత్తిమీద ఒక ముడి, ఒంటిమీద నార బట్టలు, ఒక నగా, ఒక సంపదా, ఒక వైభవమా అతడిలో ఏమి చూసి నువ్వు వెంటపడుతున్నావు? నా దగ్గర ఇంత ఉంది కదా, నువ్వు ఎందుకు నాతో ఉండవు? అని అడిగితే, మనం రామాయణము చదువుకున్నాము కాబట్టి మనం సీత చేసింది correct అని చెప్తాము. కాని మన వరకు అలా ఉండము. ఎందుకు అట్లా ఉండలేము? సీత శక్తి చైతన్యముతో అనుసంధానము అయినది. మనకు అలాంటి అనుసంధానము లేదు. అందుకని మనకి ఆకర్షణతో కనిపించినది ఏదైనా ఉంటే, వెళ్ళిపోతునే ఉంటాము దాని వెంట. పెద్దవే అక్కరలేదు చిన్న చిన్న ఆకర్షణలు చాలు. విశ్వామిత్రుడు వంటి మహర్షుల కోసం ఊర్ధ్వ లోకాల నుండి అత్యంత అందమైన రూపాలు కట్టుకురావలసి వచ్చిందట. గంధర్వలోకములో వయ్యారంగ వెలిగే శబ్ద తరంగాలు ఉంటాయే, అవి వెలుగుగా రూపు కట్టుకు వస్తాయి. అప్సరసలంటే అతి సుందరమైన నడక కలిగిన శబ్దము, వెలుగుల రూపం! శబ్దము తరంగాలలో తిరుగుతూ ఉంటుంది. అది చాల అందముగా ఉంటుంది. వింటే మనం తన్మయము చెందుతాము. అటువంటి శబ్దము అతి సుందరమైన వెలుగుల రూపముగా దిగి వస్తే అది అప్సరస! అంతటి వాళ్ళు వస్తేనే తప్ప వాళ్ళు కదలరు. మనకి అంత అక్కర్లేదు. ఓ 10% commission ఇస్తానంటే ఏ పనికైనా సిద్ధమే! మీరు కూడ 1% వేసుకోవచ్చంటే చాలు ఓహ్ ఎగపడతారు. 1% మనకి ముఖ్యము తప్ప మిగతావి ముఖ్యము కాదు. అట్లా ఉన్నపుడు, రావణాసురుడు, వాడి వైభవము, వాడి వ్యవహారము చూస్తే, రాముడిని చూస్తే మనమైతే it is the commonsense that we have to follow Raavana అని చెప్తాము. మనం అందరము అదే కదా చేస్తున్నాము ఇప్పుడు. డబ్బున్న వాళ్ళ వెనకాల, power ఉన్న వాడి వెనకాల నాద స్వరం ఊదితే నాగుపాములా తిరుగుతాము. కీర్తి ప్రతిష్టలు, డబ్బు, పదవి ఉన్న వారి వెంట తిరగటం మనకి బాగా తెలుసును. మరి మనకి ఆధ్యాత్మికత ఏమిటి? ఎదుటివాడు Collector అయితే వీడి భుజాలు వంగిపోతూ ఉంటాయి అనవసరంగ. ఎదుటి వ్యక్తికి మన అవసరము ఉంటె, భుజాలు పైకి లేచి collar పైకి వెళ్ళిపోతుంది. అలా ఉన్నచోట ఇది

వీలు పడే రకము కాదు. Consciousness ని / చైతన్య స్వరూపాన్ని అనుభూతి చెందిన వాడి దగ్గర ఉండేది pure love. అంటే అది అందరిలో ఉంది కాబట్టి అందరిని ఒకే విధముగా ప్రేమిస్తాడు అతడు. ప్రేమించడం ఉండదు, అట్లా ప్రవహిస్తుంది ప్రేమ. అది ఇది ఒకటే కదా! మనలని మనం వేళ్ళు అచ్చులు పడేటట్టుగా లెంపకాయ కొట్టుకోగలమా? ఏమైనా మాయ బాగా ప్రకోపిస్తే తప్ప, మనని మనము కొట్టుకోము, గిల్లుకోము. చైతన్య స్ఫూర్తి ఉన్న చోట అది పరిపూర్ణమైన అందమట. ఆ అందము చూస్తే ఇక ఏ అందము దానిముందు దిగదుడుపేట! అది సీతాదేవి రాముడిని చూసినపుడు పొందిన ఆనందము. అందంలో ఆనందము అంటే మనకి సంబంధించిన అవగాహనలో చూసుకోవాలి. అందము మూడు తరగతులలో ఉంటుందిట. మనకి తెలిసిన అందము రూపానికి సంబంధించిన అందం. కాస్తోకూస్తో ప్రవర్తనకి సంబంధించినది రెండోది. ఏమిటది? పాపం అంత అందముగా ఉన్నా అందము లేని భార్య దొరికింది అతనికి అంటాము. అంటే, రూపానికి సంబంధించి! అతి వికారంగా ఉన్న భార్య అయినా అతడు ప్రేమగా ఉంటాడు. ఎందుకంటే, వాళ్ళకి ప్రవర్తనలో కుదిరింది. ప్రవర్తన అందముగ లేకుండా, రూపము అందముగా ఉందనుకోండి, విడిపోతారు. ప్రవర్తన అందము ఉంది, రూపము అందము లేదనుకోండి కలిసి ఉంటారు. రావణాసురుడు చాల అందగాడు. రావణాసురుడిని చూసి రాముడే ఆనందము పొందుతాడు, ఎంత బాగున్నాడురా వీడు అని. అంటే పై బాగే ! సినిమాలలో వేషాలు వేసేవారు ఎంత బాగుంటారు. ప్రవర్తన చూస్తే చెప్పలేము. ప్రవర్తనలో అందము చూడగలిగిన వాడు ధన్యుడు. రూపములో అందము చూసేవాడు మూర్ఖుడు. రూపములో అందము చూసి తన దగ్గర పెట్టుకుందాము అనుకునేవాడు దుష్టుడు. పువ్వులు, కుక్కలు, పిల్లులు, వీటన్నిటిని కూడ తెచ్చి పెట్టుకుంటూ ఉంటాము కదా. అందముగ పువ్వు కనిపిస్తే కోసి సిగలో పెట్టుకుందామనుకుంటాము. స్వంతము చేసుకుందామనుకోడం బంధం. రూపములో అందము చూసి మోహ పడేవాడిని ఈ ప్రపంచము శుభ్రంగా బంధించేస్తుంది. ప్రవర్తనలో అందము చూసిన వాడు ఒక పొర తీసిన వాడు. వాడు ప్రవర్తనలో అందము బట్టి, అనుబంధము పెట్టుకుంటాడు. ఇంకోడు ఉన్నాడు, ప్రవర్తనతో కూడ సంబంధము లేదు. దానికి అవతల ఉంటుందే, 'చైతన్యము,' దానితో సంబంధము. వాడికి అన్నీ ఒకటే! అక్కడ దాన్నే 'ప్రేమ' అంటారు. ప్రవర్తనలో అందాన్ని 'సమత్వం' అంటారు. రూపములో అందాన్ని మనం ఎరిగిన 'అందము' అంటారు. అందము అందముగా ఉంటుంది, సమత్వముగా ఉంటుంది, పరమ ప్రేమగా ఉంటుంది. ఇలా మూడు రకాలుగా ఉంటుంది. అమ్మవారు సింహం మీద ఉంటుంది. ఆ సింహం చాల అందముగా కనిపిసుంది. అలా అని సింహం దగ్గరకి వెళ్తే, ఎప్పుడూ మనం సింహము దగ్గరకి వెళ్లకూడదని చాలా సులభం గా తెలుస్తుంది దాని ప్రవర్తనని బట్టి. ఒక్క సారి అది అరచిందంటే మనకి భయము వేస్తుంది. ప్రవర్తనయందు సమత్వం కలిగిన వారంతా వేరే స్థితికి చేరిన వారు.

ఎదుటి వాడి ప్రవర్తన చూసి, వీడు ఇట్లా ఉంటాడు, ఇంత కంటే ఉండడు అని తెలుసుకోవడము, వాడ్ని గూర్చిఊరికే ఎందుకు రొప్పు పడడం అని తెలుస్తుంది. వాడు ఎప్పటికీ ఇట్లాగే ఉంటాడు, అని ఉపయోగము లేదు. మారితే వాడి అదృష్టం. వాడు

మారితే మన అదృష్టము అనుకోవచ్చు కూడ. ప్రక్కవాళ్ళు మారాలి అనుకోడములోనే ఉంది మొత్తము గోలంత. ప్రక్కవాళ్ళని మార్చేయాలని ఉద్యమాలు చేస్తే ఎందుకూ పని చేయవు. వాడి అంతట వాడికి మారాలి అని పుట్టాలి తప్ప, ఇంకోడు మార్చేద్దామనుకుంటే వల్ల కాదు. అందర్నీ మారుద్దామని try చేస్తే, అంత కన్నా వెర్రివాడు ప్రపంచములో ఇంకోడు లేడు. వాడు మారదాము అనుకున్నపుడు, వాడికి తగ్గ కార్యక్రమాలు వాడు నిర్ణయము చేసుకుంటూ ఉంటాడు. అందుకని ప్రవర్తనయందు ప్రవర్తకుడిని చుసిన వాడు మాత్రమే సమభావము కలిగి ఉంటాడు. వాడు ఎక్కువ అందగాడు. రూపంలో అందము కన్న అందమైన వాడు. అంత కన్న అందము చైతన్యముతో అనుసంధానము చెందిన వాడు పరిపూ ర్ణమైన అందము కలిగిన వాడు. అక్కడ మనకి రాముడు, కృష్ణుడు తార్కాణముగ కనిపిస్తారు. అక్కడ పరమ ప్రేమ ఉంటుంది. రావణాసురుడ్ని చూడగానే రాముడికి ఆనందమే కలిగింది కాని కోపము కలగలేదు. లక్ష్మణుడికి చాలా ఆవేశము వచ్చింది. అట్లాగే కృష్ణుడికి కూడ దుర్యోధనుడు ఎన్ని సార్లు పిచ్చి పనులు చేసినా అతడిని చూసినప్పుడు ఏమనిపించదు. ఎందుకు అనిపించదు? ఇన్ని రూపాలలో చైతన్యముగ ఉన్నది నేనే కదా అని తెలిసినవాడు కాబట్టి. దాని చుట్టూ చేరిన వాటితో వాడికి సంబంధము లేదు. అందుకని ఎవరు వచ్చినా వారితో ఆ విధంగా ఉండేవాడు అందరికన్న అందగాడు. రాముడు అప్పుడప్పుడు కాస్త, తల్లి కైకేయి మాములుగా ఉంటె నాకీ కష్టాలు ఉండేవి కాదు కదా అని అనుకొని, మళ్ళా సమస్థితికి వస్తూ ఉంటాడు. కృష్ణుడులో అది కూడా కనిపించదు పెద్దలు వ్రాసిన గ్రంధములలో. ఎప్పుడూ ఒకటే! ఆ పరమప్రేమకి 'కృష్ణ తత్త్వము' అని చెప్తారు. అది ఎటువంటి ప్రేమ అంటే ఆయన ఎవడ్ని చూసినా ఆయనలో ఉండేది, వీడిలో ఉండేది అంతా ఒకటే అయిపోయి, వీడి ప్రవర్తన subdued అయిపోతుంది. యుద్ధము చేస్తున్న వారందరిని, అర్జునుడి మీదికి వస్తున్నవారిని, శ్రీకృష్ణుడు ఒక్క సారి చూసి నవ్వటం చేత వాళ్ళ ప్రాణాలు వచ్చి ఈయనలో కలిసిపోతాయి. మిగతా శవాలు అర్జునుడు చంపుకున్నాడని చెప్తారు భాగవతంలో. అంత చైతన్యము! అది పరమప్రేమ! కాబట్టి ఆత్మతత్త్వంలో పరమప్రేమతత్త్వము సహజముగా ఉంటుంది. కాబట్టి రూపాన్ని వాడిగా చూస్తే, అక్కడ నుంచి ప్రవర్తన, అక్కడ నుంచి చైతన్యము ఇలా మూడు గొడుగులుగా ఉన్న తత్త్వాన్ని తెలుసుకోటానికి వీలు ఉంటుంది. లేకపోతే ఉండదు. ఆయన అనేక రూపాలుగా ఉన్నప్పుడు వాడిని గుర్తు పెట్టుకోడమనే సాధన బాగా జరగాలి. జరగపోతే ఏ పనులు అవ్వవు. అందుకనే మనలో concept of beauty అనే అవగాహనే లేదు. Beauty is more in terms of behaviour than in terms of form. The beauty in terms of behaviour is called balance. The beauty in terms of pure love which is expressed as consciousness, అది ultimate. ఈ మూడు మనకి వృషభం లో శుక్రగ్రహం అంటే, Venus in Taurus, రూపములో ఉన్న అందానికి బాగా

ఆకర్షణ చెందేవాడు. Venus in Libra, అంటే తులలో శుక్రుడు ఉంటే ప్రవర్తనలో అందాన్ని చూడగలిగిన వాళ్ళు అవుతారు వారు. రూపంలో ఉన్న అందంతో సంబంధము లేదు Libra లో ఉండే Venus కి. ప్రవర్తనలో అందం చూస్తారు. Libra లో Venus exaulted. Aquarious third decanate లో Venus అంటే కుంభ రాశిలో 20 degrees నుంచి 30 degrees వరకు, దాన్నే ధనిష్ఠ నక్షత్రం అంటారు. అందులో శుక్రుడు ఉంటే పరమప్రేమ వాడి యొక్క అందము. శ్రీకృష్ణుడు నిజానికి ఏమి అందగాడు? ఆ రోజుల్లో రాజులందరికి చాలా వెగటుగాను, వికారంగాను ఉండేది, కృష్ణుడిని చూస్తే. ఆడవాళ్ళందరూ  విపరీతముగ ఆకర్షింపబడుతూ ఉంటారు ఆయనవైపు. రాజులకి ఈయన ఒక రకమైన సామాన్యమైన వ్యక్తి తప్ప, ఆయనలో వీరికి ఏమీ కనపడదు. రాముడు ఆజానుబాహుడు తప్ప, కృష్ణుడు ఆజానుబాహుడు కాదు. Average height. నల్లగా ఉంటాడు. పెద్ద అలంకారాలు ఏమి చేసుకోడు. వికారంగా కూడ ఉంటుంది, వాళ్ళు వీళ్ళు చూస్తే. రాజులు కిరీటాలలో మణులు, రత్నాలు పెట్టుకుంటారు. కృష్ణుడు అవన్నీ పక్కకి పెట్టేసి ఒకే ఈక పెట్టుకు తిరిగాడు. ఇదే నా కిరీటం అని. ఇట్లా మిగతా రాజులమధ్య ఉంటే ఎట్లా ఉంటుంది? వాడేమి రాజు అనేలా ఉంటుంది! అంటే రూపముతో చూస్తే కృష్ణుడు పెద్ద అందగాడు కాదు. అర్జునుడు ఇంకా చాలా అందముగా కనిపిస్తాడు. మిగతా రాజులు చాల అందగాళ్ళు. వాళ్ళ ముందు ఈయన అందగాడు కాదు. కాని ఈయనలో ఏదో అందం. ఏమిటో తెలీదు. మనుషులు ఎగపడిపోతారు. ఏమిటా అందము? 'పరమప్రేమతత్త్వము'! అట్లా చూడగానే ఎంతటివాడైనా  వీడిలో భాగము అయిపోతాడు. కాబట్టి భగవంతుడిని మనం రూపములో భావన చేసుకొని, ఆ వెలుగు తీసి  ప్రవర్తనలో కనిపించే అటువంటి వాడిని భావన చేసుకొని ఆ తరువాత ప్రవర్తన దాటాలి. చైతన్యము ఉండటం వలన ప్రవర్తిస్తున్నాడు. చైతన్యవంతుడు కాబట్టి ప్రవర్తించడము ఏముంది? మనింట్లో ఒక గుండ్రాయిని తెచ్చి పెట్టుకుంటే దాని వల్ల ఏ problem లేదు. దాని ప్రవర్తన దాటి చైతన్యము లేదు. ప్రవర్తనని చూస్తేనే చైతన్యముని చూడగలము. ప్రవర్తించే వాడిలో చైతన్యము ఉండబట్టి కదా ప్రవర్తిస్తున్నాడు. చైతన్యము లేకపోతే గుండ్రాయి లాగే ఉంటుంది. మనింట్లో పది గుండ్రాయిలు ఉంటె ఏమి ప్రయోజనము లేదు. ఓ గుండ్రాయి, ఒక మొక్క, ఓ జంతువు, ఓ మనిషి ఇంట్లో ఉన్నాయనుకోండి, ఎవరు ఉంటె ఎక్కువ problem? మనిషే! ఎక్కువ చేసేదేమి ఉండదు కానీ, పైగా నీ కన్నా ఎక్కువ అర్హత కలిగి  ఉంటె మరీ problem! ఇంటాయన కన్నా ఇంటావిడకి సమర్ధత ఎక్కువ ఉండి, ఇంటావిడని అందరు పొగుడుతున్నారనుకోండి, ఇంటాయనకి ఎట్లా ఉంటుంది? ఈ పొగడ్తలు కన్నా వంటింట్లో ఇంకా ఎక్కువ సేపు ఉంటె బాగుంటుందని అనుకుంటాడు. కానీ, ఉండదు, ఎంచేత? ప్రవర్తన చేత ఆవిడ అటువంటిది. అందుకనే పాశ్చాత్య దేశాలలో కుక్కలని, పిల్లులని పెంచుతారు. మనిషి కన్నా అవి better ట. Better కాదు, మీకు చేతకాక

పెట్టుకుంటున్నారు అని చెప్పాను. ఏమిటి better? నీకు ఏది కావాలంటే అది చేస్తుందిట. నీకు కావలసినది దానికి పెట్టవచ్చు, తిప్పవచ్చు, పక్కన పడుకో పెట్టుకోవచ్చు. అలాటప్పుడు ఓ బొమ్మ పెట్టుకోవచ్చు కదా! చైతన్యము పెరుగుతున్న కొలది నీలో అర్హత తగ్గి, నువ్వు అది problem అనుకుంటున్నావు తప్ప, సమస్య ఏమీ లేదు. అందుకని భగవత్ తత్త్వములో మనం సాధన చేసుకుంటే, ఆత్మ తత్వాన్ని అనుభూతి పొందాలంటే, ముందు రూపం వరకు చూడాలి. అది సులభం. అదే చూడలేము కదా మనము. తరువాత ప్రవర్తన, ఆ తరువాత చైతన్యము. ఎన్నో రూపాలుగ ప్రవర్తిస్తూ ఉంటాడు కదా భగవంతుడు. వీటన్నిటిలో ఉండేదీ వాడే అని గుర్తు పెట్టుకోవాలండి ప్రత్యేకంగా ఈ నామంలో. ఎవరితోనైనా సరే సమభావంతో ప్రవర్తించే వాడు యోగి. కొంత మందిని చూసి మనం బెరుకు పడిపోతాము, కొంత మంది మనని చూసి బెరుకు పడటం. రెండూ ఉండకూడదు. దుర్యోధనుడి దగ్గరకి వెళ్లాలంటే చాల మందికి భయం. కృష్ణుడు దగ్గరకి బెరుకు లేకుండా వచ్చేవారు. గోళీకాయలు ఆడుకొనే వాళ్ళ దగ్గర నుంచి దివ్య అస్త్రాలు వేసే వారి వరకు అందరితోను ఈయన ఒకటిగానే ఉన్నాడు. భీష్ముడు, ద్రోణుడు, అర్జునుడు, కర్ణుడు, విదురుడు, ధృతరాష్ట్రుడు అందరిలోనూ ఉన్నాడు. పాలు అమ్ముకొనే వారితో కలసిపోయి గోళీ కాయలు ఆడుకుంటూ ఉన్నాడు. అన్నిటిలోను సమానముగ ఉన్నాడు కదా. ఎలా ఉండగలిగాడంటే, ఇవన్ని "నేనే" అని.

నైకరూపః అంటే అనేక రూపాలు ధరించేవాడు. శ్రీకృష్ణుడు గోవులు, గోవర్ధనులు, గోపాలకులు, గోపబాలలు వీరందరి రూపాలు ధరించి తానే తిరిగాడు కదా. అనే భావనతో ఉండాలి. అదలా ఉండగా, అన్ని రూపాలు భగవత్ తత్త్వము లోంచి దిగి వచ్చాయి కాబట్టి అన్ని రూపాలు చూడగానే, ముందు రూపము 'వాడిదే' అని తెలియాలి. సృష్టిని సృష్టిగ చూడకుండా, సృష్టిని భగవంతుని రూపం గా చూడమని పెద్దలు చెప్పారు. సృష్టిని భగవంతుని రూపముగా చూడమని కపిలుడు దేవహూతికి చెప్పాడు. ప్రకృతిలో అన్నీ ఒక క్రమములో జరుగుతూ ఉంటాయి. అంటే there is a plan in it అని తెలుస్తోంది. ఒక తెలివి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ తెలివే ప్రకృతిని ఆ విధంగా నడిపిస్తోంది. అందుకని సృష్టి మొత్తాన్ని సృష్టిని సృష్టిలా చూడకూడదమ్మా. భగవంతుని రూపముగా చూడాలి. లేకపోతే నువ్వు భగవంతుని ఎలా చూడగలవు? ఈ పంచ భూతాలతో సంబంధము లేనటువంటిదాన్ని నువ్వు ఎలా చూడగలవు? అని దేవహూతికి కపిలుడు చెప్తాడు. కాబట్టి దాన్ని ముందు చూడటము అనేది ఒక భావన. ఇంకో భావన, ఎన్ని రూపాలైన ధరించగలడని మనకొక demonstration చేసి చూపించాడు కదా! అనేక రూపాలు కలిగిన వాడివి నువ్వు, ఇన్ని అని చెప్పలేము అని చెప్పడం. మనం ఊహించినదాని కన్న ఇంకా ఎక్కువ రూపాలు ఉంటాయట. ఈ రూపమే కాదు, ఏ రూపమైన 'అదే' అని తెలియాలి. అప్పుడు మనకి ఈ మతాల గోల తగ్గుతుంది. ప్రతి వాడు ఒకటి పెట్టుకు కూర్చుంటాడు. అది తప్ప రెండోది mind లోకి ఎక్కదు. ఆ మూసే

పెట్టుకుంటే ఎలా, ఏ మూస లోంచయినా రావచ్చుగా! సాధనలో మనం పెట్టుకున్న మూసేనా భగవంతుడు? అట్లాగే రావాలా? ఇంతకన్నా బాగున్నది వస్తే నీకేమైనా అభ్యంతరమా, అని అన్నట్టుగా ఉంటుంది. అందుకనే త్యాగరాజుకి విగ్రహాలు పోవటం. విగ్రహాలే రాముడు అనుకుంటే ఎట్లా? విగ్రహాలు కూడా 'రాముడు'! విగ్రహములే రాముడు కానపుడు, అంతటా ఉన్నవాడు అన్నప్పుడు, విగ్రహారాధన ఎందుకు అంటారు కొందరు. అదీ తప్పే! అంతటా ఉన్నవాడు విగ్రహాలలో కూడా ఉన్నాడు కదా. ఎదో ఒక రకమైన వెర్రి మనకి ఉంటుంది. పట్టుకుంటే ఒక రూపాన్ని పట్టుకొని తరువాత అదే అని కూర్చుంటాము. అది తప్ప ఇంకోటి వద్దు అనే స్థితి. 'నాన్యః పంథా' అంటే అదే. ఇంకోటి లేదన్నావంటే ఇందులో సత్యము లేదు. ప్రపంచములో 99% అంతా వేర్రే! ఒక్క శాతం common sense ఉండి సరైన పంథాలో నడుస్తూ ఉంటారు. మిగతా వాళ్ళు అందరికి వేర్రే! అన్ని రూపాలలో ఆయన ఉన్నాడని తెలిసి కూడా, ఒక రూపము పట్టుకు గుంజేసి, మిగతా రూపాలు విసర్జించేయటమే! అంత ఇంత విసర్జించటము కాదు. తెగ విసర్జిస్తాం. ఒక church కనిపిస్తే మొహము తిప్పేసుకుంటారు, అంటే ఏ ఆధ్యాత్మిక చింతనా లేదు. ఏది కనిపించిన ఒకటే, అన్ని రూపాలలో భగవంతుడు ఉన్నాడు అని అంటాడు. కనిపిస్తే తిప్పేసుకోటం. ఏమిటంటే, సాధన వేరు, ఇవన్నీ వేరు. అన్నిటిలో ఆయనే ఉన్నాడు కాబట్టి ఇవన్నీ అఖర్లేదు అని ఇంకో వాదన. Higher classes లో కూర్చున్నామన్నట్లుగా ఇవన్నీ కొట్టేస్తుంటాడు. అలా కొట్టేయకూడదు, ఒకటే పట్టుకోకూడదు. నిజంగా సాధన చేసే వాళ్లయితే సమభావనతో అన్ని రూపాలలోను ఒకరినే దర్శనము చేయాలి. అది సాధన! మన గురుపూజలలో అందరి photos పెట్టేస్తారు. ఇవన్నీ ఒక్కటే అని తెలియాలని అలా పెడతారు. ఒక రూపము వేదిక మీద ఉన్నది కనిపిస్తుంది. ఆ రూపము వేదిక మీద లేదు కదండి అంటే లేకపోవచ్చు, అలా వేదిక మీదకి చూస్తే ఆ తత్త్వము కనిపించాలి. ఎన్ని రూపాలలోనైనా చూడ్డానికి నాకు అభ్యంతరం లేదని చెప్పడానికి అన్ని రూపాలు వేదిక మీద పెడతాము. అందుకనే తీవ్రమైన సాధన జరుగుతున్నవాడికి ఆ రూపముగా కాకుండ ఇంకో రూపముగా కనపడటం మొదలు పెడతాడు. ఎందుకంటే ఆ limitation అతడికి పోవాలని. ఒకటి ప్రార్థన చేస్తుంటే ఇంకోటి వచ్చేస్తుంది. ఎందుకు రాకూడదు? నువ్వు అనుకున్న రూపములోనే రావాలా? మనం పిలిచిన రూపములో వాడు ఉండకపోవచ్చు. వాడు ఏ రూపములో ఉన్నాడో మనకి తెలియదు. వాడికి ఎన్ని రూపాలో, ఎన్ని పేర్లో! అందుకే ఆ గజరాజు అన్ని పేర్లు ఉన్నవాడూ, అన్ని రూపాలుగా ఉన్నవాడు, అంతటా వ్యాపించినటువంటివాడు, వాడే వచ్చి రక్షించాలి నన్ను అనుకుంటాడు. అందుకని మనం dimension పెంచుకోవాలి. 'మాస్టర్, మాస్టర్' అని మేకలా అరిస్తే సరిపోదు. మాస్టర్ అనే చైతన్యమును అన్నిటిలో చూడగలిగితే, YES. మాస్టర్ లాగ నీకు కనిపించింది, నిన్ను పుట్టించింది, నీకు ఆనందం కలిగించినది మాస్టర్ చైతన్యమే! ఇంకోటి కాదు. రూపము కాదు. ఏదో ఒకటి మనము పట్టుకొని

బయలుదేరాలి కాబట్టి, అది కూడా కావాలి, అది neglect చేయకూడదు. అదే అంతా అనుకోకూడదు. అక్కడ నుంచి మొత్తము సమన్వయమంతాను. అనేక రూపాలు విశ్వరూప సందర్శనములో చూపిస్తాడు అర్జునుడికి శ్రీకృష్ణుడు. చూసి చూసి అర్జునుడికి మూర్ఛ వస్తుంది. ఇంక చాలు ఆపేయ్ అంటాడు. ఒక పక్క పుట్టుకుంటూ వస్తుంటాయి, మరో పక్క మళ్ళా వెళ్ళి కలిసిపోతూ ఉంటాయి. నాలో ఇన్ని రూపాలు ఉన్నాయని చూపిస్తాడు. అన్నీ ఒక రూపములోంచి వచ్చినవే అని చెప్పటానికి బృహద్రూపః. బృహద్రూపము లోంచి ఈ రూపాలు వస్తు ఉంటాయి. అతడ్ని విశ్వకర్మ అంటారు. ఒక చెట్టు లోంచి ఎన్ని చెట్లు వచ్చినాయీ ? ఎన్ని వచ్చినా ఒకటే formula కదా. ఇంత మంది మనుషులు వచ్చారు. Space Consciousness అని ఏదైతే అంటారో దాన్నే విశ్వ కర్మ అంటారు మన సాంప్రదాయములో. ఈ విధమైన రూపానికి ఈ చైతన్యము.

## 282 బృహద్రూపః

'బృహద్రూపము' ఒకటి ఉంది. అదే విరాట్! "తస్మా ద్విరాడజాయత విరాజో ఆదిపూరుషః | సజాతో అత్యరిచ్యత | అప్పుడు అక్కడ నుంచి అన్ని పుట్టుకొొచ్చినాయట. అక్కడ ఒకటి ఉంది, అందులోంచి మొత్తం అంత వచ్చేసింది. ఆ ఉన్నది పూర్ణరూపము. ఆ పూర్ణము లోంచే అన్ని వచ్చినాయంటారు. ఎన్ని రకాల బొమ్మలు మనం గీసినా అవి ఆ పూర్ణములో యిమిడి పోయి ఉంటాయి. All fall in a circle. అందుకని circle ని పూర్ణరూపం గ చెప్తారు. పూర్ణత్వము చెందిన దానిని మన వాళ్ళు భగవత్ తత్త్వముగా చెప్తారు. ఆయనొొక్కడే పరిపూర్ణుడని, అక్కడ నుంచి దిగివచ్చినా కూడ కాస్త అపరిపూర్ణత కలిగి ఉంటాయి. బృహద్రూపం అంటే, ఈ మొత్తం బ్రహ్మాండము అంతా భగవంతుని యొక్క పూర్ణ రూపం. అందులో సమస్త జీవరాసులు, గ్రహగోళాదులు అన్ని యిమిడి ఉంటాయి అదే మన చుట్టూ ఉండే space globe. అందులో మనము కూడ ఉంటాము. మనం చూస్తూ ఉంటె, మనం కూడా అందులో ఉండి చూడడం గ ఉంటుంది.

## 283 శిపివిష్టః

ఇన్నిటిలోను ఒకటిగా తాను ఉండి, మొత్తము తాను ఉండే వాడుగ ఉన్న వాడు అని చెప్పడము. అలా ఉన్న దేవుడిని 'శిపివిష్ట' అంటారు. I AM THAT I AM అంటారు యూదులు. ఉన్నవాడే, ఉన్నవాడైన ఓ దేవా, అని వాళ్ళు ప్రార్ధన చేసుకుంటారు. దాన్నే 'జెహోవహ్' అంటారు. దాన్ని యహోవాగా మార్చుకున్నారు. ఆ పదము ఎక్కువ పలకరు. ఆ పదం పలికే అంత అర్హత మనకి లేదు, పాపిష్టి వాళ్ళము అని నమ్మకం వాళ్ళకి. మనం జెహోవా అంటే, అలా చెప్పకూడదు అంటారు. వాళ్ళు ఎక్కువగా చెప్పరు, చచ్చిపోతాం అనే భయము. మీకు తెలియక చెప్తారు కనక పర్వా లేదు, మాకు తెలుసు కాబట్టి అలా చెప్తే మేము చచ్చిపోతాము అంటారు. ఇట్లాంటివి చాల జరిగినాయి. అంటే ఏమిటి? వాడు ఉండబట్టి మనం అంతా ఉన్నాం. వాడు ఉండడమే మనం ఉండడం. వాడిలో మనం ఉన్నాము. అదే 'రాజ విద్య, రాజ గుహ్యా'. సముద్రములో అల ఉన్నది. సముద్రమే లేకపోతే అల ఎక్కడ ఉంది? చోటులో గ్రామాలు ఉన్నాయి, నగరాలు ఉన్నాయి, దేశాలు ఉన్నాయి. చోటే లేకపోతే భూగోళం ఉండదు. చోటు చూడలేము కదా. అలా ఈ ఉన్నవాడ్ని చూడటము కష్టము. ఆ ఉన్నవాడిని ధ్యానము చేస్తారు యూదులు. దాన్నే మన వాళ్ళు 'స్థాణుః' అంటారు. ప్రతి దాంట్లోనూ వాడు ఉన్నవాడి గానే ఉంటాడుట అండి ! దాన్నే మన వేదపరిభాషలో 'అస్మి' అని అంటాము. ఈ చూసేదాన్ని I AM అంటాము, అది శిపివిష్ట అంటే. అన్నిటిలోను నేను ఉన్నాను అంటాడు. వాడి లోంచి ఉద్భవించిన ప్రజ్ఞ పదార్థముగ ఒక్కోటి ఏర్పడుతూ ఉంటాయిట. గుండ్రాయి నుంచి పరబ్రహ్మం వరకు అంతా ఉన్నదాంట్లో ఉండడమే. వాడు ఉంటె వాడిలో ఇవన్నీ ఉన్నాయి. వాడొకడు ఉండబట్టి వాడిలోంచి ఒకటి ఉద్భవించింది, ఉద్భవించిన వాటిలో బ్రహ్మ వచ్చాడు. వాడు లేకపోతే ఉద్భవించడము ఎలాగ? ఉద్భవించిన తరువాత ఎందులోంచి ఉద్భవించామో తెలియదు. అదే వచ్చింది గొడవ! అది అర్ధము అయితే మొత్తము అంతా అర్ధమైనట్టే, అప్పుడు ఇహ ఉండటమే! Just be. According to time and space just be. 'వాడు' ఏమన్నా చేయించుకుంటే చేస్తుంటాడు. భగవంతుని సంకల్పము ప్రకారము తెలిసినవాడు కాలానికి, దేశానికి అనుసంధానము చెంది, ప్రణాళిక ప్రకారము నడుస్తూ ఉంటాడుట. ఎందుకంటే మందేమీ లేదని తెలిసి, ఇదంతా వాడిదే! ఇన్ని రకాలుగ ఆడేవాడు, మనలాగ వాడే ఉన్నాడని తెలుస్తుంది. అది తెలిసినా కూడ భలే తమాషాగా, 'ఓరి ఓరి ఎంత ఘోరం జరిగి పోయింది', అని అనిపిస్తుంది. వాడొకడు ఉన్నాడు అని, ఇంత మంది గా ఉన్నాడని, వాడొకడు నాలో నాలాగే ఉన్నాడని తెలుస్తుంది. నీలో ఉన్న వాడు కూడా వాడిలో ఉన్నవాడేమో నీలో నీ లాగ ఉన్నాడేమో' అని మాస్టర్ చాల సార్లు చెప్పారు. అట్లా లేదు భాగవతములో. కానీ అట్లా చెప్పడములో చాల పెద్ద రహస్యము ఉన్నది. నీలో నీలాగ ఉంది వాడెరా, అని చెప్పడము అన్నమాట. వాడు ఉండ బట్టి నువ్వు ఉన్నావు, వాడు లేకపోతే నువ్వు లేవుగా. వాడే నువ్వు! లేకపోతే నువ్వు నిద్ర ఎట్లా లేస్తున్నావు? లేచాక కదా మనం ఉన్నామని తెలిసేది. మనని లేపేవాడు ఎవడు? ఎప్పుడో లేవం కదా! లేవకపోతే ఇంట్లో వాళ్ళు అందరూ లేవరా అంటే లేవడు. పట్టుకుపోతాడు ఎప్పుడో! మనలో లేచేవాడు, పడుకొనే వాడు

"వాడు". వాడు అసలు ఉన్నవాడు. ఆ ఉన్నవాడు లేవగానే మనం వాడి పేరు మర్చిపోయి, మన పేరు పట్టుకొని తిరిగేస్తాము. లేవగానే, మనం ఎక్కడ నుంచి వచ్చాము, ఎలా లేచాము, మనని లేపిన వాడు ఎవడు? ఈ విచారణ చాల important. లోపల ఉన్నవాడే లేస్తాడు, లేని వాడు లేవడుకదా. ఉన్నవాడు లేచిన తరువాత ఎక్కడ నుండి లేస్తాడో నాకు ఏమి తెలుసు అంటే, లేచాక వీడి పేరు కాక 'వాడి' పేరు పెట్టుకు తిరుగుతాడు తెలిసినవాడు. ఇదే సత్యం. మిగతాది అంత గోల. ఈ మొత్తములో Einstein, Rabindranath Tagore ఒక discussion జరిగింది. Einstein ఏమన్నారు అంటే, 'ఈ మొత్తము అంతా చైతన్యమే కదా' అన్నారుట. Einstein మహా భక్తుడు. ఆయన పెద్ద Jewist. ఆయన భగవత్ తత్త్వాన్ని శాస్త్ర పరముగ అనుభూతి చెంది అందరికి అందించినటువంటి వాడు. ఆయన Tagore ని కలిసినపుడు, 'మొత్తం విశ్వము అంత వ్యాపించినది చైతన్యమే, ఇహ అంతకన్న ఏముంది' అన్నాడు. అంటే అప్పుడు Tagore 'ఒకటి ఉంది, దాంట్లోంచి చైతన్యము వస్తుంది', అని చెప్పారు. అదేమిటంటే, 'దానికి పేరు లేదు, ఊరు లేదు దాని గురించి మాట్లాడమాకు' అన్నారు. మరి మాట్లాడుకోటానికి వీలు లేని దాని గురించి మాట్లాడుకోటం ఎందుకు? అంటాడు Einstein. ఏమి లేదు, చైతన్యమే అంతా అనుకుంటున్నావు కాబట్టి చెప్తున్నాను, చైతన్యము ఉద్భవించడానికి ఇంకొకటి ఏదో ఉండాలి కదా. ఉద్భవించాలి అంటే అంతకు ముందు పుట్టడానికి ఉద్భవించే స్థానము లేకుండా ఎక్కడ నుంచి ఉద్భవిస్తుంది అని Tagore చెప్తారు. దాన్ని ఏమంటారు మీరు అంటే, Existence అని అంటాము అని చెప్పారు. అదే యూదులు యొక్క గ్రంథాలలో కూడా భగవంతుని పేరు. Pure Existence! దాన్నే మనము భాగవత పరముగా 'నారాయణుడు' అని చెప్పకుంటాము. Pure Existence అంటే సమాధిలో ఉండేది. ధ్యానము ఏడో మెట్టు, ఎనిమిదో మెట్టు సమాధి. ధ్యానములో మనము ఉన్నాము, వాడు ఉన్నాడు, వాడే మనముగా ఉన్నాం, మనమే వాడిగా ఉన్నాము, వాడే అంతా ఈ మొత్తముగ ఉంది అని తెలుస్తూ ఉంటుంది. విశ్వాత్మతత్త్వమును వీడు అనుభవిస్తూ ఉండడము తప్ప ఇంకేమి ఉండదు, అది ధ్యానస్థితి. మొత్తముతో అనుసంధానము చెందడము ధ్యానము. మొత్తములో కలిగిపోవటం సమాధి. కలిగిపోయేటపుడు నేను ఉన్నాను అని కూడ తెలియదు. ఉండటమే ఉంటుంది. ఉన్నానని తెలియటం అనే తెలివి ఉన్నాననే దాని మీద వచ్చే ripple {తరంగము} అల. నిద్రలో ఉన్నాం గాని మనము ఉన్నామని తెలియదు కదా. నిద్ర అంటే తెలిసిన వాడికి సమాధి స్థితి. నిద్రలో ఉన్నాము కదా, ఎలా ఉన్నాము? ఉన్నామని ఎలా తెలుసు? మహా అయితే ఉన్నాము కనుకే లేచాము అంటాడు. కాబట్టి లేవటానికి ఒకటి ఉండాలి కదా. అట్లాగే ఈ సృష్టి అంతా ఏర్పడడాకి ఒకటి ఉండాలి కదా. దానంతట అది ఈ గోళము ఎందుకు గుండ్రముగ తిరగాలి? సూర్యుడు చుట్టూ ఎందుకు తిరగాలి? చంద్రుడి చుట్టూ ఎందుకు తిరగాలి? ఏదో లేకపోతే దేని ఆధారం గా ఇవన్నీ ఒక్కొక్కటి ఎలా తిరుగుతున్నాయి? మనకి ఏదో ఉండ బట్టే కదా లోపల గుండె కొట్టుకుంటోంది. రక్త ప్రసారము అవుతోంది. మంచి రక్తము చెడు రక్తము చేసి మళ్ళీ మంచి రక్తము అవ్వడం. ఇవన్నీ ఎక్కడ నుంచి జరుగుతున్నాయి? వాడు అన్నిటిలో అట్లా ఉంటాడుట. అణువు దగ్గర నుంచి బ్రహ్మాండము వరకు. అణువులో కూడ దివ్య చైతన్యము ఉందని మనకి ఇప్పుడు తెలుస్తోంది కదా శాస్త్ర పరముగా. ఎంతో busy గ electrons,

neutron చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఒక సూర్యుడు చుట్టూ గోళాలన్ని ఎలా తిరుగుతున్నాయో, ఒక అణువులో neutron చుట్టూ electrons అట్లా తిరుగుతూ ఉంటాయి. ఆయన భార్యలాగ. Neutron భర్త అయితే electrons భార్య. అట్లాగే ఈ మధ్య Genetics Theory ఒకటి ఉంది కదా, Genes ని examine చేస్తే పిల్లవాడు పుడితే, ముందు శుక్ర కణము ఒకటి స్త్రీ లో చేరినపుడు అది చిన్న అండముగా బృహ్మాణముఒక్క cell చేరితే 7 cells చేరాయి. మరి మనకి వీళ్ళు చెప్పే patterns ఇదివరకు వాళ్ళు చెప్పిన patterns ఒక్కటే. కాని మన వాళ్ళు చెప్పిన పద్ధతి, వీళ్ళు తెలుసుకున్న పద్ధతులు వేరు. ఒకడే 7 లోకాలలో దిగి వస్తాడు. వాడు ఎనిమిదో వాడు అని కూడ చెప్పకున్నాము. అది కాక ఇవాళ Genetic field లో latest ఏమిటంటే, ఒక cell పురుషుడి దగ్గర నుంచి ఏర్పడితే 7 cells (కణాలు) స్త్రీవి ఏర్పడతాయిట అందుకని, motherly nature యే dominant అవుతుందిట పుట్టిన వాడిలో. Fatherly nature ఏర్పడాలంటే పురుషుడి కణము చాల బలమైనది అయి ఉండాలి. అప్పుడు వాడు తండ్రి లాగ ప్రవర్తిస్తాడు. వాడు Son Of God. మిగతా వాళ్ళు Son of Man. మనం పంచదార ఒక అణువు, ఉప్పు ఒక అణువు తీసుకున్నాము అనుకోండి అందులో ఉండే పరమాణువులు, అంటే electrons, protons, neutrons వాటి pattern ఒక లాగే ఉంటుంది. విపరీతమైన చైతన్యము ఉంటుంది. స్థబ్దుగా ఉంది అనుకుంటాము రాయి. అది ఎన్నో అణువులు యొక్క సమూహము/గుంపు. మరి ఇంత చైతన్యము నడిపిస్తున్నవాడు ఒకడు ఉన్నాడు. వాడు back ground లో ఉంటాడు. వాడి లోంచి వస్తూ ఉంటాము. వచ్చిన తరువాత మనము ఉన్నాము అని తెలుస్తుంది. మనము వచ్చిన తరువాత వాడిని గుర్తు పెట్టుకోము. మన పనులు మనకి కదా లేచిన దగ్గర నుంచి. వాడిని పట్టుకు కూర్చుంటే మన పనులు ఎవడు చేస్తాడు అన్నట్టుగా ఉంటుంది. వాడిని పట్టుకు పనులు చేస్తుంటే, పనులు చాల బాగా జరుగుతాయి. వాడిని మర్చిపోయి దిగిపోతాము రంగము లోకి. పనులు మధ్యలో పడిపోయినట్లుగా ఉంటుంది మనకి మాములుగా. తాళము మరచి car దగ్గరకి వెళ్లిపోయినట్లు. ఇప్పుడు ఆ ఉన్నవాడైనటువంటి దేవుడు ఉన్నాడు కదా ? వాడిని మనవాళ్ళు 'అహం అస్మి' అన్నారు. 'బ్రహ్మోహమస్మి' అంటే అక్కడ నుంచి బృహ్మాణము చేయగలిగినది కూడా నేనే! బృహ్మాణము చేయ బట్టి కదా వచ్చాము. వచ్చిన తరువాత 'నేనే వాడు' అంటే అహంకారం అవుతుంది. 'వాడే నేను' - సోహమస్మి. అతడే నేను. సహో - అస్మి . I AM THAT I AM. అన్ని భాషలలో చెప్పకొనేది అది ఒకటే! ఈ ఉన్నవాడి లోంచి మనం ఉదయము లేచినపుడు వాడు మరుగు అవుతాడు. "నేను ఉంటె నువ్వు ఉండవు, నువ్వు ఉంటె నేను ఉండను," అంటాడు. నువ్వు అంత ఆక్రమించుకుంటే నేను కనబడను. నేనే ఉన్నదీ. నువ్వుగా ఉంటాను. వేషము వేసిన తరువాత, మంచి కైపు వచ్చిందనుకోండి తరువాత, మన గురించి మనము మర్చిపోయామన్నమాట. నువ్వుగా నేను ఉన్నపుడు నేనే నువ్వుగా ఉన్నాను అని గుర్తు ఉంటె సుఖపడతావు. అప్పుడు నేను ఉంటాను, నువ్వు ఉండవు. If you exist I do not exist and if I exist you do not exist అని ఒక వాక్యం ఉన్నది. నేనుగా వాడు ఉన్నప్పుడు వ్యక్తిగతముగ పెట్టుకున్న పేర్లు, పదవులు అవేవి ఉండవు. కానీ వీడుగా ఉన్నపుడు ఇక వాడు ఉండడు. ఎవరో ఒకరే అక్కడ, నర - నారాయణులలో ఒకడు active గ ఉంటె రెండో వాడు passive గ ఉంటాడండి. ఒకడు

గుహలోకి కూర్చుంటే రెండో వాడు పని చేస్తూంటాడుట. నరుడు బాగా పని చేసి అలసిపోయి గుహలోకి వెళ్తే, అపుడు నారాయణుడు బయటకు వస్తాడట. అప్పుడు వాడు తపస్సు చేస్తాడుట. అంటే మనం ఊరికే ఉంటె, వాడు పని చేస్తాడని చెప్పడము. మనం చేయడం ఒకటి, వాడు చేసేది రెండు ఉన్నాయి కదా. మనం వాడికి అప్పచెప్తే వాడు మన నుండి పని చేస్తూ ఉంటాడుట. అది మనకి కృష్ణార్జున కథగా ఇచ్చారు. నువ్వేనా చేయి, నన్నేనా చేయని అంటాడు. నేనే చేస్తాను నీ ద్వారా, అంటాడు కృష్ణుడు. ఎప్పుడు కృష్ణుడు అర్జునుడి ద్వారా పని చేస్తాడో అప్పుడు అంతా సవ్యం. ఎప్పుడు అర్జునుడు తానంతట తాను చేస్తాడో అంతా అపసవ్యం. ఇదొక రహస్యం. అందుకని ప్రొద్దున్నే ఏమి దణ్ణం పెట్టుకోవాలంటే 'కర్తవ్యం దైవ మాహ్నికం'! దివ్య ప్రణాళిక ప్రకారం ఈ రోజు నడిచేట్టు చూసుకోమని, వాడే నడవాలి నా ద్వారా, నేను చూస్తాను, ఆనందిస్తాను అనుకోవాలి. దాన్నే Father thy Will be done. Not mine అన్నారు. పొద్దున లేవగానే నీ సంకల్పము నా ద్వారా నిర్వర్తించు, నేను కాదు సుమా! అనుకోవాలి. 'నమః' అంటాము అంటే 'నేను కాదు అంతా నువ్వే' అని చెప్పడం. నమస్కారమ్స్ అంటాము కదా, నమః నేను చేయను నువ్వు చేసుకో, నేను సిద్ధం. The vehicle is ready for you to function. అదే వాహిక అంటే! అదే భాగవత మార్గమంటే! దివ్య ప్రణాళిక నిర్వర్తింపబడుతుంటే చూస్తూ వాడు ఆనందిస్తాడు కాస్త సేపు కుదురుగ ఉంటె. మనము చేద్దాము అనుకుంటే అవదు. అదే కదా పోతన చూపించాడు. తను రాస్తున్నపుడు, తన చెయ్యి ఆయనని వాడుకోనిచ్చాడండి, అంతే!

'పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట'

అని అనడములో అర్థము అది. మాస్టర్ గారు కూడా అట్లాగే రాశారు భాగవతము. మనము కాదు కదా రాసేది, వాడు రాయాలి అనుకున్నప్పుడు రాస్తాడులే. అది ప్రజల యొక్క సంసిద్ధతను, అర్హతను, పాత్రతను బట్టి ఉంటుంది, మనకి ఏమి సంబంధము లేదు పూర్తి అయినది, పూర్తి కాలేదు అనేది అని చెప్తూండే వారు ఆయన. అది అటు నుంచి అది సంకల్పించినపుడు తాను ready గ ఉంటాడు పని చేయడానికి. Car owner కోసము ready గ ఉన్నట్టుగా జీవుడు, దేవుడి కోసము ready గా ఉండటం అనేది భక్తుడికి, భగవంతుడికి ఉన్న సంబంధము. అలా ఉంటె అటు నుంచి పలుకుతుంది. పలుకక పోతే ఊరుకుంటాడు. పోతనకి అలా ఆగిపోయింది. మనమే రాసేస్తున్నాము అని అనుకొని ఉంటాడు బహుశ. ఆగిపోతే ఒక సారి గోదావరి ఒడ్డుకి వెళ్ళిపోయాడు వేరే ఏమి చేయాలో తెలియక. గజేంద్రుడు చేసే ప్రార్థన వర్ణించాడు. అటు నుండి విష్ణువు ఎలా బయలుదేరాడో ఈయనకి అందటము లేదు. వదిలేసి వెళ్ళిపోయాడు. వచ్చేసరికి పద్యము రాసి ఉంది. అప్పుడు పూర్తిగా అర్థము అయిపోయింది పోతనకి మనము కాదు రాసేది 'వాడే' అని. అలా ఆ ఉన్నవాడుగా ఉన్నవాడై ఒకడు ఉన్నాడు. ఎప్పుడైనా సరదాగ హాస్యము కోసమైన, మనకి relaxation వస్తుంది, తెలుగులో రాసిన బైబిల్ (old Testament) చదవండి. అందులో రాస్తాడు 'ఉన్నవాడై ఉన్నవాడైన ఓ తండ్రి!' అని సత్యం రాశారు. మనకి కూడా అదే! ఉన్నది సత్యము. ఉన్నది ఒకటి, అది ఆధారంగా

మిగతావన్నీ జరుగుతూ ఉంటాయి కదా. అన్నిటిలో అలా ఉంటాడు. మనం ఊహించని వాటిలో కూడా ఉంటాడు. బొద్దింక లో కూడా ఉన్నాడు లేకపోతే బొద్దింక కదలదు కదా? కనిపించే ప్రతి దానిలో నిండి ఉన్నాడు. శిపివిష్ట ధ్యానము పెట్టుకుంటే లోటు ఉండదు. నీలో ఉండటం కాదు. ఉండటం వలన ప్రకాశిస్తారు. ఆ ప్రకాశము తరచి చూసిన కొలది కనిపిస్తుంది. ఆకాశము, ప్రకాశము, వికాశము. ''కాశ్'' అంటే వెలుగు అని అర్ధము. ప్రకాశము అంటే ప్రకటింపబడిన వెలుగు. ప్రకటింపబడనిది ప్రకటింపబడుతోంది అప్పటికపుడు. మనము ఈ తొడుగులు ఒక్కొక్కటి తీసుకుంటూ వెళ్తే అణువులో ఎంత ఉందో తెలుస్తోంది కదా. వాటి లాగే మనలో కూడా, పదార్థము కన్న జలము ఎక్కువ వెలుగు. జలము కన్న అగ్నికి ఎక్కువ వెలుగు. అగ్ని కన్న వాయువుకి ఎక్కువ వెలుగు. వాయువు కన్న ఆకాశానికి ఎక్కువ వెలుగు. వెలుగు ఎక్కువ అవుతున్న కొలది మన కన్నులు చూడలేవు. అందుకనే వాయువు దగ్గరకి వచ్చేసరికి మనకి ఏమి కనపడవు. ఆకాశము ఇక అంతే సంగతులు. మనకు ఆకాశానికి మధ్య ఏమి కనబడుతుంది? మనమే కనిపిస్తాము. వెలుగు యొక్క transperancy అంతలా ఉంటుంది. మీరు నాకు కనిపిస్తున్నారంటే వెలుగే కారణము. నాలో వెలుగు ఉండబట్టే మిమ్మల్ని చూస్తున్నాను. మీకు, నాకు మధ్య చోటులో కూడ వెలుగు నిండి ఉండబట్టి. మొత్తము ఆయన ప్రకటింపబడినపుడు అది వెలుగుగా గోచరిస్తుంది. ఎవరిలో వెలుగు ఎక్కువ కనిపిస్తుందో వారిలో భగవంతుడి అస్థిత్వము ఎక్కువగ ఉందని తెలుసుకోవాలి. అందుకే బంగారము పెట్టుకోడము, ఇనప ముక్కలు పెట్టుకోకుండా. బంగారము వెలుగు ఎక్కువ. బొగ్గు పెట్టుకోవచ్చు కదా, వజ్రము ఎందుకు పెట్టుకుంటున్నాము? ఏది ఎక్కువ వెలుగుని ప్రకాశింప జేస్తుందో అందులో భగవంతుని అస్థిత్వము చాల ఎక్కువగ ఉందని అర్ధము. మనలో కూడ పదార్థాన్ని బాగా దైనందినంగ మెరుగు పెట్టుకోవాలి. పెట్టుకుంటే మెరుగు ఉంటుంది, లేకపోతే ఉండదు. విగ్రహాలు తోముకోడమూ, ఇంట్లో గిన్నెలు కడుక్కోడాము, తుడుచుకోడమూ ఎందుకని? లేకపోతె నెమ్మదిగా అపానం చేరిపోతుంది, ప్రాణంని కప్పివేయటానికి. శాసనములు, అశనములు అని మనకి రెండు ఉన్నాయి. 'సాశనానశనే అభి' అంటూ ఉంటాము. అంటే Organic and Inorganic అని. Organic attend కాకపోతే Inorganic అయిపోతుంది. Inorganic attend అవుతున్న కొలది Organic అవుతుంది. మనలో కూడ బాగా ప్రాణవాయువు పీలుస్తు ఉంటె ప్రాణ శక్తి పెరిగి వెలుగు బాగా ఎక్కువ అవుతూ ఉంటుంది, వేడిమి పెరిగి మలినాలన్ని దగ్ధము చేస్తుంది. అది అట్ల పరిపూర్ణముగ ఆ పనే చేస్తే మనము కాలిపోతాము కాబట్టి వేరే చోటు నుంచి బొగ్గు పులుసు వాయు దాన్ని ఆర్పేస్తు ఉంటుంది. లోపల మనకి inorganic substance ఉంది కదా.అది కొంత వెలుగుని తగ్గిస్తూ ఉంటుంది, ప్రాణముని. మళ్ళి ప్రాణము ఏమి చేస్తుందంటే, అపానము మీద ఆధిక్యతని పొందుతుంది. ప్రాణము అపానము మీద

ఆధిక్యత, అపానము ప్రాణము మీద ఆధిక్యత, రెండు అట్లా పెరుగుతూ ఉంటాయి. అదే Saturn and Sun principle. Sun principle ప్రాణం, Saturn principle అపానం. Saturn is a Cold planet. Sun is a brilliant burning planet. అది అట్లా వెలుగుని ఇస్తుంటే, ఇది రెండో పక్క నుంచి చల్ల పరుస్తూ ఉంటె మనం ఉన్నాము. ఈ రెండిటిలో ఏది ఎక్కువైనా ఇబ్బందే మనకి. అవి balanced గ ఉన్నపుడే బాగుంటుంది. అట్లాగే, సృష్టిలో inorganic గ ఉన్న అన్నిటిని నెమ్మదిగా organic చేస్తుంటుంది సూర్యుడిలో ఉన్నటువంటి ప్రాణము. సూర్యకిరణాలు కారణముగ ఖనిజాలు నెమ్మదిగ చెట్లల్లోంచి, వృక్షాల లోంచి వచ్చి మనుష్యుల్లోకి  చేరిపోతాయి. మనం చూస్తే రాయి మీద చిన్న మొలకలు వస్తు ఉంటాయి. Vegetation అట్లా జరుగుతూ ఉంటె, మనకి ప్రాణము లేని వాటి నుంచి ప్రాణము ఉన్న రూపాలు వచ్చేస్తూ ఉంటాయి. అదంతా ప్రాణశక్తి చేస్తూ ఉంటుంది. రెండో పక్క నుంచి ఆ ప్రాణముని నెమ్మదిగ తీసేస్తే ఇంకోటి ఉంటుంది. అప్పడే చచ్చిపోవడం జరుగుతుంది. అంటే ఈ బతికించిన దాన్ని చంపడానికి, ఈ చచ్చిన దాన్ని బతికించటానికి ఈ రెండు జరుగుతూ ఉంటాయి సృష్టిలో. అదే 'సాశనానశనే అభి'! ఎన్నెన్నో పెద్ద విషయాలు చిన్న ముక్కలు చేసి అట్లా విసిరి  పారేసారు. ఎందుకు పారేశారంటే, 'అమ్మ! ఇంత ఉందా  పురుష సూక్తంలో' అని తెలుస్తుంది. రోజు టపటపలాడించేస్తూ చదువుతాము కదా! ఏముందో అని అందులో దిగితే, బ్రహ్మ నాభి కమలం లో దిగినట్టుగా ఉంటుంది. భయము వేస్తుంది, అంత ఉంటుంది అందులో. అందుకని ఒక ప్రక్క అట్లా ప్రకాశవంతముగ చేస్తాడు. అది విష్ణువు యొక్క తత్వము. విష్ణుని స్థితి కారకుడు కాబట్టి అలా చెప్పారు. వీటన్నిటిలో పదార్థము యొక్క పొరలు తీసుకుంటే, పదార్థము సూక్ష్మమైన కొద్దీ వెలుగు ఎక్కువ అవుతుంది. పదార్థము స్థూలమైన కొద్దీ వెలుగు తగ్గిపోతుంది. Body cells కి సాంద్రత బాగా పెరుగుతూ, మనిషి అలా పడి ఉంటాడు మన్ను తిన్న పాములా. ఎంత మన్ను తింటే అంత పడి ఉంటామండీ! మనము తినేవన్నీ మన్ను లోనుంచి పండి వచ్చేవే. ఎక్కువ తింటే భుక్తాయాసము, నిద్ర. పండుగ నాడు మధ్యాహ్నం ఎవ్వడు పని చేయడు. ముఖ్యముగా బ్రాహ్మణులకే తిండి గోల మరీ ఎక్కువ. నేను బాగా గమనించాను.  బ్రాహ్మణా భోజన ప్రియః! అని ఎవరో చెప్పారు. పొద్దుట నుండి చురుగ్గా ఉంటాడు. మధ్యహ్నం నుండి పదార్థము ఎక్కువ అయి చిరాకు, చురుకులేకపోవటం పెరిగిపోతాయి. ఎందుకంటే మందము పెరిగిపోతుంది. శరీరములో మందము పెరిగిన కొలది ప్రకాశము తగ్గుతూ ఉంటుంది.   పదార్థము స్థూలత్వము చెందుతుంది. అప్పడు 'ప్రాణాన్ని' బాగా ఆవాహనము చేస్తే, శరీరము తేలిక పడి, సాంద్రత తగ్గుతుంది. Density తగ్గుతుంది. శరీరము చురుకుగా ఉంటుంది. అన్ని పనులకి పనికి వస్తుంది. అలసట తొందరగ చెందరు. Rest కోసము waiting ఉండదు. సూక్ష్మత్వము పెరిగే కొలది ప్రకాశము పెరుగుతుంది. 'సూక్ష్మశరీరము' అంటే అది! అతి సూక్ష్మమైనటువంటి అణువులతో

ఉన్నటువంటిది అది. దాన్నే 'ఆకాశ శరీరము' అంటారు. మనకి కనపడదు. ఎందుకంటే, శరీర మందము చేత. ఏ వ్యక్తికి అయిన ఎంత ప్రకాశవంతుడో వాడి కళ్ళ బట్టి తెలుస్తుంది అని చెప్తారు. వాడి కళ్ళలో ఉండే ప్రకాశము వాడి సూక్ష్మ శరీరముకు సంబంధించినది అక్కడ indicate అవుతుంటుంది. కళ్ళు కనపడటం లేదు, ఎప్పుడూ మూసుకుపోతుంటాయనుకోండి, వాడికి అన్నీ ఆర్పేద్దాము అనిపిస్తుంది. దీపము ఆర్పేద్దాము అనిపిస్తుంది. వెలుగు నచ్చదు. చీకటి చూస్తే నచ్చుతుంది. చలికాలము బాగుంటుంది, ఎండాకాలం బాగుండదు. ఇవన్నీ symptoms అన్నమాట దీనికి. ప్రకాశవంతము అవ్వాలంటే శరీరము యొక్క, అణువుల యొక్క సాంద్రత తగ్గుతూ ఉండాలి. బాగా ప్రాణాన్ని పీలుస్తూ ఉంటె అపానం బయటకి వదిలేస్తాము. ఎక్కువ dominant గ అపానం ఉంటుంది. దాని వల్లే జబ్బులు ఉంటాయి. Carbon deposits లోపల ఏర్పడి జబ్బులు వస్తుంటాయి. అందుకని గట్టిగ ప్రాణాయామము చేస్తే జబ్బులు రావటానికి వీలు లేనంత vital body vibrant గ ఉంటుంది. శరీరము తేలికగా ఉంటుంది. అది చేయాలని అనిపించినా, చేయలేకపోవటం అన్నది మన భృక్తం. తెలిసి చేయలేనిది సంకల్ప బలము ఉంటె బాగుంటుంది. ఎక్కడైతే మంచి ప్రకాశము ఉంటుందో అక్కడ భగవంతుని యొక్క ప్రకాశము గుర్తించడము అనేది ప్రధానమైనటువంటి సాధన. అందుకే దీపము పెట్టుకోడమూ. దీపము జ్వాలలో ఉండే ప్రకాశము చూడటము అనేది పదార్థము యొక్క సూక్ష్మ రూపము, జ్వాల! ఒత్తికి ఆ స్థితి లేదు, సెమ్మెకి ఆ స్థితి లేదు, నూనెకి ఆ స్థితి లేదు. కానీ వాటిలో ఉన్నది అది అట్లాగే మనలో కూడా ఇంత మొద్దుగ కనిపించినా ఉంది అది. దాన్ని ప్రజ్వలింప చేసుకోడము వలన వెలుగు బయటకు వ్యక్తము అవుతుంది. ఎక్కడ వెలుగు వ్యక్తము అవుతుందో అక్కడ భగవంతుని దర్శనము చేసుకోవాలి. నాకు బంగారము అంటే ఇష్టము లేదు అంటే definite గ వాడిలో something wrong. Fashion కి అంటుంటారు చాల మంది. బంగారము అంటే సహజముగా చూడగానే ఆహ్లాదము కలగాలి. కొనాలనే తాపత్రయము ఉండ కూడదు కాని, ఆహ్లాదం కలగ లేదంటే హిరణ్మయమైనటువంటి తత్త్వము లోపల లేదని అర్థం. హృదయము లో ఉండే వర్ణము అది, అట్లా మూలాధారం లోకి దిగిపోయి ఓ గొయ్యి తీసి బావిలో కప్పేశారని అర్థము. వెండి కన్న ఇనుము బాగుంటుంది అన్నాడనుకోండి భగవంతుడే ఇక రక్షించాలని ప్రార్థన చేసుకోవాలి. సహజముగా మనలో ఉండే చైతన్యాన్ని stimulate {ప్రచోదనం} చేయగలిగే అటువంటివి. అలాగే వర్ణము, రంగులు. కాషాయము రంగు. పొద్దున్నే వస్తాడు సూర్యోదయము. అలాగే, బంగారము రంగు. ఎరుపు రంగు. ఈ రంగులలో ఉన్నటువంటి కాంతి కనపడుతున్నప్పుడల్ల వాడు వ్యక్తమౌతున్నాడని తెలియాలి. మనలో కాంతి వంతుడిని ఎవరినైనా చూస్తే వారిలో కాంతి రూపం లో వీడే ఉన్నాడని తెలియాలి. కాంతి విహీనముగా ఉన్న చోట కలి అక్కడ ఉంటాడు. అంటే కప్పెట్టేసి ఉంటాడు.

అందుకని కాంతివంతముగా ఉంచుకోవాలి. మన ఇల్లు , వొళ్ళు కాంతివంతముగా ఉండాలి. మన చేతలు, మాటలు కాంతివంతముగా ఉండాలి. మన కాంతి అట్లా మన చుట్టూ కోట కట్టినట్లుగా ఉండాలి. కాంతివంతము అవటం కోసం ఈ కార్యక్రమాలన్నీ చేసుకుంటూ ఉంటాము. కార్యక్రమాలు చేసి చేసి నీరసపడిపోతూ అంతకంతకీ నాసిగా అయిపోతున్నాడంటే కార్యక్రమములో ఎదో తప్పు ఉందని అర్ధము. కార్యక్రమములో పాల్గొనడం వాడిలో చైతన్యము బాగా వర్ధిల్లటం వల్ల , వ్యక్తం అవడము వల్ల, ప్రకాశవంతము అవటం వల్ల అది ప్రవర్తనని నెమ్మదిగ సరి చేస్తుంది. రూపాన్ని కూడ సరి చేస్తుంది. కాంతి వెదజల్లుతుంది. అందుకని నము వాడుకొనే ప్రతి వస్తువు అట్లా ఉంచడానికి ప్రయత్నము చేయాలి. నలిగి ఉన్న నాలుగు కాగితాల పుస్తకము జేబులో ఉండ కూడదు. చేతిలో ఉండే పుస్తకము కాంతివంతముగ ఉండాలి. మన దగ్గర ఉండేవి ఏవైనా సరే అట్లా ఉండాలి. అంటే, We are filling everything in and around us with THAT (GOD) called ప్రకాశం! ప్రకాశం అని మనము ఎవరినైనా పిలిచాము అనుకోండి , వాడు అదోలా ఉన్నదనుకోండి, వాడిని పేరైన మార్చుకోవాలి లేక నువ్వేనా మారు అని చెప్పాలి. ఎప్పుడు నిద్ర మత్తులో ఉండి, కళ్ళు ముసుకు ఉంటె వాడిని 'ప్రకాశ్ ' అని పిలవకూడదు. మనము వాడుకొనే అమస్తమూ మన చుట్టూ, మన లోపల అన్ని కూడ orientation towards illumination గా ఉండాలి. అందుకే దీపాలు పెట్టుకోవడం. ఎన్ని దీపాలు పెట్టుకుంటే అంత ఆనందము కలుగుతుంది. సహజముగ వెలుగుని చూడగానే ఆనందము కలుగుతుంది. చీకటి చూస్తే ఆనందము కలిగిందంటే మనిషి లో తేడా అని తెలియాలి. సూర్యోదయము కాక ఎప్పుడు సూర్యుడు అస్తమిస్తాడా అని ఎదురు చూసేవాడు ఉన్నాడనుకో, అంటే basic గ core level లో ఎదో తేడా పడ్డదని అర్ధము. విష్ణు సహస్రనామాలు అన్ని కూడ direct confrontation with THAT which we call GOD. మనము ఏది భగవంతుడు అని అనుకుంటామో, ముఖాముఖి పడిపోతుంది వాడితో మనకి. ఉత్సాహముగా చూస్తే ఏది చూసినా అది కనిపిస్తుంది.

## 284 ప్రకాశనః

ఏదైనా పెద్దది చూసాము అనుకోండి. వినాయకుడిని చూస్తే చాల పెద్దది. అబ్బో! అని ఆనందము కలగదూ?. దానికి ఉండే commercial values లోకి పోగూడదు. మనం పుట్టపర్తి వెళ్ళాము అనుకోండి, అక్కడ చూస్తే ఒక్క సారి ఆకాశము అంతా బొడ్డు గీసినట్లుగా కనిపిస్తాయి. ఏమనుకోవాలి? భగవంతుని యొక్క వైభవము అనుకోవాలి. అట్లాగే మహానగరానికి వెళ్ళాము అనుకోండి, విపరీతమైన భవనాలు, పెద్ద కాంతి( illumination ) చూసి ప్రకాశనః అనుకోవాలి. ఒక పెళ్ళిలో illumination బాగా డబ్బు ఉండి పెట్టారనుకోండి. ఆ డబ్బు సంగతి మర్చిపోయి ఈ విధంగా మనకి వెలుగు దర్శనం అనుకోవాలి. Most illumined City on the Globe, Las Vegas, నేను చూసాను మొన్న. ఆశ్చర్యమే! పెద్ద కాంతి పుంజములో మనము జీవిస్తున్నట్టుగా ఉంటుంది. పగలా, రాత్రా అన్నట్టుగా. రాత్రి ఇంకా బాగుంటుంది అంత వెలుగు. అట్లా మనకి దర్శనము చేసేలా ఉండాలి వెలుగు. ఇంట్లో కాంతి విహీనమైన బొమ్మలు పెట్టుకోకూడదు. ఎడారి బొమ్మలు, ఎండిపోయిన చెట్లు, కాంతి లేనివి పెట్టకూడదు. ఇంట్లోకి వస్తే, ఇంట్లో ఉండే చిహ్నాల బట్టి వాడి యొక్క పరిస్థితి తెలుస్తుంది. ఇంటిని చూస్తే ఇంటావిడని చూడక్కర లేదు అంటారు కదా. ఇల్లు కళగా ఉంటె మనము ఇంటావిడ ఎవరని వెతికి చూడవచ్చు. అట్లాగే అంతా కూడ. Nature is shiny. Nature is brilliant. Nature is illuminative. మనము శుభ్రంగ ఉండటానికి ఆర్థిక స్తోమతతో సంబంధము లేదు. ఉతుక్కున్న చొక్కా వేసుకున్నా శుభ్రమే, గంజి, ఇస్త్రీ అక్కరలేదు. జుత్తు దగ్గర నుంచి శుభ్రంగా ఉంచుకున్న వాడిలో ప్రకాశము వస్తుంది. ప్రకాశమును ఎంత ఆరాధన చేస్తే మనలో అంత పెరుగుతుంది. మన జీవితములో ప్రకాశము మలచుకుంటూ ఉండాలి. ఆ ప్రకాశము భగవంతుని యొక్క అస్థిత్వము వలన వచ్చినటువంటి వెలుగు. అస్థిత్వమును ఉండడము అన్నాం. ఉండడం వల్ల వెలుగు. అమ్మవారు వచ్చారుట అంటే, అయ్యవారు రాకుండా రారు. ఒకరు ఉంటె ఇంకొకరు ఉంటారు. వాళ్ళు inseparable అది అర్ధనారీశ్వర తత్త్వము. ఇద్దరూ కలిపే 'విష్ణువు'! శివ పార్వతులకి పూజ చేసినా, విష్ణువుకి పూజ చేసినా ఒకటే. వెలుగు రావాలంటే విద్యుత్ లేకుండా వస్తుందా? కనపడని విద్యుత్, కనపడే వెలుగుగా వస్తోంది కదా. ఎప్పుడైతే వెలిగిందో, దాని వెనకాల వాడు ఉండబట్టే! అమ్మవారు ప్రత్యక్షము అయిందంటే అయ్యవారితో సహా అని అర్ధము. అయ్యవారు ప్రత్యక్షము అయ్యారు అంటే అమ్మవారితో సహా అని అర్థము. రెండిటిలో విడతీసి ఏదో ఒకటి పెట్టుకోవాలంటే వీలు లేదు. మనకి కనపడేది 'అమ్మవారు'. ఆమెని బాగా మనం ఆవాహనము చేస్తున్నాము అంటే, ఆ కనపడని అయ్యవారు ఈ కనపడే అమ్మవారు ద్వారా వచ్చినట్టుగ మనకి ఉండాలి. అందుకని వెలుగు పెంచుకుంటున్నాము అంటే 'ఆయన' దగ్గర అవుతున్నారని అర్థము. అతను దగ్గర అవ్వాలి, ఇంట్లో బూజు ఉండకూడదు. ఇంట్లో ముగ్గు పెట్టుకోకుండ ఉండకూడదు. పళ్ళు తోముకోకుండ మాట్లాడకూడదు. కాఫీ తాగుదాము, మాట్లాడదాము పళ్ళు తోముకోకుండా, కూడదు అవి. వాక్కు అంటే "నేను" అనే శబ్దము స్పందన లోంచి వ్యక్తము అయ్యి ఓంకారముగ మన లోంచి వ్యక్తమై ముఖం నుండి

బయటకి వెళ్తుంది. మరి ముఖం నుంచి వ్యక్తము అయ్యేది కనుక దాన్ని శుభ్రముగ ఉంచుకోవాలి. బాల క్రీడలలో 'నువ్వు ఎక్కడ ఉంటావు,' అని కృష్ణుడిని ఒక ఆవిడ అడిగితే, మూతి మీద ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయాడట, అక్కడ ఉంటాను అని చెప్పటానికి. కొంటెగా చెప్పాడు. వాక్కుకి ultimate expressive vehicle ముఖము. ముఖములో అగ్ని, ఇంద్రుడు ఉంటారు. అది కదా పురుష సూక్తములో వస్తుంది, ''ముఖా దింద్రశ్చాగ్నిశ్చ. ఇంద్రుడు అక్కడే, అగ్ని అక్కడే, వాక్కు అక్కడే, ఇవన్నీ వచ్చే చోటుని ఎంత శుభ్రంగా ఉంచాలండి ? రెండోది దానిలోంచి వచ్చే మాటలని కూడా దాకలోంచి వచ్చే వాటిలా కాకుండా అతి పవిత్రమైన గుహ లోంచి వచ్చినట్టుగా భావన చేసుకొని వ్యక్తం చేయాలి. మన ముఖము ఒక అగ్ని గుండము. అగ్ని ఉండేది హోమ గుండములోనే కదా. మరి ఈ హోమ గుండము ఎట్లా ఉంచుకోవాలి. దీని అంతటికి ఇంద్రుడు అధిపతి. కాబట్టి, మనం చేసేదాన్ని బట్టి ఆయన మనకి account maintain చేస్తాడు. He is the Ruler! ఇంద్రుడికి పాలు లేకుండా యజ్ఞము ఉండదు. అందుకని అన్ని బాగా ఉంచుకోవాలి. ఇది ఖర్చుతో సంబంధము లేదు. కేవలము శ్రద్ధ, భక్తి. అవి ఉంటె అంతా బాగుంటాయి. మనము పని చేసే టేబులు, కుర్చీ, మంచము, మనము వాడుకొనే చెప్పులు, let them shine. Let us not give scope for any impurities to gather around us. మలినాలు చేరటానికి అవకాశము ఇవ్వకూడదు. మలినం చేరితే కోరికలు ఎక్కువ అవుతాయి. ఆశలు పెరుగుతాయి. అదే ఆకలి - దప్పులు అంటారు. 'క్షుత్పిపాసామలాం' అనే మలినాలు. కాళ్ళకి మట్టి ఉన్నా పర్వాలేదు అనుకోకూడదు. కాళ్లలో, తలలో, గోళ్లలో మట్టి ఉంటే we are inviting things, దానికి plan మరొకటి ఉంది. Carbon's plan is already there. Just like oxygen's plan is there. ప్రాణానికి ప్రణాళిక ఎంత ఉందో, మరణము యొక్కా ప్రణాళిక కూడ అంతే ఉంటుంది కాబట్టి, నిన్ను చంపుకు తినటానికి అవన్నీ చేరుతూ ఉంటాయి. అందుకని రోజు కడుక్కోవాలి. అదే మనకి శ్రీకృష్ణుడు చెప్పినది కూడ. కడుక్కుంటే బాగుంటుంది. అద్దము తుడుచుకుంటే బాగుంటుంది. అవే మనకి ఈ ఆచారాలు క్రింద వచ్చేసాయి. కానీ ఈ బయట కడుక్కోటం, తుడుచుకోటం ఎంత అవసరమో, అంతకంటే ముఖ్యం గా లోపల నుంచి వచ్చేవి మనకి శుచిగా ఉండాలి. లోపల నుంచి మనకి మాటలు వస్తాయి, ఆలోచనలు వస్తాయి. అటు నుంచి మొదలు పెట్టి ఇటు నుంచి చేయమని మనకి గురువులు చెప్తారు. సాంప్రదాయము అటు మొదలు పెట్టమంటుంది. ఎటో అటు ఒకటి ముందు మొదలు పెడితే బాగుంటుంది. Let everything around us shine. Let nothing be impure around us. If you entertain any impurities, it will give scope for further impurities. ఒక మంచి గుణము పది మంచి గుణాలని ఏ విధముగా పట్టుకు వస్తుందో, అట్లాగే ఒక బద్ధకాన్ని సంబంధించిన అలవాటు మిగతా బద్ధకాలని పట్టుకు వస్తుంది. అందుకనే మన వాళ్ళు కాళ్ళు కడుకొనిరా, అంటారు. తట్టెడు మట్టి ఉంటుంది చూసుకుంటే. మన అరికాళ్ళలో మట్టి మనకి కనబడదు. అందుకని బాగా ఆపాదమస్తకము శుభ్రంగా ఉంటె అలక్ష్మి చేరదు. లక్ష్మి ప్రకాశము, అలక్ష్మి చీకటి. అలక్ష్మిని నాశనము చెయ్యమని అడుగుతున్నాము కదా. 'అలక్ష్మీర్ నాసయామ్యహమ్' |అభూతిం 'అభూతిం' అంటే అన్ని ఉంటాయి ఏది అనుభూతికి రాదు. 'అసమృద్ధిం సర్వాన్ నిర్ణుధమే గృహాత్ ‖ మొత్తము అన్ని తీసి అవతల పారేయమని మనము అమ్మవారిని

అడుగుతున్నాము. నాకు అసంవృద్ధి అనేది లేకుండా చెయ్యి. ఉన్నది అనుభవించేటట్లు చెయ్యి. మురికి అనేది రానీయక. ఆశలు పెంచక. మనము ఆమెని పిలుచుకోపోతే పెరుగుతాయి. ప్రకాశము ఎంత ప్రకాశింప చేసుకుంటే అంత తగ్గుతాయి. అక్కరు లేనివన్ని కోరుకోటము ఉండదు. చూసినవన్నీ కావాలి అనిపిస్తుంది ఊరిలో ఉన్న స్థలాలన్నీ కొనాలి అనిపిస్తుంది. అంటే అది ఆశ, ఆకలి, దప్పిక, అది తీరదు. ఎంత తాగినా దాహమే! ఆమె ఉంటె. ఉన్నంతలో హాయిగా ఉంటుంది. అందుకనే ఈ ప్రకాశనామానికి , ఆ వసుతత్త్వానికి core నామము ఆ మొదటి నామము. అటువంటి సంబంధము ఉంది కాబట్టి, మనకి ఏదో కలసి రావటము లేదని అనుకోకూడదు. కలసి రావటానికి మనలో ఏవో అడ్డంకులు ఉన్నాయి, అవి మనలో తలపులలోను, వాక్కులలోను,ఆచార వ్యవహారాలలోను ఉండే మలినాలు. అవి నెమ్మదిగా తీసేస్తూ ఉంటె, క్రమశః వెలుగు వస్తుంది. వెలుగు రావడమే సంపద రావడం. అటువంటి సంపదే శుభం. రాకపోతే ఇబ్బంది లేదు. ఇంకో రకమైన సంపద ఉండీ కూడా లాభము లేదు.

## 285, 286 ఓజః, తేజః

ఓజస్సు అంటే మనలో ఉద్భవించే ప్రాణశక్తి, ప్రాణము, జీవము. అది మనకు సూర్యోదయానికి ముందు లభ్యమవుతుంది. తెల్లవారుఝామున లేచి, స్నానాదికాలు ముగించుకొని, ఆరుబయలులో కూర్చొని ఒక గంట ధ్యానం కానీ, మంత్రజపం కానీ, Book reading కానీ, లేదూ ఒక గంట ఊరికే కూర్చున్నా, ఏదైనా పనిచేసుకున్నా 'ఓజస్సు' అనే భగవత్ తత్వం మనలో ప్రాణశక్తిని ఉద్భవింపచేస్తుంది. సూర్యోదయానికి ముందే లేచి, స్నానాదికాలు ముగించుకొని ఆరుబయలులో కూర్చొని ఒక గంట ఏదైనా పనిచేసుకున్నా కూడా ఓజస్సు, సూర్యోదయానికి ముందు వచ్చే ప్రాణశక్తి మన శరీరానికి ఆరోగ్యం కలిగించడానికి అవకాశం వుంటుంది. మాస్టరుగారు అంటూండేవారు సూర్యోదయానికి ముందే లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, సూర్యోదయం కోసం ఎదురుచూసేవారే నా అనుయాయులు అని. దానివల్ల మనకు ప్రాణశక్తి అభివృద్ధి చెందుతుంది. ఓజస్సు వున్న చోటే తేజస్సు వుంటుంది. ఎందుకంటే తెల్లవారుఝామున సూర్యోదయానికి రెండు గంటల ముందు ఈ 'ఓజస్సు' అనేది లభిస్తుంది. దానివల్ల జీవశక్తి ఉత్సాహంగానూ, పరిపూర్ణంగానూ, చాలా కుతూహలం గానూ ఎన్ని కార్యక్రమాలైనా చేయగలిగిన బలము అందులో నుండి లభిస్తాయి. అది ప్రాణశక్తి కాబట్టి ఈ 'ఓజస్సు'ను భగవంతుని తత్వంగా తీసుకోవాలి. ఆత్మతత్వానికి మూడు కళ్యాణగుణాలు. 1 ప్రాణము 2. తెలివి 3. వెలుగు. ఓజస్సు సమస్తమైన దేవతలను ఒక రకమైన సమన్వయంలో వుంచి మనకు తోడ్పాటు చేసి పనిచేసే శక్తిగా పనిచేస్తుంది. The cementing Force. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా వుండేదానికి, ఒకరితో ఒకరికి సత్సంబంధాలుండి కలిసికట్టుగా జీవించే దానికి వుండే తేడా! భగవత్తత్వంలో సమీకరించడం, సమన్వయం చెందడం తద్వారా అంతర్యామి తత్వాన్ని అనుభూతి చెందడానికి ఈ 'ఓజస్సు' చాలా తోడ్పడుతుంది. కాబట్టి ఈ 'ఓజస్సు' ను ప్రతిదినము ఉదయం భగవత్తత్వంగా ఆవాహన చేసుకోవాలి. క్రమంగా ప్రాణం బాగా విస్తృతం గా పనిచేస్తుంది. మన శరీరంలోని అన్ని అవయవాలకు మధ్య సహకారం అందుతుంది. వాటిమధ్య అంగీకారం కుదిరి ఆరోగ్యం బాగుండడానికి అవకాశము ఏర్పడుతుంది. ప్రాణశక్తి ఎంత ఎక్కువగా ఉంటే మనకి అందులో నుండి తేజస్సు కనబడుతుంది. అందుకని తరువాత 'తేజస్సు' భగవంతుని నామం గా ఇచ్చారు.

తేజస్సు అంటే వెలుగు. వెలుగు మనలో పెరగడానికి ఇదే కారణం. సూర్యుడు రాకముందే సూర్యుని వెలుగు వస్తుంది. ఆకాశంలోకి ముందు ఓజస్సు, తరువాత తేజస్సు, దాని తరువాత ద్యుతి. 'ద్యుతి' అంటే వెలుగు ప్రవాహం. సూర్యుని కిరణాల నుండి వెలుగు ప్రవాహం మనకు అందుతుంటుంది. ఆ ఒకసారి కిరణాలు మన మీద పడితే ప్రకాశం వస్తుంది. ప్రకాశం బాగా ఎక్కువ అయ్యి ప్రతాపనం. ప్రతాపనం అంటే

వేడి. బాగా తాపం కలిగించేవాడు ప్రతాపుడు. సూర్యుని 'ప్రతాపుడు' అంటారు. ఆయన తాపం మనకు అనుభవమే! ఆయన సంవత్సరానికి 8 నెలలు మనకి ప్రతాపుడుగా గోచరిస్తాడు. తెల్లవారుఝామున సూర్యోదయానికి ముందు 2 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వుండే వెలుగు తత్వాన్ని ఈ నామాల్లో ఇచ్చారు. ''ఓజస్తేజో ద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః''. ఇది మొత్తం 16 అక్షరాల మంత్రం. ఈ మంత్రాన్ని బాగా చేసుకుంటే అందులోంచి చక్కటి healing power బాగా generate అవుతుంది. మనకీ పనికి వస్తుంది. ఇతరులెవరైనా అస్వస్థులుగా వుంటే వారిని ఈ మంత్రం చేసుకొమ్మని సలహా ఇవ్వవచ్చును. ''ప్రాణదా'' అనే మంత్రం కూడా వుంది. దానికంటే ఇది చాలా ముఖ్యమైన మంత్రం. ఈ మంత్రం లో 16 అక్షరాలున్నాయి. షోడశి అన్నమాట. ప్రాణాన్ని పరిపూర్ణం గా బాగా అభివృద్ధి గావించి, మనలో ఓజస్సుని, తేజస్సుని, ద్యుతిని, ప్రకాశమును, ప్రతాపాన్ని పెంచే మంత్రం. ఈ మంత్రాన్ని ఆదివారం బాగా చేసుకోవడం అనే ఒక కార్యక్రమం పెట్టుకోవచ్చును. సాధన పరం గాను ఉన్నది. ఎవరికైనా ఆరోగ్యం కావాలనుకొంటే వారికి ఈ మంత్రం ఇవ్వవచ్చును. దానికి ముందు ఓంకారం చేయవచ్చును. ఈ మంత్రం వల్ల మనలో క్రమేశః ఈ 5 పెరుగుతాయి. ఓజస్సు, తేజస్సు, ద్యుతి, ప్రకాశం, ప్రతాపం. ఓజస్సు, తేజస్సు, ప్రకాశం ఇవి ఆత్మకు సంబంధించినవి. ఓజస్సు, తేజస్సు, ద్యుతి ఈ మూడూ కలిగినవాడు ద్యుతిధరుడు. దాని తరువాత ప్రకాశాత్మ. దానివల్ల వచ్చే ప్రకాశం. దీనినే జ్వాలాకూల్ మహర్షి The Love, Light, Power అని చెప్పారు. వెలుగు ప్రవాహం అనేది current లాంటిది. అది power. తేజస్సు అనేది light లాంటిది. అంటే వెలుగు. ఓజస్సనేది మనలో అన్నిటినీ సమీకరణ చేసే ప్రాణశక్తి. అదే ప్రేమశక్తిగా love గా వర్ణించవచ్చును. ఈ మూడూ ఆత్మ యొక్క మూడు కళ్యాణగుణాలుగా వర్ణిస్తారు. దాన్నే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తిగా చెబుతూ వుంటారు. ఈ మూడు భగవత్తత్వంలో వున్న కళ్యాణ గుణాలూ మనవరకు వచ్చి, మనకు వెలుగును ప్రసాదించి, మనల్ని ప్రతాపవంతులుగా చేయడానికి పనికి వచ్చేవి. భగవత్తత్వంలో ఈ 5 మనం దర్శనం చేయవచ్చును. ప్రతాపం, ప్రకాశం, వెలుగు యొక్క ప్రవాహం అంటే శక్తిగా, తెలివి గా, ప్రాణశక్తిగా భగవంతుని దర్శనం చేయవచ్చును. ఈ 5 నామాలకీ ఈ విధమైన అనుసంధానమున్నది. వివరణ తక్కువ గానీ, ఇందిలో ఉండే శక్తి చాలా ఎక్కువ.

## 287, 288, 289, 290 ద్యుతిధరః, ప్రకాశత్మ, ప్రతాపనః ఋద్ధః

ద్యుతిధరః అంటే వెలుగుని ధరించినటువంటి వాడు, విద్యుత్తును ధరించినటువంటి వాడు, ఆ విద్యుత్తును ధరించి ప్రకాశించి మనకు కనపడ్డం జరుగుతుంది సూర్యోదయం తరవాత, ఆ ప్రకాశం అయిన తరువాత అది పెరుగుదల చెంది ప్రతాపంగా మారుతుంది. మనలో కూడా ముందు ఆరోగ్యం బావుంటే వొంట్లో ఓజస్సు పెరిగి తర్వాత తేజస్సు పెరుగుతుంది. తేజస్సు పెరిగిన తర్వాత మాస్టర్ cvv గారు అన్నారే ఆ 'ఎలక్ట్రిక్ హింట్'' మనకి ఏర్పడుతుంది. ఈ రెండు లేకుండా అది ఏర్పడదు. అంటే 'భగవంతుడి యొక్క అవతరణము' అంటారు దాన్ని. అవతరణం జరిగిన తర్వాత ఇంక నెమ్మదిగా అది ప్రకాశించడం మొదలు పెడుతుంది. ప్రకాశం బాగా ఎక్కువయ్యింతర్వాత దాని యొక్క ప్రతాపం కూడా కనిపిస్తుంటుంది. ఇదీ సాధనలో మెట్లు. భగవంతుడి యొక్క అవతరణం దాని యొక్క క్రమం ఒకటి ఇచ్చారు. అలాగే రోజులో జరిగేటటువంటి సూర్యోదయానికి ముందు దాన్ని బ్రాహ్మీ ముహూర్తం అంటారు. ఆ సమయం నుంచి ఈ ప్రక్రియలు, ప్రతి రోజూ జరుగుతాయి. ప్రతీ సంవత్సరంలో కూడా మళ్ళీ జరుగుతూ ఉంటాయి, మకర మాసం ఉదయం అయితే ధనుర్మాసం ఉదయానికి రెండు గంటలు ముందు కింద చెప్తారు. అందుకని ధనుర్మాసంలో సూర్యోదయానికి రెండు గంటలు ముందుగా నిదుర లేచి దంతావధానం చేసుకుని, అవకాశం ఉంటే స్నానం చేసి, ప్రకృతితో అనుసంధానం చెందటానికి ప్రకృతికి expose అయి ఉండాలి, ప్రకృతిలో ఉండే ఆ ఓజస్సు ఆ తేజస్సు అందుకోడానికి ధనుర్మాసం మనం అలా సద్వినియోగం చేసుకోవాలి. వినియోగించుకుంటే తద్వారా మనకి మకర మాసం అంటే ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే సమయానికి మనలో రక్షకుడు పుట్టటానికి అవకాశం ఏర్పడుతుంది. మకరాశిలో రక్షకుడు పుడతాడు ప్రతి సంవత్సరం. The saviour is born in the month of Capricorn. రక్షకుడు పుట్టటం అంటే మనలో దివ్యత్వం యొక్క అస్తిత్వం ఏర్పడటం. మనం మన హృదయముల యందు కృష్ణజననం అని చెప్పకోవచ్చు లేదా దివ్యజననం అని చెప్పకోవచ్చు లేదా క్రైస్తు జననం అని చెప్పకోవచ్చు. దేవుడికి మనం ఏ పేరు పెట్టుకుంటే హృదయంలో దాని జననం జరుగుతుంది. అది జరగాలంటే ప్రాణశక్తి బావుండాలి, ఆ తరువాత దాన్ని పెంపొందించుకునే తేజస్సు ఏర్పడాలి. దానికి సంబంధించిన సాధన మనం చేకునేది, అలా ఒక్కసారి అవతరణం జరిగిన తర్వాత ఇంకది ప్రకాశించడం మొదలుపెట్టి మొత్తం మనలో వ్యాపనం చెందుతూ ఉంటుంది. వ్యాపనం చెందిన తరువాత ప్రకాశం నుంచి ప్రతాపనం లోకి వస్తుంది. సూర్యుడు కూడా 8, 9 గంటల వరకు ప్రకాశంగా ఉంటాడు, తర్వాత నెమ్మదిగా మనకి తాపం ఎక్కిస్తాడు. ప్రతాపనం! మనలో జరిగే కథా ఇదే, సృష్టిలో జరిగే కథా ఇదే, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోజూ జరిగే కథా ఇదే! సంవత్సరంలో కూడా ఇదే కథ మనకి జరుగుతూవుంటుంది. కార్తీక మాసం అంటే రాత్రి రెండు గంటల నుంచి 4 గంటల కాలం వరకు. మార్గశీర్ష మాసం అంటే 4 గంటల నుంచి 6 గంటల కాలం. మార్గశీర్ష మాసాన్ని మనం ఎంత వినియోగించుకో గలిగితే అంత కృతార్థులం అవుతాం. పైగా మార్గశీర్ష మాసంలో శుద్ధ ఏకాదశి అత్యంత పవిత్ర మైన

రోజు, సంవత్సరంలో అంతకు మించిన పవిత్ర మైన రోజు ఇంకోటి లేదు. మార్గశీర్ష మాసంలో, శుక్ల పక్షం లో వచ్చే ఏకాదశిని పరిపూర్ణంగా దైవ సాన్నిధ్యానికి, విష్ణు సాన్నిధ్యం కోసం వినియోగం చేసుకున్నట్లయితే మనకి అంతర్లోకములో ఒక విధమైన ప్రబోధం జరగటానికి అవకాశం ఉంటుంది. మార్గశీర్ష మాసం అంతా కూడా అట్లాగే జరుగుతుంది. మార్గశీర్ష మాసంలో మనకి మాసం అంతా ముఖ్యం, అందులో గురువారం మరీ ముఖ్యం. మార్గశీర్ష మాసానికి అధిపతి బృహస్పతి. అంటే గురువన్న మాట, అంటే గురువు యొక్క అనుగ్రహం ఈ నెలలో చాలా బాగా మనం పొందటానికి అవకాశం ఉంటుంది. గురువారం నాడు, మార్గశీర్ష మాసం అంటే గురువారం లో గురువు యొక్క ఆధిపత్యం ఉంటుంది, అంటే గురువారం నాడు గురువు అధిష్టించి ఉంటాడు, మార్గశీర్ష మాసం అంతా గురువు అధిష్టించి ఉంటాడు, కాబట్టి మార్గశీర్ష మాసంలో గురువారం అంటే చాలా ఎక్కువగా గురువు అనుగ్రహించటానికి అవకాశం ఉంటుంది, అలాగే ఏకాదశి. శ్రీ కృష్ణుడు కూడా మాసాల్లో నేను మార్గశీర్ష మాసాన్ని అని చెప్పాడు. అంటే తన యొక్క పరిపూర్ణమైన అనుగ్రహం మనకి లభించడానికి మార్గశీర్ష మాసం పని చేస్తుంది. మార్గశీర్ష మాసం యోగానికి మూలమైన మాసం, మూల అనే నక్షత్రం మార్గశీర్ష మాసంలోకే వస్తుంది. అంటే ధనుర్రాశిలో వచ్చే నక్షత్రం మూలా నక్షత్రం. అక్కడ్నుంచి యోగ కారకుడై మనకి దత్తాత్రేయుడు గురువుగా దర్శనం ఇచ్చి మనకి యోగ మార్గాన్ని అందించే మాసం. అందుకని ధనుర్రాశి లో ఉండే పౌర్ణమిని కూడా దత్తాత్రేయ పౌర్ణమి గా మనం ధ్యానం చేసుకుంటుంటాం. చాలా రకాలైన విశేషాలున్న మాసం మార్గశీర్ష మాసం. కాబట్టి ప్రతి ఉదయానికి రెండు గంటల ముందు కాలం అంతా కూడా మార్గశీర్ష మాసం గా చెప్పకోవచ్చు. సంవత్సరంలో ఈ మార్గశీర్ష మాసం అంతా గూడా మొత్తం సంవత్సరానికి ఈ నెల ఉదయానికి రెండు గంటలు ముందు కింద లెక్క, ఎందుకంటే పుష్యమాసం రాంగానే మనకి మకర సంక్రాతి ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేప్పటికి మనకి ఆ నెల ఉదయం కింద లెక్క సంవత్సరంలో.

బుద్ధః-బుద్ధుడంటే తను అలాగే ఉండీ తన చుట్టూ పెరిగే తత్త్వం కలిగిన వాడు. భగవంతుడు మొత్తం అంతా నిండి ఉన్నాడు కాబట్టి అంత కన్నా పెరిగేదేంలేదు. పెరగడానికి ఇతనిది కానిదేదన్న ఉంటే కదా! ఆ తత్వం కానిదేంలేదు కనక పెరిగేది ఏమీ లేదు. కానీ తను ఉండగా, తాను ఆధారంగా, సమస్తాన్ని పెంచుతూ ఉంటాడు. పృథ్వీ పెంచుతూ ఉంటాడు, మనం కూడా మన సాధన పరంగా అట్లా చేసుకోవాలి. మన చుట్టూ పెరుగుతూ ఉంటె వాటితో పాటు మనం పెరుగుతున్నాం అని మనం అనుకోకూడదు. మనం పెరగగూడదు అంటే ఇక్కడ అహంకారంగా పెరగగూడదు అని అర్థం. ఆలోచనాపరంగా పెరగగూడదు. పదార్థమయంగా పెరగగూడదు. కోరికలమయంగా పెరగగూడదు. మనం మాములుగా అవసరమైన కోరికల మేరకు, అవసరమైన ఆలోచనల మేరకు మనం, మనంగా వుంటూ మన చుట్టూ ఉండేది పెంచుకుంటూ, ఇతరులకి ఉపయోగపడే పద్ధతిలో వెళ్తూ వుంటే బుద్ధః అనే నామం మన యందు బాగా ఎక్కువ సిద్ధి చెందటానికి అవకాశం ఏర్పడుతుంది. మహాత్ముల్ని మనం చూసినట్లయితే మనకటువంటి విషయాలు బాగా గోచరిస్తాయి. వాళ్ళు పెరగటంగా,

పెంచుకోటంగా ఉండకుండా వాళ్ళ చుట్టూ అన్నీ పెంచుతూ వుంటారు. వాళ్ళ చుట్టూ వుండే వాళ్లందరికీ సమృద్ధి కలిగిస్తూ వుంటారు. వీళ్ళు సమృద్ధిలోనే ఉంటారు కాబట్టి సమృద్ధికి మించి ఇంకేం కావలసింది ఉండదు కాబట్టి సమృద్ధి లేని వారందరికీ ఏ ఏ విషయాల్లో సమృద్ధి లేదో ఆ యా విషయాల్లో సమృద్ధి నందించేటువంటి తత్త్వంగా మహాత్ములు వుంటారు. అదే కదా ఒక గురువు చెప్తారు. తనకి కావాల్సిందేమి ఉండదు గురువుకి, ఇతరులక్కావల్సింది అన్నిటినీ కూడా సమకూర్చి పెట్టి వారిని సమృద్ధి అనే తత్వంలోకి ఇముడ్చుకోటానికి ప్రయత్నం చేస్తూ వుంటారు. ఇదీ ఋద్ధః అనే నామానికి అర్థం. అంటే పెరిగేదే అది. ఋద్ధః అంటే పెరుగుతున్నటువంటిదని. ఇక్కడ పెరిగేదేమిటయ్యా అంటే తాను పెరగటం కాదు, తన ప్రకృతి తన్ని ఆధారం చేసుకొని పెరుగుతుండటం. పెరుగుతున్న దానికి తరుగుదల కూడా ఉంటుంది. అందుకని ఈ హాని వృద్ధులు రెండిటికీ కూడా ఆధారభూతంగా తాను కాలానికి అతీతంగా వుంటూ పెరగటానికి దోహదం చేస్తూ ఉంటాడు. మనం కూడా పెరుగుతున్న దాంతో ఏకీభావం చెందినపుడు తరుగున్న దానికి బాధ పడుతూ ఉంటాం. పెరుగుతున్నపుడు మనం పెరగట్లేదు మన చుట్టూ ఉండే సంపద పెరుగుతున్నది అని తెలుసుకోవాలి. తరుగుతున్నపుడు మనం తరగట్లేదు మన చుట్టూ ఉండే సంపద తరుగుతున్నది అని తెలుసుకోవాలి. శరీరం పెరిగినపుడు మనం పెరుగుతున్నాం అనుకోడానికి వీల్లేదు. వొళ్ళు పెరిగిందనుకోవాలి. శరీరం తగ్గినపుడు మనం తగ్గిపోయాం అనుకోడానికి వీల్లేదు. మనం తగ్గట్లేదు శరీరం తగ్గుతోంది. ఇట్లా పెరుగుతుంటే అదొక బాధ. ఇట్లా పెరిగిపోతున్నావ్ నువ్వు అంటారు, నువు పెరగవు, నీ శరీరం పెరుగుతోంది. అట్లాగే బాగా తగ్గిపోతున్నారండి మీరు అనంటారు, నువు తగ్గవు నీ శరీరం తగ్గుతూ ఉంటుంది. పెరిగేదానికి తగ్గే గుణం ఉంటుంది. తరిగే దానికి మళ్ళీ పెరిగే గుణం ఉంటుంది. పెరగటం తరగటం అనేవి ప్రకృతికి సంబందించినవి. మనకి సంబంధించినవి కావు. ఇది తెలుసుకున్న వాడు జ్ఞాని. తన శరీరమే కాదు, తన యొక్క చుట్టూ ఉండేటువంటి బంధువర్గం కానీ, మిత్రవర్గం కానీ, సంఘం కానీ, ఆస్తి పాస్తులు కానీ, అవన్నీ కాలం ప్రకారం పెరుగుతూ ఉంటయి, తరుగుతూ ఉంటయి అని తెలిసిన వాడు ఆత్మవంతుడు. అవి పెరిగినపుడు మనం పెరిగాం అనుకుని, అవి తరిగినపుడు మనం తరిగిపోయాం అనుకునే వారు హాని వృద్ధి లో చిక్కుకుని బాధ పడుతూంటారు. కాబట్టి ఋద్ధ అనే నామం మనకి తెలిపేదేంటంటే భగవంతుడే పెరుగుదల తరుగుదల లేకుండా ఉన్నాడు. ఆయనలోంచి దిగి వచ్చిన వాళ్ళం కాబట్టి, మనం కూడా అదే తత్త్వం కలిగిన వాళ్ళం కాబట్టి అదికాక వేరే ఎదో మనం అందుకోకుండా ఉన్నట్లయితే, చుట్టూ వుండే వాటిల్లో పెరిగేవి తరిగేవి మనల్ని బాధించవు. మనకి పెరిగే వాటిల్లోనూ తరిగే వాటిల్లోనూ చాలా అతుక్కుపోయి ఉంటం వల్ల రకరకాలుగా బాధ పడుతూ ఉంటాం. మహాత్ములా విధంగా బాధ పడకుండా జీవించి, మనకి ఎలా జీవించాలో చూపిస్తూవుంటారు కాబట్టి వాళ్ళని

చూసి నేర్చుకుంటూ వుండాలి. వాళ్లకి పెరిగిన దాని యందు సంతోషం కానీ తరిగిన దాని యందు దుఃఖం కానీ ఈ రెండూ వుండవు. పెరిగినపుడు పెరుగుతూ ఉంటుంది, తరిగినపుడు తరుగుతూ ఉంటుంది అని తెలిసి వుంటారు. అవి కాలం బట్టి జరుగుతూ ఉంటుందని తెలుస్తుంది, కాలజ్ఞానులై ఉండటం వల్ల పెరిగే సమయం వచ్చినపుడు దానికి సంబంధించిన దివ్య మైన కార్యక్రమాలు నిర్వహిస్తారు, తరిగే సమయం వచ్చినపుడు తరుగుదాల్లోంచి జీవులు బాధ పడకుండా ముందు వాళ్ళని రక్షించుకుంటూ వుంటారు. జీవులని ఇట్లా రక్షించుకోటమే మహాత్ములు చేసే కార్యక్రమము. జీవులు తమ్ము తాము తెలుసుకున్నట్లైతే, తమకి పెరిగేదంటూ ఏంలేదు, తమకి తరిగేదంటూ ఏంలేదు అని తెలుసుకోటం జరుగుతుంది. అటువంటి వాడికి తాను యుక్త వయస్కుడయ్యాడని గాని, మధ్య వయస్కుడయ్యాడని గాని వృద్ధుడయ్యాడని గానీ ఏముండదు, మరణించాడని గాని ఏముండదు. ఈ  మార్పులు శరీరానికే గాని తనకి కాదని తెలుస్తూ ఉంటుంది. చుట్టు ఏంపెరిగినా అది ప్రకృతి యొక్క పెరుగుదలే. దానికి ఆధారంగా భగవద్ తత్త్వం ఉండటం వల్ల అది పెరుగుతూ ఉంటుంది, తరుగుతూ ఉంటుంది. అల లేస్తూ ఉంటుంది, పడుతూ ఉంటుంది, ఆధారం సముద్రం. సముద్రం లేవటం పడటం ఉండదు. అట్లాగే మనకి చోటు. చోటుకి పెరుగుదల్లేదు తరుగుదల్లేదు. అదే చోటు. చోటు పెరిగిందండీ మీ ఇంట్లో అంటే గోడలు కొంచెం దూరం దూరంగా కట్టుకున్నాం తప్ప, చోటు పెరగదు, చోటు తగ్గదు.  సృష్టిలో ఉండేవన్నీ పెరుగుతాయి, అన్నీ తరుగుతాయి.

పుట్టినటువంటి భూమి కూడా దానికి పెంపు ఉంది మళ్ళీ తగ్గుదల ఉన్నది. చంద్రుడికి పెంపు ఉంది తగ్గుదల ఉంది, ఇవన్నీ మనకి కనిపిస్తున్నాయి కదా. ఈ పెరిగి తరిగే వాటిల్తో సంబంధం లేకుండా ఉండే వాడి ఆధారంగా, అన్నీ పెరగటం తరగటం జరుగుతూ ఉంటాయి కాబట్టి, చూస్తూ ఉంటాడుట వాడు. బాధ పడడు మనలాగ. మనమైతే తరిగే time లో  పెరగాలనుకుని పని చేస్తూ ఉంటాం, అది పెరగదు, బాధ పడుతూ ఉంటాం. పెరిగే time లోనేమో పని చేయం కాబట్టి పెరగదు.  చాలామంది సంపద  పెరిగితే దాంతో పాటు  వికారంగా పెరిగిపోతూ ఉంటారు. తరుగుతున్నపుడు బాధ పడతారు. ఈ వికారాలన్నీ ఉండవు, ఈ కళలన్ని లేకుండా ఉండే వాడు కాబట్టి ఆ తత్వాన్ని మనం బుద్ధః అని చెప్పకుంటున్నాం, బుద్ధుడంటే seemingly ever increasing but includes, there is no such thing as increase for him. పెరగటం అనేది లేదతనికి, తరగటం అనేది లేదు, రెండూ లేనటువండి వాడు, రెండూ ఉన్నట్టుగా గోచరించేటి వంటి వాడు, మనకి వృద్ధినిచ్చేటి వంటి వాడు. అది కూడా మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. ఏ వృద్ధి ఇస్తాడంటే భగవంతుడు మనకి ఇచ్చేటువంటి వృద్ధి వేరు, ప్రకృతి మనకి ఇచ్చేటువంటి వృద్ధి వేరు. సద్గురువును ఆశ్రయించినపుడు వృద్ధి దేని యందు కలిగిస్తాడంటే  ఆత్మతత్వము యొక్క ప్రకాశము నందు, ప్రతాపము నందు కలిగిస్తాడు.

ఇక మిగతావన్నీ శాశ్వతమైనటువంటివి కాదు కాబట్టి ఆత్మతత్వము యందు  మనల్ని నిలబెట్టటానికి ప్రయత్నం చేస్తాడు.

## 291 స్పష్టాక్షరః

స్పష్టాక్షర అంటే అక్షరం స్పష్టమైనటువంటి వాడు. శుభ్రం గా ఉండే అక్షరము అని చెప్పకోవచ్చు. మనకు స్పష్టముగా కనబడేటట్టు గా ఉందని అర్ధం. అంటే వ్యక్తమైందిటా, అని అర్ధం. That is which manifest is seen, that is which not manifest is unseen. Unmanifest గా వున్నప్పుడు చూడలేము. అందుకని unmanifest only manifest through nature. ఎలాగంటే ఉప్పులో ఉప్పగా, పంచదారలో తీపిగా, మామిడిపండులో మామిడిరసంగా, మనిషిలో మనిషిగా వుంటాడు. అన్నింటిలో అన్నిటిగా వుంటూ ధర్మాల ద్వారా వ్యక్తమవుతాడు. అస్పష్టంగా వుంటే మనకు కనబడడు కాబట్టి ఎప్పటికప్పుడు స్పష్టమవుతూ వుంటాడు. అక్షరము అంటే రెండు అర్థాలు. 1. క్షరము కానిది. 2. అ- భగవంతుని నామం. అక్షరాలలో 'అ' నేను అంటాడు భగవద్గీతలోని విభూతియోగం లో! అక్షరుడు లో 'అ' ఏ ఇదంతా ఏర్పడుతుంది. తాను మాత్రం నశించని వాడుగా ఉంటాడు. అక్షర అని ఇంకొక విభాగం తీసుకొంటే, అక్షమంటే కేంద్రం నుండి పరిధికి గీయబడిన వ్యాసం. కేంద్రం నుండి పరిధికి వ్యాపనం చెందినవాడు. అక్షముగా, 'ర' అంటే తీసుకొని రాబడినవాడు. అంటే అవ్యక్తుడైన భగవంతుడు ప్రకృతి తత్వం లోకి, అన్ని లోకాల్లోకి, సప్తలోకాలుగాను కొనిరాబడిన వాడు. మనం కేంద్రం నుండి పరిధికి కొనిరాబడతాము. ఉదయం నిద్రలేచినప్పుడు మనం ఒక కేంద్రం నుండి మన శరీరం వరకు వ్యాపనం చెందుతాము. మన శరీరం మన పరిధి. మనం కేంద్రం నుండి మన పరిధి యైన శరీరం వరకు వ్యాపనం చెందుతాము. అంటే 'నేను' అనే ప్రజ్ఞ, నేనుగా మేల్కొంచి, మేల్కొంచిన తరువాత బుద్ధిలోకాలకి, బుద్ధిలోకాల నుండి ఇంద్రియ లోకాలకి, అక్కడనుండి శరీరానికి వ్యాపనం చెంది, అక్కడనుండి బయటకు, మనకుండే పరిధి అంతా మనం వ్యాపించి వుంటాం కదా! ఎవరి పరిధి వాళ్ళకుంటుంది. ఎవరి field of action వారి పరిధి అన్నమాట! ఈ పరిధి అంతా వ్యాపించి, వ్యక్తమవుతున్నవాడు ఒకడే. ఒక్కొక్క స్థితిలో, ఒక్కో పేరు, ఒక్కో తొడుగు వేసుకోగానే ఒక్కొక్క రకంగా వాడు అదృశ్యుడౌతాడు. ఇంకొకడున్నట్లు గా కనిపిస్తాడు. వాడే మనలో నిద్రలేస్తే, మనం లేచామని మనం అనుకొంటాము. రకరకాలుగా భావాలు పెట్టుకొని పనిచేసుకుంటూ వుంటాము కానీ మొత్తం గా పని చేసేది అతనొక్కడే! అలాగే అక్షర రూపంలో వ్యక్తమయినప్పుడు అక్షరం ఒక రూపంగా కనిపిస్తుంది. 'అ' అనే తత్వం కోసం అక్షరం ఒక రూపం తప్ప, మనం అక్షరం అనుకొనేది అక్షరం కాదు. మనం వ్రాసే 'అ' లేక 'ఓం' అక్షరం మనం ఏదైతే అక్షరుడు అనుకుంటున్నామో దాన్ని చెప్పడానికి వ్యక్తమయిన ఆకారం లేదా రూపము. అక్షరమే రూపం. శబ్దరూపంలో వ్యక్తం చేయడానికి వీలు లేనటువంటివాడిని 'అ' అనే శబ్దం గా ముందు వ్యక్తం చేస్తున్నాము. ఆ తరువాత వ్రాయుట వలన ఇంకొంచెం వ్యక్తం చేస్తున్నాము. వ్యక్తం చేసినంత మాత్రాన అందులో వున్నాడా? అంతకుమించి వున్నాడా? అంతకుమించి కూడా వున్నాడు. 'అ' అని అనకముందు, అన్నాక, అన్న తరువాత కూడా వున్నాడు. ఎప్పుడూ వున్న వాడిని మనం 'అ' అని ఉచ్చరించి బయటకు తెస్తున్నాం అనుకుంటాం. వ్రాసిన రూపం 'అ' అనుకుంటాం. రూపం 'అ' అవదు. ఇది

చాలా పెద్ద రహస్యం. మామూలుగా ఎంతో సాధన చేసిన తరువాత అవగాహన అయ్యేటటువంటి విషయం. 'అ' అనే అక్షరం, 'ఓం' అనే అక్షరం వ్రాసామనుకోండి. 'అ' అక్షరం రూపానికి సంకేతంగా పెట్టుకొన్నామే గానీ, సంకేతం అసలు కాదు. ఆ సంకేతం ద్వారా అసలు విషయాన్ని మనం తెలుసుకొంటాము. అలాగే శబ్దం కూడా ఆయన సంకేతమే! 'అ' శబ్దం అనక ముందు కూడా ఆయన వున్నాడు కదా! 'ఓం' అనే శబ్దము, అ శబ్దము అనక ముందు గూడా వున్నాడు కదా! అనడం వలన శబ్దమనే తొడుగులోకి వచ్చాడు. అది మనం వ్రాయడం వలన ఇంకొక తొడుగులోకి వచ్చాడు. తొడుగులే గుర్తుంటాయి గాని, తొడుగులో వున్నవాడు గుర్తుండడు. స్పష్టమైనప్పటికీ కూడా అస్పష్టుడే! నేను మాట్లాడుతుంటే, మీరు కుమార్ గారు మాట్లాడుతున్నారని అంటారు. అది సామాన్యం. కానీ మాట్లాడడానికి అ అనేఅక్షరం అన్నాననుకోండి. అన్నవాడు ఎవడో భావన చేసుకుంటే ఎవడు అన్నాడో వాడే 'స్పష్టాక్షరుడు'. వాడు లేకపోతే మనం అనలేము. మనలోవాడు అట్లా వుంటాడు. మనలో మనం గా వుండటం వలన, మనం అంటున్నామనే భావన కలిగి, దానికి ఒక తొడుగు పడిపోతుంది. నిజానికి వాడు వుండబట్టి కదా మనం అంటున్నాము. వాడే ఒక నామం ద్వారా, రూపం ద్వారా, శబ్దం ద్వారా, రంగు ద్వారా వ్యక్తమవుతాడు. భగవంతుడికి చాలా తొడుగులున్నాయి. రూపం, శబ్దంతొడుగు. వెలుగు కూడా ఒక తొడుగే, ఎందుకంటే వెలుగుకి అవ్వల వున్నవాడు కదా! అందుకే వెలుగు కూడా ఆయన యొక్క అంటే అవ్యక్తుడికి వ్యక్త స్థితి. రంగు, రూపం, శబ్దం ద్వారా అక్షరుడు, ఎప్పుడూ వుండేవాడు, ఇలా వ్యక్తమవుతూ వుంటాడు. స్పష్టమవుతూ వుంటాడు. ఏది స్పష్టమో దాన్ని చూస్తాము గాని, స్పష్టమైన దానిలో నుండి వాడిని చూడలేము. గులాబిపువ్వు చూసి పువ్వు అనుకుంటాం గాని, వాడే విచ్చుకొని వచ్చాడని అనుకోలేము. గులాబీ వాసన చూసే వాడిగా కూడా ఆయనే ఉంటాడు అనుకోము. ఒకడే గులాబిపువ్వుగా వచ్చి, ముక్కుగా వచ్చి, వాసన చూసేవాడుగా వచ్చి, వాసన చూసే ప్రజ్ఞగా వచ్చి , అంతా వాడే దిగి వచ్చి అనుభవిస్తుంటాడు. ఈ విధంగా అక్షరుడు.స్పష్టంగా వస్తూ వుంటాడు. సృష్టి వున్నంత కాలం పువ్వు, వాసన చూచేవాడు. వాసన అనే అనుభూతి వుంటాయి. అట్లా అక్షరంగా వుంటాయి. సృష్టి అయిపోవడం అంటూ వుండదు. ఇది అయిపోతే ఇంకొకటి అయిపోయే లోపల వస్తుంది. అదీ గొప్పతనం. ఈ విషయాన్ని 'Secret Doctrine' లో ఈ కాలానికి Madam Blavatsky ద్వారా హిమాలయాల్లోని మహర్షులు దీనిని బయట పెట్టారు. వారికి తెలుసు. అందుకే వారేమి చెప్పారంటే సృష్టి అయిపోవడం అంటూ వుండదూ, ఇది అయ్యే లోపల ఇంకొకటి తయారవుతుంది. తండ్రి వెళ్ళిపోయే లోపల కొడుకు రావడం లేదా ? అలాగే ఒక భూగోళం అయ్యేలోగా ఇంకో భూగోళం వస్తుంది. ఒక సూర్యమండలం అయ్యే లోపల ఇంకొకటి రెడీగా ఉంటుంది రావడానికి. ఒక మాట మాట్లాడే లోపల ఇంకొక మాట రావడం లేదూ ? మాట్లాడే లోపల, మాట అవ్యక్తం గా అంటే భావంలో వుండి, మాటగా వ్యక్తమవుగానే, దాని ముందున్న భావం వచ్చి మాట వస్తుంది. ఇది సృష్టిలోని continuity. ఇది చాలా పెద్ద రహస్యం. ఏదీ అయిపోదు సృష్టిలో. అయిపోతుంది అని భయపడేవాడు మానవుడు ఒక్కడే! పంచభూతాలు, గోళాలు అయిపోవు సృష్టిలో, మానవుడు కట్టుకున్నవి అయిపోయినా మళ్ళీ వస్తాయి. అన్నీ ఉంటాయి. ఇన్నిటికీ వస్తున్న వాడున్నాడు. వాడు ఉండబట్టి అన్నీ వస్తున్నాయి. వాడు

లేకపోతే రావు. వాణ్ణి చూస్తే స్పష్టంగా, కనిపిస్తాడు. వాడూ 'స్పష్టాక్షరుడు'. భావాలు లేని స్థితిలో అన్నీ potential గా ఉంటాయి. దాన్నే సాధ్యస్థితి అంటారు. భావాలు లేకపోవడం కాదు. అణిగివుంటాయి. అదుపులో ఉంటాయి. పిడకలో విత్తనంలా అణిగి వుంటాయి. ఎంతటి వారికయినా సమాధి స్థితిలో భావాలు అణిగివుంటాయి. సమాధి స్థితి తరువాత మళ్ళీ భావాలే! లేకపోతే ప్రపంచంలోకి ఎలా వెడతాడు ? ఏదీ నిర్మూలనం అవదు. Active గా వున్నాయా, Passive గా వున్నాయా అంతే! నియమింప బడుతున్నాయా, అతిక్రమింపబడి వున్నాయా ఉన్నాయా అని సాధనలో చూసుకోవాలి. అంటే భావములు మనలో ఇమిడి ఉంటాయన్నమాట. అవసరమైనప్పుడు వ్యక్తమవుతాయి. ఇవి పై లోకంలోకి ముడుచుకొనిపోయి, అవసరం బట్టి మళ్ళీ విచ్చుకుంటూ వస్తాయి. ఊర్ధ్వ లోకాలలోకి వెళ్ళినప్పుడు కింద లోకాలలోనివి అక్కడ ఇమిడిపోతాయి. కావాలంటే మళ్ళీ అవరోహణక్రమంలో క్రిందికి వస్తాయి. మంచుగడ్డ వుందనుకోండి. మంచుగడ్డ నీరైతే మంచు లేని స్థితే. మంచుగడ్డ లేకపోవడం అంటే నీటి లోనికి ఇమిడిపోయి వున్నది. నీరు ఆవిరి అయినదంటే అర్ధం, నీరు ఆవిరిలోకి ఇమిడిపోయి వున్నది. మళ్ళీ కావాలంటే నీరుగా, మంచుగడ్డగా వస్తుంది. అంటే ఉన్నాయా, లేవా ? ఉన్నాయి. ఎట్లా వున్నాయి అంటే potential గా వున్నాయి. దాన్నే 'సాధ్యస్థితి' అంటారు. సాధ్యులు, సిద్ధులు అని రెండు రకాలు. Potential, manifest చేయగలిగి చేయకుండా వుండటం. అవసరమైతే చేస్తారు. ఋషులు అలా చేస్తారు. వాళ్ళు ఇన్ని నీళ్ళు చల్లి, అక్కడ అప్పటికప్పుడు, మహాలోకాలను సృష్టించగలిగి వుంటారు. ఇదంతా వాళ్ళ potential అన్నమాట! ఉన్నది. ఉన్నదా అంటే లేదు కానీ లేదా అంటే ఉన్నది. When it is potential you dont see. When it is manifest you see. Potential నుండి manifest అవుతున్నది ఎవరు? వాడూ! అటువంటివి ఋషులు చేయగలుగుతున్నారంటే, వాళ్ళు ఆ తత్వంలో వుండటం వలన అలా చేయగలుగుతున్నారు. భావాతీతస్థితి తప్ప, భావాలు చంపేయడం కాదు. మనసును, ఇంద్రియాలను చంపేయడం కాదు. ఇంద్రియాలను చంపేస్తే మనిషి బ్రతకలేడు. దేన్నీ చంపేయడం కాని, అణగద్రొక్కడం కాని, నాశనం చేయడం కాని కాదు. దానికన్నా పై దానిని రుచి చూపించడం వలన, దానితో కలిసిపోతాయి. మూలస్థానం లోకి కలిసిపోతాయి. భావాలు కూడా వాటి మూలస్థానం లో ఇమిడిపోయి అవసరమైనప్పుడు పైకి వస్తాయి మాటగా. ఇది సృష్టిలోని continuity. ఇది చాలా పెద్ద రహస్యం. ఏదీ అయిపోదు సృష్టిలో. పంచభూతాలు, గోళాలు అయిపోవు సృష్టిలో, మానవుడు కట్టుకొన్నవి అయిపోయినా మళ్ళీ వస్తాయి. ఇన్నిటికీ మూలం వస్తున్నవాడు ఒకడున్నాడు. వాడు లేకపోతే రావు. వాణ్ణి చూస్తే స్పష్టంగా కనిపిస్తాడు. వాడు 'స్పష్టాక్షరుడు'. భావాలు ఆగిపోయినప్పుడు, నిశబ్ద స్థితిలో ఉన్నప్పుడు ఒక భావానికీ, మరొక భావానికి gap ఏర్పడ్తుంది. అయితే ఈ స్థితిలో gap పెరిగి, ప్రత్యేకించి భగవత్ తత్వం లో ఇమిడినప్పుడు stillness ఉంటుంది. తర్వాత మళ్ళీ కార్య రూపం దాలుస్తాం కదా అప్పుడు మళ్ళీ భావాలు కావాలి. భావాలు లేని స్థితి సాధ్యస్థితి. భావాలు లేకపోవడం కాదు. అణిగివుంటాయి. ఏదీ లేకపోవడం కాదు. అణిగివుంటాయి. పిడకలో విత్తనంలా అణిగివుంటాయి. సమాధి స్థితిలో కూడా భావాలు అణిగివుంటాయి. సమాధి తరువాత మళ్ళీ భావాలే. లేకపోతే ప్రపంచంలోకి ఎలా వెడతాడు ? ఏదీ

నిర్మూలనం అవదు. Active గా వున్నాయా, Passive గా వున్నాయా. నియమింప బడుతున్నాయా, అతిక్రమింపబడి వున్నాయా అని చూసుకోవాలి. ఇవి పై లోకంలోకి ముడుచుకొనిపోయి, అవసరం బట్టి మళ్ళీ విచ్చుకొని వస్తాయి. ఊర్ధ్వ లోకాలలోకి వెళ్ళినవి. మళ్ళీ అవరోహణలో క్రింది లోకాలలోకి వస్తాయి. మంచుగడ్డ వుందనుకోండి. మంచుగడ్డ నీరైతే మంచు లేని స్థితే. మంచుగడ్డ లేకపోవడం అంటే నీటి లోనికి ఇమిడిపోయి వున్నది. నీరు ఆవిరి అయినదంటే అర్థం, నీరు ఆవిరిలోకి ఇమిడిపోయి వున్నది. మళ్ళీ కావాలంటే నీరుగా వస్తుంది. అంటే అవి వున్నవే కదా! ఎట్లా వున్నాయి అంటే potential గా వున్నాయి. దాన్నే 'సాధ్యస్థితి' అంటారు. సాధ్యులు, సిద్ధులు potential, manifest చేయగలిగి చేయకుండా వుండటం. అవసరమైతే చేస్తారు. ఋషులు ఇన్ని నీళ్ళు చల్లి, మహాలోకాలను సృష్టించగలిగి వుంటారు. ఇదంతా వాళ్ళ potential! When it is potential you cannot see. When it is manifest you can see. Potential, Manifest a Potential నుండి manifest అవుతున్నది ఎవరు ? వాడు వుండటం వలన, వాడితో మనం వుండటం వలన. అటువంటివి ఋషులు చేయగలుగుతున్నారంటే, వాళ్ళు ఆ తత్వంలో వుండటం వలన అలా చేయగలుగుతున్నారు. భావాతీతస్థితి తప్ప భావాలు చంపేయడం కాదు. మనసును, ఇంద్రియాలను చంపేయడం కాదు. ఇంద్రియాలను చంపేస్తే మనిషి బ్రతకలేడు. దేన్నీ చంపేయడం కాని, అణగద్రొక్కడం కాని, నాశనం చేయడం కాని కాదు. దానికన్నా పై దానిని రుచి చూపించడం వలన దానితో కలిసిపోతాయి. Tube light సూర్యుడున్నప్పుడు సూర్యుని వెలుగులో కలిసిపోయినట్లు. కాని manifest అయినట్లుగా కనిపించదు. పెద్ద వెలుగులో చిన్న వెలుగు కలిసిపోయింది. గోదావరి, సముద్రంలో కలిసిపోయింది. గోదావరి వుందా ? లేదా ? ఉంది కానీ దాని మూలస్థానం లోకి వెళ్ళినప్పుడు లేనట్లు కనిపిస్తుంది. భావాలు కూడా ఎక్కడ ఉద్భవమవుతున్నాయో, దాని మూలస్థానంలోకి వెళ్ళినప్పుడు అందులో ఇమిడిపోయి వుంటాయి కానీ, లేకుండా వుండవు. వ్యక్తమై వున్నాయా, అవ్యక్తంగా వున్నాయా అన్నది మనం అవగాహన చేసుకోవలసిన point. ఏదో రోజు ఈ భావాలన్నీ ధ్యానంలో పోతాయనుకోవడం కాదు. అవి పోవు. నియమింపబతాయి. మనం మనంగా వుంటాం. అవసరమైనప్పుడు మనం మనం గా ఉంటూ భావాల్లోంచి పనిచేయడం, ఇంద్రియాల్లోంచి, శరీరం లోంచి పనిచేయడం వుంటుంది. రాజయోగ మార్గంలో అన్నీ వుంటాయి. నువ్వు ఎక్కడ వుంటావన్న దాన్ని బట్టి. నువ్వు నీలో వుంటే, సద్దుమణిగి వుంటాయి. అవసరం బట్టి పనిచేస్తాయి. భావాల్లో వుంటే, భావాలు అలా ఊరుతూ వుంటాయి. భావాలు పోవడమంటే, నియమింపబడి వుండడం. వికృతంగా రాకుండా. ప్రకృతి సహజంగా రావడం అంటే పనిని బట్టి భావం, కాలం, దేశం బట్టి కర్తవ్యం నిర్ణయమవుతుంది. సరైన ఆరోగ్యం వున్న వాళ్ళకి ఆ కర్తవ్యాన్ని బట్టి భావం వస్తుంది. క్రమశిక్షణా రాహిత్యంగా, అడ్డుగోలుగా భావాలు రాకుండా వుంటాయి. అంతేకానీ అసలు భావాలు లేనట్లు భావన చేయకూడదు. భావాలు వుండకూడదనేది లేదు. కానీ కాలన్ని, దేశాన్ని అనుసరించి కర్తవ్యం మేరకు సహజంగా మనయందు వ్యక్తమయ్యే భావాలలో స్పష్టతగా వ్యక్తమవుతుంది. ఈ వ్యక్తమవడమే భగవంతుడు వ్యక్తమవడంగా భావన చేసుకోవాలి. మనం మాట్లాడే అన్ని మాటలూ వాక్కు వరకు, అక్షరం వరకు వాడు మూలం. వాడు

వ్యక్తమవడం వలన అక్షరం వస్తున్నది. వాడు వ్యక్తం కాకపోతే అక్షరం లేదు. శబ్దం అనుకుంటే, సంకల్పం దగ్గరనుండి, భావం దగ్గర నుండి, భాష దగ్గర నుండి, గొంతులో వుండే vocal chords పనిచేస్తే కదా మాట స్పష్టంగా వచ్చేది! ఇవన్నీ వాడు వ్యక్తమవడంగా మనం భావిస్తే, వ్యక్తమయేవాటిలో వాడు స్పష్టంగా కనిపిస్తాడు. చెట్టు వుందనుకోండి. దాని కొమ్మలు, ఆకులు, పువ్వులు, పిందెలు, కాయలు అన్నీ వాడు వ్యక్తమవడంగానే చూస్తూ వుంటాడు భాగవత మార్గంలో వున్నవాడు. ఆవుని, కుక్కని చూచినప్పుడు కూడా ఆవుగా, కుక్కగా వ్యక్తమయ్యాడని చూస్తాడు. సమదర్శనం కలవాడు కుక్కమాంసం చూసినా, మాంసం కొట్టుని చూసినా ఇలా వ్యక్తమయ్యాడు భగవంతుడని భావిస్తాడు. శ్రీకృష్ణుడు 'కుక్కలోను, కుక్క మాంసంలోను, అజ్ఞానిలోను, పండితుడిలోను సమదర్శనం చేసేవాడు పండితుడని' చెప్పాడు. వాడు ఇంకొకటి చూడడు. అదీ అద్వైత మంటే!. ఇంకొకటి చూసామంటే మాయ కమ్మివేసినట్లే! ఏ రూపంలో వ్యక్తమయ్యాడో ఆ రూపం యొక్క స్వభావం మనకు తెలుస్తుంది. ఇప్పుడు మనం చేయవలసిన పని కూడా కర్తవ్యంగా మనకు భాసిస్తుంది. అంతవరకే! దాని మంచిచెడులతో మనకి సంబంధం లేదు. అది మాంసం కాబట్టి పాపం, ఇది పప్పు కాబట్టి పుణ్యం ఇలా వుండదు. వ్యక్తమయ్యేదంతా ఆయనే అని స్పష్టంగా గుర్తు పెట్టుకోవాలి. కష్టంగానీ, సాధన అది ఒక్కటే! ఇది ఒకటే చేస్తే మిగతావన్నీ సులభం. ఇది చేయకపోతే ఎన్ని చేసినా ఉపయోగం లేదు. వరుసగా సున్నలు పెట్టుకొనిపోతే దానికి value లేదు కదా! ముందు ఒక అంకె వేస్తేనే దానికి value. ఒక్కడే అయిన వాడిని ముందు అన్నిట్లో establish చేస్తే, ఆ తరువాత మిగతా అన్నిటికీ value వుంటుంది. సృష్టిలో అన్నీ విలువైనవే! వ్యర్థమైనవేవీ లేవు. మనకి ఎంత వ్యర్థమైనవి అని అనిపిస్తే, అంతవరకు మనకు తెలియదని అర్థం. ఇది అడవిలా పెరిగిపోయింది. ఎందుకు పనికివస్తుంది, అనుకొంటాము. కానీ అందులో medicinal properties చాలా ఉంటాయి. ఈ సృష్టిలో ఎవరు, ఎందుకు పనికివస్తారో మనకు తెలియదు. మనకి తెలిసినవాళ్ళు చాలా విలువైనవాళ్ళు అనుకుంటాము. ఎవరు ఎందుకు పనికివస్తారో తెలియనివాళ్ళని, వీళ్ళంతా waste అనుకుంటాము. ఎంత మనకి వ్యర్థం అనిపిస్తుందో, మనలో అంత వ్యర్థమైనది ఉందన్నమాట! అన్నిట్లో వ్యక్తమయ్యేది వాడే కాబట్టి అన్నిట్లోంచి వాడినే దర్శనం చేసేవాడు, అన్నిట్లో అక్షరుడినే స్పష్టంగా దర్శనం చేయడం జరుగుతుంది. వాడికి ఆనందం చాలా ఎక్కువగా వుంటుంది. కొండను చూసినా, నదిని చూసినా భగవంతుని అనుభూతే వస్తుంది. మురుగు గుంటలో పందిని చూసినా అలాగే వుంటుంది. తేడా పడదు. మనమైతే గీతలు పెట్టుకొంటాం. ఎన్ని గీతలు పెట్టుకొంటే, అన్ని వాతలు నువ్వు పెట్టుకొన్నట్లే తప్ప, అక్కడ లేదు. మనం పరిమితం చేసుకొంటున్న కొద్దీ పరిమితం అవుతూ వుంటుంది. మనం పెంచుకొన్నకొద్దీ కనిపిస్తూ వుంటుంది. ఎందుకంటే స్పష్టంగా ఉన్నాడు కాబట్టి.

# ౨౨౨ మంత్రః

"మంత్రః" ఒక్కొక్క శబ్దానికి ఒక్కొక్క శక్తి వుంది. 'అ' అనే శబ్దానికి ఒక శక్తి, 'ఇ' అనే దానికి ఇంకొక శక్తి వున్నది. 'ఉ' అనే శబ్దానికి మరొక శక్తి వున్నది. మనం చిన్నప్పుడు అ, ఇ, ఉ లు నేర్చేసుకున్నాము. కానీ అవి చాలా మహత్తరమైన శక్తులు ఈ సృష్టిలో. 'అ' అంటే భగవంతుడు, 'ఈ' అంటే అమ్మవారు. 'ఉ' అంటే వారిద్దరి నుండి పుట్టుకొచ్చిన సృష్టిలోని దేముడు. సృష్టికి అతీతమైన దేముడిని 'పరబ్రహ్మము' అంటారు అంటే 'అ' అంటారు. పరాప్రకృతిని 'అమ్మవారు' అంటారు. అందుకనే అమ్మవారిని 'ఈం' అని పిలుస్తాము. ఈ ఇద్దరూ కలిస్తే 'ఉ' అంటాము. అంటే వ్యాపనం చెందే జగద్గురువు. విష్ణుమూర్తి లేక వ్యాపనశక్తి 'ఉ' కారము. అట్లాగే 'గ' అనే అక్షరం తీసుకుంటే అది గమనం. 'య' అనే అక్షరం తీసుకుంటే అది వాయువు యొక్క వ్యాపనం. అలాగే ప్రతి అక్షరానికి శక్తి వుంది. 'ర' అనే అక్షరం అగ్నిబీజం. అది ఎంత ఎక్కువ పలికితే మనలో అంత పవిత్రత పెరిగిపోతుంది. అందుకనే 'రామ' మంత్రం ఇస్తారు. రామ మంత్రం ఎంత చేస్తే అంత అగ్ని పెరిగి, పవిత్రత పెరుగుతుంది. అగ్నిని ఏదీ మైల పరచలేదు. అగ్ని అన్నింటిని పవిత్రం చేస్తుంది. నిజంగా మనల్ని మనం పవిత్రీకరించుకోవాలంటే రామమంత్రం చేసుకోవాలి. 'రామ' శబ్దం యొక్క పురుషాకారం రాముడు. పరిపూర్ణ మైన అగ్ని. ముట్టుకొంటే కాలిపోతుంది. 'క్లీం' అంటే అమృతవర్షం. 'ద్రాం' అనే మంత్రం మనకి కావలసినవి ఇచ్చి, రక్షించేది. దత్తాత్రేయుడికి 'ద్రాం' అనే బీజాక్షర మంత్రం చెబుతారు. మనకి కావలసినవి ఇచ్చుకొంటూ, మనల్ని రక్షించుకొంటూ, మనల్ని పైకి తీసుకువెడతాడు గురువు, గ, ఉ ర అనే మూడు శబ్దాలున్నాయి అందులో. 'గ' అంటే గమనము. వ్యాపనం చెందడం. "గం గణపతయే నమః". 'ఉ' అంటే విష్ణు వ్యాపక శక్తి. 'ర' అంటే రక్షణము. ఇన్ని వున్నాయి గురువు శబ్దంలో. అలాగే రామ శబ్దము, కృష్ణ శబ్దము. మంత్రములే దైవ నామములుగా ఇచ్చేసారు. అట్లా మనం వాటిని సాధన చేసుకుంటూ వుంటే, మనలో పవిత్రీకరణ జరుగుతుంది. ఇవన్నీ శబ్దములకు వున్న శక్తులు. ఒక్కొక్క శబ్దానికి ఒక్కొక్క శక్తి, కొన్ని శబ్దాలు కూడితే, ఆ శక్తుల యొక్క కూడిక జరిగి, దానికి సంబంధించిన అవతరణము అక్కడ జరుగుతుంది. శబ్దంతో సృష్టి మొదలుపెడతారు. కొన్ని కొన్ని శబ్దాలు ఉచ్చరించడం వలన కొన్ని కొన్ని అవతరణలు జరుగుతాయి. అదీ మంత్రం అంటే! ఆయనేదో మంత్రం వేసాడు. అయిపోయింది అంటారు. శబ్దంతో సృష్టిని తయారుచేయడం, శబ్దంతో సృష్టిని లయం చేయడం. వీటికి శబ్దానికి సంబంధించిన దేవతలున్నారు. ఇవన్నీ వాళ్ళు చేసే కార్యక్రమాలు. ఈ శబ్దాల రూపంలో వున్న వాడు ఎవరు ? ఈయనే అని గుర్తు పెట్టుకోవాలి. లేకపోతే వివిధత్వం లోకి పడిపోతాము ఏకత్వం నుండి. అన్నిట్లోనూ అంతర్యామిగా వాడే వుంటాడు. అంతర్యామిగా అన్ని వంటల్లోనూ వుండేది ఆకలి తీర్చడం, ప్రాణశక్తి ఇవ్వడం. అదే దాని ముఖ్య లక్షణం. మనం ఇన్ని రకాలుగా తిన్నా, ఆకలి తీరడం, శరీర పోషణ జరగడం. ఇది మర్చిపోకూడదు. ప్రతిదాంట్లోనూ అనుస్యూతంగా, అంతర్లీనంగా వున్న వాడ్ని చూపిస్తూ వుంటాడు. ఇదే విష్ణు సహస్ర నామాల్లో వున్నది. మనకు సృష్టిలో కనిపించేదంతా తీసుకొని, సృష్టి కార్యక్రమాలన్నిటిలో మొత్తం నిండియున్నది ఈయనే అని మనకు

చూపిస్తారు. అన్ని నామాలూ ఆయనవే! మంత్రానికి, శబ్దం, స్పష్టాక్షరుడు ఆయనే. ఇక మంత్రం. "మననాత్ త్రాయతే మంత్రం". మనం ఎంత మననం చేసుకొంటే మంత్రం అంత రక్షిస్తుంది. కాబట్టి మనకు ఏది అవసరమో ఆ మంత్రం గురువు ఇస్తూ వుంటాడు. మనం ఎక్కాల్సిన మెట్టు ఏదో దానికి సంబంధించిన మంత్రం ఇస్తాడు. బద్ధకస్తులలో అగ్ని పెరగాలనుకోండి. వారికి రామమంత్రం ఇవ్వాలి. వాడిలో అగ్ని పెరిగితే, తేజస్సు పెరిగి, active గా తయారవుతాడు. రామమంత్రం చేసుకొనేవాళ్ళు ఎక్కడా బద్ధకంగా వుండరు. అగ్ని బాగా ప్రజ్వలిస్తూ వుంటుంది కాబట్టి చక్కటి కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వుంటారు. అలాగే బాగా పోగేసుకొన్నవాడు వదిలించుకోవాలనుకోండి వాడికి వాయుమంత్రం ఇస్తారు. వాయు బీజమంటే గాలి కదా! చెట్టు నుండి ఆకులన్నీ రాలుస్తుంది ఆకురాలు కాలములో. ముందు అగ్నిబీజమిచ్చి, తరువాత వాయుబీజ మిస్తారు. చెట్టులో చెమ్మ వున్నట్లు, మనలో అవీ ఇవీ కావాలనుకోవడమే చెమ్మ. అన్నీ కావాలనుకొని చెమ్మ చెమ్మగా వుంటాము. అగ్నిబీజం ఇవ్వడం వలన చెమ్మంతా ఆరి, వాయుబీజం వలన అంతా ఎండిపోతుంది. అప్పుడు ఆకులన్నీ రాలిపోతాయి. అప్పుడు అమృతవర్షిణి అనే బీజం ఇస్తారు. అదే 'క్లీం' 'లం'. ఇవన్నీ అవే! అప్పుడు వచ్చే క్రొత్త చిగురు వేరు. అంతకు ముందున్న చిగురు వేరు. ఆ విధంగా సాధన చేయించే పద్ధతులున్నాయి. మనం ఒక గురువుని ఆశ్రయించినప్పుడు, గురువు అంగీకరించినప్పుడు గురువు చెప్పినది చేయాలి. అలాకాక చెప్పినది చేయకపోవడం వలన ప్రత్యేకమైన మార్గాలు ఇవ్వడానికి అవకాశం ఇవ్వము. అంతటితో సరి. ముందు general గా అందరికీ ఒకటే ఇస్తారు. From general to particular వెళ్ళడం జరుగుతుంది. చెప్పింది చెప్పినట్లు చేసినప్పుడు general నుండి particular కి వెళ్ళడం జరుగుతుంది. మనం మొట్ట మొదట చెప్పినదే మొత్తం అనుకొని దానితో కుస్తీపడతాము. అది అయితే కానీ రెండవది రాదు కదా! ముందు అక్షరాలు వస్తేనే, గుణింతాలు వస్తాయి. అక్షరాలు రాగానే అంతా వచ్చనుకొంటే ఎలా? ముందు అక్షరాలు నేర్చుకొని, గుణింతాలు నేర్చుకొని, పదముల పొందిక నేర్చుకొని అప్పుడు అవగాహన చేసుకోవాలి. అలా రకరకాల మంత్రాలతో రకరకాల మార్పులు మనుష్యులలో తీసుకురావడానికి సమస్తమైన విద్య వుంది. దాన్ని తంత్రమంటారు. మంత్రం యవలసిన విధానాన్ని 'తంత్రం' అంటారు. దానికి సంకేతం పెట్టుకొని చేస్తూవుంటారు. ఆ సంకేతం యంత్రం. ఒక్కొక్క మంత్రానికి ఒక్కొక్క రూపం వుంటుంది. మంత్రానికి శబ్ద రూపం, దానికి అక్షర రూపం వుంటుంది. మంత్రం వ్రాయాలంటే కొన్ని అక్షరాలు వ్రాస్తాము. ఆ అక్షరాలు ఆ శబ్దానికి రూపము. అట్లాగే మంత్రానికి యంత్రం ఒక రూపంగా వుంటుంది. ఆ రూపాన్ని ఆ మంత్రంతో, చెప్పిన విధానంగా చేయడం తంత్రం. ఈ విధంగా మంత్రం రూపంలో తను వ్యక్తమై వుంటాడు. మంత్రం చేస్తూ వుంటే మూడు జరుగుతాయి. 1. హృదయం లోంచి ఆ మంత్రం యొక్క శక్తి ఉద్భవించి మనచుట్టూ తలనుండి పాదముల వరకు ఒక వలయాకారంగా, శంఖం ఆకారంగా ఒక రక్షణ ఏర్పడుతుంది మంత్రం చేసుకొనేవాళ్ళకి. మంత్రం ఎప్పుడూ జరిగేటట్టుగా తయారైపోతారు వాళ్ళు. మంత్రం తెలిసి చేయాలి. Mechanical గా చేస్తే tape చేసినట్లే. Tape మంత్రం చెస్తే tape చుట్టూ రక్షణ రాదు. అలాగే మనం వినకుండా చేస్తే మనకి రక్షణ రాదు. వింటూ చేయాలి. అంటే దానికి ఒక పద్ధతి నాలుక కదిలించకుండా మంత్రం చేయడం. మననం చేయాల్సింది మనస్సు కానీ నాలుక కాదు

కదా! మామూలుగా నాలుకకి అప్పచెప్పి మనసు వెళ్ళిపోతుంది. కాబట్టి నాలుక కదిలించకుండా మంత్రం చేస్తే మనసు చేయాల్సి వస్తుంది.. మనసుగా నువ్వున్నావు కాబట్టి నువ్వు మానవుడివి. అప్పుడు నువ్వు చేసినట్లు అవుతుంది. నువ్వు చేయడం వలన మంత్రం యొక్క అనుగ్రహం నీకు కలుగుతుంది. మొదట రక్షణ కలిగిస్తుంది. రెండు చైతన్యాన్ని పెంపొందింపచేస్తుంది. మూడు ఏ ఏ పనులు మనం చేయాలో నిర్దేశిస్తుంది. చేయకూడని పనులు చేయనీయదు. నిజంగా మంత్రం చేసేవాళ్ళు అడ్డమైన పనులు చేయలేరు. మంత్రం ఆ విధంగా నియమిస్తుంది. ఇతరుల పెంపుదలకి, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలే చేయడానికి ప్రోత్సహిస్తుంది. దోహదమిస్తుంది. ముందుకు తోస్తుంది. నిజంగా గాయత్రీమంత్రం చేస్తే లోకహితమైన పనులు చేయకుండా వుండడానికి వీలులేదు.  ఆ మంత్రంలో మూడు రకాలు. 1. రక్షణ 2. మనని చైతన్యవంతులుగా చేయడం 3. మనని మార్గంలో నడిపించడం. అదీ మంత్రం యొక్క రక్షణ అంటే! ఏ మంత్రమైనా అంతే! ఆ మంత్రం దీక్షగా చేసుకోవాలి. చేసుకొంటున్నట్లు ఎవ్వరికీ తెలియకూడదు. నువ్వు చేసే మంత్రం ఇంకొకరికి తెలిసిందంటే అది ఫలించదు. గుర్తుపెట్టుకోండి. మన మంత్రం గురించి, ఇతరులకు చెప్పకోవడం వలన ఏమీ కలిసిరాదు. మంత్రం నీకు, నీ మంత్రదేవతకు వుండే సంబంధం. అది ఇంకొకళ్ళకు ఎందుకు తెలియాలి? మంత్రం చేస్తూ వుంటే భగవంతుడు ఆ మంత్ర రూపంలో దేవతగా మనచుట్టూ కాపు కాస్తాడు. ఆ మంత్ర స్వరూపంగా దర్శనమిస్తాడు. ఏ మంత్రం చేస్తే, ఆ మంత్ర స్వరూపం గా  దర్శనమిస్తాడు. అప్పుడు  దేముడు కనిపించాడనుకొంటాడు. కృష్ణమంత్రం చేస్తే అదే అంతర్యామి తత్వం కృష్ణుడుగా కనిపిస్తుంది సాధన చేసేవాడికి. రామమంత్రం చేసేవాడికి  రాముడు గా కనిపిస్తాడు. అంటే మనం ఊహించుకున్న దేవతా స్వరూపము యొక్క దర్శనము అవుతుంది. దేవత అంటే? 'దివ్యము' అనే పదం నుండి 'దేవ' అనే శబ్దం వచ్చింది. 'దివి' అంటే వెలుగు అని అర్థం. ఒక వెలుగు రూపం నీవెంట వుండి నడిపిస్తుంది. అంతకంటే ఇంకేం కావాలి? భగవంతుడు మంత్ర రూపంలో, దేవతరూపంలో దిగివచ్చి సహాయం చేసే పద్ధతి ఒకటి వుంది. అది కేవలం భారతీయులకి మాత్రమే పెట్టిన విద్య. ఇది మనం ఎంతో గర్వించాల్సిన విషయం కాదు, ఆనందించాల్సిన విషయం. ఈ దేశంలో వున్న మంత్ర సంపద ఈ భూగోళంలో ఇంకెక్కడా లేదు. కాబట్టి మనం మిగతావాళ్ళ కన్నా అదృష్టవంతులం. అదీ ఈ దేశంలో పుట్టడం అదృష్టం అంటే! ఈ దేశంలో మంత్రాలు కోకొల్లలు. ఏ ఒక్కటి పట్టుకొన్నా జన్మ చరితార్థమైపోతుంది. ప్రతి దేముడు అంతర్యామి రూపం కాబట్టి ఏ దేముణ్ణి పట్టుకున్నా ఫరవాలేదు. అబ్బే వీళ్ళంతా దేవతలు, వీళ్ళ పైవాడిని పట్టుకుంటానని అనుకోనక్కరలేదు. ఒకే విద్యుత్ ద్వారా అన్ని బల్బులతో కాంతిని ఎట్లా పొందుతున్నామో, ఏ దేవత ద్వారానైనా మనం భగవదనుభూతిని పొందడానికి అవకాశం వుంది. స్పష్టాక్షరుడుగా వచ్చినవాడు, మంత్రంగా, మంత్ర స్వరూపంగా, మంత్ర దేవతగా వ్యక్తమై వస్తూ వుంటాడు కాబట్టి మంత్రాలన్నీ భగవంతుడే అని గుర్తు పెట్టుకోవాలి. ఏ దేవత మంత్రం చేయాలి? అని విచికిత్స అక్కరలేదు. ఏ ఒక్కటి చేసినా సరాసరి విద్యుత్ తీగను పట్టుకొన్నట్లే. ఆ తీగ దొరికితే, విద్యుత్ దొరికినట్లే కదా! భగవంతుడు  ఆ విధంగా దర్శనం చేయాలి.

## 293 చంద్రాంశు:

మనలో వున్న సోమాత్మక ప్రజ్ఞ. అది చంద్రుని కిరణంలా మన వద్దకి వస్తుంది. అది సోమకిరణం. చంద్రుని కిరణంలో నుండి సోముని ప్రజ్ఞ మన దగ్గరకు వస్తుంది. సోముడంటే స, ఉమ. అంటే ఉమతో కూడినవాడని అర్ధం. కాబట్టి ఆ తత్వం మనకి చంద్రుని ద్వారా వస్తుంది. అందుకే మనం చైతన్య వంతులవడానికి పౌర్ణమి చాలా ముఖ్య మైనది. పూర్ణకళల నుండి చంద్రుని యొక్క వెలుగు ఎక్కువ దిగివస్తుంది. కాబట్టి ఆ దిగివచ్చిన వెలుగును మనం ఆస్వాదన చేయడము వలన మనలో చైతన్యం అభివృద్ధి చెందుతుంది. మనలో ప్రచోదనం కలుగుతుంది. అదికూడ పౌర్ణమి తిథి అయిపోతున్న సందర్భంలో చంద్రుని పరిపూర్ణమైన వెలుగు వుంటుంది. దాన్నే 'రాకా' అంటారు. రాకా చంద్రుడు అన్నమాట. ఆ రాకాచంద్రుని నుండి దిగివచ్చేదే 'సుషుమ్న' అనే ప్రజ్ఞ. అందుకూ పౌర్ణమి అయిపోతున్న సందర్భంలో ధ్యానం చేసుకోమని జ్వాలాకూల్ గారు చెప్పారు. పౌర్ణమి అయిపోయి పాడ్యమి తిథి వస్తుంది. కదా! ఆ పౌర్ణమి తిథి అయిపోయేటప్పుడు పరిపూర్ణమైన వెలుగు వస్తుంది. దాన్ని 'Full moon point' అంటారు పాశ్చాత్య దేశాలలో. ఆ Full moon point కి ఒక గంట అటూ ఇటూ ఏ కార్యక్రమాలూ పెట్టుకోకపోతే full moon లో వుండే ఆనందం చాలా అనుభవించవచ్చును. నిజంగా ఈ మార్గంలో నడవాలనుకున్న వాళ్ళకి ఊతనిచ్చేవి. ఊర్ధ్వగతికి మనల్ని తప్పక తీసుకొనివెళ్ళే సూచనలు. Full moon point లో భూమి మీదకు సుషుమ్న అనే ప్రజ్ఞ, చంద్రుని ద్వారా దిగివస్తుంది. అది ఏ సమయమైనా ఫరవాలేదు. ఆ సమయానికి పావుగంట ముందు, పావుగంట తరువాత ఓపికతో కూర్చోవాలి. లేకపోతే గంట ముందు, గంట తరువాత, రెండు గంటల ముందు, రెండు గంటల తరువాత మన ఓపికే. జ్వాలకూలుడు ఏం చెప్పారంటే ప్రతీ పరమ గురువుల ఆశ్రమం లోనూ ఈ full moon point కి ఆరు గంటల ముందు, ఆరు గంటల తరువాత కూడా చాలా గురువు సంసిద్ధుడై వుంటాడు ఉన్ముఖుడైన శిష్యుడికి సహకరించి, మార్గంలో ఉత్తీర్ణుడిని చేయడానికి. వాళ్ళకి భూమి మీద చాలా పనులుంటాయి. మనకంటే వంద రెట్లు ఎక్కువ పని చేసేవాళ్ళు కూడా పౌర్ణమి సమయం లో పన్నెండు గంటల సేపు అంటే, full moon point ఆరు గంటల ముందు నుండి ఆరు గంటల తరువాత కూడా సంసిద్ధత కలిగిన సాధకులకు సరియైన స్ఫూర్తిని ఇవ్వడానికి వారు సంసిద్ధులై వుంటారుట ఆశ్రమంలో. ఎందుకంటే వారు చంద్రాంశని తీసుకొని, సాధకులకు అందిస్తూ వుంటారు. దాన్నిబట్టి పౌర్ణమి విశిష్టత అర్ధం చేసుకోండి. పౌర్ణమి ధ్యానంలో అంత వున్నది. ప్రత్యేకించి పౌర్ణమి సమయంలో కూర్చోవడం సాధనగా తీసుకోవాలి. పాశ్చాత్య దేశాల్లో మన బృందాలు అన్నీకూడా ఆ సమయంలో కూర్చుంటారు. అది పగలైనా, అర్ధరాత్రి అయినా ఫరవాలేదు. ఆ సమయం లో నిశ్శబ్దమైన ప్రదేశం ఎన్నుకొని కూర్చుంటారు. కూర్చొని దాన్ని అస్వాదిస్తారు. ఆస్వాదిస్తే, మనలో చైతన్యం బాగా పెరుగుతుంది. భగవంతుడు ప్రతీ పౌర్ణమినాడు 'చంద్రాంశువు' గా దిగివస్తాడు. అది సోమాత్మకమైన ప్రజ్ఞ. సోమాత్మక ప్రజ్ఞను, భూమి మీదకు చంద్రుడనే ఉపగ్రహము ఆధారంగా దింపుతున్నారు. నిజానికి చంద్రుని నుండి రకరకాల ప్రజ్ఞలు మన వరకు అందుతున్నాయి. చంద్రుడు ఒక

reflective principle మాత్రమే! అతని ద్వారా మనకు వస్తున్నాయి. అందులో అతి పవిత్రము, అంతకు మించినది లేనిది సోమప్రజ్ఞ. అదీ సోముడంటే! ఈశ్వరుడు, అమ్మవారు కలిసిన పరిపూర్ణమైన ప్రజ్ఞ ఏదైతే వుందో, ఆ చైతన్యం మనకు ఆరోజు అందుతుంది.

## 294 భాస్కరద్యుతిః

భాస్కర ద్యుతిః సూర్య ప్రజ్ఞ. మనలో ప్రాణశక్తిని పెంపొందించేది. 'భాస్కర ద్యుతి' పొందుతూ వుండాలి రోజూ. అంటే భాస్కరుని యొక్క వెలుగు! అందుకే సంధ్యాసమయాల్లో ఉదయం, సాయంత్రం సూర్యునికి అభిముఖంగా కూర్చొని ప్రార్థన చేసుకోవాలి. ప్రార్థన భగవంతుని గురించి చేసుకొన్నా, సూర్యునికి అభిముఖంగా వుండటం వలన, సూర్యుని నుండి వచ్చిన ప్రాణశక్తి సాధన చేసుకోవడానికి కావలసిన పటుత్వాన్ని ఈ శరీరానికి ఇస్తుంది. ఉదయం తూర్పు ముఖంగా, సాయం సమయంలో పడమర ముఖంగా సూర్యకిరణాలు హృదయం మీద పడేలా కూర్చొని, సంధ్యావందనం చేసుకోవాలి. కిరణాలు మనల్ని తాకాలి. మధ్యాహ్నం ఆచ్ఛాదన వేసుకొని చేసుకుంటారు. ఈ శ్లోకం ప్రాణశక్తితో మొదలు పెట్టి, ప్రాణశక్తితో ముగిసినది.

## 295 అమృతాం శూద్భ వః

అమృతం నుండి, అమృతాంశువు నుండి పుట్టినవాడు. ఉద్భవించినవాడు. అవ్యక్తము నుండి వ్యక్తము లోనికి ఉద్భవం జరగాలంటే అమృతత్వం ద్వారా దిగిరావడమని చెప్తారు. ఇది అన్ని నామాల్లోకి అతి గంభీరమైనటువంటిది. అతి లోతైనటువంటిది. భాషలో వ్యక్తం చేయడానికి అతి కష్టమైనటువంటిది. ఏమీలేనటువంటి స్థితి నుండి మొదటి కదలిక జరిగినప్పుడు 'ఉద్భవం' అని అంటారు. మనవరకు మనం నిద్రలో నుండి మేల్కాంచినప్పుడు మొదటి మేలుకొలుపు ఎక్కడనుండి వచ్చిందో, అలాగే మనకు పవిత్ర గ్రంథములలో నారాయణుని బొడ్డు నుండి కమలం ఉద్భవించడాన్ని 'అమృత ఉద్భవం' గా చెబుతారు. 'అమృత' అనేది అమ్మవారి యొక్క ఒక నామం. భగవంతుడు తన సంకల్పం నుండి తానే దిగివస్తాడు. ఈ మొట్టమొదటిసారి తనను తానుగా దిగివచ్చిన తత్వం, అమృతత్వం లోంచి దిగివస్తుంది. కాబట్టి 'అమృతాం శు ఉద్భవుడు'. ఈ అమృతాంశువు, అనే శబ్దానికి మనకందరికీ తెలిసిన తాత్పర్యం సోమరసం నుండి దిగివచ్చినవాడు. భగవంతుని సంకల్పాన్ని "అమ్మవారు' అంటారు. ఆ సంకల్పం నుండి సమస్త సృష్టి బయలుదేరి, వస్తుంది. ఆ బయలుదేరి వచ్చిన సృష్టి తాను బలంగా నిలబడి వుండటం వలన ఏర్పడుతుంది. అన్నిట్లోనూ అంతే! వ్యక్తమైన విషయానికి, వ్యక్తమైన రూపానికి దైవమే బలంగా వుంటాడు. ప్రతీదీ ఏర్పడడానికి తాను సహకరించి, అందులో ఇమిడివుంటాడు. మనకి రూపమే పెరుగుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన ఇమిడి వుండటం వలన రూపం పెరుగుతుంది. చెట్లు పెరగటం, జంతువులు పెరగటం, మనిషి పెరగటం చూస్తాము. ఇవి పెరగటం దేనివల్ల జరుగుతుందంటే, ఆయన ఉద్భవం కారణంగా ఒకదాంట్లోంచి ఒకటి, ఒకదాంట్లోంచి ఒకటి ప్రతిబింబిస్తూ తయారైపోతూ వుంటాయి. పాలు తోడుబెట్టడం. ఒక చెమ్చా మజ్జిగ పాలల్లో వేసినప్పుడు, ఆ చెమ్చా మజ్జిగ ఆధారంగా పాలు కొద్ది కొద్దిగా తోడుకుంటాయి. పెరుగుగా మారిపోతాయి. అలా ఒకదాని నుండి ఒకటి, ఒకదాని నుండి ఒకటి ఏర్పడటం మొదలుపెడుతుంది. Chain action క్రింద ఏర్పడుతుంది. అంతము లేనటువంటి chain action. అందుకని అది అమృతత్వము కలిగినటువంటిది. దీన్ని 'సోమతత్వము' గా చెబుతారు. ఈ సోమతత్వం మనకి సూర్యుని ద్వారా వస్తూ వుంటుంది. చంద్రుని ద్వారా వస్తూ వుంటుంది. సూర్యుని నుండి వెలుగు ప్రతిబింబించాలంటే ఈ తత్వం వుండాలి. చంద్రుని నుండి ఈ వెలుగు ప్రతిబింబించాలంటే ఈ తత్వం వుండాలి. సోముడనే ప్రజ్ఞని స, ఉమ గా చెబుతారు. అంటే ఉమతో కూడినటువంటివాడని. అంటే అమ్మవారితో కూడినవాడు. అమ్మవారితో కూడి వుండటం అంటే సంకల్పంతో కూడి వుండటం. సంకల్పంతో కూడి వుంటే, సంకల్పానికి బలం వచ్చి, ఆ సంకల్పాలు నెరవేరుతూ వుంటాయి. మనలో కూడ మన ఆధారంగా, మన సంకల్పం వ్యక్తరూపం దాలుస్తుంది. అది వాగ్రూపం దాలుస్తుంది. చేతల రూపం దాలుస్తుంది. మనం విత్తనం నాటితే అది ఉద్భవిస్తుంది కదా! పరిసరాలలో వుండే పోషక పదార్థాలను సమీకరణ చేసుకొని, గింజ చిన్న మొక్కగా మొలుస్తుంది. అంకురం బయటకు వస్తుంది. ఆ బయటకు రావడమనే తత్వాన్ని 'వ్యక్తమవడం' అంటారు. గింజలో నుండి చిన్న అంకురం, అంకురం నుండి చిన్న

మొక్కగా వస్తుంది. మొక్క నెమ్మదిగా పెరుగుతుంది. చెట్టవుతుంది. కొమ్మ లొస్తాయి. ఇలా రోజు రోజూ ఉద్భవం జరుగుతూనే వుంటుంది కదా! అది ఒకదానితో ఒకటి, ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది గొలుసుకధలా ఏర్పడుతుంది. ఇలా సృష్టి అంతా అణువుల దగ్గరనుండి కట్టుకొంటూ, కట్టుకొంటూ ఒక్కొక్కటీ ఆయనలో నుండి వ్యక్తమవుతూ వుంటే, ముందువచ్చిన అణువుని వెనుకవచ్చిన అణువు ముందుకు త్రోయుట వలన ముందు అణువు ముందుకు వెళుతూ వుంటే, రూపాలేర్పడుతూ వుంటాయి. ఇలా గొలుసుగా ఒకదాని వెనకాల ఒకటి బయలుదేరి వస్తూ వుంటే, ఎట్లా ఈ మొత్తం ఏర్పడుతుందో, ఈ మొత్తం చోట్లో అంతా కూడ ఆయన ఉద్భవం చేత ఈ రూపాలన్నీ ఏర్పడుతాయి. ఈ రూపాలన్నిటికీ ఆయనే బలంగా వుంటాడు. గాలిని బూర లోకి ఊదితే బూర ఏ విధంగా పెద్దది అవుతుందో, మంచి పెద్ద బూర అనుకొంటాం గానీ, ఎక్కువ గాలి అందులో నిండి వున్నదని చూడలేము. పెద్ద ఇల్లు అనుకుంటాం గానీ ఎక్కువ చోటు అనుకోలేము కదా! పరమాత్మ మొట్టమొదట తను వ్యక్తమైనప్పుడు ఆ వ్యక్తమవడం లోంచి ఈ రూపాలు ఒక్కొక్కటి ఒక్కొక్కటి సూక్ష్మ రూపాల నుండి స్థూల రూపాలుగా ఒకదానిలోంచి ఒకటి ప్రతిబింబించుకొంటూ వస్తాయి. మన భూలోకం చూస్తే, అది భువర్లోకం యొక్క ప్రతిబింబం. భువర్లోకం చూస్తే సువర్లోకం ప్రతిబింబం. సువర్లోకం చూస్తే మహర్లోకం యొక్క ప్రతిబింబం. మహర్లోకం, జనోలోకం యొక్క ప్రతిబింబం. జనోలోకం, తపోలోకం యొక్క ప్రతిబింబం. తపోలోకం, సత్యలోకం యొక్క ప్రతిబింబం. సత్యలోకం, గోలోకం యొక్క ప్రతిబింబం. అది ఎప్పుడూ వుండేది. ఎప్పుడూ వుండేది ఇన్నిట్లో నుండి ప్రతిబింబించుకొంటూ వస్తుంది. అలాగే ఈ చంద్రుని కిరణాన్ని 'సోమకిరణం' అంటారు. ఈ సోమకిరణం సోముని నుండి ఇంద్రగ్రహం అంటే Neptune లోనికి, అక్కడ నుండి శుక్రుని లోనికి, అక్కడ నుండి చంద్రుని లోనికి, అక్కడ నుండి భూమి మీదకు, అక్కడ నుండి మనమీదకు ఇలా ప్రతిబింబించుకొంటూ వస్తుంది. మొత్తం అంతా అద్దాల మేడలా వుంటుంది. ఒకదానికొకటి, ఒకదానికొకటి ప్రతిబింబం కావడం వలన ఒకటే ఇన్నిగా ఏర్పడతాయి. దాన్ని 'The beam of moon light' అంటారు. అంటే చంద్రుని యొక్క కిరణము లేక సోముని యొక్క కిరణము అని చెప్తారు. ఈ సోమకిరణం కారణంగా రూపాలన్నీ ఏర్పడుతాయి. అన్నీ పెరుగుతాయి, వృద్ధి చెందుతాయి. ఎవరు, ఎక్కడ బాగా పెరిగినా చంద్రుని వలె పెరిగాడంటారు. పదహారు కళలు ఏర్పడి పెరుగుతూ వస్తున్నాడంటారు. ఈ పెరుగుదల ఎక్కడ వుందో, అక్కడ సోమతత్వం వున్నట్లు. అమృతాం శూద్భవం వున్నట్లు. జాతకంలో కూడ ఈ చంద్రుని స్థితి బాగుంటే, వాడి వృద్ధి బాగుంటుంది. ఎందుకంటే మూలతత్వానికి సరైన ప్రతిబింబంగా వుండటం వలన, ఆ ప్రతిబింబం కారణంగా వ్యక్తమవుతూ వుంటాయి. మంచి ఆలోచనలు వస్తూ వుంటాయి. వాటిని ఆచరణలో పెట్టగలడు. చుట్టూ వుండే వాటిని ఆకర్షింపగలడు. చంద్రుని యొక్క తత్వమది. ఆకర్షణ అనేది ఆ కిరణానికి వుండే స్వభావము. చుట్టూ వుండే వనరులను బాగా ఆకర్షించడం వలన పుష్టిగా వుంటారు. ఒక చెట్టు పుష్టిగా బాగుందంటే దాని అర్ధం చుట్టూ వుండే వనరులను, భూమిలో వుండే ఖనిజాలను బాగా తీసుకొంటున్నదని అర్ధం. బాగా పుంజుకోగలదు. ఆకర్షణ చేత పుంజుకోగలదు. మనలో కూడ చంద్రుని యొక్క position బాగుంటే, అన్నీ బాగా కలిసి వస్తూ వుంటాయి. వాడికన్నీ బాగా కలిసొస్తాయని చెబుతూ వుంటారు. వాడికేం చేసినా

కలిసొస్తాయి. కొంచెం చేసినా బాగా కలిసొస్తుంది. కారణం ఏమిటంటే వాడిలో సోమకిరణం దిగిరావడానికి కావలసిన సంస్కారం ఏర్పడి వుండటమే. అంతేకానీ కొంతమందికి భగవంతుడు ప్రత్యేకంగా అమర్చి పంపడు. మనసు యొక్క reflecting ability బాగా వున్న చోట చక్కగా గ్రహించడం వుంటుంది. చక్కగా గ్రాహ్యము చేసుకొన్నవాళ్ళు, దాన్ని అనుభూతి పొందడానికి అర్హత పొంది వుంటారు. ఈ తత్వంగా సృష్టిలో భగవంతుడు మనకి కనిపిస్తాడు. కొన్ని చెట్లు, కొన్ని జంతువులు, కొంతమంది మనుషులు పుష్టిగా వుంటారు. బాగా పుష్టి వుందంటే, చంద్రుడు మంచి చోట వున్నట్లు అర్థం. మీనంలో చంద్రుడుంటే మంచి పుష్టి వుంటుంది. మీనంలో చంద్రుడు, కర్కాటకంలో చంద్రుని కంటే బాగా పుష్టినిస్తాడు. మీనం అంటే ఆకాశ జలానికి సంబంధించినది. మీనరాశిలో చంద్రుడున్న వాడికి పుష్టి సహజంగా వుంటుంది. పవిత్రంగా వుంటుంది. తనచుట్టూ ఏర్పడినవి తనని సుఖపెట్టేవిగా వుంటాయి. ఇట్లా మనం జ్యోతిష పరంగా చంద్రుని స్థానాన్ని బట్టి కొంత అవగాహన చేసుకోవచ్చును. చంద్రునితో ఏ ఏ గ్రహాలు అనుకూలంగా వున్నాయి? ఏ ఏ గ్రహాలు ప్రతికూలంగా వున్నాయి? దాన్నిబట్టి సోమకిరణాన్ని మనలోకి ఆవాహన చేసుకోవడానికి అర్హతకి సంబంధించి, ఎటువంటి స్థితి మనం కలిగి వున్నామనేది తెలుస్తుంది. ఈ సోమకిరణం కారణంగానే అన్నీ అనుకూలిస్తాయి. ఈ భూమి, గోళాలు ఏర్పడడం, జీవులేర్పడడం, ఈ జీవులు పెరగడం అన్నీ ఆ కిరణం కారణం గానే జరుగుతాయి. ఎక్కడ ఏది పెరిగినా, ఆ పెరుగుదల వెనకాల వున్న కథని మనం గుర్తిస్తే, ఆ ప్రక్రియని 'అమృతాం శూద్భవుడు' అనే భగవంతుని స్పర్శని మనం అనుభవిస్తాము. ఏది చక్కగా పెరిగినా దీని వల్లనే! మంచి చెట్టు, జంతువు, మనిషి విషయంలో గాని, భూగోళ విషయంలో గాని, సూర్యగోళాల విషయం గాని, గుంపుల సూర్యమండలాల విషయంలో గాని పెరుగుదల కావాలంటే ఈ సోమాత్మక కిరణం కావాలి. మనలో కూడ ఈ సోమాత్మక కిరణం బాగా ఉంటే, ఇడనాడి నుండి బాగా పనిచేస్తుంది. శరీరం చక్కగా పోషింప బడుతుంది. పింగళనాడి నుండి సూర్యుని యొక్క ప్రాణశక్తి బాగా అందుతూ వుంటే, ఇడనాడికి ఈ తత్వం బాగా అందుతుంది. ఈ రెండిటి యందు కూడ ప్రతిబింబించడం అను తత్వము కిరణం కాబట్టి, ఈ రెండిటి యందు సరైన అనుసంధానం బాగా జరిగితే, మనలో అంగిట్లో నుండి అంటే కొండనాలుక చివర నుండి సోమబిందువు ఉద్భవించే అవకాశం వుంది. ఈ 'అమృతాం శూద్భవం' అక్కడ నుండి జరిగినప్పుడు ఇంక భోజనం చేయవలసిన అవసరం వుండదు. మనం తుష్టికి, పుష్టికి కదా తింటాం. తుష్టి, పుష్టి ఈ రెండిటికీ కూడ, ఒక్కచుక్క లేక ఒక్క బిందువు సోమపానం శరీరానికి అందిందంటే, కొన్ని సంవత్సరాలకి సరిపడా పోషణకి కావలసిన శక్తి అందుతుంది. మహాత్ములు హిమాలయాల్లాంటి పవిత్రమైన పర్వత శ్రేణులలో తపస్సు చేసుకునేవాళ్ళు, ఆ విధంగా సోమపానాన్ని అనుభూతి చెందుతూ, తపస్సులో వుంటారని మనకు పెద్దలు చెబుతారు. 'సోమలత' అనేది ఎక్కడ వుంటుందో వారికి తెలుస్తుంది. అది పిండుకొని త్రాగుతారు. అంతకంటే ఉన్నతమైనది యోగము నందు తమకుగల స్థితిని బట్టి, ఈ సోమపానము ఒక బిందువు గనక అంగుటి నుండి స్రవించినట్లైతే దేహం యొక్క పోషణ కొన్ని సంవత్సరాల వరకు జరిగిపోతుంది. మనలో చాలా గ్రంథులున్నాయి. ఆజ్ఞ దగ్గర ఒక గ్రంథి, గొంతులో ఒక గ్రంథి, కంఠం దగ్గర ఒక గ్రంథి, హృదయం దగ్గర ఒక గ్రంథి, బొడ్డు దగ్గర ఒక గ్రంథి, మూలాధారం దగ్గర ఒక

గ్రంథి, వాటిమధ్య ఒక గ్రంథి వున్నాయి. ఇవన్నీ స్రవించడం వలన దేహం యొక్క పోషణ బాగా జరుగుతుంది. ఈ గ్రంథులన్నీ బాగా స్రవించనప్పుడు దేహం యొక్క పోషణ పరిపూర్ణంగా జరగడానికి అవకాశం లేదు. దేహపోషణ బాగా జరగాలంటే గ్రంథులు బాగా స్రవించాలి. గ్రంథులు బాగా స్రవించాలంటే, ఈ భగవత్తత్వం మనలో ఎంత బాగా పనిచేస్తుంటే గ్రంథులు అంత బాగా స్రవిస్తాయి. ఆజ్ఞ యందు స్రవించడం వుంది. విశుద్ధి యందు స్రవించడం వుంది. విశుద్ధి యందు స్రవిస్తే అమృత వాక్కులు వస్తాయి. హృదయము నందు స్రవిస్తే ప్రేమతత్వం విపరీతంగా వెల్లివిరుస్తూ వుంటుంది. ఏదైనా ఉద్భవం జరగాలంటే ఏడు కేంద్రాల యందు ఏడు రకాలైన స్రావాలు వుంటాయి. అవి ఏర్పడాలి. అవి ఏర్పడడానికి కూడా ఈ భగవంతుని యొక్క తత్వమే మూలకారణము. అందుకని భగవత్తత్వాన్ని ఈ కిరణంగా, పుష్టికి గాను ధ్యానం చేసే మార్గాలలో అతిముఖ్యమైనది సంగీతము. సంగీతం ద్వారా అనుభూతి పొందే అవకాశం వుంది. అలాగే ధ్యానం ద్వారా పొందే అవకాశం వుంది. శబ్దం సరిగ్గా ఉచ్చరించడం ద్వారా ఈ కిరణాన్ని పొందే అవకాశం వుంది. మనస్సు నిర్మలంగా వుంచుకొని, సన్యాసం మనసుకు ఏర్పడే సందర్భంలో చాలా ఎక్కువ అవకాశం వుంటుంది. అభిప్రాయముల యొక్క ముద్రలు లేక నిర్మలమైన మనసుగా వున్నట్లైతే దానిని 'కన్య మనసు' అంటారు. "కన్య మనసు' అంటే దానిమీద ఏ విధమైన అభిప్రాయముల ముద్ర పడలేదని అర్థం. అందుకని యోగసాధనలో మనసుని కన్యగా వుంచుకోమని చెబుతారు. భావముల చేత ప్రభావితం కాక కేవలం ఆత్మతత్వాన్నే ప్రతిబింబించుకొనేలా మనసును తయారు చేసుకోవాలి. అభిప్రాయముల ద్వారా, భావాల ద్వారా మనం పనిచేస్తున్నా, బహిర్గత ప్రపంచంతో ఏ విధమైన ప్రవర్తన అవసరం లేని సమయంలో, ఆత్మ యందు మాత్రమే మనసు రమించే పద్ధతిలో వున్నట్లైతే, ఈ ప్రజ్ఞ ఉద్భవించి పరిపూర్ణమైన పుష్టి వుంటుంది. మనందరికీ ఆరోగ్యాలు బాగా వుండక పోవడానికి కారణాలు ఏదో ఒక గ్రంథి తక్కువ స్రవించడమే. ఒళ్ళు నొప్పులు, కీళ్ళవాతం వుందనుకోండి. మూలాధారం దగ్గర వున్న గ్రంథి స్రవంతి సరిగా లేదని అర్థం. Physical deformaties అన్నిటికీ కూడ మూలాధారము నందు తేడాయే కారణం. అలాగే దేహంలో వుండే liquids, వాటి management సరిగా ఉండాలి. శంకరాచార్యుల వారి సాంప్రదాయంలో మణిపూరకం నీటికి, స్వాధిష్ఠానం అగ్నికి చెబుతారు. కానీ మిగతా శాస్త్ర గ్రంథాలలో sacral gland నుండి నీరు, solar plexus నుండి అగ్ని, పుడుతుందని చెప్తారు. ఏదైనా ఈ రెండు గ్రంథులలో కూడ ఒక గ్రంథి నీటికి, ఒకటి అగ్నికి, ఇంకొక గ్రంథి వాయువునకు; నీటియొక్క regulation సరిగా లేకపోయినట్లైతే మనిషి యొక్క శరీరం ఉబ్బడం, తగ్గడం, నీరుపట్టడం ఇలాటివన్నీ జరుగుతూ వుంటాయి. అగ్నితత్వం సరిగా regulation లేకపోతే మాటిమాటికీ జ్వరాలు రావడం, ఎక్కువ తక్కువ ఉష్ణోగ్రత లేర్పడడం, దీనివల్ల balance తప్పిపోవడం జరుగుతూ వుంటుంది. వాయువు యొక్క హెచ్చుతగ్గుల వల్ల సరాసరి ప్రాణశక్తికే ముప్పు కలిగే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే విశుద్ధి యొక్క స్రావం సరిగా లేకపోయినా రకరకాలైన అనారోగ్యాలు ఏర్పడతాయి. ఇవన్నీ స్రవించడానికి మూలమైన ఉద్భవించే తత్వానికి అవరోధమేదీ వుండకూడదు. ప్రవర్తన కారణంగా వీటికి అవరోధాలు వస్తాయి తప్ప, మరొక కారణం కాదు. జ్వాలకూల్ మహర్షి వ్రాసిన "Esoteric Healing" చదువుకొన్నట్లైతే, అందులో ఏ ఏ

చక్రాలు సరిగా పనిచేయకపోవడం వలన ఏ ఏ వ్యాధులు వస్తాయన్నది చక్కగా వివరించి ఇచ్చారు. మనలో ఇలా స్రవించడం ద్వారా జీవుల యొక్క తుష్టి, పుష్టి ఏర్పడడం జరుగుతుంది కాబట్టి, ఆ ప్రక్రియ అంతా మనలో చంద్రుని కిరణం ద్వారా భగవంతుడు దిగివచ్చి చేస్తున్నట్లుగా పెద్దలు గమనించి మనకి ఇచ్చారు. ఇది అతి ముఖ్యమైన కార్యం. సృష్టి కార్యంలో చంద్ర కిరణం లేకపోతే సృష్టి లేదు. చంద్ర కిరణం కారణంగానే మొత్తం సృష్టి ఏర్పడడం జరుగుతుంది. అందుకని దీన్ని 'సోమప్రజ్ఞ' అని అంటారు. ఈ సోమప్రజ్ఞ ని బాగా ఆరాధన చేసుకోవాలి. అందుకని సోమవారం నాడు దీనికి అరాధన బాగా ఎక్కువగా పెట్టారు. రుద్రాభిషేకములు పెట్టి తద్వారా దేహ ఆరోగ్యానికి సంబంధించిన సమస్తమైన క్రతువులను మనకు నిర్దేశించి ఇచ్చారు. 'యో రుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు యో రుద్రో విశ్వా భువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు' అంటే 'ఏ రుద్రుడైతే అగ్ని, నీరు, పృథ్వి, ఓషధుల యందు మొత్తం ఈ భువనమంతా ఆవరించి వున్నాడో, అటువంటి రుద్రుడ్ని నేను ప్రార్ధన చేస్తూ వున్నాను' అని అర్ధం. ఇందులో ముఖ్యమైన భావమేమంటే ఉద్భవిస్తూ వుండటం. ఉద్భవానికి అడ్డు రాకుండా వుండటము. నీరు వాడుకొన్న కొద్దీ ఊరి, ఊట వస్తూ వున్నట్లు, ఆ ప్రవాహానికి ఎక్కడైనా అడ్డు తగిలితే ఊట కూడా ఆగిపోతుంది. మనం నదీప్రవాహాలు చూసుకొంటే చిన్న ఊటలు అక్కడక్కడ ఏర్పడి, సెలయేళ్ళుగా, నదులుగా సముద్రం దాకా ఏర్పడుతున్నవి. ఈ మొత్తమంతా ఈ విధంగా ఉద్భవించి పెంపొందిన స్థితిలో వుంచడానికి పనిచేసే భగవత్తత్వం అవగాహన కలగడానికి ఈ నామాన్ని పెద్దలు ఇచ్చియున్నారు.

## ౨౨౬ భానుః

భానుః అంటే ఉద్భవించడం చేత దానితో పాటు వచ్చే వెలుగు. మామూలుగా ఏదైనా పెరుగుతూ వుంటే, దానితోపాటు వెలుగు కూడా పెరుగుతుంది. ఒక మంచి మామిడిచెట్టు పెరుగుతొందనుకొండి అది పుష్టిగా పెరిగితే, దానిలోనుండి ఒకరకమైన ఆకర్షణ. ఒక జంతువు పుష్టిగా వుందనుకోండి, దానినుండి ఒకరకమైన వెలుగు దర్శనం ఇస్తుంది. మనుషులు పుష్టిగా వున్నారనుకోండి. వారినుండి ఒకరకమైన వెలుగు వ్యక్తమవుతుంది. ఉద్భవాన్ని అనుసరించి వెలుగు వస్తూ వుంటుంది సూర్యాత్మకమైన ప్రజ్ఞ నుండి. ప్రాణం వ్యక్తం చేయడనికి ఈ 'భానుః' అనే సూర్యాత్మక ప్రజ్ఞను చెపుతారు. సూర్యునికి 'భాను' అనే ఒక నామం ఉన్నది. తూర్పున భానుడు ఉదయిస్తాడు. ఈ 'భాను' శబ్దంలో 'భా' అంటే వెలుగు అని. ఆ వెలుగు వ్యక్తమవుతూ వుంటే అందులోనే మనకి చైతన్యం భాసిస్తుంది. ప్రణవం లోంచి చైతన్యము, ప్రాణము రెండూ వస్తాయి. అందుచేత ఒకే ఒక ప్రణవం నుంచి ఒక తత్వం ప్రాణశక్తిగా వస్తూ వుంటే, మరొక తత్వం అన్నిటినీ పంచభూతాలను ఆకర్షించేటటువంటి రూపు కట్టుకొనే తత్వం. ఈ రెండూ కలిసి సమస్తమైన సృష్టి ఏర్పడుతుంది. అందుకని ఈ రెండు తత్వాలనీ దర్శనం చేసుకోవాలి. అచేతనములను సచేతనములు చేయడానికి చంద్రుని యొక్క ప్రజ్ఞ బాగా పనిచేస్తుంది. సచేతనములకు సూర్యుని ద్వారా వచ్చిన ప్రాణశక్తి బాగా పనిచేస్తుంది. మొత్తం సృష్టి అంతా అచేతనములు, సచేతనములు అవడం; సచేతనములు, అచేతనములు అవడంగా జరుగుతుంది. అందుకని పురుషసూక్తంలో రెండూ నీవు అని చెప్పారు "సాశనానశనే అభి' అని. అంటే organic substance, inorganic substance అయిపోతూ వుంటుంది. Inorganic substance, organic substance అయిపోతూ వుంటుంది. మనలో కూడ మనం ప్రాణవాయువును లోపలకి తీసుకొనడం వలన లోపలి అణువులు ప్రాణవంత మవుతాయి. లోపల జరిగే అగ్నికార్యం వలన వచ్చిన బొగ్గుపులుసు వాయువు వలన కొన్ని అణువులు సచేతనములు, అచేతనములు అవుతాయి. అచేతనములు సచేతనములవడం, సచేతనములు అచేతనములవడం రెండూ సమపాళ్ళలో జరుగుట వలన మనం వుంటాం. మొత్తం ప్రాణాగ్నిగా వుంటే శరీరం భరించలేదు. మొత్తం పదార్థం వుంటే, అందులో ప్రాణం వుండదు. కాబట్టి ఈ Oxygen కి, Carbon కి మధ్య చక్కటి సమన్వయం జరిగి మనం సచేతనంగా జీవించి వున్నట్లుగా ఒక భావన. ఎప్పుడు బొగ్గుపులుసు వాయువు, ప్రాణవాయువు మీద ఆధిక్యత సంపాదిస్తే, అప్పుడు మనుష్యులలో స్తబ్ధత, తమస్సు వస్తుంది. ప్రాణవాయువు ఆధిపత్యం చెందితే అప్పుడు రజస్సు మనలో ఎక్కువవుతూ వుంటుంది. కాబట్టి రజోగుణ ప్రవృత్తో, తమోగుణ ప్రవృత్తో అటో ఇటోగా వుంటారు మనుష్యులు. మనుష్యులలో తమోగుణం వుందిట అంటే inorganic substance యొక్క domination వుందని అర్థం. Overactive గా వున్నారంటే organic substance ఎక్కువగా వున్నట్లు. రెండూ సమన్వయం చేసుకొన్నప్పుడు మనిషిలో సత్వగుణం వస్తుంది. అప్పుడు సూర్యుడు, చంద్రుడు ఇద్దరి యొక్క తత్వముల యొక్క సమన్వయం సాధింపబడి, అది కారణంగా రెండిటికి సమన్వయం కుదిరే సమయంలో, మనము ప్రణవము నందు మేలుకాంచే స్థితి

కలుగుతుంది. ఆ స్థానం మనమెప్పుడైతే చేరుకోగలుగుతామో అంటే ఇడ, పింగళ సమభావం చెందడం వలన, సమానత్వం చెందడం వలన మూడవది పుడుతుంది. దాన్ని 'శశిబిందుః' అంటారు.

## 297 శశిబిందుః

"అమృతాం శూద్భవో భానుః శశిబిందుః సురేశ్వరః". ఇవన్నీ చాలా లోతైన నామాలు. సృష్టికి మూలంలో వుండే తత్వాలు. మొట్టమొదట సృష్టి మేల్కాంచినపుడు ఒక చుక్కలా మేల్కాంచి, ఆ చుక్క చుట్టూ ఒక పరిధి ఏర్పడి, ఈ చుక్క నుండి/ కేంద్రం నుండి పరిధికి తత్వం వ్యాపనం చెందుతూ వుంటుంది. ప్రతినెలా అమావాస్య వెళ్ళిన తరువాత మొట్టమొదటి చంద్రకిరణం భూమి మీద పడుతుంది. దానిద్వారా మనకి 'శశిబిందువు' అందుతూ వుంటుంది. అంటే సూర్యుని యొక్క ప్రతిబింబము చంద్రగోళం ద్వారా భూమికి అందుతూ వుంటుంది. అప్పుడు భూమి పులకరిస్తుంది. చంద్రదర్శనం అని పంచాంగంలో ప్రతినెలా వేస్తారు. ఆ time కి చంద్రదర్శనం చేయవచ్చును. మొట్టమొదటి ఆ చంద్రకిరణం చైతన్యానికి చక్కటి మేలుకొలుపు. ఈ శశిబిందు, అమావాస్య అయిపోయి పాడ్యమి (ప్రతిపత్) నాడు వచ్చే మొట్టమొదటి వెలుగు కిరణాలు భూమిని తాకినప్పుడు, భూమికి మరొక సారి చైతన్యం అందింపబడుతుంది. మనం నిద్ర నుండి మొట్టమొదటిసారి మేల్కాంచినప్పుడు కూడా ఈ కిరణాలు మనలో అలాగే ఉద్భవిస్తాయి. లేక భగవంతుని యొక్క వెలుగును మనం మొట్టమొదటి సారిగా హృదయము నందు దర్శనం చేసుకున్నప్పుడు అలాగే ఉద్భవిస్తాయి. మనకు మంత్రపుష్పంలో ఇస్తారు. 'విద్యుల్లేఖ' వరిగింజంత, హృదయమందు నీలమైన కాంతులు వెదజల్లుతూ వుందని. 'విద్యుల్లేఖే వభాస్వరా నీవారశూక వర్తన్వీ పీతాభా స్వత్యణూపమా తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః'. ఆ వరిగింజ అంత వున్న నీలరంగు కాంతి పైన శిఖలో, 'తస్యాశ్శిఖాయా మధ్యే'. వరిగింజ తల తీసుకొంటే, దాని మధ్యలో 'పరమాత్మా వ్యవస్థితః'' అన్నమాట. ఆ గింజను ధ్యానం చేసుకొని, దానిని పెద్దది చేసుకొని అందులో జీవిస్తూ వుంటారు. ""సబ్రహ్మ సశివః సహరి స్సేంద్ర స్సోక్షరః పరమ స్వరాట్". అప్పుడు మొత్తమంతా ఆ బిందువులో నుండి వ్యక్తమవుతుంది. ఈ నామం అత్యంత గంభీరమైనటు వంటిది. అవ్యక్తంలో నుండి వ్యక్తం లోకి సృష్టి రావడానికి వుండే బిందువు అది. సూదిమొనలాగ, సూదిమొన కంటే చిన్నది. ఇందాక చెప్పినట్లు వరిగింజ యొక్క తలలో వుండే కేంద్రములో వుండే మిరుమిట్లు గొలిపేటి కన్నులు చెదిరిపోయేంత కాంతులు గల విద్యుద్దీపంలా వుంటుంది. మనం TV ఆపేసినప్పుడు vertical, horizontal lines meet అయి, ఒక spark వస్తుంది. ఆ తరువాత ఏదీ లేనట్లుగా వుంటుంది. ఆ spark నుండి కదా మిగతావన్నీ వచ్చినాయి. మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయినప్పుడు ఆ spark ద్వారా మొత్తం అంతా ఏమీలేనట్లుగా అయిపోతుంది. సృష్టిలో కూడ అంతే! ఒక చిన్న బిందువు, అతి సూక్ష్మమైన బిందువు మామూలుగా ఒక చుక్క పెడితే ఆ చుక్కకి ఒక పరిధి వుంటుంది. అందులో మళ్ళీ కేంద్రం. చూడండి ఎంత సూదిమొన అయిన pencil తో చుక్క పెట్టినా, దానికి ఒక పరిధి వుంటుంది. అందులో కేంద్రాన్నే పరమ బిందు వంటారు. బిందువులో పరమ బిందువు. అంత చిన్న బిందువులో నుండి మొదలై, ఇన్ని గోళములు, ఇంత సృష్టి

వ్యక్తమవుతున్నవి. అట్లా మనలో కూడ బిందువుగా భగవంతుని యొక్క తత్వం విద్యుత్ తీగ లోని శక్తి వలె వుంటుంది. అది ఆధారంగా దానిచుట్టూ ఇంత శరీరం తయారవుతుంది. ఈ మొత్తానికి అది basis. దాన్నుంచి ఇంకొక బిందువు ప్రతిబింబిస్తుంది. వాడు జీవుడు. వాడి నుండి కొంత కాంతి ప్రతిబింబిస్తుంది. అది వాడి బుద్ధి. దాన్ని అందుకోవడానికి మనస్సు. మనస్సు నుండి వచ్చే ఆజ్ఞలను అందుకోవడానికి ఇంద్రియాలు. మనస్సు, ఇంద్రియాలు చేసే ఆజ్ఞలు అందుకోవడానికి శరీరం. ఇలా ఒకదానికొకటి పెరిగి, చిన్న negative నుండి ఎంత పెద్ద బొమ్మ పడుతున్నదీ! Only through reflexion. ఈ శశిబిందువు అనేది అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి దారి. అందుకనే అమావాస్య తరువాత మొట్టమొదట వచ్చే రోజు ద్వారా అది వ్యక్తమవుతుంది. అమావాస్య ధ్యానాలు అందుకు ముఖ్యం. సూర్యుడికి, చంద్రుడికి, భూమికి అనుసంధానం జరిగినప్పుడు, అమావాస్య తిథి మొదలైనప్పుడు zero డిగ్రీలు. మనకి పౌర్ణమి 180 డిగ్రీలు అని ఎప్పుడు తెలుస్తుందంటే పౌర్ణమి తిథి అయిపోయి, పాడ్యమి వస్తున్నప్పుడు. పూర్తి పౌర్ణమి. అది Full moon point. అందులో నుండి సుషుమ్న అనే తత్వం దిగివచ్చి, యోగులకు చాలా ముఖ్యమైన సమయం. అందుకని ఆ Full moon point కి ఒక గంట అటూ ఇటూ ధ్యానంలో కూర్చొని, అది అందుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఆ సమయంలో వుండే నిశ్చలత్వం మనచుట్టూ వుండే చోటులో ఎప్పుడూ అనుభవించము. అట్లా వుంటుందది. అలాగే అమావాస్య మొదలుకి Zero degrees. అమావాస్య అయిపోయి పాడ్యమి వస్తున్నది అనే సందర్భంలో క్రొత్తగా మళ్ళీ చంద్రుని నుండి కిరణాలు భూమి మీదకు వస్తాయి. దాంట్లోంచి వచ్చేది 'శశిబిందువు'. దాన్ని అందుకోడానికి యోగులు అమావాస్య సమయంలో ధ్యానంలో వుండి, ఆ తరువాత ఈ ప్రతిపత్ అంటే శుక్ల పాడ్యమి సమయంలో వచ్చే కిరణాలను ఆస్వాదిస్తారు. దీనివల్ల నవచైతన్యం మళ్ళీ అందుతుంది. ప్రతినెలా నవచైతన్యం! ద్వాదశ భావాల్లో వాసుదేవుని యొక్క ప్రజ్ఞ సంవత్సర పురుషునికి అందుతుంది. వాసుదేవుడుగా, ద్వాదశ భావాలుగా ద్వాదశ రాశుల్లోంచి వ్యక్తమవుతూ వుంటాడు. ఆయన యొక్క భావంతో మనం అనుసంధానం చెందాలంటే ఈ శుద్ధ పాడ్యమి మొదటి ఘడియలు చాలా ముఖ్యం. ఆ ఘడియల్లో ఆ భావం అందుకొని, ఆ నెలంతా ఆ భావాల్లో జీవించాలి. అమవాస్య తిథి మొదలుకొని అంటే మాసశివరాత్రి ఎప్పుడు మొదలవుతుందంటే కృష్ణ చతుర్ధశి అంతిమ ఘడియల నుండి మొదలై, అమావాస్య తిథి దాటి, పాడ్యమి తిథి వచ్చేవరకు. ఈ మొత్తమంతా ఒక సాధనగా నడుస్తుంది. ఇది మార్పు చెందే సమయం. ప్రజ్ఞ యొక్క భావంలో జరిగే మార్పు. ప్రజ్ఞలో కాదు. పన్నెండు భావాలతో సంవత్సర పురుషుడుగా వాసుదేవుడు మనదగ్గరకు వస్తూ వుంటాడు. మనల్ని అనుగ్రహిస్తూ వుంటాడు. కాబట్టి సంవత్సరానికి 12 programmes. పన్నెండుకి మనం అనుసంధానం చెంది వుండాలి. పన్నెండు channels. ఏ మాసంలో ఏ భావం వుంటుందో, ఆ భావంతో ఆ నెలంతా

వుండడము. మార్గశీర్ష మాసానికి ఒక భావము, కార్తీక మాసానికి ఒక భావము వుంటుంది. రెండింటికీ తేడా వుంటుంది. ఏమీ తెలియనివాడికి అన్ని రోజులూ ఒకటిగానే వుంటాయి. అన్ని తిథులు ఒకటిగానే వుంటాయి. తెలిసినటువంటి వారికి అందులో ఉన్నరుచి వేరు. రుచి తెలియనటువంటి వారికి ఏం తిన్నా ఒకటే కదా! రుచి తెలిసినవాడికి వైభవం ఎక్కువ. సృష్టిలో వున్న జ్ఞానము తెలుసుకొన్న కొద్దీ, మనలో వైభవం పెరిగి, ఆనందం కలుగుతుంది. ఈ మొత్తం సృష్టి వైభవం పొందడానికే మనల్ని ఇక్కడకు పంపించారు. సృష్టిలో ఎన్నో విషయాలు నవీనంగా, నవనీతం గా వుంటాయి. అంటే ఎప్పుడూ క్రొత్తగా, చక్కగా తీసుకొనిరాబడినవి. ఋగ్వేదంలో ఉదయం గురించి పరిశీలన చేసుకుందామనుకొని చివరకు చెప్పలేమనుకున్నారు. చూడగలిగినవారికి అన్ని అద్భుతాలుంటాయి. ప్రతిరోజూ అదే ఉదయం కాదు. ఎందుకంటే మనకి తిథి మార్పు వున్నది. మిగతా గ్రహముల యొక్క స్థితి మార్పు వున్నది. చంద్రుడొక్కడే కాదు కదా! మహాత్ములు తిథులను పంచాంగం చూసి చెప్పకోరు. ఒక మహాత్ముడు చెప్పారు పంచాంగంలో వుండే పౌర్ణమికి, అసలు పౌర్ణమికి తేడా వున్నదని. నిజం అది! ఎట్లా తెలుస్తుందంటే, నీవు పౌర్ణమితో అనుసంధానం చెందితే తెలుస్తుంది. నీవు పౌర్ణమి అంతా అనుసంధానం చెంది జీవిస్తే, ఒక సమయంలో ఒక బిందువు పరాకాష్ఠ చెందుతుంది. అదీ పౌర్ణమి. మన పంచాంగంలో ఒకళ్ళ పౌర్ణమికి, ఇంకొకళ్ళ పౌర్ణమికి తేడా వుంటుంది. ఋషులు ఎలా వుంటారంటే, ఎప్పుడు ఏ తిథో చెప్పగలిగి వుంటారు. అన్ని తిథుల అనుభూతిని అనుసంధానం చెందడం వలన తెలుసుకొని వుంటారు. కనీసం ఇది ఏ ఋతువో మనకు తెలియాలి. అట్లాగే ఏ మాసం అనేది భావం ద్వారా చెప్పాలి. భావం అంటే కాలము ద్వారా చోటులో ఇవ్వబడిన భావం. కార్తీకమాసం భావం వేరు, కర్కాటక మాసం భావం వేరు. చైత్రమాసం భావం వేరు. తులారాశి భావం వేరు. అలా నీవు కళ్ళు మూసుకొని 12 మాసాల భావాలూ calender చూడకుండా నిన్ను ఎక్కడో వుంచినా, భావం బట్టి ఏ మాసమంటే, చెప్పగలిగి వుండాలి. ఇందులో ఇంకా వివరంలోకి వెళితే తిథులు. శరీరంలో దర్శనం చేసి బృహస్పతి ఏ రాశిలో వున్నాడో చెప్పగలరు తెలిసినవారు. కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తే మూలాధారంలో బృహస్పతి కనిపిస్తాడు. మూలా నక్షత్రంలో బృహస్పతి వున్నాడు కాబట్టి. పుస్తకం చూసి చెప్పడం కాదు. లోపల దర్శనం చేసి బయట ఇట్లా వున్నాయని చెప్పినవాళ్ళు ఋషులు. దాన్ని verify చేసుకొంటే అట్లాగే వుంటాయి బయట. మనం అటునుండి ఇటు వేసుకొస్తున్నాము. Map ను బట్టి ఊరు చూస్తూ వుంటారు. ఊరుని బట్టి map కానీ, map ని బట్టి ఊరు కాదు. అలాగే పంచాంగం బట్టి గ్రహాలు తిరగవు కదా! గ్రహాల బట్టి పంచాంగం వుంటుంది. తప్పఉంటే పంచాంగంలో వుండాలి తప్ప, గ్రహాలు తప్ప తిరుగుతున్నాయని అనడానికి లేదు. అందుకే మనకి మాస్టారుగారు న్యాసవిద్య ఇచ్చారు. రాశిచక్రంలో ఏ ఏ గ్రహం ఎక్కడ వున్నదో, ఆ గ్రహాలు మొత్తం, ద్వాదశ రాశులు నీ

దేహంలో వున్నాయి కదా! మన దేహంలో ఆయా భాగాల్లో ఆ గ్రహాలని మనం భావన చేసినట్లైతే, ద్వాదశాత్మకుడైన భగవంతుడు వాసుదేవమూర్తి యొక్క భావన లేక సాన్నిధ్యం మనలో ఏర్పడుతుంది. ఇది పతంజలి చెప్పిన వాటిల్లో ముఖ్యమైనది. పతంజలి యోగ సూత్రాలలో ఈ విషయాలు వున్నాయి. మాస్టారు వ్రాసిన "Spiritual Astrology" లో కూడ ఈ విషయాలు వున్నాయి. అంటే ఏ రోజున ఏ సమయంలో ఏ గ్రహం ఎక్కడ వున్నదీ తెలుస్తుంది. కనీసం సూర్యుడు ఎక్కడ వున్నాడో, చంద్రుడు ఎక్కడ వున్నాడో తెలియాలి. ఈ రెండూ తెలియాలి. ఆ తరువాత బృహస్పతి. బృహస్పతి గురించి ఎక్కువ ఇబ్బంది పడనక్కరలేదు. సంవత్సరానికి గానీ రాశి మారడు. శని గారైతే రెండున్నర సంవత్సరాలకు రాశి మారతాడు. ఇక ఇంద్రుడు, వరుణుడు. ఒకళ్ళేమో ఏడేళ్ళు. ఒకళ్ళు పధ్నాలుగేళ్ళు. ఎక్కువగా తిరిగేది శుక్రుడు, బుధుడు, కుజుడు. వీళ్ళని కాస్త చూసుకుంటూ వుంటే మనం కళ్ళు మూసుకొని ఆ గ్రహముల యొక్క భావములు, ఆ దేహ భాగంలో ధ్యానం చేస్తే, ఆ గ్రహముల ద్వారా మనకు వచ్చే కర్మని అది neutralise చేస్తుంది. ఇటువంటి సాధనలు మనకు రహస్యంగా, ఆధ్యాత్మిక పరంగా, జ్యోతిషపరంగా ఒక భాగంగా ఇచ్చారు. అందులో ఎక్కువగా బృహస్పతిని వాడుకుంటే చాలు. సూర్యుడిని వాడుకుంటే చాలు. సూర్యుడు ఆత్మతత్వానికి, బృహస్పతి బృహ్మాణానికి చైతన్యం యొక్కవ్యాపనానికి పనికివస్తారు కాబట్టి శశిబిందుః అనే నామం యొక్క తత్వాన్ని అనుభూతి చెందడానికి చంద్రదర్శనమని పంచాంగంలో వేస్తారు. దాన్ని చూసుకోవాలి. మనకి అమావాస్య అయిన తరువాత మొట్టమొదటిసారిగా అతిచిన్న రేఖగా చంద్రరేఖ వస్తుంది. అందులో నుండి సోమతత్వం వస్తుంది. ఈశ్వరుని తల మీద వుండే చంద్రుడు. బండగా వేసుకుంటాం మనం. పెద్ద పట్టీలా వుంటుంది. అట్లా కాదు. ఒక చిన్న కిరణం. చంద్రకిరణం ఆయన శిరస్సు మీద నుండి మనకు అందుతుంది. ఆయన చంద్రశేఖరుడు. అది అందించగలడు. ఎప్పుడు అందిస్తాడంటే, మాసశివరాత్రి మొదలైనప్పటి నుండి ఆయన తన ధ్యానంలో నిమగ్నమై వుంటే, అమావాస్య తిథి దాటి పాడ్యమి లోకి వచ్చినప్పుడు. దాన్ని మొదటి కళ అంటారు. సోముని యొక్క మొదటి కళ. అక్కడ నుండి ఆ నెల అంతా దానితో అందిన భావంతో జీవిస్తాము. అందులోంచి భావం అందిస్తాడు. మాసం, అమావాస్య అయిపోయి పాడ్యమి వచ్చినపుడు మారుతుంది. అలా 12 భావాలు. ఆ భావానికి పరాకాష్ఠ ఆ నెలలో వచ్చే పౌర్ణమి. 15 కళలు అయి, 16 వ కళగా మనకి పూర్ణిమ ఘడియలు పరిపూర్ణమై, మళ్ళీ మనం కృష్ణపక్షంలో ప్రవేశించేవరకు 16 కళలు పరిపూర్తి అయినట్లు. ఈ విషయం మనకు 'ప్రతిపన్ముఖ్య రాకాంత తిథి మండల పూజితా' అని లలితా సహస్ర నామాలలో ఇచ్చారు. ప్రతిపత్ అంటే అమావాస్య వెళ్ళిన తరువాత వచ్చే పాడ్యమి నాడు వచ్చే చంద్ర కిరణం. ప్రతిపత్ ముఖ్య రాకా అంత. రాకా అంటే పౌర్ణమి పూర్తయి పాడ్యమి వస్తున్న సమయం. కృష్ణ పాడ్యమిని 'రాకా' అంటారు. ఆ సమయంలో మనకు సుషుమ్న ప్రజ్ఞ అందుతుంది. కాబట్టి

ఇక్కడనుండి అక్కడవరకు 16 తిథులు, 16 భావాలు పరిపూర్ణంగా అనుభూతి చెంది, మళ్ళీ 15 రోజుల్లో దాని తగ్గుదల ఏ విధంగా తిరోధానం చెందుతుందో కూడా తెలుసుకోవాలి. ఎట్లా వచ్చింది? ఎట్లా వెళ్ళింది? అప్పుడు మొత్తం కథ. ఈ విధంగా మనకి ఈ "శశిబిందువు' అనే నామం ద్వారా కొంత జ్ఞానం అందుతుంది. ఇది మనం జీవితంలోకి ఈ తిథిని అనుసంధానం చేసుకోవడం వలన అనుభూతి పొందడానికి అవకాశం వుంది. సాధకులకి చక్కటి రహస్యాలు, ఋషిప్రోక్త మైనవి ఎన్నో వున్నాయి. వాటి సాధన చేసుకోవడం వలన వివరణలోకి వాడతాము. లోతుల్లోకి వెడతాము. మనలో కూడ లోతులు ఏర్పడతాయి. లేకపోతే ఏదో vague గా జీవిస్తూ వుంటాము. భక్తికి జ్ఞానం యొక్క ఆవశ్యకత ఎంతైనా వుంది. ముందు మనిషికి వుండాల్సినది భక్తి. భక్తి అంటే కేవలం శ్రద్ధ. శ్రద్ధ ద్వారా జ్ఞానం లభిస్తుంది. సరైన జ్ఞానం ఏర్పడిన వాడికి మాత్రమే వైరాగ్యం లభిస్తుంది. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు. జ్ఞానం వచ్చినప్పుడు మనం చూసేదంతా పరమ డొక్కు అని తెలుస్తుంది. మనం వెంపర్లాడేవన్నీ శుష్కమైన విషయాలు అని తెలుస్తుంది. గింజ వదిలి పొట్టు కోసం తాపత్రయ పడుతున్నామని తెలుస్తుంది. రూపాన్ని వదిలి, నీడ కోసం వెతుకుతున్నామని తెలుస్తుంది. ఇవన్నీ తెలియడమే జ్ఞానం. భ్రమలు, భ్రాంతులు విడతాయి. మోహం, మాయ తగ్గుతాయి. మూఢత్వం పోతుంది. ఇవన్నీ వస్తేనే వైరాగ్యం వస్తుంది తప్ప, మనం నమ్ముకున్నవన్నీ మనకు సత్యాలు కదా! ఇవన్నీ జ్ఞానమనే అగ్ని చేత దగ్ధం చేసుకోవాలి. శ్రద్ధ కలగడం కోసం చేసే కార్యక్రమాలే అన్నీ అనుకోవడం పొరపాటు. మొదట భక్తి. భక్తి సాధన శ్రద్ధ కోసం. మనం అంతా తెలుసనుకుంటాము. ఏమీ తెలియదు. ఋషులు అలా వుండరు. భాగవతులు కూడ అలా వుండరు. అంతా తెలిసీ, తెలియనట్లుంటారు. చూడడానికి చలిమిడి ముద్దలా ఏమీ తెలియనట్లు వుంటారు. కానీ వాళ్ళకి అన్నీ తెలుసు. వశిష్ఠునికి అన్నీ తెలిసి, తెలియనట్లు వుంటాడు. విశ్వామిత్రునికి వశిష్ఠుని చూస్తే కోపం. ఆయన మీద ఏ ఆయుధము వేసినా దానికి విరుగుడు ఆయన దగ్గర వుంది. ఏం తెలియనట్లుంటాడు తప్ప, అన్నీ తెలుసట. అన్నీ తెలుసుకున్న జ్ఞానికి అహంకారం రావడానికి అవకాశమెక్కువ. జ్ఞానం కొంచెం రాగానే మనకన్నీ తెలిసిపోయినాయి, మిగతా వాళ్ళకేమీ తెలియదు అనే అహంకారం వస్తుంది. మనకి కొంత తెలిస్తే, చాలామంది తెలియనివాళ్ళు కనిపిస్తారు. ఈ తెలియటం మన ఉద్ధరింపు కోసమని తెలిసి, తద్వారా మనకుండే మోహం నుండి విడిపడాలి. అప్పుడు నిజమైన వైరాగ్యం వస్తుంది. వైరాగ్యం ఊరికే బయటకు నటనగా వుండి, లోపల అన్నిటిలోనూ పట్టు పెట్టుకొని తిరుగుతూ వుంటారు. నిజమైన వైరాగ్యం, సహజమైన వైరాగ్యం జ్ఞానమున్న వాడికే వుంటుంది. గురువుల సాన్నిధ్యంలో తెలిసే విషయాలు. మామూలు పుస్తకాల్లో వుండేవి కాదు. గురువు దగ్గర మనం చక్కగా శుశ్రూష చేసి, ఆయన కార్యంలో మనం చేదోడు వాదోడుగా పనిచేస్తూ వుంటే, గురువు తన ప్రజ్ఞ యొక్క సాన్నిధ్యాన్నిస్తాడు. ఆ

సాన్నిధ్యంలో అన్నీ తెలుస్తూ వుంటాయి. గురు శిష్యుల యొక్క సంబంధం అలా వుంటుంది. ఆ జ్ఞాన పరంపర మన భారతీయమైన సాంప్రదాయంలో చాలా ఎక్కువ వుంటుంది. ప్రతీది పిలిస్తే పలికేటంత సాంప్రదాయమున్న దేశమిది. మనం ఒక గురువు సాన్నిధ్యంలో వున్నప్పుడు, ఆయన గురించి మనకేమీ తెలియదు. ఎందుకంటే ఆయనేమీ చెప్పడు. మన బాధలు చెపితే ఉపశమింపచేస్తాడు. మనం ఏదో అడుగుతూ వుంటాం. చెప్తూ వుంటాడు. ఆయన పనిలో మనం చేతులు కలిపినప్పుడు, Joining force అంటారు. కలిసి పనిచేస్తూ వుంటే, ఆయన యొక్క ప్రసన్నత వాడియందు ఏర్పడినప్పుడు వాడిలో భాసిస్తాయి. అంతే! నాకు తెలిసినవన్నీ నీకు చెబుతానని కూర్చోబెట్టి చెప్పినా, అయ్యే పని కాదది. Information ద్వారా వచ్చేది కాదది. ఏమవుతుందంటే గురువులో వుండే సత్యము, ధర్మము కారణం చేత శిష్యునిలో అవి మేల్కొంచుతాయి. అవి అందరిలోనూ వుంటాయి. అవి మేల్కొంచాలంటే గురువు చెప్పిన పని చేస్తూ వుండాలి. గురువు యొక్క ప్రణాళికలో మనం కూడా భాగంగా జీవిస్తూ, సమర్పణ చేసుకోవాలి. ఇది రహస్యము. అట్లా చేస్తే ఈ జ్ఞానం అందించాల్సిన అవసరం లేకుండా, అందుకోబడుతుంది. అక్కడ నుండి reflect అయిపోతుంది. ప్రజ్ఞ యొక్క సాన్నిధ్యం చేత ఏర్పడుతుంది. మనం దాన్ని పెంపొందించుకోవాలి. అందిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టుకోవాలి. భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగము ఈ నాలుగూ కలిపితే పరిపూర్ణమైన సాధన. ఉత్త భక్తి, ఉత్త జ్ఞానం లాభం లేదు. ఉత్త భక్తి వల్ల మూఢుడుగా వుంటాడు. ఉత్త జ్ఞాని అహంకారుడుగా వుంటాడు. ఈ రెండూ లేనివాడికి వైరాగ్యం వుండదు. డంబాచారం వుంటుంది. వైరాగ్యం, సన్యాసం అని పేరు పెట్టుకొని కోటానుకోట్లు సంపాదించుకొని, వాళ్ళు నీ మీద అజమాయిషీ చేస్తూ వుంటారు. యోగమనేది ఎలాగూ వుండదు. ఈ నాలుగూ ప్రాతిపదికగా మనం దైనందిన జీవితంలో సాధన చేసుకోవాలి. భక్తి, అన్నిట్లో శ్రద్ధ. అంటే అన్నిట్లోనూ భగవంతుని చూసే శ్రద్ధ వుండాలి. జ్ఞానం దాంట్లోంచి పెంపొందాలి. తద్వారా మనలో వైరాగ్యం ఏర్పడాలి. వైరాగ్యమంటే వాటికోసం, వీటికోసం వెంపర్లాడకుండా వుండాలి.

## ౨౪౮ సురేశ్వరః

ఈ శశిబిందువు అందుకొనేవాళ్ళు సురలు. 'సుర' అంటే వ్యాపనం చెందిన వెలుగు కిరణం. అలా వ్యాపనం చెందడానికి ఒక బిందువు కావాలి. ఆ బిందువు ఆయన! ఒక బిందువు నుండి సూర్య కిరణాలు అలాగే వ్యక్తమవుతున్నాయి కదా! వ్యక్తమైన సమస్తమైన సురలకు ఆయన ఈశ్వరుడు. ఆయన లేకపోతే ఇవిలేవు. దీపం లేకపోతే దీప కిరణాలు ఎక్కడ వుంటాయి? ఇన్ని దేవతలకూ కూడా ఆయన మూలస్థానము. అదీ 'సురేశ్వరుడు' అంటే. అదే 'సురేంద్రనాధ్' అంటే. దేవతలందరికీ ఇంద్రుడు అధిపతి. ఆయనకే నాధుడు. సురేంద్రనాధ్. ఇన్ని రకముల వెలుగులకు ఆయన మూలస్థానము, కేంద్రము, బిందు స్థానము, ఉత్పత్తి స్థానము. ఒక శిష్యుడు గురువుని అసలు దేవతలెంతమంది అని అడుగుతాడు. ఆయన 33 కోట్లు అనిచెప్పి, చివరకి వున్నది ఒక్కడు. ఒకడి నుండి ముగ్గురు, ముగ్గురి నుండి 33, 33 నుండి 33 కోట్లు వచ్చారు. చాలామంది అని చెప్పడానికి 33 కోట్లు అని అంటారు అని చెప్పారు. అసలు ఈ మూడు అని ఎందుకు పెట్టుకున్నారని శిష్యుడు అడుగగా ఆదిత్యులు, రుద్రులు, వసువులు అని ముగ్గురు. 33 ఎలా వచ్చారంటే 12 మంది ఆదిత్యులు, 11 మంది రుద్రులు, 8 మంది వసువులు. లెక్క వేసుకోమని చెప్పారు. 31. మిగతా ఇద్దరూ మిత్రావరుణులు అయిన అశ్వనీ దేవతలని చెప్పారు. ఇంకా details కి వెడితే చాలామంది వస్తారు. గంధర్వులు, చారుణులు, సిద్ధులు, సాధ్యులు మొదలైనవారు. వీటన్నిటికీ మూలమైన బిందువు శశిబిందువు. ఆ శశిబిందువుని అందుకుంటే, అందులోంచి 33 కోట్ల మంది దేవతలు అందుతారు. వాడు మూలం కదా! అందుకనే మూలపురుషునితో అనుసంధానం చెందితే, ఒక్కొక్క. దేవతని మనం ప్రత్యేకంగా ప్రార్ధన చేసుకోకుండా దేవతల యొక్క సహకారం సహజంగా లభిస్తుంది.

## 2ని౨ ఔషధం

అంటే మందుగా తానున్నాడు. మనం మామూలుగా మందులు తీసుకునేటప్పుడు ఇది ఇంగ్లీషు మందని, హోమియో అని, ఆయుర్వేదం అని రకరకాలుగా అని తీసుకొంటాం. ఇన్ని మందుల్లోనూ వున్నవాడు 'వైద్యో నారాయణో హరిః'' అన్నట్లు వైద్యుడే కాకుండా, మనం తీసుకొనే మందు కూడా నారాయణుడని గుర్తుంటే, మనం త్వరితగతిని అనారోగ్యం నుండి ఆరోగ్యం పొందే అవకాశం కలుగుతుంది. మనం అన్నీ కూడ వేరు వేరుగా చూస్తూ వుంటాం. అంతర్యామి సాధనలో సృష్టి అంతా నారాయణుడని గుర్తుంటే, ఆయన యొక్క వ్యక్తరూపంగా సమస్తాన్నీ దర్శించడం భాగవత ధర్మం. అలా దర్శించినపుడు ఇది హోమియోపతి, ఇది అల్లోపతి అని దర్శించడానికి అవకాశం లేదు. ఇది ఎక్కువ, ఇది తక్కువ అనే మీమాంస మనలో రాదు. కాలం రూపంలో భగవంతుడు కర్తవ్యం నిర్దేశించినప్పుడు, ఆ కర్తవ్యం మేరకు వేసుకున్న మందు ఏదైనా అది నారాయణుని యొక్క స్వరూపమనే భావనతో వేసుకున్నట్లైతే మనకు మందులు బాగా పనిచేస్తాయి. మామూలుగా లౌకికమైన విషయంలో ఇలా ఆధ్యాత్మికత ఇమిడివుండటం ఒక రహస్యం. ఏ మందైనా వేసుకుంటున్నప్పుడు మందు రూపంలో నారాయణు డున్నాడని గుర్తుపెట్టుకొంటే మందు చాలా చక్కగా పనిచేస్తుంది. వైద్యుడే నారాయణుడు కాబట్టి, ఔషధ రూపంలో వచ్చాడు కాబట్టి వేసుకునే మందు ఏదైనా నారాయణుని స్వరూపంగా భావన చేసి వేసుకోవాలి. మనకు పెద్దలు ఒక శ్లోకం ఇచ్చారు.

"శరీరే జర్ఝరీభూతే వ్యాధిగ్రస్తే కళేబరే, ఔషధం జాహ్నవీతోయమ్, వైద్యో నారాయణో హరిః"

మామూలుగా కృశించిపోయే శరీరానికి, నారాయణుని పాదపద్మముల నుండి ప్రవహిస్తున్న గంగాజలాన్ని ఔషధంగా స్వీకరిస్తున్నానని, ఋషులు గంగాతీరంలో తపస్సు చేసుకుంటూ తమ జీవితాన్ని గడుపుతున్న సమయంలో వారు గంగాజలమే ఔషధంగా తీసుకొనేవారు. 'ఔషధం జాహ్నవీతోయమ్''. ఆ నీరు త్రాగి నయం చేసుకొంటూ వుండేవారు. ఇప్పుడు గంగా తీరానికి చాలా దూరం వచ్చేసింది కదా మానవ జాతి. సంస్కృతిపరంగా, భావపరంగా, భౌతికంగా, దేశపరంగా కూడ చాలాదూరం వచ్చేసింది. కాబట్టి మన దగ్గరకు వచ్చిన ఏ మందవ్వనీ, చూర్ణమవనీ, ఏదైనా కానీ ఇది 'నారాయణుడు' అని గుర్తు వుంటే, మందు చక్కగా కావల్సిన స్వస్థత చేకూరుస్తుంది. అలాగే మనకి దొరికిన వైద్యుడే నారాయణుడని భావన చేయాలి. అందరికీ అందరూ అందుబాటులో వుండరు కదా! ఎక్కడో ఒక మంచి వైద్యుడున్నాడంటే వెళ్ళలేకపోవచ్చు. భగవంతుని యందు విశ్వాసం వుంటే, భగవంతుడే అందరిలో నుండి పనిచేస్తున్నాడు కాబట్టి, మన కర్తవ్యం మేరకు, మన శక్తి మేరకు, మనకు దొరికిన వైద్యుడు, వైద్యము అంతే! ఈ అవగాహన వుండి అందులో ఆత్మవిశ్వాసము వున్నట్లైతే, అందులోంచే సమస్త రోగాలు తగ్గించుకోవచ్చును. మామూలుగా మనకి ఆవగింజంత

విశ్వాసం వుంటుంది. దాన్ని వీళ్ళూ వాళ్ళూ వచ్చి, ఇంతకంటే ఆ ఊళ్ళో బాగా చేస్తారంటే దీనికి సున్నా చుట్టి, అక్కడకి వెడతాం. అక్కడనుండి ఇంకొక చోటుకి, అలా అక్కడ నుండి అమెరికా వరకు తిప్పి, మనమీద కక్ష తీర్చుకుంటారు. మన స్థితిగతుల అవగాహన లేక సలహాలిస్తారు. ఇక్కడకు అక్కడకు తీసుకువెళ్ళమని, అక్కడ బాగా చేస్తారు ఆపరేషను, ఇక్కడ బాగా చేస్తారు అని రోగిని నానా విధాలుగా రొష్టు పెడతారు. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే, ఒకటి భగవంతుని యందు విశ్వాసము లేకపోవడం వలన. విశ్వాసము లేక అలా ప్రవర్తించేవారు అధర్మపరులు. దేముడిని నమ్ముతున్నాను, దేముని మీద ఎంతో నమ్మకమున్నట్లు ఆ మార్గంలో నడుస్తున్నానని చెప్పి, వ్యతిరేకంగా ప్రవర్తించేవారు ఎక్కువ అధర్మపరులు. చెడ్డవాడు చెడ్డపని చేస్తే అంత తప్పులేదుట. మంచివాడు చెడ్డపని చేస్తే శిక్ష ఎక్కువట. అంటే భగవత్తత్వంలో జీవించేవాళ్ళకి భగవంతుని విషయంలో మనకున్న విశ్వాసం ఏ మాత్రం వుందో మనకి తెలియాలి అని మనలో వున్న చంచలత్వానికి ఒక పరీక్ష పెడతాడు. గాలివేస్తే ఊగిపోతావా? లేక నిలబడతావా అని. చెట్టు గట్టిదైతే ఎంత గాలి వచ్చినా నిలబడుతుంది. గట్టిగా లేకపోతే గాలివాటుగా వుంటుంది. గాలివాటుగా జీవించేవాళ్ళకి ఏ విధమైన లోతులూ ఏర్పడవు. లోతులు ఎలా ఏర్పడతాయంటే, నేనున్న చోటుకే దేముడొస్తాడు. నాచుట్టూ దేముడున్నాడు. నాలో దేముడున్నాడు అని చెప్పకుంటూ ఉన్న వాళ్ళు అలా చేసారనుకోండి ఘోరం. ఇంకొకళ్ళకి చెప్తూ అలా చేసారనుకోండి. అది ఇంకా ఘోరం. అంతటా భగవంతు డున్నాడని చెప్తున్నపుడు నమ్మి చెప్పాలి. దానియందు విశ్వాసం వుండాలి. మనం ఎవరికైనా చెప్పినపుడు ముందు మనం ఆచరించాలి. మన లోపల, మనచుట్టూ, అందరి ద్వారా భగవంతుడు వ్యక్తమవుతున్నాడనేది భాగవతధర్మం. అప్పుడు మందుల విషయంలో ఇంత విచికిత్స వుండవలసిన అవసరం లేదు. జ్వాలకూల్ గారు చెప్పారు ఏ మందైనా ఫరవాలేదని. సత్యం అది! నువ్వు ఏ మందు వేసుకున్నా ఒకటే! సత్యం ఏమిటంటే మందుల రూపంలో వున్నది భగవంతుడని గుర్తించడం. ఇంకొకటి కూడా చెప్తారు జ్వాలకూల్ గారు మందులు మనం వేసుకోకపోయినా కాలం రూపంలో వదిలేస్తే చాలా జబ్బులు అవే తగ్గుతాయి. వాటికే మనం ఎక్కువ మందులు వేసుకుంటూ వుంటాము. 20% లో 5% తగ్గించగలవి వుంటే, 15% అవి ఎప్పుడూ మనతో వుంటాయి. ఒప్పకొంటే సరిపోతుంది. 15% ఒప్పకోవడం వలన వైద్యులు చేసేది 5%. 80% దగ్గు వచ్చింది, జలుబు వచ్చింది అని. మందులన్నీ అవేకదా! వీటికి ప్రవర్తనలో మనకి rest, work and food. ఈ మూడింటిలో వుండే సామ్యం బట్టి disturb అవడం, కాకపోవడం వుంటుంది. సామ్యం లేకపోవడం వలన అడ్డదిడ్డంగా, వేళాపాళా లేకుండా తినడం, పనికి, నిద్రకి కూడ వేళాపాళా లేకుండా వుందనుకోండి. ఏవో వస్తూనే వుంటాయి. పద్ధతి లేకుండా వుంటే, శరీరంలో వుండే దేవతలకి తెలియదు. మనం ఒక పద్ధతి ఇస్తే, శరీరంలో దేవతలు ఆ పద్ధతి ప్రకారం నడుస్తారు. సృష్టిలో దేవతలంతా

క్రమపద్ధతిలో వుంటారు. మనం రోజుకో పద్ధతి చేస్తే వారికేం చేయాలో తెలియక మనల్ని వదిలేస్తారు. వాళ్ళు వదిలేసినప్పుడు మనకు జబ్బులు వస్తాయి. కళ్ళు, ముక్కు, చెవులు పనిచేయడం లేదని, నాలుక రుచి తప్పిందని, కిడ్నీ పనిచేయలేదని, ఊపిరితిత్తులలో నీరు చేరిందని, ఇవన్నీ ఎందుకొస్తాయంటే, ఆ ప్రజ్ఞలు వెళ్ళిపోతాయి. మనలో ఆ ప్రజ్ఞలు పనిచేస్తూ వుంటే మనం పై పనులు చేసుకొంటూ, ఏవో సాధిస్తున్నామని అనుకొని విర్రవీగుతాము. కానీ లోపల అవి ప్రవర్తించే తీరుకి ఒక పద్ధతి వుంది. మనలో oxygen తీసుకొని, carbondioxide వదిలేది ఒక ప్రజ్ఞ. మనకి అంకెలు తెలియనప్పటి నుండి కూడ సంఖ్యాజ్ఞానం ఒక ప్రజ్ఞగా మనలో పనిచేస్తున్నది. ఇలా మనలో ఎన్నో ప్రజ్ఞలు పనిచేస్తున్నాయి. ఇంద్రియాలు, ఊపిరితిత్తులు, కాలేయం మొదలైనవి అన్నీకూడ క్రమమైన పద్ధతిలో పనిచేస్తూ వుంటాయి. ఇట్లా అవి అన్నీ క్రమపద్ధతిలో వుంటాయి కాబట్టి, మనం క్రమం తప్పితే అనారోగ్యం రావడానికి అవకాశం వుంది. అనారోగ్య స్థితి మనకు వంశపారంపర్యంగా వుందనుకోండి విత్తనంలోనే వున్నాయనుకోండి. ఎక్కువ భాగం ఒప్పుకోవడం వలన ఒక విధమైన harmony వస్తుంది. అప్పుడు సమన్వయం వుంటుంది. ప్రశాంతత వుంటుంది. ఎందుకంటే ఈ సారికి అలా ఇచ్చారు. నేత నేసేటప్పడే అలా వచ్చేసింది. నేతలోనే వుంది. నేతలోనే వున్న దానికి చింపుకొంటే తప్ప, నేతలో వున్న వాటిని మార్చలేము. దాన్ని మార్చాలంటే మందుల వల్ల అవదు. అందుకనే ఈ రోజుల్లో మందుల కంటే రోగాలు ఎక్కువ. ఎందుకంటే అది నేతలోనే వుంది. కొన్ని జబ్బులకు, మందులకు మధ్య పరుగుపందెం జరుగుతుంది. ఎప్పుడూ జబ్బులే ముందుంటాయి మందుల కన్నా. ఎన్ని మందులు కనిపెట్టినా, ఇంకా జబ్బులే ముందు వుంటున్నాయి. ఎందుకిలా వస్తున్నాయి అంటే, ఇదికాదు పద్ధతి జీవించడానికి, ఇంకో పద్ధతి వుందని తెలియజెప్పడానికి. మనం సహజమైన జీవనవిధానం నుండి చాలా దూరం వచ్చేసాము. ఆర్యులు ఇచ్చిన జీవనవిధాన మొకటి వున్నది. అది 'సనాతన ధర్మం' అంటారు. సృష్టిలో మనం ఏ విధంగా వుంటే హాయిగా వుంటామో, మనచుట్టూ వుండేవాళ్ళు హాయిగా వుంటారో తెలిపే విధానం. అది మతం కాదు, ధర్మం. సనాతన ధర్మం. ఆ ధర్మం ప్రకారం జీవిస్తూ వుంటే మనకు అస్వస్థత రాదు. ఎప్పుడైనా దేశకాల పరిస్థితుల చేత కాస్తో కూస్తో తేడా వచ్చినా, వచ్చినప్పుడు మనం మందుల రూపంలో నారాయణు డున్నాడనే భావంతో వుంటే స్వస్థత చేకూరుతుంది. మనకి మందులలో నుండి పనిచేస్తున్నది మందులలో వుండే స్వభావం. ఒక్కొక్క chemical లో ఒక్కొక్క స్వభావమున్నది కదా! ఆ స్వభావం అలాగే వుండడానికి కారణం minerals, metals, salts మొదలైనవన్నీ వున్నాయి. ఇవే వీళ్ళు మందులుగా తయారుచేసి ఇస్తారు. ఈ మందులను మొక్కలు, ఖనిజాలు, జంతువుల నుండి తీసి, తయారుచేసి మనకిస్తారు. ఎందులోంచి తీసిన ఆ మందుకు ఆ స్వభావం వస్తుంది. మామిడిచెట్టు నుండి తీస్తే మామిడి స్వభావం, ఉప్పు ఉప్పగా, పంచదార తీయగా వుండడం, నీళ్ళు దాహం తీర్చడం.

ఎన్ని త్రాగినా దాహం తీర్చేది నీరే. ధర్మం అది. దాహం తీరడానికి మంచినీళ్ళు అని చెప్పారు. అలాగే ఆకలి తీరడానికి. ఈ విధానంలో తేడా వచ్చినప్పుడు, మనకి ఏ వైద్యుడు దొరికితే ఆయనే నారాయణుడు. మాస్టరు గారి శిష్యులు ఎవరు మందు వేసినా, మాస్టరుగారే వేసారనే భావం తెచ్చుకుంటున్నాము కదా! మాస్టారు గారు కూడ 'నన్ను నమ్ముకొని మందు ఇచ్చిన వాళ్ళ ద్వారా, నేను పనిచేస్తాను. పుచ్చుకొనేవాళ్ళు కూడ నేనే ఇస్తున్నానని భావన చేయాలి' అనే చెప్పారు. అందులో వుండే రహస్యమిదే! అదే సృష్టి రహస్యం! ఆయన నేనే ఇస్తున్నానని అన్నప్పుడు కృష్ణమాచారి కాదు. నేనంటే అంతర్యామి. నా మార్గమంటే అంతర్యామి మార్గం. నేను మార్గం. భగవద్గీతలో వున్నదంతా 'నేను' మార్గమే. 'నేను' తప్పితే ఇంకొకటి లేదు. శ్రీకృష్ణుడు ఇంకొకటి చెప్పలేదు. అందుకని నేను మందు వేస్తున్నానని గుర్తుపెట్టుకో. నీకు తగ్గుతుంది, అని చెప్పారు. మనం రూపాలు కాకుండా, అందరిలో వున్న వాడిని చూస్తే, నిలకడ వుంటుంది. నిలకడగా మందు పుచ్చుకుంటే విశ్వాసం వల్ల తగ్గుతుంది. అందువల్ల వైద్యుని మీద విశ్వాసం వుండాలి. అలాగే మందు కూడ. ఈ విష్ణుసహస్ర నామం మనం దైనందిన జీవితంలో తారసపడే అన్నిటిలో భగవంతుడున్నాడని చెప్పడానికి ఇచ్చారు. దేనిద్వారా తగ్గితే అదే మందు అని మాస్టరుగారు చెప్పారు. ఎవరి ద్వారా తగ్గితే వాడే వైద్యుడు. అందరిలోంచి ఒకడే పనిచేస్తున్నాడు. ఇదే అంతర్యామి భావన. అలా అని మనం కాళ్ళు బారచాపుకొని కూర్చోవడం కాదు. మనకుండే పరిస్థితులలో, మనకు సాధ్యపడే ప్రయత్నాలు చేస్తే మనకు తారసపడే వైద్యుడు, మందు కూడా భగవంతుడే అని నమ్మితే, వాళ్ళద్వారా భగవంతుని సంకల్పమే పనిచేసి, మనకి స్వస్థత చేకూరుతుంది. అదీ ఔషధం. ఇన్ని మందుల్లోంచి పనిచేసే healing agent. ఒకే జబ్బుకు ఒక కోటీశ్వరుడు 5 లేక 6 లక్షలు ఖర్చు పెట్టుకొని బ్రహ్మాండంగా చేయించుకొచ్చానంటాడు. అదే జబ్బు ఒక పేదవాడికి మామూలు మందుతోనో, ప్రకృతి చికిత్సతోనో, నాటుమందుతోనో, మూడు రూపాయల ఖర్చుతో అయిపోతుంది. గొప్పతనం కోసం చూసేవాళ్ళకి గొప్ప గొప్ప విషయాలు చాలా వున్నాయి ప్రపంచంలో. అది వాడి దగ్గర వుండే సంపద బలాన్ని బట్టి ఆ విధంగా వెళ్ళిపోతూ వుంటుంది. మామూలుగా చిన్న చిన్న పనులకు పెద్ద పెద్ద ఖర్చులవుతూ వుంటాయి. ఉన్నది కదా అని అహంకరించి చేయడం తప్ప, తగ్గడం తగ్గకపోవడ మన్నది విశ్వాసం వల్ల జరుగుతుంది. గుళ్ళో దండం పెట్టుకొని operation చేయించుకొని బయటపడ్డ వాళ్ళు చాలామంది వున్నారు. ఇవి నమ్మకానికి సంబంధించినవని అనవచ్చును. నమ్మకమే కాదు. మామూలుగా మనకు కనిపించే భౌతికమైన ప్రపంచంలో దాని వెనకాల వుండే ప్రజ్ఞల యొక్క పాటవం తెలిసినట్లైతే అందులో వుండే రహస్యం తెలుస్తుంది. తగ్గించేవాడు నారాయణుడు అనే భావన వుందనుకోండి. వేసుకొనే మందు నారాయణ అనే భావం వుందనుకోండి. అది చెప్పడానికి మనకు ఇచ్చారు. He is the healing agent. మనం కూడా నారాయణ

మంత్రం ద్వారా జబ్బులు తగ్గించే అవకాశం కలిగివున్నాము. 'ఓం నమో నారాయణాయ' అనే మంత్రాన్ని బాగా ధ్యానం చేస్తూ, మననం చేస్తూ, ఆ మంత్రం ద్వారా నారాయణుని యొక్క స్వరూపం మొత్తాన్ని కిరీటం దగ్గరనుండి పాదాల వరకు, కిరీటంలో వజ్రాలు, మణులు, వైఢూర్యాలు అన్నీ ప్రకాశిస్తూ, చక్కటి అర్ధచంద్రాకారం గల ఫాలభాగం వున్నట్లు, విశాలమైన పద్మముల వలె నేత్రములున్నట్లు, తుమ్మెద రెక్కల వలెనున్న కనుబొమ్మ లున్నట్లు, ముంగురులు చెవుల మీద పడుతున్నట్లు, సంపెంగ మొగ్గ లాంటి ముక్కు వున్నట్లు, మంచి చిరునవ్వు చిందించే పెదవులు, నోరు, అందమైన చుబుకము, తరువాత కంఠము అట్లా ఊహ చేసుకుంటూ పోవాలి.

అందుకే మనకు అంగపూజ ఇచ్చారు. సంస్కృతంలోనే చదవనక్కరలేదు. ఇలా భావన చేసుకోవచ్చును. కళ్ళు మూసుకొని ఇట్లా పైనుండి క్రిందవరకు, క్రింద నుండి పైవరకు, మళ్ళీ పై నుండి క్రిందవరకు మొత్తాన్ని భావించాలి. కంఠం దగ్గరకు వచ్చినపుడు కంఠం దగ్గర హారం, శరీరం నీలంగా వున్నట్లు, దానిమీద బంగారు రంగు ఆభరణాలున్నట్లు, వాటిల్లో పొదిగిన వజ్రాలు, మణులు, వైఢూర్యాలు కాంతులు వెదజల్లుతున్నట్లు, ఒక చేతిలో శంఖం, ఒక చేతిలో చక్రం, ఒక చేతిలో గద, ఒక చేతిలో కమలం, వక్షస్థలం మీద పుట్టుమచ్చ, క్రిందకు దిగివస్తే బొడ్డు, పట్టు పీతాంబరం కట్టుకొన్నట్లు, ఆ తరువాత ఇంకా క్రిందకి దిగివస్తే పాదములు, ఆ పాదములు ఎంతో మృదువైనటువంటివిగా భావన చేసి, వాటిమీద మన చేతులు పెట్టి ముట్టుకొని, మన కళ్ళకు అద్దుకొన్నట్లు. ఇదంతా పిచ్చి అనుకున్నా తప్పలేదు. ఆయన నిలబడిన పద్మాన్ని కూడా ధ్యానం చేస్తూ, 'ఓం నమో నారాయణాయ' అని చెప్పకొంటూ, పైనుండి క్రిందకు, క్రింద పాదాల నుండి పైన కిరీటం వరకు, 12 భావాలు దర్శనం చేసుకోవాలి. మనలోనూ 12 భావాలు వున్నాయి. అవే ద్వాదశ రాసులు. అలా భావన చేసుకొంటూ మూడు సార్లు అటూ, మూడు సార్లు ఇటూ వెళ్ళిన తరువాత, మీకు ఎక్కడ ఇష్టంగా వుంటే అక్కడ హృదయంలో కానీ, పాదాల వద్ద కానీ ఎక్కడైనా ధ్యానం చేసుకోవచ్చును. నీలం రంగులో ఆయన వున్నట్లు, ఆయన దగ్గరనుండి నీలపుకాంతి బాగా వ్యాపనం చెంది, ఆ కాంతిలో మనం వున్నట్లు, ఆయన హృదయంలో మనం వున్నట్లు, మన హృదయంలో ఆయన వున్నట్లు ఇట్లా భావన చేసుకోవాలి. ఆయన పాదాలు మన హృదయంలో పెట్టుకొని మొత్తం స్వరూపం మన శిరస్సు వరకు వున్నట్లు భావన చేయాలి. అలా నిలబెట్టి మనం కావలసినంతసేపు చూడాలి. అదీ దర్శనం చేయడమంటే! దర్శనం అయిన తరువాత స్పర్శనం కూడా చేసుకోవాలి. పాదాలు ముట్టుకున్నట్లు. భగవంతుని పాదాలు మాత్రమే ముట్టుకోవడానికి మనకి అర్హత వున్నది. వక్షస్థలం ముట్టుకొంటే అమ్మవారికి కోపం వస్తుంది. ఇది మనకు ఆరాధనా మార్గం. దర్శనం, స్పర్శనం చేసుకున్న తరువాత కొంతసేపు సంభాషణ చేసుకోవచ్చును. మనకున్న విషయాలన్నీ ఊళ్ళో వాళ్ళకు చెప్పకొనే బదులు ఆయనతో చెప్పకోవచ్చును. ఊళ్ళో వాళ్ళైతే మనకి ఆర్చేవారా?

తీర్చేవారా? శివపురాణంలో కధలన్నీ అలా వుంటాయి. మనకంటే ప్రజ్ఞలో పెద్దవాళ్ళు మనకి ఆర్చేవాళ్ళు, తీర్చేవాళ్ళు. వాళ్ళతో మన బాధలు చెప్పకోవాలి. అందరి దగ్గరా చెప్పకుంటే అక్కరలేని సలహాలిస్తారు. మనని తప్పదారి పట్టిస్తారు. ఆ సలహాలు పట్టుకొని పరిగెడితే అంతే సంగతులు. అలా అరణ్యంలో వదిలేస్తారు. అందుకని మనం ఈ భావన చేసుకున్న తరువాత భగవంతునితో మాట్లాడుకోవాలి. నీలపురంగు వెలుగులో మనం పూర్తిగా నిండి వుండి, ఆయనతో మనం మాట్లాడుకుంటే మన హృదయంలో ఆయన వున్నట్లు, ఆయన హృదయంలో మనం వున్నట్లు భావన చేయాలి. ఆయనలో తిరుగుతున్నాము. ఆయనలో తిరుగుతున్నామని గుర్తున్నంతసేపు ఆయన ప్రభావం మనచుట్టూ వుంటుంది. మర్చిపోతే వుండదు. మనకి, ఆయనకి మధ్య అదే రాజవిద్య, రాజగుహ్యం. ' మీ అందరూ నాలో ఉన్నారు. మీ అందరిలో నేను వున్నాను. నీలో నేను వున్నాను. నాలో నీవున్నావు. నీలో నేనున్నాను కాబట్టి. నాలో నీవున్నావు'. ఈ మూడు వాక్యాలూ అర్ధం చేసుకొంటే రాజవిద్య, రాజగుహ్యం అర్ధమైనట్లే. సముద్రంలో అలలాగ మనం భగవంతుని యందు వున్నాము. సముద్రంలోనే అల వుంటుంది కానీ, వేరే ఎక్కడ వుండమన్నా వుండదు. మొత్తంలో భాగంగా మనం వున్నాం కాబట్టి, ఆయనలో భాగంగా అర్ధం చేసుకోవాలి. మనలో ఆయన వున్నాడు. ఎందుకంటే ఆయనలో మనం వున్నాం కాబట్టి. సముద్రంలో అల వుంది. అలలో సముద్రం వుంది. ఎప్పటికీ ఈ ఉదాహరణ తప్పదు. ఇదొక్కటే మార్గం. అలలో సముద్రం వున్నట్లు ఆయన మనలో వున్నాడు. నిజానికి ఆయనే మనంగా వున్నాము. సముద్రమే అలగా వుంది కదా! అట్లా భావన చేసుకొంటే, ఆ భావనలో కూర్చొని చెప్పకోవచ్చును. ఏ భాషైనా ఫరవాలేదు. కాసేపు భగవంతునితో మాట్లాడుకోవాలి. అందుకనే పూజ అయిన తరువాత కాసేపు నోరు, కళ్ళు మూసుకొని కూర్చోవాలి. అలా మనం అన్ని రకాల బాధలూ చెప్పకోవచ్చును. వాసుదేవుడిగా అన్నిట్లో చూడాలని అనుకున్నపుడు మందులో కూడా చూడాలి కదా! మందు వేరే చూడబోకు. అందులో కూడా ఆయనే వున్నాడని చెప్పడానికి ఇదిచ్చారు. నీలంరంగును మనలోకి బాగా ఆవాహన చేసుకొంటున్నామనుకోండి, బాగా దింపుకొన్నామనుకోండి. సమస్త కోశములు పరిశుద్ధి చేయబడతాయి. ఆ నీలంరంగు మహత్యం అటువంటిది. శ్యామల వర్ణంతో స్నానం చేసినట్లు shower లో మునగాలి. Blue shower. వెన్నెల రాత్రి చంద్రుని చూస్తే, ఆకాశం నుండి వెన్నెల అలా దిగివస్తున్నట్లు వుంటుంది. మన విశాఖపట్నానికి నీలంరంగు ఎక్కువ. కారణమేమంటే సముద్రం యొక్క సాన్నిధ్యం చేత. కొన్నిచోట్ల ఎర్రగా, బూడిదరంగు గాను వుంటాయి. ఆ నీలంరంగు లోనే బాగా వున్నామనుకోండి. మనలోని 7 కోశములను బాగా శుద్ధి చేస్తుంది. మనసును శుభ్రపరుస్తుంది. మనసుకు ప్రశాంతత వస్తుంది. తరువాత ఇంద్రియాలకు. ఆ తత్వం ఇంద్రియాలకు దిగితే, 'అనిరుద్ధుడ' 'ని పేరు పెట్టుకోవచ్చును. ఆ తత్వం హృదయంలో ఎప్పుడూ వుంటే,

'ప్రద్యుమ్నుడ'ని పేరు పెట్టుకోవచ్చును. ఆ తత్వం ఎప్పుడూ హృదయం నుండి శిరస్సు వరకూ వ్యాపించియుంటే, 'సంకర్షణుడ' ని పేరు పెట్టుకోవచ్చును.( బలరాముడు). ఆ తత్వం ఎప్పుడూ మన లోపలా, బయటా వుంటే, 'వాసుదేవుడ'ని పేరు పెట్టుకోవచ్చును. శ్రీకృష్ణుడు వసుదేవుడని పిలువబడతాడు. ఎప్పుడూ ఆ తత్వం వుండి, అతడు చిన్నవయసులో వున్నప్పుడు కూడా ఆ తత్వం పెద్ద పనులు చేసిపెడుతుంది. అందరినీ చంపింది. ఆ చుట్టూ వుండే చతుర్భుజుని యొక్క రూపం వచ్చి, పనిచేసి వెళ్ళిపోతూ వుంటుంది. ఈ పిల్లవాడి రూపం వాహికగా! అలాగే మన రూపం వాహికగా భగవంతుని తత్వం పనిచేస్తూ వుంటుంది. అట్లా వాహికలుగా తయారుచేయడమే C.V.V. యొక్క యోగమార్గము. అదే మాస్టారుగారు మనకిచ్చిన అంతర్యామి సాధనామార్గం. దానికి మనం గుర్తుపెట్టుకోవలసినది ఎన్నిట్లో వీలుంటే అన్నిట్లో మనం భగవంతుని యొక్క దర్శనం చేయాలి. అది అలా జరుగుతూ వుండగా మనం చేసేటటువంటి ధ్యానాది కార్యక్రమాలలో, పూజాది కార్యక్రమాలలో ఈ భగవంతుని రూపాన్ని, అత్యంత సౌందర్యాన్ని తిలకించి, దర్శించి, స్పర్శించి ఆ పై కాసేపు సంభాషణ చేయాలి. రాత్రి పడుకోబోయే ముందు ఈ సాధన చేయాలి. ఎంతసేపూ నీలంరంగుతో పనిచేసుకోవాలి. మనకి రాముడిని, కృష్ణుణ్ణి నీలంరంగులో ఇచ్చారు. విష్ణుమూర్తిని నీలంరంగులోనే ఇచ్చారు. ఈ నీలంరంగు ఎంత మనలో దిగితే అంత healing power పెరుగుతుంది. తెలుపు రంగు బాగా లోతుల్లో వుంటే నీలం. లోతులు తెలియని తెలుపు నీలంగా కనిపిస్తుంది. అందుకనే ఆయన విఠలుడు, శ్యామలుడు. 'విఠల్' అన్న పదానికి అర్థం తెల్లనివాడని. కృష్ణుడంటే నల్లనివాడు. ఈ రంగు, నీలంరంగు మనలో బాగా పెంచుకోవాలి. పెంచుకుంటే మనలో వున్న శరీరం లింకు విడివడి, తెల్ల శరీరం దగ్ధమవుతుంది. తెల్లశరీరాన్ని 'వెలుగు శరీరం' అంటారు. తెల్లశరీరం నుండి బంగారు రంగు శరీరం వస్తుంది. బంగారు రంగు శరీరం నుండి నీలంరంగు శరీరం వస్తుంది. జ్వాలకూల్ గారు మూడు శరీరాలతో పనిచేస్తూ వుంటారు. మనలో ఇంత potential వుంది. భగవంతుడే మనం వుండనిస్తే, వుండగలిగేంత potential మనలో వుంది. మనం మనంగా వుండవచ్చు. భగవంతుడు భగవంతుడుగా వుండవచ్చు. దూరదూరంగా తిరుగుతూ వుండవచ్చు. అట్లాకాక మనతోనే ఎప్పుడూ వుండిపోయేలా చేసుకోవచ్చును. మనతోనే వుండేలా చేయాలంటే ఆ స్వరూపాన్ని మనలో బాగా ప్రతిష్ఠించుకోవాలి. మన హృదయంలో సింహాసనం వేసి కూర్చోబెట్టాలి. మానసిక ఉపచారాలన్నీ చేయాలి. కాళ్ళు, చేతులు కడగటం, స్నానం చేయించడం, బట్టలు వేసి, గంధం పూసి, ఆభరణాలు మనకి ఇష్టమైనవన్నీ పెట్టవచ్చును. భోజనం పెట్టి, తాంబూలం ఇచ్చి, చివరకు సంభాషణం చేయండి. త్యాగరాజు అలా సంభాషణ చేసాడు. భక్తులందరూ అలా సంభాషణ చేసినవారే. మనం ఈ భావనలు పెట్టుకోవడం చాలా ముఖ్యం. మనకి పూజ చేసినప్పుడు ఆయన వచ్చి, అక్కడ కూర్చున్నాడనే భావనే వుండదు.

మనం పిలిచి కూర్చోబెట్టి, అన్ని సేవలూ చేసిన తరువాత సంభాషించాలి. నీకు కావలసినవి అడగాలి. ఏమీ అక్కరలేకపోతే మౌనంగా కాసేపు ఆయనతో వుండాలి. తరువాత ఒకటి అడగాలి. 'నీ పాద కమల సేవయు, నీ పాదార్చకుల తోడి నెయ్యము, నితాంతాపార భూతదయ'[1] ఇమ్మని. అపారమైన భూతదయ ఇమ్మని. అంటే మిగతా జీవుల యందు ప్రేమ, కరుణ, దానబుద్ధి, సహాయబుద్ధి ఇవ్వమని అడగాలి. ఆ విధంగా చేస్తున్న వారితో నాకు మైత్రి ఇవ్వమని అడగాలి. భగవంతుని పూజ చేసుకొనే విషయంలో మాత్రం concession ఇవ్వద్దని వేడుకోవాలి. నిన్ను పూజించే వారితో స్నేహము, అపారమైన భూతదయ కలిగించమని అడగాలి. ఇంకేమైనా కావాలంటే అడిగి, కళ్ళు మూసుకొని దండం పెట్టుకొని, మళ్ళీ నిన్ను పూజించేంతవరకు నాతోనే వుండు సుమా! అని చెప్పాలి. ఇదీ భక్తి. మళ్ళీ పూజ చేసుకొనే అవకాశం ఇవ్వమని కోరాలి. మళ్ళీ పూజ చేసుకొనే వరకూ నాతోనే వుండమని ప్రార్థించాలి. ఇట్లా చేసుకోవడం వలన మూడు కోశాలూ శుభ్రపడతాయి. మనోమయం, ప్రాణమయం, అన్నమయం. ఈ కోశాలే శుభ్రపరచుకోవాలి. మనం అనకూడనివి అనటం, తినకూడనివి తినటం, ఇవి పోవాలన్నా పోవు. ఆయన మనలో దిగిరావడం వలన ఇవి పోతాయి. ఆయన వుంటే ఇవి వుండవు. ఆయన లేకపోతే ఇవి వుంటాయి. ఈ ప్రేయర్, పూజ కుక్క తోకకి బద్ద కట్టడం లాంటివి. ఒక గంట కట్టి తీసేస్తే, వంకర పోదు. అలాగే రోజూ ప్రొద్దున, సాయంకాలం ఒక గంటో, అరగంటో పూజ చేయడం వలన మనలో వంకర పోదు. పూజ తరువాత కూడా భగవంతుని స్మరణలో వుండాలి. అలా 12 ఏళ్ళు వుంటే, మనలో వంకరలు పోవడానికి అవకాశం వుంటుంది. వంకరలు పోవడానికి భగవంతుడు మనతో రోజంతా వుండాలి. మనం ఆయనెప్పుడూ మనతోనే వున్నాడనే భావనలో వుండాలి. పూజ అవగానే వదిలేసి వెళ్ళకూడదు. మనం క్షణంలో వదిలేస్తాము. అలా వదలకుండా వుండడమే సాధన. మనం ఇన్ని కార్యక్రమాలు ఎందుకు పెట్టుకుంటామంటే, మన దైనందిన జీవితంలో ఇవి ఎన్నిసార్లు అంటిస్తే అంత మంచిదని. మనం మధ్య మధ్యలో అనుకుంటాం ఎందుకు ఇన్ని పెట్టుకున్నామని. వాడినుండి బయట పడడం వలన ఇలా అనిపిస్తుంది. వాడిలోనే వున్నవాడికదే జీవితం, త్యాగరాజులాగ. భక్తులనందుకే ఇస్తారు. అందులో వుంటూ పనులన్నీ చేసుకోవచ్చును. ఔషధం కూడా అలా ఆయన్ని తల్చుకుంటూ తీసుకోవాలి. నన్ను తల్చుకొని మందిస్తే, తగ్గుతుందని మాస్టర్ E.K. విధానం. తల్చుకోవడం జరగాలి. తల్చుకోకుండా మందిస్తే తగ్గదు. ఎందుకంటే మనం ఇస్తాం కాబట్టి. మనసు నుండి కాక పై కక్ష్యల నుండి ఏ సంకల్పం వచ్చినా అది వెలుగల్లే, మెరుపులా పనిచేసి వెళ్ళిపోతుంది. మనసుతో చేసిన పనులు, మనలో మలినం కారణంగా అంతంత మాత్రంగా పనిచేస్తాయి. మందులు రెండు రకాలు. భవరోగం, మనసు నుండి అన్ని రోగాలు వస్తాయి. కాబట్టి అన్ని రోగాలకి ఆయనే మందు. Body కి వేరే మందు, మనసుకి వేరే ప్రార్థన అని వుండదు. వేసుకునే

ముందు మందు వేసుకుంటూ, కర్తవ్యం మేరకు వాడినే చూస్తూ, అన్ని పొరల్లో కూడా ఆయనే వున్నట్లు భావన చేయాలి. మనసు, శరీరం, ఇంద్రియాల్లోకి దింపాలి. 'అనిరుద్ధుడు' కావాలి. ఔషధం తీసుకున్నప్పుడు 'నారాయణ' అని తీసుకోవాలి. మందునే నారాయణుడుగా భావించి తీసుకోవాలి. అది వేరు, ఇది వేరు కాదు. మందు, మందు ఇచ్చేవాడు, మందు తీసుకునేవాడు కూడా నారాయణుడని భావన చేయాలి. ఇదే జ్ఞానం. అన్నిటినీ ఒకదానిలో చూడడమే జ్ఞానం. కర్త, కర్మ, క్రియ మూడూ ఒకటే అని తెలియడం జ్ఞానం. ఔషధంలో భగవంతుని దర్శనం చేస్తే, మనం చాలాసార్లు చూస్తాం.

## 300 జగత్ స్సేతుః

ఈ జగత్తుకి ఆయన వంతెనగా వున్నాడుట. I am the path. I am the way అని ఏసుక్రీస్తు చెబుతాడు. ఆయనే దారి. ఆయనే మార్గం. ఆయన ఆధారంగా అన్నీ ఏర్పడుతున్నాయి. అన్ని లోకాల్లోనూ ఆధారం గా ఆయన నిండివున్నాడు. ఇక్కడనుండి సత్యలోకం వెళ్ళాలంటే చాలా దూరం. ఇక్కడ నుండి సూర్యుడు, అక్కడ నుండి సవితృడు, అక్కడ నుండి ఆదిత్యుడూ ఇలా ఎలా వెళ్ళగలమనుకుంటాం? మన దగ్గరనుంచి, సృష్టి మొదలు వరకు తానే వంతెనగా వ్యాపించి యున్నాడు. ఈ మామిడిచెట్టు తీసుకొంటే విత్తనంగా, మొక్కగా, మొక్క మొదలుగా, శాఖలు, కొమ్మలు, రెమ్మలు, రెమ్మల నుండి ఆకులు, పిందెలు, కాయలు అలా ఈ మొత్తంగా వ్యాపనం చెందినది ఏది? ఈ వ్యాపనం చెందే తత్వాన్ని విష్ణుతత్వ మంటారు. విష్ణువంటే వ్యాపనం చెందేవాడు. ఒక మొక్క అలా పెరుగుతూంటే విష్ణువే పెరుగుతున్నాడని అనుకోవాలి. నీళ్ళు పోస్తే మొక్క పెరుగుతున్నదని అనుకోవడం ఒక రకం. లోపల విష్ణువు పెరగడం వలన మొక్క పెరుగుతున్నదని అనుకోవడం ఇంకొక రకం. భగవంతుడు వంతెనలా వుండుట వలన మనం సులువుగా నడిచి వెళ్ళిపోవచ్చును. భగవద్గీత లోని

పురుషోత్తమ ప్రాప్తియోగం లో అశ్వత్థ వృక్షం గురించి చాలా బాగా చెబుతాడు. ఈ వృక్షమునకు వ్రేళ్ళు పైకి వున్నాయి. శాఖలు క్రిందకు వున్నాయి. క్రిందకు వచ్చిన శాఖలు మళ్ళీ పైకి వెళితే, అంతా పైన వ్రేళ్ళు, క్రింద శాఖలు జమిలిగా కలిసిపోయి వుంటాయి. మనలో సంకల్పాలు ముందుగా మొక్కలుగా ఏర్పడి, క్రిందకు దిగివచ్చి సంకల్పాలుగా ఏర్పడిన వాటినుండి వాక్కు, చేత ఏర్పడుతాయి. మనం పని మొదలుపెట్టక ముందు బద్ధ స్థితి వుండదు. కొన్ని పనులు మొదలుపెట్టిన తరువాత బద్ధస్థితి, బంధనం ఏర్పడుతుంది. సంసారం మొదలుపెట్టి బంధనం చేసుకొనేవాళ్ళు, ఉద్యోగంలో బంధనా లేర్పరచుకొని భయపడుతూ వుండేవాళ్ళు ఉంటారు. ఆదాయపు పన్ను ఎగగొట్టే వాళ్ళకి Income tax వాళ్ళని చూస్తే భయం. ఇలా మనం చేసే పనిలో కొన్ని అవకతవకలు చేసుకొని, కొన్ని వంకరలు ఏర్పరచుకుంటాము. చేసే పనులలో కంపు పుట్టించుకొంటే, ఆ కంపు మనల్నే బాధిస్తుంది. పాడుచేస్తుంది. చేసే పనుల నుండి మళ్ళీ పనులు పుడతాయి. ఇవన్నీ మనం పెంచుకున్నవే! లేని పనులను మనం సృష్టించుకుంటాము. అవి మొలక లెత్తుతాయి. ఇవన్నీ కలిపి పైకి లేచిపోతాయిట. ఇవన్నీ గజిబిజిగా కలిసిపోయి అసలు సంకల్పం మొదట వచ్చినదేదో, తరువాత మనం పుట్టించినదేదో తెలియదు. మనకు అనుమానాలు వస్తూ వుంటాయి. అసలు ఈ సంకల్పం మాస్టారు గారి నుండి వచ్చిందా? లేక నా నుండి వచ్చిందా? అని. మస్టారుగారిని తలుచుకుంటే వారి నుండి వచ్చినదైతే మనకి తెలిసిపోతుంది. దానిమీద అసలు doubt వుండదు. నిజమైన సంకల్పం హృదయం నుండి వస్తుంది. అది మనకే తెలుస్తుంది. అది నడుస్తుంది. దానిద్వారా మనం నడవాలి. నడిపిస్తూ మనం తరించాలి. అలాకాక మన వ్యామోహం వల్ల ఇంకొకటి

వచ్చిందనుకోండి. దానివల్ల మనకు తేలదు. ఇదా? అదా? అని తేలక ఎవరినైనా అడిగితే, వాడికి తోచింది వాడు చెప్తాడు. అందుకనే కృష్ణుడు చెప్తాడు అశ్వత్థ వృక్షంలో కొన్ని అటునుండి కలుపుకొస్తే, నువ్వు ఇటునుండి కొన్ని కలిపావు. ఇవి, అవి కలిసిపోయినాయి. ఇప్పుడేమీ తెలియదు అని చెప్తాడు. అంతా అయోమయం. సూక్ష్మ లోకాల నుండి సంకల్పాలు దిగివచ్చి, వాక్కుగాను, చేతగాను బయటకు వస్తాయి. మనం దిగివచ్చిన సంకల్పాలను అలాగే చేయాలి కానీ, commisions పెట్టుకోకూడదు. అదే ఫలత్యాగం చేయడం. ఫలత్యాగం చేయకుండా, ఇందులో మనకేమిటి వస్తుంది? అనుకోకూడదు. వచ్చిన సంకల్పం వచ్చినట్లు చేయకపోవడం వలన, సంయమనము లేక కొన్ని వంకర టింకరలు వస్తాయి. కొత్త మొలకలు వస్తాయి. క్రొత్త మొలకలు, పాత మొలకలు అన్నీ గుంపుగా కలిసిపోతాయి. Duplicate ఎక్కువ అయిపోయి, అసలంటూ ఏమీలేదు, అంతా ఇదే! అని అనిపిస్తుంది. ఒకటి గుర్తు పెట్టుకోవాలి. Duplicate ఒకటి వుందిట అంటే original వున్నట్లే కదా! చెల్లని కాని ఉందంటే చిల్లి కాని ఒకటి వున్నట్లే కదా! లేకపోతే చెల్లని కాని అని రాదుగా. దేముడు లేడని అన్నారనుకోండి. లేకపోతే వాడి గురించి భావన ఎందుకు వస్తుంది? సృష్టిలో లేనిది లేదు. కాబట్టి ఎన్ని జన్మలు time ఇచ్చినా, సృష్టిలో లేని వస్తువు మనం చెప్పలేము. సృష్టిలో లేని వస్తువు గురించి భావం రాదు. పదం పుట్టదు. ఏదైనా మనం చెప్పినది వుండబట్టే దానికి పదం వస్తుంది. అట్లా కలిసిపోయి వుండడం వలన, వున్నది కనబడక లేదని అనేస్తాము. పగలు నక్షత్రాలు కనబడకపోతే, నక్షత్రాలు లేవనడం ఎంత తెలివో, ఈ తెలివి కూడా అంతే అని పెద్దలు చెబుతారు. మనకు కనబడవు కానీ అవి ఎక్కడకూ వెళ్ళవు. పగలూ వుంటాయి, రాత్రీ వుంటాయి. అట్లా కలిసిపోవడం వలన తెలియడం లేదు. తెలియాలంటే అన్నిట్లోనూ నన్ను చూడు. నువ్వు తయారుచేసిన వాటిల్లోనూ, నేను తయారుచేసిన వాటిల్లోనూ నన్నే చూడటం మొదలుపెట్టు. ఇది దివ్యజీవనం, ఇది లౌకికజీవనం అని పెట్టుకోవద్దు. మొత్తం దివ్యజీవనమే! భార్య, పిల్లలు, వృత్తి అన్నిట్లో నన్నే చూడు. నాతో సంగం చేయి. నీది అనుకున్నదాంట్లోనూ, నీది కాదనుకొన్నదాంట్లోనూ అన్నిట్లోనూ నన్నే చూడు. ఇలా సంగం చేయడాన్ని 'అసంగము' అన్నారు. ప్రతిదాంట్లోనూ నాతోనే సంగం చేయడం అసంగం కానీ, వదిలించేసుకోవడం అసంగం కాదు. ఈ సంగం వుండకూడదండి, అంటారు. ఏదీ వుండకపోతే నీకేదీ రాదు. తిండి, బట్ట ఏదీ రాదు. భగవద్గీతలో అసంగమనే ఖడ్గంతో నరికేయమంటారు అన్నిటినీ. అన్నీ చాలా రహస్యంగా చెప్పి వుంచారు. ఏం నరికేస్తావు నువ్వు? ఎప్పుడైతే భార్య యందు భగవంతుని దర్శిస్తావో, భార్య అనే భావం తగ్గి, భగవంతుడనే భావం పెరుగుతూ వుంటుంది. అప్పుడు అన్నిట్లోనూ దేముడే మిగులుతాడు. కానీ విభూతియోగంలో కృష్ణుడేం చెప్పాడంటే, అక్షరాలలో 'అ' నేను అంటాడు. అందుకని అన్ని భాషల్లో, English తప్ప "అ' తో మొదలవుతాయి. Latin కూడా "అ' తో

మొదలవుతుంది. English లో 'అ' కి, 'ఎ' కి ఒకటే అక్షరం తప్ప, 'అ' అనే శబ్దం వుండదు. కృష్ణుడు అక్షరాల్లో 'అ'నేను అంటాడు. 'అ' తో సంగం చేయడం 'అసంగం'. అందుకని ఒక కంటితో భగవంతుని చూస్తూ, ఒక కంటితో లోకం చూడడానికి రెండు కళ్ళు వున్నాయి. కుడికన్నుతో భగవత్సంబంధమైనవి చూడాలి. ఎడమ కన్నుతో లౌకిక సంబంధమైనవి చూడాలి. కుడికన్ను పొడుచుకోకు. ఎడమ కన్ను పోయినా ఫరవాలేదు. కుడికన్ను జ్ఞానపరంగా, ఎడమ కన్ను లౌకికంగా దృష్టికి, అంతర్ దృష్టికి కుడికన్ను, దివ్యదృష్టికి మూడవ కన్ను. అంతటా ఆయన వ్యాపించి యున్నాడు కాబట్టి ఎక్కడ కూర్చుంటే అక్కడ నుండే ఆయనలోకి వెళ్ళిపోవచ్చును. ఎందుకంటే అన్నిచోట్లకి ఆయన bridge వుంది. కేంద్రము నుండి పరిధి వరకు సమస్తముగా తానే వ్యాపించి యున్నాడు కాబట్టి, ఈ జగత్తుకంతా వంతెనలు వేసే వుంచాను కాబట్టి నా దగ్గరకు రావడానికి నీకంత కష్టం లేదని చెబుతున్నాడు. భగవంతుని ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలో నైనా పొందవచ్చును. అంత సన్నిధిలో వున్నాడు. మన చర్మాన్ని ఆనుకునే వున్నాడు. చర్మం లోపల, బయట వుంటాడు. ఇంతగా వ్యాపించి యున్న వాడిని ఎక్కడో దూరంలో పెట్టుకుంటే, దూరంగానే వుంటాడు. నేలమీద వున్నాడంటే నేలమీద, గుండెల్లో వున్నాడంటే గుండెల్లో వుంటాడు. ఎక్కడైనా వుంటాడు. నువ్వు వున్నచోట దేముణ్ణి కలుసుకొంటే, అక్కడ నుండి మొత్తానికి వంతెన ఇచ్చేస్తాడు. అదీ ఆయనిచ్చిన నిచ్చెన. ఆ నిచ్చెన పట్టుకొని ఎక్కడికైనా పోవచ్చును. ఈ మహర్షులందరూ కూడా ఈ నిచ్చెనలు పట్టుకొనే వెలుగుదారుల్లో తిరుగుతూ వుంటారు. వంతెన ఆయనది. "నేనే" మార్గమని చెప్పాడు క్రీస్తు. నేనంటే భగవద్గీతలో చెప్పిన 'నేను'. ఆ 'నేను' నే క్రీస్తు చాలా వాడాడు. ఆయన 'నేను'' తెలిసినవాడు. అంతర్యామి తత్వం తెలిసినవాడు. 'నేను' సమస్తం వ్యాపించి యున్నాడు కాబట్టి, వంతెనలు వేసి వున్నాడు. ఇక్కడికి, అక్కడికి వెళ్ళనక్కరలేదు. కానీ కర్తవ్యంలో భాగంగా వెళ్ళాలి. ఒకోసారి ఆ భావంతో పిలిపించుకుంటాడు. పిలిపించుకుంటే వెళ్ళాలి. అన్నిచోట్లా వుంటాడు కాబట్టి గుడికి వెళ్ళనక్కరలేదని, అలా వుండదు. భగవంతుడు మనల్ని పిలుస్తున్నాడని అనుకోవాలి తప్ప మనం చాలా పెద్దవాళ్ళం అయిపోయాం, ఇక్కడా వున్నాడు కాబట్టి గుడికి వెళ్ళనక్కరలేదని అనుకోకూడదు. కుచేలుడంతటివాడు తన భార్య చెబితే వెళ్ళాడు. భార్య ద్వారా కృష్ణుడు తనని రమ్మంటున్నాడని అనుకున్నాడు. అదీ తెలివి అంటే! ఎవరి ద్వారానైనా సందేశం వస్తే, మనల్ని రమ్మంటున్నాడని దానిని పట్టుకొని వెళ్ళాలి. లేదంటే కర్తవ్యం ఆచరిస్తూ వుండాలి. కర్తవ్యం వున్నప్పుడు పిలిస్తే, కర్తవ్యం వదిలేసి దేముడు పిలుస్తున్నాడని వెళ్ళకూడదు. అలా కర్తవ్యం వదిలి వెళ్ళిన వారికి అన్నీ ఆటంకాలెదురౌతాయి. మనం భగవంతుని దర్శనార్ధం వెళ్ళినప్పుడు దర్శనం బాగా జరిగిందంటే ఒకటే గుర్తుపెట్టుకోవాలి. అంతకుముందు దర్శనానికి, ఈ దర్శనానికి మధ్య మన కర్తవ్యం బాగా నెరవేర్చామని. బాగా దర్శనం అవక ఇబ్బందులు పడితే, మన కర్తవ్యం

సరిగా నేరవేర్చలేదని అర్థం. మనల్ని ముప్పతిప్పలు పెడతారు. పాండురంగని విషయంలో పుండరీకుడేం చేసాడు? ఆయన తల్లితండ్రులు వృద్ధులు. వారికి పాదసేవ చేస్తూ వుంటాడు. సుందరాంగుడైన పాండురంగడు వచ్చి రమ్మని పిలిస్తే, పుండరీకుడు ఆయన్ని కాసేపు ఆగు, నేను తల్లితండ్రుల సేవలో వున్నానని అంటాడు. నిజానికి ఈయన కాళ్ళు వదిలేస్తే, ఆయన మాయమైపోతాడు. ఈయన కాళ్ళు వదల్లేదు కాబట్టి, ఆయన అలా నిలబడిపోయాడు రాయిలా. మనకి పండరీపురం, పాండురంగడు మిగిలారు. అక్కడ ఆయన నిలబడిన ప్రదేశం లోని చైతన్యానికి గుడి కట్టుకున్నారు కానీ, నిజంగా ఆయన రాయి అయిపోలేదు. ఆ చైతన్యం వల్ల అక్కడ గుడి కట్టారు. కొన్ని వేల మంది ఆయన్ని దర్శించుకొని భక్తులై, చాలామందికి దారి చూపించారు. దానికి కారణం పుండరీకుడు. ఆయన కర్తవ్యంలో నిలబడటం వలన దేముడు నిలబడిపోయాడు. కర్తవ్యాలు నెరవేరుస్తూ వుంటే, కర్తవ్యంలో భాగంగా పిలుపులు వస్తూ వుంటాయి. అదీ సాధన. మనకి అవసరమైతే పుణ్యక్షేత్రాల దర్శనం చేయిస్తాడు. మహాత్ముల దర్శనం చేయిస్తాడు. ఎన్నో చేస్తాడు. ఎందుకంటే వాడిలోనే వుంటున్నాము కాబట్టి. అంతా ఆయనే చేయిస్తూ వున్నాడనుకొంటే, ఈ bridge లు వున్నాయి కాబట్టి ఆ bridge ల మీద నడిచి వెళుతూ వుండాలి. ఆయన్ని మర్చిపోతే bridge పడిపోతుంది. అదే కదా హనుమంతుడు కట్టిన bridge. ఇది నిజం కాదు. భక్తి కోసం చెప్పిన కథ. అర్జునుడు భక్తి, హనుమంతుడి భక్తి. అర్జునుడు అప్పుడప్పుడు తాను గొప్పవాడనుకుంటూ, ఆపద వచ్చినప్పుడు తానుకాదు కృష్ణుడనుకుంటాడు. అర్జునుడు, హనుమంతుని ఎగతాళి చేస్తాడు. అప్పుడనుకుంటారు నువ్వొక వంతెన, నేనొక వంతెన కడదాము. నా వంతెన నువ్వు, నీ వంతెన నేను త్రొక్కుదాము. ఎవరు బాగా త్రొక్కగలిగితే, వారికి ఎక్కువ భక్తి వున్నట్లు అని. అర్జునుడు ముందు హనుమంతుని వంతెన కట్టమంటాడు. హనుమంతుడు రామనామంతో కట్టేస్తాడు. అర్జునుడు దాన్ని అన్నిరకాల అస్త్రశస్త్రాలతో త్రొక్కి వేయడానికి చూస్తాడు. కానీ అది ఇనుపగుండు వలె వుండి చలనం వుండదు. అప్పుడు హనుమంతుడు అర్జునుడితో నువ్వు కట్టు వంతెన అని అడుగుతాడు. అర్జునుడు కట్టిన వంతెన, హనుమంతుడు కాలు వేయగానే ఫెళ ఫెళమంటుంది. అప్పుడు అర్జునుడు 'కృష్ణా' అని ధ్యానం చేయగానే, ఆ వంతెన విరిగినట్లు అనిపిస్తుంది కానీ విరగదు. అప్పుడు హనుమంతుడు నీవు కూడా చాలా గొప్ప భక్తుడవే అని కౌగలించుకుంటాడు. ఆ bridge కింద నుండి అప్పుడు కృష్ణుడు వస్తాడు. వీపంతా పుండు అయిపోయి వుంటుంది. ఇదేమిటని అడిగితే, నీ బుద్ధి ఇంత తెచ్చింది నాకు, అంటాడు. హనుమంతుడు ఎప్పుడూ భక్తిలోనే వుంటాడు.

# 301 సత్యధర్మ పరాక్రమః

సత్యము, ధర్మము అనే రెండు తత్త్వములతో భగవంతుడు పరము నుండి ఇంతవరకు ఆక్రమించి వుంటాడు. మనమెట్లా ఆక్రమిస్తామో, దేవుడుట్లా ఆక్రమిస్తాడు. మనదనుకొంటూ మనం అన్నీ పెంచుకొంటూ పోతాం కదా! ఈ మొత్తమంతా ఆయనదని గుర్తున్నప్పుడు మనం ఆక్రమించే దేమిటి? ఈ మధ్య స్థలం పెంచానంటాడు, ఇల్లు పెంచానంటాడు. వీడు పెంచేదేమిటి? పెరిగిందది. ఆ పెరిగింది విష్ణువు. నువ్వు పెంచితే పెరగదు, జుట్టులాగ అదే పెరగాలి తప్ప మనం పెంచితే కాదు. అన్నీ పెరిగేవే. కానీ మనం పెంచితే కాదు. సత్యం చేత, ధర్మం చేత మొత్తాన్నంతా ఆక్రమించే వాడు భగవంతుడు. ఆయన దర్శనం మనకు కూడా లభించాలంటే, మనం కూడా సత్యము, ధర్మము మన జీవితంలో ఎక్కువ పాటించడం వలన ఆయన యొక్క దర్శనం చేయడానికి అవకాశం వుంటుంది. మనం సత్యం గురించి, ధర్మం గురించి, పరాక్రమము గురించి చెప్పకున్నాము. కాబట్టి సత్యము, ధర్మము ఆధారంగా ఈ మొత్తాన్ని ఆక్రమించే భగవంతుని దర్శనం చేసుకోవాలి. స్వభావం మారకుండా, అదే ధర్మంతో ప్రవర్తిస్తూ వుంటాడు. పిల్లి పిల్లిలా, కుక్క కుక్కలా పనిచేస్తాయి. పులి ఎలుకలా, ఎలుక సింహంలా వుండవు కదా! ఏ ధర్మానికి ఆ ధర్మం శాశ్వతంగా నిర్వర్తించే పద్ధతులలో తాను వున్నాడు. ఉప్పు, పంచదార ధర్మాలు మనలా ఎప్పుడు పడితే అప్పుడు మారతాయనుకోండి అప్పుడు ఉప్పేదో, పంచదార ఏదో తెలియదు. అంత చిన్న విషయం ఉప్పు నుండి, భూగోళం వరకు, సూర్యమండలం వరకూ అదే ధర్మాలు అలాగే వర్తించే బలమేదైతే వుందో, అది ధర్మం యొక్క బలం, అది దైవం! ధర్మమన్నా, దైవమన్నా ఒకటే మానవధర్మం! సృష్టిలో ధర్మంగా వుంటాడు. కాబట్టి సృష్టిలో ఆయా వస్తువులు వాటి ధర్మాన్ని నిర్వర్తిస్తూ వుంటాయి ఒక్క మానవుడు తప్ప. మానవుడు ఎప్పుడు, ఎలా వుంటాడో చెప్పలేము. కాసేపు గోవులా, కాసేపు గాడిదలా వుంటాడు. మన దగ్గరే తేడాలున్నాయి కాబట్టి బాధ. సృష్టిలో మిగతా ఎవ్వరికీ బాధ లేదు. మళ్ళీ అందులో ఇమడడానికి మనకి ఇవన్నీ కావాలి. అందుకే ఈ ధర్మాన్ని అంటే మానవ ధర్మాన్ని అవగాహన చేసుకొంటే, అదే మనుధర్మం. మానవుడెట్లా ప్రవర్తిస్తే ఈ సృష్టిలో పరిపూర్ణమైన ఆనందం పొందగలడో అనే విషయాన్ని మనుధర్మంగా ఇచ్చారు. అందరితోనూ ఎలా వున్నాడో రాముడి కథ తీసుకొంటే మానవ ధర్మం పరిపూర్ణంగా తెలుస్తుంది. అందుకని రాముణ్ణి సత్య పరాక్రము డంటారు. 'సత్యధర్మ పరాక్రమః' అంటే రామకథ పూర్తిగా తెలుసుకుంటే, ఈ నామానికి అర్థం పూర్తిగా తెలుస్తుంది. మొత్తం రామాయణం గురించి తెలుసుకోవాలి. రాముడు ఒక చెట్టుతో ఎలా వున్నాడు? ఒక నదితో ఎలా వున్నాడు? అడవిలో వుండే వాళ్ళ అవగాహన నాయకుడితో ఎలా వున్నాడు? దాసితో ఎలా వున్నాడు? రాక్షసులతో ఎలా వున్నాడు? తమ్ముళ్ళతో ఎలా వున్నాడు? అన్నది. అదీ ధర్మం! పరిపూర్ణమైన మానవ ధర్మం రాముని చరిత్రలో తెలుస్తుంది. కృష్ణుడు దివ్య ప్రకృతి కాబట్టి, మానవ ధర్మాన్ని చూపలేదు. మనకు కాస్త కష్టం. రాముని చరిత్ర మనకు పరిపూర్ణమైన అవగాహన ఇస్తుంది ధర్మ స్వరూపం గురించి. 'సత్యధర్మ పరాక్రముడు' అంటే రాముడు అని చెప్పవచ్చును.

# విష్ణు సహస్రనామ పారాయణ ప్రాశస్త్యము

భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడడం అనేది, మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకొని భగవత్ అనుభూతిని పొందటానికి ఒక సులభమైన మార్గం, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు ఇవ్వడం జరిగింది. కలియుగంలో అతి సులభమైన పద్ధతిలో భగవంతుడి అనుభూతి పొందటానికి అవకాశం ఎక్కువగా వున్నదని తెలుస్తోంది. కారణం ఏమిటంటే, ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు – ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్ధ్యములు కలియుగంలో మానవుడికి ఉండదు, అంతేకాక కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుతుంది. అందు వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకోవడం ద్వారా, సులభముగా తన్నుతాను పవిత్రీకరించుకొని, భగవంతుని యందు నిలబడడానికి అవకాశము ఏర్పడుతుందని. శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చెప్పడం జరిగింది.

ఆ మార్గంలోనే మనకి వేదవ్యాస మహర్షి,శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ వున్నట్లయితే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికంగా భగవంతుని నామ పారాయణం చేసుకోడం ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకుంటూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించడానికి భక్తి శ్రద్ధలతో ప్రయత్నం చేయాలి. భగవంతుని ఈ మార్గంలో అనుభూతి చెందడానికి శ్రద్ధ, ఓర్పు బాగా కావాలి. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ వుంటుంది. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుంటుంది. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకుంటూ మనం మనని పవిత్రీకరించుకుంటూ, కాలం యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించడానికి అవకాశం కల్పించుకోవాలి.

–కంభంపాటి పార్వతి కుమార్